॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ అష్టాదశోఽధ్యాయః - మోక్షసన్న్యాసయోగః

## (పదునెనిమిదవ అధ్యాయము - మోక్షసన్న్యాసయోగము)

భగవద్గీతలోని ఈ పద్దెనిమిదవ అధ్యాయము చివరి అధ్యాయము. ఇది అన్నింటికన్నా పెద్ద అధ్యాయము. ఇందులో 78 శ్లోకాలు ఉన్నాయి. కృష్ణపరమాత్మ బోధ రెండవ అధ్యాయములో మొదలయింది. ఇంకా సరిగ్గా చెప్పాలంటే రెండవ అధ్యాయములోని పదకొండవ శ్లోకంనుంచి మొదలయింది.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

మొదటి అధ్యాయము మొత్తమూ, రెండవ అధ్యాయములో పదోశ్లోకం వరకూ గీతాబోధ ఆవిర్భావానికి బాట వేయటం జరిగింది. వీరాధివీరుడైన అర్జునుడు యుద్ధానికి రావటం, అతనికి సాక్షాత్తూ కృష్ణపరమాత్మే రథసారథిగా రథాన్ని నడపటంతో మొదలైన భగవద్గీత రెండవ అధ్యాయములో వీరాధివీరుడైన అర్జునుణ్ణి శిష్యునిగా మార్చి, రథసారథి అయిన కృష్ణపరమాత్మను గీతాచార్యునిగా, జగద్గురువుగా మారుస్తుంది.

**కృష్ణం వందే జగద్గురుమ్**

మొదటి అధ్యాయము ఈ మార్పుకు బీజం వేస్తుంది. అర్జునుడు ద్రోణాచార్యుడు, భీష్మాచార్యులను చూసి రాగంలోపడి, శోకం చెంది, మోహంలో ఎలా పడ్డాడో, ధర్మాధర్మవిచక్షణను ఎలా కోల్పోయాడో, చివరికి ఆ విషయం గ్రహించుకుని కృష్ణపరమాత్మను ఎలా శరణు వేడాడో వివరంగా చూశాము. నాకు శ్రేయస్కరమైనదేదో నువ్వే చెప్పు అన్నాడు. అక్కడ్నుంచి కృష్ణపరమాత్మ బోధ చేస్తున్నాడు. కృష్ణపరమాత్మ బోధ పదిహేడు అధ్యాయాల్లో సాగుతున్నది.

కృష్ణపరమాత్మ తన బోధను ఉపయోగించిన పద్ధతిని **సంక్షేప విస్తారబోధనమ్** అంటారు. ముందు తను చెప్పబోయేదాన్ని క్లుప్తంగా చెప్పటం. అంటే ఒక విహంగవీక్షణం ఇస్తారు దానికి. విద్యార్థికి తను వినబోయేదేమిటో ఒక అవగాహన ఉంటుంది. తర్వాత తను చెప్పదలుచుకున్నదాన్ని చాలా వివరంగా చెప్పుకుంటూ వస్తారు. మళ్ళీ ముగించేముందు మళ్ళీ క్లుప్తంగా, ఇంతవరకూ చెప్పిన దాని సారాంశాన్ని చెప్పి ముగిస్తారు.

ఉపక్రమ సంక్షేపః – మొదట్లో క్లుప్తంగా చెప్పటం
విస్తారః – వివరంగా చెప్పటం
ఉపసంహార సంక్షేపః – మళ్ళీ క్లుప్తంగా చెప్పి ముగించటం.

టూకీగా – వివరంగా – టూకీగా ఇదీ పద్ధతి. టీవీలో వచ్చే వార్తలను వింటే ఈ టూకీగా–వివరంగా–టూకీగా పద్ధతి అర్థమవుతుంది. వార్తలు చెప్పేముందు ఈరోజు ముఖ్యవిశేషాలు అని విశేషాలు చెప్పి, వాటిని వివరంగా

కొన్ని నిముషాలు చెప్పి, మళ్ళీ వార్తలు ముగించేముందు ముఖ్యవిశేషాలు మరొకసారి అని ఆ వార్తలను మళ్ళీ టూకీగా చెబుతారు.

కృష్ణపరమాత్మ కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తున్నాడు తన బోధనాశైలిలో.

ఉపక్రమ సంక్షేపః – అధ్యాయము 2

విస్తారః – అధ్యాయములు 3–17

ఉపసంహార సంక్షేపః – అధ్యాయము 18

రెండవ అధ్యాయము అయిన సాంఖ్యయోగము మొత్తం భగవద్గీతయొక్క సారాంశము. ఈ సారాంశాన్నే చాలా వివరంగా కృష్ణపరమాత్మ 3–17 అధ్యాయాల్లో చెప్పుకొచ్చాడు. ఇప్పుడు ఈ 18వ అధ్యాయంలో మళ్ళీ తను ఈ పదిహేను అధ్యాయాల్లోనూ చెప్పిన దానికి ముక్తాయింపుగా మళ్ళీ సారాంశాన్ని చెప్పబోతున్నాడు. అంటే 18వ అధ్యాయములో 3–17 వరకూ చూసిన గీతాబోధ సారాంశాన్ని చూస్తాము.

ఈ పదిహేను అధ్యాయాల్లోనూ కృష్ణపరమాత్మ 9 అంశాల గురించి బోధించాడు. వాటిని కూడా అంతకుముందు చూశాము. అయినా ఇప్పుడు మళ్ళీ చూద్దాము.

ఎ) **సాధనత్రయ విచారః** – ఒక ఆధ్యాత్మిక సాధకుడు పాటించాల్సిన మూడుదశల సాధనలను గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. మోక్షం పొందాలంటే మూడూ పాటించితీరాలి; ఏదో ఒకటి కాదు. అవి –

| | | |
|---|---|---|
| కర్మయోగ సాధన | – చిత్తశుద్ధికోసం | – షట్కము 1 |
| ఉపాసనయోగ సాధన | – చిత్త ఏకాగ్రతకోసం | – షట్కము 2 |
| జ్ఞానయోగ సాధన | – ఆత్మజ్ఞానం పొందటంకోసం | – షట్కము 3 |

కర్మయోగ సాధన గురించి మొదటి షట్కములోనూ, ఉపాసనయోగ సాధన గురించి రెండవ షట్కములోనూ, జ్ఞానయోగ సాధన గురించి మూడవ షట్కములోనూ వస్తాయి.

బి) **పదత్రయ విచారః** – వేదాంతసారాన్ని మహావాక్యాల్లో చెప్పిస్తారు. మహావాక్యం అంటే జీవఈశ్వర ఐక్యాన్ని బోధించే వాక్యం. అందులో ఒక ప్రసిద్ధి చెందిన మహావాక్యం – తత్త్వమసి. ఇందులో మూడుపదాలు ఉన్నాయి. తత్+త్వమ్+అసి. తత్ ఈశ్వరస్వరూపాన్ని, త్వమ్ జీవస్వరూపాన్ని, అసి ఐక్యాన్ని సూచిస్తాయి.

ఈ తత్త్వమసి వాక్యం వ్యష్టి అయిన జీవాత్మ, సమష్టి అయిన పరమాత్మల ఐక్యాన్ని సూచిస్తుంది. ఈ మూడు పదాల విచారణ, మూడు షట్కములలో వస్తుంది. కాకపోతే ముందు త్వమ్ పద విచారణ వస్తుంది.

| | | |
|---|---|---|
| త్వమ్ పద విచారణ | – జీవస్వరూపం | – షట్కము 1 |
| తత్ పద విచారణ | – ఈశ్వరస్వరూపం | – షట్కము 2 |
| అసి పద విచారణ | – ఐక్యం | – షట్కము 3 |

ఈ విధంగా ఈ మూడుపదాల విశ్లేషణ వస్తుంది. విచారః అంటే విశ్లేషణ.

సి) **ఘటకత్రయ విచారః** – జీవితంలో విజయం పొందాలంటే, అది కూడా ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధనలో విజయం పొందాలంటే పాటించాల్సిన మూడు సాధనలను చర్చిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అవి ప్రయత్నం, ప్రసాదం, సద్గుణం. ఘటక అంటే అంశం. మూడు అంశాల గురించి చెబుతున్నాడు.

**ప్రయత్నం** – ఏదైనా సాధించాలంటే ముందుగా దానికి మానవప్రయత్నం ఉండాలి. దీన్ని ఫ్రీవిల్ అంటారు. అంటే ముందు భగవంతుడు మనకు ఫ్రీవిల్‌ను ప్రసాదించాడని అంగీకరించాలి. కొంతమంది అసలు ఈ ఫ్రీవిల్‌ను ఒప్పుకోరు. కాని కృష్ణపరమాత్మ ఫ్రీవిల్‌ను ఒప్పుకోవాలనీ, దాన్ని సరిగ్గా వినియోగించుకోవాలనీ బోధిస్తున్నాడు. ఫ్రీవిల్ ఒక అంశం.

**ప్రసాదం** – ప్రసాదం అంటే ఈశ్వరానుగ్రహం. పూర్వజన్మ సుకృతం అనికూడా కొందరు అంటారు. కాని దాన్ని సాధారణంగా ఈశ్వరప్రసాదం లేదా ఈశ్వరానుగ్రహం అంటారు. ఈశ్వరానుగ్రహం రెండవ అంశం.

**సద్గుణం** – మంచి నడవడిక కలిగివుండాలి. మనిషికి మంచి నడవడిక లేకపోతే అంటే ఆరోగ్యకరమైన విలువలు, దైవీసంపత్తి, సత్త్వగుణం లేకపోతే అతను విజయం సాధించటం ముఖ్యంగా ఆధ్యాత్మిక విజయం సాధించటం అసాధ్యం.

| | | |
|---|---|---|
| ప్రయత్న అంశం | – ఫ్రీవిల్ | – షట్కము 1 |
| ప్రసాద అంశం | – ఈశ్వరానుగ్రహం | – షట్కము 2 |
| సద్గుణ అంశం | – మంచి నడవడిక | – షట్కము 3 |

ఇప్పుడు సైన్సు లౌకికవిజయానికి కూడా మంచి నడవడిక కలిగి ఉండటం ముఖ్యం అంటున్నది. ఎంత పెద్ద కార్పోరేట్ సంస్థ అయినా చరిత్రలో శాశ్వతంగా నిలవాలంటే, అది మానవతా విలువలను పాటించాలని బోధిస్తూ పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు, మేనేజ్‌మెంట్ కోర్సులు వస్తున్నాయి. విలువలు పాటించకపోతే విజయం రావచ్చేమో కాని అది మూడునాళ్ళ ముచ్చటే అవుతుంది అంటున్నారు. స్టీఫెన్‌కోవ్ వ్యాపార విజయానికి ఏడు మెట్లు అని చెప్పినదాంట్లో, ఒక మెట్టు క్యారక్టరు ఉండాలని చెప్పారు. ఆయన దాన్ని నిరూపిస్తూ, అనేక పెద్ద కంపెనీల గురించిన స్టాటిస్టిక్స్ తీసి, సర్వే చేసి చెప్పారు. అందువల్ల లౌకిక విజయానికైనా, ఆధ్యాత్మిక విజయానికైనా మంచి నడవడిక ముఖ్యం.

ఈ మాట కృష్ణపరమాత్మ కొన్ని వేలసంవత్సరాల క్రిందటే బోధించాడు. నడవడిక ముఖ్యం కాబట్టే కృష్ణపరమాత్మ పూర్తిగా రెండు అధ్యాయాలనే దానికి కేటాయించాడు. 16, 17 అధ్యాయాలు దైవీసంపత్తి గురించి, సత్త్వగుణం గురించి చెప్పాయి అని చూశాము.

ఘటకత్రయం అయిన ఫ్రీవిల్, ఈశ్వరానుగ్రహం, మంచినడవడికను వరుసగా మూడు షట్కాలలో చెప్పుకొచ్చాడు కృష్ణపరమాత్మ. ఆ విధంగా మూడు షట్కాలలో తొమ్మిది అంశాలను బోధించాడు. ఇప్పుడు ఇవే తొమ్మిది అంశాలను మళ్ళీ షట్కపరంగా చూద్దాము.

అధ్యాయము 2 – ఉపక్రమ సంక్షేపః
అధ్యాయాలు 3–17 – విస్తారః
అధ్యాయము 18 – ఉపసంహార సంక్షేపః

| **షట్కము** | **సాధనత్రయ విచారః** | **పదత్రయ విచారః** | **ఘటకత్రయ విచారః** |
|---|---|---|---|
| షట్కము 1 | కర్మయోగ సాధన | త్వమ్ పద విచారణ | ప్రయత్న అంశం |
| షట్కము 2 | ఉపాసనయోగ సాధన | తత్ పద విచారణ | ప్రసాద అంశం |
| షట్కము 3 | జ్ఞానయోగ సాధన | అసి పద విచారణ | సద్గుణ అంశం |

ఇదీ టూకీగా భగవద్గీతయొక్క విహంగవీక్షణం.

ఇప్పుడు పద్దెనిమిదవ అధ్యాయంలోకి అడుగుపెట్టబోతున్నాము. మనం ముందు అయిన పదిహేడు అధ్యాయాలనూ గుర్తుపెట్టుకుని ఉంటామని భావిస్తూ, కృష్ణపరమాత్మ అంతకుముందు బోధించిన అంశాలను టూకీగానే మనకు గుర్తుకుతెస్తాడు. మళ్ళీ వివరంగా బోధించడు. మనం కూడా మరీ వివరంగా మొత్తం అంశాలను మళ్ళీ చూడము కాని, అవసరమైనచోట కొంచెం వివరాలలోకి వెళతాము. అప్పుడు మనకు సందేహం లేకుండా అర్థమవుతుంది. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

**1. సాత్త్విక సన్న్యాసయోగము – శ్లోకాలు: 1–12 : ఉపోద్ఘాతము**

కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో టూకీగా చెప్పి, పదిహేను అధ్యాయాల్లో వివరంగా చెప్పినా, బోధించినది సాక్షాత్తూ జగద్గురువు అయిన కృష్ణపరమాత్మే అయినా, అర్జునునికి ఏదో ఒక సందేహం కలుగుతూనే ఉంది. అంటే దీనిబట్టి ఒక విషయం సుస్పష్టమవుతున్నది. ఆత్మజ్ఞానం అంత తేలిగ్గా అర్థంకాదు. దీనికి గురుశిష్యుల సంవాదం చాలాసేపు కొనసాగాలి. అలా ఆశువుగా వచ్చేయదు జ్ఞానం. ఆత్మబోధను ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలు బోధించాలి. కృష్ణపరమాత్మ ఒక క్రమపద్ధతిలో ఎలా బోధించుకువస్తున్నాడో ఇంతసేపూ చూశాము.

గురువు చెప్పిన అంశాన్ని శిష్యుడు బాగా అర్థం చేసుకోవాలి; ఏమైనా సందేహాలు వస్తే, గురువును అడిగి తెలుసుకోవాలి. బోధనుంచి వచ్చిన ప్రశ్నలను అనుప్రశ్నలు అంటారు. గురువు వాటిని తీర్చాలి. కాని ఒక సందేహం తీరినా, ఇంకొక సందేహం కలుగుతూనే ఉంటుంది. అందువల్ల గురువు చాలా వివరంగా చెప్పుకు వస్తాడు. కృష్ణపరమాత్మ కూడా వివరంగా పదిహేను అధ్యాయాల్లో చెప్పుకువచ్చాడు. అయినా అర్జునునికి ఎలాగో సందేహం వచ్చింది. ఇది అర్జునుడు అడిగిన ఆఖరిప్రశ్న. ఈ ప్రశ్నే ఈ ఆఖరి అధ్యాయానికి బీజం వేసింది.

అర్జునుడు సన్న్యాసం గురించి ప్రశ్నవేశాడు. ఎందుకు? సన్న్యాసం అంశం అర్జునుని బుర్రను తొలిచేస్తున్నది. నిజానికి, ఇప్పుడు అర్జునుడు ఉన్న పరిస్థితిని ఇంచుమించుగా అందరమూ ఎప్పుడో అప్పుడు ఎదుర్కొనే ఉంటాము. అంటే ఏదైనా సమస్య ముంచుకువచ్చినప్పుడే ఎవరికైనా సన్న్యాసం స్వీకరించాలనీ, ఋషీకేశ్‌కి వెళ్ళిపోవాలనీ,

ఏదైనా ఆశ్రమంలో శేషజీవితం గడపాలనీ అనిపిస్తుంది. జీవితం సాఫీగా సాగుతున్నంతసేపూ ఇలాంటి ఆలోచన రాదు.

నిజానికి అర్జునునికి కూడా సన్న్యాసం గురించిన ఆలోచన అడవిలో ఉండగా రాలేదు. నిజానికి అడవిలో ఉన్నప్పుడు, అది సన్న్యాసం స్వీకరించటానికి బాగా అనువైన ప్రదేశం. అక్కడే ఉండిపోయి ఉండవచ్చు. కాని అడవిలో ఉన్నన్నాళ్ళూ, ఇంకా మాట్లాడితే ఉన్నన్ని ఏళ్ళూ, రాజ్యానికి తిరిగిరావాలనీ, యుద్ధం చేసి రాజ్యాన్ని తిరిగి చేజిక్కుంచుకోవాలనీ తపనపడ్డాడు. దానికోసం ప్రణాళికలు వేశాడు. కాని తీరా యుద్ధరంగానికి వచ్చి, తనకు పూజ్యులైన ద్రోణాచార్యులు, భీష్మాచార్యులను స్వయంగా ఎదుర్కోవాల్సి వచ్చేసరికి తన కర్తవ్యం చేదుగా అనిపించింది; యుద్ధం చెయ్యటం అధర్మంగా అనిపించింది; పూజ్యనీయులను హతమార్చాల్సిరావటంకన్నా రాజ్యాన్ని త్యజించి, సన్న్యాసాన్ని స్వీకరించటం ఉత్తమమనిపించింది. సన్న్యాసాన్ని స్వీకరించటం ఉత్తమమని మొదటి అధ్యాయంలోనే భావించాడు. గాండీవం జారవిడిచి, రథంలో చతికిలబడ్డాడు.

దైవకృప ఉండబట్టి, తను ధర్మాధర్మవిచక్షణ కోల్పోయానని గ్రహించి, కృష్ణపరమాత్మను శరణువేడాడు. అప్పుడు కూడా కృష్ణపరమాత్మ తనను సన్న్యాసాన్ని స్వీకరించమని బోధిస్తాడని ఆశించాడు. ఇది అందరమూ ఎదుర్కొనే పరిస్థితే. మనకు ఏదో సమస్య వస్తుంది. ఆ సమస్యతో స్వామీజీ దగ్గరకు వెళతాము; నిజంగా స్వామీజీ చెప్పిన సమాధానాన్ని స్వీకరించటానికి కాదు; మనకు ఏదో సమాధానం ముందే దొరికివుంటుంది; అదే స్వామీజీ చెపితే, మన నిర్ణయాన్ని ఆయన కూడా బలపరిచిన ఉత్సాహం కలుగుతుంది. అందువల్ల నిజానికి మనం ఆశించిన పరిష్కారం వచ్చేదాకా వేచిచూస్తాము.

ఒకవేళ మనం ఆశించిన పరిష్కారం రాకపోతే, అదే ప్రశ్నను తిప్పి తిప్పి అడుగుతాము. చివరికి ఆశించినది వచ్చాక, అప్పుడు తృప్తిగా, 'స్వామీజీ, చాలా బాగా చెప్పారు,' అని ఎదురు స్వామీజీని మెచ్చుకుంటాము.

ఇప్పుడు అర్జునుడు అదే పరిస్థితిలో ఉన్నాడు. అర్జునుడు అస్త్రసన్న్యాసం చేసి, యుద్ధరంగంనుంచి వెళ్ళిపోయి, సన్న్యాసం స్వీకరించాలి అనుకుంటున్నాడు. దానికి కృష్ణపరమాత్మ ఆమోదముద్ర వెయ్యటంకోసం ఓపిగ్గా ఎదురుచూస్తున్నాడు. అందువల్ల తెలివిగా మళ్ళీ సన్న్యాసం గురించి చెప్పమని అర్జునుడు కృష్ణపరమాత్మను అడుగుతున్నాడు. కృష్ణపరమాత్మకు ఆ విషయం తెలియదా? ఆయన అర్జునునికన్నా తెలివైన భగవంతుడు. ఇప్పుడు అర్జునుడు సన్న్యాసం కోరుకుంటున్నది పలాయనం చిత్తగించటానికేననీ, నిజంగా వైరాగ్యం కలిగికాదనీ తెలుసు కృష్ణపరమాత్మకు. ఇలాంటి తాత్కాలిక వైరాగ్యం ఎక్కువకాలం నిలవదు.

సమస్యలు ఉన్నప్పుడు వాటిని తప్పించుకోవటానికి, పారిపోయి సన్న్యాసం స్వీకరించకూడదు. సమస్యలను చక్కగా పరిష్కరించుకుని, పరిస్థితి అంతా చక్కబడ్డాక, అంతా సవ్యంగా ఉన్నప్పుడు, సన్న్యాసం తీసుకోవాలనే కోరిక ఇంకా బలంగా ఉంటే, అప్పుడు తీసుకోవాలి. అందువల్ల అర్జునుడు ఆశించిన పరిష్కారాన్ని కృష్ణపరమాత్మ చూపించబోవటం లేదు.

అందువల్ల ఇక్కడ కృష్ణపరమాత్మ సన్న్యాసానికి సాంప్రదాయంలో ఇచ్చే నిర్వచనాన్ని కాకుండా, కొత్త నిర్వచనం ఇస్తున్నాడు. సాంప్రదాయ నిర్వచనం ఏమిటి? బాహ్యంగా సన్న్యాసం స్వీకరించి సన్న్యాసాశ్రమ జీవనాన్ని

గడపటం. అంటే ఒకవ్యక్తి తనకున్న బంధాలన్నిటినీ, తనకున్న ఆస్తిపాస్తులన్నిటినీ వదులుకుని, ఇల్లువాకిలి వదలి, ఎక్కడికో వెళ్ళి, సన్న్యాసం స్వీకరించటం. అదికూడా ఒక సాంప్రదాయ పద్ధతిలో చేస్తారు. దానికి చాలా తతంగం ఉంటుంది. దీన్ని ఆశ్రమసన్న్యాసః అంటారు. అర్జునుడు కావాలనుకుంటున్నది ఇది. అలా బాహ్యంగా సన్న్యాసం స్వీకరిస్తే, కాషాయవస్త్రాలు ధరిస్తే, ఇంక యుద్ధం చెయ్యనవసరంలేదు. ఎందుకంటే సన్న్యాసి యుద్ధం చెయ్యకూడదు.

కాని కృష్ణపరమాత్మ సర్వజ్ఞుడు. అర్జునుని మనస్సులో ఏముందో తెలిసిన దైవం. అందువల్ల ఈ సాంప్రదాయ నిర్వచనం ఇవ్వకుండా, కొత్త నిర్వచనాన్ని ఇస్తున్నాడు. ఏమిటది? కర్మయోగమే అసలైన సన్న్యాసం అన్నాడు. గృహస్థు పాటించే కర్మయోగజీవన విధానం అసలైన సన్న్యాసం అన్నాడు. అది ఇప్పుడు కాదు ఆరవ అధ్యాయం మొదట్లోనే అన్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః ॥** – 6.1

**యం సన్న్యాసమితి ప్రాహుః యోగం తం విద్ధి పాండవ ।**
**న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన ॥** – 6.2

కేవలం సన్న్యాసం స్వీకరించినంత మాత్రాన, కాషాయదుస్తులు ధరించినంత మాత్రాన ఎవరూ నిజమైన సన్న్యాసి కాజాలరు; గృహస్థుగా ఉండికూడా తీవ్రమైన రాగద్వేషాలను త్యజించగలిగిన వ్యక్తి అసలైన సన్న్యాసి అని ఆరవ అధ్యాయంలోనే చెప్పాడు కృష్ణపరమాత్మ. సన్న్యాసం అంటే ఏమిటి? రాగద్వేషాలను త్యజించటం. మామూలుగా గృహస్థు అనేక వ్యవహారాలు నడుపుతాడు కాబట్టి అతనికి రాగద్వేషాలు అధికంగా ఉంటాయి. కాని కొందరు గృహస్థుగా ఉంటూకూడా, తమ ధర్మాలను పాటిస్తూ కూడా, రాగద్వేషాలకు అతీతంగా ఎదగగలరు. దీనికి కర్మయోగ జీవనవిధానం తోడ్పడుతుంది. అందువల్ల సన్న్యాసం నిర్వచనం – కర్మయోగ జీవనవిధానం, రాగద్వేష అతీత జీవనవిధానం.

కృష్ణపరమాత్మ అలా తెలివిగా సన్న్యాసం అంటే కర్మయోగం, కర్మనుంచి పారిపోవటం కాదని చెప్పినా కూడా, అర్జునునికి తృప్తిగాలేదు. ఎందుకంటే కృష్ణపరమాత్మ తను ఆశించిన జవాబును ఇవ్వటంలేదు. ఒకసారి కాకపోతే, ఒకసారైనా కృష్ణపరమాత్మ సరే, సన్న్యాసం స్వీకరించు అంటాడేమో అనుకుంటే, అది రావటంలేదు. అందువల్ల మళ్ళీ ఆఖరిప్రయత్నంగా ఆఖరి అధ్యాయంలో 'కృష్ణా, దయచేసి సన్న్యాసం అంటే ఏమిటో చెప్పు,' అంటున్నాడు. అక్కడికేదో కృష్ణపరమాత్మ అసలు సన్న్యాసం అంశాన్నే చర్చించనట్టుగా. కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలోనే చర్చించాడని చూశాము. కాని అర్జునుడు తను ఆశించిన జవాబుకోసం మళ్ళీ అడుగుతున్నాడు. కొందరు ప్రెస్‌రిపోర్టర్లు ఒక్కోసారి అలా చేస్తారు. రాజకీయనాయకులనుంచి వారు ఆశించిన జవాబును రాబట్టటానికి ప్రయత్నిస్తారు. ఇక్కడితో సన్న్యాసయోగము ఉపోద్ఘాతము అయిపోయింది.

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।**
**త్యాగస్య చ హృషీకేశ పృథక్ కేశినిషూదన ॥**
సన్న్యాసస్య, మహాబాహో, తత్త్వమ్, ఇచ్ఛామి, వేదితుమ్,
త్యాగస్య, చ, హృషీకేశ, పృథక్, కేశినిషూదన ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో! | = ఓ మహాబాహూ! | త్యాగస్య, (తత్త్వమ్), చ | = త్యాగతత్త్వమును |
| హృషీకేశ! | = ఓ అంతర్యామీ! | పృథక్ | = వేర్వేరుగా |
| కేశినిషూదన! | = ఓ వాసుదేవా! | వేదితుమ్, ఇచ్ఛామి | = (నేను) తెలిసికొనగోరుచున్నాను |
| సన్న్యాసస్య, తత్త్వమ్ | = సన్న్యాసతత్త్వమును | | |

**హే మహా-బాహో! హే కేశి-నిషూదన హృషీకేశ! (అహం)**
**సంన్యాసస్య త్యాగస్య చ తత్త్వమ్ పృథక్ వేదితుమ్ ఇచ్ఛామి ॥**

తా: ఓ మహాబాహూ!, ఓ అంతర్యామీ!, ఓ వాసుదేవా! సన్న్యాసతత్త్వమును, త్యాగతత్త్వమును వేర్వేరుగా నేను తెలిసికొనగోరుచున్నాను.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకం అర్థం చూద్దాము.

**అర్జున ఉవాచ** – అర్జునుని ప్రశ్నతో ఈ అధ్యాయము మొదలవుతున్నది.

**మహాబాహో** – అర్జునుడు కృష్ణపరమాత్మను 'ఓ మహాబాహో' అని సంభోదిస్తున్నాడు. మహాబాహో అంటే బలమైన భుజాలు ఉన్నవ్యక్తి.

**సన్న్యాసస్య తత్త్వం వేదితుమ్ ఇచ్ఛామి** – నాకు సన్న్యాసం పదంయొక్క అర్థం, దాని ప్రాధాన్యత తెలుసుకోవాలని ఉంది. సన్న్యాసం పదాన్ని అక్షరాలా తీసుకుంటే దాని అర్థం – త్యజించటం. సన్న్యాసంలో మూడు అక్షరాలు ఉన్నాయి; సమ్+ని+అస్. అస్ ధాతువునుంచి ఈ పదం వచ్చింది. అస్యతి అంటే త్యజించటం. సమ్+ని రెండు ప్రిఫిక్స్‌లు ఈ అక్షరానికి వచ్చిచేరాయి. అంటే పూర్తిగా త్యజించటం. కొంత ఉంచుకుని, కొంత త్యజిస్తాననకూడదు. ఉన్న ఆస్తిపాస్తులు, అనుబంధాలు, బ్యాంక్ బాలన్సులు, బిరుదులు, డిగ్రీలు, అన్నీ త్యజించాలి. ఎవరో సన్న్యాసి అన్నీ త్యజించాడు కాని తన పేరు వెనక ఎమ్.ఎ. డిగ్రీని ఉంచుకున్నాడు. అంటే అతను పూర్తిగా త్యజించినట్టు కాదు. సన్న్యాసి అంటే సర్వాన్నీ త్యజించాలి. కొన్ని రోజులు సన్న్యాసాన్ని స్వీకరించి, మళ్ళీ వెనక్కి గృహస్థాశ్రమానికి వస్తాననకూడదు.

లౌకికజీవనంలో కూడా కొన్ని కంపెనీల్లో ఉద్యోగంలో చేరితే, ఆ కంపెనీలోకి ఆహ్వానిస్తూ ఒక కార్యక్రమం ఉంటుంది. దాన్ని వదిలివచ్చేటప్పుడు కూడా కొన్ని నియమనిబంధనలను పాటించాలి. నెల ముందో, రెండునెలల ముందో మానేస్తున్నానని నోటీసు ఇవ్వాలి; మన స్థానంలో ఇంకొకరికి శిక్షణను ఇవ్వాలి. అలా ఒక క్రతువులా చెయ్యాలి. సన్న్యాసం స్వీకరించటం కూడా అంతే. దానికి కూడా ఒక క్రతువు ఉంటుంది. అన్నింటినీ వదలటం

కూడా ఒక సాంప్రదాయ పద్ధతిలో చెయ్యాలి. ఇది సన్న్యాసంయొక్క నిఘంటువు అర్థం. అర్జునుడు, కృష్ణా నేను సన్న్యాసం గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను అన్నాడు.

**హృషీకేశ** – మళ్ళీ కృష్ణపరమాత్మను సంబోధిస్తున్నాడు. హృషీకం అంటే ఇంద్రియాలు; ఈశ అంటే భగవంతుడు.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః** – కేనోపనిషత్తు

భగవంతుడు చైతన్యం కాబట్టి ఇంద్రియాలకు చైతన్యాన్ని ప్రసాదిస్తాడు. అందువల్ల ఇంద్రియాలకు అధిపతి అయ్యాడు.

**కేశినిషూదన** – ఇంకో సంభోదన కూడా చేస్తున్నాడు. కేశి అనే రాక్షసుడు వేరేమొహం పెట్టుకుని వచ్చాడు. ఆ రాక్షసుణ్ణి సంహరించాడు కాబట్టి కేశినిషూదన అన్నాడు.

**త్యాగస్య చ (తత్త్వమ్ వేదితుం ఇచ్ఛామి)** – తత్త్వమ్ వేదితుం ఇచ్ఛామి మనం కలుపుకోవాలి. నాకు త్యాగం గురించి కూడా తెలుసుకోవాలని ఉంది. త్యాగం పదాన్ని కూడా మనం తరచు చూస్తుంటాము శాస్త్రంలో.

**న కర్మణా ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**

**వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సన్న్యాస యోగాత్, యతయః శుద్ధ సత్త్వాః॥**

సన్న్యాసం ఒక పదం; త్యాగం ఇంకొక పదం. త్యాగం పదంయొక్క నిఘంటువు అర్థం ఏమిటి? త్యాగం పదం 'త్యజ్,' ధాతువునుంచి వచ్చింది. అంటే త్యజించటం. సన్న్యాసం పదం 'అస్,' పదంనుంచి వచ్చిందనీ, దాని అర్థం కూడా త్యజించటం అని చూశాము. అంటే రెండింటి అర్థాలూ ఒకటేనా, వాటిమధ్య ఏదైనా సూక్ష్మభేదం ఉందా?

**పృథక్** – నాకు ఈ రెండుపదాలయొక్క అర్థం విడివిడిగా తెలుసుకోవాలని ఉంది అంటున్నాడు అర్జునుడు. అంటే అర్జునుడు ఆఖరిఅస్త్రం వదిలాడు. కృష్ణపరమాత్మ ఏమని జవాబిస్తాడో రాబోయే శ్లోకంలో చూద్దాము.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 2 **కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।**

**సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥**

కామ్యానామ్, కర్మణామ్, న్యాసమ్, సన్న్యాసమ్, కవయః, విదుః,

సర్వకర్మఫలత్యాగమ్, ప్రాహుః, త్యాగమ్, విచక్షణాః ॥

| | | | |
|---|---|---|---|
| కవయః | = కొందరు పండితులు | విచక్షణాః | = విచక్షణాశీలురైన మరికొందరు మాత్రము |
| కామ్యానామ్, కర్మణామ్ | = కామ్యకర్మలయొక్క | సర్వకర్మఫలత్యాగమ్ | = సమస్తకర్మల ఫలములను త్యజించుటనే |
| న్యాసమ్ (ఏవ) | = త్యాగమునే | త్యాగమ్ | = త్యాగమని |
| సన్న్యాసమ్ | = సన్న్యాసమని | ప్రాహుః | = పేర్కొందురు |
| విదుః | = భావింతురు | | |

**కవయః కామ్యానామ్ కర్మణామ్ న్యాసమ్ సంన్యాసమ్ విదుః,**
**విచక్షణాః (చ) సర్వ–కర్మ–ఫల–త్యాగమ్ త్యాగమ్ ప్రాహుః ॥**

తా: కొందరు పండితులు కామ్యకర్మలయొక్క త్యాగమునే సన్న్యాసమని భావింతురు. విచక్షణాశీలురైన మరికొందరు మాత్రము సమస్తకర్మల ఫలములను త్యజించుటనే త్యాగమని పేర్కొందురు.

కృష్ణపరమాత్మ వెంటనే తన జవాబు చెప్పడు. రెండు, మూడు శ్లోకాల్లో తక్కిన జ్ఞానులు చెప్పిన అభిప్రాయాలను ఉటంకిస్తున్నాడు. అందువల్ల ఈ రెండు శ్లోకాలను ఎవరో చెప్పిన వాక్యాలుగా తీసుకోవాలి. ఇవి కృష్ణపరమాత్మ అభిప్రాయాలు కావు; ఎవరో జ్ఞానుల అభిప్రాయం ముందు చెప్పి, తర్వాత కృష్ణపరమాత్మ తన అభిప్రాయాన్ని నాలుగవ శ్లోకంనుంచి చెబుతాడు. తన అభిప్రాయం చెప్పినప్పుడు, కృష్ణపరమాత్మ తక్కిన జ్ఞానుల అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవించటం లేదని, కొంత వ్యతిరేకిస్తున్నాడని అర్థమవుతుంది.

నిజానికి త్యజించటం అనే పదాన్ని ప్రధానంగా కర్మకు వినియోగిస్తారు. త్యజించటం అంటే ఆస్తిపాస్తులు, అనుబంధాలు, ఇల్లువాకిలి – వీటిన్నిటినీ త్యజించటమనే అర్థం. అయినా కూడా, ముఖ్యంగా కర్మను త్యజించాలని అర్థం వస్తుంది. నిజానికి కర్మను త్యజించటం అన్నింటికన్నా చాలా కష్టమైన పని. ఖాళీగా కూర్చోగలగటం చాలా కష్టం. ఖాళీగా కూర్చున్న మనిషి మనస్సు రాక్షసుని కర్మాగారం అంటారు.

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్** – 3.5

ఏ మనిషి అయినా, ఏ కాలంలోనైనా, క్షణం కూడా కర్మను చెయ్యకుండా ఉండలేడని కృష్ణపరమాత్మే చెప్పాడు. ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. అందువల్లనే పదవీవిరమణ చేస్తే, అది ఇటు పదవీవిరమణ చేసిన వ్యక్తినీ బాధిస్తుంది; అటు అతని కుటుంబీకులనీ బాధిస్తుంది. అందువల్ల చాలామంది రిటైర్ అయ్యాక కూడా ఇంకొక పనిని చేపడతారు. అందువల్ల త్యజించటం అంటే అంత కష్టమైన కర్మను త్యజించటం అంటుంది శాస్త్రం.

శాస్త్రం కర్మను ఐదు రకాలుగా విభజించింది. ఈ ఐదురకాల కర్మలను అంతకుముందు కూడా చూశాము. సందర్భం వచ్చింది కాబట్టి మళ్ళీ చూద్దాము.

ఎ) **విహిత కర్మలు** – చేసితీరాల్సిన కర్మలు. వీటిని నిత్యకర్మలు అనికూడా అంటారు.

బి) **కామ్య కర్మలు** – వీటిని సకామకర్మ అనికూడా అంటారు. ఇవి చేసితీరాలని లేదు, మీరు కావాలనుకుంటే చెయ్యవచ్చు.

సి) **నిషిద్ధ కర్మలు** – ఈ కర్మలు అసలు చెయ్యకూడదు. శాస్త్రం వీటిని నిషేధించింది.

డి) **ప్రాయశ్చిత్త కర్మలు** – వీటిని పరిహారకర్మలు అనికూడా అంటారు. ఏదైనా నిషిద్ధకర్మ చేస్తే, దానివల్ల కలిగే పాపాన్ని పోగొట్టుకోవటానికి చేసే కర్మను ప్రాయశ్చిత్తకర్మ అంటారు.

ఇ) **నైమిత్తిక కర్మలు** – సందర్భం వచ్చినప్పుడు చేసే కర్మలు.

ఉదాహరణకు పిల్లలు పుడితే వారికి చేసే కర్మలు నైమిత్తిక కర్మల కిందికి వస్తాయి. వారు పుట్టకముందు

ఆ కర్మలు ఉండవు. పుట్టి పెద్దయ్యాక కూడా ఆ కర్మలు ఉండవు. అలాగే మనవలు పుడితే కొన్ని అదనపు బాధ్యతలు వస్తాయి. అదికూడా నైమిత్తిక కర్మల కిందికే వస్తాయి.

అలా ఐదురకాల కర్మలు ఉన్నాయి. ఆ కర్మలను ఆధారంగా చేసుకుని, కొంతమంది సన్న్యాసానికీ, త్యాగానికీ మధ్యవున్న భేదాన్ని వివరిస్తారు. ఏమిటా భేదం?

**కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసమ్** – సన్న్యాసం అంటే కామ్యకర్మలను త్యజించటం అంటారు కొందరు. కామ్యకర్మలతో పాటు నిషిద్ధకర్మలను, ప్రాయశ్చిత్తకర్మలను కూడా కలుపుకోవాలి. మొదటికర్మ విహిత కర్మ. దాన్ని నిత్యకర్మలు అనికూడా అంటారని చూశాము. ఐదవది నైమిత్తిక కర్మ. ఈ రెండు రకాలూ చేసితీరాలి. ఈ రెండింటినీ కలిపి నిత్య, నైమిత్తిక కర్మలు అంటారు. అందువల్ల కొంతమంది కామ్యకర్మలు, నిషిద్ధకర్మలు, ప్రాయశ్చిత్త కర్మలను సన్న్యాసి త్యజించాలి కాని నిత్య, నైమిత్తిక కర్మలను చెయ్యాలి అంటారు. అయితే త్యాగం అంటే ఏమిటి?

**సర్వకర్మఫలత్యాగమ్** – కామ్యకర్మలు, నిషిద్ధకర్మలు, ప్రాయశ్చితకర్మలను వదిలేసి, అతను నిత్య, నైమిత్తిక కర్మలు చెయ్యాలంటారని చూశాము కదా. అంటే నిత్యమూ చేసితీరాల్సిన కర్మలు, అవసరం వచ్చినప్పుడు చేసితీరాల్సిన కర్మలు. ఈ కర్మలు చేసినప్పుడు కర్మఫలాన్ని ఆశించకుండా చేస్తే, ఆ కర్మఫలత్యాగాన్ని త్యాగం అంటారు అంటున్నారు కొందరు.

మామూలుగా ఈ నిత్య, నైమిత్తిక కర్మలను రెండు విధాలుగా చెయ్యవచ్చు. లౌకికసుఖాలకోసం లేదా ఆధ్యాత్మిక ఉన్నతికోసం. ఉదాహరణకు పిల్లలను పెంచటం విషయమే తీసుకోండి. కొంతమంది, 'ఇదుగో నీమీద ఇంత ఖర్చుపెట్టాను, నీ కాలేజీ ఫీజుకోసం ఇంత డొనేషను కట్టాను, నువ్వు ఉద్యోగంలో చేరాక నాకు అణాపైసలతో సహా తీర్చాలి,' అంటారు. కొంతమంది, 'నీమీద ఇంత ఖర్చుపెట్టాను కాబట్టి నీకు ఇంత మొత్తాన్ని కట్నంగా తీసుకోవాలి,' అంటారు. ఇది లౌకికవిజయాలకోసం చేసే పద్ధతి.

ఆధ్యాత్మిక ఉన్నతికోసం చేస్తే, పిల్లలను పెంచటం మీ బాధ్యత అనుకుంటారు. వారు వెనక్కి తిరిగి చూసినా, చూడకపోయినా ఏమీ అనుకోరు. వెనక్కి తిరిగి చూస్తే అదృష్టమే, చూడకపోతే మీకు ఇంతే రాసిపెట్టి ఉందనుకుని ఊరకుండిపోతారు.

**(సర్వకర్మఫలత్యాగమ్) ప్రాహుః త్యాగమ్** – ఈ నిత్య, నైమిత్తిక కర్మలను చేసి, వాటి ఫలితాన్ని ఆశించకపోవటాన్ని త్యాగం అని అంటున్నారు. ఎవరు?

**కవయః విచక్షణాః విదుః** – కవయః అంటే కవులు కాదు, పండితులు; విచక్షణాః అంటే విచక్షణాశక్తి ఉన్నవారు; విదుః అంటే భావిస్తారు. ఈ వాక్యాన్నిబట్టి ఇంతవరకూ చెప్పిన వాదన కృష్ణపరమాత్మది కాదు; కొందరు పండితులు, మేధావులు అంటారు. ఈ మేధావుల అభిప్రాయ సారాంశాన్ని టూకీగా చూద్దాము.

సన్న్యాసమ్ – కామ్య, నిషిద్ధ, ప్రాయశ్చితకర్మలను త్యజించాలి.

త్యాగమ్ – నిత్య, నైమిత్తిక కర్మల ఫలాన్ని త్యజించాలి.

శ్లో. 3 **త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।**
**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే ॥**
త్యాజ్యమ్, దోషవత్, ఇతి, ఏకే, కర్మ, ప్రాహుః, మనీషిణః,
యజ్ఞదానతపఃకర్మ, న, త్యాజ్యమ్, ఇతి, చ, అపరే ॥

| | | | |
|---|---|---|---|
| ఏకే | = కొందఱు | ప్రాహుః | = పలికెదరు |
| మనీషిణః | = విద్వాంసులు | అపరే, చ | = మరికొందరు |
| కర్మ | = ప్రతికర్మయు | యజ్ఞ, దాన, తపః, కర్మ | = యజ్ఞ, దాన, తపస్సులను కర్మలు |
| దోషవత్ | = దోషయుక్తమే కనుక అది | | |
| త్యాజ్యమ్ | = త్యజింపదగినదే | న, త్యాజ్యమ్ | = త్యజింపరానివి |
| ఇతి | = అని | ఇతి, (ఆహుః) | = అని పేర్కొందురు |

**ఏకే మనీషిణః కర్మ దోషవత్ (అస్తి తస్మాత్) త్యాజ్యమ్ ఇతి ప్రాహుః,**
**అపరే చ యజ్ఞ–దాన–తపః–కర్మ న త్యాజ్యమ్ ఇతి (ఆహుః) ॥**

తా: కొందఱు విద్వాంసులు ప్రతికర్మయు దోషయుక్తమే కనుక అది త్యజింపదగినదే అని పలికెదరు. మరికొందరు యజ్ఞ, దాన, తపస్సులను కర్మలు త్యజింపరానివి అని పేర్కొందురు.

ఈ శ్లోకంలో మరి రెండు అభిప్రాయాలను ప్రవేశపెడుతున్నాడు కృష్ణపరమాత్మ. ముందు శ్లోకంలో ఏమన్నాడు? కొందరు కామ్య, నిషిద్ధ, ప్రాయశ్చితకర్మలను త్యజించాలి అంటారు అన్నాడు. ఆ విషయంలో ఏ విధమైన విభేదమూ లేదు; అందరూ ఏకాభిప్రాయంలోనే ఉన్నారు. కాని వచ్చిన చిక్కల్లా నిత్య, నైమిత్తిక కర్మల విషయంలోనే. మొదటిరకం వారు ఇవి చేసితీరాల్సిన కర్మలు కాబట్టి వీటిని చేసితీరాలి, వీటిని వదలకూడదు. కాని వీటివల్ల వచ్చే కర్మఫలాన్ని మాత్రం త్యజించాలి అన్నారు. కాని ఇప్పుడు కొంతమంది ఏమంటున్నారు? ఆధ్యాత్మిక సాధన చెయ్యాలంటే ఈ నిత్య, నైమిత్తిక కర్మలను కూడా వదలాలి అంటున్నారు. ఆ అభిప్రాయం ఎందుకు వెలిబుచ్చుతున్నారో, ఇందులో చూస్తాము.

**ఏకే మనీషిణః ప్రాహుః** – కొందరు మనుష్యులు అంటారు. ఏమని?

**కర్మ త్యాజ్యమ్** – ఏ కర్మ అయినా సరే దాన్ని త్యజించాలి అంటారు. ఎందుకు?

**దోషవత్ ఇతి** – దానిలో దోషాలు ఉన్నాయి కాబట్టి అంటున్నారు. ఏమిటా దోషాలు? ఏ కర్మ చేసినా దానికి సంబంధించిన ఒత్తిడి, ఆందోళన ఉంటూనే ఉంటుంది. కర్తవ్యం అంటేనే ఘర్షణ, ఆందోళన. ఎందుకంటే మీరు చేపట్టిన పనిని పూర్తి చెయ్యగలరో లేదో అనే ఆందోళన వెంటాడుతూనే ఉంటుంది. అందువల్ల వేదాంతానికి రావాలనుకుంటే, ఈ కర్మలన్నిటినీ త్యజించి రావాలి.

**చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్**

ఈ వాక్యంమీద మీరు ధ్యానం చెయ్యాలనుకుంటే, మీ మనస్సు ఈ వాక్యంమీద దృష్టిపెట్టకుండా ఊరంతా తిరిగివస్తుంది. మనస్సు ప్రశాంతంగా ఉండనే ఉండదు. కర్మ అంటే ఆందోళన ఉండితీరుతుంది. అందువల్ల అది దోషాలతో కూడినది. ఎవరంటున్నారు? 'ఇతి' అంటే అంటున్నారు అని ఎవరి మాటలోచెబుతున్నాడు కృష్ణపరమాత్మ. కొంతమంది అన్ని కర్మలనూ త్యజించాలి అంటారు.

అంటే మీరు చేపట్టిన కర్మలను పూర్తిచేసి, దాని తర్వాత కొత్త బాధ్యతలను చేపట్టకూడదు. చేపట్టిన వాటిని మధ్యలో వదిలివేయకండి; కొత్తగా, అనవసరంగా వేరే బాధ్యతలను నెత్తిన వేసుకోకండి. మీ పిల్లలను సాకటం, వారి పిల్లలను సాకటం మీ నైమిత్తిక కర్మ. అంతేకాని మూడోతరం వారిని అంటే మీ మునిమనవలను కూడా సాకాల్సిన బాధ్యత మీకు లేదు. అలా బాధ్యతలు పెంచుకుంటూ పోతే, వీటికి అంతెక్కడ? ఇలా బాధ్యతలను పెంచుకుంటూపోయి, బాధ్యత తీరాక వేదాంతానికి వస్తానంటే, సముద్రపుటొడ్డున కూర్చుని, అలలు ఆగాక స్నానం చేస్తాను అన్నట్టు ఉంటుంది.

కొంతమంది మనుష్యులు నిత్యనైమిత్తిక కర్మలను కూడా త్యజించాలి అంటారు.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చ అపరే** – అపరే అంటే మరికొందరు యజ్ఞదానతపస్సులను త్యాగం చెయ్యకూడదు అంటారు. వీరు నిత్య, నైమిత్తిక కర్మలను యజ్ఞం, దానం, తపస్సులుగా పేర్కొంటున్నారు. నిత్యనైమిత్తిక కర్మలు అంటే మీ వ్యక్తిగతధర్మాలు, మీ కుటుంబధర్మాలు, సామాజికధర్మాలు. వీటిని మానకూడదు అంటారు. ఎందుకంటే ఇవి మీరు ఇతరులకు సేవగా చేస్తున్నారు. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే పంచమహాయజ్ఞాలు చేసితీరాలి అంటారు వీరు.

వేదాంతం పేరు చెప్పి, మీ నిత్యపూజలను మాననవసరం లేదు అంటారు. ముఖ్యంగా మాండూక్యోపనిషత్తు నేర్చుకుంటే, గౌడపాదాచార్యుల వారు ఉపాసకులను కృపణః అంటారు. అలా అయితే ఉపాసన మానేస్తాను అనకూడదు. అది ఈశ్వరప్రసాద అంశం కిందికి వస్తుంది. ఇంతకుముందే చూశాము. ఘటకత్రయంలో ప్రయత్నం, ప్రసాదం, సద్గుణాలు ఉండితీరాలని. అందువల్ల యజ్ఞదానతపస్సులను చేసితీరాలి.

అవి ఆందోళనను కలుగజేస్తాయని చెప్పి అసలే మానేయకూడదు. ఒకవేళ ఆందోళనను కలుగజేసేటట్టయితే, వాటిని పారద్రోలే మార్గాలను వెతుక్కోండి; అంతేకాని కర్మలను మానేస్తానంటే ఎట్లా అంటారు వీరు. కర్మలవల్ల కలిగే ఆందోళనను ఎలా పారద్రోలాలి? కృష్ణపరమాత్మే మార్గం చూపాడు తొమ్మిదవ అధ్యాయంలో.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

నామీదే పూర్తి భారం వేసి, నామీద నమ్మకం పెట్టుకుంటే మీ యోగక్షేమాలను నేనే చూసుకుంటాను అని హామీపత్రం ఇచ్చేశాడు కృష్ణపరమాత్మ. అందువల్ల కర్మలను పూర్తిగా త్యజించకండి – యజ్ఞదానతపస్సులను చెయ్యండి అంటారు మరికొందరు.

ఇప్పుడు మూడురకాల వాదనలను చూశాము. అవేమిటో మళ్ళీ చూద్దాము. ముందుగా త్యాగం గురించి చూద్దాము. త్యాగం గురించిన అభిప్రాయభేదాలు లేవు.

**త్యాగమ్** – నిత్య, నైమిత్తిక కర్మలు చెయ్యాలి కాని, వాటి కర్మఫలాలను త్యజించాలి.

**సన్న్యాసమ్** –1. కామ్య, నిషిద్ధ, ప్రాయశ్చిత్త కర్మలను త్యజించాలి.
2. అన్ని కర్మలనూ త్యజించాలి.
3. యజ్ఞదానతపస్సులను చెయ్యాలి.

ఈ మూడు వాదనలనూ రెండుగా చెయ్యవచ్చు. రెండవ వాదన ప్రకారం అసలు ఏ కర్మ కూడా చెయ్యకూడదు. ఎందుకంటే అవి దోషపూరితమైనవి. ఒకటీ, మూడు వాదనలను సమీకరిస్తే, కామ్యనిషిద్ధప్రాయశ్చిత్త కర్మలు లౌకిక విజయాలను ఇస్తాయి కాబట్టి వాటిని త్యజించాలి. నిత్యనైమిత్తిక కర్మలు లేదా పంచమహాయజ్ఞాలు లేదా యజ్ఞదానతపస్సులు చెయ్యాలి. అవి ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడతాయి. అంటే ఏ పేరుతో పిలిచినా ఈ కర్మలు ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడతాయి. అందుకని వాటిని పూర్తిగా వదలకూడదు – రెండవ వాదన. పూర్తిగా వదలాలి – మొదటి వాదన. ఈ వాదనలను ప్రవేశపెట్టాక కృష్ణపరమాత్మ తన అభిప్రాయాన్ని చెప్పబోతున్నాడు వచ్చే శ్లోకం నుంచీ.

శ్లో. 4 **నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః ॥**
నిశ్చయమ్, శృణు, మే, తత్ర, త్యాగే, భరతసత్తమ,
త్యాగః, హి, పురుషవ్యాఘ్ర, త్రివిధః, సంప్రకీర్తితః ॥

| | | | |
|---|---|---|---|
| పురుషవ్యాఘ్ర! | = ఓ పురుషశ్రేష్ఠా! | నిశ్చయమ్ | = నిశ్చితాభిప్రాయమును గూర్చి |
| భరతసత్తమ! | = ఓ అర్జునా! | శృణు | = వినుము |
| తత్ర | = సన్న్యాసము, త్యాగము అను రెండు విషయములలో (మొదట) | హి | = ఎందుకంటే |
| | | త్యాగః | = త్యాగము |
| త్యాగే | = త్యాగవిషయమున | త్రివిధః | = మూడు విధములుగా |
| మే | = నాయొక్క | సంప్రకీర్తితః | = పేర్కొనబడినది |

**హే భరతసత్తమ! తత్ర త్యాగే మే నిశ్చయమ్ శృణు ।**
**హే పురుష–వ్యాఘ్ర! త్యాగః హి త్రివిధః సమ్ప్రకీర్తితః (అస్తి) ॥**

తా: ఓ పురుషశ్రేష్ఠా! ఓ అర్జునా! సన్న్యాసము, త్యాగము అను రెండు విషయములలో మొదట త్యాగవిషయమున నాయొక్క నిశ్చితాభిప్రాయమును గూర్చి వినుము. ఎందుకంటే త్యాగము మూడు రకాలుగా పేర్కొనబడినది.

కృష్ణపరమాత్మ చేయబోయే బోధ చూసేముందు, శాస్త్రంలో చెప్పినదాన్ని గుర్తు తెచ్చుకుందాము. సన్న్యాసం అంటే అన్నీ త్యజించి, కాషాయవస్త్రాలు ధరించటం అని చూశాము. ఒకవ్యక్తికి సన్న్యాసం ఒక షరతుమీద

శాస్త్రం ఇస్తుంది. ఏమిటది? అతను సన్న్యాసం తీసుకుని, వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. లేదా అతను వేదాంతం నేర్చుకున్నాక సన్న్యాసం స్వీకరిస్తే, తను నేర్చుకున్న బ్రహ్మవిద్యను నలుగురికీ పంచిపెట్టాలి. దీన్ని ఆశ్రమసన్న్యాసం అంటారు.

ఈ సన్న్యాసం కూడా ఎవరికి ఇస్తారు? అతను తన ధర్మాలన్నీ నెరవేర్చి, చిత్తశుద్ధి పొందాక; అంటే పంచమహాయజ్ఞాలు చేశాక. అతను చిత్తశుద్ధి పొందకుండా సన్న్యాసం స్వీకరిస్తే మాత్రం అతనికి అది చాలా బాధాకరమవుతుంది. అలా చిత్తశుద్ధి కలగకుండా సన్న్యాసం స్వీకరిస్తే, అది అతనికే కాదు, సమాజానికి, సన్న్యాసధర్మానికీ, కాషాయవస్త్రానికీ కూడా అపరాధం చేసినట్టు అవుతుంది. అందువల్ల శాస్త్రం సన్న్యాసాశ్రమాన్ని నాలుగవ ఆశ్రమధర్మంగా నిర్దేశించింది. గృహస్థుగా నీ ధర్మం నెరవేర్చు; చిత్తశుద్ధి పొందు; అప్పుడు కావాలంటే సన్న్యాసాన్ని స్వీకరించు అంటుంది. కాని దానిముందు మాత్రం కాదు.

కృష్ణపరమాత్మ అర్జునుడు అప్పుడే సన్న్యాసం స్వీకరించటానికి అర్హుడు కాదని తెలుసుకున్నాడు. ఎందుకంటే అతను పాటించాల్సిన క్షత్రియధర్మం ఉంది. అది నెరవేర్చాక, ఇంకా ఆ మక్కువ ఉంటే, అప్పుడు ఆలోచించవచ్చు. అందువల్ల కృష్ణపరమాత్మ ఇక్కడ సన్న్యాసం నిర్వచనం, అందరికీ తెలిసిన సాంప్రదాయ నిర్వచనాన్ని ఇవ్వబోవటం లేదు. సన్న్యాసం అంటే రాగద్వేషాలకు అతీతంగా ఎదగటం అంటున్నాడు.

ముందే చూసినట్టుగా కృష్ణపరమాత్మ ఈ నిర్వచనాన్ని ఇప్పుడు కొత్తగా ఇవ్వటంలేదు. సమయం దొరికినప్పుడల్లా చెబుతూనే ఉన్నాడు; కాని అర్జునుడే స్వీకరించలేకుండా ఉన్నాడు. ఎందుకంటే అతనికి తెలిసినది ఆశ్రమ సన్న్యాసమే, ఆంతర సన్న్యాసం కాదు. అందువల్ల మళ్ళీ సన్న్యాసం, త్యాగం గురించిన సూక్ష్మభేదాన్ని చెప్పమని కోరాడు. కృష్ణపరమాత్మ తన వివరణ ముందే ఇవ్వకుండా తక్కిన పండితులు, మేధావులు ఏమంటారో చెప్పాడు ఇంతవరకు. అవి ఒక్కముక్కలో చెప్పాలంటే అన్ని కర్మలనూ వదిలేయాలి అని కొందరంటే, కొన్ని వదిలేయాలని మరికొందరు అంటారు. కృష్ణపరమాత్మ ఏం చెప్పబోతున్నాడో చూద్దాము.

**భరతసత్తమ** – కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి భరతసత్తమ అని సంబోధిస్తున్నాడు. సత్ అంటే సత్పురుషుడు. భరతవంశానికి చెందినవారిలో నువ్వు అత్యంత శ్రేష్ఠుడవు అంటున్నాడు.

**శృణు** – జాగ్రత్తగా విను. దేన్ని?

**మే నిశ్చయమ్** – నా నిశ్చితాభిప్రాయాన్ని విను. దేని గురించి?

**తత్ర త్యాగే** – త్యాగం గురించి నేను చెప్పబోయే నిర్వచనాన్ని విను అంటున్నాడు. అర్జునుడు రెండు పదాలను అడిగాడు. అవి సన్న్యాసం, త్యాగం. కృష్ణపరమాత్మ త్యాగం గురించి విను అంటున్నాడు.

ఇక్కడ శంకరాచార్యులవారు ఈ మాటలోని గూఢార్థాన్ని వివరిస్తున్నారు. రెండుపదాల గురించి అడిగితే, కృష్ణపరమాత్మ ఒక్కదాని గురించే ఎందుకు చెబుతున్నాడంటే అవి రెండూ రెండు భిన్నపదాలు కావు. కృష్ణపరమాత్మ ఈ రెండూ ఒకటే అని సూచిస్తున్నాడు.

కృష్ణపరమాత్మ రెండూ ఒకటే అన్నాడు అని అర్థం చేసుకుంటే, ఇంకొక గూఢార్థాన్ని కూడా తీసుకోవాలి. ఏమిటది? మొదటివాదనలో కొందరు మేధావులు సన్న్యాసానికీ, త్యాగానికీ మధ్య భేదాన్ని సూచించారు. సన్న్యాసం అంటే కామ్య, నిషిద్ధ, ప్రాయశ్చిత్త కర్మలను త్యజించటమనీ; త్యాగం అంటే నిత్యనైమిత్తిక కర్మఫలాలను త్యజించటమనీ అన్నారు. ఇప్పుడా నిర్వచనాలు వర్తించవు.

అందువల్ల కృష్ణపరమాత్మ త్యాగం అన్నా కూడా సన్న్యాసం పదాన్ని కూడా కలుపుకోవాలి. ఇది ఒక నియమం. రెండవది పైన చెప్పిన నిర్వచనానికి భిన్నంగా కృష్ణపరమాత్మ త్యాగాన్ని నిర్వచించబోతున్నాడు.

**పురుషవ్యాఘ్ర** – పురుషులలో శ్రేష్ఠుడా. వ్యాఘ్ర అంటే పులి; పురుషవ్యాఘ్ర అంటే పురుషులలో పులివంటివాడు; అంటే పురుషులలో శ్రేష్ఠుడు. ఓ పురుషోత్తమా విను,

**త్యాగో హి త్రివిధః సంప్రకీర్తితః** – త్యాగాన్ని మూడురకాలుగా పేర్కొంటారు. త్యాగం అంటే సన్న్యాసం కూడా కలుపుకోవాలని చూశాము. అర్జునుడు రెండు పదాలను అడిగి వాటిమధ్య భేదాలు ఏమిటి అంటే దాన్ని కృష్ణపరమాత్మ ఇంకా పెంచి మూడురకాల సన్న్యాసాలు ఉన్నాయి అన్నాడు. సహజంగానే ఆ మూడు ఏమిటో తెలుసుకోవాలని ఎవరికైనా కుతూహలంగా ఉంటుంది. కాని కృష్ణపరమాత్మ అవేమిటో చెప్పేముందు, ప్రాథమిక సూత్రాలను చెప్పబోతున్నాడు. అవి అర్థమైతేనే సన్న్యాసం అంటే అర్థమవుతుంది. రాబోయే రెండు శ్లోకాల్లోను ఆ ప్రాథమిక సూత్రాలను చెప్పబోతున్నాడు. అవి బాగా గుర్తుంచుకుని తీరాల్సిన శ్లోకాలు. వైదిక బోధలోనే వాటిని జాతిరత్నాలు అనవచ్చు.

శ్లో. 5 **యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥**
యజ్ఞదానతపఃకర్మ, న, త్యాజ్యమ్, కార్యమ్, ఏవ, తత్,
యజ్ఞః, దానమ్, తపః, చ, ఏవ, పావనాని, మనీషిణామ్ ॥

| | | | |
|---|---|---|---|
| యజ్ఞదానతపఃకర్మ | = యజ్ఞ, దాన, తపస్సులను కర్మలు | దానమ్ | = దానము |
| న, త్యాజ్యమ్ | = త్యజింపరానివి | చ | = ఇంకా |
| తత్ | = ఆ మూడును | తపః | = తపస్సు |
| కార్యమ్, ఏవ | = అవశ్యము ఆచరింపవలసినవే – ఎందుకంటే | ఏవ | = అను మూడు కర్మలే |
| | | మనీషిణామ్ | = బుద్ధిమంతులను |
| యజ్ఞః | = యజ్ఞము | పావనాని | = పవిత్రమొనర్చునవి |

**యజ్ఞ–దాన–తపః–కర్మ న త్యాజ్యమ్ తత్ కార్యమ్ ఏవ ।**
**యజ్ఞః దానమ్ తపః చ (ఏతాని) మనీషిణామ్ పావనాని ఏవ (సన్తి) ॥**

తా: యజ్ఞ, దాన, తపస్సులను కర్మలు త్యజింపరానివి. ఆ మూడును అవశ్యము ఆచరింపవలసినవే. ఎందుకంటే యజ్ఞము, దానము ఇంకా తపస్సు అను మూడు కర్మలే బుద్ధిమంతులను పవిత్రమొనర్చునవి.

సన్న్యాసం గురించి చెప్పేముందు ఈ నిర్వచనాన్ని వినేదెవరో చూసుకోవాలి. అందువల్ల సన్న్యాసాన్ని అందరికీ నిర్దేశించరు. వినే శ్రోతలనుబట్టి చెబుతారు. శాస్త్రం ఈ అంశాన్ని రెండు స్థాయిల్లో విశదీకరిస్తుంది అంటే శిష్యుడు ఉన్న స్థాయినిబట్టి విశదీకరిస్తుంది.

శాస్త్రం మొత్తం మానవాళిని రెండుతెగల కింద విభజించింది. ఒక తెగ – జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందినవారు. ఇంకో విధంగా చెప్పాలంటే పరిణితి చెందిన మనస్సు, చిత్తశుద్ధి ఉన్న మనస్సు, సంసిద్ధత ఉన్న మనస్సు, అనుబంధాలను వదులుకోగలిగిన మనస్సు ఉన్నవారు. రెండవరకం మనుష్యులు అశుద్ధ అంతఃకరణ ఉన్నవారు. అశుద్ధ అంతఃకరణ అంటే సన్న్యాసానికి సిద్ధంగా లేనివారు. చాలామంది రెండవ తెగలోకి వస్తారు.

సాధారణంగా మానవమనస్సు భావోద్రేకాలతో కూడివుంటుంది; అందువల్ల ఏవో కొన్ని అనుబంధాలను కోరుకుంటుంది. అందువల్లనే కొంతమందికి ఈ పటిష్ఠమైన అనుబంధాలు లేకపోతే పిచ్చెక్కినట్టు ఉంటుంది. నావారు అని చెప్పుకోవటానికి, మనస్సు విప్పి చెప్పుకోవటానికి కొంతమందైనా కావాలి. నువ్వు నావాడివి; నేను నీవాణ్ణి అనాలనుకుంటారు ఒక్కరితోనైనా.

అటువంటి ఆప్యాయతలు కొరవడితే ఒంటరితనం బాధిస్తుంది. ఒంటరితనం బాధిస్తే అనేక మానసిక రుగ్మతలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఎవరైనా మానసిక శాస్త్రవేత్తను ప్రశ్నించి చూడండి, కొందరు సన్న్యాసులను కూడా ఈ ఒంటరితనం బాధిస్తుంది అంటారు. ఎందుకు? మనిషి మనస్సు అనుబంధాలను, ఆత్మీయతలను కోరుకుంటుంది కాబట్టి. అలాంటి మనస్తత్వం ఉన్నవ్యక్తికి సన్న్యాసం స్వీకరించమని చెప్పకూడదు అంటుంది శాస్త్రం. ఈ విషయం కృష్ణపరమాత్మ కూడా ఐదవ అధ్యాయంలో చెప్పాడు.

**సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః ।**
**యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి ॥** – 5.6

కాషాయవస్త్రం ధరించటం తేలికే. ఇంటినుంచి పారిపోయి రావటం కూడా తేలికే. దయానందస్వామీజీ తన అనుభవం ఎప్పుడూ చెబుతుంటారు. ఆయన సన్న్యాసం స్వీకరించేముందు హిమాలయాలకు వెళ్ళి అనేక సన్న్యాసులను కలిశారు. వారితో తనకు కూడా సన్న్యాసం స్వీకరించాలని ఉందన్న తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాని చాలామంది సన్న్యాసులు వెంటనే దానికి తీవ్రంగా స్పందించారుట. ఆ అభిప్రాయాన్ని మార్చుకోమని గట్టిగా సలహా ఇచ్చారుట. కొంతమంది మేము సన్న్యాసం తీసుకుని ఇప్పుడు బాధపడుతున్నాము అని కూడా చెప్పారుట.

సన్న్యాసాశ్రమంలో ఉన్న గొప్ప దురదృష్టకరమైన విషయం, ఎవరికైనా సన్న్యాసం స్వీకరించే అవకాశం ఉంది కాని, అది నచ్చకపోతే వెనక్కి తిరిగివచ్చే మార్గం లేదు. వారు అందులోకి అడుగుపెట్టగానే ఆ ద్వారం మూసుకుపోతుంది. తక్కిన ఆశ్రమాల్లో ఆ బాధలేదు. బ్రహ్మచర్యంనుంచి గృహస్థాశ్రమం స్వీకరించవచ్చు; గృహస్థాశ్రమంనుంచి సన్న్యాసాశ్రమం స్వీకరించవచ్చు కాని సన్న్యాసాశ్రమంనుంచి గృహస్థాశ్రమానికి వెనక్కి రాలేరు. ఇది వన్‌వే ట్రాఫిక్ మాత్రమే.

చాలామంది సన్న్యాసులకు వారి జీవనవిధానం విసుగు పుట్టిస్తుంది. ఎదురుగా హిమాలయాలు తప్ప వేరే ఏమీ కనబడవు; వేసుకునే దుస్తుల్లో మార్పులేదు; ఆహారంలో మార్పులేదు; పొద్దున్న దాల్‌రోటీ అయితే రాత్రికి రోటీదాల్. ఇటువంటి జీవనాన్ని ప్రశాంతంగా కొనసాగించాలంటే దానికి చాలా సంసిద్ధత ఉన్న మనస్సు ఉండాలి. ఒంటరిగా ఉండే కొందరు సన్న్యాసులు ఎవరైనా కనిపిస్తే సంతోషించి, వారితో గలగలా కబుర్లు చెబుతారు. అందువల్ల శాస్త్రం ఇటువంటి సన్న్యాసజీవనాన్ని అందరికీ సమానంగా సూచించదు.

ఇలా సంసిద్ధంగా లేనివారే ఎక్కువ ఉంటారు. కృష్ణపరమాత్మ అటువంటి వారిని సంబోధిస్తున్నాడు. వారిని అశుద్ధ అంతఃకరణ ఉన్నవారు అన్నాము ఇందాక. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమ్** – యజ్ఞం, దానం, తపస్సు అనే ఈ మూడు కర్మలను మాత్రం ఎన్నడూ త్యజించకు అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే దైవచింతనను, భక్తిని ఎన్నడూ మానకూడదు. అది మీ మనస్సును దృఢంగా ఉంచుతుంది. అందువల్లనే కృష్ణపరమాత్మ ఈ మూడింటి గురించీ పదిహేడవ అధ్యాయంలో వివరంగా చెప్పాడు.

మత్తుమందు, మాదకద్రవ్యాలు తీసుకోవటం వంటి చెడుఅలవాట్లను వేటిని వదులుకోవాలనుకున్నా కూడా, వాటిని వదులుకుని ప్రశాంతమైన మనస్సు ఉండాలంటే, భక్తిభావన తోడ్పడుతుంది.

నిజానికి మనదేశం వేరే రంగాలలో అభివృద్ధి చెందకపోయినా, ఆధ్యాత్మికంగా చూస్తే చాలా ముందు ఉంది. మనదేశంలో మనుష్యులు ఈమాత్రం ప్రశాంతంగా ఉన్నారంటే దానికి కారణం, వారికి ఉన్న దైవచింతనే. పేదరికం రాజ్యమేలుతున్నా, పూరిగుడిసెల్లో ఉన్నవారు కూడా చిరునవ్వులు చిందించగలుగుతున్నారంటే అది మన మతంయొక్క గొప్పతనం. కొందరు సామాజికస్పృహ ఉన్నవారు ఇంతమంది పేదవారు ఉంటే వారికి పిచ్చన్నా ఎక్కాలి లేదా తిరుగుబాటన్నా చెయ్యాలి అంటారు; కాని వారు అలా చెయ్యకపోవటానికి కారణం, దైవభక్తే.

అందువల్ల యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మలను ఎన్నడూ మానకండి అన్నాడు. అవి ఆధ్యాత్మిక చింతనకు తోడ్పడతాయని ముందు అధ్యాయంలో కూడా చూశాము. యజ్ఞం అంటే ఏదో ఒకవిధమైన పూజ. ఏదైనా ఆలయానికి వెళ్ళిచూడండి; మనుష్యులు వారికున్న అనేకానేక సమస్యలను కాసేపు పక్కనపెట్టి, భక్తిపారవశ్యంతో భగవంతునికి ప్రార్థన చేస్తారు.

దానం మరొక గొప్ప విలువ. మనదేశంలో పేదరికం రాజ్యమేలుతున్నా కూడా, దానగుణం కూడా మన దేశంలోనే ఎక్కువగా ఉంది. భారతదేశంలో దానం చేసే డబ్బును లెక్కలు వేస్తే 2200 కోట్లకన్నా ఎక్కువే ఉందిట. వంద రూపాయలే ఉన్న పల్లెటూరివ్యక్తికి కూడా ఒక సన్న్యాసి తన ఊరికి వస్తే, ఆయనకు దక్షిణ ఇవ్వాలని తెలుసు.

ఒక స్వామీజీ తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. ఆ స్వామీజీ గుడిసెలు ఉన్న ఒక ప్రాంతానికి వెళ్ళారుట ఒకసారి. వారి జీవితం చాలా దయనీయంగా ఉంది. చాలా దరిద్రంలో ఉన్నారు వారు. కాని

ఏ గుడిసె ముందునుంచి వెళ్ళినా, ప్రతి గుడిసెలోని వారు ఐదుపైసలో, పదిపైసలో ఆయన చేతిలో పెట్టారుట. ధనవంతుడు వందరూపాయలు ఇచ్చినా, అది అతనికేమీ కష్టంకాదు; కాని ఈ పూరిగుడిసెలలోని వారికి ఆ ఐదుపైసలు, పదిపైసలు ఇవ్వటమే చాలా కష్టం. అయినా ఎందుకిచ్చారు? వారికున్న దానగుణంవల్ల. ఆ స్వామీజీకి కళ్ళలో నీళ్ళు తిరిగాయట. వారికి రేపనేరోజు ఎలా గడుస్తుందో తెలియదు, అయినా కాషాయాంబరధారిని గౌరవించాలని తెలుసు.

అంత పేదరికం అనుభవిస్తున్నవారినుంచి డబ్బు తీసుకోవటానికి ఆయనకు మనస్కరించలేదు; అలాగని తిరిగి ఇవ్వటానికీ ధైర్యం చాలలేదు. ఎందుకంటే ఆ స్వామీజీ ఒకవేళ తీసుకోను అనివుంటే, వారు చాలా చిన్నబుచ్చుకుని ఉండివుండేవారు. అయ్యో, మేము దానం చేసే పరిస్థితిలో లేమే అని వారిని వారు నిందించుకుని ఉండేవారు. అందువల్ల ఆయనకు కన్నీటిపర్యంతమైనా కూడా ఆ డబ్బును తీసుకున్నారు.

భారతదేశంలో 2200 కోట్లపైనే దానం చేస్తారని చూశాము కదా, అందులో డెబ్బయిశాతం పల్లెటూర్లనుంచి వస్తుంది. అత్యంత గొప్ప ధనవంతులు ఉండేది పట్టణాలలో, కాని దానగుణం ఉన్నది పల్లెటూర్లలో. ఐదురూపాయల ఆదాయం వస్తే, అందులో ఒకపైసా దానం చెయ్యాలంటుంది శాస్త్రం.

**తమేతమ్ వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేనదానేన తపసా** – బృహదారణ్యకం

ఆ బృహదారణ్యకంలోంచి యజ్ఞేన దానేన తపసా పదాలను తీసుకున్నాడు కృష్ణపరమాత్మ.

మూడవది తపస్సు. నిజానికి యజ్ఞం, దానం, తపస్సుల గురించి వివరంగా పదిహేడవ అధ్యాయంలో చూశాము. మళ్ళీ తపస్సులో రెండురకాలను కూడా చూశాము. వాటిని కారణదృష్ట్యా తపః, గుణదృష్ట్యా తపః అన్నాము. కారణదృష్ట్యా అంటే కాయిక, వాచిక, మానసిక తపస్సులు; గుణదృష్ట్యా తపః అంటే ఈ మూడురకాల తపస్సులను చేసే విధానాన్నిబట్టి వాటిని సాత్త్విక, రాజసిక, తామసిక తపస్సులు అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ సాత్త్విక, రాజసిక, తామసిక భేదాలను యజ్ఞం, దానం విషయాలలో కూడా చూశాము.

యజ్ఞదానతపఃకర్మ అంటే కర్మ నాలుగవ అంశం కాదు. కర్మను ఈ తక్కిన మూడింటికీ కలుపుకోవాలి. యజ్ఞకర్మ, దానకర్మ, తపఃకర్మ.

**న త్యాజ్యమ్** – ఈ మూడు కర్మలనూ త్యజించకూడదు. మీరు విదేశాలలో ఉద్యోగరీత్యా స్థిరనివాసం ఏర్పరచుకున్నా కూడా, ఈ మూడు కర్మలనూ మానకూడదు.

**కార్యమ్ ఏవ తత్** – ఎక్కడ ఉన్నా ఈ కర్మలను మానకూడదు. ఎందుకు? ఈ మూడు కర్మలు మీకు జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తాయని చూశాము. మీరు ఆత్మజ్ఞానానికి విలువనిస్తే, అది పొందటానికి అవసరమైన జ్ఞానయోగ్యతాప్రాప్తికి విలువను ఇస్తారు. జ్ఞానయోగ్యతాప్రాప్తికి విలువను ఇస్తే యజ్ఞదానతపస్సులకు కూడా విలువను ఇస్తారు. అందువల్లనే కృష్ణపరమాత్మ ప్రత్యేకించి రెండు అధ్యాయాలను జ్ఞానయోగ్యతాప్రాప్తికి కేటాయించాడు.

**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని** – ఈ యజ్ఞం, దానం, తపస్సు అనే ఈ మూడు సాధనలు; పావనాని – చిత్తశుద్ధి కలుగజేస్తాయి. చిత్తశుద్ధి అంటే ఏమిటి? వేదాంతబోధకు రాకుండా అడ్డుపడే భావోద్రేకాల ఆటంకాలను తొలగిస్తాయి.

ముందుగా సందేహం కలుగుతుంది. అసలు వేదాంతం అవసరమా? అది ఎందుకు నేర్చుకోవాలి? ఈ ప్రశ్నలు ఉదయిస్తాయి. ఎప్పుడు? మనస్సు శుద్ధి కాకపోతే. 'నేను హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నాను; నెల తిరిగేసరికి జీతం చేతిలో పడుతుంది; నాకు పిల్లలు ఉన్నారు; వారిని బాగా చదివించగలుగుతున్నాను; రెండుపూటలా కడుపునిండా తినగలుగుతున్నాము, ఇంక దేవుడు ఎందుకు? ఆలయాలు ఎందుకు? ఆధ్యాత్మిక సాధన ఎందుకు? జీవితం అంటే భయం ఉన్నవారికే దేవుడు, పూజలు కావాలి. మనస్సు దృఢంగా లేనివారికే ఇవన్నీ. నాకు దేవుడు, పూజలు అవసరం లేదు.' ఇది ఒక వాదన.

కాని అది పెద్ద పొరపాటు. దైవభక్తి ఉండాల్సింది బలహీనమైన మనస్సు ఉన్నవ్యక్తికి కాదు. పరిణితి చెందిన వ్యక్తికి కావాలి. మనస్సు పరిపక్వం చెందినవ్యక్తే భగవంతునిమీద భక్తిని పెంచుకోగలడు; ఆత్మజ్ఞానంయొక్క విలువను తెలుసుకోగలడు. ఇవి తెలియకపోతే, అతను చాలా దురదృష్టవంతుడు. ఇది కూడా ఒక రకమైన పాపమే.

బాగా ధనం ఉన్నవ్యక్తిని సమాజం కీర్తిస్తుంది; అతను పుణ్యం చేసుకున్నాడు లేదా పెట్టిపుట్టాడు అంటారు. కాని వేదాంతం, అతను గనుక దైవభక్తి, ఆత్మజ్ఞానాల జోలికి రాకపోతే, అతను పాపం చేసుకున్నాడు, పుణ్యం కాదు అంటుంది. అందువల్ల యజ్ఞం, దానం, తపస్సులు శుద్ధి చేస్తాయి. ఎవరిని?

**మనీషిణామ్** – తెలివైన వ్యక్తిని. అంటే వీటి విలువ తెలుసుకుని, వీటిని ఆచరించిన వ్యక్తిని.

ఇక్కడ శంకరాచార్యులవారు ఒక విషయాన్ని అదనంగా చెబుతున్నారు. ఏమిటది? యజ్ఞదానతపస్సులనే ఈ మూడూ చేసితీరాలి నిజమే కాని, జ్ఞానయోగ్యతాప్రాప్తి వచ్చాక, వాటిని త్యజించవచ్చు అంటున్నారు. ఇక్కడ వాటి ప్రాముఖ్యతను గురించి మాట్లాడుతున్నాడు కాబట్టి ఆ విషయం కృష్ణపరమాత్మ ఇప్పుడు చెప్పదలుచుకోలేదు. కాని తనే స్వయంగా ఈ అధ్యాయంలోనే 66వ శ్లోకంలో సర్వధర్మాన్ పరిత్యజ్య అంటాడు. అంటే ఈ యజ్ఞదాన తపఃకర్మలను పరిత్యజించు అంటాడు. ఎప్పుడు? శంకరులవారు చెప్పినట్టుగా జ్ఞానయోగ్యతాప్రాప్తి కలిగిన తర్వాత. అంతవరకూ శ్రద్ధగా రోజూ ప్రార్థన చెయ్యండి, విభూతిని ధరించండి. అంటే యజ్ఞదానతపస్సులను చెయ్యండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 6 **ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।**
**కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ ॥**
ఏతాని, అపి, తు, కర్మాణి, సంగమ్, త్యక్త్వా, ఫలాని, చ,
కర్తవ్యాని, ఇతి, మే, పార్థ, నిశ్చితమ్, మతమ్, ఉత్తమమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | ఫలాని | = కర్మఫలములను |
| ఏతాని | = ఈ యజ్ఞ, దాన, తపః కర్మలును | త్యక్త్వా | = త్యజించి |
| తు | = అలాగే | కర్తవ్యాని | = తప్పక చేయదగినవి |
| (అన్యాని), అపి, | = ఇతరములగు | ఇతి | = అని |
| కర్మాణి | కర్తవ్యకర్మలన్ని | మే | = నాయొక్క |
| సంగమ్ | = సంగత్వము | ఉత్తమమ్, నిశ్చితమ్, | = ఉత్తమమైన, నిశ్చితమైన |
| చ | = ఇంకా | మతమ్ | అభిప్రాయము |

**అపి తు ఏతాని కర్మాణి సఙ్గమ్ ఫలాని చ త్యక్త్వా కర్తవ్యాని**
**ఇతి, హే పార్థ! మే నిశ్చితమ్ ఉత్తమమ్ మతమ్ (అస్తి) ॥**

తా: ఓ పార్థా! ఈ యజ్ఞ, దాన, తపః కర్మలును అలాగే ఇతరములగు కర్తవ్యకర్మలన్నియు కర్మఫలములందు సంగత్వం త్యజించి తప్పక చేయదగినవి అని నాయొక్క ఉత్తమమైన, నిశ్చితమైన అభిప్రాయము.

అందువల్ల ఎవరైనా ప్రాథమిక కర్మలు, ఆధ్యాత్మికతకు తోడ్పడే కర్మలు, చేసితీరాలి.

**ఏతాని కర్మాణి** – ఈ మూడుకర్మలూ. ఏమిటవి? యజ్ఞం, దానం. తపస్సు.

**కర్తవ్యాని** – తప్పకుండా చేసితీరాలి. కాని ఆ కర్మలు చేసేటప్పుడు, మీ దృక్పథం ఎలా ఉండాలి?

**సంగం త్యక్త్వా** – వాటితో బంధం పెంచుకోకూడదు. అవి మతపరఃమైన కర్మలు అయినా కూడా వాటితో బంధం పెంచుకోకూడదు. ఎందుకు? చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందాక వాటిని కూడా త్యజించాలి.

ఈ విషయం చాలా బాగా అర్థం చేసుకోవాలి. యజ్ఞాలు, తపస్సులు చెయ్యాలి నిజమే; వాటిమీద బంధం పెంచుకోకుండా చెయ్యాలి. ఎందుకంటే చిత్తశుద్ధి పొందాక, జ్ఞానమార్గానికి రావాలి; అంటే ఈ కర్మలను త్యజించాలి. మనుష్యులు ఈ కర్మల విషయంలో రెండు భిన్నప్రవృత్తులు చూపిస్తుంటారు. ఒకరేమో అసలు ఈ మూడుకర్మలనూ చెయ్యనే చెయ్యరు. ఇంకొకరకం వారు ఆ కర్మల్లో ఎంతగా కూరుకుపోతారంటే, వాటినుంచి ఎన్నటికీ బయటకు రాలేరు.

తెలివైన వ్యక్తి ఏంచేస్తాడు? యజ్ఞదానతపస్సులను చేపట్టి, తను చిత్తశుద్ధి పొంది, వాటినుంచి బయటకు వస్తాడు. బయటకు వచ్చి ఏం చెయ్యాలి? వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనలు చెయ్యాలి.

అందువల్ల దైవకార్యాలు చెయ్యండి కాని వాటితో బంధం పెంచుకోకండి. వాటిని మార్గంగా చూడండి కాని లక్ష్యంగా చూడకండి. లక్ష్యం చేరాక మార్గాన్ని వదిలేస్తారు; అలాగే జ్ఞానయోగ్యతాప్రాప్తి అనే లక్ష్యం చేరాక, యజ్ఞదానతపస్సులనే మార్గాన్ని వదిలేయవచ్చు.

సంగం త్యక్త్వా అంటే బంధం పెంచుకోకుండా చెయ్యండి.

**ఫలాని చ** – కర్మఫలాలమీద సంగత్వం కూడా త్యజించండి.

ఈ మూడు కర్మలూ చేస్తే రెండురకాల పుణ్యం పొందవచ్చు. అవి ఆధ్యాత్మికపుణ్యం, లౌకికపుణ్యం.

**లౌకికపుణ్యం** – లౌకికపుణ్యం అంటే లౌకికవిజయాలను కలుగజేస్తుంది. లంకంత ఇల్లు, పడవంత కారు, ఇంటి నిండా నౌకర్లు, ఇంట్లో అన్ని సదుపాయాలు, అన్నీ కలుగుతాయి. ఎప్పుడు? యజ్ఞదానతపస్సులను చేస్తే.

**ఆధ్యాత్మికపుణ్యం** – ఆధ్యాత్మికపుణ్యం లౌకికఫలాలను ఇవ్వదు కాని ఆంతరమార్పు తీసుకువస్తుంది. పదమూడవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ వివరించిన అమానిత్వం, అదంభిత్వం, అహింస, శాంతి వంటి మంచివిలువలను పెంపొందించుకోవటానికి తోడ్పడుతుంది; లేదా పదహారవ అధ్యాయంలో చెప్పిన అభయం, సత్యం, అక్రోధం, త్యాగం వంటి దైవీసంపత్తిని పెంపొందించుకోవటానికి తోడ్పడుతుంది.

ఒక్కముక్కలో చెప్పాలంటే మీకు పుణ్యం రూపంలో సాధనచతుష్టయ సంపత్తిని కలుగజేస్తుంది. ఈ పుణ్యం ఇంకొక పుణ్యానికి దారితీస్తుంది. అంటే మీరు ఆత్మజ్ఞానాన్ని పొందటానికి అవసరమైన గురువును ఏర్పాటుచేస్తుంది.

మీకు పెద్దఇల్లును సమకూర్చే పుణ్యానికీ, గురువును సమకూర్చే పుణ్యానికీ మధ్య భేదం ఉంది. ఇల్లు కావాలన్నా, గురువు కావాలన్నా కూడా రెండింటికీ పుణ్యమే కావాలి. కాని ఆ పుణ్యాలయొక్క నాణ్యతలో ఉంది ఆ భేదమంతా. ఆధ్యాత్మికఫలంగా గురువు దొరికితే చాలదు; ఆ గురువు చేసే బోధకు క్రమం తప్పకుండా వెళ్ళగలగాలి. దానికి కూడా బోలెడు పుణ్యం కావాలి. క్రమం తప్పకుండా వెళ్ళాలంటే మీ ఆరోగ్యం సహకరించాలి; మీ కుటుంబసభ్యులు సహకరించాలి; వెళ్ళటానికి వీలు ఉండాలి; ఇలా అనేక కారణాలు జతపడతాయి. అన్ని ఆటంకాలు కలిగే అవకాశమున్నా కూడా, మీరు ఒక్కరోజు కూడా మానకుండా గురువు చేసే వేదాంతబోధకు వెళ్ళగలుగుతున్నారంటేనే మీరు చాలా పుణ్యం చేసుకున్నారన్నమాట.

అందువల్ల మీరు వేదాంతబోధను లేదా గీతాబోధను క్రమం తప్పకుండా వినగలుగుతున్నారంటే, ఈ వ్యవహారాన్ని ఆషామాషీగా తీసుకోకండి. మీరు అలా వినగలగటానికి ఎంతో పుణ్యం చేసుకున్నారు. అంటే మీరు ధన్యజీవులు. అంటే పుణ్యమనే మీ బ్యాంక్ఎకౌంటులో మీరు చాలా నిలువజేసుకున్నారన్నమాట. లేకపోతే ఇన్ని సంవత్సరాలుగా ఈ బోధను వినలేరు. ఏదో ఒక ఆటంకం ఏర్పడి, మీ సంకల్పానికి అడ్డుపడిపోతుంది.

అందువల్ల యజ్ఞదానతపస్సులనే కర్మలను చేసేటప్పుడు, ఎటువంటి పుణ్యం కావాలో ఎన్నుకోవటం మీ చేతిలో ఉంది. కారులు, బంగళాలలో ముంచెత్తే పుణ్యం కావాలో, వేదాంతశ్రవణం చేయించే గురువు దొరికే పుణ్యం కావాలో మీరే తేల్చుకోండి. ఏదో ఒకటి ఎన్నుకోండి. రెండూ ఎన్నుకోలేరు. అందువల్ల కృష్ణపరమాత్మే ఏది ఎన్నుకోవాలో సూచిస్తున్నాడు.

ఫలాని చ త్యక్త్వా – ఫలాని అంటే లౌకికపుణ్యం. లౌకికపుణ్యాన్ని త్యజించమంటున్నాడు కృష్ణపరమాత్మ. లౌకిక విజయాలు శాశ్వతం కాదు; అవి వస్తాయి, పోతాయి. వాటిని మళ్ళీ సంపాదించవచ్చు కాని ఈ యజ్ఞ దాన తపస్సులను ఆధ్యాత్మికపుణ్యం పొందటానికి చెయ్యండి.

**దుర్లభం త్రయమేవైతద్దేవానుగ్రహహేతుకమ్**

**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః** – వివేకచూడామణి 3

శంకరాచార్యులవారు వివేకచూడమణిలో, మనుష్యజన్మ పొందటం కష్టమనీ, మనుష్యజన్మ పొందినా ఆధ్యాత్మిక చింతన ఉండటం ఇంకా కష్టమనీ, ఆధ్యాత్మికచింతన ఉన్నా గురువు దొరికి, ఆత్మజ్ఞానం పొందటం మరీ కష్టమనీ అంటారు. దీన్నే పుణ్యపరంగా చూస్తే మనుష్యజన్మ పొందటానికే పుణ్యం చేసుకుని ఉండాలి; ఆధ్యాత్మిక చింతన కలగటానికి ఇంకా పుణ్యం చేసుకుని ఉండాలి; గురువుద్వారా శాస్త్ర అధ్యయనం చెయ్యగలగటానికి ఇంకా ఎంతో పుణ్యం చేసుకుని ఉండాలి. మీరు మహాపట్టణంలో ఉండిఉండవచ్చు, ఎక్కడికి వెళ్ళాలన్నా తేలిగ్గా వెళ్ళే సదుపాయం ఉండిఉండవచ్చు, గురువు–శాస్త్రం కూడా అందుబాటులో ఉండిఉండవచ్చు, కాని మీకు శాస్త్రాన్ని అధ్యయనం చేసే వీలు కుదరకపోవచ్చు. అందువల్ల యజ్ఞం, దానం, తపస్సులు చెయ్యాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఇతి నిశ్చితం మతమ్ ఉత్తమమ్** – ఇది నా నిశ్చితమైన అభిప్రాయము అంటున్నాడు కృష్ణపరమాత్మ. అభిప్రాయము అనేసరికి దాన్ని తేలికగా తీసుకోకూడదు. కృష్ణపరమాత్మ చెప్పేది శాస్త్రాన్ని ఆధారం చేసుకుని చెబుతాడు. అందుకని దీన్ని నిశ్చయంగా పాటించాలనీ, ఇది కృష్ణపరమాత్మ చేసిన శాసనమనీ తీసుకోవాలి. ఏమిటా శాసనం?

యజ్ఞం, దానం, తపస్సులను చేసితీరాలి; అదికూడా లౌకిక విజయాలకోసం కాదు, ఆధ్యాత్మిక ఉన్నతికోసం చేసితీరాలి. మంచి గంధంచెక్కను అరగదీసి, మొహంమీద చందనం పెట్టుకోవచ్చు, కాని దాని విలువ తెలియని అజ్ఞానులు వంటచెక్క కింద ఉపయోగిస్తారు. అలాగే యజ్ఞం, దానం, తపస్సుల విలువ తెలియనివారు చిన్నచిన్న కోరికలు కోరటానికి వాడతారు; దాని విలువ తెలిసినవారు చిత్తశుద్ధి పొందటానికి చేస్తారు.

(**గమనిక –** ముఖ్యమైన అంశాలకు ప్రత్యేకంగా విశ్లేషణ ఇవ్వటమైనది.)

**మూడు రకాల సన్న్యాసం – శ్లోకాలు: 7–9 – విశ్లేషణ**

ముందుముందు రాబోయే శ్లోకాల్లో కృష్ణపరమాత్మ మూడురకాల సన్న్యాసాల గురించి వివరిస్తాడు. కాని వాటిని చెప్పేముందు సందర్భం ఏమిటో కూడా స్పష్టం చెయ్యదలుచుకున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే శాస్త్రం ఏదైనా సలహా ఇచ్చేముందు, అది వినే శ్రోతలు ఎవరో కూడా దృష్టిలో పెట్టుకుంటుంది. అంటే శ్రోతలయొక్క మానసిక పరిపక్వతనుబట్టి సలహా ఇస్తుంది. అది అర్థం చేసుకోలేనివారు మన శాస్త్రం పరస్పర భిన్న విషయాలను బోధిస్తోంది అని నింద వేసేస్తారు.

ఉదాహరణకు శాస్త్రం ఒకచోట సాధకుణ్ణి కర్మలు చెయ్యమంటుంది, ఇంకోచోట అదే శాస్త్రం కర్మలను త్యజించమంటుంది. అలాగే ఒకచోట పెళ్ళి చేసుకోమంటుంది, ఇంకోచోట సన్న్యాసం స్వీకరించమంటుంది. ఒకచోట పూజలు, ఉపాసనలు చేసితీరాలంటుంది, ఇంకోచోట (మాండూక్యం) అలా పూజలు, ఉపాసనలు చేసేవారు కృపణులు అంటుంది. కృపణులు అంటే దురదృష్టవంతులు అంటుంది. అలా చూస్తూపోతే శాస్త్రం నిండా ఇలాంటి పరస్పర విరుద్ధ అభిప్రాయాలు ఉన్నాయి అనే అపోహపడే అవకాశం ఉంది. శాస్త్రం ఎందుకు అలా బోధిస్తున్నది?

శాస్త్రం సాధకులను రెండురకాలుగా విభజిస్తుంది. ఒకతెగకు చెందినవారు చిత్తశుద్ధి పొందినవారు. దీనినే జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందటం అనీ లేదా సాధనచతుష్టయ సంపత్తిని పొందటం అనీ అంటారు. ఇంకా

తేలికగా చెప్పాలంటే, సంసిద్ధత చెందిన సాధకులు. రెండవతెగకు చెందినవారు సంసిద్ధత చెందని సాధకులు. ఇద్దరికీ ఒకటే సలహా కుదరదు.

ఇప్పుడు సన్న్యాసం గురించి నిర్వచించబోయేముందు ఈ రెండుతెగల్లో ఎవరికి చెప్పబోతున్నాడో కృష్ణపరమాత్మ బేరీజు వేసుకున్నాడు. సంసిద్ధత చెందిన సాధకునికి చెప్పే పరిస్థితిలో కృష్ణపరమాత్మ ఇచ్చే నిర్వచనం వేరేగా ఉండేది. కాని ఇప్పుడు కృష్ణపరమాత్మ బోధ చెయ్యబోయేది సంసిద్ధత చెందని మనస్సు ఉన్నవారికి. అర్జునుడు కూడా సంసిద్ధత చెందని మనస్సు ఉన్నవారితెగలోకే వస్తాడు. ఈ తెగవారిలో రాగద్వేషాలు, కామక్రోధాలు, లోభమోహాలు మనస్సు నిండా పేరుకొని ఉంటాయి.

అందువల్ల సంసిద్ధతలేని మనుష్యులు సన్న్యాసజీవనం గురించి ఆలోచించకూడదు. ఒంటరిగా, సమాజం నుంచి దూరంగా వీరు బ్రతకలేరు. వీరు సమాజంలో ఉండాలి; కర్మల్లో మునిగితేలాలి. కాకపోతే ఒక విషయం మర్చిపోకూడదు. వారు ఎన్నుకునే కర్మ వారిలో ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడేదిగా ఉండాలి. పదిహేడవ అధ్యాయంలో మూడురకాల కర్మలను చూశాము. అవి సాత్త్విక, రాజసిక, తామసిక కర్మలు.

**పర ఉపకార కర్మల**ను సాత్త్విక కర్మలు అంటారు. ఇవి ఇతరులకు మేలుచేసే కర్మలు; సాధకుడు ఆధ్యాత్మిక ఫలం పొందేలా చేస్తాయి. లౌకికవిజయం వస్తే రావచ్చు కాని, ఆధ్యాత్మిక ఉన్నతి అయితే తప్పకుండా వస్తుంది.

**పర ఉదాసీన కర్మల**ను రాజసిక కర్మలు అంటారు. పరులకు మేలు చెయ్యాలనే సంకల్పమే ఉండదు వీరికి. అసలు సమాజం ఒకటి ఉందనే స్పృహే ఉండదు వీరికి. ఉదాసీనం అంటే పట్టించుకోకపోవటం. వీరు సమాజానికి మేలూ చెయ్యరు; కీడూ చెయ్యరు. సమాజానికి మేలు చెయ్యరు కాబట్టి వీరికి ఆధ్యాత్మిక ఉన్నతి ఉండదు; కీడు చెయ్యరు కాబట్టి ఆధ్యాత్మిక పతనమూ ఉండదు. ఎక్కడ ఉన్నవారు అక్కడే ఉండిపోతారు. త్రిశంకుస్వర్గంలో ఉన్నట్టు ఉంటుంది వీరి పరిస్థితి. అంటే పైకీ ఎదగరు; కిందకీ జారరు.

**పర అపకార కర్మల**ను తామసిక కర్మలు అంటారు. వీరు పరులకు అపకారం చేస్తారు కాబట్టి అవి చాలా నికృష్టకర్మలు. అంతేకాక హానిచేస్తారు కాబట్టి వీరు ఆధ్యాత్మిక పతనం పొందుతారు.

మూడింటినీ ఒకసారి బేరీజు వేస్తే, సాత్త్వికకర్మలు ఆధ్యాత్మిక ఉన్నతిని కలుగజేస్తే; రాజసికకర్మలు ఉన్నచోటే ఉంచితే; తామసికకర్మలు కిందికి లాగుతాయి.

ఆధ్యాత్మిక సాధకుడు సాత్త్విక కర్మలను పెంచుకోవాలి, రాజసిక కర్మలను తగ్గించుకోవాలి, తామసిక కర్మలను పూర్తిగా వదిలివేయాలి. దీన్నే నిష్పత్తిలో చూస్తే ఒకవ్యక్తి *60%* సాత్త్విక కర్మలు చేసి, *35%* రాజసిక కర్మలు చేసి, *5%* తామసిక కర్మలు చేస్తే అతను త్వరగా ఉన్నతి పొందుతాడు. ఈ ఐదుశాతాన్ని కూడా సున్నా చెయ్యాలి. ఇలా మార్చుకుంటూపోతే అతను కేవలకర్మను కర్మయోగంగా మలుచుకోగలుగుతాడు. అందువల్ల కృష్ణపరమాత్మ సంసిద్ధతలేని సాధకుడు సాత్త్వికకర్మల యొక్క విశిష్ఠత తెలుసుకుని, వాటిని చెయ్యాలని బోధిస్తున్నాడు. ఆ సాత్త్విక కర్మలను యజ్ఞం, దానం, తపస్సుగా వివరిస్తున్నాడు.

ఒకవేళ సంసిద్ధమైన మనస్సులేని సాధకుడు కర్మను వదిలివేసాడనుకుందాము. ఏ కర్మను? రాజసిక, తామసిక కర్మలను వదిలితే ఏ సమస్యా లేదు. సాత్త్విక కర్మను వదిలేసి, సన్న్యాసం స్వీకరిస్తే ఏమవుతుంది? అతను బాహ్యంగా కుటుంబాన్ని, ఇంటిని, సమాజాన్ని వదిలివేశాడు కాని అతని మనస్సు వారినుంచి రాలేదు. అంటే అతని మనస్సు సిద్ధంగా లేదు. అలాంటి పరిస్థితిలో అతను వేదాంతబోధను అర్థం చేసుకోలేడు. అతనికి జ్ఞానయోగ్యతను కలుగజేసే కర్మయోగాన్ని వదిలివేశాడు.

ఇలా సంసిద్ధత లేకుండా కర్మలను వదిలివేయటానికి రెండు కారణాలు చెప్పవచ్చు. ఒకటి అజ్ఞానం, రెండు శరీర అభిమానం. వాటిని తామసిక సన్న్యాసం, రాజసిక సన్న్యాసం అని కూడా అనవచ్చు.

**తామసిక సన్న్యాసం** – తామసిక ప్రవృత్తి అజ్ఞానానికి చిహ్నం. సాత్త్విక కర్మ అయిన నిత్యపూజ, సంధ్యావందనం, జపం, దానం, ప్రజాసేవ, ఇవన్నీ ఎంత ముఖ్యమో అతనికి తెలియదు. ఎందుకు? సాత్త్విక కర్మలు చేస్తే వచ్చే ఫలం కంటికి కనబడదు. లౌకికఫలాలు అయితే ధనం, పేరుప్రతిష్ఠల రూపంలో తెలుస్తాయి. కాని ఆధ్యాత్మిక ఫలం చిత్తశుద్ధి. అది తెలియదు. అది తెలియని అజ్ఞానంతో వీరు సన్న్యాసం స్వీకరిస్తారు; అర్హత ఉందో లేదో చూసుకోరు.

అటువంటివారితో చాలా ప్రమాదం. ఎందుకు? వారిని వారు బాధపెట్టుకుంటారు; సన్న్యాసాశ్రమానికే కళంకం తెస్తారు. సంసిద్ధుడు కానివ్యక్తి అజ్ఞానంవల్ల సాత్త్విక కర్మలను వదిలివేస్తే, దాన్ని తామసిక సన్న్యాసం అంటారు. ఇటువంటివారు సమస్యలనుంచి పారిపోవటానికి సన్న్యాసం స్వీకరిస్తారు. అప్పుడు సన్న్యాసజీవనం భారం అవుతుంది. అందువల్ల సన్న్యాసం స్వీకరించాలని ఉంటే, ఒక మహాత్ముని వద్ద కొంతకాలం శుశ్రూషలు చేస్తే, గురువు అతణ్ణి పరీక్షించి, అతనికి సన్న్యాసం స్వీకరించే చిత్తశుద్ధి ఉందో లేదో గమనించి, అప్పుడు నిశ్చయిస్తాడు. గురువు నిర్ణయించినప్పుడు శిష్యుడు స్వీకరించాలి. ఇంకా అతను సిద్ధంగా లేకపోతే ఏంచేస్తాడు? ముందు ఈ గురువును మార్చాలి అనుకుంటాడు.

సంసిద్ధుడు కాని వ్యక్తి అజ్ఞానంవల్ల సాత్త్విక కర్మలను త్యజించటం **తామసిక సన్న్యాసం**.

**రాజసిక సన్న్యాసం** – ఈ తెగకు చెందినవ్యక్తి కూడా ఇంకా సిద్ధం కాలేదు. అతనికి సాత్త్వికకర్మలు కావాలి. కాని ఇతను కూడా వాటిని త్యజిస్తాడు. ఎందుకు? ఇక్కడ కారణం అజ్ఞానం కాదు. అతనికి సాత్త్వికకర్మల విలువ తెలుసు; భగవద్గీత బోధ కూడా విన్నాడు; సాత్త్వికకర్మలు చాలా ముఖ్యమనీ, అవి చిత్తశుద్ధిని కలుగజేస్తాయని, కనబడ్డవారందరికీ ఉపన్యాసాలు దంచుతాడు. కాని తను మాత్రం వాటిని చెయ్యడు.

కొంతమందికి వ్యాయామంయొక్క విలువ తెలుసు. అంటే వ్యాయామం గురించిన అజ్ఞానం లేదు వారికి. కాని వ్యాయామం చెయ్యరు. ఎందుకు? వారికి దేహాభిమానం ఉంటుంది, ఆ అభిమానం ఎలా ఉంటుందంటే, దాన్ని ఆరోగ్యకరంగా ఉంచుకోవాలనే అభిమానం కాదు; వారు శరీరాన్ని బాధపెట్టలేరు. వారికి జీవితం సుఖంగా సాగాలి. మార్నింగ్‌వాక్ ఆరోగ్యానికి మంచిదని వారికీ తెలుసు. వాకింగ్ చేస్తే బరువు తగ్గుతారు, కొలెస్ట్రాల్ తగ్గుతుందివంటి ఆరోగ్యసూత్రాలు వారికి బాగానే తెలుసు. కాని దానికోసం పొద్దున్నే అలారం

పెట్టుకుని లేవాలి; శరీరాన్ని బాధించాలి అని బాధపడతారు. చివరికి నమస్కారం చెయ్యటానికి కూడా వారికి ఒళ్ళు వంగదు. మామూలు నమస్కారం పెడతారు అంతే.

అందువల్ల వీరి సమస్య అజ్ఞానం కాదు. కావాల్సినంత జ్ఞానం ఉంది; కాకపోతే శరీరంమీద రాగం దాన్ని మించి ఉంది. దీన్ని దేహాభిమానం అంటారు. అందువల్ల పూజలు చెయ్యరు. ఎందుకంటే మన సాంప్రదాయంలో పూజలు, యజ్ఞాలు చాలామటుకు కాయికంగా ఉంటాయి. ఒకటికి నాలుగుసార్లు లేచినిల్చోవాలి, ప్రదక్షిణలు చెయ్యాలి, సాష్టాంగనమస్కారం చెయ్యాలి. ఇవన్నీ శాస్త్రం పెట్టిందే దేహాభిమానత్యాగం చెయ్యటానికి. కాని దేహాభిమానం ఉన్నచోట ఇవి చేసే ప్రసక్తే లేదు. ఇంక త్యాగం ఎక్కడ?

ఇతనికి ప్రతికర్మ కూడా దుఃఖహేతువు. శబరిమలై వెళ్ళరాదా అంటే, 'ఎందుకు, ఊళ్ళో ఉన్న అయ్యప్ప గుడికి వెళ్ళివస్తాను,' అంటాడు. తిరువన్నామలై గిరిప్రదక్షిణం చెయ్యమంటే మనస్సులో చేస్తాను అంటాడు. అలా ప్రతిఒక్క కాయికపూజకు, దాన్ని తప్పించుకోవటానికి అతని దగ్గర జవాబు సిద్ధంగా ఉంటుంది.

ఇటువంటి వ్యక్తి సన్న్యాసం స్వీకరించినా లాభంలేదు. ఎందుకంటే ఇతని మనస్సు సిద్ధంగా లేదు; అంటే చిత్తశుద్ధి ఏర్పడలేదు. అందువల్ల ఇతనికి త్యాగఫలం కలగదు.

సంసిద్ధుడు కానివ్యక్తి దేహాభిమానంవల్ల సాత్త్వికకర్మలను త్యజించటం **రాజసిక సన్న్యాసం**.

**సాత్త్విక సన్న్యాసం** – సాత్త్విక పురుషునికి తను ఇంకా సంసిద్ధంగా లేడని తెలుసు. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే, శాస్త్రం భిన్న స్థాయిల్లో ఉన్న సాధకులకు భిన్న స్థాయిల్లో సాధనలు చెబుతుంది. వాటిలో ఏది సాధన చెయ్యాలి? అది తెలుసుకోవాలంటే అతను ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసుకోవాలి. అది ఎవరికి వారే గమనించుకోవాలి.

సాత్త్వికప్రవృత్తి ఉన్నవ్యక్తికి తనకి కావాల్సిందేమిటో తెలుసు; దానికి తనేం చెయ్యాలో కూడా తెలుసు. అతనికి మోక్షం కావాలి; మోక్షం కావాలంటే జ్ఞానం పొందాలి; జ్ఞానం పొందాలంటే చిత్తశుద్ధి ఉండాలి; చిత్తశుద్ధి ఉండాలంటే సాత్త్వికకర్మలు చెయ్యాలి. అంటే మోక్షం పొందాలంటే తను సాత్త్విక కర్మలు చేసితీరాలనే స్పష్టమైన జ్ఞానం ఉంది. అందువల్ల తామసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తికి ఉన్న అజ్ఞానం ఇతనికి లేదు.

రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తికి ఉండే దేహాభిమానం కూడా ఇతనికి లేదు. ఎందుకంటే సాత్త్వికకర్మలు చెయ్యాలంటే శారీరకశ్రమ తప్పదని కూడా అతనికి తెలుసు. కాని అతను అసలు దానిని శ్రమ అనుకోడు; అది అవసరం అనుకుంటాడు. అంత శ్రమ వెనుక దాగివున్న విజయాన్ని చూస్తాడు; అప్పుడది బాధగా అనిపించదు. క్షణంపాటు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనం కలగటంకోసం గంటల తరబడి క్యూలో ఎందుకు నిలుచుంటారు మనుష్యులు? అది ఒక్కోసారి ఒక రోజంతా కూడా పట్టవచ్చు. అయినా శ్రమ అనుకోకుండా నిలుచుంటారు. ఎందుకు? దాని తర్వాత వచ్చే అద్భుతమైన దర్శనం కోసం. భగవంతుని నిలువెత్తు రూపాన్ని చూస్తే, ఇంతవరకూ పడ్డ శ్రమంతా దూదిపింజంలా తేలిపోతుంది.

ఏదైనా పనిని ఎందుకు చేస్తున్నాడో గుర్తించకపోతే, ఆ పని చాలా కష్టమైనదిగా తోస్తుంది. ఏ లక్ష్యంకోసం చేస్తున్నాడో, అది మర్చిపోతే మార్గం చాలా కష్టంగా అనిపిస్తుంది. కాని లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే, మార్గం చాలా తేలిక అనిపిస్తుంది. అందువల్ల అతను కర్మలను చేస్తాడు; పంచమహాయజ్ఞాలను చేస్తాడు; నియత కర్మలను చేస్తాడు.

అతను కర్మలను చేసేటట్టయితే అది సాత్త్విక సన్న్యాసం ఎలా అవుతుంది? సాత్త్విక సన్న్యాసంలో కర్మలను త్యజించనవసరం లేదు. అతను కర్మలను త్యజించకపోతే అది సన్న్యాసం ఎలా అవుతుంది? వేరే ఏదో త్యజిస్తాడు. ఏమిటది?

**సంగం త్యక్త్వా** – ఈ కర్మలతో బంధాన్ని త్యజిస్తాడు. సంగం అంటే బంధం. ఇవి సాత్త్విక కర్మలే అయినా వీటితో కూడా అనుబంధం పెంచుకోకూడదు. ఎందుకంటే సాత్త్విక కర్మలు కూడా చిత్తశుద్ధి పొందేవరకే అవసరం.

సాత్త్విక కర్మలు చిత్తశుద్ధిని కలుగజేస్తాయి కాని జ్ఞానాన్ని కలుగజేయవు. ఈ ప్రాథమిక సూత్రాన్ని మర్చిపోకూడదు. చిత్తశుద్ధి కలిగేదాకానే సాత్త్విక కర్మలు అవసరం. ఒకసారి చిత్తశుద్ధి కలిగాక, సాత్త్విక కర్మలను కూడా త్యజించటానికి సిద్ధపడాలి.

సర్వధర్మాన్ అపి పరిత్యజ్య అని కృష్ణపరమాత్మే తర్వాత చెబుతాడు. అందువల్ల దేనితోనూ బంధం పెట్టుకోకూడదు. అంటే సాత్త్విక కర్మలను లక్ష్యంగా చూడకూడదు, వాటిని చిత్తశుద్ధి అనే లక్ష్యాన్ని ఇచ్చే మార్గంగా మాత్రమే చూడాలి.

సాత్త్విక కర్మలవల్ల కలిగే ఫలమేమిటి? ఈ కర్మలకు రెండురకాల ఫలాలు వస్తాయి. వాటిని ముఖ్యఫలం, అవాంతరఫలం అంటారు. ముఖ్యఫలం చిత్తశుద్ధి కలుగుతుంది; అంటే ఆంతర ఎదుగుదల కలుగుతుంది. దీనివల్ల కలిగే అవాంతరఫలం సంఘంలో మంచి పేరుప్రఖ్యాతులు కలుగుతాయి. అతను అన్నీ మంచిపనులే చేస్తాడు కాబట్టి అతన్ని పరోపకారి పాపన్న అని అందరూ కీర్తిస్తారు. లేకపోతే ఏ పద్మశ్రీ బిరుదో వచ్చినా వస్తుంది.

కాని సాత్త్విక కర్మలు చేసే వ్యక్తి ఈ అవాంతరఫలం మోజులో పడిపోకూడదు. అవాంతరఫలాన్ని ఆశిస్తే అది ఆవాంతరఫలం అవదు; ముఖ్యఫలం అవుతుంది. అవాంతరఫలం అంటేనే ఆశించకుండా వచ్చేది అని అర్థం. దానికోసం ఆశించకుండా అతని పాటున అతను పనిచేసుకుపోవాలి. అంటే ఫలాన్ని త్యజించాలి.

ఉన్నత కార్యాలను చేస్తే ఆ చేస్తున్న కర్మే మీకు ఆనందాన్ని కలుగజేస్తుంది. ఒక మంచి టీచరు, తను చేసే బోధను తనే ఆనందిస్తాడు; విద్యార్థికి అర్థమయితే, అది విద్యార్థి చేసుకున్న పుణ్యం. కాని ఏ కారణంవల్లనైనా అతనికి అర్థంకాకపోతే, టీచరుకి ఏమీ నష్టంలేదు. ఎందుకంటే, అతను తను చేసే బోధలోనే రమిస్తాడు. అంటే కర్తగానే ఆనందిస్తాడు; ఎప్పుడో వచ్చే భోక్త గురించి ఆలోచించడు.

కేవలకర్మకూ, కర్మయోగానికీ మధ్య చిన్నభేదం ఉంది. ఎప్పుడో భవిష్యత్తులో భోక్తగా కర్మఫలాన్ని అనుభవిస్తాను అనుకుని కర్మ చేస్తే అది కేవలకర్మ అవుతుంది. కాని ఇప్పుడు చేస్తున్న కర్మలోనే ఆనందాన్ని పొందితే అది కర్మయోగం అవుతుంది. కర్మయోగంలో ఫలం వెంటనే దక్కుతుంది. కాని కేవలకర్మలో ఫలం భవిష్యత్తులో వస్తుంది. ఆశించిన ఫలం వస్తుందో రాదో కూడా చెప్పలేము.

సంసిద్ధమైన మనస్సుతో, కర్మఫలాన్ని ఆశించకుండా, కర్మలు చెయ్యటం **సాత్త్విక సన్న్యాసం.**

దీనితో మూడురకాల సన్న్యాసం గురించిన విశ్లేషణ అయిపోయింది.

శ్లో. 7 **నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।**
**మోహాత్తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః ॥**

నియతస్య, తు, సన్న్యాసః, కర్మణః, న, ఉపపద్యతే,
మోహాత్, తస్య, పరిత్యాగః, తామసః, పరికీర్తితః ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | మోహాత్ | = (కాబట్టి) మోహవశమున |
| నియతస్య | = శాస్త్రవిహితమైన | తస్య, పరిత్యాగః | = దానిని పరిత్యజించుట |
| కర్మణః, సన్న్యాసః | = కర్మాచరణమును త్యజించుట | తామసః, పరికీర్తితః | = 'తామస త్యాగము' అని చెప్పబడును |
| న, ఉపపద్యతే | = ఉచితము కాదు | | |

**నియతస్య కర్మణః తు సంన్యాసః న ఉపపద్యతే**
**మోహాత్ తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః ॥**

తా: కాని శాస్త్రవిహితమైన కర్మాచరణమును త్యజించుట ఉచితము కాదు. కాబట్టి మోహవశమున దానిని పరిత్యజించుట 'తామస త్యాగము' అని చెప్పబడును.

మూడురకాల సన్న్యాసం గురించి విశ్లేషణ చూశాము ఇప్పటివరకూ. ఈ నేపథ్యంతో 7, 8, 9 శ్లోకాలను చూద్దాము. ఇదే వరుసక్రమంలో ఇవి ఒక్కొక్క సన్న్యాసం గురించి చెబుతాయి. ఈ మూడురకాల సన్న్యాసం గురించి చెప్పేది, జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందనివ్యక్తి గురించి అని మర్చిపోకూడదు. అంటే అతని మనస్సు సన్న్యాసం స్వీకరించటానికి సిద్ధంగా లేదు. మనస్సు సిద్ధంగా లేనివారు సన్న్యాసం స్వీకరిస్తే ఎలా ఉంటుందో, దాన్ని తామసిక, రాజసిక, సాత్త్విక సన్న్యాసాల కింద చెప్పుకువచ్చాడు.

అంతకుముందు అంటే పదిహేడవ అధ్యాయంలో మూడురకాల కర్మలను చెప్పినప్పుడు వేరే వరుసక్రమంలో చెప్పాడు. అది సాత్త్విక కర్మలు, రాజసిక కర్మలు, తామసిక కర్మలు. ఇప్పుడు ఈ వరుసక్రమాన్ని తారుమారు చేస్తున్నాడు. అంటే చివరినుంచి మొదలుపెట్టి, మొదటికి వస్తున్నాడు. తామసిక సన్న్యాసం, రాజసిక సన్న్యాసం, సాత్త్విక సన్న్యాసం వరుసలో చెప్పుకువస్తున్నాడు.

మనం ముందుకు వెళ్ళేముందు, ఇంకొక విషయం కూడా గుర్తుపెట్టుకోవాలి. కృష్ణపరమాత్మ సన్న్యాసానికీ, త్యాగానికీ మధ్య ఏమీ భేదాన్ని చూపించటంలేదు. అందువల్ల సన్న్యాసం పదం తీసి త్యాగం పదం వేసుకుంటే అవి వరుసగా తామసికత్యాగం, రాజసికత్యాగం, సాత్త్వికత్యాగం అవుతాయి. ఇప్పుడు ఈ ఏడవశ్లోకంలో తామసిక సన్న్యాసం గురించీ, ఎనిమిదవ శ్లోకంలో రాజసిక సన్న్యాసం గురించీ, తొమ్మిదవ శ్లోకంలో సాత్త్విక సన్న్యాసం గురించీ చూస్తాము.

**తామసిక సన్న్యాసం** – ఈ మూడు ప్రాథమిక కర్మలనూ మానవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**కర్మణః సన్న్యాసః న ఉపపద్యతే** – ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ముఖ్యమైన కర్మలను ఎన్నడూ త్యజించవద్దు. ఏమిటవి? ఏమిటా మూడు? యజ్ఞము, దానము, తపస్సు. యజ్ఞం అన్నప్పుడల్లా మూడవ అధ్యాయంలో నేర్చుకున్న పంచమహాయజ్ఞాలు గుర్తు తెచ్చుకోవాలి. అవి దైవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం.

**నియతస్య** – ఈ మూడు కర్మలనూ నియత కర్మలు అంటున్నాడు కృష్ణపరమాత్మ. నియత అంటే చేసితీరాల్సిన కర్మలు. ఈ రోజుల్లో శారీరక ఆరోగ్యంకోసం ప్రతిఒక్కరూ వ్యాయామం చేసితీరాలి లేదా మార్నింగ్‌వాక్ చేసితీరాలి. పొద్దున్నే ఏ ఛానెల్‌ను చూసినా వీటి గురించి హెూరెత్తించేస్తారు. వాటిని మీరు కదలకుండా కూర్చుని చూస్తే ఏమీ ఫలం దక్కదు. వాటిని చేసితీరాలి. అలాగే ఆధ్యాత్మిక ఆరోగ్యం కావాలంటే ఈ మూడూ చేసితీరాలి.

నేను వ్యాయామం లేదా వాకింగ్ చెయ్యకపోతే ఏమవుతుంది? మీరు గనుక ఈ ప్రశ్న అడిగితే, నష్టపోయేది ఎవరు? మీరే! వ్యాయామం చెయ్యమని ఆదేశించే డాక్టరు నష్టపోడు; వాటిగురించి హెూరెత్తించే టీవీ నష్టపోదు; వాటి గురించి రోజూ రాసే వార్తాపత్రికలు నష్టపోవు; వాటిని చెయ్యకపోతే మీ ఆరోగ్యం దెబ్బతింటుంది, బరువు పెరుగుతారు. అలా నష్టపోయేది మీరే.

ఇదే సూత్రం యజ్ఞదానతపస్సులకు కూడా వర్తిస్తుంది. ఈ మూడు నియతకర్మలను మీరు చెయ్యకపోతే, కృష్ణపరమాత్మ నష్టపోడు; వేదం నష్టపోదు; గీత నష్టపోదు; అది బోధించే గురువు నష్టపోరు; మీరే నష్టపోతారు. మీరే చిత్తశుద్ధిని పొందలేరు. అందువల్ల నియతకర్మలను చెయ్యమని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఈ కర్మలను సన్న్యసించటం మంచిది కాదు.

ఈ కర్మలను చెయ్యకపోవటానికి కారణాలు ఏవైనా కావచ్చు. వ్యాయామం చెయ్యమంటే కొందరు చెప్పిన కారణం చెప్పకుండా తప్పించుకుంటారు. ఒక పక్కనేమో స్వీట్లు దట్టిస్తారు; ఇంకొకపక్క వ్యాయామం చెయ్యనని భీష్మించుకు కూర్చుంటారు. బరువు పెరగక ఏమవుతుంది? బరువు పెరగటమొక్కటే కాదు సమస్య, దానివల్ల లేనిపోని రోగాలు వస్తాయి.

ఇలా చెయ్యాల్సిన పనిని చెయ్యకపోవటానికి ఒక కారణాన్ని ఇందులో సూచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అది అజ్ఞానం. కొంతమంది వ్యాయామం ఎందుకు చెయ్యరంటే వ్యాయామంయొక్క విలువ తెలియక. చదువుకోని వారికి దీని విలువ తెలియదు. అందువల్ల వారికి అవగాహన కలుగజేయాలి. కండరాలను అసలు కదపకపోతే కలిగే నష్టమేమిటో తెలియజేయాలి.

ఇక్కడ సాత్త్విక కర్మలను చెయ్యకపోవటానికి కూడా కారణం అజ్ఞానమే. వాటి విలువ తెలియని అజ్ఞానం.

**మోహాత్తస్య పరిత్యాగః** – కొంతమంది ఈ సాత్త్విక కర్మలను మోహంవల్ల పరిత్యజిస్తారు. మోహం అంటే అజ్ఞానం. ఆ కర్మల విలువ తెలియని అజ్ఞానం. ఈ అజ్ఞానం దేనివల్ల కలిగింది? తమోగుణంవల్ల.

**తామసః పరికీర్తితః** – ఈ కర్మలను పరిత్యజించటాన్ని తామస సన్న్యాసం అంటారు. వాటి ప్రయోజనం తెలియదు వారికి. తామసిక కర్మలు లేదా రాజసిక కర్మలను త్యజిస్తే మంచిదే. కాని సాత్త్విక కర్మలను త్యజించకూడదు.

కేవలం అజ్ఞానంవల్ల నియతకర్మలను త్యజిస్తే అది తామసిక సన్న్యాసం అవుతుంది.

ఇటువంటి వ్యక్తి ఒకవేళ సన్న్యాసం స్వీకరిస్తే అతను వేదాంతబోధను అర్థం చేసుకోలేడు. అతనికి చిత్తశుద్ధిని కలుగజేసే కర్మయోగాన్ని వెనక వదిలేసి వచ్చాడు. అప్పుడు అతని పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

శ్లో. 8 **దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్ త్యజేత్ ।**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥**
దుఃఖమ్, ఇతి, ఏవ, యత్, కర్మ, కాయక్లేశభయాత్, త్యజేత్,
సః, కృత్వా, రాజసమ్, త్యాగమ్, న, ఏవ, త్యాగఫలమ్, లభేత్ ॥

| | | | |
|---|---|---|---|
| (యః) | = (ఎవడు) | సః | = అతడు |
| యత్, కర్మ | = ఏ విద్యుక్తకర్మాచరణమును | రాజసమ్, త్యాగమ్ | = 'రాజసత్యాగము' ను |
| దుఃఖమ్, ఏవ, ఇతి | = దుఃఖకారకమేయని తలంచి | కృత్వా | = చేసి |
| కాయక్లేశభయాత్ | = శారీరక బాధలకు భయపడి | త్యాగఫలమ్ | = త్యాగఫలమును |
| త్యజేత్ | = త్యజించునో | న, ఏవ, లభేత్ | = ఏ విధముగను పొందడు |

**(యః) దుఃఖమ్ ఇతి (మత్వా) ఏవ యత్ కర్మ కాయ-క్లేశ-భయాత్**
**త్యజేత్, సః రాజసమ్ త్యాగమ్ కృత్వా త్యాగ-ఫలమ్ న ఏవ లభేత్ ॥**

తా: ఎవడు ఏ విద్యుక్తకర్మాచరణమును దుఃఖకారకమేయని తలంచి శారీరక బాధలకు భయపడి త్యజించునో అతడు 'రాజసత్యాగము' ను చేసి త్యాగఫలమును ఏ విధముగను పొందడు.

**రాజసిక సన్న్యాసం** – రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి కూడా చిత్తశుద్ధిలేని వ్యక్తి కిందకే వస్తాడు. కాని ఇతను కూడా సాత్త్వికకర్మను త్యజిస్తాడు. కాకపోతే ఇతని కారణం వేరు. తామసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తిది అజ్ఞానం అయితే, రాజసిక సన్న్యాసం ఉన్నవ్యక్తిది దేహాభిమానం లేదా శరీరంమీద రాగం.

**కాయక్లేశభయాత్ త్యజేత్** – శరీరంమీద ఉన్న ఆపేక్షకొద్దీ, శరీరం అవస్థ పడుతుందనే భయంకొద్దీ కర్మలను త్యజిస్తాడు ఇతను అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాయ అంటే శరీరం; క్లేశ అంటే అవస్థ; కాయక్లేశభయాత్ అంటే శరీరం ఎక్కడ అవస్థ పడుతుందోననే భయంవల్ల త్యజేత్ అంటే కర్మలను త్యజిస్తాడు. కర్మ గురించి అతని అభిప్రాయం ఏమిటి?

**దుఃఖమ్ ఇత్యేవ** – ప్రతి కర్మ కూడా దుఃఖాన్నే కలుగజేస్తుంది అనుకుంటాడు. ఎంత చిన్న కర్మ చెయ్యమన్నాసరే అతను ఏవో కుంటిసాకులు వెతుక్కుంటాడు. అది దుఃఖం అనుకుంటాడు కాబట్టి దాన్ని తప్పించుకోవటానికి కుంటిసాకులను వెతుక్కుంటాడు.

**స కృత్వా రాజసం త్యాగమ్** – దేహాభిమానంవల్ల, నియతకర్మలను త్యజిస్తే అది రాజసిక సన్న్యాసం అవుతుంది.

అటువంటి రాజసిక సన్న్యాసం తీసుకుంటే, అతనేమీ ఫలాన్ని పొందడని కృష్ణపరమాత్మ హెచ్చరిస్తున్నాడు. అతను ఆశ్రమానికి వెళ్ళినా కూడా, అతని మనస్సు సంసిద్ధంగా లేదు కాబట్టి, అతను జ్ఞానాన్ని పొందలేడు. **త్యాగఫలం నైవ లభేత్** – అతను సాత్త్వికకర్మలను త్యజించి, సన్న్యాసం స్వీకరిస్తే, దానివల్ల కలిగే ఫలాన్ని పొందలేడు. ఎందుకంటే అతనికి ఇంకా చిత్తశుద్ధి కలుగలేదు.

ఈ విధంగా చిత్తశుద్ధి పొందకుండా, సన్న్యాసం స్వీకరించవద్దని కృష్ణపరమాత్మ గట్టిగా హెచ్చరిస్తున్నాడు. తామసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తికి సాత్త్విక కర్మల గురించిన జ్ఞానం లేక వాటిని త్యజిస్తాడు; రాజసిక ప్రవృతి ఉన్న వ్యక్తి సాత్త్విక కర్మల గురించి పూర్తిగా తెలిసినా దేహాభిమానంవల్ల త్యజిస్తాడు. ఇద్దరిదీ తప్పే. ఎందుకంటే వారు ఇంకా సంసిద్ధతను పొందలేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 9 **కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।**
**సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః ॥**

కార్యమ్, ఇతి, ఏవ, యత్, కర్మ, నియతమ్, క్రియతే, అర్జున,
సంగమ్, త్యక్త్వా, ఫలమ్, చ, ఏవ, సః, త్యాగః, సాత్త్వికః, మతః ॥

| | | | |
|---|---|---|---|
| అర్జునా! | = ఓ అర్జునా! | ఫలమ్ | = ఫలమును |
| నియతమ్ | = శాస్త్రవిహితమైన | త్యక్త్వా | = త్యజించి |
| యత్, కర్మ, కార్యమ్, ఏవ | = ఏ కర్మయైనను చేయదగినదే | క్రియతే | = చేయబడునో |
| ఇతి | = అనే భావముతో | సః, ఏవ | = అదియే |
| సంగమ్ | = సంగత్వమును | సాత్త్వికః, త్యాగః | = సాత్త్విక త్యాగముగా |
| చ | = ఇంకా | మతః | = భావింపబడును |

**హే అర్జున! కార్యమ్ ఇతి (మత్వా) ఏవ యత్ నియతమ్ కర్మ, సఙ్గమ్**
**ఫలమ్ చ ఏవ త్యక్త్వా క్రియతే, సః త్యాగః సాత్త్వికః మతః ॥**

తా: ఓ అర్జునా! శాస్త్రవిహితమైన ఏ కర్మయైనను చేయదగినదే అనే భావముతో ఆసక్తిని సంగత్వమును ఫలమును త్యజించి చేయబడునో అదియే సాత్త్వికత్యాగముగా భావింపబడును.

**సాత్త్విక సన్న్యాసం** – సాత్త్వికపురుషునికి తను ఇంకా చిత్తశుద్ధి పొందలేదని తెలుసు. తక్కిన ఇద్దరూ కూడా చిత్తశుద్ధి పొందలేదు కాని, వారికి అది తెలియదు. సాత్త్విక పురుషుడు కూడా చిత్తశుద్ధి పొందలేదు; కాని అతనికి అది తెలుసు. శాస్త్రంలో ఇది చాలా ముఖ్యం. మీరేస్థాయిలో ఉన్నారో మీరు తెలుసుకుంటే, ఆ స్థాయి నుంచీ మీరు సాధన చెయ్యవచ్చు. ఎందుకంటే శాస్త్రం అనేక స్థాయిలనుంచి బోధిస్తుంది.

సాత్త్విక పురుషునికి తనేమిటో, తనకేం కావాలో తెలుసు. తనకి మోక్షం కావాలి; మోక్షం కావాలంటే జ్ఞానం పొందాలి; జ్ఞానం పొందాలంటే చిత్తశుద్ధి కలగాలి; చిత్తశుద్ధి కలగాలంటే సాత్త్వికకర్మలు చేసితీరాలి. ఈ స్పష్టమైన జ్ఞానం అతనికి ఉంది. అంటే ఇతనికి తామసపురుషునికి ఉన్న అజ్ఞానం లేదు.

అంతేకాదు, ఇతనికి రాజసిక ప్రవృత్తి ఉండేవ్యక్తికి ఉండే దేహాభిమానం కూడా లేదు. కర్మ చెయ్యాలంటే శారీరకశ్రమ తప్పదని తెలుసు. నిజానికి అతను దాన్ని శ్రమగా భావించడు. దాన్ని అవసరంగా భావిస్తాడు. అలా శ్రమపడితే వచ్చే ఫలాన్ని అర్థం చేసుకుంటాడు కాబట్టి అతనికి అది పెద్ద శ్రమగా అనిపించదు. ఏదైనా మార్గం ఎప్పుడు కష్టం అనిపిస్తుంది? లక్ష్యం గురించి మర్చిపోయినప్పుడు. లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని మార్గాన్ని పాటిస్తే, అప్పుడది శ్రమ అని కొంచెం కూడా అనిపించదు.

**కార్యమ్ ఇతి ఏవ** – నేను కర్మలను చేసితీరాలి అనుకుంటాడు. సాత్త్విక కర్మలు అంటే పంచమహాయజ్ఞాలని చూశాము. అందువల్ల ఈ పంచమహాయజ్ఞాలు చేసితీరాలి. ఇవి కూడా 'నా గురువును సంతోషపెట్టటానికో, భగవంతుణ్ణి మెప్పించటానికో, శాస్త్రాన్ని గౌరవించటానికో కాదు. నేను ఆధ్యాత్మిక ఉన్నతిని పొందటానికి నాకు ఈ కర్మలు అవసరం,' అని అర్థం చేసుకుంటాడు. అందువల్లనే ఒకపని గురించిన స్పష్టమైన అవగాహన ఉండి తీరాలి అంటారు. అవగాహనతో కూడిన కర్మే నిలుస్తుంది. ఎవరైనా వ్యాయామం చెయ్యమని నిర్బంధిస్తే, ఆ నిర్బంధంవల్ల చేసే కర్మ మూడునాళ్ళ ముచ్చటే అవుతుంది. అదే మీరు ఆ వ్యాయామం మీ మంచికోసమే అనే స్పష్టమైన జ్ఞానంతో చేస్తే, ఎన్ని ఆటంకాలు వచ్చినా, ఆగకుండా ముందుకు సాగిపోతారు. అందువల్ల సాత్త్విక పురుషుడు నేను కర్మ చెయ్యాలి అనుకుంటాడు. ఎటువంటి కర్మ?

**నియతం కర్మ క్రియతే** – నియతకర్మలను చేస్తాడు. యజ్ఞదానతపస్సులను నియతకర్మలని చూశాము. అతను సాత్త్విక కర్మలను పెంచుకుంటూ వస్తాడు. ఇల్లు కావాలి, డబ్బు కావాలి అనే రాజసిక కర్మలు, స్వార్థపూరితమైన కర్మలు కూడా చేస్తాడు. అవి పూర్తిగా మానేయడు. కానీ సాత్త్వికకర్మలతో పోల్చిచూస్తే అవి చాలా తక్కువే ఉంటాయి. అదికాక హానికరమైన తామసికకర్మలను అతను ప్రయత్నపూర్వకంగా చాలామటుకు తగ్గిస్తాడు.

కొన్ని వ్యాపారసంస్థలు చూడండి, వారు చాలా లాభాలను పొందుతారు, కాని ఆ లాభాలను వారు మాత్రమే అనుభవించాలనుకోరు. ఆ లాభాలలో కొంతభాగాన్ని సమాజసేవకు ఉపయోగిస్తారు. అంటే ఆ సొమ్మును పాఠశాల, ఆసుపత్రి, ఆశ్రమాలు, వేదపాఠశాలలు అభివృద్ధికోసం వినియోగిస్తారు. అందువల్ల సమాజం వీరి వ్యాపారాభివృద్ధికోసం ప్రార్థన చేస్తుంది. వ్యాపారం చేయటం లౌకికకర్మ కాదు. ఎప్పుడు? అందులో వచ్చిన లాభాన్ని పరోపకారానికి ఉపయోగిస్తే. అందువల్ల సాత్త్వికప్రవృత్తి ఉన్న పురుషుడు నియతకర్మను చేస్తాడని చూశాము. నియతకర్మ అంటే యజ్ఞదానతపస్సులు లేదా సాత్త్విక కర్మలు లేదా పంచమహాయజ్ఞాలు. ఈ పర్యాయపదాలను మర్చిపోకూడదు.

అతను ఒకపక్క కర్మలను చేస్తున్నాడు అంటూనే అది సాత్త్విక సన్యాసం అని ఎలా అంటారు? సన్యాసం అంటే త్యజించటం కదా అనవచ్చు మీరు. కృష్ణపరమాత్మ అతను కూడా త్యజిస్తాడు; కాని సాత్త్విక కర్మలను కాదు, వేరేదాన్ని త్యజిస్తాడు అంటున్నాడు. ఏమిటది?

**సంగం త్యక్త్వా** – అతను ఈ కర్మలతో ఉన్న అనుబంధాన్ని త్యజిస్తాడు. గుర్తుంచుకోండి, సాత్త్వికకర్మలమీద బంధం పెంచుకోకూడదు.

సాత్త్వికకర్మలు చిత్తశుద్ధిని పెంపొందిస్తాయి కాని అవి జ్ఞానాన్ని కలుగజేయవు. ఇవి ప్రాథమిక సూత్రాలు. వీటిని మర్చిపోకూడదు. అందువల్ల చిత్తశుద్ధిని పెంపొందించుకునేదాకా చేసి, వాటిని త్యజించటమో, తగ్గించుకోవటమో చెయ్యాలి.

**ఫలం చైవ** – ఈ సాత్త్విక కర్మలవల్ల రెండురకాల ఫలం వస్తుంది. ఒకటి ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు. అది ముఖ్యఫలం. అతను పరోపకారకర్మలు చేస్తాడు కాబట్టి, సంఘంలో పేరుప్రఖ్యాతులు కూడా పొందుతాడు. దాన్ని అవాంతరఫలం అంటారు. సాత్త్వికకర్మలు చేసేవ్యక్తి ఈ అవాంతరఫలంయొక్క ప్రలోభంలో పడకూడదు. అవాంతరఫలం అంటేనే అది ముఖ్యఫలం కాదని అర్థం. దాన్నే ముఖ్యఫలం అనుకుంటే, అప్పుడది అవాంతరఫలం అవదు.

ఉదాహరణకు మీరు మామిడిపండ్ల కోసం మామిడిచెట్టును మీ తోటలో వేశారనుకుందాము. మామిడిచెట్టువల్ల అనేక అవాంతరఫలాలు ఉన్నాయి. ముందుగా అది నీరుని పీల్చి, వాతావరణాన్ని చల్లబరుస్తుంది. పెద్ద వృక్షంగా అయ్యాక మీకు నీడను ఇస్తుంది. పండుగలకు మామిడి ఆకులకోసం ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. పూర్వకాలంలో వంటకు ఎండిన రెమ్మలను వాడేవారు. ఇలా ఎన్నో ఆశించని ఫలాలు కలుగుతాయి. కర్మయోగి ఈ ఫలాల వెంటపడడు. కర్మఫల త్యాగాన్ని చేస్తాడు. అంటే అవాంతరఫల త్యాగాన్ని చేస్తాడు.

నేను ఇంత కష్టపడి పనిచేస్తున్నాను. నా జూనియర్ బాస్‌ని కాకాపట్టి ప్రమోషన్ కొట్టేశాడు అని బాధపడడు. అతను కర్మయోగి అయితే చేసేపనిలోనే ఆనందం వెతుక్కుంటాడు. ఒక సంగీత విద్వాంసుడు పెద్దకచేరీలు ఇవ్వాలి, అందరూ చప్పట్లు కొట్టాలి అనే ఫలం కోరడు. తను పాడే సంగీతంలోనే తను రమిస్తాడు. ఎవరు విన్నా, వినకపోయినా అతను బాధపడడు. అసలుసిసలు కర్మయోగి కర్తగానే ఆనందం పొందుతాడు. కేవలకర్మ చేసే వ్యక్తి భవిష్యత్తులో భోక్తగా అనుభవించబోయే దానిమీద ఆశపెట్టుకుంటాడు. కర్మయోగి ఇప్పుడు చేసే పనిలోనే ఆనందాన్ని పొందుతాడు. కర్మయోగికి ఫలం ఇప్పుడే, ఇక్కడే దొరుకుతుంది.

**(సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః) సాత్త్వికో మతః** – కర్మతో సంగత్వం పెట్టుకోకుండా, నియతకర్మలు చేస్తూ, వాటివల్ల వచ్చే ఫలాన్ని త్యజిస్తే అది సాత్త్విక సన్న్యాసం అవుతుంది.

ఈ విధంగా తామసిక, రాజసిక, సాత్త్విక సన్న్యాసం గురించి కృష్ణపరమాత్మ చెప్పాడు. కృష్ణపరమాత్మ సన్న్యాసం, త్యాగం పదాల మధ్య భేదం చూపించలేదని చూశాము. ఈ సన్న్యాసం పదం నిర్వచించేటప్పుడు కృష్ణపరమాత్మ ఎవరిని ఉద్దేశించి చెబుతున్నాడో, అది దృష్టిలో పెట్టుకున్నాడనీ, అందువల్ల సన్న్యాసంయొక్క సాంప్రదాయ నిర్వచనం ఇవ్వలేదనీ కూడా చూశాము.

యజ్ఞదానతపస్సులను చేసి, వాటివల్ల చిత్తశుద్ధి పొందిన వ్యక్తి ఇంకా కర్మలు చెయ్యనవసరం లేదు. అది కడుపునిండా భోజనం చేసినవ్యక్తికి మళ్ళీ భోజనం పెట్టినట్టు ఉంటుంది. అటువంటి వ్యక్తి వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలకోసం సన్న్యాసాన్ని స్వీకరించినా ఫర్వాలేదు. కాని అందరికీ ఆ పరిపక్వత రాదు. అందువల్ల వారు యజ్ఞదానతపస్సులను చెయ్యక తప్పదు. ఇవే వారి మనస్సుకు చిత్తశుద్ధిని కలుగజేస్తాయి. అలా సంసిద్ధత

లేకుండా సన్న్యాసం స్వీకరిస్తే, అందులోనూ అజ్ఞానం వల్ల స్వీకరిస్తే అది తామసిక సన్న్యాసమనీ; దేహాభిమానంతో స్వీకరిస్తే అది రాజసిక సన్న్యాసమనీ నిర్వచించాడు కృష్ణపరమాత్మ.

అలా సంసిద్ధత లేకుండా, నియతకర్మ చేసి, కర్మఫలత్యాగం చేస్తే దాన్ని సాత్త్విక సన్న్యాసం అన్నాడు కృష్ణపరమాత్మ.

ఈ తొమ్మిదవ శ్లోకంనుంచి ఒక ముఖ్యమైన ఉపసిద్ధాంతాన్ని ఏర్పరచుకోవచ్చు. సాత్త్విక సన్న్యాసంలో కర్మ చెయ్యాలి కాని లౌకికఫలాలను ఆశించకూడదు అన్నాడు. ఫలం వచ్చినా, రాకపోయినా పట్టించుకోకూడదు అన్నాడు. ఇదే నిర్వచనాన్ని కర్మయోగానికి కూడా ఇచ్చాడు కృష్ణపరమాత్మ.

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥** – 2.48

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

ఈ రెండు శ్లోకాలూ కర్మయోగాన్ని నిర్వచిస్తాయి. సంగం త్యక్త్వా అన్నాడు రెండవ అధ్యాయంలో, నిరాశీర్నిర్మమో భూత్వా అన్నాడు మూడవ అధ్యాయంలో. అదే నిర్వచనాన్ని ఇచ్చి, ఇప్పుడు దానికి కొత్తపేరు పెట్టాడు. సాత్త్విక సన్న్యాసం అన్నాడు. పాత దానికి కొత్త తొడుగు తొడిగాడు.

అర్జునుణ్ణి కర్మయోగం పాటించమన్నాడు కృష్ణపరమాత్మ. అర్జునుడు సన్న్యాసం వైపు మొగ్గుచూపుతున్నాడు. అందువల్ల అదే కర్మయోగానికి సన్న్యాసం పేరు కలిపి సాత్త్విక సన్న్యాసం అంటున్నాడు. కర్మయోగి కూడా ఒక విధంగా సన్న్యాసే. ఎందుకంటే అతను ఆంతరసన్న్యాసం చేస్తాడు. దీన్నే శాస్త్రంలో గౌణసన్న్యాసం అంటారు. సన్న్యాసికి ఉండే ప్రశాంతత ఇతనికి కూడా ఉంటుంది. కర్మయోగి కూడా ఏ ఫలాన్నీ ఆశించడు. ఏది వచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాడు. అందువల్ల ఇక్కడ మనం గ్రహించాల్సిన ఉపసిద్ధాంతం ఇది –

సాత్త్విక సన్న్యాసం = కర్మయోగం.

సాత్త్విక సన్న్యాసం కర్మయోగం వంటిది. అయితే పంచమహాయజ్ఞాలు చేసితీరాలి.

**కర్మయోగము – శ్లోకాలు: 10–12 – విశ్లేషణ**

పద్దెనిమిదవ అధ్యాయంలో 10, 11, 12 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ కర్మయోగమహిమ గురించి చెప్పబోతున్నాడు. రెండు, మూడు అధ్యాయాల్లో నిర్వచించిన కర్మయోగాన్నే పద్దెనిమిదవ అధ్యాయంలో సాత్త్విక సన్న్యాసం అన్నాడు కృష్ణపరమాత్మ. పేర్లు ఏవైనా, తాత్పర్యం ఒకటే.

కర్మయోగికి తన ధర్మాలేమిటో బాగా తెలుసు. ధర్మం అంటే నా జీవితం కొనసాగించటానికి కొన్ని పన్నులు కట్టాలి. నేను జీవించాలంటేనే, కొన్ని ధర్మాలు నెరవేర్చాలి. అందులో మొట్టమొదటిది నా గురించి నేను నెరవేర్చాల్సిన కర్తవ్యం.

1. **శారీరక ధర్మాలు** – నా శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. నేను జీవించి ఉండాలంటే, నేను ఆహారం తీసుకోవాలి. నాకు తినటం ఇష్టంలేదు అనలేను. ఆహారం తీసుకోవటం ఎంత సహజమో, మలమూత్ర విసర్జన కూడా అంతే సహజంగా జరగాలి. అదికాక రోజూ స్నానం చెయ్యాలి, వ్యాయామం చెయ్యాలి. ఇవన్నీ శారీరక ధర్మాల కిందికి వస్తాయి. వీటిని సవ్యంగా నెరవేర్చకపోతే అనారోగ్యమనే శిక్షను భరించాల్సి ఉంటుంది.

2. **గృహస్థ ధర్మాలు** – అలాగే గృహస్థుగా నాకు కొన్ని ధర్మాలు ఉంటాయి. భార్య, పిల్లల విషయంలో కొన్ని బాధ్యతలు ఉంటాయి. వాటిని నెరవేర్చాలి. ఇవన్నీ ప్రకృతి సూత్రాలు. భగవంతుడు నియమించిన సూత్రాలు. వీటిని తప్పించుకోలేను, భగవంతుణ్ణి మోసం చెయ్యలేను.

పిల్లలకు పరీక్షల సమయం అయితే అది మనకు పరీక్షా సమయం! వారి పాఠాలన్నీ మనం నేర్చుకుని, వారికి చెప్పాలి. మనకి రాని హిందీ అయినా సరే, మనకి రాని ఏ సబ్జెక్టు అయినా సరే. అదికాక వారు రాత్రంతా మేలుకుని చదివితే, మనం కూడా కళ్ళలో ఒత్తులు వేసుకుని కూర్చుని, వాళ్ళు నిద్రపోకుండా, అలసిపోకుండా ఉండటానికి ఆరారగా టీనో, చిరుతిళ్ళో ఇస్తూ ఉండాలి. ఈ రోజుల్లో భర్తకు కూడా వంటిపనిలో, ఇంటిపనిలో సగభాగం అప్పజెప్పుతున్నారు. కూరలు తరగాలి, డిష్‌వాషర్‌లో గిన్నెలు తోమి, వాషింగ్‌మిషన్‌లో బట్టలు ఉతికి, చంటిపిల్లలకు బట్టలు తొడిగి, స్కూలుకు ముస్తాబులు చెయ్యాలి.

3. **పౌరునిగా ధర్మాలు** – ఒకదేశంలో ఉన్నందుకు, ఆ దేశపౌరునిగా కొన్ని ధర్మాలను నెరవేర్చాలి. అందులో ముఖ్యమైన ధర్మం పన్నులు కట్టాలి.

పైన చెప్పిన కర్మలు కాక అనేకానేక కర్మలు మనం చెయ్యాల్సి ఉంటుంది . వాటిలో కొన్ని కర్మలు మనకు ఇష్టం ఉంటాయి, కొన్ని ఇష్టం ఉండవు. కర్మయోగి చేసే మొట్టమొదటి పని – ఇలా కర్మలకు ఇష్టాయిష్టాల బిరుదులు ఇవ్వడు. మనం చెయ్యాల్సిన పనులు నచ్చకపోతే, జీవితం దుర్భరంగా ఉంటుంది. అప్పుడేం చేస్తాము? చేసితీరాల్సిన పనిని శారీరకంగా చేస్తాము కాని మనస్సు వాటిని అంగీకరించదు. అంటే మనస్సు, శరీరంతో సహకరించదు. దానివల్ల మనలో సంఘర్షణ బయలుదేరుతుంది.

సన్యాసి అయినా కూడా కొన్నింటిని తప్పించుకోలేడు. స్వామీజీ దర్శనం చేసుకోవాలని ఎందరో వస్తూవుంటారు. ఎవరూ రాకూడదని చెప్పలేరు. ఎందుకంటే మనదేశంలో సన్యాసులకు, స్వామీజీలకు గౌరవాన్ని ఇస్తారు. వారితో కష్టం సుఖం చెప్పుకోవాలనుకుంటారు. అందులో ఇవాళ రావచ్చా, మీకు వీలేనా అని అడిగే అలవాటు మనకులేదు. నాకు ఏకాంతం కావాలి, నన్ను కలవకండి అని ఆయనా చెప్పలేరు. సన్యాసికీ, ఏకాంతానికీ చుక్కెదురు అవుతుంది. అందువల్ల ఏ ఆశ్రమం తీసుకున్నా ధర్మాలు తప్పవు.

కర్మయోగి కర్మను త్యజించలేడు. దాన్ని తప్పించుకునేందుకు ఒకటే మార్గం ఉంది. ఇది జీవితంలో ఒక భాగంగా ఇది నేను పాటించి తీరాల్సిన కర్తవ్యం అనుకోవాలి. అందువల్ల కేవలం జీతంకోసమే ఏదైనా ఉద్యోగంలో చేరినా, ఆ ఉద్యోగధర్మాన్ని బాధ్యతగా నిర్వర్తించాలి.

ఈ సందర్భంలో స్వామీజీ తనకైన ఒక అనుభవాన్ని మనతో పంచుకుంటున్నారు. ఒక స్కూల్లో ఆ స్కూలు యాజమాన్యం, స్కూల్లో పనిచేసే టీచర్లు మన సంస్కృతిని నేర్చుకోవాలని ఆశించారు. ఎందుకంటే చిన్నపిల్లల

భవిష్యత్తును తీర్చిదిద్దేది టీచర్లే కాబట్టి, వారికి మన సంస్కృతి తెలిస్తే, పిల్లలని మంచిదారిలో నడిపించగలరు అనుకున్నారు.

దానికి పరమార్థానంద స్వామీజీని ఆ టీచర్లకు భగవద్గీత బోధించమని ఆహ్వానించారు. ఆ బోధ స్కూలు అయిపోయాక చెయ్యాలి. ఎందుకంటే, స్కూలు కార్యక్రమాలకు ఆటంకం రాకూడదు. అందువల్ల 4–5 గంటల మధ్య పెట్టారు. స్వామీజీ అది తన జీవితంలో అత్యంత బాధాకరమైన విషయాలలో ఒకటి అంటారు. ఎందుకంటే ఆ బోధను స్కూలు సమయం తర్వాత పెట్టటంతో, ఆ టీచర్లు చాలా అసహనంగా ఉండేవారు. స్వామీజీ ఎప్పుడు ముగిస్తారా, ఎప్పుడు దీన్నించి బయటపడి, పారిపోదామా అన్నట్టు ఉండేవారు. వారి బాడీలాంగ్వేజ్, ముఖకవళికలు, మాటిమాటికీ చేతిగడియారం వంక చూసుకోవటం చూస్తే వారు ఎలా ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నారో అర్థమయ్యేది.

ఇటువంటి పరిస్థితినే ఎదుర్కోవాల్సి వచ్చిన ఒక కవిహృదయాన్ని తలుచుకున్నారు స్వామీజీ ఆ సమయంలో. ఆ కవి అంటాడుట, 'ఓ భగవంతుడా, నేను ఎటువంటి లలాటలిఖితాన్ని అయినా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నాను; కాని నా కవితలమీద శ్రద్ధలేని వారికి నా కవితలు చదివి వినిపించాల్సిన దురవస్థను మాత్రం కల్పించకు.'

స్వామీజీ పరిస్థితి కూడా అలాగే ఉంది. అసలు ఏమాత్రం శ్రద్ధలేని వారి మెదడుల్లోకి భగవద్గీతను బలవంతంగా ఎక్కించాల్సి వచ్చింది. రష్యా ఇనపగోడ ఇంతకన్నా సన్నగా ఉంటుందేమో అనుకున్నారు. అంటే వారి అసహన శక్తి అంతకన్నా ఎక్కువగా ఉందన్నమాట. అయినా తన ధర్మాన్ని స్వామీజీ నిర్వర్తించారు. అప్పుడు ధర్మం పాటించినందువల్ల కలిగిన పుణ్యం వృథా పోలేదనీ, ఇప్పుడు శ్రద్ధగా వినే విద్యార్థులు దొరికారనీ మురిసిపోయారు స్వామీజీ (స్వామీజీ బోధకు వందల్లో ఉంటారు శ్రోతలు).

కర్మయోగం లేదా సాత్త్విక సన్న్యాసం పాటించేవ్యక్తి పూర్తిగా చిత్తశుద్ధి పొందలేదనే విషయం మర్చిపోకూడదు. అందువల్ల ఈ వ్యక్తి సాత్త్విక కర్మలు లేదా నియతకర్మలను మానకూడదని కృష్ణపరమాత్మ గట్టిగా చెబుతున్నాడు. యజ్ఞం అంటే పంచమహాయజ్ఞాలు అని చూశాము. కొంతమంది వేదాంతబోధకు రాగానే, 'నేను అకర్తను, అభోక్తను,' అని నేర్చుకోగానే ఆలయాలకు వెళ్ళటం, దైవపూజలను మానేయటం చేస్తారు. అలా చెయ్యకూడదని కృష్ణపరమాత్మ గట్టిగా నొక్కివక్కాణిస్తున్నాడు.

జ్ఞానానికి వచ్చినా కూడా శక్తివంతమైన రాగద్వేషాలు పట్టి కుదిపివేస్తుంటే, ఇంకా మీ మనస్సు పరిపక్వత చెందలేదని తెలుసుకోవాలి. అందువల్ల శ్రద్ధగా ఇష్టదేవత ప్రార్థన చెయ్యాలి; యజ్ఞం చెయ్యాలి; దానం చెయ్యాలి; తపస్సు చెయ్యాలి.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. సాత్త్విక సన్న్యాసం = కర్మయోగం అంటే, దానికి సన్న్యాసం పదం ఎలా వాడగలరు? కర్మయోగంలో యజ్ఞదానతపస్సులను కర్మయోగి త్యజించడు. మూడూ చేస్తాడు. ఇక్కడ సన్న్యాసం పదం వేస్తే అతను ఏదో ఒకటి త్యజించాలి. ఏం త్యజిస్తాడు? దానికి కృష్ణపరమాత్మ జవాబు చెబుతున్నాడు.

1. **ఆందోళన త్యజిస్తాడు** – కర్మయోగి భవిష్యత్తు గురించిన ఆందోళనను త్యజిస్తాడు. నిజానికి ఆందోళనను త్యజించిన వ్యక్తిని కర్మయోగి అంటారు. అయితే అతను ఏంచేస్తాడు? తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తాడు. కుటుంబంలో, ఉద్యోగంలో, సమాజంలో నిర్వర్తించాల్సిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తాడు. తండ్రిగా పిల్లల భవిష్యత్తుకు మంచిబాట వెయ్యటానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు. అతనికి తన పాత్ర ఎంతవరకో స్పష్టంగా తెలుసు. పిల్లలకు మంచిబాట వెయ్యగలడే కాని తను వారి భవిష్యత్తును నిర్దేశించలేడని తెలుసు. వారి భవిష్యత్తునే కాదు, వారి ఆలోచనలనే తను అదుపులో పెట్టలేనని తెలుసుకుంటాడు.

తండ్రిగా తను చెయ్యగలిగింది చేస్తాడు. ఇంటిలో పిల్లలకు అనువైన వాతావరణాన్ని ఏర్పరచి, వారికి ఆధ్యాత్మిక చింతన కలిగేందుకు తోడ్పడే పరిస్థితులను ఏర్పరచగలడు కాని వారిని పూర్తిగా మార్చలేడు. పిల్లల మీద టీవీ ప్రభావం ఉంటుంది; స్కూలు, కాలేజీ ప్రభావం ఉంటుంది; స్నేహితుల ప్రభావం ఉంటుంది; సమాజం ప్రభావం ఉంటుంది. వారు స్కూలు ఎగ్గొట్టి సినిమాలకు, షికార్లకు మీకు తెలియకుండా వెళ్ళవచ్చు. అందరూ అలా చేస్తారని కాదు, చేసే అవకాశం ఉంది. అందువల్ల పిల్లల భవిష్యత్తును మీరు నిర్దేశించలేరు, అలాగని మీ కర్తవ్యాన్ని వదిలివేయకూడదు.

కర్మయోగి = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి

కర్తగా మీ ధర్మాన్ని నెరవేర్చాలి. ఏ కర్మ చేసినా ఈశ్వరార్పణబుద్ధితో చెయ్యాలి. భోక్తగా మీరు ఏం అనుభవించబోతారో, అది మీచేతిలో లేదని గ్రహించుకోవాలి. ఏదివచ్చినా చిరునవ్వుతో ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి.

ఇంతవరకూ చూసింది పిల్లల విషయంలో. ఇదే సూత్రం ఆరోగ్యానికీ, ధనానికీ, ఉద్యోగానికీ, అన్నిటికీ వర్తిస్తుంది. కర్తగా మీ బాధ్యతను మీరు నిర్వర్తించాలి. అది కూడా యాంత్రికంగా కాదు, ఉత్సాహంగా, శ్రద్ధగా, వివేకంతో చెయ్యాలి. ఎందుకంటే మీరు చేసేపనిని ఈశ్వరునికి అర్పిస్తున్నారు. కాని ఫలం మీ చేతిలో లేదు. మీరు చేసుకున్న కర్మవల్ల, అది ఈ జన్మలో కర్మవల్ల కావచ్చు, పూర్వజన్మ కర్మవల్ల కావచ్చు. వచ్చే ఫలాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి.

భవిష్యత్తులో ఏమవుతుందో తెలియనప్పుడు, దాన్ని ఎలా నిర్దేశించగలరు? ఏదో శనిమహాదశ నడుస్తోందని తెలుసుకోగలరేమో కాని, ఏమవుతుందో తెలియదు. అందువల్ల కర్మయోగి ఆందోళనను త్యజిస్తాడు. ఇది అతను త్యజించే మొదటి అంశం.

2. **బంధాన్ని త్యజిస్తాడు** – కర్మయోగి అంత శ్రద్ధగా దైవకార్యాలు చేస్తున్నా కూడా వాటిమీద బంధం పెంచుకోడు. చేసేటప్పుడు శ్రద్ధగానే చేస్తాడని చూశాము. అయినా బంధం పెంచుకోడు. ఎందుకు? అతనికి ఈ కర్మలను మార్గంగా తీసుకోవాలి కాని, లక్ష్యంగా కాదని తెలుసు. కర్మను లక్ష్యంగా తీసుకుంటే ఈ కర్మద్వారా ధనం, ధాన్యం, బహుపుత్రలాభం కావాలనుకుంటాడు. కర్మను మార్గంగా తీసుకుంటే కర్మద్వారా చిత్తశుద్ధి పొంది జ్ఞానయోగ్యతాప్రాప్తి కలగాలని తెలుసుకుంటాడు.

మార్గాన్ని మార్గంగానే చూడాలి. దానిమీద అనుబంధం పెంచుకోకూడదు. పిల్లలు, 'స్కూలు టీచర్లు బాగా చెబుతున్నారు, స్కూలు బాగుంది, ఇక్కడే ఉండిపోతాను రాను,' అంటారా? స్కూలుమీదా, టీచర్లమీదా అభిమానం ఉండటం మంచిదే, కాని అది దురభిమానం కాకూడదు. అంటే అవసరమైనప్పుడు ఆ అభిమానానికి అతీతంగా ఎదగాలి. స్కూలు వదలాల్సిన సమయంలో వదిలి బయటకు రావాలి. దీన్ని సంగత్యాగం లేదా ఫలత్యాగం అంటారు. లౌకికభాషలో చెప్పాలంటే రేపేమవుతుందోననే బెంగ ఉండదు. దీన్నే కర్మయోగం లేదా సాత్త్విక సన్న్యాసం అంటారు. దీన్ని ఏక్సెప్ట్ అండ్ అకామడేట్ అంటారు.

3. **సాత్త్విక అంతఃకరణ ఉంటుంది** – కర్మయోగి తను చెయ్యాల్సిన కర్మలను చిరునవ్వుతో స్వీకరిస్తాడు. ఎన్నడూ సణగడు. 'ఎందుకు చెయ్యాలి భగవంతుడా?' అనుకోడు ఎప్పుడూ. పిల్లలను స్కూల్లో చేర్చటానికి గంటలకొద్దీ క్యూలో నిలుచోమన్నా సంతోషంగా నిలుచుంటాడు, వారిని అమెరికా పంపాలంటే దానికి కావాల్సిన ఏర్పాట్లు అన్నీ చక్కగా చేస్తాడు.

పెళ్ళి చేసుకునేముందు ఆలోచించాలి కాని, చేసుకున్నాక ఎందుకు చేసుకున్నాను అనుకోకూడదు. గృహస్థాశ్రమంలో వచ్చే కష్టసుఖాలను చిరునవ్వుతో స్వీకరించాలి. ఆ మాటకొస్తే ఏ ఆశ్రమంలో ఉండే కష్టసుఖాలు ఆ ఆశ్రమంలో ఉంటాయి. ఏదీ పూర్తిగా దుఃఖరహితంగా ఉండదు. ఏ ఆశ్రమమైనా కూడా దుఃఖమిశ్రితంగా ఉంటుంది. జీవితమంటే కూడికలు, తీసివేతల మేలుకలయిక అని తెలుసు కర్మయోగికి. ప్రశాంతత కావాలంటే ఒక్క శ్మశానంలోనే దొరుకుతుందని కూడా తెలుసు. అందువల్ల కర్మయోగి ఇవి నాకు ఆనందమిచ్చే పనులు; ఇవి దుఃఖాన్ని కలిగించే పనులు అని వాటిని విభజించడు. కర్తవ్యం కర్తవ్యమే. దాని ముందు విశేషణం కలపకూడదు. విశేషణం కలిపితే అది ఆందోళనను, ఒత్తిడిని కలుగజేస్తుంది.

ఇటువంటి మనస్థితిని కలిగివుండాలంటే అతనికి సాత్త్విక అంతఃకరణ ఉండాలి. రాజసిక మనస్సు ఉంటే అతని ధర్మాలతో బంధం పెంచుకుంటాడు; తామసిక మనస్సు ఉంటే అసలు కర్మే చెయ్యకుండా తప్పించుకుంటాడు. కాని కర్మయోగికి సాత్త్విక అంతఃకరణ ఉంటుంది.

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**

**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥** – 2.45

సత్త్వగుణంలో నిలవాలంటే కర్మమీద ద్వేషమూ ఉండకూడదు, బంధమూ ఉండకూడదు.

**ఫలం** – ఇలా కర్మయోగం పాటించిన వ్యక్తి పొందే ఫలమేమిటి? అతను జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందుతాడు. ప్రాకృత మనస్సు కాస్తా సంస్కృత మనస్సు అవుతుంది. అప్పుడు అతను యజ్ఞదానతపస్సులను తగ్గించుకోవచ్చు. మనస్సు సంస్కరించబడనంతవరకూ ఈ కర్మలను చేసితీరాలి.

మనస్సు సంస్కరించబడిందని ఎలా తెలుస్తుంది? రెండు అంశాలద్వారా తెలుస్తుంది.

**వేదాంతం విలువ తెలుస్తుంది** – మనస్సు సంస్కరించబడితేనే వేదాంతం అవసరమనిపిస్తుంది; లేకపోతే అదికూడా ఒక విద్యలాగా అనిపిస్తుంది. ముఖ్యంగా మాండూక్యోపనిషత్తువంటి కష్టమైన ఉపనిషత్తులు నేర్చుకుని

ఏమిటి ప్రయోజనం అనిపిస్తుంది. బ్రహ్మ గురించీ, జగత్తు గురించీ నేర్చుకుంటే అది నేను ఎదుర్కొనే నీటియెద్దడిని ఎలా తగ్గిస్తుంది? సంస్కరించబడని మనస్సు ఉన్న వ్యక్తికి ఆత్మజ్ఞానానికీ, దైనందిన జీవితంలోని సమస్యలకూ లంగరు కుదరదు. మనస్సు శుద్ధి అవుతున్నకొద్దీ, తన సమస్యకు మూలకారణం అజ్ఞానం అని తెలుస్తుంది. మనస్సు సంస్కరించబడిందని తెలిపే మొదటి అంశం – వేదాంతం విలువ తెలియటం.

**వేదాంతం అర్థమవుతుంది** – ఎప్పుడైతే వేదాంతంయొక్క విలువ తెలుసుకుంటాడో అప్పుడే వేదాంతం అర్థమవటం మొదలవుతుంది. వేదాంతం అర్థమయిందీ అంటే సాధనచతుష్టయ సంపత్తి కలిగి, అతను అర్హత పొందినట్టు అర్థం. కృష్ణపరమాత్మ అటువంటివ్యక్తిని యోగారూఢః అన్నాడు ఆరవ అధ్యాయంలో.

**యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥** – 6.4

జీవితంలో తక్కిన లక్ష్యాలకన్నా వేదాంతం బాగా ఆకర్షిస్తుంది. అలా ఆకర్షించిందంటే అతను అర్హత పొందినట్టే. **కర్మలను పూర్తిగా త్యజించకూడదు** – ఎప్పుడైతే ఈ అర్హతను పొందుతాడో, అప్పుడే అతను కర్మలను తగ్గించవచ్చు. జాగ్రత్తగా గమనించండి; కర్మలను తగ్గించవచ్చు కాని పూర్తిగా త్యజించకూడదు. అలా కర్మలను తగ్గించేసరికి, అతనికి కొంత ఖాళీసమయం చిక్కుతుంది. దాన్ని దేనికి వాడాలి? టీవీ చూడటానికా? కాదు. ఖాళీ సమయాన్ని వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు కేటాయించాలి. ఇలా వేదాంతంమీద సమయాన్ని వెచ్చించగలిగితే అతను బాహ్యంగా సన్న్యాసం స్వీకరించాల్సిన అవసరంలేదు. సంస్కరించబడిన, వైరాగ్యం పొందిన మనస్సుతో అతను ఉపనిషత్తులను నేర్చుకుంటే, అంటే శ్రవణం చేస్తే, అతను మేధావి అవుతాడు.

శ్రవణంద్వారా అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందుతాడు; మననంద్వారా ఆ జ్ఞానాన్ని నిస్సంశయ జ్ఞానంగా మలుచుకుంటాడు అంటే అతనికి ఎండాకాలపు ఎండ ఎంత సత్యమో, అహం బ్రహ్మ అస్మి అనేది కూడా అంత సత్యమనిపిస్తుంది. అది ఉపనిషత్తు చెప్పే వాక్యంగా కాక, సత్యంగా అర్థమవుతుంది.

ఆ విధంగా కర్మయోగంద్వారా జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది; అప్పుడు జ్ఞానయోగానికి వచ్చి మోక్షాన్ని పొందుతాడు. కర్మయోగం జ్ఞానయోగానికి దారితీస్తుంది; జ్ఞానయోగం మోక్షాన్ని కలుగజేస్తుంది. కర్మయోగం ఫలాన్ని పరంపరయా మోక్షం అంటారు. అంటే అది ప్రత్యక్షంగా మోక్షానివ్వదు కాని, జ్ఞానయోగానికి వెళ్ళటానికి, తద్వారా మోక్షాన్ని పొందటానికి బాటవేస్తుంది. ఇది ఫలం.

**కర్మలను త్యజించలేరు** – ఇంతకుముందు కర్మలను పూర్తిగా త్యజించకూడదు అన్నాడు; ఇప్పుడు కర్మలను పూర్తిగా త్యజించలేరు అంటున్నాడు కృష్ణపరమాత్మ. సన్న్యాసం స్వీకరించినా కూడా, భిక్షాటన చెయ్యాలి. శరీరాన్ని ఆరోగ్యకరంగా ఉంచుకోవాలి అంటే స్నానంవంటి కర్మలు చెయ్యాలి. మనిషి పూర్తిగా కర్మలను త్యజించలేడు. అది ఒక్క సందర్భంలోనే సాధ్యమవుతుంది. అది ఎప్పుడో తెలుసా? మరణంలోనే. ఒక శరీరం కర్మలనుంచి విముక్తి పొందితే, ఆఖరికి శ్వాస పీల్చుకునే కర్మనుంచి కూడా బంధవిముక్తి పొందితే, అతనితో బంధం ఉన్నవారి కర్మ రెట్టింపు అవుతుంది. ఆ భౌతికకాయానికి అంత్యక్రియలు చేయించాలి; దానికి అవసరమైన కర్మలు చెయ్యాలి.

మన కర్మలు మనం చేసుకోగలిగినప్పుడు, మనమే చేస్తాము. మనం ఆఖరిశ్వాస విడిచాక, మనకు వారు కర్మలు చెయ్యాల్సి ఉంటుంది.

చేసే కర్మలను మార్చగలమేమో కాని, కొన్ని కర్మలను తగ్గించుకోగలమేమో కాని, కర్మలను పూర్తిగా అయితే త్యజించలేము. చిన్మయానందస్వామీజీ ఈ సిద్ధాంతాన్ని చాలా అద్భుతంగా వివరిస్తారు. మనం జీవించి ఉన్నంతకాలం, జీవితంలో ప్రతిక్షణమూ మనం మనచుట్టూ ఉన్న పరిసరాలనుంచి, జీవులనుంచి, తోటి మనుష్యులనుంచి లబ్ధి పొందుతున్నాము. వాయువునుంచి మనం ఆక్సిజన్‌ను గ్రహిస్తున్నాము శ్వాసక్రియ చెయ్యటానికి; భూదేవినుంచి అన్నం; జలంనుంచి నీరు రోజూ తీసుకుంటున్నాము. అంతేకాదు, మన కంచంలోకి అన్నం, కూరలు వచ్చాయంటే, వాటి వెనక ఎందరిదో సమష్టికృషి ఉంది. మనం మంచిదుస్తులు వేసుకోగలుగుతున్నామంటే, దాని వెనక ఎందరిదో సమష్టికృషి ఉంది.

మనుష్యులే కాదు, జంతువులు, చెట్లుచేమలు కూడా మన జీవితం ఆనందమయంగా సాగటానికి తోడ్పడుతున్నాయి. ఇంతమందినుంచి, ఇన్నింటినుంచి మనం ఇన్ని లాభాలు పొందుతూ ఉంటే, వారికి తిరిగి తీర్చాల్సిన కనీసబాధ్యత మనమీద ఉంది. వారికి మనం ఋణపడివున్నాము. పంచమహాయజ్ఞాలు ఏమిటి? మనం తీర్చుకునే ఋణాలే! దేవఋణం, ఋషిఋణం, పితృఋణం, మనిషిఋణం, భూతఋణం. వీరందరికీ మనం ఋణపడివున్నాము. అంటే మనం జీవించి ఉన్నన్నాళ్ళూ మనం ఋణపడేవుంటాము. ఈ ఋణాన్ని తీర్చుకోవటమెలా? మన శక్తిమేరకు మనం తిరిగి చెయ్యటం ద్వారా.

గీతాబోధవల్ల మనం ప్రయోజనం పొందుతున్నామంటే దానికి మనం వ్యాసాచార్యులకు ఋణపడివున్నాము. ఆయన దాన్ని లిఖించారు కాబట్టే, నేడు మనం నేర్చుకోగలుగుతున్నాము. అర్జునునికి ఋణపడివున్నాము. అర్జునుడు అడగకపోయివుంటే కృష్ణపరమాత్మ బోధించి ఉండేవాడు కాదు. కృష్ణపరమాత్మకు ఋణపడివున్నాము. కృష్ణపరమాత్మ అర్జునునికి మాత్రమే బోధించలేదు. అర్జునునిద్వారా మొత్తం మానవాళికి వేదాంతసారాన్ని బోధించాడు. ఉపనిషత్తులు నేర్చుకోలేనివారికి సూక్ష్మంలో మోక్షం. మన పితృదేవతలకు ఋణపడివున్నాము. వారు తరతరాలుగా, గురుశిష్యపరంపరగా గీతాబోధను అందించకపోయివుంటే ఇవాళ మనం ఇంత సుఖంగా, ఇంత తేలికగా గీతను నేర్చుకోగలిగి ఉండేవారము కాదు (పరమార్థానంద స్వామి ఇంత తేలికగా, ఒక క్లాసురూమ్ టీచింగ్‌లా బోధ చెయ్యకపోయివుంటే, ఇంత భాండాగారాన్ని అందుకోగలిగి ఉండేవారము కాదు.) అందువల్ల ఒక్క గీతా పారాయణం చేస్తేనే పంచమహాయజ్ఞాలు చేసినంత ఫలము.

దీనికి ప్రతిగా మనమేం చేస్తున్నాము? అంటే ప్రతిఒక్కరము గీతనే తిరిగి బోధించనవసరం లేదు. సమాజానికి మనవంతు సేవ చేస్తే చాలు. ఎలా సేవ చెయ్యాలి? కర్మలు చెయ్యటం ద్వారా. కర్మ చేస్తే దాన్ని వెన్నంటే ఆందోళన వస్తుంది కదా! కర్మ చెయ్యి కానీ కర్మఫలత్యాగం చెయ్యి అంటున్నాడు కృష్ణపరమాత్మ. చెప్పటం తేలికే, కాని ఆచరించటం కష్టం అనకండి. కృష్ణపరమాత్మ ముందే ఆచరించే పద్ధతిని కూడా చెప్పేశాడు.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**

**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽ స్త్వకర్మణి ॥** – 2.47

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

ఏమిటా పరిష్కారం? మనం చేసిన కర్మకు ఏ ఫలం వచ్చినా దాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో తీసుకోవాలి.

**కర్మయోగి కాకపోతే కలిగే నష్టం** – కర్మయోగి కాకపోతే కలిగే నష్టమేమిటి? కర్మయోగి కానివాణ్ణి కర్మఠుడు అంటారు. అతను భవిష్యత్తు గురించిన ఆందోళనతో ఉంటాడు. ఆ భయం అవసరమైతే విలువలను వదులుకోవటానికి కూడా సిద్ధపడేలా చేస్తుంది.

ఎందుకలా అధర్మానికి పాలుపడతాడు? భవిష్యత్తులో ఇబ్బంది పడకూడదని. భవిష్యత్తు మీద బెంగ, వర్తమానంలో రాజీపడేలా చేస్తుంది. అందువల్ల అతను చేసే కర్మలు మూడురకాల ఫలితాలను ఇస్తాయి.

ఎ) **అనిష్టమ్** – పాపఫలాన్ని ఇస్తాయి.
బి) **ఇష్టమ్** – పుణ్యఫలాన్ని ఇస్తాయి.
సి) **మిశ్రమ్** – పుణ్యపాప ఫలాల మిశ్రమాన్ని ఇస్తాయి.

అందువల్ల పునరపి జననం, పునరపి మరణం కలుగుతుంది. ఈ మూడు కర్మఫలాలు జీవించివుండగా కలుగుతాయి. మరణించాక కూడా మూడురకాల ఫలాలు కలుగుతాయి. ఊర్ధ్వలోకాలకో, అధోలోకాలకో వెళతాడు; లేదా ఈ లోకంలోనే మళ్ళీ పుడతాడు. కాని కర్మయోగి పరంపరయా మోక్షం పొందుతాడు.

ఇక్కడితో కర్మయోగం గురించిన విశ్లేషణ అయిపోయింది.

శ్లో. 10 **న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।**
**త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥**
న, ద్వేష్టి, అకుశలమ్, కర్మ, కుశలే, న, అనుషజ్జతే,
త్యాగీ, సత్త్వసమావిష్టః, మేధావీ, ఛిన్నసంశయః ॥

| | | | |
|---|---|---|---|
| (యః) | = ఎవడు | సః | = అతడే |
| అకుశలమ్, కర్మ | = చేయవలిసిన కర్మ(ల)ను | సత్త్వసమావిష్టః | = శుద్ధసత్త్వగుణయుక్తుడు |
| న, ద్వేష్టి | = ద్వేషింపడో | ఛిన్నసంశయః | = సంశయరహితుడు |
| కుశలే | = ఇష్టమైన కర్మలందు | మేధావీ | = బుద్ధిమంతుడు |
| న, అనుషజ్జతే | = బందమును కలిగియుండడో | త్యాగీ | = నిజమైన త్యాగి |

**(సః) త్యాగీ సత్త్వ-సమావిష్టః మేధావీ ఛిన్న-సంశయః**
**(చ భవతి సః) అకుశలమ్ కర్మ న ద్వేష్టి, కుశలే (చ) న అనుషజ్జతే ॥**

తా: ఎవడు చేయవలిసిన కర్మ(ల)ను ద్వేషింపడో, ఇష్టమైన కర్మలందు బంధమును కలిగియుండడో అతడే శుద్ధసత్త్వ గుణయుక్తుడు, సంశయరహితుడు, బుద్ధిమంతుడు, నిజమైన త్యాగి.

**కర్మయోగం – శ్లోకాలు 10–12** వీటిలో కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని స్తుతిస్తున్నాడు. కాకపోతే ఈ అధ్యాయంలో కర్మయోగాన్ని సాత్త్విక సన్న్యాసంగా పేర్కొన్నాడని చూశాము. సాత్త్విక సన్న్యాసమహిమ లేదా కర్మయోగమహిమ గురించి మాట్లాడబోతున్నాడు.

**కర్మయోగి కర్మలను త్యజించకూడదు** – కర్మయోగికి తన ధర్మాలను తను నిర్వర్తించాలని తెలుసు. మనిషిగా పుట్టినందుకు మనకు కొన్ని కర్తవ్యాలు ఉంటాయి. ముందుగా మనను మనం పరిరక్షించుకోవాలి, కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి, ఉద్యోగధర్మాన్ని నెరవేర్చాలి, సమాజానికి మనవంతు సేవ చెయ్యాలి. ఇవన్నీ మన కర్తవ్యాలు. వీటిని కర్మయోగి ఎలా చేస్తాడో ఈ శ్లోకంలో చూస్తాము.

**అకుశలం కర్మ న ద్వేష్టి** – తను చెయ్యాల్సిన ఏ కర్మను కూడా ద్వేషించడు. అతను ఏపని చేస్తున్నా సరే ఎన్నడూ బాహ్యంగా ఫిర్యాదు చెయ్యడు; ఆంతర్గతంగా కూడా తిట్టుకోడు. ఎందుకంటే అలా తిట్టుకుంటే అది ఆందోళనకు, ఒత్తిడికి దారితీస్తుందని అతనికి తెలుసు. అలా ఆందోళనకు లోనయితే ముందుముందు ఆరోగ్యం దెబ్బతింటుంది.

చాలామంది మంచి జీతం వస్తుందని ఏదో ఒక ఉద్యోగంలో చేరుతారు; కాని చేరాక వారికా పని నచ్చదు. రోజూ తిట్టుకుంటూ, సణుక్కుంటూ చేస్తారు ఆపని. ఆఫీసుకు కూడా నిరాసక్తితో వెళతారు. కర్మయోగి అలా వెళ్ళడు. అతను ఈశ్వరార్పణభావనతో చేస్తాడు. అందువల్ల అకుశలం కర్మ న ద్వేష్టి అంటే తనకిష్టం లేని పనులను ద్వేషించడు.

**కుశలే న అనుషజ్జతే** – అలాగని తనకిష్టమైన పనులమీద బంధమూ పెంచుకోడు. జీవితమంటే సుఖదుఃఖాలు రెండూ ఉంటాయని తెలుసు. అందువల్ల ఇది ఇష్టమైన పని, ఇది అయిష్టమైన పని అని తను చేసే కర్మలను రెండు తెగల కింద విడగొట్టడు. కర్తవ్యం అంటే కర్తవ్యమే. కర్మ చేసితీరాలి. దానికి మంచి, చెడు అనే విశేషణం వాడకూడదని తెలుసుకుంటాడు. తను చెయ్యాల్సిన పనిని ఈశ్వరార్పణభావనతో చేస్తాడు. ఎవరు?

**త్యాగీ** – త్యాగీ అంటే సాత్త్వికత్యాగీ లేదా కర్మయోగి. ఇంతకుముందు సాత్త్విక సన్న్యాసం = కర్మయోగము అని చూశాము. ఇప్పుడు కృష్ణపరమాత్మ సన్న్యాసం బదులు త్యాగీ పదాన్ని వేశాడు. అంటే త్యాగీ అన్నా, సన్న్యాసీ అన్నా ఒకటే అర్థం అని చెప్పకనే చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

సాత్త్విక సన్న్యాసం, కర్మయోగం, త్యాగం అన్నీ ఒకటే; అంటే సన్న్యాసంలోనూ, త్యాగంలోనూ ఏదైనా త్యజించాలి. కర్మయోగి మరేం త్యజిస్తాడు? కర్మయోగి భవిష్యత్తును గురించిన బెంగను త్యజిస్తాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. భవిష్యత్తు తన చేతిలో లేదనీ, అది అతను ఈ జన్మలోనూ, అంతకుముందు జన్మలోనూ చేసుకున్న కర్మలనుబట్టి ఉంటుందనీ తెలుసు కర్మయోగికి. అందువల్ల కర్మయోగి ఈశ్వరప్రసాదబుద్ధితో ఫలాన్ని స్వీకరిస్తాడు. దీన్ని సంగం త్యక్త్వా అని చూశాము తొమ్మిదవ శ్లోకంలో. అంటే ఫలత్యాగం అని అనవచ్చు. ఇదంతా మనస్సు పూర్తిగా సంస్కరించబడని కర్మయోగి గురించి అని మర్చిపోకూడదు. కర్మయోగి ఇష్టమైన పనిని, అయిష్టమైన పనిని కూడా శ్రద్ధగా చేస్తాడు. నిజానికి అలా పేర్లు పెట్టడు. ఇటువంటి భావాన్ని అనుభవించటానికి అతని మనస్సు ఎలా ఉండాలి?

**సత్త్వసమావిష్టః** – అతని మనస్సు రాజసికంగా ఉంటే కర్మలమీద బంధం ఏర్పరచుకుంటుంది; తామసికంగా ఉంటే కర్మలను తప్పించుకోవటానికి ప్రయత్నిస్తుంది. అందువల్ల ఈ రెండూ లేకుండా సమభావం ఉండాలంటే సాత్త్విక అంతఃకరణం ఉండాలి. తక్కిన గుణాలు లేకుండా ఉండాలి.

అలా కర్మయోగం పాటిస్తే, అతనికి జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. మనస్సు సంస్కరించబడుతుంది. అప్పుడు అతను ఈ కర్మలను తగ్గించవచ్చు. కాని అతని మనస్సు చిత్తశుద్ధి పొందిందని ఎలా తెలుస్తుంది? ఒక సూచన – వేదాంతంమీద శ్రద్ధ ఏర్పడుతుంది. అంతవరకూ వేదాంతం నేర్చుకుని ఏంలాభం పొందుతాము అనుకునే వ్యక్తి, ఇది నా సమస్యలను ఎలా పరిష్కరిస్తుంది అనుకునే మనిషి, తన సమస్యలకు ఆత్మ అజ్ఞానమే కారణమని తెలుసుకుంటాడు. మొదటి సూచన – వేదాంతం విలువ తెలుస్తుంది.

రెండవ సూచన – వేదాంతం అర్థమవుతుంది. అంతకుముందు వేదాంతం అంటే అర్థంకాని, కొరుకుడుపడని విషయం అనుకుంటాడు. మనలో ఒక నానుడి ఉంది, 'ఇదేమైనా బ్రహ్మవిద్యా?' ఎవరైనా ఏదైనా కష్టంగా ఉంది అంటే, తక్కినవారు ఏమంతకష్టం, ఇదేమైనా బ్రహ్మవిద్యా అంటారు. అంటే ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మజ్ఞానం పొందటం చాలా కష్టమనే అభిప్రాయం మనలో ఉంది. అది కష్టమే కాని అసాధ్యం కాదు. కష్టం ఎవరికి? సంసిద్ధత లేని మనస్సుకు. ఎప్పుడైతే కర్మయోగి జ్ఞానయోగ్యతను పొందుతాడో, అప్పుడు అతనికి వేదాంతం బాగా అర్థమవుతుంది. అతనికి అర్థమయింది అంటేనే అతను చిత్తశుద్ధిని పొందినట్టు అర్థం. చిత్తశుద్ధి సాధన చతుష్టయ సంపత్తిని ఇస్తుంది. దాన్ని యోగారూఢః అన్నాడు కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలో. అందువల్ల చిత్తశుద్ధి కలిగిందని తెలుసుకోవటానికి రెండు పరీక్షలు – వేదాంతం విలువ తెలుస్తుంది; వేదాంతం అర్థమవుతుంది.

**మేధావీ** – చిత్తశుద్ధి పొందితే కర్మలను తగ్గించుకుని, ఆ మిగిలిన సమయాన్ని వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు వినియోగించాలి. దీనికోసం అతను బాహ్యంగా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు. వివేక, వైరాగ్యాలు ఉంటే చాలు. అప్పుడు అతను మేధావీ అవుతాడు.

అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని శ్రవణంలో పొందుతాడు. మేధావీ పదం శ్రవణాన్ని సూచిస్తుంది.

**ఛిన్నసంశయః** – అహం బ్రహ్మ అస్మి కేవలం జ్ఞానంగా కాకుండా, లేదా ఉపనిషత్తుల్లో వచ్చిన వాక్యంగా కాకుండా, అది ఒక సత్యంగా మారుతుంది మననంలో. ఎండాకాలంలో ఎండ ఉండటం ఎంత సత్యమో, తను బ్రహ్మ అవటం అంత సత్యం అని జీర్ణించుకోగలుగుతాడు. శ్రవణంలో జ్ఞానాన్ని పొందితే, మననంలో అతనిలో ఉన్న సంశయాలు తొలగిపోతాయి. నిస్సంశయజ్ఞానం కలుగుతుంది. ఛిన్నసంశయః అంటే సంశయాలు తొలగిపోతాయి. ఛిన్నసంశయః పదం మననాన్ని సూచిస్తుంది.

అందువల్ల కర్మయోగంద్వారా జ్ఞానయోగ్యతను పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మననాలు చేసి, జ్ఞానాన్ని పొందుతాడు. మేధావీ – శ్రవణాన్ని; ఛిన్నసంశయః – మననాన్ని సూచిస్తాయని చూశాము. ఆ విధంగా కర్మయోగం జ్ఞానయోగానికి దారితీస్తే, జ్ఞానయోగం మోక్షానికి దారితీస్తుంది.

శ్లో. 11 **న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః ।**
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥**
న, హి, దేహభృతా, శక్యమ్, త్యక్తుమ్, కర్మాణి, అశేషతః,
యః, తు, కర్మఫలత్యాగీ, సః, త్యాగీ, ఇతి, అభిధీయతే ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | (తస్మాత్) | = అందుచేత |
| కర్మాణి | = కర్మలనన్నింటిని | యః | = ఏ పురుషుడు |
| అశేషతః | = సంపూర్ణముగా | కర్మఫలత్యాగీ | = కర్మఫలమును త్యజించువాడో |
| త్యక్తుమ్ | = త్యజించుటకు | సః, తు | = అతడే |
| దేహభృతా | = దేహధారియైన ఏ మనుష్యునకును | త్యాగీ, ఇతి | = నిజమైన 'త్యాగి' యని |
| న, శక్యమ్ | = సాధ్యముగాదు | అభిధీయతే | = పేర్కొనబడును |

**దేహ-భృతా అశేషతః కర్మాణి త్యక్తుమ్ న శక్యమ్,**
**యః తు హి కర్మ-ఫల-త్యాగీ సః త్యాగీ ఇతి అభిధీయతే ॥**

తా: ఎందుకంటే కర్మలనన్నింటిని సంపూర్ణముగా త్యజించుటకు దేహధారులకు సాధ్యముగాదు. అందుచేత ఏ పురుషుడు కర్మఫలమును త్యజించువాడో, అతడే నిజమైన 'త్యాగి' యని పేర్కొనబడును.

**కర్మయోగ కర్మలను త్యజించలేడు** – ముందేమన్నాము? కర్మయోగి కర్మలను త్యజించకూడదు అన్నాము; ఇప్పుడు ఏమంటున్నాము? కర్మయోగి కర్మలను త్యజించలేడు అంటున్నాము. ఎందుకంటే, మనం జీవించి ఉన్నన్నాళ్ళూ, ఏదో ఒక కర్మ చెయ్యకతప్పదు. శరీర ఆరోగ్యంకోసం అయినా స్నానాది కర్మలు చెయ్యాలి. అందువల్ల కృష్ణపరమాత్మ హెచ్చరిస్తున్నాడు. ఏమని?

**కర్మాణ్యశేషతః త్యక్తుం న శక్యమ్** – కర్మలను పూర్తిగా త్యజించటం ఎవరికీ సాధ్యంకాదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మహా అయితే మనం చేసే కర్మను మార్చగలము లేదా కొన్ని కర్మలను తగ్గించుకోగలము కాని పూర్తిగా అయితే కర్మలను త్యజించటం అసాధ్యం. మనం హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నామంటే, అన్నపానాదులు స్వీకరించ గలుగుతున్నామంటే దానికి పంచభూతాలకు ఋణపడివుండాలి. మనం దుస్తులు ధరిస్తున్నా, కంచంలో అన్నం వడ్డించుకున్నా దానివెనక ఎందరి సమిష్టికృషో ఉంది. చిన్మయానందస్వామి ఈ విషయాన్ని అద్భుతంగా చెబుతారు. మన జీవితంలో మనం జీవించివున్న ప్రతిక్షణమూ ఎవరో ఒకరికి ఋణపడివున్నాము. అందువల్ల మనిషిగా మన కర్తవ్యం మళ్ళీ మనం తిరిగిఇవ్వాలి. పంచమహాయజ్ఞాలనే ఇంకొకరకంగా చూస్తే పంచమహాఋణాలు అనవచ్చు. మనం దైవఋణం, ఋషిఋణం, పితృఋణం, మనిషిఋణం, భూతఋణం తీర్చుకోవాలి.

ఒక్క భగవద్గీతను నేర్చుకుంటున్నామంటేనే దైవం అయిన కృష్ణపరమాత్మకు, ఋషులైన వేదవ్యాసునకు, మన స్వామీజీకి, మనకు అందజేసిన పితృదేవతలకు, గీత ఆవిర్భావానికి మూలకారణమైన శ్రేష్ఠమైన పురుషపుంగవుడైన అర్జునునికీ, గీత పుస్తకానికి కాగితాలనిచ్చిన వృక్షాలకు ఋణపడి ఉన్నాము.ఒక కర్మలోనే ఎంతమందికి ఋణపడివున్నామో! అలాంటి ఎన్నో ఫలాలను మనం అనుభవిస్తున్నామంటే ఇంకెంతమందికి ఋణపడివుంటాము?

అందువల్ల, నేను సైతం అన్నట్టుగా మనవంతు సహాయం మనం తిరిగి చెయ్యాలి. అందువల్లనే కర్మను పూర్తిగా త్యజించటం అసాధ్యం అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని కర్మ చేస్తే ఫలం గురించిన ఆందోళన ఉంటుంది కదా, దాన్నెలా తప్పించుకోవటం?

**కర్మఫలత్యాగీ (భవ)** – నువ్వు చెయ్యాల్సిన కర్మను చెయ్యి, కాని ఫలాన్ని ఆశించకు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఫలాన్ని ఆశించకూడదు అంటే ఫలం గురించిన ఆందోళనను త్యజించాలి. చెప్పటం తేలికే, కాని ఆందోళనను త్యజించటం ఎలా? దీనికి కృష్ణపరమాత్మే రెండవ అధ్యాయంలో, మూడవ అధ్యాయంలో, మళ్ళీ తొమ్మిదవ అధ్యాయంలో కూడా పరిష్కారాన్ని చూపాడు. పరిష్కారాన్ని చూపాడు అనేకన్నా చూపిస్తూనే వస్తున్నాడు అనవచ్చు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

ఆందోళన పడకుండా ఉండాలంటే ఏంచెయ్యాలి? ఫలం ఏదొచ్చినా దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. భగవంతుడు ఏంచేసినా నా మేలుకోరి చేస్తాడు; నా యోగక్షేమాలు తనే చూసుకుంటానన్నాడు అనుకోగలగాలి.

లౌకికంగా విజయం సాధించలేకపోవచ్చు; జీవితంలో ఏదైనా నష్టపోవచ్చు కాని కర్మయోగం పాటిస్తే, అది ఆంతర ఎదుగుదలకు తోడ్పడుతుంది. అత్యంత క్లిష్టపరిస్థితి కూడా ఆంతర ఎదుగుదలకు తోడ్పడుతుంది. అందువల్ల భవిష్యత్తుమీద బెంగ ఉండకూడదంటే ఈశ్వరప్రసాదబుద్ధి కలిగివుండటమే మార్గము.

యస్తు కర్మఫలత్యాగీ – ఎవరైతే కర్మఫలం గురించిన ఆందోళనను త్యజిస్తాడో,

**సః త్యాగీ** – అతనే సాత్త్విక త్యాగి. అతనే కర్మయోగి.

శ్లో. 12 **అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥**

అనిష్టమ్, ఇష్టమ్, మిశ్రమ్, చ, త్రివిధమ్, కర్మణః, ఫలమ్,
భవతి, అత్యాగినామ్, ప్రేత్య, న, తు, సన్న్యాసినామ్, క్వచిత్ ॥

| | |
|---|---|
| అత్యాగినామ్ | = కర్మఫలత్యాగము చేయనివారి |
| కర్మణః | = కర్మ(ల)కు |
| ఇష్టమ్ | = మంచి |
| అనిష్టమ్ | = చెడు |
| చ | = ఇంకా |
| మిశ్రమ్ | = మంచి, చెడులతో కలిసినది |
| (ఇతి) | = అని |
| త్రివిధమ్, ఫలమ్ | = మూడు విధములైన ఫలములను |
| ప్రేత్య | = మరణానంతరము తప్పక |
| భవతి | = అనుభవింప వలసియుండును |
| తు | = అయితే |
| సన్న్యాసినామ్ | = కర్మఫలములను పూర్తిగా త్యాగము చేసినవారికి (కర్మ ఫలానుభవము) |
| క్వచిత్ | = ఏ కాలమునందును |
| న (భవతి) | = ఉండదు |

**అనిష్టమ్, ఇష్టమ్, మిశ్రమ్ చ (ఇతి) త్రివిధమ్ కర్మణః ఫలమ్**

**ప్రేత్య అత్యాగినామ్ భవతి, సంన్యాసినామ్ తు క్వచిత్ న (భవతి) ॥**

తా: కర్మఫలత్యాగము చేయనివారియొక్క కర్మ(ల)కు మంచి, చెడు ఇంకా మిశ్రము (మంచి, చెడులతో కలిసినది) అని మూడువిధములైన ఫలములు ఉంటాయి. ఇవి మరణానంతరము తప్పని సరిగా కర్మఫలత్యాగము చేయనివారు అనుభవింపవలసియుండును. అయితే కర్మఫలములను పూర్తిగా త్యాగము చేసినవారికి కర్మ ఫలానుభవము ఏ కాలమునందును ఉండదు.

**కర్మయోగి కాకపోతే కలిగే నష్టం** – ఒకవేళ కర్మయోగి కాకపోతే కలిగే నష్టమేమిటి? కర్మయోగి కాని వ్యక్తిని కర్మఠుడు అంటారు.

కర్మయోగి = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి

కాని ఇలా కర్మయోగి కానివ్యక్తికి భవిష్యత్తుమీద బెంగ ఉంటుంది. ముందేమవుతుందో అనే ఆందోళన ఉంటుంది. దానికోసం అతను విలువలకు విలువను ఇవ్వకుండా, అధర్మం వైపు తిరిగే ప్రమాదం ఉంది. అందువల్ల అతని కర్మలు మూడురకాల ఫలాలను ఇస్తాయి.

**అనిష్టమ్** – అనిష్టమ్ అంటే పాపఫలం. ఎందుకంటే అతను అధర్మానికి లొంగిపోవటమే కాక, కలియుగంలో ఇలాగే చెయ్యాలని వాదిస్తాడు. అలా తన అక్రమాలను సమర్థించుకుంటాడు.

**ఇష్టమ్** – ఇష్టమ్ అంటే పుణ్యఫలం.

**మిశ్రమ్** – మిశ్రమ్ అంటే పుణ్యపాపాల మిశ్రమఫలం. ఈ మూడు ఫలాలకు తగ్గట్టుగానే అతని పునర్జన్మ ఉంటుంది. అందువల్ల అతనికి పునరపి జననం, పునరపి మరణం ఉంటుంది. ఇది సంసారంలోకి వస్తుంది.

**ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।**

**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥** – 14.18

**త్రివిధం కర్మణః ఫలమ్** – ఇవి మూడురకాల సంసారం. ఎవరికి?

**అత్యాగినామ్ భవతి** – త్యాగి అంటే కర్మయోగి; అత్యాగి అంటే కర్మయోగి కానివ్యక్తి; అంటే కర్మఠుడు. ఇతనికి మూడు ఫలాలు వస్తాయి. అంటే మూడురకాల పునర్జన్మలు ఉంటాయి. ఎప్పుడు?

**ప్రేత్య** – మరణించాక.

జీవించివుండగా మూడురకాల ఫలాలు పొందుతాడు. అవి సుఖం, దుఃఖం, మిశ్రమఫలం. క్రికెట్ ఆటలో ఒక క్రీడాకారుడు ఎప్పట్నుంచో ఎదురుచూసిన సెంచరీ కొట్టాడు. అంతకుముందు సెంచరీ దగ్గరికి వచ్చి అవుటయి పోయేవాడు. ఇప్పుడు సెంచరీ కొట్టాడు. అయినా ఆ మ్యాచ్‌లో వారి టీమ్ గెలవలేదు. అప్పుడు అతనికి సెంచరీ కొట్టినందుకు ఆనందంగా ఉంటుందా, వారి జట్టు ఓడిపోయినందుకు బాధగా ఉంటుందా? మిశ్రమభావన ఉంటుంది. కొందరు ఏడుస్తారు, కొందరు నవ్వుతారు, కొందరు ఏడుస్తూ నవ్వుతారు.

అలాగే మరణించాక కూడా పద్నాలుగవ అధ్యాయంలో చూసినట్టుగా ఊర్ధ్వలోకానికో, మధ్యలోకానికో, అధోలోకానికో వెళతాడు.

**న తు సన్న్యాసినాం క్వచిత్** – కాని కర్మయోగికి పునర్జన్మ ఉండదు. సన్న్యాసి అంటే సాత్త్విక సన్న్యాసి లేదా కర్మయోగి. ఎందుకు? కర్మయోగి చిత్తశుద్ధి పొందుతాడు; చిత్తశుద్ధి గురుప్రాప్తిని కలుగజేస్తుంది; గురుప్రాప్తి జ్ఞానప్రాప్తికి దారితీస్తుంది; జ్ఞానప్రాప్తి మోక్షప్రాప్తికి దారితీస్తుంది. గురువుద్వారా శాస్త్రాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి, మోక్షం పొందుతాడు. అందువల్ల కర్మయోగికి పరంపరగా మోక్షం వస్తుంది. సాక్షాత్ మోక్షం రాదు. చిత్తశుద్ధి, గురువు, జ్ఞానం అనే దశలు దాటాలి మోక్షం రావటానికి.

ఈ విధంగా ఈ పన్నెండవ శ్లోకంతో కృష్ణపరమాత్మ అర్జునుని ప్రశ్నకు సందేహం తీర్చాడు. అర్జునుని ప్రశ్న– సన్న్యాసికి, త్యాగికి మధ్య ఉన్న సూక్ష్మభేదం చెప్పు అన్నాడు. సన్న్యాసి, త్యాగి, కర్మయోగి అన్నీ ఒకటే అన్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ అర్జునునికి సన్న్యాసియొక్క సాంప్రదాయ అర్థం ఇవ్వకుండా కర్మయోగం అని చెప్పాడు. అంటే ఆంతర సన్న్యాసం అన్నాడు. అందువల్ల అర్జునుడు కిందికి జారవిడిచిన గాండీవాన్ని తీసుకుని యుద్ధం చెయ్యాలి.

దీనితో ఈ అధ్యాయంలోని మొదటి అంశం అయిపోయింది. అది **సాత్త్విక సన్న్యాసయోగము**. అది కర్మయోగానికి ఇంకొకపేరు అని చూశాము. ఇప్పటిదాకా కర్మయోగం అయింది, ఇప్పుడు జ్ఞానయోగం గురించి చెప్పబోతున్నాడు.

### 2. జ్ఞానయోగము – శ్లోకాలు: 13–17– విశ్లేషణ

సంసిద్ధత పొందని మనస్సు ఉన్నవారు కర్మయోగాన్ని పాటించితీరాలి. కర్మయోగాన్ని పద్దెనిమిదవ అధ్యాయంలో సాత్త్విక సన్న్యాసం అన్నాడు కృష్ణపరమాత్మ. సాధకుడు కర్మయోగాన్ని పాటిస్తే అతనికి చిత్తశుద్ధి కలిగి, జ్ఞానయోగ్యత వస్తుంది. ఆ విధంగా కర్మయోగం మార్గం, జ్ఞానయోగం లక్ష్యం అవుతుంది. అందువల్ల కర్మయోగంనుంచి జ్ఞానయోగానికి వచ్చి, మోక్షం పొందాలి. ఆ విధంగా మొత్తం ఆధ్యాత్మిక పయనం రెండు దశల్లో సాగుతుంది. మొదటిదశ కర్మయోగం. అది జ్ఞానయోగానికి సంసిద్ధులను చేస్తుంది; తర్వాత జ్ఞానయోగానికి వచ్చి మోక్షం పొందాలి.

ఇప్పుడు శ్లోకాలు 13–17లో జ్ఞానయోగం గురించి చూస్తాము. ఇది ఆధ్యాత్మిక సాధనలో చివరిదశ. కాకపోతే ఇది జ్ఞానయోగం యొక్క సంక్షిప్తవర్ణన అనే విషయం మర్చిపోకూడదు. మొత్తం పద్దెనిమిదవ అధ్యాయాన్నే ఇంతవరకూ గీతలో వచ్చిన అంశాలన్నింటి ఉపసంహారం కింద కృష్ణపరమాత్మ సంక్షిప్తంగా చెబుతున్నాడు.

జ్ఞానయోగాన్ని అనేక అధ్యాయాల్లో చూశాము.

అధ్యాయం 2 – శ్లోకాలు 12–25
అధ్యాయం 4 – శ్లోకాలు 18–25
అధ్యాయం 5 – శ్లోకాలు 13–31

ఇప్పుడు వాటి సారాన్ని ఇవ్వబోతున్నాడు. ఆ శ్లోకాల్లోకి వెళ్ళబోయేముందు ఒకసారి జ్ఞానయోగసారాన్ని చూద్దాము.

జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానం పొందటం. మామూలుగా జ్ఞానం అంటే ఏ సబ్జెక్టు గురించిన జ్ఞానమైనా అవచ్చు. అంటే అది ఫిజిక్స్ జ్ఞానం అవచ్చు లేదా కెమిస్ట్రీ జ్ఞానం అవచ్చు; కాని భగవద్గీతలో జ్ఞానం అన్న పదం వచ్చినప్పుడు అది ఆత్మజ్ఞానాన్నే సూచిస్తుంది. జ్ఞానయోగంలో దశలు చూద్దాము.

1. **ఆత్మ–అనాత్మ వివేకం** – ప్రతివ్యక్తిలోనూ రెండు అంశాలు ఉంటాయి. అవి అచేతన అంశ, చేతన అంశ. దీన్నే జడం–చైతన్యం అంటారు లేదా అనాత్మ–ఆత్మ అంటారు. మనమంతా ఆత్మ అనాత్మల మేలుకలయిక. కాని సాధారణంగా ఇలా మనం అనాత్మ–ఆత్మల మేలుకలయిక అని గుర్తించము. ఎందుకంటే జడ అంశ మాత్రం మనకు కనబడుతుంది, తెలుస్తుంది; చేతన అంశ కనబడదు, అందుకని మనకు తెలియదు.

ఈ గదిలో ఒక బల్బు వెలుగుతోందంటే దానికి కారణం దానిలో ఉన్న రెండు అంశాలు. ఒకటి కనబడే బల్బు. ఇంకొకటి కనబడని విద్యుచ్ఛక్తి. ఆ కనబడని విద్యుచ్ఛక్తివల్లనే ఈ బల్బు ప్రకాశించగలుగుతున్నది. అంటే బల్బులో కనబడని అంశ, కనబడే అంశ – రెండూ ఉన్నాయి. రెండూ కలిసి అది కాంతి అయింది.

అలాగే మనలో కూడా కనబడే శరీరం, కనబడని చైతన్యం ఉన్నాయి. విద్యుచ్ఛక్తివల్లనే బల్బు ప్రకాశిస్తున్నట్టుగా, చైతన్యం వల్లనే మన శరీరం చైతన్యవంతం అవుతున్నది. కనబడని చైతన్యాన్ని ఆత్మ అంశ అనీ, కనబడే శరీరాన్ని అనాత్మ అంశ అనీ అంటారు. అందువల్ల ఆత్మజ్ఞానంలో మొట్టమొదటి దశ మనం ఇలా రెండుభాగాల మిశ్రమమనీ, వాటిని ఆత్మ, అనాత్మ అంటారనీ తెలుసుకోవటం. దీన్ని **ఆత్మ–అనాత్మ వివేకం** అంటారు.

2. **ఆత్మ వైపుకు దృష్టి మరల్చటం** – ఆత్మ–అనాత్మలు రెండూ ఉన్నాయని తెలుసుకున్నాక, వాటి లక్షణాలు ఏమిటో తెలుసుకోవాలి. ముందుగా ఆత్మ లక్షణాలు చూద్దాము. ఆత్మ అన్నా, చైతన్యం అన్నా ఒకటే. చైతన్యం లక్షణాలు ఐదు ఉన్నాయి. అవి –

1. చైతన్యం శరీరంలో ఒకభాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరమంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

చైతన్యాన్ని ఆత్మ అంటారు. ఆత్మజ్ఞానంలో మొదటిదశ నేను ఆత్మ–అనాత్మల మేలుకలయికను అని నేర్చుకోవటం.

తర్వాత ఈ ఆత్మయొక్క ఐదు లక్షణాలనూ నేర్చుకున్నాక, క్రమంగా ఆత్మవైపు మొగ్గాలి. నేను జడమైన అనాత్మను కాను; నేను చైతన్యమైన ఆత్మను అని అర్థం చేసుకోవాలి. ఎందుకలా తెలుసుకోవాలి? నేను శరీరం అనుకుంటే తప్పేమిటి? ఎందుకంటే ఈ శరీరం శాశ్వతం కాదు. మనం వేసుకునే దుస్తులను కొంతకాలమే వాడి,

అవి పాడయ్యాక ఎలాగైతే వాటిని పారేస్తామో, అదేవిధంగా ఈ శరీరం కూడా ఆత్మ అయిన నాకు ఇవ్వబడిన తొడుగు. దాన్ని నా ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ వాడుకుని, తర్వాత ఈ శరీరాన్ని భగవంతునికి అప్పజెప్పాలి. అటువంటి అశాశ్వతమైన శరీరంమీద మమకారం పెంచుకుంటే, అది బాధకు దారితీస్తుంది. అందువల్ల ముందు జాగ్రత్తగా నేను వ్యవహారం నడపటానికి భగవంతుడు నాకు తాత్కాలికంగా ఈ శరీరాన్ని కానుకగా ఇచ్చాడు; నేను ఈ శరీరంలో ఉన్న శరీరిని అని అర్థం చేసుకోవాలి.

ఆత్మజ్ఞానంలో రెండవదశ అనాత్మనుంచి ఆత్మవైపు దృష్టి మరల్చటం.

ఈ విషయం అర్థం చేసుకోవటానికి మనం వేదాంత శ్రవణం చెయ్యాలి. శ్రవణం అంటే వేదాంతశాస్త్రాన్ని గురువుద్వారా నేర్చుకోవటం. శాస్త్రం నేను అనాత్మ కాదు, ఆత్మ అని నేర్పిస్తుంది. ఆత్మజ్ఞానం పొందటానికి శ్రవణం ఒక్కటే చాలదు. శ్రవణం అజ్ఞాన నివృత్తి చేస్తే, మననం సంశయనివృత్తి చేస్తే, నిదిధ్యాసనం విపర్యయనివృత్తి చేస్తుంది. విపర్యయనివృత్తి అంటే మనలో ఇన్నాళ్ళూ పాతుకుపోయిన విపరీతభావనలను పోగొడుతుంది.

ఇన్నాళ్ళూ నేను శరీరాన్ని అనీ, ఫలానా రోజున పుట్టాననీ, నాకు వయస్సు పైబడుతోందనీ, నాకు మరణం ఆసన్నమయిందనీ భావిస్తూ వచ్చాను. ఈ చివరి దశలకు వచ్చేసరికి భయం ఇంకా ఎక్కువ అవుతుంది. అందువల్ల భయం పారద్రోలాలంటే, నేను అశాశ్వతమైన శరీరాన్ని కాను, నేను శాశ్వతమైన ఆత్మను అనే సత్యంలో నెలకొని ఉండాలి. దానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది.

శ్రవణంలో నేర్చుకున్న ఆత్మ లక్షణాలను నాకు అన్వయించుకుని, వాటిమీద ధ్యానం చెయ్యాలి నిదిధ్యాసనంలో. ఉదాహరణకు అంతకు ముందు చైతన్యం స్వతంత్ర వస్తువు. అది మనసంతటా వ్యాపించి, మనస్సును ప్రకాశింప జేస్తుందని నేర్చుకున్నాను. ఇప్పుడు నిదిధ్యాసనంలో చైతన్యం పదం తీసేసి, నేను అని పెట్టుకోవాలి. అంటే నేను స్వతంత్రవస్తువును. నేను మనస్సంతా వ్యాపించి, మనస్సును ప్రకాశింపజేస్తాను అని ధ్యానం చెయ్యాలి. అలా చైతన్యంయొక్క ఐదు అంశాలను నాకు అన్వయించుకోవాలి. అంతేకాదు చైతన్యం లేదా ఆత్మ గురించి నేర్చుకున్న అనేక నిర్వచనాలను, నాకు అన్వయించుకోవాలి. లేకపోతే నేను వేరు, ఆత్మ వేరు అనుకుంటాను. ముఖ్యంగా ఆత్మ **అకర్తా, అభోక్తా** విషయంమీద ధ్యానం చెయ్యాలి. ఈ విషయాన్ని కృష్ణపరమాత్మ రెండు, మూడు, ఐదవ అధ్యాయాల్లో బోధించాడు.

**వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥** – 2.21

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ॥** – 3.27

**తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥** – 3.28

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – 5.8

అలా చాలా అధ్యాయాల్లో కృష్ణపరమాత్మ ఆత్మస్వరూపాన్ని బోధించాడు. అందులో అర్జునా, ఆత్మవైన నువ్వు అకర్తా, అభోక్తా అన్నాడు. కర్త అంటే కర్మలను చేసేవ్యక్తి; భోక్త అంటే కర్మఫలాలను అనుభవించేవ్యక్తి. నేను కర్తా, భోక్తాను అనుకున్నంతవరకూ నేను సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటూనే ఉంటాను.

**కర్త** – కర్తగా నేను ఏపని చేసినా నాకు పూర్తి తృప్తి కలగదు. అందువల్ల నిరంతరం నన్ను అపరాధభావన వెంటాడుతూనే ఉంటుంది. ఈ పనిని ఇంకా బాగా చేసివుండవచ్చు అనే భావన ఎప్పుడూ ఉంటుంది. స్కూల్లో ఉన్నప్పటినుంచే ఈ అపరాధభావన మొదలవుతుంది. నేను పరీక్షలో అన్నీ బాగా రాశాను కానీ, రెండు మార్కుల ప్రశ్న ఒకదాన్ని వదిలేశాను. ఈ కానీ; వెంటాడుతూనే ఉంటుంది. కానీ వస్తే అపరాధభావన వస్తుంది. అది మనస్సును తొలిచేస్తుంది.

వయస్సు పెరిగేకొద్దీ గత 50, 60, 70 సంవత్సరాలలో గడిచిన అనుభవాలన్నీ వాసనల రూపంలో మన మనస్సులో నిక్షిప్తమై ఉంటాయి. ఒమిషన్స్ అండ్ కమిషన్స్ అంటారు ఇంగ్లీషులో. మనం చెయ్యకుండా వదిలేసినవి ఒమిషన్స్; చేసినవి కమిషన్స్. చెయ్యనివి ఎందుకు చెయ్యలేదనే పశ్చాత్తాపం, చేసినవి అలా ఎందుకు చేశాననే అపరాధభావం.

నా తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోలేదనే బాధ; నా భార్యను అలా బాధపెట్టాను అనే అపరాధభావన; పిల్లలను సరిగ్గా పెంచలేదని ఇంకో బాధ. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో, ఎన్నెన్నో! చివరికి ఇవి మర్చిపోదామని గీతాబోధకు వెళ్ళినా ఈ అపరాధభావన వెంటాడటం మానదు. కాలేజీలో సంస్కృతం తీసుకుని ఉంటే ఇప్పుడు నాకు ఉపయోగకరంగా ఉండేది కదా అనే బాధ.

ఇలాంటి బాధలన్నిటినీ మనతోపాటు పెంచిపోషిస్తాము. కర్తగా ఉంటే ఈ అపరాధభావనను తప్పించుకోలేను నేను. నేనే కాదు, మానవమాత్రుడెవరూ ఈ అపరాధభావనను తప్పించుకోలేడు. ఎందుకంటే ఎవరూ ఏ పనినీ నూటికి నూరుపాళ్ళు దోషరహితంగా చెయ్యలేరు. ఒక్క భగవానునికే ఈ అపరాధభావన ఉండదు. ఎందుకంటే ఆయన సర్వజ్ఞుడు కాబట్టి, ఏ పనిని చేసినా లొసుగులేకుండా చెయ్యగలడు. మనదేమో మిడిమిడిజ్ఞానం. ఏ విషయం కూడా పరిపూర్ణంగా తెలియదు. ఉన్న ఈ కాస్త జ్ఞానంతో మనం తీసుకునే నిర్ణయం, చేసే కర్మ ఎంతవరకూ సమంజసమో తెలియదు. ఈ రోజుల్లో కొంతమంది పెళ్ళి చేసుకునేదాకా తపన పడతారు; తీరా పెళ్ళయ్యాక ఎన్నాళ్ళు కలిసివుంటారో చెప్పలేని పరిస్థితి ఏర్పడుతున్నది. అందువల్ల కర్త అయితే సంసారం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**భోక్త** – సంసారానికి ఇంకొక కారణం నేను భోక్తను అనుకోవటం. భోక్త అంటే కర్మఫలాన్ని అనుభవించటం. భోక్తగా కూడా నేను ప్రశాంతంగా ఉండలేను. ఎందుకంటే నేను చేసిన కర్మకు ప్రతిఫలం ఏంవస్తుందో తెలియదు. నేను ఏపని చేసినా దాన్ని ఎన్నుకునే హక్కు, నా ఫ్రీవిల్‌ను ఉపయోగించి, నాకు కావాల్సినట్టుగా చేసే అవకాశం

నాకు ఉన్నాయని తెలుసు. కాని అదే సమయంలో నా ప్రారబ్ధకర్మ ఎలా ఉందో తెలియదు. కాబట్టి నేను ఆశించిన ఫలం వస్తుందో రాదో తెలియదు. రేపు పొద్దున్న లేస్తే, ఏమవుతుందో తెలియదు. ఆమాటకొస్తే రేపు పొద్దున్న లేస్తానో లేదో కూడా తెలియదు. అదే పెద్ద ప్రశ్న.

భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి, భోక్తగా కూడా నేను బెంగ, ఆందోళన, భయాలను పారద్రోలలేను. కర్తగా ఉంటే అపరాధభావన; భోక్తగా ఉంటే ఆందోళన. అంటే ఈ రెండింటిలో ఏదో ఒకటి అవుతూనే ఉంటాయి కాబట్టి, జీవితంలో ఈ రెండు అలలూ నన్ను బాధించకతప్పదు. అవి అపరాధభావన, ఆందోళన. ఇంక వేరే ఏ భావనను తీసుకున్నా, అవన్నీ ఈ రెండింటినుంచి పుట్టిన భావనలే.

ఈ అపరాధభావన, ఆందోళనలనుంచి మోక్షం పొందాలంటే ఈ కర్తృత్వ-భోక్తృత్వ భావనలనుంచి బయట పడాలి. నేను కర్త కాదు – భోక్త కాదని తెలుసుకోవాలి. కర్తృత్వ-భోక్తృత్వ భావనలనుంచి బయటపడాలంటే నేను నా ఉన్నతస్థాయికి ఎదగాలి. **ఆత్మ అకర్తా, అభోక్తా.** ఈ అధ్యాయంలో శ్లోకాలు 13-17లో కృష్ణపరమాత్మ ఆత్మ అకర్తా, అభోక్తా అని నిరూపించబోతున్నాడు.

ఆత్మ అకర్తా అభోక్తా అని ఎలా నిరూపించగలడు? కర్మలు చేసేది, వాటి ఫలాలను పొందేది అనాత్మ అని నిరూపించటంద్వారా. అనాత్మే కర్మలు చేస్తోంది అంటే దాని అర్థం ఆత్మ ఏమీ చెయ్యదని. ఈ గదిలో ఉన్న దీపంలాగా అన్నమాట. ఈ గదిలో ఉన్న నేను అనేక పనులను చేస్తున్నాను. రాస్తున్నాను, మాట్లాడుతున్నాను, చేతులు, కాళ్ళను కదుపుతున్నాను – ఇవన్నీ దేనికి చెందినవి? శరీరానికి చెందినవి. శరీరం అనాత్మ. నేను శరీరపరంగా చేస్తున్న ఈ కర్మలన్నింటినీ కాంతి ప్రకాశింపజేస్తోంది కాని, కాంతి తనంతట తాను ఏపనినీ చెయ్యదు. అలాగే అనాత్మ పనులన్నీ చేస్తుంది కాని ఆత్మ ఏపనీ చెయ్యదు. ఈ విషయం మూడవ అధ్యాయంలో కూడా చెప్పాడు కృష్ణపరమాత్మ.

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।** – 3.27

ఈ అనాత్మను కృష్ణపరమాత్మ ఐదుభాగాలుగా విభజించాడు. అంటే ఈ పంచాత్మక అనాత్మ లేదా పంచాత్మక ప్రకృతే పనులు చేస్తున్నది కాని, ఆత్మ చెయ్యదు. అనాత్మకు చెందిన ఆ ఐదు ఇవి – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, దైవం.

ఇక్కడితో జ్ఞానయోగం – విశ్లేషణ అయిపోయింది.

శ్లో. 13 **పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।**
**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥**
పంచ, ఏతాని, మహాబాహో, కారణాని, నిబోధ, మే,
సాంఖ్యే, కృతాంతే, ప్రోక్తాని, సిద్ధయే, సర్వకర్మణామ్ ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో! | = ఓ మహాబాహూ! | సాంఖ్యే | = సాంఖ్యశాస్త్రమందు |
| సర్వకర్మణామ్ | = సమస్త కర్మలయొక్క | ప్రోక్తాని | = చెప్పబడినవి |
| సిద్ధయే | = సిద్ధికి | (తాని) | = (వాటిని) |
| ఏతాని, పంచ | = ఈ ఐదును | మే | = నానుండి |
| కారణాని | = హేతువులు (అని) | నిబోధ | = తెలుసుకొనుము |
| కృతాంతే | = కర్మలను అంతముచేయు ఉపాయములను తెలియచేసే | | |

**హే మహా–బాహో! సర్వ–కర్మణామ్ సిద్ధయే కృత–అన్తే సాంఖ్యే**
**ప్రోక్తాని ఏతాని పఞ్చ కారణాని మే నిబోధ ॥**

తా: ఓ మహాబాహూ! సమస్త కర్మలయొక్క సిద్ధికి ఈ ఐదును హేతువులు అని, కర్మలను అంతముచేయు ఉపాయములను తెలియచేసే సాంఖ్యశాస్త్రమందు చెప్పబడినవి. వాటిని నానుండి తెలుసుకొనుము.

**జ్ఞానయోగం – శ్లోకాలు: 13–17**

జ్ఞానయోగం గురించి ఇంతకుముందు చూసిన విశ్లేషణతో ఈ శ్లోకాలను చూద్దాము.

**మహాబాహో** – ఓ అర్జునా! మహాబాహో అంటే గొప్పయోధుడు, బాహుబలం ఉన్న యోధుడు అని అర్థం.

**మే నిబోధ** – నానుంచి నువ్వు నేర్చుకోగాక! నిబోధ అంటే నేర్చుకో, అర్థం చేసుకో, జీర్ణించుకో అని అర్థం. ఏం నేర్చుకోవాలి?

**పంచ ఏతాని కారణాని** – కర్మ చేసేందుకు తోడ్పడే ఐదు పరికరాలను నేర్చుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. కారణాని అంటే పరికరాలు, అంశాలు. ఏతాని – తర్వాత చెప్పబోతున్నాడు. అంటే నేను చెప్పబోయే ఈ ఐదు పరికరాలను గురించి నేర్చుకుందువు గాక. అవే కర్మలు చేస్తాయి. అవి అనాత్మలోకి వస్తాయి.

ఈ ఐదు పరికరాల గురించి ఎక్కడ చెప్పబడింది? ఉపనిషత్తులో చెప్పబడింది. కృష్ణపరమాత్మ ఎక్కడ్నుంచి ఈ సమాచారాన్ని పొందాడో ఆ విషయం స్పష్టం చెయ్యదలుచుకున్నాడు. భగవద్గీతను ఉపనిషత్తుల సారంగా ప్రతి అధ్యాయము చివరా చూస్తూనే ఉన్నాము. సందర్భం దొరికినప్పుడల్లా కృష్ణపరమాత్మ కూడా ఆ విషయాన్ని గుర్తు చేస్తూనే ఉన్నాడు. ఇది నా స్వంతం కాదు, ఇది ఉపనిషత్తుల సారం అని చెబుతూనే ఉన్నాడు. కృష్ణపరమాత్మ కన్నా ఎంతో ముందుకాలంలోనే ఉన్నాయి వేదాలు. కృష్ణపరమాత్మ ద్వాపరయుగానికి చెందిన భగవానుడు. వేదాలు అంతకన్నా పురాతనమైనవి. వేదాంతం, వేదంలో ఒకభాగం. వేదాంతంలో చెప్పబడినది నేను తీసుకున్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని** – ఇది వేదాంతంలో చెప్పబడింది. ప్రోక్తాని అంటే చెప్పబడింది. ఎక్కడ? సాంఖ్యే – సాంఖ్యం అంటే వేదాంతం. వేదాంతం అంటే ఏమిటి? వేదం యొక్క అంతభాగం. వేదాంతాన్నే ఉపనిషత్తులు అని కూడా అంటారు. అందువల్ల నాకు వేదాంతాన్నీ, ఉపనిషత్తులనూ రెండింటినీ నేర్చుకోవాలని ఉంది అనకూడదు.

వేదాంతానికే ఇంకోపేరు ఉపనిషత్తు. వేదాంతం ఎక్కడుంది? కృతాంతే – కర్మకాండ చివర్లో ఉంది. కృతమ్ అంటే కర్మకాండ; అంతం అంటే చివర్లో. కృతాంతే అంటే కర్మకాండ చివర్లో వేదాంతం ఉంది. వేదాలను రెండు భాగాలుగా విభజిస్తారు. అవి వేద పూర్వభాగం, వేద అంతఃభాగం. వేద పూర్వభాగాన్ని కర్మకాండ అనీ, వేద అంతఃభాగాన్ని జ్ఞానకాండ అనికూడా అంటారు. అటువంటి వేదాంతంలో ఈ ఐదు పరికరాలు చెప్పబడ్డాయి. ఈ పరికరాలు ఎందుకు ఉపయోగపడతాయి?

**సర్వకర్మణామ్ సిద్ధయే** – సమస్త కర్మలను చెయ్యటానికి ఉపయోగపడతాయి. ఏ కర్మలు చెయ్యాలన్నా కూడా ఈ ఐదు అంశాలూ కావాలి. అవి తప్పనిసరి. ముందుగా ఐదు పరికరాలు కావాలని కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో వాటిని పరిచయం చేసి, అవేమిటో రాబోయే శ్లోకంలో చెప్పబోతున్నాడు.

శ్లో. 14 **అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।**
**వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥**
అధిష్ఠానమ్, తథా, కర్తా, కరణమ్, చ, పృథగ్విధమ్,
వివిధాః, చ, పృథక్, చేష్టాః, దైవమ్, చ, ఏవ, అత్ర, పంచమమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అత్ర | = ఈ విషయమున (కర్మ సంసిద్ధియందు) | వివిధాః | = వివిధములైన |
| అధిష్ఠానమ్ | = అధిష్ఠానము | పృథక్, చేష్టాః | = వేర్వేరు చేష్టలు |
| చ | = ఇంకా | తథా, ఏవ | = ఆ విధముగనే |
| కర్తా, చ | = కర్తయును | పంచమమ్ | = ఐదవదియగు |
| పృథగ్విధమ్ | = వివిధములైన | దైవమ్ | = దైవము (అను ఐదును హేతువులు) |
| కరణమ్ | = సాధనములును | | |
| చ | = ఇంకా | | |

**అధిష్ఠానమ్, తథా, కర్తా చ, పృథక్–విధమ్ కరణమ్ చ,**
**వివిధాః పృథక్ చేష్టాః అత్ర దైవమ్ పఞ్చమమ్ ఏవ (భవతి) ॥**

తా: ఈ విషయమున (కర్మ సంసిద్ధియందు) అధిష్ఠానము ఇంకా కర్తయును, వివిధములైన సాధనములును ఇంకా వివిధములైన వేర్వేరు చేష్టలు, ఆ విధముగనే ఐదవదియగు దైవము అను ఐదును హేతువులు.

ఏమిటా ఐదు అంశాలు? మొదటి నాలుగు అంశాలను నాలుగు కోశాలుగా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అవి – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం; అయిదవది దైవం.

1. **అన్నమయకోశం – ఆహారం (అనాటమీ)** – అన్నమయకోశం లేదా స్థూలశరీరాన్ని అనాటమీగా అభివర్ణించవచ్చు. శరీరాకృతి, స్థూలశరీరంలోని అనేక అంగాలు, అనేక భాగాలను అన్నమయకోశం అంటారు. ఇది అన్నం లేదా ఆహారంనుంచి శక్తి పొందుతుంది కాబట్టి దీన్ని అన్నమయకోశం అంటారు.

2. **ప్రాణమయకోశం – శక్తి (ఫిజియోలజీ)** – ఇది ఫిజియోలాజికల్ వ్యవస్థకు చెందినది. అనాటమీ శరీరంలోని వివిధభాగాలను సూచిస్తే, ఫిజియోలజీ వాటి ధర్మాలను వివరిస్తుంది. కేవలం అన్నమయకోశం ఉంటే ఆ జీవిలో ప్రాణం ఉన్నట్టు అవదు. శవంలో కూడా ఈ స్థూలశరీరం ఉంటుంది కాని అది పనులను చెయ్యలేదు. ప్రాణం ఉందో లేదో చూడటానికి ముక్కు కింద వేలుపెట్టి చూస్తారు. ఇది ఫిజియోలజీ కింద వస్తుంది. అందువల్ల ప్రాణమయకోశాన్ని క్రియాశక్తి అనికూడా అంటారు.

ప్రాణమయకోశంలోకి పంచప్రాణాలు, పంచ కర్మేంద్రియాలు వస్తాయి. పంచప్రాణాలు శక్తినిస్తే, పంచ కర్మేంద్రియాలు పరికరాలనిస్తాయి. రెండింటినీ కలిపి క్రియాశక్తి అంటారు. కేవలం అన్నమయకోశం ఉంటే దానిలో జీర్ణక్రియ, రక్తప్రసరణక్రియ వంటి క్రియలు జరగవు. కేవలం ప్రాణమయకోశం ఉన్నా, అది క్రియలను జరపలేదు. అందువల్ల రెండూ ఉండాలి.

ప్రాణమయకోశం శ్వాసక్రియను చేస్తుంది. అది మామూలుగా ఉంటే తక్కిన పనులను చెయ్యవచ్చు. ఆస్తమా రోగికి శ్వాస పీల్చుకోవటమే కష్టం. అటువంటి వ్యక్తిని ఏంచేస్తున్నావు అని అడిగితే, శ్వాస పీలుస్తున్నాను అంటాడు. ప్రాణమయకోశం శ్వాసక్రియకు తోడ్పడుతుంది.

3. **మనోమయకోశం – మనస్సు (సైకాలజీ)** – దీన్ని సైకలాజికల్ వ్యవస్థ అనవచ్చు. భావాలు, సందేహాలు అన్నీ మనోమయకోశంలోకి వస్తాయి. దీన్ని ఇచ్ఛాశక్తి అంటారు. క్రియాశక్తికి ముందు ఇచ్ఛాశక్తి ఉంటుంది. ఎందుకంటే కోరిక ఉంటే క్రియ చెయ్యాలనిపిస్తుంది. అందువల్ల మనోమయకోశం ప్రాణమయకోశాన్ని పనిచెయ్యటానికి ఉసిగొల్పుతుంది. ఇందులో ఆరు అంగాలు ఉన్నాయి. అవి పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు, (చిత్తం, అహంకారాలతో కూడిన మనస్సు). ఈ మనస్సులో అనేక భావోద్రేకాలు కలుగుతాయి. ప్రేమ, దయ, ఈర్ష్య, ద్వేషం, కోపం. ఈ భావాలే మనను పనికి ఉసిగొల్పుతాయి.

4. **విజ్ఞానమయకోశం – జ్ఞానం (ఇంటలెక్ట్)** – ఇది నేర్చుకునే స్థాయి. మనోమయకోశం ఇచ్ఛాశక్తికి సంబంధించినదైతే, విజ్ఞానమయకోశం జ్ఞానశక్తికి సంబంధించినది. ఇంకోవిధంగా చెప్పాలంటే విజ్ఞానమయకోశం తెలుసుకుంటుంది; మనోమయకోశం కోరుతుంది; ప్రాణమయకోశం పనిచేస్తుంది. ఈ మూడింటినీ కలిపి జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి అంటారు.

ఇందులో కూడా ఆరు అంగాలు ఉన్నాయి. అవి – పంచజ్ఞానేంద్రియాలు, బుద్ధి (చిత్తం, అహంకారాలతో కూడిన బుద్ధి).

మీ ఉద్యోగధర్మంలో మీపై అధికారి మిమ్మల్ని అనవసరంగా తిడితే, మీ మనోమయకోశం దెబ్బతింటుంది. కోపం, అసహనం కలుగుతాయి; తిరిగి అరవాలనిపించేలా చేస్తుంది. కాని విజ్ఞానమయకోశం మనస్సును బుజ్జగిస్తుంది. అలా అరిస్తే నీ ఉద్యోగం పోతుంది; ఉద్యోగం పోతే నీ కుటుంబాన్ని పోషించటం కష్టం; జాగ్రత్త అని హెచ్చరిస్తుంది. అందువల్ల మనస్సు చేసేదేంలేక ఆ అధికారిని తనలోనే కసితీరా తిట్టుకుంటుంది. అలా భావోద్రేకాలను వెలిబుచ్చలేకపోవటంవల్లనే గుండెకు చాలా తాకిడి ఏర్పడుతుంది.

ఒక ఆఫీసులో ఒక గదిలో ఆ ఆఫీసు డైరక్టరు విగ్రహాన్ని పెడతారుట. ఎవరైనా ఉద్యోగికి ఆ డైరక్టరుమీద కోపంవస్తే, అతను ఆ గదిలోకి వెళ్ళి తనివితీరా ఆయన్ని తిట్టీ, కొట్టీ రావచ్చుట. కొంత బరువు దించుకోవటానికి అది యాజమాన్యం చేసిన ఏర్పాటు. కొన్నిచోట్ల వారికి నచ్చని నాయకుల చిత్రపటాలను కాలుస్తారు కదా. ఇవన్నీ భావోద్రేకాలు వెలిబుచ్చే మార్గాలు.

**ఆనందమయకోశం – (హ్యాపినెస్)** – ఇది కారణశరీరానికి సరిపోలుతుంది. దీన్ని అంతఃచేతనంతో పోల్చవచ్చు. మనలో ఏ భావాలు ప్రస్ఫుటంగా ఉంటాయో, మన ప్రవర్తన, స్వభావం అంతా వాటి ప్రకారం ఉంటాయి. దీన్ని అంతఃచేతనం అంటారు.

ఇక్కడ కృష్ణపరమాత్మ ఐదవ అంశాన్ని ఆనందమయకోశం అనలేదు. ఆనందమయకోశం అంటే ఏమిటో తెలియటానికి అదికూడా చెప్పటం జరిగింది కాని, అది ఇప్పుడు మనకు అవసరంలేదు. ఆనందమయకోశాన్ని ఐదవ అంశంగా కృష్ణపరమాత్మ ఎందుకు చెప్పలేదంటే, ఆనందమయకోశం కారణశరీరానికి చెందినది. కారణ శరీరంలో సుషుప్తిలోకి జారుకుంటాము.

5. **దైవం** – హిరణ్యగర్భ – ఐదవ అంశం దైవం లేదా అధిష్ఠానదేవత. మనలో ఉన్న ప్రతి ఒక్క అంగానికి ఒక్కొక్క అధిష్ఠానదేవత ఉంటుంది. ఉదాహరణకు కంటికి అధిష్ఠానదేవత సూర్యుడు; మనస్సుకు అధిష్ఠానదేవత చంద్రుడు; చేతులకు అధిష్ఠానదేవత ఇంద్రుడు. ఈ అధిష్ఠానదేవతలందరికీ అధిష్ఠానదేవత హిరణ్యగర్భ. హిరణ్యగర్భను ఇక్కడ దైవం అంటున్నాడు కృష్ణపరమాత్మ. దైవం అంటే చైతన్యం కాదు. దైవం అంటే సమష్టిశక్తి. వ్యష్టి ఏపని చెయ్యాలన్నా కూడా దానికి సమష్టిశక్తి కూడా తోడవ్వాలి.

ఐదు పరికరాలు – నాలుగు కోశాలు + హిరణ్యగర్భ.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**అధిష్ఠానం** – అధిష్ఠానం అంటే అన్నమయకోశం;

**వివిధాశ్చ పృథక్ చేష్టా** – ప్రాణమయకోశం. ప్రాణమయకోశం అంటే క్రియాశక్తి. పృథక్ అంటే అనేకం. వివిధా అంటే భిన్నమైన. ప్రాణమయకోశం అనేక, భిన్నమైన పనులను చేస్తుంది.

**పృథగ్విధమ్ కరణం చ** – ఇది మనోమయకోశం. మనోమయకోశంలో పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు ఉంటాయి. పృథగ్విధమ్ అంటే ఐదు ఇంద్రియాలు, మనస్సు ఉన్నాయి.

**కర్తా** – విజ్ఞానమయకోశం. ఇందులో కూడా పంచజ్ఞానేంద్రియాలు ఉంటాయి. అవికాక బుద్ధి ఉంటుంది. బుద్ధే నేనేం చెయ్యాలో, ఏంచెయ్యకూడదో నిశ్చయిస్తుంది.

**దైవం చ పంచమమ్** – దైవం అంటే హిరణ్యగర్భ. ఈ అంగాలన్నిటి అధిష్ఠానదేవతలకు అధిష్ఠానదేవత.

అనాత్మగా పనిచేసే పంచపరికరాలు వరుసగా – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, హిరణ్యగర్భ. ఇక్కడ ఆనందమయకోశాన్ని కలుపుకోకూడదని గుర్తుంచుకోవాలి.

శ్లో. 15 **శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః ।**
**న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥**
శరీరవాఙ్మనోభిః, యత్, కర్మ, ప్రారభతే, నరః,
న్యాయ్యమ్, వా, విపరీతమ్, వా, పంచ, ఏతే, తస్య, హేతవః ॥

| | | | |
|---|---|---|---|
| నరః | = మానవుడు | ప్రారభతే | = ఆచరించునో |
| శరీరవాఙ్మనోభిః | = మనస్సు, వాక్కు, శరీరములతో | తస్య | = ఆ కర్మకు |
| న్యాయ్యమ్, వా | = శాస్త్రోక్తవిధానమున గాని | ఏతే, పంచ | = ఈ ఐదును |
| విపరీతమ్, వా | = దానికి వ్యతిరేకముగా గాని | హేతవః | = హేతువులు |
| యత్, కర్మ | = ఏ కర్మను | | |

**నరః శరీర–వాక్–మనోభిః న్యాయ్యమ్ వా విపరీతం వా యత్**
**కర్మ ప్రారభతే, తస్య ఏతే పఞ్చ హేతవః (సన్తి) ॥**

తా: మానవుడు మనస్సు, వాక్కు, శరీరములతో శాస్త్రోక్తవిధానమున గాని, దానికి వ్యతిరేకముగా గాని ఏ కర్మను ఆచరించునో, ఆ కర్మకు ఈ ఐదును హేతువులు.

ఈ ఐదు పరికరాలు మనుష్యులందరకూ ఉండితీరాలి. ఉన్నతమైన కర్మలు చెయ్యాలన్నా, ఆధ్యాత్మికకర్మలు చెయ్యాలన్నా, దైవకార్యాలు చెయ్యాలన్నా, చివరికి చెడుకర్మలు చెయ్యాలన్నా కూడా ఈ పరికరాలు ఉండాలి.

**శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః** – శరీర అంటే కాయికకర్మలు, వాక్ అంటే వాచికకర్మలు. పూజ, జపం, పారాయణం శరీరకర్మల కింద వస్తాయి. ఇవన్నీ దైవకార్యాలు. అంతేకాక ఉద్యోగంలో చేసేకర్మలు కూడా కాయిక, వాచికకర్మల కిందికే వస్తాయి. మనోభి అంటే మానసికకర్మలు. మనస్సుతో చేసే లౌకికకర్మలు లేదా ధ్యానం, ఉపాసన వంటి దైవకార్యాలు. లౌకికకర్మలకు మనస్సులో ప్రణాళికలు వేసుకుంటాము.

యత్ కర్మ ప్రారభతే నరః – మనిషి చేసే ఏ కర్మ అయినా అంటే కాయిక, వాచిక, మానసిక కర్మలు ఏవైనా వాటిని కర్మ అంటారు. మనిషి చేసే పనులనే కర్మ అంటారు. జంతువులు చేసే పనులను కర్మ అనరు, **చేష్ట** అంటారు. ఎందుకు? మనిషి ఏపని చేసినా, తన ఫ్రీవిల్‌ను ఉపయోగించి, ప్రణాళికవేసి, ఆలోచించి చేస్తాడు. జంతువులు అలా ఆలోచించి, ప్రణాళికలు వేసి చేసే పనులు ఉండవు.

రోడ్డుమీద పరుగెడుతున్న కుక్కను ఏ టీవీ రిపోర్టరు అయినా ఆపి ఇంటర్వ్యూ చేశాడనుకోండి. ఎక్కడికి వెళుతున్నావు? నీ భవిష్యత్తు ప్రణాళికలు ఏమిటి, ఏదైనా మీటింగ్‌కు వెళుతున్నావా? ఇటువంటి ప్రశ్నలకు దానిదగ్గర జవాబులు ఉండవు. జంతువుల ప్రవర్తనను స్వాభావికం అంటారు. అవి ఆలోచించి, ప్రయత్నపూర్వకంగా ఏమీ చెయ్యవు. అవి చేసే పనులను చేష్టలు అంటారు కాని కర్మలు అనరు కాబట్టి వాటికి కర్మఫలాలు కూడా అంటవు. అంటే వాటికి పుణ్యమూ రాదు, పాపమూ రాదు. ఎర్రసిగ్నలు పడినా రోడ్డు క్రాస్ చేసే హక్కు ఉంది ఆవుకు. దానికి ఫైను విధించలేదు పోలీసు. అందువల్ల జంతువులకు ఆగామిపుణ్యం కాని, ఆగామిపాపం కాని రాదు.

కాని మనిషి సిగ్నల్సును పట్టించుకోకుండా వెళితే అతనికి ఫైను పడుతుంది. నాకు నియమాలు తెలియదన్నా కుదరదు. అందువల్ల కృష్ణపరమాత్మ ప్రత్యేకించి నరః పదాన్ని వేశాడు. నరః అంటే మనిషి. మనిషిలో స్త్రీ, పురుషులు ఇద్దరూ వస్తారు.

**న్యాయ్యం వా విపరీతం వా** – అవి న్యాయమైన కర్మలైనా, అక్రమమైన కర్మలైనా కూడా న్యాయ్యం అంటే ధార్మిక కర్మలు, చట్టబద్ధమైన కర్మలు. విపరీతం అంటే న్యాయానికి వ్యతిరేకమైనవి. అంటే అధార్మిక కర్మలు, చట్టవిరుద్ధమైన కర్మలు. వీటిలో ఏ కర్మలు చేసినా కూడా ఈ ఐదు అంశాలద్వారానే చేస్తాడు మనిషి.

**పంచ ఏతే తస్య హేతవః** – తస్య అంటే ఆ కర్మ. ఏ కర్మ? పైన చూసినవన్నీ వస్తాయి. కాయిక, వాచిక, మానసిక, ధార్మిక, అధార్మిక కర్మలన్నిటికీ. పంచ ఏతే అంటే ముందు శ్లోకంలో చెప్పిన ఐదు అంశాలే. హేతవః అంటే హేతువులు.

కృష్ణపరమాత్మ వీటిని ఎందుకు పేర్కొన్నాడు? ఈ ఐదూ అనాత్మ కిందికే వస్తాయి సుమా అని చెప్పటానికి. చైతన్యం కూడా ఉండాలి కాని చైతన్యం పనిచెయ్యదు. ఈ గదిలో ఒక ముఖ్యమైన కార్యక్రమం నడవాలి అంటే ఈ గదిలో కాంతి ఉండాలి. కాంతి ఏపనీ చెయ్యదు. అందువల్ల కాంతి కర్త కాదు, భోక్త కాదు. అలాగే ఒక వ్యక్తి ఆత్మ, అనాత్మల మేలుకలయిక అని చూశాము. అతను పనిచేసేది అనాత్మతో, కాని ఆత్మ సమక్షంలో చేస్తాడు. అందువల్ల ఆత్మ కర్త కాదు, భోక్త కూడా కాదు.

కాంతి సమక్షంలో టెన్నిస్‌మ్యాచ్ అవుతోందనుకోండి. చాలా సందడిగా ఉంటుంది. అందరూ హడావుడిగా ఇటూ, అటూ తిరుగుతున్నారు. అంతా కాంతి సమక్షంలో అవుతోంది, కాని కాంతి ఏమీ చెయ్యటంలేదు. దీన్ని **సాన్నిధ్యమాత్రమ్** అంటారు. ఆ ఆటలో ఒక జట్టు గెలుస్తుంది; ఇంకొక జట్టు ఓడిపోతుంది. చూడటానికి వచ్చిన ప్రేక్షకులు గెలిచిన జట్టును మెచ్చుకుంటారు; ఓడిపోయిన జట్టును విమర్శిస్తారు. కాంతికి మెప్పూ రాదు, విమర్శా రాదు. కాని కాంతి లేకపోతే ఈ ఆట ఆడగలిగి ఉండేవారు కాదు. మనం అచేతన జడతత్త్వంతో మమేకం చెందుతున్నాము కాని చైతన్యంతో మమేకం చెందటం లేదు.

అందువల్ల మన దృష్టిని ఈ పని చేసే దయనీయమైన అనాత్మనుంచి, అకర్తా, అభోక్తా అయిన ఆత్మ వైపు మరల్చాలి. అలాగని శరీరాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు. శరీరాన్ని వినియోగించుకోవాలి; దాన్ని మంచి కండిషన్‌లో ఉంచాలి కాని దానితో మమేకం చెందకూడదు. మన కారు, స్కూటరు, స్క్రూడ్రైవరు మనం వాడే పరికరాలు మాత్రమే. నేను స్క్రూడ్రైవరును కాను అని బాగానే అర్థమవుతుంది; కాని నా శరీరం స్క్రూడ్రైవరు వంటి పరికరం మాత్రమే అని జీర్ణించుకోవటానికి సమయం పడుతుంది. అంటే వస్తువుల విషయంలో బుద్ధి బాగానే పనిచేస్తుంది కాని శరీరాన్ని వస్తువుగా చూడాలంటే మాత్రం పనిచేయదు.

ఈ మనశ్శరీరాలు స్క్రూడ్రైవరువంటి పరికరాలు మాత్రమే. వాటితో మనం మమేకం చెందితే అభద్రతాభావనకు లోనవుతాము. ఆధ్యాత్మికసాధన అంటే శాశ్వతమైన స్థూలశరీరంనుంచి మన అభిమానాన్ని శాశ్వతమైన చైతన్యం వైపుకు మళ్ళించాలి. ఇప్పుడు మనం సహజంగా పెరుగుతూ, క్షీణిస్తూ, మాయమైపోయే శరీరంతో అనుబంధం పెంచుకునివున్నాము. దాన్నించి నెమ్మదిగా ఎదగాలి.

నేనొక అశాశ్వతమైన శరీరాన్ని, నాలో చైతన్యం ఉంది అనేకన్నా, నేను శాశ్వతమైన చైతన్యాన్ని; నేను ఈ అశాశ్వతమైన శరీరంద్వారా వ్యవహారం నడుపుతున్నానని అర్థం చేసుకోవాలి. శరీరం వస్తుంది, పోతుంది; కాని దాని రాకపోకలు నన్నేమీ చెయ్యలేవు. శరీరం ఉన్నంతవరకూ శరీరం అనేక కర్మలు చెయ్యాల్సి ఉంటుంది; ఆ చేసిన కర్మలయొక్క ఫలాలను కూడా అనుభవించాలి. అంటే శరీరం కర్తా, భోక్తా అవక తప్పదు. కాని చైతన్యం అకర్తా, అభోక్తా. శరీరం కర్త, భోక్త; చైతన్యం అకర్త, అభోక్త అని తెలుసుకుంటే చాలదు; నేను అకర్తా, అభోక్తా అయిన చైతన్యాన్ని అని తెలుసుకోవాలి. అప్పుడు జ్ఞానయోగసాధన పూర్తి అవుతుంది.

శ్లో. 16 **తత్రైవం సతి కర్తారమ్ ఆత్మానం కేవలం తు యః ।**
**పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః ॥**
తత్ర, ఏవమ్, సతి, కర్తారమ్, ఆత్మానమ్, కేవలమ్, తు, యః,
పశ్యతి, అకృతబుద్ధిత్వాత్, న, సః, పశ్యతి, దుర్మతిః ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ఆత్మానమ్ | = ఆత్మను |
| ఏవమ్, సతి | = ఇలా అయినప్పటికిని | కర్తారమ్ | = సమస్త కర్మలకు కర్తగా |
| యః | = ఏ పురుషుడు | పశ్యతి | = తలంచునో |
| అకృతబుద్ధిత్వాత్ | = విపరీతబుద్ధివల్ల | సః, దుర్మతిః | = అటువంటి అజ్ఞాని |
| తత్ర | = ఆ కర్మ విషయములందు | న, పశ్యతి | = యథార్థమును గ్రహించడు |
| కేవలమ్ | = కేవల శుద్ధస్వరూపమైన | | |

**తత్ర ఏవమ్ సతి యః తు కేవలమ్ ఆత్మానమ్ కర్తారమ్ పశ్యతి,**
**సః దుర్మతిః అకృత-బుద్ధిత్వాత్ న పశ్యతి ॥**

తా: కాని ఇట్లు అయినప్పటికిని ఏ పురుషుడు విపరీతబుద్ధివల్ల, ఆ కర్మ విషయములందు కేవల శుద్ధస్వరూపమైన ఆత్మను సమస్త కర్మలకు కర్తగా తలంచునో అటువంటి అజ్ఞాని యథార్థమును గ్రహించడు.

మనమంతా చేతనఅంశ, అచేతనఅంశల మిశ్రమం. జ్ఞాని కూడా ఈ రెండింటి మిశ్రమమే; అజ్ఞాని కూడా ఈ రెండింటి మిశ్రమమే. మరి భేదం ఎక్కడ ఉంది? చూసే దృక్పథంలో ఉంది. ఈ శ్లోకంలో అజ్ఞాని దృక్పథాన్ని వివరిస్తే, వచ్చే శ్లోకంలో జ్ఞాని దృక్పథాన్ని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దేని గురించిన దృక్పథం? తన గురించి తను ఏమనుకుంటాడో, ప్రపంచంలో కూడా దాన్నే చూస్తాడు.

'ప్రపంచం ఒక అద్దం,' అన్నారెవరో. అద్దంలో ఏంచూస్తాము? మన ముఖారవిందాన్నే చూస్తాము. అలాగే మనను మనం ఏ కోణంలో ఎక్కువగా చూసుకుంటామో, ప్రపంచాన్ని కూడా ఆ కోణంలో నుంచే చూస్తాము. మనకు మన అందంమీద, మన రూపురేఖలమీద మక్కువ ఉంటే, ప్రపంచంలో ఎవరిని చూసినా వారి అందచందాలనే చూస్తాము. మనకు లోతుగా ఆలోచించి, ప్రతిదాన్నీ విశ్లేషించే అలవాటు ఉంటే, అలాంటివారే

మనకు కనబడతారు. మనకు అందంగా అలంకరించుకోవటంమీద మోజుంటే ఎవరెలా అలంకరించుకున్నారో ప్రత్యేకంగా చూస్తాము.

అజ్ఞాని ఎలా చూస్తాడో ఇక్కడ చూస్తాము.

**దుర్మతిః** – దుర్మతిః అంటే అజ్ఞాని. అతనికి తనేమిటో, తన గురించిన సరైన అవగాహన లేకపోవటంవల్ల తను అన్నమయకోశమనీ, ప్రాణమయకోశమనీ, మనోమయకోశమనీ అనుకుని వాటితో అభిమానం పెంచుకుంటాడు. అందువల్ల దుర్మతి అంటే అజ్ఞాన అధ్యాసయుక్త మతిః.

దీనినే మాండూక్యంలో అగ్రహణం, అన్యథాగ్రహణం అంటారు. దేన్ని తన స్వరూపంగా తీసుకోవాలో దాన్ని తీసుకోరు; దేన్ని తన స్వరూపంగా తీసుకోకూడదో దాన్ని తీసుకుంటారు. అందువల్ల అగ్రహణ అన్యథాగ్రహణయుక్త మతిః అంటారు. ఈ అజ్ఞాని ఏం చేస్తాడు?

**న పశ్యతి** – సరిగ్గా చూడడు. తప్పుగా తనను తాను చూసుకుంటాడు.

**కేవలమ్ ఆత్మానమ్** – తన అసలు స్వరూపం శుద్ధఆత్మ అని తెలియదు అతనికి. కేవలం అంటే తెలుగులో వచ్చే కేవలమైన వస్తువు అనే అర్థం కాదు. అక్కడ కేవలమైన అంటే తక్కువ చేసినట్టు వస్తుంది. సంస్కృతంలో కేవలం అంటే శుద్ధం. శుద్ధమ్ అంటే **కర్తృత్వ భోక్తృత్వ రహితమ్**. అంటే కర్తృత్వం; భోక్తృత్వం అనే మలినాలు అంటని శుద్ధ ఆత్మ. ఈ విషయం ఈ అజ్ఞానికి తెలియదు. అతనికున్న అజ్ఞానంవల్ల, తన గురించి పొరపాటు పడతాడు. ఏమని?

**కర్తారం పశ్యతి** – తనను తాను కర్తగా భావిస్తాడు. ఎందుకు? అతనికి తన కోశాలమీద ఉన్న అభిమానంవల్ల.

**తత్ర ఏవమ్ సతి** – సత్యం అలా అయినప్పటికీ. అంటే సత్యం ఏమిటి? పంచవిధ అనాత్మకర్త, కేవలఆత్మ అకర్తా. ఇది సత్యం. కాని అజ్ఞాని అకర్త అయిన ఆత్మ గురించి తెలియక, తను కర్త అనుకుంటాడు. ఎందుకు?

**అకృతబుద్ధిత్వాత్** – శాస్త్ర అధ్యయనం చెయ్యకపోవటంవల్ల అలా పొరపాటు పడతాడు.

అతనికి ఉన్న ఆత్మ అజ్ఞానాన్ని శాస్త్రఅధ్యయనం ఒక్కటే పారద్రోలగలదు. కెమిస్ట్రీనో, ఎకనామిక్సో నేర్చుకుంటే పోదు. మనం ఈ సబ్జెక్టులను కించపరచటం లేదు. వాటి విలువ వాటికి ఉంది; కాని ఆత్మజ్ఞానం పొందాలంటే ఆత్మను గురించి బోధించే వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి. అది కూడా గురువుద్వారానే అధ్యయనం చెయ్యాలి. కాని అజ్ఞాని తనకు అంత తీరిక లేదంటాడు; అక్కడికేదో వేదాంతం కాలక్షేపం బఠానీ అయినట్టు.

రైళ్ళల్లో ప్రయాణం చేసేటప్పుడు కొంతమంది కాలం గడవక కాలక్షేపం బఠానీ అంటూ ఏవో చిరుతిళ్ళు తింటారు. వేదాంతం అలాంటి కాలక్షేపం బఠానీ కాదు. కాని వారికి వేదాంతం విలువ తెలియక, అలా అనుకుంటారు. వేదాంతానికీ, జీవితానికీ సంబంధం లేదనే పెద్ద అపోహతో ఉంటారు. ముందు కుటుంబ బాధ్యతలను, ఉద్యోగబాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి; అవి పూర్తయ్యాక అప్పుడు చూద్దాంలే, అంతవరకూ ఎందుకు అనుకుంటారు. అది అలలు ఆగాక సముద్రంలో స్నానం చేద్దాంలే అన్నట్టే ఉంటుంది. బాధ్యతలు

ఎన్నటికి తీరేను? కొన్ని అవంతట అవి వచ్చిపడతాయి; కొన్ని మీరు తెచ్చిపెట్టుకుంటారు. ఒకవేళ అన్నీ తీరి, సమయం చిక్కినా ఒంట్లో శక్తి తగ్గుతుంది. కన్ను కనబడదు; మాట వినబడదు; కుదురుగా గంటసేపు కూర్చోలేరు. ఒకవేళ కన్ను, చెవులు బాగా పనిచేస్తూ, గంటసేపు కూర్చోగలిగినా, మనస్సు ఏకాగ్రత చూపలేదు. వేదాంతక్లాసులో హాయిగా నిద్ర వస్తుంది. అలా లాభంలేదు.

వేదాంతంమీద శ్రద్ధపెట్టి, చిన్నవయస్సులో నేర్చుకుంటే ఆత్మ అజ్ఞానం తొలుగుతుంది. మిమ్మల్ని మీరు చూసుకునే దృక్పథం మారుతుంది. మీలో మార్పు వస్తే, తదనుగుణంగా మీరు ప్రపంచాన్ని చూసే తీరుతెన్నుల్లో కూడా మార్పు వస్తుంది.

నిజానికి సంసారం అంటే జీవితంలోని పరిస్థితులకు తప్పుగా స్పందించటం. అంటే పరిస్థితులను మీరు సమస్యలుగా చూస్తున్నారు. నిజానికి మీరు సమస్యలుగా భావిస్తున్నవేవీ సమస్యలు కావు. పరిస్థితి అంటే ఏమిటి? ఎండాకాలం వేడిగా ఉంటుంది. అది సమస్యనా, పరిస్థితా? ఎండాకాలం చల్లగా ఉండగలదా? చలికాలం చల్లగా ఉందని బాధపడతారు. చలికాలం చల్లగా ఉండక, వేడిగా ఉంటుందా? మీకు వయస్సు పెరిగినకొద్దీ కీళ్ళనొప్పులు మొదలవుతాయి. చిన్నప్పుడు ఉన్నట్టుగా, ఇప్పుడూ ఉండమంటే ఎలా ఉంటాయి? అందువల్ల మీరు సమస్యలు అనుకుని బాధపడుతున్నవేవీ సమస్యలు కావు. అవి జీవితంలో ఎదురయ్యే సహజమైన సన్నివేశాలు.

ఎందుకిలా పొరపాటుపడుతున్నారు? అకృతబుద్ధిత్వాత్ – సంస్కరించబడని బుద్ధివల్ల; ఆత్మజ్ఞానం పొందని బుద్ధివల్ల. లౌకికవిద్యల్లో అతను ఎన్నో డిగ్రీలు, పి.హెచ్.డీ.లు పొందివుండవచ్చు గాక, కాని ఇలాంటి ఆధ్యాత్మిక నిరక్షరాస్యుడు సత్యాన్ని చూడలేడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**పశ్యన్నపి చ న పశ్యతి మూఢః ఉదర నిమిత్తం బహుకృత వేషః** – భజగోవిందమ్

కళ్ళు తెరిచివున్నా అతను చూడవలసినదాన్ని చూడడు. **సః దుర్మతిః న పశ్యతి** అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ఆధ్యాత్మిక జ్ఞానం లేనివ్యక్తి కూడా కళ్ళుండి చూడలేని వ్యక్తే అవుతాడు. అంటే అతనూ గుడ్డివాని కిందికే వస్తాడు. ఎందుకంటే తప్పుగా చూడటం అంటే అసలు చూడకపోవటం కిందకే వస్తుంది. అందువల్ల అజ్ఞాని సరిగ్గా చూడడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ముండకోపనిషత్తు ఒక అడుగు ముందుకెళ్ళి, అతను గుడ్డివానిగా ఉన్నాడనీ, శాస్త్రం అతన్ని సరిదిద్దటానికి సిద్ధంగా ఉన్నా; అతనే రావటంలేదనీ అంటుంది. పైగా అతను గుడ్డివానిగా ఉన్నా ఫర్వాలేదు; అతను మిగతావారికి తప్పు దారి చూపిస్తాడు అంటుంది.

**అవిద్యాయామంతరే వర్తమానాః స్వయంధీరాః పండితం మన్యమానాః**

**జంఘన్యమానాః పరియంతి మూఢాః అంధేనైవ నీయమానా యథాంధాః** – ముండకమ్ 1.2.8

వారి అహంకారం వారిని శాస్త్రానికి, గురువు దగ్గరికి తీసుకువెళ్ళదు. వారికి వారే పండితులమనకుంటారు. ఎంత బాధాకరమైన విషయం!

దానికి భిన్నంగా కొందరు వినయశీలురు, వివేకం ఉన్నవారు శ్రద్ధగా గీతాబోధకు వస్తారు. వారు నిజంగా గొప్పవారు. ఎవరంటున్నారు? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే అంటున్నాడు.

శ్లో. 17 **యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**
**హత్వాపి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే ॥**
యస్య, న, అహంకృతః, భావః, బుద్ధిః, యస్య, న, లిప్యతే,
హత్వా, అపి, సః, ఇమాన్, లోకాన్, న, హంతి, న, నిబధ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యస్య | = ఏ పురుషునకు అంతఃకరణమందు | న, లిప్యతే | = ప్రాపంచిక విషయములందును, కర్మలందును చిక్కుకొనదో |
| అహంకృతః | = 'నేనే కర్తను' అను | సః | = ఆ పురుషుడు |
| భావః | = భావము | ఇమాన్, లోకాన్ | = ఈ లోకములన్నింటిని |
| న | = ఉండదో | హత్వా, అపి | = హతమార్చినను |
| యస్య | = ఏ పురుషునియొక్క | న, హంతి | = యథార్థముగా చంపినట్టు కాదు |
| బుద్ధిః | = బుద్ధి | న, నిబధ్యతే | = ఏ పాపముచేతను బంధింపబడడు |

**యస్య అహంకృతః భావః న, యస్య బుద్ధిః న లిప్యతే, సః ఇమాన్**
**లోకాన్ హత్వా అపి న హన్తి, న నిబధ్యతే ॥**

తా: ఏ పురుషునకు అంతఃకరణమందు 'నేనే కర్తను' అను భావము ఉండదో, ఏ పురుషునియొక్క బుద్ధి ప్రాపంచిక విషయములందును, కర్మలందును చిక్కుకొనదో ఆ పురుషుడు ఈ లోకములన్నింటిని హతమార్చినను యథార్థముగా చంపినట్టు కాదు. ఏ పాపముచేతను బంధింపబడడు.

ముందు శ్లోకంలో వర్ణించిన అజ్ఞానికి భిన్నంగా ఇక్కడ, ఈ శ్లోకంలో జ్ఞాని గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞాని అంటే ఎవరు? వేదాంతశాస్త్ర శ్రవణం ఒక క్రమపద్ధతిలో చేసినవ్యక్తి. అతనికి తనలో రెండు అంశాలున్నాయనీ, వాటిని అనాత్మ అంశ, ఆత్మ అంశ అంటారనీ తెలుసు. అతను శ్రవణం మాత్రమే కాదు, మననం చేసి నిశ్చయజ్ఞానం పొందాడు; సుదీర్ఘ నిదిధ్యాసనం చేసి జ్ఞాననిష్ఠలో నిలబడుతున్నాడు.

ఏమిటా సుదీర్ఘ నిదిధ్యాసనం? మనస్సును శాశ్వతమైన ఆత్మలో నిలబడేలా చెయ్యటం. అది ఉన్నతమైన నేను అని; అశాశ్వతమైన, నాశనమయ్యే శరీరం నేను కాదని, దానితో మమేకం చెందకూడదనీ తెలుసుకుంటాడు. శరీరం కూడా కావాలి, జీవించి ఉన్నంతవరకూ దానితోనే వ్యవహారం నడుపుతాడు నిజమే. అందువల్ల దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చెయ్యకూడదు. దానితో ఎంతవరకూ అనుబంధం పెంచుకోవాలో అంతవరకే పెంచుకోవాలని జ్ఞానికి తెలుసు. ఈ శరీరం పాంచభౌతికం. అది మళ్ళీ ఎప్పుడో పంచభూతాలలో కలిసిపోవాల్సిందే. అది ఒక మార్గమే కాని గమ్యం కాదు. శరీరం గురించిన ఈ సరియైన అవగాహన ఉండటమే అహంకార విముక్తి అంటారు.

**యస్య** – యస్య అంటే జ్ఞానికి; సంస్కృతః బుద్ధిః. ముందు శ్లోకంలో అజ్ఞానిని ఏమన్నాడు? అకృతబుద్ధిః అన్నాడు. దానికి వ్యతిరేకం సంస్కృత బుద్ధిః. సంస్కృతబుద్ధి అంటే ఆధ్యాత్మికజ్ఞానం పొందిన బుద్ధిగలవ్యక్తి. అటువంటి జ్ఞాని ఏంచేస్తాడు?

**(యస్య) అహంకృతః భావః న (అస్తి)** – అతనికి తన శరీరంమీద మితిమీరిన అభిమానం ఉండదు. శరీరానికి ఎంత ప్రాముఖ్యతనివ్వాలో అంతమేరకు ఇస్తాడు కాని, మరీ ఎక్కువ ఇవ్వడు.

**గుణాగుణేషు వర్తంతే, ఇంద్రియార్థేషు వర్తంతే**

స్థూలశరీరం ఈ సృష్టిలో ఒక భాగమని, దానికి దేశ, కాలపరిమితులు వర్తిస్తాయనీ తెలుసు. శరీరానికి వచ్చే మార్పులను అతను ఆపలేడు. వాటిని సహజమైన మార్పులుగా స్వీకరించాలి.

**తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి**

నువ్వు మార్చలేని పరిస్థితులను గురించి బాధపడి లాభంలేదు. శరీరమన్నాక మారకతప్పదు; చలికాలం అన్నాక చలివేయక తప్పదు. చలి వేస్తే ఈశ్వరుని విభూతిగా భావించి, దానిమీద ధ్యానం చెయ్యాలి. జ్ఞాని ఉన్నదాన్ని ఉన్నట్టుగా తీసుకుంటాడు.

అహంకృతః భావః న అస్తి అంటే కర్తృత్వభావన ఉండదు.

**యస్య బుద్ధిః న లిప్యతే** – కర్తృత్వభావన లేకపోతే, భోక్తృత్వభావన కూడా ఉండదు. జ్ఞానికి భోక్త విషయంలో కూడా పొరపాటుభావన ఉండదు. 'నాకే ఎందుకు?' ప్రశ్న జ్ఞానినుంచి రాదు. అది తనకు ఉన్న ప్రారబ్ధకర్మఫలం అనీ, అది క్షయమవాలనీ దాన్ని ఏదో ఒక మార్గంద్వారా భగవంతుడు కలుగజేస్తాడనీ అతనికి తెలుసు.

కర్మ ప్రత్యక్షంగా ఆనందమో, దుఃఖమో ఇవ్వలేదు. ఏదో ఒక మాధ్యమంద్వారా ఇస్తుంది. అది ఒక దోమ ద్వారా కూడా కావచ్చు. జ్ఞానిని తన కుటుంబసభ్యులే ఇబ్బంది పెడుతున్నా, వారిని తిట్టుకోడు; వారిద్వారా తన కర్మఫలాన్ని అనుభవిస్తున్నానని అర్థం చేసుకుంటాడు. భార్య మంచిదైతే అతను చేసుకున్న పుణ్యఫలం అది; భార్య తనకు తగ్గట్టు లేకపోతే అతను చేసుకున్న పాపఫలం అది. రెండూ సమానంగా స్వీకరిస్తాడు.

'నాకే ఎందుకు?' ప్రశ్నే రాదు జ్ఞాని విషయంలో. జ్ఞాని తితిక్షను అలవరచుకుంటాడు. విదేశాల్లో అయితే రోడ్డుమీద ఏదైనా సమస్య వస్తే, దాన్ని తక్షణం బాగుచేస్తారు. మనదేశంలో అయితే రోడ్లమీద గుంతలు నెలల తరబడి ఉంటాయి, పట్టించుకునే నాథుడే ఉండడు. అందువల్ల మనదేశంలో తితిక్ష తప్పకుండా అలవడుతుంది. ఇది మనకు భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావించుకుని, దాన్ని భరించాలి.

యస్య న లిప్యతే అంటే భోక్తృత్వభావన న లిప్యతే అని కలుపుకోవాలి. అంటే జ్ఞాని తను భోక్త అని అనుకోడు.

**సః** – అటువంటి జ్ఞాని;

**ఇమాన్ లోకాన్ హత్వా అపి** – ఈ భూమ్మీద జీవించి ఉన్నంతవరకూ జ్ఞాని కర్మలు చెయ్యకతప్పదు. అతను

సన్న్యాసి అయితే సన్న్యాసాశ్రమధర్మాలను పాటించాలి; గృహస్థు అయితే గృహస్థుగా అనేక బాధ్యతలు ఉంటాయి, వాటిని నెరవేర్చాలి. పిల్లలను వృద్ధిలోకి తీసుకురావాలి; వృద్ధులైన తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడాలి. క్షత్రియుడు అయితే యుద్ధం కూడా చెయ్యాలి. అర్జునుని విషయమే తీసుకోండి. అతని క్షత్రయధర్మం ప్రకారం యుద్ధం చెయ్యాలి. యుద్ధంలో భాగంగా తనవారినే, తన ఆత్మీయులనే చంపాల్సిరావచ్చు. కాని జ్ఞాని ఏపని చేసినా, అది మంచిపని అయినా, మంచిపని కాకపోయినా, దానితో మమేకం చెందదు.

అతను ఏపనైనా బాగాచేస్తే, సమాజం అతన్ని ఆకాశానికెత్తినా కూడా అతనేమీ పొంగిపోడు. అలా పొంగిపోతే భోక్తృత్వాన్ని స్వీకరించినట్టు అవుతుంది. భోక్తృత్వాన్ని స్వీకరిస్తే కర్తృత్వాన్ని కూడా స్వీకరించాల్సివుంటుంది. అందువల్ల తను కర్మ చేసినట్టుగా కర్తృత్వాన్ని స్వీకరించడు; కర్మఫలాన్ని అనుభవించే భోక్తగా భోక్తృత్వాన్ని స్వీకరించడు.

సః అపి హత్వా – అతను ఎవరినైనా చంపినా;

**ఇమాన్ లోకాన్** – ఈ ప్రజలంతా. కృష్ణపరమాత్మ ఎదురుగా ఉన్న సైన్యాన్ని చూపించి ఉండవచ్చు. ఇక్కడ యుద్ధభూమిలో చెబుతున్నాడు కాబట్టి చంపినా అన్నాడు కాని, దాని అర్థం జ్ఞాని అందరినీ చంపుకుంటూ పోవచ్చునికాదు. దాన్ని ఒక క్రియాపదంగా తీసుకోవాలి. జ్ఞాని చేసే కర్మలు, ఇంకా చెప్పాలంటే జ్ఞాని నెరవేర్చే ధర్మాలు అని చెప్పవచ్చు. ఇక్కడ, ఈ సందర్భంలో అర్జునుని ధర్మం ఏమిటి? చంపటం. అంటే శిక్షించటానికి సామదానభేదదండోపాయాల్లో మొదటి మూడూ పనిచెయ్యకపోతే దండన తప్పదు.

అంటే జ్ఞానికూడా అవసరమైతే హింసకు పాల్పడకతప్పదు. అర్జునుడు భీష్మద్రోణులను చంపకతప్పదు. జ్ఞానికి జాలి, దయ ఉంటుంది కాని, అర్హులు కాని వారిమీద ఉండదు. అతను పక్షపాతవైఖరి చూపడు. సమతుల్యత ఉన్న బుద్ధి కలిగివుంటాడు. హింస చూపటమొక్కటే మార్గం అంటే, చూపుతాడు; అది కూడా సరిగ్గా చూపుతాడు. కాని అలా చేసినప్పుడు,

**న హంతి** – అతను చంపినట్టు కాదు; అంటే అతను కర్త అవడు.

**న నిబధ్యతే** – కర్మఫలం కూడా అంటదు; అంటే అతను భోక్త కూడా కాదు.

అలా తను అనాత్మతో మమేకం చెందే స్థాయినుంచి, నేను అకర్త, అభోక్త అయిన ఆత్మను అని అర్థం చేసుకోవటమే జ్ఞానయోగం. అలా అనాత్మనుంచి ఆత్మవైపుకు దృష్టి మార్చుకుంటే మోక్షం వస్తుందా, రాదా? అలా అనాత్మనుంచి ఆత్మవైపుకు దృష్టి మార్చుకుంటే మోక్షం రాదు. మరేమొస్తుంది? నేను ముందే ముక్తపురుషుణ్ణి, నాకు కొత్తగా మోక్షం రావాల్సిన పనిలేదు అనే జ్ఞానం కలుగుతుంది. నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా ముక్తపురుషుణ్ణే. నేను నిత్యశుద్ధ ముక్తపురుషుణ్ణి. ఆ విధంగా జ్ఞానయోగం మోక్షాన్ని ఇస్తుంది.

ఇక్కడితో జ్ఞానయోగం అయిపోయింది.

నిజానికి మనిషి చెయ్యాల్సిన ముఖ్యమైన సాధనలు రెండే ఉన్నాయి. మనస్సును శుద్ధిచేసే ఏ సాధననైనా కర్మయోగం అంటారు. అది జపం, పూజ, యోగం, సమాజసేవ, తీర్థయాత్ర, దానం, భజన – ఏదైనా కావచ్చు. మనస్సును శుద్ధిచేసి, జ్ఞానయోగ్యతను ప్రసాదించేదాన్ని కర్మయోగం అంటారు.

నేను నిత్యముక్త శుద్ధపురుషుణ్ణి అని నేర్చుకోవటానికి చేసే సాధనను జ్ఞానయోగం అంటారు. వేదాంతబోధ వింటుంటే అది జ్ఞానయోగం. ఇంటికి వెళ్ళి, గురువు చెప్పింది మననం చేసుకుంటే అది జ్ఞానయోగం. బుద్ధికి పదునుపెట్టి జ్ఞానం పొందితే అది జ్ఞానయోగం. ఆ జ్ఞానం ఆత్మ గురించిన జ్ఞానాన్ని ఇస్తుంది. అది నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా ముక్తపురుషుణ్ణే అనే జ్ఞానాన్ని కలుగజేస్తుంది.

ఆ విధంగా మొత్తం ఆధ్యాత్మిక సాధనలో ఈ రెండే ఉంటాయి. చిత్తశుద్ధి పొందు, ఆత్మజ్ఞానం పొందు. చిత్తశుద్ధి పొంది, ఆత్మజ్ఞానం పొందితే మోక్షం పొందుతావు.

కాని ఇక్కడ ఒక విషయం గమనించాలి. చిత్తశుద్ధి పొందాక, జ్ఞానయోగానికి రావాలంటే అది అంత స్పష్టంగా తెలియదు. ఇంతవరకూ చేస్తే నూటికి నూరుశాతం కర్మయోగం చేశావు, తర్వాత ఇంతవరకూ చేస్తే జ్ఞానయోగం పొందుతావని స్పష్టంగా విడదీసే విభజన లేదు. కర్మయోగం చేస్తూనే, నెమ్మదిగా జ్ఞానయోగసాధన మీద ఎక్కువ దృష్టి పెడుతూరావాలి. నెమ్మదిగా అటు మీ శ్రద్ధను, ఇటు సమయాన్ని జ్ఞానయోగానికి కేటాయించుకుంటూ రావాలి. అలా రాకపోతే, అసలు వేదాంతం అనేది ఒకటుందనే తెలియదు. అందువల్ల మొదట్లో కర్మయోగ ప్రధానంగా జీవితం గడిపినా, వేదాంతానికి కూడా చోటివ్వాలి. తర్వాత నెమ్మదిగా కర్మయోగ ప్రధానజీవితం జ్ఞానయోగప్రధాన జీవితంగా మారాలి. అలా మీరు చెయ్యాల్సిన సాధనలు రెండే ఉన్నాయి. అవి కర్మయోగసాధన, జ్ఞానయోగసాధన. చిత్తశుద్ధి పొందు, జ్ఞానం పొందు, మోక్షం కలుగుతుంది. మొత్తం భగవద్గీత సారం ఈ 17 శ్లోకాల్లో వచ్చేసింది.

### 3. ఆరు అంశాల విశ్లేషణ – శ్లోకాలు: 18–40

18వ శ్లోకంనుంచి కృష్ణపరమాత్మ కొత్త పంథాలో వెళుతున్నాడు. మళ్ళీ గీతాసారాన్ని చెబుతున్నాడు కాని, ఇది పూర్తిగా భిన్నమైన ఇంకొక పద్ధతిలో. 18–40 శ్లోకాలు మళ్ళీ సారాంశ శ్లోకాలే.

కృష్ణపరమాత్మ ఆరు అంశాలను తీసుకుని ఒక్కొక్కదాన్నీ మళ్ళీ మూడుగా విభజిస్తున్నాడు. ఆ మూడు ఏమిటో మీరే ఊహించవచ్చు. అవి సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలు.

మీరు ఈ ఆరు అంశాలు, ఈ మూడు భాగాలుగా విభజన అయిన అంశాలు; బాగా అర్థం చేసుకుంటే, మీకు భగవద్గీత బాగా అర్థమయిందని అర్థం. ముందుగా పద్దెనిమిదవ శ్లోకంలో దానికి ఉపోద్ఘాతాన్ని ఇవ్వబోతున్నాడు. ఈ ఉపోద్ఘాతంలో ఒక ముఖ్యమైన, ఆసక్తికరమైన విషయాన్ని నిర్వచించబోతున్నాడు.

మనిషి చేసే కార్యకలాపాలను ప్రధానంగా రెండుగా విభజించవచ్చు. అవి చేసే వ్యవహారం, తెలుసుకునే వ్యవహారం. చేసే వ్యవహారాన్ని **కర్మవ్యవహారం** అంటారు; తెలుసుకునే వ్యవహారాన్ని **జ్ఞానవ్యవహారం** అంటారు. జీవితమంతా ఈ రెండే చేస్తూ ఉంటారు. పని చెయ్యటమో, జ్ఞానం పొందటమో.

ఈ రెండింటినీ మూడుదశలుగా విభజించవచ్చు.

ఎ) **జానాతి** – జ్ఞానవ్యవహారం, కర్మవ్యవహారాల్లో ముందు జ్ఞానవ్యవహారం చేస్తారు. ఒక విషయం లేదా ఒక వ్యక్తి లేదా ఒక వస్తువు గురించి తెలుసుకుంటే అప్పుడు మీకు వాటిమీద ఇష్టమో, అయిష్టమో ఏర్పడుతుంది. ఒక విషయం గురించి తెలుసుకుంటారు.

బి) **ఇచ్ఛతి** – ఆ తెలిసిన వస్తువుమీదే ఇష్టాయిష్టాలు ఏర్పడతాయి.

సి) **యతతే** – ఒక వస్తువుమీద ఇష్టం ఏర్పడితే, ఆ వస్తువును పొందటానికి ప్రయత్నం చేస్తారు. దాన్ని ప్రవృత్తిమార్గం అంటారు. ఒకవ్యక్తి నచ్చితే అతన్ని పదేపదే కలవాలనుకుంటారు. ఒక ఊరు నచ్చితే అక్కడికి వెళ్ళాలనుకుంటారు. అంటే మీకు నచ్చిన వ్యక్తి లేదా ఊరిమీద మీకు రాగం ఏర్పడుతుంది.

కాని కొన్ని వస్తువులన్నా, కొంతమంది మనుష్యులన్నా మీకు అసలు ఇష్టం ఉండదు. వారు ఇటువైపు వస్తున్నారని ఆమడదూరంనుంచి చూసి, మీ దోవను మార్చుకుంటారు. అంటే వారికి దూరంగా పారిపోవటానికి ప్రయత్నిస్తారు. దాన్ని నివృత్తిమార్గం అంటారు. ఇది ఆవ్యక్తులమీద ఏర్పడిన ద్వేషంవల్ల జరుగుతున్నది.

అంటే ఒక వస్తువు గురించిన జ్ఞానం, మీకు దానిమీద రాగాన్నో, ద్వేషాన్నో కలుగజేస్తున్నది. దాన్ని ఇచ్ఛతి అంటారు. రాగం ఉంటే దానివెంట పడతారు; దాన్ని ప్రవృత్తి అంటారు. ద్వేషం ఉంటే దానికి దూరంగా పోతారు; దాన్ని నివృత్తి అంటారు. రెండూ కలిపి యతతే అంటారు.

ఈ రాగద్వేషాలు తెలిసిన వస్తువుమీదే ఏర్పడుతాయి. సుమారు వంద సంవత్సరాల కిందట టెలివిజన్ అంటే ఎవరికీ తెలియదు; ఏసీ అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. అందువల్ల వాటివెంట పడే అవకాశం లేదు.

పద్ధతి ఏమిటి? **జానాతి, ఇచ్ఛతి, యతతే** – తెలుసుకుంటారు, ఇష్టపడతారు, దానివెంట పడతారు. జీవితమంతా ఈ మూడింటిచుట్టే తిరుగుతుంది. అన్నేసి ప్రకటనలు ఎందుకు ఇస్తారు వ్యాపారవేత్తలు? ఆ వస్తువును ముందు వద్దనుకున్నా, పదేపదే వినేసరికి, దానిమీద మీకు తెలియకుండానే మోజు పుడుతుంది; దానివెంట పడతారు. అంటే జానాతి, ఇచ్ఛతి, యతతే అయిపోతుంది.

మీ జీవితాన్ని గమనిస్తే ముందు 20–25 సంవత్సరాల జీవితకాలం విద్యార్థులుగా గడిపేస్తారు. ఆ కాలంలో విద్యనభ్యసించటమే సరిపోతుంది. కర్మ చేసేది తక్కువగా ఉంటుంది. అందువల్ల మీవల్ల కుటుంబానికి, ఆ సమయంలో సహాయం ఉండదు. ఇంకా మాట్లాడితే కుటుంబానికి ఖర్చు ఎక్కువగా ఉంటుంది. అంటే అప్పుడు మీరు నడిపే వ్యవహారం ఏమిటి? జ్ఞానవ్యవహారం.

ఆ జ్ఞానవ్యవహారం నడపటానికి మూడు అంశాలు కావాలి. అవి జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాతా.

చదువు అయ్యాక ఉద్యోగం వేటలో ఉంటారు. అందరూ అడుగుతుంటారు కూడా, 'చదువైపోయింది కదా, ఇప్పుడేం చేస్తావు?' అంటే ఇప్పుడు ఉద్యోగంలో చేరితే కర్మవ్యవహారం మొదలవుతుంది. జ్ఞానం ఇచ్ఛను కలుగజేస్తుంది. ఇచ్ఛ ఆ కర్మ చేసేలా చేస్తుంది. ఒక కోరిక కలిగితే దాన్ని తీర్చుకోకుండా ఉండటం అసాధ్యం. ఎందుకంటే అది మీ మెదడును తొలిచేస్తుంటుంది. అందువల్ల కోరికను తీర్చుకోవాలి.

కోరికను ఎలా తీర్చుకోవాలి? ఉద్యోగం చెయ్యటం మొదలుపెట్టాలి. ఉద్యోగం చెయ్యటం, క్రెడిట్‌కార్డ్ తీసుకోవటం, ఇష్టం వచ్చినట్టుగా అన్నీ కొనేయటం, జీవితమంతా ఇన్‌స్టాల్‌మెంటు కట్టుకుంటూ కూర్చోవటం. ఇదీ ఇప్పటి పద్ధతి. అందరిదీ కాదు, కొందరిది. దానిమీద ఒక జోక్ ఉంది. ఒకవ్యక్తి ఉయ్యాల కొన్నందుకు ఆఖరి ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాడు. అది తీసుకున్న వ్యక్తి, 'ఆ పాపాయి ఎలా ఉన్నాడు?' అని అడిగాడు. ఆ డబ్బు కట్టినవ్యక్తి 'నేనే ఆ పాపాయిని,' అన్నాడు. అంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోండి. ఇలా ఎందుకు జరుగుతోంది? జానాతి, ఇచ్ఛతి, యతతే సూత్రంవల్ల జరుగుతోంది.

అలా అని మనిషి కోరిన కోరికలన్నీ తీర్చుకోగలుగుతాడా? **కోరికలు అనంతం.** పది కోరికలు తీరితే, వంద కోరికలు పుట్టుకువస్తాయి. అన్నీ తీర్చుకోవటానికి ఒక జీవితకాలం సరిపోదు. మరణశయ్యమీద ఉన్న వ్యక్తిని అడిగిచూడండి, 'నీ కోరికలన్నీ తీరాయా?' అతను 300 పేజీల నోట్‌బుక్ తీస్తాడు. అందులో తన తీరని కోరికల పట్టిక ఉంటుంది. అతని తీరని కోరికల్లో ఏ కోరిక బలంగా ఉంటే, ఆ కోరిక అతని మరుజన్మను నిశ్చయిస్తుంది.

**కామాన్ యః కామయతే మన్యమానః స కామభిర్జాయతే తత్ర తత్ర**

**పర్యాప్తకామస్య కృతాత్మనస్తు ఇహైవ సర్వే ప్రవిలీయంతి కామాః** – ముండకమ్ 3.2.2

అలా మనిషి ఏ తీరని కోరికలతో మరణిస్తే, ఆ పరిసరాల్లో మళ్ళీ పుడతాడు. అక్కడ మళ్ళీ జానాతి, ఇచ్ఛతి, యతతే కొనసాగుతుంది. కొత్త విషయాలు నేర్చుకుంటాడు, కొత్త కోరికలు పుట్టుకొస్తాయి, కొత్త పనులు చేస్తాడు.

ఆ విధంగా జ్ఞానవ్యవహారానికి త్రిపుటి – జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాతా కావాలి. కర్మవ్యవహారానికి త్రిపుటి – కర్త, కరణం, కర్మ కావాలి. ఈ వృత్తం ఎప్పుడు ఆగుతుంది? జ్ఞానమార్గానికి వచ్చి, ఆత్మజ్ఞానం పొందితేనే ఆగుతుంది. వేరే ఏ జ్ఞానం పొందినాకూడా కోరికలు ఉంటూనే ఉంటాయి; కర్మ కొనసాగుతూనే ఉంటుంది. ఒక్క ఆత్మజ్ఞానం పొందితేనే కోరికలన్నీ దగ్ధమవుతాయి. ఈ ఆరు అంశాలను ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ చర్చిస్తాడు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము.

శ్లో. 18 **జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥**

జ్ఞానమ్, జ్ఞేయమ్, పరిజ్ఞాతా, త్రివిధా, కర్మచోదనా,
కరణమ్, కర్మ, కర్తా, ఇతి, త్రివిధః, కర్మసంగ్రహః ॥

పరిజ్ఞాతా = తెలిసికొనువాడు
జ్ఞానమ్ = జ్ఞానము
జ్ఞేయమ్ = తెలిసికొనదగిన వస్తువు అను
కర్మచోదనా = కర్మ ప్రేరణములు
త్రివిధా = మూడువిధములు
కర్తా = కర్త

కరణమ్ = కరణము
కర్మ = క్రియ
ఇతి = అని
కర్మసంగ్రహః = కర్మసంగ్రహములు
త్రివిధః = మూడు విధములు

**జ్ఞానమ్, జ్ఞేయమ్, పరిజ్ఞాతా ఇతి త్రివిధా కర్మ–చోదనా (అస్తి)**

**కరణమ్, కర్మ, కర్తా (ఇతి) త్రివిధః కర్మ–సంగ్రహః (అస్తి) ॥**

తా: తెలిసికొనువాడు, జ్ఞానము, తెలిసికొనదగిన వస్తువు అను కర్మ ప్రేరణములు మూడువిధములు. కర్త, కరణము, క్రియ అని కర్మసంగ్రహములు మూడు విధములు.

జ్ఞానం పొందాలన్నా, కర్మ చెయ్యాలన్నా కూడా మూడేసి అంశాలు కావాలి. మూడు అంశాలను త్రిపుటి అంటారు. కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో ఆ త్రిపుటిని పేర్కొంటున్నాడు.

**జ్ఞానమ్** – జ్ఞానమ్ అంటే జ్ఞానం, నాలెడ్జ్.

**జ్ఞేయమ్** – తెలిసికొనవలసిన వస్తువు, ఆబ్జెక్టు.

**పరిజ్ఞాతా** – తెలుసుకొనే వ్యక్తి, సబ్జెక్టు.

**త్రివిధా కర్మచోదనా** – ఈ మూడూ కర్మను ప్రేరేపిస్తాయి.

అంటే జ్ఞానం పొందినవ్యక్తి అంతకంతకూ కర్మల్లో కూరుకుపోతాడు. పూర్వకాలపు పల్లెల జీవనం తీసుకుంటే, వారికి చాలా విషయాలు తెలియవు; తెలియని విషయాలమీద కోరికలూ ఉండవు. కోరికలు ఉండవు కాబట్టి, అవి తీర్చుకునే కర్మలు చేసేపనీ ఉండదు. అందువల్ల వారి జీవితం ప్రశాంతంగా ఉండేది. అదికాక ఖాళీ సమయం కూడా ఎక్కువ ఉండేది. కాని ఎండాకాలం వస్తే విహారయాత్రలకు ప్రణాళికలు వేయరు.

కాని ఇప్పటి జీవనవిధానం మారింది. జ్ఞానం పెరిగింది, కోరికలు పెరిగాయి; కర్మలూ పెరిగాయి. సెలవలొస్తే ఎక్కడివి తీసుకువెళతావు అంటారు పిల్లలు. మీరు గీతాబోధ వింటూ, మీ మటుకు మీరు వైరాగ్యాన్ని పెంచుకున్నా కూడా, వారు ఊరుకోరు. తోటివారితో పోటీ ఉంటుంది. అందువల్ల కర్మ చేస్తూనే ఉండాలి, పరుగులు తీస్తూనే ఉండాలి.

**వాటీజ్ దిస్ లైఫ్ ఇఫ్, ఫుల్ ఆఫ్ కేర్,**

**వియ్ హావ్ నో టైమ్ టు స్టాండ్ అండ్ స్టేర్ – డేవిస్**

ఏమిటీ జీవితం; అంతా బెంగలమయమే, మనకు నిలబడి, తేరిపారచూసే తీరికే లేదు అని వాపోతున్నాడు ఒక ఆంగ్లకవి.

అందులో ఈ సెల్‌ఫోన్లు వచ్చాక జీవితం ఇంకా బిజీ అయిపోయింది. ఎక్కడికి వెళ్ళినా, అది నిరంతరం మోగుతూనే ఉంటుంది. గంట విశ్రాంతిగా కూర్చోనివ్వదు. గంట ప్రశాంతంగా గీతాబోధను విననివ్వదు. అలాంటి బోధల్లో ప్రత్యేకించి ప్రకటిస్తారు – దయచేసి మీ సెల్‌ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి పెట్టుకోండి అని. అయినా చాలామంది వినరు. అంటే జ్ఞానం పొందే తీరికకూడా లేదు; పని, పని, పని!

అందువల్ల జ్ఞానం, జ్ఞేయం, పరిజ్ఞాతా అనే ఈ త్రిపుటి కర్మను ప్రేరేపిస్తుంది. ఇక్కడ ఒక విషయం గమనించాలి. జ్ఞానం కోరికను, కర్మను ప్రేరేపిస్తాయి అంటే అది ఆత్మజ్ఞానం కాదు. ఆత్మజ్ఞానం తప్ప, తక్కినవన్ని మామూలు

జ్ఞానాలు. వాటిని ముండకంలో అపరావిద్య అంటారు; ఆత్మజ్ఞానాన్ని పరావిద్య అంటారు. అపరావిద్య అనంతమైన కోరికలను పెంపొందిస్తే, పరావిద్య కోరికలను పెంపొందించదు సరికదా, ఉన్న తక్కిన కోరికలన్నింటినీ కూడా పారద్రోలుతుంది. ఎందుకంటే ఆత్మజ్ఞానం నేను పరిపూర్ణుణ్ణి అనే జ్ఞానం ఇస్తుంది. ఇంక కోరికకు చోటేది?

**శ్రీభగవాన్ ఉవాచ**

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – 2.55

జ్ఞాని ఆత్మలోనే రమిస్తాడు. అందువల్ల అతనికి కోరికలు ఉండవు. ఒకవేళ ఉన్నాకూడా, వాటికోసం అంతగా వెంపర్లాడడు.

**కరణం కర్మ కర్తేతి** – కర్మ వ్యవహారం నడపటానికి ఇంకొక త్రిపుటి కావాలి. అవి కర్త, కరణం, కర్మ. కరణం అంటే పరికరం, కర్మ అంటే ఆబ్జెక్టు, కర్త అంటే కర్మచేసే వ్యక్తి (సబ్జెక్టు).

**త్రివిధః కర్మసంగ్రహః** – ఈ త్రిపుటి పరిధిలో కర్మ వ్యవహారం జరుగుతుంది. జ్ఞానవ్యవహారానికి మూడు, కర్మవ్యవహారానికి మూడు కావాలి అని విభజించి చూపాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 19 **జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।**
**ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥**
జ్ఞానమ్, కర్మ, చ, కర్తా, చ, త్రిధా, ఏవ, గుణభేదతః,
ప్రోచ్యతే, గుణసంఖ్యానే, యథావత్, శృణు, తాని, అపి ॥

| | | | |
|---|---|---|---|
| గుణసంఖ్యానే | = సాంఖ్యశాస్త్రమునందు | గుణభేదతః | = గుణభేదములనుబట్టి |
| జ్ఞానమ్ | = జ్ఞానము | త్రిధా, ఏవ | = మూడు విధములుగానే |
| చ | = ఇంకా | ప్రోచ్యతే | = చెప్పబడినవి |
| కర్మ | = కర్మ | తాని, అపి | = వానిని గూర్చియు |
| చ | = అలాగే | యథావత్ | = సమగ్రముగా వివరించెదను |
| కర్తా | = కర్త | శృణు | = వినుము |

**జ్ఞానమ్, కర్మ చ కర్తా చ త్రిధా ఏవ గుణ-భేదతః**
**గుణ-సఙ్ఖ్యానే ప్రోచ్యతే, తాని అపి యథావత్ శృణు ।**

తా: సాంఖ్యశాస్త్రమునందు జ్ఞానము ఇంకా కర్మ, అలాగే కర్త గుణభేదములనుబట్టి మూడు విధములుగానే చెప్పబడినవి. వానిని గూర్చియు సమగ్రముగా వివరించెదను వినుము.

ముందు శ్లోకంలో ఉదహరించిన ఆరు అంశాల్లో, తన విశ్లేషణకు ముందుగా కృష్ణపరమాత్మ మూడు అంశాలను తీసుకుంటున్నాడు.

**జ్ఞానం కర్మ చ కర్తా** – జ్ఞానం అంటే జ్ఞానం, కర్మ అంటే క్రియ. ఈ శ్లోకంలో కర్మ అంటే క్రియ. ముందు శ్లోకంలో కర్మ అంటే ఆబ్జెక్టు. మూడవ అంశం కర్తా. కర్తా అంటే కర్మచేసే వ్యక్తి. అంటే జ్ఞానం, క్రియ, కర్త. ఈ మూడు అంశాలూ మళ్ళీ మూడేసిగా వస్తాయి.

**త్రిధైవ గుణభేదతః** – త్రిధ అంటే మూడురకాలుగా. పైన చెప్పబడిన మూడూ, గుణభేదతః – వాటి గుణాల్లో ఉన్న భేదాన్నిబట్టి మూడుగా విభజించబడ్డాయి. అవి సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలు. అంటే పై మూడులో ఒక్కొక్కదానికీ ఈ మూడూ కలుపుకోవాలి. అంటే –

జ్ఞానం – సాత్త్విక జ్ఞానం, రాజసిక జ్ఞానం, తామసిక జ్ఞానం
కర్మ – సాత్త్విక కర్మ, రాజసిక కర్మ, తామసిక కర్మ
కర్తా – సాత్త్విక కర్తా, రాజసిక కర్తా, తామసిక కర్తా

వెరసి తొమ్మిది అంశాలు ఉన్నాయి. ఇవన్నీ ఎక్కడ ఉన్నాయని సందేహం రావచ్చు. కృష్ణపరమాత్మ ఆ సందేహం రాకముందే, దాన్ని తీరుస్తున్నాడు. సందర్భం దొరికినప్పుడల్లా కృష్ణపరమాత్మ అది తన స్వంతం కాదనీ, వేదాంతశాస్త్రంలో చెప్పినదాన్ని తను చెబుతున్నాననీ పేర్కొంటూనే ఉన్నాడు.

**గుణసంఖ్యానే ప్రోచ్యతే** – గుణసంఖ్యా అంటే సాంఖ్యదర్శనం. ఇది మూడుగుణాల విశ్లేషణలో ఆరితేరింది. వేదాంతంలో కూడా ఈ మూడుగుణాలను విశ్లేషిస్తాము కాని, ఇందులో ఆరితేరారు సాంఖ్యులు. అందువల్ల కృష్ణపరమాత్మ వారి విశ్లేషణను తీసుకుందాము అంటున్నాడు.

ఈ విషయాన్ని గమనించాలి. మనం ఏ సిద్ధాంతాన్ని కానీ, దర్శనాన్ని కానీ పూర్తిగా కొట్టివేయము. ఎందులో మంచి ఉన్నా, అదిగనుక తార్కికంగా ఉంటే అంటే శ్రుతి, యుక్తి, అనుభవాలను అనుసరించి ఉంటే, మనం వాటిని తప్పకుండా స్వీకరిస్తాము. మనకు మన అద్వైతంమీద మాత్రమే వెర్రి అభిమానమూ లేదూ, తక్కినవాటిని గుడ్డిగానూ తిరస్కరించము. ఎందులో ఏ అద్భుతం ఉన్నా, దాన్ని మనసారా స్వీకరిస్తాము.

కొంతమంది మరీ విపరీతధోరణి చూపిస్తారు. కొంతమందికి విదేశాలమీద మోజు ఉంటుంది. విదేశాలకు సంబంధించిన ప్రతిదాన్నీ మెచ్చుకుని, స్వదేశానికి సంబంధించిన ప్రతిదాన్నీ విమర్శిస్తారు. ఇంకొకరకం మనుష్యులు ఉన్నారు. వారికి స్వదేశ అభిమానం ఉంటుంది. స్వదేశానికి సంబంధించిన ప్రతిదాన్నీ మెచ్చుకుంటారు; విదేశానికి చెందినది అంటే విమర్శిస్తారు. రెండూ చెయ్యకూడదు అంటుంది శాస్త్రం. ఏ సిస్టమ్‌ను కూడా గుడ్డిగా స్వీకరించకూడదు, పూర్తిగా తిరస్కరించనూకూడదు.

అయితే ఏం చెయ్యాలి? దాన్ని విశ్లేషించి, మీ ఆలోచనాధోరణిని ఉపయోగించి, ఎక్కడ మంచి ఉంటే, అది స్వీకరించాలి. మీరేం చేస్తారు? విదేశీయులు ఎంతసేపూ లౌకికవిజయాలనే కోరుకుంటారని వారిని ఎంతగా విమర్శిస్తారంటే, మీ సమయమంతా వారిని విమర్శించటానికే సరిపోతుంది. మన ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేసే తీరికే లేదు మీకు. అందువల్ల దేన్నీ గుడ్డిగా విమర్శించకూడదు.

**యుక్తియుక్తం వచో గ్రాహ్యం బాలాదపి శుకాదపి**

**యుక్తిహీనం వచః త్యాజ్యం వృద్ధాదపి శుకాదపి**

ఏదైనా తార్కికంగా ఉంటే దాన్ని స్వీకరించాలి. అది పిల్లవాడు చెప్పినా సరే, శుకమహర్షి చెప్పినా సరే. శుక పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. అవి చిలుక, శుకమహర్షి. వినదగునెవ్వరు చెప్పిన అంటారు. అలాగే బాలుడు చెప్పినా, శుకమహర్షి చెప్పినా మంచి అయితే స్వీకరించాలి. కాని అర్థంలేకుండా ఎవరైనా, ఏదైనా చెపితే, ఆ చెప్పింది వయోవృద్ధుడైనా, జ్ఞానవృద్ధుడైనా స్వీకరించకూడదు.

కృష్ణపరమాత్మ ఇక్కడ సాంఖ్యయోగుల అభిప్రాయాన్ని తీసుకుంటున్నాడు. సాంఖ్యయోగులు చెప్పినదాన్ని,

**తాని అపి శృణు** – నువ్వు విను.

**యథావత్** – నేను చెప్పినది చెప్పినట్టుగా విను అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇది ఉపోద్ఘాతం. ముందు మూడు అంశాలతో మొదలుపెట్టబోతున్నాడు. అవి జ్ఞానం, కర్మ, కర్తా. మొత్తం ఆరు ఉన్నాయి. ముందు మూడు చూస్తాము.

**ఎ) మూడురకాల జ్ఞానం – శ్లోకాలు: 20–22 ఉపోద్ఘాతం**

జ్ఞానం, కర్మ, కర్తా అనే మూడు అంశాల్లోంచి కృష్ణపరమాత్మ ముందు జ్ఞానం గురించి నిర్వచించబోతున్నాడు. జ్ఞానాన్ని మూడుగా విభజించి, ఒక్కొక్క శ్లోకంలో చెప్పబోతున్నాడు. అంటే సాత్త్విక జ్ఞానం గురించి 20వ శ్లోకంలో, రాజసిక జ్ఞానం గురించి 21వ శ్లోకంలో, తామసిక జ్ఞానం గురించి 22వ శ్లోకంలో నిర్వచించుకువస్తాడు. అందులోనూ ఈ జ్ఞానం దేని గురించిన జ్ఞానం? ఆత్మజ్ఞానం.

నేనెవరు? నేనెవరు అనే విషయాన్ని మీరు అర్థం చేసుకునేస్థాయినిబట్టి మీది తామసిక జ్ఞానమో, రాజసిక జ్ఞానమో, సాత్త్విక జ్ఞానమో చెప్పవచ్చు. ముందు ఈ మూడురకాల జ్ఞానం గురించి చూద్దాము.

ఎ) **తామసిక జ్ఞానము** – మొదట్లో ఎవ్వరైనాసరే, తననుతాను చూసుకుంటే, అతనికి కనిపించేది అతని స్థూలశరీరమే. అది తప్ప మరేమీ కంటికి కనబడదు. ఆ స్థూలశరీరానికి జన్మనిచ్చినవారిని తన తల్లిదండ్రులుగా, తననుంచి పుట్టినవారిని తన పిల్లలుగా భావించి, వారిమీద అభిమానం పెంచుకుంటాడు. వయస్సు పైనబడుతున్నకొద్దీ, తన వయస్సు ఉడిగిపోతోందని బెంగపడతాడు. ఏదో ఒకరోజు తను మరణించాలని భావిస్తాడు. దీన్ని **దేహాత్మబుద్ధి** అంటారు. అంటే నేనెవరు ప్రశ్నకు నేను శరీరాన్ని అనుకుంటాడు.

శరీరం కాకుండా ఇంకేదైనా ఉందా అంటే విజ్ఞానశాస్త్రజ్ఞుడు ఏమీ లేదు అంటాడు. మనస్సు లేదా అంటే మనస్సు మెదడులో ఉంటుంది. శరీరం పోతే అదికూడా పోతుంది అంటాడు. ఇది చార్వాక దర్శనం కూడా. చార్వాకులు శరీరం తప్ప వేరే ఏమీలేదు అంటారు. నేను అశాశ్వతమైన జీవిని, నాలాగా ఇంకా ఎందరో అశాశ్వతమైన జీవులు ఉన్నారు అంటారు. దేహాత్మభావనను **తామసిక జ్ఞానము** అంటారు.

బి) **రాజసిక జ్ఞానము** – ఈ దేహాత్మభావనలో కొన్నాళ్ళు నిలిచాక, నెమ్మదిగా శాస్త్రానికి వస్తాడు. ఎందుకంటే అతనిలో కొన్ని సందేహాలు బయలుదేరతాయి. నేనెవరు? నేను ఒక్క శరీరాన్నేనా? శరీరం కాక ఇంకేదైనా ఉందా?

నాకు పునర్జన్మ ఉందా? నాకు గతజన్మ ఉన్నదా? ఈ సందేహాలను బలపరుస్తూ వచ్చిన అనేక పుస్తకాలను, వ్యాసాలను చదువుతాడు. చిన్నపిల్లలు వారి గతజన్మ స్మృతులను తలచుకోవటం చూస్తూ ఉంటాడు. ఇది ఏదో అరుదైన విషయం. సాధారణంగా మనకు గతజన్మ గుర్తుండదు; గతజన్మ దాకా ఎందుకు, పోయినవారం ఏమయిందో కూడా గుర్తుండదు. ఒకవిధంగా గతజన్మ గుర్తుండకపోవటమే మంచిది కూడా. కాని మనం అరుదుగా ఎవరికో గతజన్మ గుర్తుకురావటం, వారికి గుర్తుకొచ్చిన ఊరికి వెళ్ళి పరిశోధనలు చెయ్యటం వంటి కథలు అప్పుడప్పుడూ వింటూవుంటాము.

అదికాక, చిన్నపిల్లలు కొన్ని రంగాల్లో ఆరితేరతారు. వారిని చైల్డ్‌ప్రాడిజీ అంటారు. ఐదవఏటనే సంగీత విద్వాంసురాలు అవుతుంది ఒక బాలిక. దానిని ఆమె పూర్వజన్మ వాసనలు అంటారు. ఇలాంటి అరుదైన విషయాలు విని, నేనెవరు అని తెలుసుకోవాలనే ఉత్సాహం కొద్దీ శాస్త్రానికి వస్తే, శాస్త్రం నువ్వు శరీరం కాదు, నువ్వు శరీరానికి భిన్నంగా ఉన్నావు అంటుంది. దానితో ఆ సాధకుని దృష్టి స్థూలశరీరంనుంచి సూక్ష్మశరీరానికి మళ్ళుతుంది.

నెమ్మదిగా అతని దృష్టి శరీరంనుంచి, మనస్సు వైపుకు మళ్ళుతుంది. 'నేను శరీరానికి భిన్నంగా ఉన్న జీవిని. నేను గతంలో ఎన్నో జన్మలు పొందివచ్చాను. మళ్ళీ కూడా మరెన్నో పునర్జన్మలు పొందుతాను. నేను ఈ స్థూలశరీరం కాదు, ఇది నాకు తాత్కాలికంగా వచ్చిన నివాసము. ఈ తల్లిదండ్రులు కూడా ఈ శరీరం వరకే పరిమితం. నాకు ప్రతిజన్మలోనూ తల్లిదండ్రులు మారతారు; వచ్చేజన్మలో వేరేవారు వస్తారు. అసలు వచ్చేజన్మలో మనిషిగానే పుడతానో లేదో కూడా తెలియదు. జంతువుగా కూడా పుట్టవచ్చు,' అని అర్థం చేసుకుంటాడు.

అలా ఆ సాధకుడు ఒక మెట్టు పైకి ఎక్కుతాడు. 'నేను శరీరాన్ని అనుకున్నవ్యక్తి కాస్తా, నేను శరీరంలో అద్దెకు ఉన్న జీవిని. అంతేకాదు, మనస్సంటే మెదడు కాదు, మెదడనే పరికరంద్వారా మనస్సు పనిచేస్తుంది. బల్బ్ ద్వారా విద్యుచ్ఛక్తి పనిచేసినట్టుగా, స్థూలశరీరంద్వారా మనస్సు పనిచేస్తుంది. బల్బు ఉన్నా, మాడిపోయినా, విద్యుచ్ఛక్తి ఉంటూనే ఉంటుంది. అదే విధంగా, నేను సూక్ష్మశరీరాన్ని లేదా మనస్సును; ఈ శరీరం పడిపోయాక కూడా నేను ఉంటాను. నేను ఉండటమే కాదు, నేను ప్రయాణం చేస్తాను,' అని అర్థం చేసుకుంటాడు.

**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥** – 15.7

**శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్ ॥** – 15.8

నేను సూక్ష్మశరీరజీవిని. నేను శరీరంనుంచి శరీరానికి, లోకంనుంచి లోకాలకు ప్రయాణం చేస్తాను. మనస్సునైన నాకు మరణం లేదు. ఇదే మనస్సు పూర్వజన్మలో కూడా ఉన్నది; దాని వాసనలు తీసుకుని ఈ జన్మలోకి వచ్చాను; ఈ జన్మ వాసనలు కూడా ప్రోగేసుకుని మరుజన్మలోకి వెళతాను,' అని వేదపూర్వభాగంలో నేర్చుకుంటాడు.

'నేను ఒక శరీరంనుంచి ఇంకో శరీరానికి ప్రయాణం చేస్తాను. నేను శాశ్వతం. నాలాగే అన్ని శరీరాల్లోని మనస్సులు కూడా శాశ్వతం,' అంటాడు. తామసిక జ్ఞానంలో 'నేను శరీరాన్ని, నాలాగా అనేక శరీరాలు ఉన్నాయి,'

అనుకుంటాడు. రాజసిక జ్ఞానంలో 'నేను మనస్సును, నాలాగే అనేక మనస్సులు ఉన్నాయి,' అనుకుంటాడు. తన మనస్సుకు ఎలా మరణంలేదో, అలా తన పితృదేవతలకు కూడా మరణం లేదు అనుకుంటాడు. 'వారు ఏదో లోకంలో ఉండి ఉంటారు. అందువల్ల వారికి శ్రాద్ధకర్మలు చెయ్యాలి,' అనుకుని, శ్రద్ధగా చేస్తాడు. ఇతనికి ఈ జ్ఞానం వేదపూర్వ భాగంనుంచి వస్తుంది. తామసిక జ్ఞానం లౌకిక పుస్తకాలనుంచి వస్తుంది.

**నేను మనస్సును**, నేను శరీరాన్ని కాదు, నా మనస్సుకు చావులేదు, నాలాగా ఎందరో శాశ్వతంగా ఉంటారు అనుకోవటం **రాజసిక జ్ఞానం**.

సి) **సాత్త్విక జ్ఞానం** – అలా కొన్నాళ్ళు రాజసిక జ్ఞానంలో ఉండి, పితృదేవతలకు శ్రాద్ధకర్మలు చేస్తూ, తర్పణాలు వదులుతూ, ఎప్పుడో వేదఅంతభాగానికి వస్తాడు. వేదాంతజ్ఞానం అతని జ్ఞానాన్ని మెరుగుపరుస్తుంది. వేదాంతం ద్వారా తను శరీరమూ కాదు, మనస్సూ కాదని తెలుసుకుంటాడు. మనస్సు ప్రయాణం చేస్తుందనీ, అది కర్తా, భోక్తా అనీ, దానికి వాసనలు ఉన్నాయనీ, దానికి సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు ఉన్నాయనీ, ఇవేవీ తను కాననీ తెలుసుకుంటాడు.

మళ్ళీ మొదటికి వస్తాడు. నేనెవరు? 'నేను శరీరానికి, మనస్సుకు చైతన్యాన్నిచ్చే చైతన్యాన్ని,' అని అర్థం చేసుకుంటాడు. చైతన్యం ఐదు లక్షణాలు ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. చైతన్యం శరీరంలో ఒకభాగం కాదని, శరీరం పడిపోయినా, మనస్సు ప్రయాణం చేసినా, చైతన్యం శాశ్వతమనీ, సర్వవ్యాపకమనీ, అందువల్ల చైతన్యానికి మరణమూ లేదు, ప్రయాణమూ లేదనీ అర్థం చేసుకుంటాడు. శరీరం పడిపోతే చైతన్యాన్ని ప్రకటించే మాధ్యమం ఉండదు కాబట్టి చైతన్యం ఉన్నట్టు తెలియదనీ, అంతమాత్రాన చైతన్యం లేనట్టుకాదనీ కూడా అర్థం చేసుకుంటాడు.

అంటే ఇతను ఇంకొకమెట్టు పైకి ఎక్కుతాడు. నేను శరీరాన్ని కాను, నేను మరణం తర్వాత ప్రయాణించే మనస్సును కూడా కాను, నేను ఈ మనశ్శరీరాలను చైతన్యవంతం చేసే ఆత్మను లేదా చైతన్యాన్ని. నేను ఈ శరీరంలోనే కాదు, శరీరం బయటకూడా ఉన్నాను. నిజానికి నాలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి. నేను సర్వవ్యాపక చైతన్యాన్ని. అందువల్ల నేను ఏకం. అంతేకాదు, నేను అకర్తా, అభోక్తా కూడా. ఇదీ ఆత్మజ్ఞానం యొక్క పరాకాష్ఠ.

నేను చైతన్యాన్ని, నేను ఏకం, నేను అకర్తా, అభోక్తా అని తెలుసుకోవటం **సాత్త్విక జ్ఞానం**.

ఇప్పుడు ఈ జ్ఞానాలను క్రోడీకరిస్తే, ఆత్మజ్ఞానం మూడుదశల్లో కలుగుతుంది. **నేనెవరు**?

| | | |
|---|---|---|
| ఎ) దశ 1 | – నేను దేహాన్ని. ఇది లౌకికపుస్తకాలవల్ల కలుగుతుంది. | – ఇది తామసిక జ్ఞానం |
| బి) దశ 2 | – నేను మనస్సును. ఇది వేదపూర్వభాగంవల్ల కలుగుతుంది. | – ఇది రాజసిక జ్ఞానం |
| సి) దశ 3 | – నేను చైతన్యాన్ని. ఇది వేదఅంతఃభాగంవల్ల కలుగుతుంది. | – ఇది సాత్త్విక జ్ఞానం |

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము.

మనం తామసిక జ్ఞానంనుంచి చెప్పుకువచ్చాము. కృష్ణపరమాత్మ సాత్త్వికజ్ఞానంనుంచి చెప్పుకువస్తున్నాడు.

శ్లో. 20 **సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే ।**
**అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥**
సర్వభూతేషు, యేన, ఏకమ్, భావమ్, అవ్యయమ్, ఈక్షతే,
అవిభక్తమ్, విభక్తేషు, తత్, జ్ఞానమ్, విద్ధి, సాత్త్వికమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యేన | = మనుష్యుడు ఏ జ్ఞానముతో | భావమ్ | = పరమాత్మ తత్త్వమును |
| విభక్తేషు | = వేర్వేరుగా ఉన్న | ఈక్షతే | = చూచునో |
| సర్వభూతేషు | = సమస్త ప్రాణులందును | తత్, జ్ఞానమ్ | = ఆ జ్ఞానమును |
| ఏకమ్ | = ఒకటిగానే ఉన్న | సాత్త్వికమ్ | = 'సాత్త్వికజ్ఞానము'గా |
| అవ్యయమ్ | = శాశ్వతమైన | విద్ధి | = తెలుసుకొనుము |
| అవిభక్తమ్ | = అఖండముగా సమభావస్థితమైన | | |

**యేన (జీవః) విభక్తేషు సర్వ-భూతేషు అవిభక్తమ్, ఏకమ్**
**అవ్యయమ్ భావమ్ ఈక్షతే, తత్ జ్ఞానమ్ సాత్త్వికమ్ విద్ధి ।**

తా: మనుష్యుడు ఏ జ్ఞానముతో వేర్వేరుగా ఉన్న సమస్త ప్రాణులందును ఒకటిగానే ఉన్న, శాశ్వతమైన అఖండముగా సమభావస్థితమైన, పరమాత్మ తత్త్వమును చూచునో ఆ జ్ఞానమును 'సాత్త్వికజ్ఞానము'గా తెలుసుకొనుము.

**విభక్తేషు సర్వభూతేషు ఏకం భావమ్ ఈక్షతే** – ఆ జ్ఞానంతో సమస్త ప్రాణులలోనూ ఒకటే చైతన్యాన్ని చూస్తాడు. భావం అంటే సత్యం; సత్యం అంటే చైతన్యతత్త్వం లేదా ఆత్మతత్త్వం లేదా శుద్ధ సత్. ఎన్ని చైతన్యాలు ఉన్నాయి?

ఏకం – ఒకటే ఉంది. ఎటువంటి చైతన్యం ఇది?

**అవ్యయమ్** – మార్పులేనిది, నిర్వికారమైనది. శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.

మనస్సు కూడా నిరంతరం మారుతుంది. శరీరానికి ధారుఢ్యం తగ్గుతూ వస్తున్నకొద్దీ, మనస్సుకు కూడా పటుత్వం తగ్గుతుంది. అన్నీ మర్చిపోతున్నాను అనుకుంటారు. అలా మనశ్శరీరాలు మార్పుకు లోనవుతాయి కాని చైతన్యం మారదు. అందువల్ల అవ్యయమ్ అంటే నిర్వికారం.

సర్వభూతేషు – ఈ చైతన్యం అన్ని శరీరాల్లో ఉందని నేర్చుకుంటాడు. శరీరాలు అనేకం, మనస్సులు అనేకం కాని అన్నింటిలోనూ ఉండే చైతన్యం ఏకం. బల్బులు అనేకం, ఫిలమెంట్లు అనేకం, విద్యుచ్ఛక్తి ఏకం. బల్బులు స్థూలశరీరం, ఫిలమెంటు సూక్ష్మశరీరం, ఫిలమెంటు పోతే బల్బు వెలగదు, కాని విద్యుచ్ఛక్తి ఉంటుంది. అదే విధంగా సూక్ష్మశరీరం స్థూలశరీరంలోంచి వెళ్ళిపోతే, స్థూలశరీరంలో ప్రాణం ఉండదు కాని, చైతన్యం ఉంటుంది. స్థూలశరీరం స్వరూపం ఏమిటి?

విభక్తేషు – స్థూలశరీరాలు అనేకం, భిన్నం. ఇక్కడొక శరీరం, అక్కడొక శరీరం ఉంటుంది, మధ్యలో ఖాళీ ప్రదేశం ఉంటుంది. దాన్ని ఆకాశం అంటాము. అందువల్ల శరీరాలు విభజించబడ్డాయి. చైతన్యం మాటేమిటి? **అవిభక్తమ్** – కాని చైతన్యం విభజించబడలేదు.

కాంతిలో మీ చెయ్యి పెట్టారు. ఐదువేళ్ళని విడదీసి చెయ్యి పెట్టారు. కాంతి చూపుడువేలుమీద పడుతున్నది, ఉంగరపువేలుమీద కూడా పడుతున్నది. ఇప్పుడు చెప్పండి, కాంతి మీ రెండువేళ్ళ మధ్య కూడా ఉందా, లేదా? ఉంది. కాని మీకు కనబడదు. ఎలా తెలుసు? మళ్ళీ మీ వేళ్ళను జరపండి, తెలుస్తుంది. కాంతి అంటే బల్బు వెదజల్లే కాంతి కాదు. సహజమైన సూర్యకాంతి.

ఈ సూర్యకాంతి మీ చూపుడువేలుమీద పడుతున్నది, ఉంగరపువేలుమీద పడుతున్నది, వేళ్ళమధ్యలో కూడా పడుతున్నది. అదే విధంగా చైతన్యం మీ శరీరంలో ఉంది, మీ ఎదురుగా ఉన్నవ్యక్తిలోను ఉంది; మీ ఇద్దరి మధ్యా ఉన్న ఖాళీలోను ఉంది. కాకపోతే ఆ ఖాళీలో ఉన్న చైతన్యం తెలియటం లేదు.

చైతన్యం మీ శరీరంలో ఉండి, మీ శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది. చైతన్యం లేకపోతే శరీరం జడమవుతుంది. మీ శరీరం, ఇంకా చెప్పాలంటే మీ మనస్సు, చైతన్యానికి మాధ్యమంగా పనిచేసి, చైతన్యాన్ని ప్రకటింపజేస్తుంది. మనస్సు లేకపోతే చైతన్యం ఉంటుంది కాని, ఉన్నట్టు తెలియదు. అందువల్ల మాధ్యమంద్వారా ప్రకటితమైన చైతన్యాన్ని వ్యక్తచైతన్యం అనీ, మాధ్యమంద్వారా ప్రకటించబడని చైతన్యాన్ని అవ్యక్తచైతన్యమనీ అంటారు. అందువల్ల అవిభక్తమ్ అన్నాడు కృష్ణపరమాత్మ. అవిభక్తమ్ అంటే ఆకాశంలాగా భాగాలు లేవు.

**తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్** – ఎవరైతే నేను ఆకాశంలా అవిభక్తమైన చైతన్యాన్ని, నేను ఏకం, నిర్వికారం అని నేర్చుకుంటాడో, అతనికి సాత్త్విక జ్ఞానం ఉంది అని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నేను శరీరం అనుకోవటం చాలా తేలిక; నేను శరీరం పడిపోయినా ఉన్న మనస్సును అనుకోవటం కొంచెం కష్టం. నేను ఈ రెండింటికీ చైతన్యాన్ని ఇచ్చే చైతన్యం అని అర్థం చేసుకోవటం ఇంకా కష్టం. ఒక్కముక్కలో చెప్పాలంటే అద్వైతజ్ఞానాన్ని **సాత్త్వికజ్ఞానం** అంటారు. నేను ఆత్మను. ఆత్మ ఏకం, నిర్వికారం, అవ్యయం, అవిభక్తం అనే జ్ఞానం. ఇది సాత్త్వికజ్ఞానం.

శ్లో. 21 **పృథక్త్వేన తు యద్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్ ।**
**వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥**
పృథక్త్వేన, తు, యత్, జ్ఞానమ్, నానాభావాన్, పృథగ్విధాన్,
వేత్తి, సర్వేషు, భూతేషు, తత్, జ్ఞానమ్, విద్ధి, రాజసమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | పృథక్త్వేన | = దేనికది 'వేర్వేరు' అని |
| యత్, జ్ఞానమ్ | = మనుష్యుడు ఏ జ్ఞానముద్వారా | వేత్తి | = తలంచునో |
| సర్వేషు, భూతేషు | = సమస్త ప్రాణులందును | తత్, జ్ఞానమ్ | = ఆ జ్ఞానము |
| పృథగ్విధాన్ | = వేర్వేరు విధములుగానున్న | రాజసమ్ | = 'రాజసజ్ఞానము'గా |
| నానాభావాన్ | = వివిధ భావములను | విద్ధి | = తెలుసుకొనుము |

**యత్ జ్ఞానమ్ పృథక్త్వేన సర్వేషు భూతేషు తు పృథక్-విధాన్**
**నానా-భావాన్ వేత్తి, తత్ జ్ఞానమ్ రాజసమ్ విద్ధి ।**

తా: కాని మనుష్యుడు ఏ జ్ఞానము ద్వారా సమస్త ప్రాణులయందును వేర్వేరు విధములుగానున్న వివిధ భావములను దేనికది 'వేర్వేరు' అని తలంచునో, ఆ జ్ఞానము 'రాజసజ్ఞానము'గా తెలుసుకొనుము.

రాజసిక జ్ఞానం మధ్యస్థంగా ఉండే జ్ఞానం. అతను నేను శరీరాన్ని అనుకోడు. అంటే తామసిక జ్ఞానికన్నా కొంచెం నయం. తామసిక జ్ఞానం ఉన్నవ్యక్తి ఈ శరీరమే నేను అనుకుంటాడు. దీన్ని చార్వాక దర్శనం అంటారు.

ఈ చార్వాకులు శరీరాన్నే నమ్ముతారు అంటే కంటికి కనబడని వాటిని నమ్మరు. పుణ్యపాపాలను నమ్మరు; ధర్మాధర్మాలను నమ్మరు; స్వర్గనరకాలను నమ్మరు. అందువల్ల 'నువ్విలా చేస్తే, అది పాపం అవుతుంది. మహా నరకాలకు పోతావు,' అని ఎవరైనా చెబితే, పుణ్యపాపాలు ఉన్నాయని ఏమిటి నిదర్శనం? స్వర్గనరకాలు ఉన్నాయని ఏమిటి సాక్ష్యం అంటారు వీరు.

కాని రాజసిక జ్ఞానం పొందేవ్యక్తి, ఈ రాలిపోయే శరీరం వెనక ఇంకొక శాశ్వతమైన అంశం ఉందని వేదపూర్వభాగంనుంచి నేర్చుకుంటాడు. దాన్ని మనస్సుగా నేర్చుకుంటాడు. 'మనస్సుకు ఆలోచించేశక్తి ఉంది కాబట్టి, చెయ్యాలనే సంకల్పం ఉంది కాబట్టి, మనస్సు ద్వారా నేనే అన్ని చేస్తున్నాను; నేను చేసిన కర్మల ఫలాన్ని కూడా నేను అనుభవిస్తాను, నేను కర్తను, నేను భోక్తను,' అని అర్థం చేసుకుంటాడు. తన శరీరంలో మనస్సు ఉన్నట్టుగా, ఎన్ని శరీరాలు ఉంటే అన్ని మనస్సులు ఉన్నాయి అనుకుంటాడు. అందువల్ల అతను ఒకమెట్టు ఎక్కినా కూడా, చివరిమెట్టుకు రాడు. మధ్యమెట్టులో ఆగిపోతాడు. ద్వైతంలోనే ఉంటాడు కాని అద్వైతానికి రాడు.

**యత్ జ్ఞానమ్** – ఏ జ్ఞానంవల్లనైతే,

**పృథగ్విధాన్ నానాభావాన్ వేత్తి** – అనేక, భిన్నమైన జీవాత్మలు ఉన్నాయని నేర్చుకుంటాడు. భావా అంటే ఇక్కడ జీవులు; నానాభావా అంటే అనేక జీవులు. వీరి ఉద్దేశ్యంలో ఈ విభజన శరీరపరంగా కాదు, మనస్సుపరంగా జరుగుతుంది. పృథగ్విధాన్ అంటే ప్రతి ఒక్కజీవి కూడా ఇంకోజీవికి భిన్నంగా ఉందని తెలుసుకుంటాడు. ఒక జీవికి పుణ్యఫలం ఎక్కువ ఉంటే, ఇంకొకజీవికి పాపఫలం ఎక్కువ ఉంటే, మరొకజీవికి రెండూ సమానంగా ఉంటాయి. ఇవన్నీ ఎక్కడ చూస్తాడు?

**సర్వేషు భూతేషు** – అన్ని స్థూలశరీరాల వెనక చూస్తాడు.

సాంఖ్యదార్శనికులు ఆత్మలు అనేకం అంటారు; న్యాయదార్శనికులు ఆత్మలు అనేకం అంటారు. ఎందుకంటే ఆత్మ అంటే మనస్సు అనుకుంటారు వీరు.

**తద్జ్ఞానం విద్ధి రాజసమ్** – ఈ జ్ఞానాన్ని రాజసిక జ్ఞానంగా తెలుసుకో అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నేను మనస్సును, ఎన్ని జీవులు ఉంటే అన్ని జీవాత్మలు ఉన్నాయనే జ్ఞానం. ఇది **రాజసిక జ్ఞానం**.

శ్లో. 22 **యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహైతుకమ్ ।**
**అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥**
యత్, తు, కృత్స్నవత్, ఏకస్మిన్, కార్యే, సక్తమ్, అహైతుకమ్,
అతత్త్వార్థవత్, అల్పమ్, చ, తత్, తామసమ్, ఉదాహృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | అహైతుకమ్ | = హేతుబద్ధము కానిదియు |
| యత్ | = ఏ జ్ఞానము | అతత్త్వార్థవత్ | = తాత్త్వికముగా అర్థరహితమైనదియు |
| ఏకస్మిన్, కార్యే | = ప్రకృతి కార్యరూపమైన శరీరము మాత్రమే | అల్పమ్ | = తుచ్ఛమైనదియు అయివుందో |
| | | తత్ | = ఆ జ్ఞానము |
| కృత్స్నవత్ | = సర్వస్వము అనిపించే | తామసమ్ | = 'తామసము' అని |
| సక్తమ్ | = ఆసక్తిని కల్గించునట్టిదియు | ఉదాహృతమ్ | = పేర్కొనబడినది |
| చ | = ఇంకా | | |

**యత్ తు ఏకస్మిన్ కార్యే కృత్స్నవత్ సక్తమ్ అహైతుకమ్**

**అతత్త్వార్థవత్ అల్పమ్ చ, తత్ (జ్ఞానం) తామసమ్ ఉదాహృతమ్ ।**

తా: కాని ఏ జ్ఞానము ప్రకృతి కార్యరూపమైన శరీరము మాత్రమే సర్వస్వము అనిపించే ఆసక్తిని కల్గించునట్టిదియు ఇంకా హేతుబద్ధము కానిదియు, తాత్త్వికముగా అర్థరహితమైనదియు, తుచ్ఛమైనదియు అయివుందో, ఆ జ్ఞానము 'తామసము' అని పేర్కొనబడినది.

ఇప్పుడు తామసిక జ్ఞానాన్ని చూడబోతున్నాము. ఈ జ్ఞానాన్ని లౌకికదృష్టి ఉన్నవ్యక్తి పొందుతాడు. అదికూడా లౌకికపుస్తకాలు చదివి పొందుతాడు. అందువల్ల ఇతను నేనెవరు ప్రశ్నకు నేను శరీరాన్ని అంటాడు. అతను మనస్సును కూడా స్వీకరించడు. అందువల్ల శరీరం మరణిస్తే, ఆ జీవి కూడా మరణించినట్టే అనుకుంటాడు అతను.

ఒకవేళ అతనితో, 'నీ స్థూలశరీరం వెనక ఒక సూక్ష్మశరీరం ఉంది, శరీరం మరణించాక అది ప్రయాణిస్తుంది,' అని అంటే అతను దానికి నిదర్శనమేమిటి అని ఎదురు ప్రశ్నిస్తాడు. అది గుడ్డినమ్మకం కాదా అని నిలదీస్తాడు. అతను ప్రత్యక్షప్రమాణాన్ని తప్ప నమ్మడు. అంటే ఇంద్రియగోచరం కాని దేన్నీ నమ్మడు. అటువంటి వ్యక్తితో వాదించి ప్రయోజనం లేదు. అతనికి మనం సూక్ష్మశరీరాన్ని ప్రత్యక్షంగా చూపించలేము.

ఎవరో ఆత్మ బరువు ఎంత ఉంటుందో తెలుసుకోవాలనుకున్నారుట. అందువల్ల మరణశయ్యమీద ఉన్న ఒకవ్యక్తి బరువును అతను మరణించక ముందు కొలిచారు. మరణించగానే కొలిచారు.మరణించక ముందు ఉన్న బరువులోనుంచి మరణించాక ఉన్న బరువును తీసేస్తే, ఆత్మ బరువు తెలుస్తుందనుకున్నారుట ఆ మేధావులు. కాని తమాషా ఏమిటంటే, అతని శరీరం బరువు మరణించక ముందుకన్నా మరణించాక ఎక్కువ ఉంది. అంటే ఆత్మకు బరువు మైనస్‌లో ఉంటుందా? శాస్త్రం స్పష్టంగా చెబుతుంది, పంచజ్ఞానేంద్రియాలకు అందనివెన్నో ఈ సృష్టిలో ఉన్నాయని.

ఈ ఉదాహరణను ఇంతకుముందు కూడా చూశాము. ఒకవ్యక్తి పుట్టుగుడ్డి అనుకుందాము. అతనికి కంటిచూపు లేదు. అందువల్ల అతనికి కంటితో మాత్రమే చూసే ఒక ప్రపంచం ఉందని తెలియదు. కన్ను చూసే రంగు, రూపులను అతను ఆస్వాదించలేడు. మీరు అతనితో, నీకు తెలియని ఒక ప్రపంచం ఉందని చెపితే, 'నేను నమ్మను. నేను నాకున్న నాలుగు ఇంద్రియాలలో దేనితోనైనా చూస్తేనే ఒప్పుకుంటాను,' అంటే ఎలా ఉంటుంది? 'నీ నాలుగు ఇంద్రియాలు ఈ రంగంలో పనిచేయవు నాయనా! కన్ను అనే ఇంకొక ప్రమాణం ఉందని ఒప్పుకో,' అంటారు.

ఇదేసూత్రం సృష్టిలోని అనేక అంశాలకు అన్వయించాలి. పంచజ్ఞానేంద్రియాలకు అందనివెన్నో ఉన్నాయి. వాటిని తెలుసుకోవాలంటే ఆరవ ఇంద్రియానికి వెళ్ళాలి. దాన్ని శాస్త్రచక్షుః అంటారు. శాస్త్రం ఆరవకన్నులాగా పనిచేస్తుంది. కన్ను చూపించినదాన్ని సత్యంగా ఎంత గట్టిగా నమ్ముతారో, శాస్త్రం చూపించినదాన్ని కూడా అంత గట్టిగా సత్యంగా నమ్మాలి. విజ్ఞానశాస్త్రంలో చేసే పరిశోధనలు కూడా ఆత్మ విషయంలో పనిచెయ్యవు. ఎందుకంటే దాని పరిధి ఆత్మకు సరిపోదు.

వేదాంతమే తన గురించి పరిచయం చేసుకుంటూ, ఇలా చెబుతుంది, 'నేనిక్కడ ఉన్నది మీకు ఇంద్రియాల ద్వారా అందనిదాని గురించి బోధ చెయ్యటానికి.' కాని మనం వింటేగా? ఒకపక్క వేదాంతం, ఆత్మ ఇంద్రియ అగోచరం అని చెబుతూవుంటే, 'ఏదీ ఆత్మను నా ఇంద్రియాలకు చూపించు అంటాడు,' ఇతను. ఏంచెప్పాలి?

**ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపయో న విద్యతే**
**ఏవం విదంతి వేదేన తస్మాత్ వేదస్య వేదతా**

వేదంయొక్క నిర్వచనమే అది ఆరవ ఇంద్రియం అని. వేదానికి అందుబాటులో ఉన్నది, తక్కిన ఇంద్రియాలకు అందుబాటులో ఉండదు. అంతదాకా ఎందుకు? కన్ను చూసినదాన్ని చెవి వినలేదు; చెవి విన్నదాన్ని కన్ను చూడలేదు.

ఇంద్రియం నిర్వచనం ఏమిటి? ఇంద్రియం అంటే ఒక ప్రత్యేకమైన వస్తువును తెలియజేస్తుంది. ఒక ఇంద్రియం చూపించినదాన్ని ఇంకొక ఇంద్రియం చూపించలేదు. ఇంత ప్రాథమికసూత్రం తెలుసుకోలేక, సూక్ష్మశరీరం ఇంద్రియాలకు అందదు; విజ్ఞానశాస్త్ర ప్రయోగాలకు అందదు; కాబట్టి పితృదేవతలు స్వర్గలోకాలకు వెళ్ళటం అనేది నమ్మశక్యం కాదు. అందువల్ల వారికి శ్రాద్ధకర్మలు చెయ్యటం, తర్పణాలు వదలటం అంతా అర్థంలేని పని అంటాడు ఇతను. ఇవంతా కాకమ్మ కథలు అంటాడు.

కృష్ణపరమాత్మ ఇటువంటి వ్యక్తులతో వాదించకండి అంటాడు. ఎందుకంటే వారితో వాదించి ప్రయోజనం లేదు. ఆ వ్యక్తులకు నిదర్శనం అంటే ఏమిటో తెలియదు; జ్ఞానం అంటే ఏమిటో తెలియదు. అందువల్ల వారిని తామసిక జ్ఞానం ఉన్న వ్యక్తులు అంటారు. ఇంద్రియ అగోచరమైనదాన్ని ఇంద్రియాల ద్వారా చూస్తామంటారు. అదెలాగుంటుందంటే, నేను శబ్దాన్ని కళ్ళద్వారా చూస్తాను అన్నట్టుంటుంది. ఏమైనా అర్థముందా?

**యత్ జ్ఞానమ్** – ఏ జ్ఞానమైతే,

**ఏకస్మిన్ కార్యే సక్తమ్ కృత్స్నవత్** – స్థూలశరీరమే నేను అని నేర్పుతుందో. ఇక్కడ కార్యం అంటే స్థూలశరీరం. గుర్తుపెట్టుకోండి, ఈ శ్లోకంలో కార్యం అంటే స్థూలశరీరం. కృత్స్నవత్ అంటే అదే పూర్తి నేను అనుకుంటాడు. ఈ వాక్యం మొత్తం అర్థం, ఈ జ్ఞానంలో నేను అంటే స్థూలశరీరం అనుకుంటాడు.

శాస్త్రం స్థూలశరీరం, నీలో అత్యంత బాహ్యంగా ఉన్న ఒక్క కోశం మాత్రమే అంటుంది. ఆ కోశాన్ని అన్నమయకోశం అంటారు. అంత బాహ్యంగా ఉన్న కోశాన్నే నేను అని అతను అనుకుంటే, అతను ఇంకా దానిలోపల ఉన్న ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశాలకు వచ్చే ఆస్కారం ఎక్కడ ఉంది? వీటికే రానివ్యక్తి, పంచకోశాలకు అతీతంగా ఉన్న ఆత్మకు వచ్చేది ఎప్పుడు? అది అడియాశే అవుతుంది.

అందువల్ల అటువంటి వ్యక్తితో మీరు వాదిస్తే మీకు కంఠశోషే మిగులుతుంది తప్ప ఏమీ ప్రయోజనం ఉండదు. అతనితో ఒక్కటే చెప్పగలరు, 'నీ మార్గంలో నువ్వు ఆనందంగా వెళ్ళు, నా మార్గంలో నేను ఆనందంగా వెళతాను.'

**కార్యే సక్తమహైతుకమ్** – వారి మాటల్లో ఏమీ తర్కం ఉండదు. లౌకిక విషయాలమీద శ్రద్ధ చూపేవారి మాటలు తర్కానికి విరుద్ధంగా ఉంటాయి.

వారు ప్రత్యక్షం ఒక్కటే ప్రమాణం అంటారు. అవునా? అలాంటప్పుడు వారికి వీపు ఉందని కూడా నమ్మటానికి వీలులేదు. మీరు వారితో ఈ విషయం వాదించవచ్చు, 'నీకు నీ వీపు కనబడదు కాబట్టి, నీకు వీపులేదు.' దీనంత వెర్రిగా ఏదీ ఉండదు. అందువల్ల అహైతుకమ్ అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అతత్త్వార్థవత్** – అందులో అంతిమసత్యం లేదు. అంటే ఈ జ్ఞానం పూర్తిజ్ఞానం కాదు.

**అల్పం చ** – అంతేకాదు, అన్నింటిలోకి అల్పమైన జ్ఞానం. చాలా తక్కువస్థాయి జ్ఞానం. అది ఇచ్చే ఫలం కూడా అల్పఫలమే ఉంటుంది.

**తత్తామసముదాహృతమ్** – ఇటువంటి జ్ఞానాన్ని తామసజ్ఞానము అంటారు.

నేను శరీరాన్ని, ఎన్ని జీవులు ఉంటే, అన్ని శరీరాలు ఉన్నాయనే నిర్హేతుకమైన, అల్పజ్ఞానం అనే జ్ఞానం. ఇది **తామసిక జ్ఞానము**.

నేనెవరు? ఈ ప్రశ్నకు పైన చెప్పినట్టుగా మూడురకాల సమాధానాలను మూడుస్థాయిల్లో పొందుతారు మనుష్యులు వారికున్న స్థాయీభేదాలనుబట్టి. ఆ స్థాయీభేదాలు వారి గుణాలనుబట్టి ఏర్పడుతాయి. అవి సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలు. ఇంతవరకూ చూసినదాన్ని మళ్ళీ టూకీగా చూద్దాము. ఇప్పుడు వెనక నుంచి వెళదాము. అప్పుడు కిందనుంచి పైకి వెళ్ళినట్టవుతుంది.

| శ్లోకం | జ్ఞానం | జ్ఞానవిషయం |
|---|---|---|
| 22 | తామసిక జ్ఞానం | నేను శరీరాన్ని, అనేక శరీరాలు ఉన్నాయి |
| 21 | రాజసిక జ్ఞానం | నేను మనస్సును, అనేక జీవాత్మలు ఉన్నాయి |
| 20 | సాత్త్విక జ్ఞానం | నేను ఆత్మను, ఆత్మ ఏకం, నిర్వికారం, అవ్యయం, అవిభక్తం |

శ్లో. 23 **నియతం సంగరహితమ్ అరాగద్వేషతః కృతమ్ ।**
**అఫలప్రేప్సునా కర్మ యత్తత్ సాత్త్వికముచ్యతే ॥**
నియతమ్, సంగరహితమ్, అరాగద్వేషతః, కృతమ్,
అఫలప్రేప్సునా, కర్మ, యత్, తత్, సాత్త్వికమ్, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ | అరాగద్వేషతః | = రాగద్వేషరహితముగా |
| కర్మ | = కర్మ | కృతమ్ | = చేయబడినది యగునో |
| నియతమ్ | = శాస్త్రవిహితమైనదియు | తత్ | = ఆ కర్మ |
| సంగరహితమ్ | = కర్తృత్వాభిమానము లేనిదియు అగునో | సాత్త్వికమ్ | = 'సాత్త్వికకర్మ' అని |
| అఫలప్రేప్సునా | = ఫలాపేక్షలేని పురుషునిచేత | ఉచ్యతే | = చెప్పబడును |

**అఫల-ప్రేప్సునా యత్ నియతమ్ కర్మ సఙ్గ-రహితమ్ అరాగ-ద్వేషతః కృతమ్, తత్ సాత్త్వికమ్ ఉచ్యతే ।**

తా: ఏ కర్మ శాస్త్రవిహితమైనదియు, కర్తృత్వాభిమానము లేనిదియు అగునో ఫలాపేక్షలేని పురుషునిచేత రాగద్వేషరహితముగా చేయబడినది యగునో, ఆ కర్మ 'సాత్త్విక కర్మ' అని చెప్పబడును.

**బి) మూడురకాల కర్మ - శ్లోకాలు: 23-25**

ఇక్కడ్నుంచి వరుసగా మూడురకాల కర్మను చూడబోతున్నాము. అవి వరుసగా సాత్త్వికకర్మ, రాజసికకర్మ, తామసికకర్మ. ఇక్కడ కర్మ అంటే క్రియ అని మర్చిపోకూడదు. ఎందుకంటే కర్మ అంటే ఆబ్జెక్టు అనికూడా అర్థం వస్తుంది. తెలుగులో కర్తా, కర్మ, క్రియ అని నేర్చుకుంటాము. అప్పుడు కర్త అంటే సబ్జెక్టు, కర్మ అంటే ఆబ్జెక్టు, క్రియ అంటే వెర్బ్ అవుతుంది. ఇప్పుడు కర్మ అంటే చేసేపని. ఈ శ్లోకంలో సాత్త్వికకర్మను నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**నియతం కర్మ సాత్త్వికమ్** - నియతకర్మలను సాత్త్వికకర్మలు అని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. నియతకర్మ అంటే శ్రుతి ప్రత్యేకించి విధించిన కర్మలు. ఈ కర్మలను ప్రత్యేకించి ఆధ్యాత్మిక ఉన్నతి కలగటానికి, ఆంతర పరిణితి రావటానికి, విలువలు పెంపొందించటానికి ఏర్పాటుచేసింది శ్రుతి.

పదహారవ అధ్యాయంలో చూశాము, విలువలకు విలువనిచ్చి, దైవీసంపత్తిని పెంపొందించుకున్న వ్యక్తిలోనే ఆత్మజ్ఞానం కలుగుతుందని. ఒక్కొక్కరకం పంటకు నేల ఒక్కొక్కరకంగా ఉండాలి. కాఫీ, టీ తోటలను మద్రాసులో పెంచలేరు. దానికి వేరే నేల కావాలి. పంట పండాలంటే సారవంతమైన నేల కావాలి. మనస్సనే నేల సారవంతంగా ఉండాలి. అలాగే ఆత్మజ్ఞానం కావాలంటే మలినరహితమైన మనస్సు కావాలి. అది దైవీసంపత్తి ఉన్నవారిలో ఉంటుంది.

శాస్త్రం విధించిన ఈ నియతకర్మలను నిష్కామకర్మలు అనీ, విహితకర్మలు అనీ, చోదకకర్మలు అనీ అంటారు. చోదకం అంటే శుద్ధిచేసే కర్మ అని అర్థం. అవి లౌకికఫలాలను ఇవ్వవు కాని ప్రత్యేకించి ఆంతర ఎదుగుదలకు తోడ్పడతాయి. వీటిని సాత్త్వికకర్మలు అంటారు.

శాస్త్రం ఇలా ఆంతర ఎదుగుదలకే కాక, లౌకికవిజయాలకు కూడా అనేక కర్మలను నిర్దేశిస్తుంది. తైత్తిరీయోపనిషత్తులో ఆవహంతీహోమం ఉంది. ఆ హోమం చేస్తే ధనం వస్తుంది. అలా రెండురకాల కర్మలూ ఉన్నాయి శ్రుతిలో. ఇప్పుడు సాత్త్వికకర్మల గురించి చెబుతున్నాడు కాబట్టి కృష్ణపరమాత్మ నియతకర్మలను పేర్కొంటున్నాడు.

నియతకర్మలంటే ఏమిటో వివరంగా భగవద్గీతలోనే మూడవ అధ్యాయంలో చూశాము. ఇంకో విధంగా చెప్పాలంటే వీటిని పంచమహాయజ్ఞాలు అనికూడా అంటారు. ఈ పంచమహాయజ్ఞాలు ఇతరుల మేలుకోరి చేసే కర్మలు. మన జీవితం సమాజానికి మేలు చేసేదిగా ఉందా, హాని కలుగజేసేదిగా ఉందా అనే విషయం మనం చేసే కర్మలనుబట్టి తెలుస్తుంది. పంచమహాయజ్ఞాలు చేస్తే అవి సమాజానికి మేలుచేసే యజ్ఞాలు అవుతాయి. మనస్సును శుద్ధి చేస్తాయి. అందువల్ల వీటిని నియతకర్మలు అంటారు.

**సంగరహితమ్** – సాత్త్వికకర్మకు ఇంకొక నిబంధన సంగరహితం. నియతకర్మలు చెయ్యాలి కాని, వాటిమీద బంధం పెంచుకోకూడదు. అంటే నేను చేస్తున్నాను అనే కర్తృత్వభావన ఉండకూడదు. ఒక సాధకుడు సాత్త్విక కర్మలే చేసినా, అవి ఇతరులకు మేలు చేసేవే అయినా, అవి ఉన్నత కర్మలే అయినా, దేశసేవ చేసే కర్మలే అయినా, కర్మ లక్ష్యం కాదు, మార్గం మాత్రమే అని గుర్తుంచుకోవాలి. అతని లక్ష్యం వేదాంతబోధ అవాలి. ఆ విషయాన్ని అతను ఎన్నడూ మర్చిపోకూడదు. సమాజసేవ మంచిదే, అది అతనికి చిత్తశుద్ధిని కలుగజేస్తుంది కూడా. కాని అక్కడే ఆగిపోతే, అతను తన స్వస్వరూపాన్ని తెలుసుకునే అవకాశం ఉండదు. వేదాంతశ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసితీరాలి. దానికి తప్పనిసరిగా వారానికి ఒకసారి వేదాంతబోధకు వెళ్ళాలి.

అందువల్ల కృష్ణపరమాత్మ అటువంటివారికి చెబుతున్నాడు, మీరెంతైనా సేవ చెయ్యండి కాని, నిదానంగా, ఏదో ఒకరోజు దాన్నుంచి ఎదిగి, ఆత్మ విచారణకు రావాలి. అలా చెయ్యాలంటే కర్మలకు అంకితమైపోకూడదు. కర్మను అంకితభావంతో చెయ్యాలి కాని, కర్మకు అంకితమైపోకూడదు. ఈ రెండింటికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. కర్మ చెయ్యాలి, చిత్తశుద్ధి పొందాలి; దాన్నించి వేదాంతశ్రవణానికి రావాలి. అందువల్ల సంగరహితంగా ఉండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని దురదృష్టకరమైన విషయమేమిటంటే చాలామంది కర్మయోగానికి రాకుండానే వారి తనువు చాలిస్తారు. అటువంటి వారిని హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అరాగద్వేషతః కృతమ్** – ఈ సాత్త్వికకర్మలను రాగద్వేషాలు లేకుండా చెయ్యాలి. రాగద్వేషాలు లేకుండా అంటే లౌకిక ఉద్దేశ్యం లేకుండా చెయ్యాలని అర్థం. బాహ్యప్రపంచాన్ని మార్చటానికి చేసేవిగా ఉండకూడదు మీ కర్మలు.

సాత్త్విక కర్మకూ, రాజసిక కర్మకూ సూక్ష్మభేదం ఉంది. రాజసిక కర్మలో ప్రపంచాన్ని మారుస్తే తనకు ఆనందం వస్తుంది, తన కుటుంబసభ్యులను మారుస్తే తనకు ఆనందం కలుగుతుంది అనుకుంటాడు.

చాలామంది స్వామీజీని వారి ఇంటికి పిలుస్తారు. ఎందుకు? వారి కుటుంబసభ్యులను మారమని సలహా ఇస్తారనే ఆశతో. తాము మారాలని వారనుకోరు. ఎందుకంటే తమలో ఏమీ దోషాలు లేవనుకుంటారు. కుటుంబసభ్యులే మారాలనే దృఢనిశ్చయంతో ఉంటారు. పైగా తాము చెబితే, తమ కుటుంబసభ్యులు వినరు కాని, పూజ్యులైన స్వామీజీ చెబితే విని మారతారని నమ్మకం.

ఇది ఒక పెద్దదోషం. రాగద్వేషాలతో కూడిన కర్మను రాజసిక కర్మ అంటారు. రాజసిక కర్మలో ఉన్న ప్రాథమిక అపోహ – తన చుట్టూ ఉన్నవారు మారితే, తన పరిస్థితి మెరుగుపడుతుంది.

సాత్త్విక కర్మ అలాకాదు. దాని ప్రాథమిక సిద్ధాంతం నీ ఆనందం నిన్ను నువ్వు మార్చుకోవటంలో లభిస్తుంది. ఎవరికి వారు తమ ఆలోచనలను, తమ జ్ఞానాన్ని, తమ గురించిన దృక్పథాన్ని, ప్రపంచాన్ని గురించిన దృక్పథాన్ని మార్చుకోవాలి. నిజానికి, వారు ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తుంటే, వారిని మార్చటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది ప్రపంచం.

కర్మయోగికి తనను తాను మార్చుకోవాలని తెలుసు; ప్రపంచంమీద అతనికి ఎటువంటి ఫిర్యాదూ లేదు. అతనికి ఈ సూత్రం బాగా తెలుసు –

**నిన్ను మాత్రమే నువ్వు మార్చగలవు, ఇతరులను మార్చలేవు**

**నిన్ను నువ్వు మాత్రమే మార్చగలవు, ఇతరులు నిన్ను మార్చలేరు**

అందువల్ల ప్రపంచంలో మార్చగలిగినది అంటూ ఏదైనా ఉంటే, అది మిమ్మల్ని మీరే. అంతేకాదు, మిమ్మల్ని వేరే ఎవరూ మార్చలేరు. మిమ్మల్ని మీరే మార్చుకోగలరు. అందువల్ల కర్మయోగికి దేనిమీదైనా ఫిర్యాదు ఉంటే, అది తనమీదనే. సమస్య తనలోనే ఉందని తెలుసు. దయానందస్వామీజీ అద్భుతంగా చెబుతారు.

**సమస్యా నువ్వే, పరిష్కారం కూడా నువ్వే**

కర్మయోగి ఈ సూత్రాన్ని అక్షరాలా పాటిస్తాడు.

అందువల్ల అతని కర్మను అరాగద్వేషతః కృతమ్ అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే అతనికి తనచుట్టూ ఉన్నవారిమీద రాగద్వేషాలు ఉండవు.

**అఫలప్రేప్సునా (కృతమ్)** – ఫలాపేక్ష లేకుండా కర్మ చేస్తాడు. ఒకవేళ ఏదైనా ఫలం కోరినా, లౌకికఫలం కోరడు; తనకు జ్ఞానయోగ్యతాప్రాప్తి కలగాలనుకుంటాడు.

కర్మయోగం పాటిస్తే, అవాంతరఫలం కూడా వస్తుందని శాస్త్రం మాటిచ్చినా, కర్మయోగి ఆ అవాంతరఫలాల కోసం ఎదురుచూడడు. ఎందుకు? అవాంతరఫలాలను ఆశిస్తే, వాటి పేరుకు విలువ ఉండదు. అవి ముఖ్యఫలాలు అయిపోతాయి. అందువల్ల కర్మయోగి ఫలాన్ని ఆశించడు.

కర్మయోగికి కలిగే మొదటి అవాంతరఫలం శారీరక ఆరోగ్యం బాగుంటుంది. నిజానికి ఇప్పటి డాక్టర్లు కూడా గుండెజబ్బు ఉన్నవారికి కర్మయోగాన్ని సూచిస్తున్నారు. అంటే అంత స్పష్టంగా కర్మయోగం అనరు కాని,

వారు చెప్పే జాగ్రత్తలను పాటిస్తే కర్మయోగం పాటించినట్టే. గుండెజబ్బు ఉన్నవారికి ఏమని జాగ్రత్తలు చెబుతారు డాక్టర్లు? జీవితాన్ని తేలిగ్గా తీసుకోండి; మరీ ఎక్కువ ఆందోళన పడకండి. మీరు ఆందోళన పడితే మీ సమస్యలు తీరవు; ఇంకా మీకు గుండెజబ్బు పెరిగి, ఇంకొక బైపాస్ సర్జరీ చెయ్యాల్సి రావచ్చు అంటారు. దాని అర్థం, పని చెయ్యండి కాని ఫలితం గురించి ఆలోచించకండి. ఏదొచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరించండి. అందువల్ల కర్మయోగి ఫలాపేక్ష లేకుండా కర్మ చేస్తాడు.

**యత్ తత్ సాత్త్వికమ్ ఉచ్యతే** – అటువంటి కర్మను సాత్త్వికకర్మ అంటారు. ఈ స్థాయికి ఎదగాలంటే సాధకుడు సమస్య నాలోనే ఉందని అర్థం చేసుకోవాలి. అంటే అతను కర్మయోగి అవాలి. మార్పు రావాల్సింది బాహ్యప్రపంచంలో కాదు, నా మనస్సులో అని తెలుసుకోవాలి. ఒకవ్యక్తి తరచు అనారోగ్యం పాలవుతున్నాడంటే, అతనిలో రోగనిరోధకశక్తి తగ్గినట్టు అర్థం. అలాగే ఒకవ్యక్తి ప్రతిదానికీ రాగద్వేషాలు చూపుతున్నాడంటే, అతనిలో మార్పు చాలా రావాలి. ఆ మార్పుకోసం ప్రయత్నించాలి. ఇటువంటి కర్మను కర్మయోగం అంటారు.

కర్మయోగం = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి

నియతకర్మలను, బంధం పెంచుకోకుండా, రాగద్వేషాలకు అతీతంగా, ఫలాపేక్ష లేకుండా చేసేకర్మ. ఇది **సాత్త్వికకర్మ.**

శ్లో. 24 **యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।**
**క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥**
యత్, తు, కామేప్సునా, కర్మ, సాహంకారేణ, వా, పునః,
క్రియతే, బహులాయాసమ్, తత్, రాజసమ్, ఉదాహృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | సాహంకారేణ | = అహంకారిచేతను |
| యత్, కర్మ | = ఏకర్మ అయితే | క్రియతే | = చేయబడునో |
| బహులాయాసమ్ | = మిక్కిలి శ్రమతో గూడినదియో | తత్ | = ఆ కర్మ |
| పునః | = అలాగే | రాజసమ్ | = 'రాజస కర్మ'గా |
| కామేప్సునా | = భోగలాలసుడైన పురుషునిచేతను | ఉదాహృతమ్ | = పేర్కొనబడును |
| వా | = లేక | | |

**పునః యత్ తు కామ–ఈప్సునా, సాహంకారేణ వా బహుల ఆయాసమ్**
**కర్మ క్రియతే, తత్ రాజసమ్ ఉదాహృతమ్ ।**

తా: కాని ఏకర్మ అయితే మిక్కిలి శ్రమతో గూడినదియో అలాగే భోగలాలసుడైన పురుషునిచేతను లేక అహంకారిచేతను చేయబడునో, ఆ కర్మ 'రాజస కర్మ'గా పేర్కొనబడును.

ఈ శ్లోకంలో రాజసిక కర్మ అంటే ఏమిటో నిర్వచించబోతున్నాడు కృష్ణపరమాత్మ. సాత్త్వికకర్మ అంటే కర్మయోగం అని చూశాము. రాజసికకర్మ అంటే ఏమిటి?

**క్రియతే బహులాయాసమ్** – రాజసిక కర్మను చాలా ఒత్తిడితోనూ, ఆందోళనతోనూ చేస్తారు. చాలా శ్రమతో కూడిన పని కూడా. చాలామందికి వారిపనిలో తీవ్రమైన తాకిడి, ఆందోళన ఉంటుంది. ఆ ఆందోళనను రకరకాలుగా చూపిస్తారు.

ఎ) **అనారోగ్యం పాలవుతారు** – కొంతమంది వారికి కలిగిన ఆందోళనను, ఒత్తిడిని బయటకు రానివ్వకుండా చిరునవ్వు వెనకాల దాచేస్తారు. వ్యాపారలక్షణాల్లో ఒకటి, తాము ఎలా ఉన్నాకూడా చిరునవ్వులు చిందిస్తూ ఉండాలి. అంటే మొహానికి రంగు పులుముకున్నట్టుగా, చిరునవ్వు అనే వేషం వేసుకుంటారు. బాహ్యంగా చూస్తే వీరికేమీ బాధలు లేవా అనేటట్టు ఉంటారు, కాని లోపల్లోపల ఉడుకుతుంటారు. అది తరువాత అనేకరకాలైన రోగాలుగా బయటపడుతుంది. వీటిని సైకోసోమాటిక్ డిసీజెస్ అంటారు.

బి) **కోపిష్టిగా తయారవుతారు** – మరికొందరికి తమకు వచ్చే ఒత్తిడి, ఆందోళనలను ఎలా ఎదుర్కోవాలో తెలియదు. అందువల్ల చిన్నదానికే ఎదుటివారిమీద చిర్రుబుర్రులాడుతూ ఉంటారు. వారికి సాధారణంగా బలయ్యేది భార్యా, పిల్లలే. ఇంకా మాట్లాడితే భార్య మాత్రమే. పిల్లలు అటువంటి తండ్రిని చూసి ఆమడదూరం పారిపోతారు. దుర్వాసుడు వస్తున్నాడు, యముడు వస్తున్నాడు అని ఎవరికి వారే సూచనలను ఇచ్చేసుకుని, నిశ్శబ్దంగా ఏ పాఠ్యపుస్తకమో తీసుకుని చదువుతున్నట్టు నటిస్తారు. భార్యకు అతనికి సేవలు చెయ్యకతప్పదు కాబట్టి అతని కంటపడక తప్పదు. అతని అరుపులను నిశ్శబ్దంగా భరించకా తప్పదు. అలా కొంతమంది తమ ఆఫీసులోని చిరాకుని ఇంట్లో తీర్చుకుంటారు.

సి) **వ్యసనాలకు బానిసలు అవుతారు** – మరికొంతమందికి వారి బాధలనుంచి ఎలా బయటపడాలో తెలియక ఏదో ఒక వ్యసనానికి బానిసలు అవుతారు. రాత్రి అయ్యేసరికి ఏ క్లబ్బుకో వెళ్ళి తాగుడుకో, సిగరెట్టుకో, మరోదానికో బానిసలు అవుతారు. దానివల్ల వారు బాధపడతారు, ఆరోగ్యం దెబ్బతింటుంది, కుటుంబంలో కలతలు వస్తాయి, కుటుంబం విడిపోయే ప్రమాదం కూడా ఉంది.

ఈనాటి పరుగుపందెంలో ఇలాంటి ఆందోళనల మయమయిన జీవితంలో వీటిలో ఏదో ఒక జరిమానా చెల్లించక తప్పదు. అదికాక, ఒక మామూలు జీవితాన్ని ప్రశాంతంగా గడపలేనివారికి, శాస్త్రం చదవటానికి అవకాశం ఎక్కడిది? ఎప్పుడూ కలతలతో నిండిన మనస్సుకు ప్రశాంతత అంటే ఏమిటో తెలియదు. ప్రశాంతంగా కుటుంబంతో కొంత సమయాన్ని గడపటం కానీ, ఏ గీతాబోధకో, ఉపనిషత్తుల బోధకో వెళ్ళటం కాని జరిగేపని కాదు.

ఇటువంటి జీవితం చాలా దురదృష్టకరమైన జీవితం. నిజానికి అతను తన కార్పోరేట్ సంస్థలో నిచ్చెనమెట్లు ఎన్నో ఎక్కి ఉండవచ్చు; పెద్ద హెూదాకి రావచ్చు; లక్షల్లో జీతం ఉండవచ్చు; కాని ప్రశాంతతే ఉండదు. అతనికి మాత్రమే కాదు, అతనితో తమ జీవితాన్ని పెనవేసుకున్న కుటుంబసభ్యులకు కూడా ప్రశాంతత ఉండదు. ఇది రాజసిక కర్మకు తిరుగులేని ఉదాహరణ.

బహులాయాసమ్ – ఆయాసం అంటే ఒత్తిడి, ఆందోళన, కలత, ఖంగారు మొదలైనవి. లోపల అగ్నిపర్వతం మండుతోంది; ఎప్పుడు పేలుతుందో ఎవరికీ తెలియదు. ఇటువంటి వ్యక్తి జీవితంలో కోరుకున్న లౌకికవిజయాలన్నీ పొందవచ్చు కాని ఒక్కటే కొరత ఉంటుంది. ప్రశాంతత ఉండదు. దానివల్ల కుటుంబజీవనం, దైవచింతన కొరవడతాయి. అయినా ఫర్వాలేదు, నాకు అలాంటి విజయాలే కావాలంటారా, మీ ఇష్టం; ఆల్ ది బెస్ట్ అంటుంది శాస్త్రం.

**కామేప్సునా క్రియతే** – ఈ కర్మలను లౌకికవిజయాలను ఆశించే వ్యక్తి చేస్తాడు. అంటే పేరుప్రతిష్ఠలు, హోదా, ఆస్తి అంతస్తు – ఇటువంటి వాటికోసం తాపత్రయపడతాడు. ఒకవేళ అతనికి ఆ తాపత్రయం లేకపోయినా కుటుంబసభ్యులు ఊరుకోరు. 'మీ తమ్ముణ్ణి చూసి బుద్ధి తెచ్చుకో, అతనికి రెండు కార్లున్నాయి, రెండు ఇళ్ళు ఉన్నాయి. అది కూడా ఇక్కడ ఒకటీ, కొడైకెనాల్‌లో ఒకటీ. మనకేమో పాత డొక్కుకారు ఉంది అంతే.' అందువల్ల ఈ పరుగుపందెంలో పాల్గొనక తప్పదు.

కామేప్సునా అంటే కోరికలతో. మనిషికి ఉన్న ప్రాథమిక అపోహ ఎంత ఎక్కువ హోదా, ధనం, పేరు ఉంటే అంత ఎక్కువ ప్రశాంతత ఉంటుంది అనుకోవటం. శాంతికీ, ఈ వస్తువులకీ మధ్య ఎటువంటి సంబంధం లేదని చెప్పటానికి అనేక ఉదాహరణలను చూపవచ్చు. ఐశ్వర్యంలో తులతూగుతున్నా కూడా కొంచెం కూడా మనశ్శాంతి లేకుండా ఉండేవారు కొందరు; దారిద్ర్యంలో మునిగితేలుతున్నా ప్రశాంతంగా జీవిస్తున్న మరికొందరు మనకు తారసపడుతూనే ఉంటారు.

కుచేలుడు రెండవదానికి గొప్ప ఉదాహరణ. అతనికి ఏమీ లేదు; అయినా ఆనందానికి కూడా కొదవలేదు. అయితే మరి కృష్ణపరమాత్మ దగ్గరికి ఎందుకు వెళ్ళాడు? అతను స్వయంగా వెళ్ళలేదు. అతను పంపబడ్డాడు. కుచేలుడు అంటే ఏమిటి? చేలు అంటే దుస్తులు; కుచేలుడు అంటే మారుదుస్తులు కూడా లేనివ్యక్తి. అతనికి డిజైనర్ డ్రెస్సులు లేవు; కాని ఎన్నడూ తను దరిద్రంలో ఉన్నాడని బాధపడలేదు.

**సాహంకారేణ** – అహంకారంతో పనిచేస్తాడు. అతను పెద్ద హోదాలో ఉండటంలో దానికి చాలా విలువను ఇస్తాడు. అతను ఎక్కడికి వెళ్ళినా అందరూ తనకు నీరాజనాలు ఇవ్వాలి అనుకుంటాడు. అంటే అతను ఈ బాహ్యాడంబరాలకే ప్రాముఖ్యతను ఇస్తాడు. అంతేకాదు, తనకు మర్యాదలు చెయ్యాలని ఎదురుచూస్తాడు. ఆఖరికి అతను ఒక ఆధ్యాత్మిక ప్రసంగానికి వెళ్ళినాకూడా, తనకు అక్కడ రాచమర్యాదలు చెయ్యకపోతే పిలిచినవారిని మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడు.

నిజానికి అటువంటి ఆధ్యాత్మిక ప్రసంగాన్ని వినగలిగితే, అది మొదటి వరుసలో కూర్చున్నా, మూడవవరుసలో కూర్చున్నా ఏమీ భేదం ఉండదు. కాని అతను మాత్రం ఊరుకోడు. మీ వరుస ఏమీ బాగాలేదంటూ కడిగిపారేస్తాడు. అంతా దంభం, అహంకారంయొక్క చిహ్నాలు.

**తద్రాజసముదాహృతమ్** – ఇటువంటి కర్మను రాజసిక కర్మ అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

లౌకికవిజయాలకోసం, అహంకార దర్పంతో, ఒత్తిడి, ఆందోళనలకు లోనై చేసేకర్మ. ఇది **రాజసిక కర్మ**.

శ్లో. 25 **అనుబంధం క్షయం హింసామ్ అనవేక్ష్య చ పౌరుషమ్ ।**
**మోహాదారభ్యతే కర్మ యత్తత్ తామసముచ్యతే ॥**
అనుబంధమ్, క్షయమ్, హింసామ్, అనవేక్ష్య, చ, పౌరుషమ్,
మోహాత్, ఆరభ్యతే, కర్మ, యత్, తత్, తామసమ్, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యత్, కర్మ | = ఏకర్మ | అనవేక్ష్య | = ఆలోచింపక |
| అనుబంధమ్ | = పరిణామమును | మోహాత్ | = కేవలము అజ్ఞానముతో |
| క్షయమ్ | = హానిని | ఆరభ్యతే | = చేయబడునో |
| హింసామ్ | = హింసను | తత్ | = ఆ కర్మ |
| చ | = ఇంకా | తామసమ్ | = 'తామసము' అని |
| పౌరుషమ్ | = సామర్థ్యమును | ఉచ్యతే | = చెప్పబడును |

**అనుబన్ధమ్ క్షయమ్ హింసామ్ పౌరుషమ్ చ అనవేక్ష్య**
**యత్ కర్మ మోహాత్ ఆరభ్యతే, తత్ తామసమ్ ఉచ్యతే ।**

తా: ఏకర్మ పరిణామమును హానిని, హింసను ఇంకా సామర్థ్యమును ఆలోచింపక కేవలము అజ్ఞానముతో చేయబడునో ఆ కర్మ 'తామసము' అని చెప్పబడును.

ఈ శ్లోకంలో తామసిక కర్మను నిర్వచించబోతున్నాడు. ఆలోచనారహితమైన కర్మ, సరియైన ప్రణాళికలేని కర్మ తామసిక కర్మ క్రిందకు వస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కర్మయోగంలో సరియైన ప్రణాళిక ఉండాలి. చాలామంది భవిష్యత్తు గురించిన ప్రణాళిక వేసుకోవటానికీ, భవిష్యత్తుమీద ఉన్న బెంగకూ మధ్య సూక్ష్మభేదాన్ని తెలుసుకోలేక, అయోమయంలో పడతారు.

ప్రణాళిక మీరు ప్రయత్నపూర్వకంగా చేసేది. ఏదైనా తీర్థయాత్రకు వెళ్ళాలనుకుంటే, దానికి సంబంధించి అనేక ప్రణాళికలు వేయాలి. ముందు ఎప్పుడు వెళ్ళగలరో, సెలవలు ఎప్పుడున్నాయో చూసుకోవాలి. దాని తర్వాత ఏయే ఊర్లకు వెళ్ళాలో, ఏ వరుసక్రమంలో వెళ్ళాలో చూడాలి. దాని తర్వాత ఎందులో వెళ్ళాలి? కారు, బస్సు, విమానం – వీటిలో ఏది వీలు? ఎక్కడ ఉండాలి? ఇవన్నీ ఎంత ముందుగా బుక్ చెయ్యాలి? ఇలా భవిష్యత్తు గురించిన ప్రణాళిక వేసుకుంటే, ఇప్పుడు వర్తమానంలో మీపని చాలా సమర్థవంతంగా సాగుతుంది. అందువల్ల ప్రణాళిక అంటే మీరు ప్రయత్నపూర్వకంగా చేసేపని. వేదాంతం ఇటువంటి ప్రణాళిక వేసుకుతీరాలని అంటుంది. అది సాత్త్వికకర్మలోకి వస్తుంది. అది మీకున్న తెలివితేటలను చూపిస్తుంది.

భవిష్యత్తు గురించిన బెంగ అంటే ఏమిటి? రైలులో టికెట్టు బుక్ చేశాక కొంతమందికి కొన్ని బెంగలు బయలుదేరతాయి. ఆ రైలు ఆరోజు వెళుతుందో లేదో, ఎవరైనా స్ట్రైక్ చేస్తారేమో, ఆరోజే నేను ఉన్న బోగీ పడిపోతుందేమో అనుకుంటారు. ఎందుకు? వార్తాపత్రికల్లో రైలుప్రమాదాల గురించి చదువుతుంటారు. కొన్ని బోగీలు తిరగబడిపోవటం గురించి చదువుతారు. అదీ వారి భయానికి కారణం. అలా ఏదో ఒకదాని గురించి బెంగపడుతూనే ఉంటారు. అది వారికి తెలియకుండానే జరిగిపోతుంది.

ఏది ప్రణాళికో, ఏది బెంగో ఎలా తెలుస్తుంది? ప్రణాళిక మీరు ప్రయత్నపూర్వకంగా చేసేపని కాబట్టి, మీరు ఫలానారోజు, ఫలానా సమయానికి ఈ పని గురించి ప్రణాళిక వేస్తాను అనుకోగలరు. ఒకవేళ డిసెంబరులో వెళ్ళాలనుకుంటే, ఇప్పట్నుంచీ ఎందుకు, రెండునెలల తర్వాత దీనిగురించి ఆలోచిస్తాను అనుకోవచ్చు. లేదా కుటుంబంతో వెళ్ళే తీర్థయాత్ర అయితే, కుటుంబసభ్యులు అందరూ కూర్చుని వాటిలోని కష్టసుఖాలను చర్చించుకునేందుకు వీలుగా ఫలానా ఆదివారం సాయంకాలం నాలుగుగంటలకు కూర్చుని చర్చిద్దాము అనుకోవచ్చు. అంటే ప్రణాళిక ఎప్పుడు వెయ్యాలో దానికి మీరు మీకు అనువైన సమయాన్ని ఎన్నుకోవచ్చు.

కాని బెంగ అలాకాదు. నేను ఇవాళ మా అబ్బాయి గురించి సాయంకాలం ఐదుగంటలనుంచి ఆరువరకూ బెంగపడతాను; రేపు సాయంకాలం ఒకగంట మా అమ్మాయి గురించి బెంగపడతాను; వచ్చేవారం మనవడి గురించి బెంగపడతాను అని, ఇలా ప్రణాళిక వేసుకుని బెంగపడగలరా? ఎన్నడూ అలా చెయ్యలేరు. మీ ప్రమేయం లేకుండా, మీకు తెలియకుండా, ఇంకా మాట్లాడితే మీ అనుమతి లేకుండా అది దూసుకువస్తుంది. బెంగ ఉచితానుచితాలు కూడా చూడదు. అయ్యో పాపం మీరు భగవద్గీతను వింటున్నారు, మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకూడదు అనుకోదు. మీరు బోధ చాలా శ్రద్ధగా వింటుండగా, మధ్యలో మీ అనుమతి లేకుండా దూసుకువచ్చేస్తుంది. దీన్ని బెంగ అంటారు.

భవిష్యత్తును గురించి బెంగపడుతూ కూర్చుంటే, అది ఇప్పుడు మీ పనిలో సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. మిమ్మల్ని బలహీనులను చేస్తుంది, మీ శక్తిని హరించివేస్తుంది. ప్రణాళిక మీకు బలాన్ని ఇస్తుంది; బెంగ బలహీనులను చేస్తుంది. చూడండి తమాషా! రెండూ భవిష్యత్తుకు సంబంధించినవే అయినా వాటి ప్రభావంలో అంత వ్యత్యాసం ఉంది. ఒకటి మిమ్మల్ని బలవంతులని చేస్తే, ఇంకొకటి మిమ్మల్ని నిర్వీర్యం చేస్తుంది.

సాత్త్విక కర్మలో ప్రణాళిక ఉంటుంది; తామసిక కర్మలో ఉండదు. ఎప్పుడేది చెయ్యాలనిపిస్తే, అది చేసేస్తాడు. 'నాకు చెయ్యాలనిపించింది, చేశాను,' అంటాడు.

**పౌరుషమ్ అనవేక్ష్య** – పౌరుషం అంటే సామర్థ్యం. ఆ సామర్థ్యం శారీరకబలం కావచ్చు; ఆర్థికస్తోమత కావచ్చు; వ్యక్తిగత సమర్థత కావచ్చు; బుద్ధిబలం కావచ్చు. అవి తనకు ఉన్నాయా లేదా బేరీజు వేసుకోకుండా పనిచేస్తాడు.

ఏ కోర్సులో చేరాలనుకున్నా కూడా అనేక విషయాలను బేరీజు వేసుకోవాలి. దానికి తగ్గ ఆర్థికస్తోమత ఉందో లేదో చూసుకోవాలి. దాన్ని చదివి అర్థం చేసుకునే బుద్ధిబలం ఉందో లేదో చూసుకోవాలి. అంత శ్రమ శరీరం తట్టుకోగలదో లేదో చూసుకోవాలి. లేకపోతే తలకు మించిన బాధ్యతను స్వీకరించినట్టు అవుతుంది. ఆఖరికి భోజనం చేసేటప్పుడు కూడా ఎంత ముద్ద తింటే అది తేలిగ్గా గొంతులోకి వెళుతుందో తెలుసుకోవాలి. అలాగే ఎంత తింటే కడుపు నిండుతుందో తెలుసుకోవాలి. దాన్నిమించి తినకూడదు.

తామసిక వ్యక్తికి ఇటువంటి ప్రణాళికలంటే ఏమిటో తెలియదు. అనవేక్ష్య అంటే తన సామర్థ్యాన్ని తెలుసుకోకుండా పనిచేస్తాడు.

**అనుబంధమ్** – అనుబంధం అంటే ఇక్కడ అర్థం పరిణామం. అతను చేసే పనులవల్ల కలిగే పరిణామాలేమిటో, ముందువెనుకలు ఆలోచించకుండా చేసేస్తాడు తామసిక వ్యక్తి. తనపై అధికారి తనమీద అరిస్తే, ఇతను కూడా ముందువెనుకలు చూడకుండా అరిచేస్తాడు. ఫలితం? మర్నాడు ఉద్యోగం పోతుంది. అలా పై అధికారిమీద తిరిగి అరిచే ముందు, ఒక విషయం ఆలోచించుకోవాలి – ఈ ఉద్యోగం నాకు అవసరమా? నేను వారికి అవసరమా? సంస్థ తనమీద ఆధారపడివుంటే అది వేరే విషయం. తను ఆ ఉద్యోగంమీద ఆధారపడివుంటే, దాని తర్వాత వచ్చే పర్యవసానాన్ని ఆలోచించి మరీ ముందడుగు వెయ్యాలి. కాని తామసిక కర్మలో ఈ పరిణామాలు ఆలోచించే ప్రసక్తే లేదు.

**క్షయమ్** – క్షయం అంటే ఖర్చు. జీవితంలో ఏం సాధించాలనుకున్నా కూడా, దానికి తగ్గట్టుగా ఖర్చుపెట్టాలి. అది అన్నివేళలా ధనమే అవనవసరం లేదు; మీ శారీరక శ్రమ కూడా కావచ్చు. మీరు రోజుకి పన్నెండు గంటలు పని చెయ్యాల్సివచ్చినా, రాత్రి డ్యూటీ చేసే ఉద్యోగం చేపట్టాల్సివచ్చినా, అది చేసేముందు మీ శరీరం అంతటి శ్రమను తట్టుకోగలదో లేదో అంచనా వేసుకోవాలి. అందువల్ల క్షయం అంటే శారీరక శ్రమ, ఆర్థికస్తోమత.

**హింసామ్** – తను చేసేపనివల్ల ఎవరికైనా హాని జరుగుతుందేమోనని కూడా చూసుకోవాలి. ఏపని చేపట్టినా, దాన్ని వెన్నంటే మంచీ, చెడూ ఉంటాయి. అణుబాంబులను మంచికీ వాడవచ్చు, చెడుకూ వాడవచ్చు. అలాగే దేశపురోభివృద్ధికోసం రోడ్లను విశాలం చెయ్యటం మొదలుపెడతారు. కాని ఆ తతంగంలో భాగంగా ఎన్నో ఇళ్ళను నేలకూల్చాల్సి ఉంటుంది. అదేకాకుండా కాలుష్యం పెరుగుతుంది.

ఆ విధంగా ఏ పనిచేసినా మంచీ, చెడూ రెండూ ఉంటాయి. కాని సాధారణంగా ఎవరూ చెడు పట్టించుకోరు. అంతేకాదు, ఆ సమస్యను కూడా పూర్తిగా బేరీజు వెయ్యరు. ఎప్పుడు ఏ స్థితిలో ఉంటే, అప్పుడు అది బాగాలేనట్టు అనిపించి, వెంటనే బాగున్నట్టుగా అనిపించిన ఇంకొకదానికి దూకుతారు. ఉదాహరణకు అద్దె ఇంట్లో ఇంటి యజమానితో నిరంతరం ఘర్షణ పడుతున్నారనుకోండి. 'నేను అతని ఇంట్లో ఉండటంవల్ల కదా ఇన్ని మాటలు పడుతున్నాను. నేనే ఒక స్వంత ఇల్లు కొనుక్కుంటే, నాకీ అవమానాలు ఉండవు,' అని వెంటనే నిర్ణయించేసుకుంటారు. ఆఘమేఘాలమీద స్వంత ఇల్లు కొనేసుకుంటారు. అక్కడితో మీ సమస్య తీరిపోయిందా? ఆ సమస్య తీరింది కాని కొత్త సమస్యలు, ఊహించని సమస్యలు ఎదురవుతాయి. స్వంత ఇల్లు అంటే సమస్యలు మీ స్వంతం అవుతాయి. అద్దెఇంట్లో నచ్చకపోతే ఆ ఇల్లు మారతారు. స్వంత ఇల్లు మారలేరు కదా!

ఇది ఏ విషయంలోనైనా వర్తిస్తుంది. ఇక్కడ ఉద్యోగంలో జీతం బాగాలేదు, ఫలానా కంపెనీలో రెట్టింపు జీతం ఇస్తున్నారని వింటారు. వెంటనే ముందువెనకలు ఆలోచించకుండా అందులోకి దూకేస్తారు. చేరిన కొన్నాళ్ళకే మీరు ఆశించినంత రంగులప్రపంచం కనబడదు అక్కడ. మీకు తెలియని సమస్యలు వేరే రూపంలో చుట్టుముట్టుతాయి. అంటే మీ పరిస్థితి పెనం మీంచి పొయ్యిలోకి పడ్డట్టయింది. మీరేమో తంతే బూరెలగంపలో పడ్డాననుకుని వెళ్ళారు. కాని పరిస్థితి తారుమారయ్యింది.

ఏ విషయానికి సంబంధించిన ఏ పని చేపట్టాలన్నా కూడా అందులో మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది. ఏ ఒక్కపనిలో కూడా కేవలం మంచే ఉండదు. సన్న్యాసం స్వీకరించాలనుకున్నా కూడా అందులో ఉండే కష్టాలు అందులో ఉంటాయి. అందువల్ల ఏపని చేపట్టాలన్నా కూడా, ముందు అందులో ఉంటే కష్టనష్టాలను లెక్కవేసుకుని,

అవి తట్టుకుని నిలబడగలనా అని మిమ్మల్ని మీరు బేరీజు వేసుకోవాలి. రెండు దశలు ఉన్నాయి ఇందులో. ముందు కష్టనష్టాలు ఏం ఉన్నాయో తెలుసుకోవటం; తెలుసుకున్నాక అది తట్టుకు నిలబడగలనా అని బేరీజు వేసుకోవటం. కాని తామసిక కర్మలో ఆచితూచి పనిచేసే ప్రసక్తే లేదు. ఏది తోస్తే అది చేసెయ్యటం; తర్వాత చేసిన కొత్తపని బాగాలేదని బాధపడటం. జీవితమంతా బాధ తప్పదు అతనికి.

**మోహాదారభ్యతే కర్మ యత్తత్ తామసముచ్యతే** – కేవలం అజ్ఞానంతో చేసేపనిని తామసిక కర్మ అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వివేకరహితంగా చేసే కర్మ.

తన సామర్థ్యాన్ని చూసుకోకుండా, పర్యవసానాలు చూడకుండా, ప్రణాళిక లేకుండా, అనాలోచితంగా, అజ్ఞానంతో చేసే కర్మ. ఇది **తామసిక కర్మ**.

ఇక్కడితో మూడురకాల కర్మల గురించి అయిపోయింది. దీన్ని మళ్ళీ టూకీగా వెనకనుంచి ముందుకు చూద్దాము. అప్పుడు కిందనుంచి పైకెళ్ళినట్టవుతుంది.

| **శ్లోకం** | **కర్మ** | **విధానం** |
|---|---|---|
| 25 | తామసిక కర్మ | తన సామర్థ్యాన్ని చూసుకోకుండా, పర్యవసానాలు చూడకుండా, ప్రణాళిక లేకుండా, అనాలోచితంగా, అజ్ఞానంతో చేసే కర్మ. |
| 24 | రాజసిక కర్మ | లౌకికవిజయాలకోసం, అహంకార దర్పంతో, ఒత్తిడి, ఆందోళనలకు లోనై చేసే కర్మ. |
| 23 | సాత్త్విక కర్మ | నియత కర్మలను, బంధం పెంచుకోకుండా, రాగద్వేషాలకు అతీతంగా, ఫలాపేక్ష లేకుండా చేసే కర్మ. |

ఇప్పటిదాకా కృష్ణపరమాత్మ చెప్పినవాటిని చూస్తే తామసిక ప్రవృత్తిని వీలున్నంత త్వరగా వదిలివేయాలని అర్థమవుతుంది. ఎందుకంటే అది మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. అది మీకు ఎన్నైనా లౌకిక విజయాలను కలిగించుగాక, మీకు గనుక ఆధ్యాత్మికతమీద మక్కువ ఉంటే అటువంటి ప్రవృత్తిని వదులుకోవటం మంచిది. ఇప్పటివరకూ తామసజ్ఞానం, తామసకర్మ గురించి చెప్పాడు. ముందుముందు తామసకర్తృత్వం, తామసబుద్ధి, తామసధృతి, తామససుఖాల గురించి కూడా చెబుతాడు. వీటన్నిటినీ వదలాలి.

ఒక విషయం గుర్తుంచుకోండి. మీరు భగవద్గీత బోధను వింటున్నారు అంటేనే మీకు ఆధ్యాత్మిక సాధనమీద శ్రద్ధ ఏర్పడిందని అర్థం. ఆ శ్రద్ధ లేకపోతే మీరు గీతాబోధకు రానేరారు.

అంతేకాదు, ఇంకొక విషయం కూడా గుర్తుంచుకోండి.

భగవద్గీతను **మోక్షశాస్త్రం** అంటారు. భగవద్గీతను మోక్షశాస్త్రం అని శంకరాచార్యులవారు తన ఉపోద్ఘాతంలోనే స్పష్టం చేశారు. ఎందుకు? అర్జునుడు మొదటి రెండు అధ్యాయాల్లో తనకు ఎన్ని లౌకికవిజయాలు కలిగినా, మనస్సు ప్రశాంతంగా లేదన్నాడు. అంతేకాదు, ఎవరైనా విజయాలు సాధించి, స్వర్గలోకానికి వెళ్ళాలని కోరుకుంటారు. కాని అర్జునుడు, తాను యుద్ధభూమిలో తనవారిని హరించి, స్వర్గానికి వెళ్ళినా అక్కడ స్వర్గసుఖాలను అనుభవించలేనని చెప్పాడు. దీన్నిబట్టి గీతాబోధ వినే ప్రతివ్యక్తికీ లౌకికవిజయాల పరిమితి అర్థమయ్యే ఉంటుంది.

అందువల్ల గీతాబోధంతా మోక్షాన్ని దృష్టిలో పెట్టుకుని సాగుతుంది. మోక్షం మీ అంతిమలక్ష్యం అయితే, మిమ్మల్ని ఆధ్యాత్మికంగా ఎదగనీయకుండా, కిందికిలాగే ప్రవృత్తిని వెంటనే మానుకోవాలి. దానివల్ల లౌకిక విజయాలు ఎన్ని కలిగినా, అవి ఆధ్యాత్మిక ఎదుగుదలకు సహకరించవు సరికదా, మిమ్మల్ని ఇంకా కిందికి లాగుతాయి. ఇటువంటి ప్రవృత్తిని తామసిక ప్రవృత్తి అంటారు. తామసిక ప్రవృత్తికి సంబంధించినది ఏదైనా – అది ముందు అధ్యాయంలో చెప్పిన ఆహారం అయినా, ఈ అధ్యాయంలో చెప్పిన కర్మ అయినా, ఇకముందు చెప్పబోయే సుఖం అయినా సరే, కిందికి లాగుతుంది.

రాజసిక ప్రవృత్తి విషయం తీసుకుంటే, అది ఉన్నవ్యక్తి నెమ్మదిగా రాజసిక ప్రవృత్తినుంచి పైకి ఎదగాలి. వెంటనే వదిలివేయనవసరం లేదు; వెంటనే వదిలివేయలేరు; ఆ మాటకొస్తే వెంటనే వదిలివేయనవసరం లేదు కూడా. ఎందుకు? రాజసిక కర్మలో ఉండే అదృష్టం ఏమిటంటే అది మిమ్మల్ని తామసిక కర్మలాగా కిందకి లాగదు. ఎక్కడున్నవారిని అక్కడే ఉంచుతుంది. అంటే గుడ్డిలో మెల్ల. అది రాజసిక జ్ఞానం అవనీ, రాజసిక కర్మ అవనీ, రాజసిక సుఖం అవనీ, ఏదైనా సరే మిమ్మల్ని ఎక్కడున్నవారిని అక్కడే ఉంచుతుంది. పైకీ తీసుకువెళ్ళదు, కిందకీ లాగదు. రాజసిక ప్రవృత్తి కిందికి లాగదు కాబట్టి, నెమ్మదిగా దాన్నించి సాత్త్విక ప్రవృత్తికి ఎదగవచ్చు మీరు.

అంతేకాదు, రాజసిక ప్రవృత్తికి ఉండే లాభం దానికి ఉంది. కర్మయోగాన్ని పాటించటానికి కూడా రాజసిక ప్రవృత్తి ఉండాలి; రాజసిక జీవనవిధానం ఉండాలి. కర్మయోగం అంటే సమాజానికి సేవ చెయ్యటమని చూశాము. సేవ చెయ్యటానికి రజోగుణం ఉండాలి. చిత్తశుద్ధి పొందాక, రజోగుణాన్ని తగ్గించుకోవచ్చు. గీతాబోధకు రావాలన్నా కూడా రజోగుణం ఉండాలి. అందువల్ల రజోగుణాన్ని పూర్తిగా కొట్టివేయము; దానిమీద మనకు పూర్తిగా ద్వేషమూ లేదు. రజోగుణం కొంచెం ఉండవచ్చు, ఫర్వాలేదు. కొంచెం రజోగుణం; కొంచెం గీతాబోధ ఉండాలి. లౌకిక విజయాలు పొందండి; ధనం సంపాదించండి. హుషారుగా ఉండండి, సమాజసేవ చెయ్యండి. ఇవన్నీ మీకు చిత్తశుద్ధిని కలిగిస్తాయి, కాని వారానికి ఒకసారన్నా గీతాబోధకు రండి. అందువల్లనే కొంచెం రజోగుణం, కొంచెం గీతాబోధ ఉండాలి అన్నాము.

అందువల్ల మీలో తామసిక ప్రవృత్తి ఉంటే దాన్ని వెంటనే పారద్రోలండి; రాజసిక ప్రవృత్తి ఉంటే నెమ్మదిగా పైకి ఎదగండి; సాత్త్విక ప్రవృత్తిని పెంచుకోండి. సాత్త్వికజ్ఞానం, సాత్త్వికకర్మ, సాత్త్వికబుద్ధి, సాత్త్వికధృతి, సాత్త్వికసుఖం మంచివి. వాటిని పెంపొందించుకుంటే, అవి మిమ్మల్ని నెమ్మదిగా జ్ఞానమార్గానికి తీసుకువెళ్ళి, మోక్షం కలిగేలా చేస్తాయి.

కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో ఆరు అంశాలను చర్చిస్తున్నాడు. అవి జ్ఞానం, కర్మ, కర్త, బుద్ధి, ధృతి, సుఖం. అన్నింటినీ మూడు తెగలుగా విభజించుకుంటూ వస్తున్నాడు. అవి ఈ విషయాల్లో సాత్త్విక, రాజసిక, తామసిక ప్రవృత్తులు. అలా చెప్పటంలోని అంతర్లీనమైన సందేశాన్ని ఎప్పుడూ మీ మనస్సులో గుర్తుంచుకోవాలి. ఏ అంశమైనా సరే మీరు పాటించేది సాత్త్వికంగా ఉండాలి. ఒకవేళ తామసిక ప్రవృత్తిలో ఉంటే వెంటనే దాన్ని వదులుకోవాలి; ఒకవేళ రాజసిక ప్రవృత్తిలో ఉంటే నెమ్మదిగా దాన్నించి సాత్త్విక ప్రవృత్తికి రావాలి.

ఇదీ ఇందులో అంతర్లీనంగా ఉన్న సందేశం. ఈ నేపథ్యంతో తక్కిన అంశాలను చూద్దాము. ఆరు అంశాల్లో రెండు చూశాము. అవి జ్ఞానం, కర్మ. ఇప్పుడు కర్త అంశాన్ని చూద్దాము.

శ్లో. 26 **ముక్తసంగోఽ నహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।**
**సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥**
ముక్తసంగః, అనహంవాదీ, ధృత్యుత్సాహసమన్వితః,
సిద్ధ్యసిద్ధ్యోః, నిర్వికారః, కర్తా, సాత్త్వికః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| ముక్తసంగః | = సంగత్వము త్యజించినవానిని | నిర్వికారః | = హర్షము, శోకము లేనివానిని |
| అనహంవాదీ | = అహంకార రహితముగా భాషించువానిని | సాత్త్వికః, కర్తా | = 'సాత్త్విక కర్త' అని |
| ధృత్యుత్సాహసమన్వితః | = ధైర్యోత్సాహములు గలవానిని | ఉచ్యతే | = అంటారు |
| సిద్ధ్యసిద్ధ్యోః | = సిద్ధి–అసిద్ధులందు | | |

**ముక్త–సఙ్గః, అనహం–వాదీ, ధృతి–ఉత్సాహ–సమన్వితః,**
**సిద్ధి–అసిద్ధ్యోః నిర్వికారః కర్తా సాత్త్వికః ఉచ్యతే ।**

తా: సంగత్వము త్యజించినవానిని, అహంకార రహితముగా భాషించువానిని, ధైర్యోత్సాహములు గలవానిని సిద్ధి–అసిద్ధులందు హర్షము, శోకము లేనివానిని, 'సాత్త్విక కర్త' అని అంటారు.

**సి) మూడురకాల కర్త – శ్లోకాలు: 26–28**

ఇక్కడ్నుంచి వరుసగా మూడురకాల కర్తను చూడబోతున్నాము. అవి వరుసగా సాత్త్విక కర్త, రాజసిక కర్త, తామసిక కర్త. నిజానికి కృష్ణపరమాత్మ ఈ మూడురకాల కర్త గురించి చెప్పకపోయినా ఫర్వాలేదు. ఎందుకు? ఇంతకుముందే మూడురకాల కర్మలను నిర్వచించాడు కాబట్టి, దాన్ని ఆధారంగా తీసుకుని మీరే మూడురకాల కర్త గురించి చెప్పేయవచ్చు. సాత్త్విక కర్త అంటే ఎవరు? సాత్త్విక కర్మలు చేసేవ్యక్తి; అదే సూత్రం ప్రకారం రాజసిక కర్మలు చేసే వ్యక్తి రాజసిక కర్త; తామసిక కర్మలు చేసేవ్యక్తి తామసిక కర్త అవుతారు.

కాని కృష్ణపరమాత్మ ఆదిగురువు. ఒక మంచి గురువు, శిష్యుడు అర్థం చేసుకుంటాడులే అని, ఏదీ చెప్పకుండా వదిలివేయడు. ఏమీ తెలియనివానికి ఎలా చెబుతాడో, అలా బోధిస్తాడు గురువు. అంతేకాదు, శిష్యుల్లో కూడా మూడురకాల శిష్యులు ఉంటారు – మంద, మధ్యమ, ఉత్తమశిష్యులు. అందువల్ల అందరి ఊహకు ఇది అందక పోవచ్చు. అందువల్ల కృష్ణపరమాత్మే స్వయంగా కర్తల్లో మూడురకాలను నిర్వచించబోతున్నాడు. ఇందులో సాత్త్విక కర్తను నిర్వచిస్తాడు. సాత్త్విక కర్త ఎవరు?

**ముక్తసంగః** – కర్మను తాత్కాలికంగా ఉపయోగించి, తర్వాత దానికి అతీతంగా ఎదుగుతాడు. అంటే అతనికి కర్మను ఎంతమేరకు చెయ్యాలో, ఎప్పుడు వదిలివేయాలో తెలుసు. కర్మ అనే మార్గాన్ని ఉపయోగించి, చిత్తశుద్ధి

అనే లక్ష్యాన్ని పొందాలి. అనుకున్న లక్ష్యం పొందాక, మార్గమైన కర్మను వదిలివేయాలి. అలా వదిలివేయకపోతే, మీ లక్ష్యానికి కర్మ రెండురకాలుగా ఆటంకాన్ని కలిగిస్తుంది. ఏమిటవి?

**బహిర్ముఖులను చేస్తుంది** – కర్మలో కూరుకుపోయినన్నాళ్ళూ కర్మ మిమ్మల్ని బహిర్ముఖులను చేస్తుంది. అంతేకాదు, మిమ్మల్ని కుదురుగా ఉండనివ్వదు. ఆత్మజ్ఞానం పొందాలంటే శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి; శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలంటే ముందు మీరు కుదురుగా కాసేపు కూర్చోవాలి; మనస్సును అంతర్ముఖం చేసుకోవాలి. లేకపోతే వేదాంత అధ్యయనం చెయ్యలేరు.

**కర్తృత్వభావన** – కర్మల్లోనే కూరుకుపోతే కలిగే ఇంకొక ఆటంకం – కర్తృత్వభావన. కర్మలు ఎక్కువగా చేసినకొద్దీ, నేను కర్తను, నేను ఈ కర్మలన్నీ చేస్తున్నాను అనే భావన లోతుగా పాతుకుపోతుంది. కాని అసలు సత్యం నేను అకర్తా. నేను అకర్తను అనే ఈ సత్యాన్ని అర్థం చేసుకోవాలంటే, కొన్నాళ్ళు కర్మచేసి, చిత్తశుద్ధి పొంది, తర్వాత కర్మలను త్యజించాలి. సన్న్యాసి ఇలా కర్మలను త్యజించాడని అతనికి గుర్తు చెయ్యటానికే, సన్న్యాసికి స్వాగతం చెబుతూ ఈ మంత్రాన్ని పఠిస్తారు.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**

సాత్త్వికకర్మ అంటే కర్మయోగి చేసే పద్ధతి అని చూశాము. అందువల్ల కర్మయోగికి ఈ సత్యం తెలుసు. తను కర్మలు చేసి, తర్వాత వాటిని త్యజించాలని తెలుసు. అందువల్ల అతను ఏ కర్మతోనూ అనుబంధం పెంచుకోడు.

ఉదాహరణకు మీరు కాలేజీలో చేరేది ఎందుకు? అందులోనే శాశ్వతంగా ఉండిపోవటానికి కాదుకదా! అక్కడ విద్యను ఎన్ని సంవత్సరాలు అభ్యసించాలో అన్ని సంవత్సరాలు అభ్యసించి, బయటకు రావాల్సిన సమయంలో సంతోషంగా వస్తారు. మీరు బయటకు వచ్చి, తర్వాత తరంవారు రావటానికి చోటు ఇస్తారు.

ముక్తసంగః అంటే తను చేస్తున్న ఏపనితోనూ అనుబంధం పెంచుకోడు. అతనికి తెలుసు; దాని పరిమితి ఏమిటో. అటువంటి జ్ఞానం పొందినవ్యక్తి కర్మయోగి. అతను సాత్త్వికకర్త. అందువల్ల అతను **ముక్తసంగః**.

**అనహంవాదీ** – అహంకారం పెంచుకోడు సాత్త్వికకర్త. ఇది రెండవ నిర్వచనం. అతను చేసిన కర్మలకు పొంగిపోడు. ముఖ్యంగా అతను సాధించిన విజయాలకు పొంగిపోడు. అతను ఒక సంస్థకు వైస్‌ప్రెసిడెంట్ అయినా, ఒక మంచిపని చేసినా, ఏ రోటరీక్లబ్బుకో లేక లయన్స్‌క్లబ్బుకో సెక్రటరీగా దేశసేవ చేసినా, అతను ఏమీ వెన్నువిరుచుకు తిరగడు. మామూలుగా ఎవరికైనా ఇలాంటి హోదా ఉంటే, వారికి తెలియకుండానే అహంకారం పొడచూపే అవకాశం ఉంటుంది. ఒకసారి ఆ హోదా రుచి మరిగారంటే, ఒకసారి అహంకారం తొంగిచూసిందంటే, దాన్నించి బయటపడటం చాలా కష్టం. ఆ హోదాను వదులుకోవటం ఇంకా కష్టం. కొంతమంది ఈ హోదాల్లో కూరుకుపోయి, గీతాబోధకు వెళ్ళలేకపోతున్నాము అంటారు.

ఆ విధంగా అహంకారం, ఆ పదవి ఇచ్చే హోదా, మనిషిని పైకి ఎదగనీయకుండా అడ్డుపడుతుంటాయి. కాని కర్మయోగికి వాటిని ఎక్కడ ఉంచాలో బాగా తెలుసు. అహంవాదీ అంటే అహంకారం. అతను అహంకారాన్ని గొంతెత్తనివ్వడు. ఒకవేళ ఎవరైనా అతణ్ణి స్తుతించినా, ఆ కీర్తిని తను స్వీకరించకుండా, భగవంతునికి అర్పిస్తాడు.

తనదేం లేదు, అంతా భగవంతుని కృప అని వినయంగా విన్నవించుకుంటాడు. అతను సాధించిన విజయంలో అతని శ్రమ లేకపోలేదు కాని, అదికూడా భగవంతునికే చెందుతుంది అంటాడు. కర్మయోగి అలా అహంకార మమకారాలను త్యజిస్తాడు. అందువల్ల అతను **అనహంవాదీ.**

మీకు అహంకారం లేదనీ, అమానిత్వమే ఉందనీ మీరు అనుకోవచ్చు. కాని ఏ కాస్త సందు దొరికినా, అవకాశం చూసుకుని అహంకారం దూసుకుని వస్తుంది. దానితో చాలా జాగ్రత్తగా ఉండాలి. అహంకారం వస్తోందని ఎలా తెలుస్తుంది? మీరు చేసిన పనిని ఎవరైనా మెచ్చుకోకపోతేనో, మీ పేరును వందనసమర్పణలో చదవకపోతేనో, మీ ఫోటో పేపర్లో పడకపోతేనో, స్టేజీమీద మీకు దండ వెయ్యకపోతేనో, మీకు బాధవేస్తే ఇంకా ఏమూలో అహంకారం పొంచి ఉన్నట్టు అర్థం. మీరు కర్మయోగి అయితే ఈ మానావమానాలు ఉండవు. అందువల్ల అతను అనహంవాదీ. ఇంకో భావంలో చెప్పాలంటే సాత్త్వికకర్తను కర్మయోగి అనవచ్చు.

**ధృత్యుత్సాహసమన్వితః** – ఈ కర్మయోగికి తనను ఇతరులు మెచ్చుకున్నా, మెచ్చుకోకపోయినా ధృతి, ఉత్సాహం మెండుగా ఉంటాయి. ధృతి అంటే మొక్కవోని పట్టుదల; ఓడిపోయినా ఉత్సాహం సన్నగిల్లకపోవటం. మళ్ళీమళ్ళీ ప్రయత్నం చేస్తాడు. ధృతి గురించి కృష్ణపరమాత్మే విడిగా ముందు చెప్పబోతున్నాడు. అప్పుడు వివరంగా చూద్దాము. ఇప్పటికి గట్టి పట్టుదల అని తెలుసుకుంటే చాలు.

ఒక రబ్బరుబంతిని, మట్టిముద్దను రెండింటినీ కిందికి వదిలిచూడండి. మట్టిముద్ద మీరు ఎక్కడ వేస్తే, అక్కడే ఉండిపోతుంది; పైకి రాదు. కాని రబ్బరుబంతి మీరు ఎంత వేగంగా వేస్తే, అంత వేగంగా పైకి లేచివస్తుంది. ధృతి ఉన్నవ్యక్తి ఓటమి ఎదురైనా, ఆగకుండా రబ్బరుబంతిలా పైకి వస్తాడు.

ఉత్సాహసమన్విత అంటే ఉత్సాహం ఉన్నవ్యక్తి. అంటే ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, ప్రతికూల ఆలోచనలు లేకుండా, ప్రతిదీ విమర్శనాత్మకంగా చూడకుండా ఉంటాడు. దీన్నే సానుకూలంగా చెప్పాలంటే, ఎప్పుడూ సానుకూల ఆలోచనలతో, ఆశాజనకంగా ఉంటాడు. ఇటువంటి ఉల్లాసవంతులు వారు చిరునవ్వులు చిందించటమే కాదు, ఎదురుగా దిగులుగా ఉండేవ్యక్తిని కూడా నవ్వించి, కేరింతలు కొట్టిస్తారు. దీనికి భిన్నంగా ఉంటారు మరికొంతమంది. మీరు వారి దగ్గరికి ఎంత ఉల్లాసంగా వెళ్ళినా, మీ ఉల్లాసాన్ని వారి దిగులుతో హరించివేస్తారు. వారికి ప్రపంచంలో ఏమీ మంచి అన్నది కనిపించదు. వారితో పదిహేను నిముషాలు మాట్లాడిచూడండి; ప్రతిదీ విమర్శిస్తారు. ఈ రోజుల్లో బొత్తిగా విలువలు పడిపోతున్నాయి అంటారు; మనుష్యుల్లో మంచితనం లేదు అంటారు; అందరూ దొంగలు, మోసగాళ్ళు అంటారు. అలా ఏ విషయం మాట్లాడినా, అన్నీ ప్రతికూల విషయాలే.

సానుకూల ఆలోచనలు ఉన్నవ్యక్తి ప్రతిదీ సానుకూల విషయాలే మాట్లాడతాడు. సృష్టిలో మంచివీ ఉన్నాయి, చెడ్డవీ ఉన్నాయి. ప్రపంచం మంచీచెడుల మేలుకలయిక. మీరు దాన్ని ఏ దృష్టితో చూస్తే, అవే మీకు కనబడతాయి. మీకు ప్రతికూల ఆలోచనలు ఉంటే, అన్నీ చెడు విషయాలే కనిపిస్తాయి. దానికి భిన్నంగా సానుకూల ఆలోచనలు ఉంటే, అన్నీ మంచివే కనిపిస్తాయి. ప్రపంచం ఎలా ఉందంటే మీ చూపులో ఉంది అది. అందువల్ల నేను, అన్నీ మంచి విషయాలే చూస్తానని నిర్ణయం తీసుకుని చూడండి. మీకే చాలా భేదం కనపడుతుంది. కుటుంబంలో వారికి కూడా హాయిగా ఉంటుంది.

అంతకుముందు మీరు టీవీలో ప్రతికూల విషయాలే చూసివుంటారు. టీవీని తిట్టిపోస్తూ ఉండివుంటారు. ఇప్పుడు మీరు కొత్తగా తీసుకున్న నిర్ణయంతో టీవీలో ప్రతికూల విషయాలకన్నా, అన్నీ మంచి విషయాలే కనిపిస్తాయి. ఎందరో స్వామీజీల ప్రసంగాలు వినవచ్చు; మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి; గురుపూర్ణిమరోజు స్వామీజీని ఆశ్రమానికి వెళ్ళి కలవాలంటే చాలా కష్టం. కాని టీవీ పుణ్యమా అని, మీ ఇంట్లో హాల్లో కూర్చుని స్వామీజీని చక్కగా చూడవచ్చు. ఎన్నో ఆలయాల్లో కుంభాభిషేకాలు చేస్తారు; వాటిని అక్కడికి వెళ్ళి చూసినా మీకు స్పష్టంగా కనబడదు, ఎక్కడో దూరంనుంచి లీలగా చూస్తారు; కాని దాన్నే టీవీలో లైవ్‌షో చూస్తే, చాలా దగ్గరగా, హాయిగా చూడవచ్చు. మానససరోవరానికి వెళ్ళకుండానే, టీవీలో చూడవచ్చు. అలా ఎన్నో మంచి కార్యక్రమాలు ఉన్నాయి. టీవీని చెడు కార్యక్రమాలకు ఉపయోగిస్తే, అది రాజసిక, తామసిక ప్రవృత్తి అవుతుంది. సానుకూలంగా చూస్తే సాత్త్విక ప్రవృత్తి అవుతుంది. సాత్త్విక కర్త అలా సానుకూలంగా చూస్తాడు. అందువల్ల అతను **ధృత్యుత్సాహసమన్వితః.**

**సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః** – సమత్వబుద్ధి ఉంటుంది సాత్త్వికకర్తకు. తను చేసిన కర్మలు విజయవంతమైనా, విఫలమైనా అతను నిర్వికారంగా ఉంటాడు.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**

కర్మయోగి ఈశ్వరార్పణబుద్ధితో చేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తాడు కాబట్టి, అతను ఎటువంటి ఫలం వచ్చినా చలించడు. తను చేసిన కర్మయొక్క ఫలం ఎలా ఉంటుందో, ఊహించలేడు. ఎందుకు? ఆ ఫలం వెనుక అనేక తెలిసిన, తెలియని అంశాలు అనేకం ఉంటాయి.

సిద్ధి అంటే విజయం, అసిద్ధి అంటే విఫలం. విజయం, విఫలం రెండూ మీ చేతుల్లో లేవు. అంటే ఏది కావాలో మీరు కోరలేరు కాని, దానికి ఎలా స్పందించాలో అది మీ చేతుల్లో ఉంది. సాత్త్వికకర్త ఎటువంటి ఫలం వచ్చినా చలించకుండా ఉండటం నేర్చుకుంటాడు. నిర్వికారం అంటే సమత్వబుద్ధి కలిగివుండటం. మంచిఫలం వచ్చినా పొంగిపోడు, చెడు వచ్చినా కృంగిపోడు.

గుండెజబ్బు వచ్చినవారిని పరిశీలిస్తే, విషాదవార్తలు వింటేనే కాదు, పట్టలేని సంతోషం వచ్చినా గుండెజబ్బు వస్తుందని తెలుస్తుంది. ఇరవైఆరుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిన ఒక రాజకీయనాయకుడు, ఇరవై ఏడవసారి గెలిచేసరికి ఆ ఉత్సాహం పట్టలేక గుండెఆగి చనిపోయాడు. మరీ ఎక్కువగా చలించటం ఆరోగ్యానికి మంచిదికాదు. అంటే మరీ ఉత్సాహకరమైన వార్త విన్నా, మరీ దిగ్భ్రాంతిలో ముంచే వార్త విన్నా శారీరక, మానసిక ఆరోగ్యాలు రెండూ దెబ్బతింటాయి. సాత్త్వికకర్త రెండింటినీ సమానంగా తీసుకుంటాడు. అందువల్ల అతను నిర్వికారంగా ఉంటాడు.

అంటే సాత్త్వికకర్తకు అసలు భావోద్రేకాలే ఉండవనటం లేదు. వేదాంతం ఎన్నడూ అసలు భావోద్రేకాలు ఉండకూడదు అనదు, బండరాయిలా ఉండాలనీ అనదు. నిజానికి ఎవరూ భావోద్రేకాలను పారద్రోలలేరు కూడా. వేదాంతం చెప్పేది ఒకటే. మీ భావోద్రేకాలు మీ విచక్షణాశక్తిని కప్పేయకూడదు. మనిషికున్న అసలైన

ఐశ్వర్యం ఈ విచక్షణాశక్తి, దీన్ని పోగొట్టుకోకూడదు. భావోద్రేకాలను పొందండి, కాని వాటిని మితిమీరనివ్వకండి. సాత్త్వికకర్తకు దాన్ని ఎలా మితిమీరకుండా ఉంచాలో తెలుసు. అందువల్ల అతను **నిర్వికారం**.

ఇటువంటి సమభావన ఎలా పెంపొందించుకోవాలో ఇక్కడ చెప్పడు కృష్ణపరమాత్మ. ఇది ఆఖరి అధ్యాయం; ఇందులో గీతసారాంశాన్ని చూస్తున్నాము. అందుకని ఈ సమతుల్యతను ఎలా పెంపొందించుకోవాలో గుర్తు తెచ్చుకోవాలి అనుకుంటే ఒక్కసారి వెనక్కి మూడవ అధ్యాయంలోకి వెళ్ళాలి. కర్మయోగం నిర్వచనాన్ని మర్చిపోకూడదు.

**కర్మయోగం = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి**

ఏదైనా కర్మ చేసినప్పుడు దాన్ని ఈశ్వరార్పణబుద్ధితో చెయ్యాలి. మీ బుద్ధికి చెప్పుకోవాలి, 'నేను ఈ కర్మను భగవంతునికి అర్పించాను. దానికి వచ్చే ఫలాన్ని భగవంతుడే నిర్ణయిస్తాడు. అందువల్ల భగవంతుడు ఏ కర్మఫలాన్ని ఇస్తే అది సబబైనదే. భగవంతుడు సర్వజ్ఞుడు. ఆయన ఎన్నడూ అన్యాయం చెయ్యడు; పక్షపాతం చూపడు. అందువల్ల నేను చేసిన పనికి ఏ ఫలం వచ్చినా అది న్యాయమైనదీ, సరియైనదీ అయివుంటుంది. ఆ ఫలం సాక్షాత్తూ ఆ భగవంతుని నుంచే వస్తుంది కాబట్టి, దానికి నేను ఎదురుతిరక్కూడదు. ఏదివచ్చినా ఈశ్వర ప్రసాదంలా చిరునవ్వుతో స్వీకరించాలి.' అలా కర్తగా ఈశ్వరార్పణభావన, భోక్తగా ఈశ్వరప్రసాదభావన ఉంటే సమతుల్యత ఏర్పడుతుంది.

ఆ విధంగా సాత్త్వికకర్త ఈశ్వరప్రసాదభావనతో ఉంటాడు. అలాంటి భావన ఉండాలంటే, అతను ముందు భక్తుడై ఉండాలి. భక్తి లేకుండా సాత్త్వికకర్త అయ్యే అవకాశమే లేదు. కాబట్టి కర్మయోగం ముందు భక్తియోగం వస్తుంది. కర్మయోగం అంటే భగవంతునికి అంకితమవటం.

**(నిర్వికారః) కర్తా సాత్త్వికః ఉచ్యతే** – అటువంటి కర్తను సాత్త్వికకర్త అంటారు. సాత్త్వికకర్త కర్మయోగికి ఇంకొక పేరు.

సంగత్వం, అహంకారం లేని; పట్టుదల, ఉత్సాహం ఉన్న, జయాపజయాలకు చలించని వ్యక్తిని **సాత్త్వికకర్త** అంటారు.

శ్లో. 27 **రాగీ కర్మఫలప్రేప్సుః లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।**
**హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥**
రాగీ, కర్మఫలప్రేప్సుః, లుబ్ధః, హింసాత్మకః, అశుచిః,
హర్షశోకాన్వితః, కర్తా, రాజసః, పరికీర్తితః ॥

| | | | |
|---|---|---|---|
| రాగీ | = ఆసక్తి గలవానిని | అశుచిః | = అపవిత్ర ప్రవర్తన గలవానిని |
| కర్మఫలప్రేప్సుః | = కర్మఫలములకై ఆరాటపడువానిని | హర్షశోకాన్వితః | = హర్షశోకములకు లోనగువానిని |
| లుబ్ధః | = లోభిని | రాజసః, కర్తా | = 'రాజసకర్త' అని |
| హింసాత్మకః | = ఇతరులను కష్టపెట్టు స్వభావము గలవానిని | పరికీర్తితః | = చెప్తారు |

**రాగీ, కర్మ-ఫల-ప్రేప్సుః, లుబ్ధః హింసాత్మకః, అశుచిః,**
**హర్ష-శోక-అన్వితః కర్తా రాజసః పరికీర్తితః ।**

తా: ఆసక్తి గలవానిని, కర్మఫలములకై ఆరాటపడువానిని, లోభిని, ఇతరులను కష్టపెట్టు స్వభావము గలవానిని, అపవిత్ర ప్రవర్తన గలవానిని, హర్షశోకములకు లోనగువానిని 'రాజసకర్త' అని చెప్తారు.

ఈ శ్లోకంలో రాజసిక కర్తను నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. రాజసిక కర్తకు లేని ఒక ముఖ్యమైన లక్షణం సాత్త్విక కర్తకు ఉంది. ఏమిటది? సాత్త్విక కర్త, జీవితంలో ఎదురైన జయాపజయాలు రెండింటికీ విలువైన పాఠాలను నేర్పించే సామర్థ్యం ఉందని మనసారా నమ్ముతాడు.

నిజానికి జీవితంలో ఓటమినుంచి పారిపోనవసరం లేదు. దానికి కారణాలు రెండు. ఒకటి ఓటములను తప్పించుకోలేము. రెండు ఓటములనుంచి పాఠాలు నేర్చుకుని పైకి ఎదగవచ్చు. అందువల్ల ఓటమిని పాఠంలా నేర్చుకుని, పైకి ఎదగటానికి ఉపయోగిస్తే, ఆ ఎదుగుదల అసలైన ఆధ్యాత్మిక విజయం అవుతుంది. అందువల్ల బాహ్యఓటమిని ఆంతర ఎదుగుదలకు ఉపయోగిస్తే, అది విజయం అంటుంది వేదాంతం. అది విజయవంతమైన ఓటమి. ఆ విధంగా ఓటమిని మలుచుకుంటే అది ఆధ్యాత్మిక విజయానికి బాటవేస్తుంది. అలాగని చేసేపనిని ఆషామాషీగా చెయ్యకూడదు. విజయం పొందాలనే శ్రద్ధతో చెయ్యాలి; కాని విజయం రాకపోతే కృంగిపోకూడదు; ఓటమినుంచి పారిపోకూడదు. ఇది వేదాంతబోధ. బాహ్యంగా కలిగిన గెలుపు ఓటములను ఆంతరగెలుపుగా మలుచుకోవటం.

ఉదాహరణకు శారీరక ఆరోగ్యం కోసం టెన్నిస్ ఆడే వ్యక్తిని తీసుకోండి. ఇద్దరు వ్యక్తులు టెన్నిస్ ఆడుతుంటే, దానివల్ల రెండు ఫలాలు వస్తాయి. మొదటిఫలం వారిలో ఒకరే గెలుస్తారు. వింబుల్డన్ కప్పుకోసం ఆడుతున్నట్టయితే ఆ కప్పును పొందే విజేత ఒకరే అవుతారు. ఇద్దరూ ఒకసారే గెలవలేరు కదా! అంటే గెలవటం ఒకఫలం.

రెండవఫలం ఆ ఆట వారికి శారీరక దారుఢ్యాన్ని ఇస్తుంది. ఇప్పుడు ఈ శారీరక దారుఢ్యం ఏ ఒక్కరికో వస్తుందా, ఇద్దరికీ వస్తుందా? ఇద్దరికీ సమానంగా వస్తుంది. ఆటలో వారు గెలిచినా, ఓడినా, వారు ఆ ఆట ఆడటంవల్ల వ్యాయామం చేసినవారు అవుతున్నారు; శారీరకబలం పొందుతారు. ఈ ఆటను శారీరకబలం కోసం ఆడితే కప్పు పొందినా, పొందకపోయినా ఆ ఫలం ఎలాగూ పొందుతారు. దానిలో సందేహం లేదు. ఒకవేళ కప్పు కూడా వస్తే, అది అదనపు ఫలం అవుతుంది.

ఇదేసూత్రం కర్మకు కూడా వర్తిస్తుంది. ఏ కర్మ చేసినా గెలుపో, ఓటమో ఏదోఒకటి వస్తుంది. అది తథ్యం. అదికాక రెండవఫలం ఉంది. గెలిచినా, ఓడినా ఆ కర్మ మనస్సును శుద్ధి చేస్తుంది. గెలుపూ మనస్సును శుద్ధి చేస్తుంది; ఓటమీ మనస్సును శుద్ధిచేస్తుంది. నిజానికి ఓటమి ఇంకా శుద్ధి చేస్తుంది. అది ఎలాగంటే ఓటమి మనస్సును దృఢపరుస్తుంది. అందువల్ల ఓటమి ఇంకా శక్తివంతమైనది. అది మీ మనస్సుకు ఎక్కువశక్తిని ఇస్తుంది.

కర్మయోగి ఆంతర ఎదుగుదలకే ప్రాముఖ్యతను ఇస్తాడు. అతను లౌకికవిజయాలను పట్టించుకోడు. అందువల్ల అతను ఎప్పుడూ విజయాన్నే పొందుతాడు. ఎలాగైతే టెన్నిస్ఆట కప్పును ఇప్పించినా, ఇప్పించకపోయినా,

శారీరకబలాన్ని ఇస్తుందో, అలాగే కర్మయోగికి లౌకిక ఆటలో కప్పు వచ్చినా, రాకపోయినా, ఆంతర విజయం నిరంతరం పొందుతూనే ఉంటాడు. కర్మయోగి కాని వ్యక్తికి ఇలా గెలుపు ఓటములను ఆంతర విజయానికి మలుచుకోవటం చేతకాదు.

అందువల్ల మామూలు వ్యక్తి లౌకికవిజయాల వెంటపడతాడు. ఎప్పుడైతే అతను లౌకికవిజయాలను కోరుకుంటాడో, అప్పుడే సమస్యల వలయంలో చిక్కుకున్నట్టు అర్థం. ఎందుకంటే ప్రతిసారీ గెలుపు అతనిదే అవ్వాలని రాసిపెట్టిలేదు. కాని ఇతనేమో గెలిస్తే ఆకాశంలో తేలిపోతాడు, ఓడిపోతే నిరాశతో కృంగిపోతాడు. విజయం వస్తుందని తెలిసినా కూడా వచ్చేదాకా ఆందోళనే. ఎక్కడో చిన్న అనుమానం తలెత్తుతుంది. అందువల్ల కర్మరునికి ఆందోళన, భయం తప్పదు. అటువంటి వ్యక్తిని రాజసికకర్త అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**రాగీ** – లౌకికవిజయాలమీద ఆసక్తి ఉన్నవ్యక్తి; అంటే దానిమీద రాగం పెంచుకుంటాడు.

**కర్మఫలప్రేప్సుః** – బాహ్యంగా ఉన్న ఆడంబరాలకు ఎక్కువ విలువనిచ్చే వ్యక్తి.

అతనికి జీవితంలో ఒక ప్రాథమిక సూత్రం తెలియదు. ఏమిటది? అతను వెంపర్లాడే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో లేవని, అవి తనలోనే ఉన్నాయని తెలియదు. అందువల్ల బాహ్యవస్తువులు అతనికి ఆనందాన్ని, శాంతిని ఇస్తాయి అనుకుంటాడు. అందువల్ల పేరుప్రఖ్యాతులు, ఆస్తిపాస్తులు, పదవి, హోదా కోసం వెంపర్లాడుతాడు. ఆంతరఉన్నతి గురించి ఆలోచించడు. కర్మఫలాలను ఆశిస్తాడు.

**లుబ్ధః** – లుబ్ధః అంటే అత్యాశ, పీనాసితనం రెండూ వస్తాయి. తన ఆస్తిమీద విపరీతమైన మమకారం ఉంటుంది. అందువల్ల అతను వన్‌వే ట్రాఫిక్‌లో ఉంటాడు ఎప్పుడూ. అంటే ఎంతసేపూ ఎవరేమిస్తే అది తీసుకోవటమే తప్ప, ఇవ్వటం ఎరగడు.

అత్యాశవల్ల ఇంకాఇంకా ప్రోగేయాలనుకుంటాడు; పీనాసితనంవల్ల పైసా రాల్చడు. ఎవరికైనా ఇస్తే ఆస్తి కరిగిపోతుందేమోనని భయపడతాడు. ఎందుకంటే తన దగ్గర ఎంత ఎక్కువ ధనం ఉంటే తనకంతటి భద్రత ఉంటుంది అనుకుంటాడు. అందువల్ల అతను **లుబ్ధః**.

**హింసాత్మకః** – ఎప్పుడైతే అతనిలోని అత్యాశ పైకివస్తుందో, అప్పుడే అతను సమాజానికి చీడపురుగుగా మారతాడు. ధర్మాన్ని ఉల్లంఘించటానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే, మొదట ధర్మబద్ధంగానే మొదలుపెట్టినా కూడా, అత్యాశ పెరిగేకొద్దీ, ఇంకాఇంకా ధనం పోగేయాలనిపించినకొద్దీ, ధర్మాధర్మవిచక్షణ కోల్పోతాడు. ఈ విషయాన్ని మూడవ అధ్యాయంలోనే చెప్పాడు కృష్ణపరమాత్మ.

**శ్రీభగవాన్ ఉవాచ**

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

ఆ విధంగా లోభి ధర్మాధర్మాలను పాటించడు. అది హింసగా మారుతుంది. అంటే సమాజానికి హాని చేస్తాడు. ఆ విధంగా అతను **హింసాత్మకః.**

**అశుచిః** – అశుచి అంటే అతని ఆలోచనలు శుద్ధంగా ఉండవు. అంటే అతను తన నీడను కూడా నమ్మడు. ప్రతివారినీ అనుమానిస్తాడు. వ్యాపారంలో భాగస్వామిని అనుమానిస్తాడు. అతను డబ్బు తీసుకుని పారిపోతాడనే భయం అతన్ని నీడలా వెంటాడుతుంది. ఎవర్నీ నమ్మడు. తన దిండుకింద దాచుకుంటాడు. మనుష్యులమీద అపనమ్మకం పేరుకుపోతుంది. అందువల్ల అతను **అశుచిః.**

**హర్షశోకాన్వితః** – ఒక నిముషం ఆనందంతో గెంతితే, ఇంకొక నిముషం విచారంలో మునిగిపోతాడు. అంటే జీవితంలో వచ్చిన ఆటుపోట్లకు తట్టుకోలేడు. అందువల్ల అతని మనస్సు కుదురుగా ఉండదు. అందువల్ల కూడా హింసాత్మకంగా తయారవుతాడు. అంటే ప్రతి చిన్నదానికీ రెచ్చిపోయి, ఇతరులను తిట్టటం చేస్తాడు. అటువంటి వ్యక్తి ఇంటికి రాగానే పిల్లలు మూలమూలలకు వెళ్ళిపోయి నిశ్శబ్దంగా కూర్చుంటారు. భార్యకు తప్పదు కాబట్టి, అతని కళాకళలను భరిస్తుంది.

**(హర్షశోకాన్వితః) కర్తా రాజసః పరికీర్తితః** – అటువంటి వ్యక్తిని రాజసిక కర్త అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

రాగం, విజయాలమీద మక్కువ, లోభత్వం, హింసాత్మకత్వం, అనుమానం, హర్షశోకాలు ఉన్న వ్యక్తిని **రాజసకర్త** అంటారు.

శ్లో. 28 **అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥**

అయుక్తః, ప్రాకృతః, స్తబ్ధః, శఠః, నైష్కృతికః, అలసః,
విషాదీ, దీర్ఘసూత్రీ, చ, కర్తా, తామసః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| అయుక్తః | = జితేంద్రియుడు కానివానిని | అలసః | = సోమరిని |
| ప్రాకృతః | = సుశిక్షితుడు కానివానిని | చ | = ఇంకా |
| స్తబ్ధః | = మూర్ఖుని | దీర్ఘసూత్రీ | = ఉపేక్షతో కాలము గడుపుచుండువానిని |
| శఠః | = ధూర్తుని | తామసః, కర్తా | = 'తామస కర్త' అని |
| నైష్కృతికః | = అకారణముగా ఇతరుల వృత్తులకు విఘాతము కల్గించువానిని | ఉచ్యతే | = పేర్కొంటారు |
| విషాదీ | = నిరంతరము చింతాగ్రస్తుని | | |

**అయుక్తః, ప్రాకృతః, స్తబ్ధః, శఠః, నైష్కృతికః, అలసః,**
**విషాదీ, దీర్ఘ-సూత్రీ చ కర్తా తామసః ఉచ్యతే ।**

తా: జితేంద్రియుడు కానివాడును, సుశిక్షితుడు కానివాడును, మూర్ఖుడును, ధూర్తుడును, అకారణముగా ఇతరుల వృత్తులకు విఘాతము కల్గించువాడును, నిరంతరము చింతాగ్రస్తుడును, సోమరియును ఇంకా ఉపేక్షతో కాలము గడుపుచుండువాడును, అగువాడు 'తామస కర్త' అని పేర్కొనబడును.

ఈ శ్లోకంలో తామసిక కర్తను నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అయుక్తః** – యుక్తః అంటే మనోవాక్కాయ కర్మలను ఒక త్రాటిమీద నడపగలిగిన వ్యక్తి. అతన్ని యోగి అంటారు. అయుక్తః అంటే మనోవాక్కాయ కర్మలను ఒక త్రాటిమీద నడపలేనివ్యక్తి.

ఒకవ్యక్తిలో ఐదుకోశాలు ఉంటాయని చూశాము. అవి అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయకోశము, ఆనందమయకోశము. వాటన్నిటినీ ఒక త్రాటిమీద నడపాలి. ఐదూ ఒక్కత్రాటిమీద నడిస్తే, ఫలం అమోఘంగా ఉంటుంది. భగవన్నామస్మరణ చేసేటప్పుడు కళ్ళు భగవంతుణ్ణే చూస్తూ, నాలుక భగవంతుని నామమే జపిస్తూ, మనస్సు భగవంతునిమీదనే లగ్నమయితే, దాని ఫలం అద్భుతంగా ఉంటుంది. సూర్యకిరణాలను భూతద్దంద్వారా ఒకచోట కేంద్రీకరిస్తే వాటికి ఎంత శక్తి వస్తుందో, అంత శక్తి మీ అంగాలన్నింటినీ ఏకీకృతం చేస్తే వస్తుంది. కాని ఇటువంటి ప్రయత్నమే తామసిక వ్యక్తి ఎన్నడూ చెయ్యడు. ఎందుకంటే దానికి మనస్సు పెట్టి ప్రయత్నం చెయ్యాలి.

ఒకచిన్న ప్రయత్నం చేసిచూడండి. 'నేను ఏం మాట్లాడినా ఆలోచించి, మాట్లాడతాను,' అనుకోండి. అంటే అప్పటికప్పుడు ఏది తోస్తే అది మాట్లాడకుండా, ఆలోచించి మాట్లాడండి. చిన్న పరీక్షలా పెట్టుకోండి. మీకే ఎంత ఫలం వస్తుందో తెలుస్తుంది. మీరు ఏం మాట్లాడినా ముందు దాన్ని ఆలోచించి మాట్లాడాలి. అనాలోచితంగా మాట్లాడకూడదు. ఇదంతా వాచిక తపస్సులో చెప్పాడు కృష్ణపరమాత్మ.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్** – 17.15

ఆచి, తూచి మాట్లాడుతాను అనుకోవటం యోగం. అది పాటించిన వ్యక్తిని యుక్తః అంటారు. ఏ పనిచేసినా అన్ని కోశాలూ కలిసికట్టుగా ఉండాలి. లేకపోతే ఒకటి ఒకవైపుకూ, ఇంకొకటి ఇంకొకవైపుకూ లాగుతాయి. అప్పుడు ముందుకు పోలేరు.

ఇలా అన్ని కోశాలూ కలిసి పనిచెయ్యటం అనేది చాలా అవసరం. ఇది దానంతట అది జరగదు. శారీరక ఎదుగుదల దానంతట అది అవుతుంది. దానికి వేళకి ఆహారం తిని, జీవిస్తే చాలు. మీరు వద్దనుకున్నా, మీరు బరువు పెరుగుతారు కూడా. అలా శారీరక ఎదుగుదల అదే జరుగుతుంది కాని ఆంతర ఎదుగుదల అలా స్వతహాగా జరగదు. దానికి చాలా శ్రమపడాలి. పతంజలి యోగసూత్రాల్లో చెప్పబడిన అష్టాంగయోగం ఆరోగ్యానికి, ఆర్జవానికి తోడ్పడుతుంది. కాని ఇది రావాలంటే ప్రయత్నం చెయ్యాలి. తామసిక వ్యక్తికి ఆ ప్రయత్నం చేసే అలవాటు ఉండదు. అతను బద్ధకానికి ప్రతీక.

**అలసః** – కృష్ణపరమాత్మ అలస తర్వాత చెప్పాడు కాని ముందుకు తెచ్చుకున్నాము. అలసః అంటే బద్ధకం; సోమరితనం. ఈ సోమరితనంవల్ల ఏదీ చేయాలనిపించదు. అందువల్ల ఏమీ ఉత్సాహం లేక ఏమీ చెయ్యడు. తన వ్యక్తిత్వాన్ని ఏకత్రాటి మీద నడపాలి అనుకోడు. అందువల్ల జీవితం గురించిన ప్రణాళికలు కూడా ఏమీ ఉండవు.

జీవితంలో ప్రణాళిక ఉండితీరాలి. ప్రతిమనిషికీ తాత్కాలిక లక్ష్యాలు, అంతిమలక్ష్యం ఉండాలి. ఈ తామసిక వ్యక్తికి అసలు లక్ష్యాలు ఉండవు; ఒకవేళ ఉన్నాకూడా వాటికి ప్రణాళికలు ఎలా వెయ్యాలో తెలియదు. ప్రణాళిక

వేసినా దాన్ని ఆచరణలో పెట్టడు లేదా ఆలోచించకుండా పనిచేస్తాడు. అంటే అతనిలో ప్రణాళిక వేసే బుద్ధీ లేదు, ఆచరణలో పెట్టే శక్తీ లేదు. అలా గాడితప్పిన బండిలా సాగిపోతుంది అతని జీవితం. జీవితంలో డెబ్బయి ఏళ్ళు వచ్చినా, ఇంకా తనకేం కావాలో తెలియదు. అటువంటి వ్యక్తిని అయుక్తః అంటారు. దానికి కారణం అతని అలసత్వం.

అలసః – సోమరితనం అనేది ఆధ్యాత్మిక ఎదుగుదలకు పెద్ద ఆటంకం.

**ఆలస్యం హి మనుష్యాణామ్ శరీరస్థోమహాన్‌రిపుః**

ప్రతివారిలోనూ ఈ బద్ధకం స్వతహాగా ఉంటుంది. ఈ బద్ధకం పొద్దునే నిద్రలేవటం దగ్గరనుంచే మనిషిని లొంగదీసుకుందామని చూస్తుంది. ఎవరైనా ఎనిమిది గంటలకు లేచినా కూడా, శరీరం 'అప్పుడే ఏం మునిగిపోయింది, ఇంకొంచెంసేపు పడుకోరాదా?' అంటుంది. అసలైతే మన శాస్త్రం ఎనిమిది కాదుకదా, సూర్యభగవానుడు తూర్పు తలుపు తోసుకుని వచ్చేలోపే, మీరు లేచి ఆయనకు స్వాగతం చెప్పాలి అంటుంది. కాని మనిషిని కిందికి లాగేది బద్ధకం.

శాస్త్రం ఈ బద్ధకాన్ని పారద్రోలటానికే అనేక పూజావిధానాలను నిర్దేశించింది. శారీరకకర్మ, శరీరం స్థాయిలో తమోగుణాన్ని పారద్రోలటానికే నిర్దేశింపబడింది. నిజానికి మానసికపూజ కాయికపూజకన్నా శక్తివంతమైనదే కాని, దానికి వచ్చేముందు కాయికపూజ చెయ్యాలి అంటుంది శాస్త్రం. అంటే కొన్నాళ్ళు ఆలయానికి వెళ్ళాలి, పూజలు చెయ్యాలి. అప్పుడు ఈ తమోగుణం పోతుంది. కాని ఈ తమోగుణం ఉన్నవ్యక్తికి సోమరితనం ఉంటుంది. అందువల్ల అతను అలసః.

**ప్రాకృతః** – ప్రాకృతః అంటే సంస్కారం లేనివ్యక్తి. అతను ఆలోచించకుండా మాట్లాడతాడు. ఏది మాట్లాడవచ్చో, ఏది మాట్లాడకూడదో అతనికి తెలియదు. అందువల్ల అతను సంస్కారం లేకుండా, మంచీ మర్యాద లేకుండా ఉంటాడు. కొంతమంది సంవత్సరాల తరబడీ గీతాధ్యయనం చేసికూడా, వారికి కోపం వస్తే ఉచితానుచితాలు మరచి చెడ్డమాటలు మాట్లాడేస్తారు. ఆ మాటలను మనం మళ్ళీ ఎవరికీ చెప్పలేము కూడా, అంత చెడ్డగా ఉంటాయి.

ఒక విషయం గుర్తుంచుకోవాలి. గీతాబోధకు వెళ్ళటమంటే దానిమీద నోట్స్ రాసుకోవటం మాత్రమే కాదు. మీ జీవితంలోని ప్రతి నిముషాన్నీ మీరు తీర్చిదిద్దుకోవాలి. దానికి చాలా అప్రమత్తత కావాలి. ఈ వ్యక్తికి అలాంటిది ఉండదు. గీత వినేది వారంలో ఒకరోజు. కాని దాన్ని జీర్ణించుకోవటానికి అప్రమత్తత ఒక గంటకాదు, రెండు గంటలు కాదు, మీరు మేలుకుని ఉన్నంతసేపూ కావాలి. అంత బాధ్యత ఉంటుంది గీత నేర్చుకునేవ్యక్తికి.

కాని ఈ తామసికవ్యక్తి అటువంటి బాధ్యతను ఊహించుకోలేడు. అతను ప్రాకృత పురుషుడు. మనం పుట్టినప్పుడు అందరం జంతువులలాగానే ఉంటాము. కాని సంస్కారం నేర్చుకుని మనిషిగా ఎదగాలి. జంతువు–మనిషి నుంచి మనిషి–మనిషి అవాలి. జంతువు ముందు వెనకలు ఆలోచించదు. ఏదైనా చెయ్యాలనిపిస్తే అది చేసేస్తుంది. పక్కన గీతాబోధ జరుగుతున్నా, ఒక కుక్కకి మొరగాలనిపిస్తే, బోధ అవుతున్నంతసేపూ మొరుగుతూనే ఉంటుంది. 'అయ్యో, ఇప్పుడు క్లాసు అవుతోంది, క్లాసు అయ్యాక తనివితీరా మొరుగుదాము,' అనుకోదు. కాని మనిషికి

ఆ సమయంలో అరవాలనిపించినా, అతను ఉచితానుచితాలను గమనించాలి. 'పక్కన గీతాబోధ జరుగుతోంది, నేను అరవకూడదు,' అనే ఇంగితజ్ఞానం ఉండాలి. అటువంటి విచక్షణాజ్ఞానం లేకపోతే అతన్ని ప్రాకృత పురుషుడు అంటారు. ఇటువంటి వ్యక్తికి మోక్షం విషయం పక్కనపెట్టి, ముందు ప్రాకృతపురుషునినుంచి సంస్కృత పురుషునిగా మార్చాలి. బ్రతికి బాగుంటే మోక్షం గురించి ఆలోచించవచ్చు.

ప్రాకృత పురుషునికి నలుగురిలో ఎలా మెలగాలో తెలియదు. దాన్ని ఆచారం, అనుష్ఠానం అంటారు. ఇప్పటి భాషలో చెప్పాలంటే మంచీ, మర్యాద. ఆచారం, అనుష్ఠానం అంటే ఏవో తాతలనాటి భావాలుగా కొట్టి పారేస్తారు. మన ఆచారఅనుష్ఠానాలను వదిలేస్తే, విదేశీయుల మర్యాదలు నేర్చుకోవాలి. వారి మర్యాద అంటే ఏదోకాదు, మన ఆచారం, అనుష్ఠానాలే.

వారు ప్రతిదీ నేర్పిస్తారు, టేబుల్‌మానర్స్ అంటారు. బల్ల దగ్గర ఎలా కూర్చోవాలి, ఎలా తినాలి, ఒళ్ళో న్యాపికిన్‌ను ఎలా వేసుకోవాలి, పంటిలో ఏదైనా ఇరుక్కుంటే ఏంచెయ్యాలి? వీటన్నిటిమీద వారు పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు రాశారు. మన యువత వాటివెంటబడతారు. మన ఆచారం, అనుష్ఠానాలను విమర్శించిన నోటితోనే వాటిని మెచ్చుకుంటారు. ఇంటర్వ్యూలో ఎలా మాట్లాడాలి, బిజినెస్ మీటింగ్‌లో ఎలా మాట్లాడాలి, ఎవరినైనా పేరుపెట్టి పిలవాలంటే ఏ పేరుతో పిలవాలి? విదేశీయులకు రెండుపేర్లు ఉంటాయి. అందులో ఏ పేరుతో పిలవాలి? వీటన్నిటికీ నియమాలు ఉన్నాయి. ఐదుగురిని ఎవరికైనా పరిచయం చెయ్యాలంటే, వారిలో ఎవరిని ముందు పరిచయం చెయ్యాలి? ప్రతిదానికీ ఇలా నియమాలు ఉన్నాయి.

మనదేశంలో ఆచార అనుష్ఠానం చెయ్యకపోతే పాపం వస్తుంది అంటారు. విదేశాలలో మంచీ, మర్యాదా తెలియకపోతే వ్యాపారం పోగొట్టుకుంటారు అంటారు. రెండూ ఒక్కటే. వ్యాపారంలో విజయవంతం అవ్వాలంటే ఇవన్నీ నేర్చుకోవాలి. ఒక ఫోను వస్తే ఎవరితో ఎలా మాట్లాడాలి? మీకన్నా పైవారు మాట్లాడితే ఎలా మాట్లాడాలి? మీకన్నా చిన్నవారు మాట్లాడితే ఎలా మాట్లాడాలి? అవి తెలియకపోతే మర్యాద లేదు అనేస్తారు.

మాటతీరే కాదు, ఇప్పుడు బాడీలాంగ్వేజ్ ఒకటి వచ్చింది. పై అధికారి ముందు ఎలా కూర్చోవాలి, ఎలా మాట్లాడాలి, ఎలా తుమ్మాలి, తుమ్మినప్పుడు ఎలా సారీ చెప్పాలి – ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయి. వాటినే మన పరిభాషలో ఆచారం, అనుష్ఠానం అంటారు. పేరు వేరు, విషయం ఒకటే.

ఏ దేశానికి ఆ దేశానికి తగ్గ అనుష్ఠానం ఉంటుంది. కొన్ని తర్కానికి అందుతాయి, కొన్ని తర్కానికి అందవు– అంతే భేదం. అలా మనకీ కొన్ని ఆచారవ్యవహారాలు ఉన్నాయి. కాని తామసికవ్యక్తి ఈ మర్యాదలను పాటించడు. అటువంటి వ్యక్తిని ప్రాకృతపురుషుడు అంటారు.

<u>స్తబ్ధః</u> – స్తబ్ధః అంటే అమర్యాదగా ప్రవర్తించేవ్యక్తి. పెద్దవారితో ఎలా మాట్లాడాలి, ఎలా నిలుచోవాలి, చేతులు ఎలా పెట్టుకోవాలి– ఇటువంటి సూక్ష్మవిషయాలను కూడా ధర్మశాస్త్రం బోధిస్తుంది. ఎలా మర్యాద చూపాలి, ఎలా అణకువగా ఉండాలి, ఎలా గౌరవంగా ప్రవర్తించాలి. ఇవన్నీ కూడా ధర్మశాస్త్రం చెబుతుంది. కాని తామసిక వ్యక్తికి ఇటువంటివి తెలియవు, తను పాటించడు. తనకు తెలియదు, ఇంకొకరు చెబితే వినడు; అంటే మూర్ఖత్వంగా ప్రవర్తిస్తాడు.

మన ధర్మశాస్త్రం ఉన్నదే ప్రాకృతపురుషుణ్ణి సంస్కృతపురుషునిగా మార్చటానికి. కాని తామసిక ప్రవృత్తి ఉన్న వ్యక్తి వాటిని పట్టించుకోడు. తనకు లేవాలనిపించినప్పుడు లేస్తాడు, కాఫీ తాగుతాడు, మళ్ళీ పడుకుంటాడు. అంటే తనను తను నియంత్రించుకోలేడు. ఎప్పుడు తినాలనిపిస్తే, ఏది తినాలనిపిస్తే అది తింటాడు. దానికొక సమయం అంటూ ఉండదు. అటువంటివారికి ఆకలి అంటే ఏమిటో తెలియదు. ఆ నోటికి, కడుపుకు కొంచెమైనా విశ్రాంతిని ఇస్తేనే కదా, ఆకలి అంటే ఏమిటో తెలిసేది. ఇలాంటివారిని కామచార, కామవాదీ, కామబక్ష అంటారు. అంటే ఎప్పుడేం చెయ్యాలనిపిస్తే అది చేస్తారు, ఏం మాట్లాడనిపిస్తే అది మాట్లాడతారు, ఏం తినాలనిపిస్తే అది తింటారు. అందువల్ల ఇటువంటి వ్యక్తి **స్తబ్ధః**.

**శఠః** – శఠః అంటే మాయావి. అతని ప్రవర్తన వక్రంగా ఉంటుంది. అతను చెప్పేది ఒకటి, చేసేది ఒకటిగా ఉంటుంది. అతను బయటకు ఏం చెప్పినా, దానివెనక అంతర్లీనంగా ఇంకో కారణం ఉంటుంది. అంటే అతని మాటకు, అతని ఆలోచనకు పొంతన ఉండదు. ఇటువంటి రెండురకాల మనస్తత్త్వం ఉన్నవ్యక్తి ఆధ్యాత్మికంగా ఎదగలేడు. అతనిలో చాలా మానసిక ఒత్తిడి ఉంటుంది. అందువల్ల అతను **శఠః**.

**నైష్కృతికః** – ఇతరుల పనికి అడ్డం వస్తాడు. ఇతనికి ఏమీ లక్ష్యాలు ఉండవని చూశాము కదా. అందువల్ల అతనికి చాలా ఖాళీ సమయం ఉంటుంది. ఆ సమయాన్ని పోచికోలు కబుర్లతోనూ, పుకార్లు పుట్టించటంతోనూ వినియోగిస్తాడు. అతని సమయాన్ని అతను వృథాపరచుకుంటే ఫర్వాలేదు, కాని వేరేవారి సమయాన్ని తినేస్తాడు. చెప్పకుండా ఎవరింటికో వెళ్ళి, వారు ఖాళీగా ఉన్నారో లేదో చూసుకోకుండా, గంటల తరబడీ వారితో బాతాఖానీ వేస్తాడు. మాటవరసకు మీకు ఇప్పుడు ఖాళీయేనా అని అడగడు. ఫోను చేసినా అంతే! ఎదుటివారు పనిలో ఉన్నారేమో అనే ఇంగితజ్ఞానం ఉండదు, తనపాటున తాను గంటలకొద్దీ మాట్లాడుతూపోతాడు. అంటే తన సమయాన్ని వృధా పరుచుకోవటమే కాక, ఎదుటివారి సమయాన్ని కూడా వృథా పరుస్తాడు. అలా ఇంకొకరి సమయాన్ని వృథా పరుస్తాడు కాబట్టి అతను **నైష్కృతికః**.

**విషాదీ** – ఎప్పుడూ విషాదంలో మునిగిపోతాడు. డిప్రెషన్‌లోకి పోకుండా ఉండాలంటే శారీరకంగా ఏదో ఒకపని చేస్తూనే ఉండాలి అంటారు మానసిక శాస్త్రవేత్తలు. ధనం సంపాదించాల్సిన అవసరం లేకపోతే, ఏదో ఒక సామాజికసేవ చేపట్టాలి. ఖాళీగా కూర్చుంటే, మనస్సు బాధల్లోకి వెళ్ళిపోతుంది. బాధ, ప్రతికూల ఆలోచన, నిరాశావాదం వంటివి చోటుచేసుకుంటాయి. ఈ తామసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తికి ఏమీ పని ఉండదు, ఉన్నా చెయ్యడు.

అంతేకాదు, అతను దిగులుగా కూర్చుంటే ఫర్వాలేదు, తన బాధలను ఇతరులకు ఉచితంగా పంచుతాడు. ఎప్పుడూ నవ్వులు చిందించే వ్యక్తి, తను నవ్వుతూ, ఎదుటివారిని నవ్విస్తూ ఉంటాడు. కాని ఎప్పుడూ దుఃఖంలో కూరుకుపోయే వ్యక్తి తను బాధపడతూ, ఎదుటివారిని బాధపెడతాడు. అందువల్ల అతను **విషాదీ**.

**దీర్ఘసూత్రీ** – ఇటువంటి తమోగుణం ఉన్నవ్యక్తిని మీరు మార్చటానికి ప్రయత్నించినా, అతను ఒకపట్టాన మారడు.

తమోగుణం ఉన్నవ్యక్తికి మొదటే సత్త్వగుణ లక్షణాలను బోధించకూడదు. అతనికి సన్న్యాసం గురించి బోధించి, ధ్యానం చెయ్యమంటే, అతను ధ్యానం పేరిట ఇంకా నిద్రపోతాడు. అతని పని మరీ అధ్వానంగా తయారవుతుంది. అందువల్ల అతనికి ఎప్పుడూ సత్త్వగుణం బోధించకూడదు. ముందు రజోగుణానికి తేవాలి.

అతనిలో లౌకికవిజయాలమీద కోర్కెలను రేపండి. ఏదో ఒక కర్మ చేసేలా ప్రేరేపించండి. నిజానికి వేదపూర్వభాగం ఇటువంటి తమోగుణం ఉన్నవ్యక్తులకు అనేక కోరికలను ఆశ చూపించి, వాటిని తీర్చుకునేందుకు తగ్గ యజ్ఞయాగాదులను సూచిస్తుంది. కాని బద్ధకానికి మారుపేరయిన ఈ తమోగుణం ఉన్నవ్యక్తి అంత తేలిగ్గా లొంగడు. వేదపూర్వభాగం ఇలా చెప్పింది, ఈ కర్మచెయ్యి, ఈ ఫలం వస్తుంది అని మీరు చెపితే, అంతా విని, బుర్రఊపి, 'సరే నేను చేస్తాను,' అంటాడు. 'ఎప్పుడు?' అంటే నూతన సంవత్సరంలో మొదలుపెడతానంటాడు. 'అంతదాకా ఎందుకు, ఇప్పుడే మొదలుపెట్టు,' అంటే 'అమ్మో, ఇప్పుడు రాహుకాలం, యమగండం, ఇవాళ మంగళవారం,' ఇంకా ఏవో కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటాడు. 'రేపు చేస్తాను,' అంటాడు; ఆ రేపు రానేరాదు. మీరు గోడమీద రాసుకోవాల్సిందే. లేకపోతే ఇంకెవరో దొరికితే వారికి అంటగట్టేస్తాడు. అతనిచేత పని చేయించటం చాలా కష్టం. ప్రతి పనినీ వాయిదాలు వేస్తాడు. అందువల్ల అతను **దీర్ఘసూత్రీ**.

**కర్తా తామసః ఉచ్యతే** – ఇటువంటి లక్షణాలున్న కర్తను తామసికకర్త అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

యోగి కాని వ్యక్తి, ప్రాకృతపురుషుడు, మూర్ఖుడు, మాయావి, ఇతరుల పనికి అడ్డం వచ్చే వ్యక్తి, సోమరిపోతు, పనిని వాయిదా వేసే వ్యక్తిని **తామసిక కర్తా** అంటారు.

ఇక్కడితో మూడురకాల కర్త గురించిన వివరణ అయిపోయింది.

**జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా** – 18.18

జ్ఞానం, కర్మ, కర్తల గురించి నీకు వివరంగా చెబుతాను విను అన్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడితో ఆ మూడింటి గురించిన వివరణ అయిపోయింది.మూడురకాల కర్త గురించి మళ్ళీ టూకీగా, వెనకనుంచి ముందుకు చూద్దాము. అప్పుడు కిందనుంచి పైకెళ్ళినట్టవుతుంది.

| **శ్లోకం** | **కర్త** | **కర్తల్లో మూడు రకాలు** |
|---|---|---|
| 28 | తామసిక కర్త | యోగి కాని వ్యక్తి, ప్రాకృత పురుషుడు, మూర్ఖుడు, మాయావి, ఇతరుల పనికి అడ్డం వచ్చే వ్యక్తి, సోమరిపోతు, పనిని వాయిదా వేసే కర్త. |
| 27 | రాజసిక కర్త | రాగం, విజయాలమీద మక్కువ, లోభత్వం, హింసాత్మకత్వం, అనుమానం, హర్షశోకాలు ఉన్నకర్త. |
| 26 | సాత్త్విక కర్త | సంగత్వం, అహంకారం లేని; పట్టుదల, ఉత్సాహం ఉన్న, జయాపజయాలకు చలించని కర్త. |

శ్లో. 29 **బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।**
**ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥**

బుద్ధేః, భేదమ్, ధృతేః, చ, ఏవ, గుణతః, త్రివిధమ్, శృణు,
ప్రోచ్యమానమ్, అశేషేణ, పృథక్త్వేన, ధనంజయ ॥

| | | | |
|---|---|---|---|
| ధనంజయ! | = ఓ ధనంజయా! | త్రివిధమ్, భేదమ్ | = మూడు విధములగు భేదములున్నాయి |
| బుద్ధేః | = బుద్ధికి | (మయా) | = నాచేత |
| చ | = ఇంకా | అశేషేణ | = సంపూర్ణముగా |
| ధృతేః, ఏవ | = ధృతికిని | పృథక్త్వేన | = వేర్వేరుగా |
| గుణతః | = గుణములనుబట్టి | ప్రోచ్యమానమ్ | = చెప్పబడుచున్న (వాటిని) |
| | | శృణు | = వినుము |

**హే ధనఞ్జయ! బుద్ధేః ధృతేః చ ఏవ గుణతః త్రివిధమ్**

**భేదమ్ అశేషేణ పృథక్త్వేన ప్రోచ్యమానమ్ శృణు ।**

తా: ఓ ధనంజయా! బుద్ధికి ఇంకా ధృతికిని గుణములనుబట్టి మూడు విధములగు భేదములున్నాయి. నాచేత సంపూర్ణముగా వేర్వేరుగా చెప్పబడుచున్న వాటిని వినుము.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ ఇంకో రెండు అంశాలను ప్రవేశపెట్టబోతున్నాడు. ఇప్పటివరకూ నాలుగు అంశాలను చూశాము. మూడురకాల సన్న్యాసం; మూడురకాల జ్ఞానం; మూడురకాల కర్మ, మూడురకాల కర్తలను చూశాము. ఇక్కడ కృష్ణపరమాత్మ మరో రెండు అంశాలను ప్రవేశపెట్టబోతున్నాడు. అవి బుద్ధి, ధృతి.

**బుద్ధేర్భేదమ్** – బుద్ధిలో మూడురకాలు. దేని ప్రకారం?

**గుణతః త్రివిధమ్** – గుణాలనుబట్టి మూడుగా విభజించవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సాత్త్వికబుద్ధి, రాజసికబుద్ధి, తామసికబుద్ధిల గురించి చెప్పబోతున్నాడు. అంతేకాదు,

**ధృతేశ్చైవ** – ధృతి గురించి కూడా చెబుతాను అంటున్నాడు. ధృతి అంటే మొక్కవోని పట్టుదల. దీన్ని విల్‌పవర్ అంటారు ఇంగ్లీషులో. పట్టుదల చాలా ముఖ్యం. జీవితంలో ఏదైనా లక్ష్యం సాధించాలనుకుంటే పట్టుదల ఉండి తీరాలి. ఏ పని చేపట్టినా, ఆ రంగంలో ఆటంకాలు ఎదురైతీరతాయి. ఆటంకాలు లేని పని అంటూ ఉండదు. ఈ పట్టుదల గనుక లేకపోతే, చిన్న ఆటంకం ఎదురైనా, దాన్ని భూతద్దంలోంచి చూసి, ఆమడదూరం పోతారు.

సైకిలు నేర్చుకునే కొత్తలో ఎడ్లబండి ఎదురైనా భయపడిపోయి, కిందికి దిగిపోతారు. అది ఏ బస్సో, కారో కూడా కాదు. అయినా ధైర్యం చాలదు. పట్టుదల లేకపోతే, ఇంక నేర్చుకోవటం కూడా మానేస్తారు. అందువల్ల పట్టుదల కూడా మూడురకాలని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అవి సాత్త్వికధృతి, రాజసికధృతి, తామసికధృతి.

చివరికి, వదలకుండా గీతాబోధకు వెళ్ళటానికి కూడా గట్టి పట్టుదల ఉండాలి. లేకపోతే ఏ చిన్న ఆటంకం వచ్చినా, మానేయటానికి సిద్ధంగా ఉంటారు కొందరు. మొన్నెప్పుడో తుమ్మితే, ఇవాళ క్లాసుకి వెళితే జలుబు చేస్తుందనే కుంటిసాకు వెతుక్కుంటారు. తిండి తినటానికి ఏ సాకూ అవసరంలేదు. ఏ చిన్న ఆటంకం వచ్చినా, ముందుగా ఆగిపోయేది గీతాబోధే. అలా ఆగకుండా ఉండాలంటే, ఏంచెయ్యాలి? గట్టి పట్టుదల ఉండాలి.

**(ధృతేశ్చైవ) గుణతస్త్రివిధం శృణు** – ధృతి కూడా మూడుగా విభజించబడింది. వాటి గురించి విను.

**ప్రోచ్యమానమశేషేణ** – ఈ ఆరు విషయాలూ నాచేత చెప్పబడతాయి. ఆరు విషయాలు అంటే మూడురకాల బుద్ధి, మూడురకాల ధృతి. ఎలా చెప్పబడతాయి? అశేషణ అంటే పూర్తిగా. అంటే కృష్ణపరమాత్మ కొంచెం చెప్పి, మిగతాది నువ్వు అర్థం చేసుకో అనబోవటం లేదు. ఆరు అంశాలనూ నేనే స్పష్టంగా నీకు అర్థమయ్యేలా చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. శిష్యునిమీద ఎంత అభిమానమో చూడండి. అది కూడా ఎలా చెబుతాడుట?

**పృథక్త్వేన ధనంజయ** – చాలా స్పష్టంగా, వాటి గురించి విడివిడిగా చెబుతాను. నీ పనల్లా నీ మనస్సును, నీ చెవులను నాకప్పగించటమే అర్జునా అన్న అర్థంతో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ విధంగా ఈ శ్లోకం మరో రెండు అంశాలకు ఉపోద్ఘాతం అయింది.

శ్లో. 30 **ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।**
**బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ ॥**
ప్రవృత్తిమ్, చ, నివృత్తిమ్, చ, కార్యాకార్యే, భయాభయే,
బంధమ్, మోక్షమ్, చ, యా, వేత్తి, బుద్ధిః, సా, పార్థ, సాత్త్వికీ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | చ | = అలాగే |
| యా | = ఏ బుద్ధి | బంధమ్ | = బంధమును |
| ప్రవృత్తిమ్ | = ప్రవృత్తి మార్గమును | చ | = ఇంకా |
| చ | = ఇంకా | మోక్షమ్ | = మోక్షమును |
| నివృత్తిమ్ | = నివృత్తి మార్గమును | వేత్తి | = యథార్థముగా తెలుసుకొనునో |
| కార్యాకార్యే | = కర్తవ్యమును, అకర్తవ్యమును | సా, బుద్ధిః | = అటువంటి బుద్ధి |
| భయాభయే | = భయ–అభయములను | సాత్త్వికీ | = సాత్త్వికబుద్ధి అని చెప్పబడును |

**హే పార్థ! యా బుద్ధిః ప్రవృత్తిమ్ చ నివృత్తిమ్ కార్య–అకార్యే**
**భయ–అభయే చ బన్ధమ్ మోక్షమ్ చ వేత్తి, సా సాత్త్వికీ, (మతా) ।**

తా: ఓ పార్థా! ఏ బుద్ధి ప్రవృత్తి మార్గమును ఇంకా నివృత్తి మార్గమును, కర్తవ్యమును, అకర్తవ్యమును భయ–అభయములను అట్లే బంధమును ఇంకా మోక్షమును యథార్థముగా తెలుసుకొనునో అటువంటి బుద్ధి సాత్త్వికబుద్ధి అని చెప్పబడును.

**డి) మూడురకాల బుద్ధి – శ్లోకాలు: 30–32**

ఇక్కడ్నుంచి మూడురకాల బుద్ధిని చూడబోతున్నాము. అవి వరుసగా సాత్త్వికబుద్ధి, రాజసికబుద్ధి, తామసికబుద్ధి. ఈ శ్లోకంలో సాత్త్వికబుద్ధిని నిర్వచించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

మన శాస్త్రంలో బుద్ధికి చాలా పెద్ద ప్రాముఖ్యతనే ఇస్తారు. ఎందుకంటే, మీ అంతిమలక్ష్యం ఏమిటి, తాత్కాలిక లక్ష్యాలేమిటో మీకు బాగా స్పష్టంగా తెలియాలి. ఒక కారులో బయటకు వెళుతున్నారంటేనే, ఎక్కడికి

వెళదామని బయలుదేరారో మీకు తెలియాలి. అంతేకాదు, ఆ గమ్యానికి చేరుకోవటానికి ఏ మార్గంలో వెళ్ళాలో కూడా తెలియాలి. ఇంటినుంచి బయలుదేరాక, కుడివైపు తిరగాలా, ఎడమవైపు తిరగాలా, ఏ మార్గంలో ఎంతదూరం వెళ్ళాలి – ఇలాంటివన్నీ బుద్ధికి ముందే తెలియాలి. అంటే, ఇంకో విధంగా చెప్పాలంటే, మీ అంతిమలక్ష్యం ఏమిటో మీకు తెలియాలి, దాన్ని ఏమార్గంలో వెళితే చేరుకోగలరో కూడా తెలియాలి.

అందువల్లనే మన శాస్త్రం జీవితంలో ఉన్న అనేక వృత్తుల గురించి బోధించటమే కాక, మనకు ఉండాల్సిన చతుర్విధ పురుషార్థాలను కూడా నిర్దేశించింది. అవి ధర్మార్థకామమోక్షాలు. వీటన్నిటి గురించీ బ్రహ్మచర్య ఆశ్రమంలోనే బోధిస్తారు. అతను బయటకి వచ్చేసరికి తన తక్షణ కర్తవ్యం, అంతిమలక్ష్యం ఏమిటో తెలుసుకుని వస్తాడు.

అందువల్ల కఠోపనిషత్తు రథకల్పన వచ్చినప్పుడు బుద్ధిని రథసారధితో పోలుస్తుంది. రథసారధికి తన అంతిమలక్ష్యమేమిటో తెలియటమే కాదు, అతని మనస్సు కూడా స్థిరంగా ఉండాలి. కారుడ్రైవరుకు తన మార్గమూ, లక్ష్యమూ తెలిసినా కూడా, అతను త్రాగి కారును నడిపితే, అతని గమ్యాన్ని సరిగ్గా చేరుకోలేడు. పూర్వం ఐక్యూని చూసేవారు. ఐక్యూ అంటే ఇంటిలిజెంట్ కోషెంట్ అంటే అతని బుద్ధిస్థాయి. ఇప్పుడు దానితోపాటు ఇక్యూ కూడా చూస్తున్నారు. అంటే ఎమోషనల్ కోషెంట్, అంటే మనస్సు ప్రశాంతత స్థాయి. లక్ష్యం గురించి బుద్ధి చెప్పాలి; ఆ మార్గానికి మనస్సు చేర్చాలి.

**యా వేత్తి** – ఏ బుద్ధికి అయితే ఈ కింది అంశాలు స్పష్టంగా తెలుస్తాయో;

**సా బుద్ధిః సాత్త్వికీ** – ఆ బుద్ధిని సాత్త్వికబుద్ధి అంటారు. ఏమిటవి?

**ప్రవృత్తిం చ** – ప్రవృత్తి అంటే కర్మమార్గం. కర్మమార్గంద్వారా ఏ లక్ష్యాలను పొందగలరో, ఏ లక్ష్యాలను పొందలేరో స్పష్టంగా తెలియాలి. అంటే కర్మవల్ల కొన్ని విషయాలను సాధించవచ్చు కాని మరికొన్నింటిని సాధించలేరు. కర్మ వేటిని సాధించగలదో, వేటిని సాధించలేదో స్పష్టంగా తెలియాలి.

అది తెలియకపోతే, కర్మను తెలివిగా ఉపయోగించుకోలేరు. కర్మ ఒక మార్గం. ఆ మార్గం ద్వారా ఏ లక్ష్యాన్ని పొందగలరో, ఏ లక్ష్యాన్ని పొందలేరో సరిగ్గా తెలియాలి.

**నివృత్తం చ** – నివృత్తి అంటే జ్ఞానమార్గం. జ్ఞానమార్గం ఆరు విషయాల గురించి జ్ఞానాన్ని కలుగజేస్తుంది. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, సంసారం, మోక్షం, సాధన. జ్ఞానమార్గం దేని గురించి బోధిస్తుందో తెలుసుకోవాలి. జ్ఞానంయొక్క శక్తిని తెలుసుకోవాలి.

ప్రవృత్తి అంటే కర్మమార్గం; నివృత్తి అంటే జ్ఞానమార్గం. వాటి శక్తులు ఏమిటి? పరిమితులు ఏమిటి? ఈ రెండింటి గురించీ స్పష్టత ఉండాలి.

**కార్యాకార్యే** – మీరు కర్మమార్గాన్ని ఎన్నుకున్నాక, అందులో కూడా రెండురకాల కర్మలు ఉన్నాయి అంటుంది శాస్త్రం. ఒకరకం కర్మ ఆధ్యాత్మికతకు దగ్గరగా తీసుకువెళితే, ఇంకొకరకం కర్మ ఆధ్యాత్మికతకు దూరంగా

తీసుకువెళుతుంది. మొదటిరకం కర్మను కర్మయోగం అంటారు. ఆ కర్మ చేస్తే అది చిత్తశుద్ధిని కలుగజేసి, జ్ఞానమార్గంమీద శ్రద్ధ ఏర్పడేలా చేస్తుంది. దానివల్ల నెమ్మదిగా గీతాబోధకు వెళ్ళాలనీ, సన్న్యాసులను గౌరవించాలనీ అనిపిస్తుంది.

దానికి భిన్నంగా కర్మ మాత్రమే చేస్తే, అది అంతకంతకూ లౌకికజీవనంలో కూరుకుపోయేలా చేస్తుంది. దానివల్ల ఆధ్యాత్మికతకు మరింత దూరం చేస్తుంది.

**కృతిమహోదధౌ పతనకారణమ్ ఫలమశాశ్వతం గతినిరోధకమ్** – ఉపదేశసారము 2

ఈ కర్మలు అశాశ్వతమైన ఫలాన్ని ఇవ్వటమే కాక, లక్ష్యంనుంచి దూరం చేస్తాయి. ఇటువంటి కర్మలు లౌకికంగా అనేక విజయాలను సమకూరుస్తాయి – ఐశ్వర్యాన్ని, పదవిని, హోదాని, పేరుప్రఖ్యాతులని, గౌరవమర్యాదలని ఇస్తాయి కాని అవి ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆటంకాలను కలుగజేస్తాయి. అందువల్ల వాటి పరిమితులు తెలుసుకుని, అవి ఎంత ప్రలోభపెట్టేవిగా ఉన్నాకూడా వాటినుంచి పైకి ఎదగాలి. కార్యాకార్యేలో కార్యం అంటే ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడే కార్యం ఏమిటో తెలుసుకోవాలి. అకార్యే అంటే ఏది ఆటంకం కలిగిస్తుందో కూడా తెలుసుకోవాలి. అందువల్ల కర్మ గురించిన విచక్షణ ఉండాలి.

**భయాభయే** – భయం అంటే భద్రతనివ్వని వస్తువు భయాన్ని కలుగజేస్తుంది; అభయం అంటే భద్రతనిచ్చే వస్తువు అభయాన్ని కలుగజేస్తుంది. సత్త్వగుణం ఉన్న వ్యక్తికి ఏది భద్రతను ఇస్తుందో, ఏది అభద్రతను కలుగజేస్తుందో స్పష్టంగా తెలుసు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఏ మనిషైనా కూడా ప్రాథమికంగా కోరుకునేది భద్రత. పుట్టటమే అభద్రతాభావనతో పుడతాడు. అందుకే చిన్నపిల్లవాడు తల్లికొంగు వెనకాల దాక్కుంటాడు. కొంతమంది పిల్లలు తల్లి పక్కన లేకపోతే, తల్లి చీరను పక్కన పెట్టుకునో, నోట్లో వేలు పెట్టుకునో పడుకుంటారు. అప్పుడు తల్లి పక్కనే ఉందనే ధైర్యం వస్తుంది వారికి.

అదృష్టమో, దురదృష్టమో తెలియదు, జీవితంలో ఎన్ని సాధించినా మనిషికి ఈ అభద్రతాభావన మాత్రం పోదు. అంతకుముందు భద్రతకోసం పాటుపడ్డాడు. ఇప్పుడు తనకు భద్రతనిచ్చే ఇల్లు, ధనం, మనుష్యులు సమకూడారు. కాని తనకు భద్రతనిచ్చేవాటికోసం లేదా వాటి భద్రతకోసం వెంపర్లాట పెరిగిపోయింది. అంటే ఏమిటి అర్థం? ఈ అభద్రత జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టమవుతున్నది. మనిషికి ఏది భద్రతను ఇస్తుంది, ఏది భయాన్ని కలుగజేస్తుంది అనే విషయాల్లో స్పష్టత లేదు. చాలా వస్తువులు తనకు భద్రతను ఇస్తాయి అనుకుంటాడు కాని అవి ఇవ్వవని అనుభవం కొన్ని మొట్టికాయలు వేశాక తెలుస్తుంది. కాని సాత్త్వికగుణం ఉన్నవ్యక్తికి ఆ భేదం తెలుస్తుంది. భయాన్ని ఏది కలుగజేస్తుందో, అభయాన్ని ఏది ఇస్తుందో అతనికి స్పష్టంగా తెలుసు. అతను చీకట్లో తడుములాడుకోడు.

ఏది అభయాన్ని ఇస్తుంది? దేనికి భద్రత ఉందో, అది మీకు కూడా భద్రతను ఇస్తుంది. అతనికే ధైర్యం లేని వ్యక్తి ఇంకొకరికి ఏం భద్రతను ఇస్తాడు? కొంతమంది పిరికిపందలు వారే భయంతో గజగజలాడిపోతూ,

'నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు,' అంటే వారిమీద మీరేం భరోసా పెట్టుకోగలరు? తనకే భద్రత లేదు. భద్రత లేనివ్యక్తి ఇంకొకరికి భద్రతను ఇవ్వలేడు. మరి ఏది భద్రతను ఇస్తుందంటే భద్రత ఉన్న, శాశ్వతమైన, అనంతమైన వ్యక్తి మాత్రమే ఇవ్వగలడు. ఆ వ్యక్తిని భక్తిపరంగా భగవంతుడు అంటాము; వేదాంతపరంగా బ్రహ్మ అంటాము. భగవంతుడో, బ్రహ్మో తప్ప వేరే ఎంత వెతికిచూసినా ఎవరూ భద్రతను ఇవ్వలేరు.

**యావద్విత్తోపార్జన సక్తః తావన్నిజపరివారో రక్తః।**

**పశ్చాజ్జీవతి జర్జరదేహే వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥** – భజగోవిందం 5

సంపాదన, మనుష్యులు, శరీరం ఏవీ శాశ్వతం కావు. శాశ్వతం కానివి ఏవీ భద్రతను ఇవ్వలేవు. అందువల్ల బాహ్యప్రపంచం భద్రతను ఇవ్వలేదు, ఒక్క భగవంతుడే ఇస్తాడని తెలుసుకోవాలి. ఈ స్పష్టత ఒక్క సాత్త్వికబుద్ధి ఉన్న అతనికే ఉంటుంది. దాన్ని **భయాభయ జ్ఞానం** అంటారు.

**బంధం మోక్షం చ** – బంధం అంటే ఏమిటి? బంధాన్ని కలిగించేది; మోక్షం అంటే ముక్తిని కలిగించేది. ఇది భయం, అభయాల వంటిదే. ఏది బంధహేతువు, ఏది ముక్తిదాయకం? ఈ విషయాలు సాత్త్వికబుద్ధి ఉన్నవ్యక్తి గ్రహిస్తాడు. బాహ్యవస్తువులు మీకు శాంతి, భద్రత, ఆనందాలను ఇస్తాయనుకుని వాటివెంట పరుగులు తీస్తారు. దానివల్ల ఒకదానిమీద ఆధారపడటంనుంచి ఇంకొకదానిమీద ఆధారపడటం వైపుకు; ఒక బంధంనుంచి ఇంకొక బంధం వైపుకు; ద్వైతంనుంచి ఇంకా ఎక్కువ ద్వైతానికి ప్రయాణిస్తారు. అది మోక్షాన్ని ఇస్తుంది అనుకుంటారు కాని, నిజానికి ద్వైతంమీద, బాహ్యవస్తువులమీద ఆధారపడటం బంధమే అవుతుంది.

అందువల్ల జీవితంలో మీ లక్ష్యం ఏమిటంటే ఆధారపడటం అనేదాన్ని తగ్గించుకోవాలి. వస్తువులను పట్టుకుని ప్రాకులాడటం తగ్గించుకోవాలి. కర్రలు పట్టుకుని నడిచినన్నాళ్ళూ స్వంతంగా నడవలేరు. వాటిని వదిలేసి సాధన చెయ్యాలి. బంధాలు అనేవి ఈ కర్రలవంటివి. ఈ బంధాన్ని వదలగలగాలి. ఈ భూమ్మీదకు వంటరిగా వచ్చారు, వంటరిగా వెళతారు, వెంట ఎవరూ రారు అనే జీవితసత్యాన్ని జీర్ణించుకోవాలి. ప్రపంచంలో అందరూ మిమ్మల్ని వెలివేసినా, మీరు ఆనందంగా ఉండాలి. అన్నీ త్యజిస్తే ఆనందం వస్తుంది, పొందితే కాదు.

లౌకిక విజయాల వెంట పరుగులు తీసేవారు, ఎంత ఉంటే అంత ఆనందం కలుగుతుంది అనుకుంటారు కాని అది పొరపాటు. అలా అన్నామని, మీరు ఉన్న వస్తువులన్నింటినీ, ఉన్న అనుబంధాలనన్నింటినీ వదులుకోనవసరం లేదు. మానసికంగా త్యజించగలగాలి.

**యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ** – ఈ విషయాలను స్పష్టంగా ఎవరు తెలుసుకుంటారో అతనికి సాత్త్వికబుద్ధి ఉన్నట్టు అర్థం అని తెలుసుకో అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఒక్కముక్కలో చెప్పాలంటే సత్త్వగుణం ఉన్నవ్యక్తికి జీవితంలో ప్రతి అంశాన్ని గురించీ స్పష్టమైన జ్ఞానం ఉంటుంది. మనిషి గొప్పతనం ఏమిటో అతనికి తెలుసు. మనిషి బుద్ధిజీవి అనీ, జంతువులకు ఈ బుద్ధి లేదనీ తెలుసు. అందువల్ల మనిషికి మాత్రమే పురుషార్థాలు ఉన్నాయని తెలుసు. అంతేకాదు, వాటిల్లో దేన్ని అంతిమ లక్ష్యంగా చూడాలి; వేటిని సహకారీ సాధనలుగా చూడాలి; ఏది లక్ష్యం, ఏది మార్గం, ఇటువంటివాటిలో స్పష్టమైన అవగాహన ఉంటుంది.

శాస్త్రం అనేక సాధనల గురించి బోధిస్తుంది. జపం, సమాజసేవ, పూజ, ధ్యానం, శాస్త్ర అధ్యయనం – ఇలా అనేక మార్గాలను సూచిస్తుంది. వీటిలో వేటిని పాటించాలి? సాత్త్వికబుద్ధి ఉన్నవ్యక్తికి ఏ సాధనవల్ల ఏ సాధ్యాన్ని పొందవచ్చో బాగా తెలుసు. దేన్ని మార్గంగా వాడి, ఏ గమ్యాన్ని పొందాలో తెలుసు. అంతేకాదు, ఏ సాధన ముందు చెయ్యాలో, ఏ సాధనను తర్వాత చెయ్యాలో కూడా తెలుసు. కర్మ ముందా, ధ్యానం ముందా, శాస్త్ర అధ్యయనం ముందా – వీటిల్లో స్పష్టత ఉంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే కర్మకాండను ముందు పాటించాలా, జ్ఞానకాండకు ముందు వెళ్ళాలా అనే విషయం బాగా తెలుసు.

శాస్త్రం కర్మకాండకు ముందు రావాలి అంటుంది. ధ్యానంతోనో, ఆత్మజ్ఞానంతోనో ఓంప్రథమంగా ఆరంభించలేరు. కర్మకాండకు వచ్చి చిత్తశుద్ధి పొంది; ఉపాసనయోగానికి వచ్చి చిత్తఏకాగ్రత పొంది, అప్పుడు జ్ఞానయోగానికి రావాలి. అందువల్ల ఏ వరుసక్రమంలో సాధన చెయ్యాలో కూడా స్పష్టంగా తెలియాలి. లేకపోతే అతని సాధన తలకిందుల వ్యవహారంగా ఉంటుంది.

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥** – 2.41

తెలివైన వ్యక్తికి తనకేం కావాలో తెలుసు. ధర్మాధర్మాలు, కార్యాకార్యాలు, భయాభయాలు, బంధమోక్షాల గురించిన విచక్షణ ఉన్న బుద్ధిని సాత్త్వికబుద్ధి అంటారు.

శ్లో. 31 **యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్యమేవ చ ।**
**అయథావత్ ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ ॥**
యయా, ధర్మమ్, అధర్మమ్, చ, కార్యమ్, చ, అకార్యమ్, ఏవ, చ,
అయథావత్, ప్రజానాతి, బుద్ధిః, సా, పార్థ, రాజసీ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అకార్యమ్, ఏవ | = అకర్తవ్యమునూ |
| యయా | = ఏ బుద్ధిద్వారా | అయథావత్, ప్రజానాతి | = యథార్థముగా తెలిసికొనలేడో |
| ధర్మమ్, చ | = ధర్మమునూ | సా, బుద్ధిః | = ఆ బుద్ధి |
| అధర్మం, చ | = అధర్మమునూ | రాజసీ | = 'రాజసబుద్ధి' అని చెప్పబడును |
| కార్యమ్, చ | = కర్తవ్యమునూ | | |

**హే పార్థ! యయా చ (బుద్ధ్యా జీవః) ధర్మమ్ అధర్మమ్ చ,**
**కార్యమ్ అకార్యమ్ చ, అయథావత్ ఏవ ప్రజానాతి సా బుద్ధిః రాజసీ (మతా) ।**

తా: ఓ పార్థా! మనుష్యుడు ఏ బుద్ధిద్వారా ధర్మమునూ, అధర్మమునూ, కర్తవ్యమునూ, అకర్తవ్యమునూ యథార్థముగా తెలిసికొనలేడో ఆ బుద్ధి 'రాజసబుద్ధి' అని చెప్పబడును.

ఈ శ్లోకంలో రాజసికబుద్ధిని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. రాజసిక ప్రవృత్తి మూర్తీభవించిన అయోమయం. ఆధ్యాత్మికత గురించి ఏమీ తెలియకపోతే, అది అజ్ఞానం అవుతుంది; అజ్ఞానం ఆనందాన్నే కలుగజేస్తుంది. ఆధ్యాత్మికత గురించి పూర్తిగా తెలిస్తే ఏ బాధాలేదు, అప్పుడూ ఆనందమే పొందుతాడు. తెలిసీ తెలియని మిడిమిడి జ్ఞానంతోనే వస్తుంది గొడవంతా. అతను కంటికి కనబడ్డ ప్రతి పుస్తకాన్నీ చదువుతాడు; అన్నింటి ప్రభావమూ అతనిమీద పడుతుంది.

ముందు ధ్యానంమీద ఏదో పుస్తకం చదువుతాడు. అది అతనికి బాగా నచ్చుతుంది. రోజుకి ఐదుగంటలు ధ్యానంలో కూర్చుంటాడు. అందులో బాగా ఆరితేరే సమయానికి, ఇంకేదో అతని కళ్ళబడుతుంది. అది ఆధ్యాత్మికత అంటే సమాజసేవ అంటుంది. వెంటనే ధ్యానాన్ని మానేసి, బాగా సమాజసేవలో హుషారుగా కూరుకుపోతాడు. ఇంతలో మరెవరో కుండలినీ ధ్యానం గురించి రాస్తారు. దాన్ని ప్రయత్నిస్తాడు. ఇంకొన్నాళ్ళకి కలియుగంలో నామజపం ఒక్కటి చేస్తే చాలు అని ఎక్కడో చూస్తాడు.

**కలే కల్మషచిత్తానామ్, పాపద్రవ్యోప జీవినామ్**
**విధిక్రియా విహీనానామ్, గతిర్గోవింద కీర్తనమ్**

వేదాంతం అర్థంకాదు; గౌడపాదాచార్యులవారి కారికలు అసలే అర్థంకావు.

**హరేర్ నామైవ నామైవ నామైవ మమ జీవనమ్।**
**కలౌ నాస్తైవ నాస్తైవ నాస్తైవ గతిరన్యథా॥**

ఇదేదో చాలా బాగుంది. నామజపం చేస్తే చాలు అనుకుంటాడు. అది మొదలుపెడతాడు. ఇంతలో ఎవరో 'అదుగో, అక్కడ గీతాబోధ జరుగుతోంది, బాగా చెబుతున్నారు,' అంటారు. దానికి వెళతాడు. అలా అయోమయమే అయోమయం. ఏ దారిలో వెళ్ళాలో తెలియదు. అలా అయోమయంలో మునిగితేలే బుద్ధిని రాజసికబుద్ధి అంటారు.

అంటే అతని బుద్ధిలో అనేక సందేహాలు రాజ్యమేలుతాయి. ఆధ్యాత్మిక సాధనలో కూడా అనేక సాధనల గురించి వింటాడు కాని, ఏ సాధన ఏ సాధ్యాన్ని కలుగజేస్తుందో తెలియదు.

**యయా ధర్మమ్ అధర్మం చ** – అతనికి ధర్మానికీ, అధర్మానికీ మధ్య ఉన్న సూక్ష్మబేధం తెలియదు. ధర్మం అంటే శాస్త్రంలో విధించిన నియమాలు. అధర్మం అంటే శాస్త్రం నిషేధించిన విషయాలు. ధర్మం మోక్షం పొందటానికి మొదటి మెట్టయితే, అధర్మం మోక్షానికి దూరంగా తీసుకువెళుతుంది. అధర్మం సమృద్ధిగా ఐశ్వర్యాన్ని, పేరుప్రతిష్ఠలను ఇవ్వచ్చేమో కాని, ఆధ్యాత్మిక ఎదుగుదలకు మాత్రం తోడ్పడదు.

కాని ఇతనికి వాటి రెండింటి మధ్య భేదం తెలియదు. శాస్త్రం చదివినా, ఆ అయోమయం పోదు. శాస్త్రంలోనే అలా భిన్నవాక్యాలు ఉన్నట్టుగా ఉంటుంది. శాస్త్రం ఒకచోట కర్మను కీర్తిస్తుంది; మరొకచోట కర్మను నిందిస్తుంది. భగవద్గీతలోనే కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయంలో అన్నాడు –

**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః**

స్వధర్మాన్ని కీర్తించాడు అక్కడ; మళ్ళీ ఈ అధ్యాయంలో దానికి భిన్నంగా చెప్పబోతున్నాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య**

పెద్ద అయోమయం. ధర్మాన్ని పాటించాలా? ధర్మాన్ని వదిలివేయాలా?

**కార్యం చ అకార్యమ్ ఏవ చ** – అంతేకాదు, లౌకికకర్మలు చెయ్యాలా వద్దా? ఇది కూడా తెలియదు. ధర్మం, అధర్మం శాస్త్రపరంగా విధినిషేధాలు. కార్యం, అకార్యం ఇంగితజ్ఞానం చూపే విధినిషేధాలు. కార్యం అంటే లౌకిక కర్మలు. లౌకిక కర్మల విషయంలో కూడా అతనికి సరియైన జ్ఞానం లేదు. దాన్ని మిడిమిడి జ్ఞానం అంటారు. అందువల్ల అయోమయం.

**అయథావత్ ప్రజానాతి** – అందువల్ల అతనిది అసంపూర్ణమైన, సగం తెలిసిన జ్ఞానం.

వేదాంతంలో రజ్జుసర్పభ్రాంతిని వేదాంతం వివరించటానికి వాడతారు. మాండూక్యోపనిషత్తులోనూ, బ్రహ్మసూత్రాల్లోనూ వివరంగా చూస్తాము. బ్రహ్మసూత్రాలకు ముందు రాసిన అధ్యాసభాష్యంలో ఈ రజ్జుసర్పభ్రాంతిని చర్చించారు శంకరాచార్యులవారు.

**అక్కడ ఉన్నది తాడు**

ఇది వాక్యం. అక్కడ పూర్తి వెలుతురు ఉంటే, తాడు తాడుగా కనిపిస్తుంది; ఏమీ సమస్య లేదు. అలాగే అక్కడ పూర్తి చీకటి ఉంటే అక్కడ త్రాచుపాము ఉన్నా, అది ఉన్నట్టు తెలియదు; అప్పుడూ సమస్య లేదు. అంటే పూర్తి జ్ఞానం ఉన్నా ఆనందమే, పూర్తి అజ్ఞానం ఉన్నా ఆనందమే. అరకొర జ్ఞానం ఉంటేనే వస్తుంది సమస్య అంతా.

అక్కడ సగం చీకటి, సగం వెలుతురు ఉందనుకోండి. అప్పుడు అక్కడ ఉన్న వస్తువు స్పష్టంగా తెలియదు. అంటే అక్కడ ఏదో ఉందని తెలుస్తుంది కాని ఆ ఉన్నది ఏమిటన్నది తెలియదు.

**అక్కడ ఉన్నది తాడు** వాక్యంలో

**అక్కడ ఉన్నది – సామాన్యజ్ఞానం, తాడు – విశేషజ్ఞానం.** అక్కడ ఒకటి ఉందని తెలుస్తున్నది కాబట్టి అది సామాన్యజ్ఞానం. అది ఏమిటి? తాడా, పామా? తెలియటం లేదు. అంటే దాని గురించిన విశేషజ్ఞానం తెలియదు. అందువల్ల ఆ వాక్యంలో ఒక సగం అలాగే ఉంచి, ఇంకొక సగాన్ని మారుస్తాము.

**అక్కడ ఉన్నది పాము**

అంటాము. అంటే తాడును చూసి పాముగా పొరపడి, ఖంగారు పడతాము. దీన్నే రజ్జుసర్పభ్రాంతి అంటారు. దీని గురించిన చర్చ చాలా ఉంటుంది. దాని లోతుల్లోకి వెళ్ళటం లేదు మనం. ఇక్కడ తెలుసుకోవాల్సింది ఒకటే. ఏ విషయమైనా పూర్తిగా తెలిసినా సమస్య లేదు; అసలేమీ తెలియకపోయినా సమస్య లేదు; తెలిసీ తెలియని జ్ఞానం ఉంటేనే వస్తుంది చిక్కంతా. సాత్త్వికబుద్ధి ఉన్న అతనికి ధర్మాధర్మ, కార్యాకార్య విచక్షణ ఉంటుంది.

అతనికి ఏ సమస్యాలేదు. తామసికబుద్ధి ఉన్న అతనికి అసలు ధర్మాధర్మ, కార్యాకార్య విచక్షణ ఉండదు. అతనికీ ఏ సమస్యా లేదు. రాజసికబుద్ధి ఉంటే అతనికి సగం తెలుసు, సగం తెలియదు. దాన్ని అయథావత్ అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సా బుద్ధిః పార్థ రాజసీ** – ఓ అర్జునా, అటువంటి బుద్ధి రాజసిక బుద్ధి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ధర్మాధర్మాలు, కార్యాకార్యాలు గురించిన పూర్తిజ్ఞానం లేని బుద్ధిని **రాజసికబుద్ధి** అంటారు.

శ్లో. 32 **అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా ।**
**సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ తామసీ ॥**
అధర్మమ్, ధర్మమ్, ఇతి, యా, మన్యతే, తమసా, ఆవృతా,
సర్వార్థాన్, విపరీతాన్, చ, బుద్ధిః, సా, పార్థ, తామసీ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | సర్వార్థాన్ | = సమస్త విషయములను |
| యా | = ఏ బుద్ధి | విపరీతాన్, చ | = వాటికి విరుద్ధముగా |
| తమసా, ఆవృతా | = తమోగుణముచే కప్పబడినదై | (మన్యతే) | = భావించునో |
| అధర్మమ్ | = అధర్మమును | సా | = అది |
| ధర్మమ్, ఇతి | = ధర్మమని | తామసీ, బుద్ధిః | = 'తామసబుద్ధి' అని పేర్కొనబడును |
| మన్యతే | = తలంచునో | | |
| చ | = ఇంకా | | |

**హే పార్థ! యా తమసా ఆవృతా (బుద్ధిః) అధర్మమ్ ధర్మమ్**
**సర్వ–అర్థాన్ విపరీతాన్ చ ఇతి మన్యతే, సా బుద్ధిః తామసీ (స్మృతా) ।**

తా: ఓ పార్థా! ఏ బుద్ధి తమోగుణముచే కప్పబడినదై అధర్మమును ధర్మమని తలంచునో ఇంకా సమస్త విషయములను వాటికి విరుద్ధముగా భావించునో అది 'తామసబుద్ధి' అని పేర్కొనబడును.

ఈ శ్లోకంలో తామసికబుద్ధిని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. తామసికబుద్ధి చూడటానికి తెలివైనబుద్ధిలా కనబడుతుంది; ఎందుకంటే తామసికబుద్ధిలో ఏ విధమైన సందేహమూ ఉండదు. అయితే మరి దాన్ని తామసిక బుద్ధి అని ఎందుకంటారు? ఎందుకంటే దానికి తెలిసిందంతా తప్పుడు జ్ఞానం. దాన్ని విపరీతజ్ఞానం లేదా విపర్యయజ్ఞానం అంటారు. కాని వచ్చిన చిక్కేమిటంటే అదే సరియైన జ్ఞానమనే గట్టి నమ్మకంతో ఉంటుంది అతని బుద్ధి.

**అధర్మం ధర్మమితి యా మన్యతే** – తామసికబుద్ధికి అధర్మం ధర్మంగా అనిపిస్తుంది. ఈ విషయాన్ని మనం స్వయంగా మొదటి అధ్యాయంలో చూశాము. మోహంతో కప్పబడిన అర్జునుడు ధర్మాధర్మ విచక్షణను కోల్పోయాడు. తను చెయ్యటానికి వచ్చిన ఈ మహాభారతయుద్ధం అధర్మం అనుకున్నాడు. పైగా అతనికి తన నిర్ణయంమీద

ఏమాత్రం సందేహం కూడా రాలేదు. పైపెచ్చు, కనీసం ఆఖరి నిముషంలోనైనా తనకీ జ్ఞానోదయం అయినందుకు తనను తనే అభినందించుకున్నాడు కూడా. తన జ్ఞానం సరియైన జ్ఞానమనే దృఢనిశ్చయం ఉండటంవల్లనే, గుక్కతిప్పుకోకుండా కృష్ణపరమాత్మకే సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చాడు.

**కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః**

ఇటువంటి తామసికబుద్ధి, తనకున్నది తప్పుడు జ్ఞానమని తెలుసుకోనీయదు. అదే నిజం అనుకుంటుంది గట్టిగా. అందువల్ల తామసికబుద్ధి ఉన్నవ్యక్తిని మార్చటం అంత తేలికకాదు. అతను ఎవరు చెప్పినా వినదు.

**అవిద్యాయామంతరే వర్తమానాః స్వయంధీరాః పండితం మన్యమానాః** – ముండకం

వారికి వారే తాము పండితులమనుకుంటారు. అలా తామే పండితులమనుకుంటే, కొత్తగా నేర్చుకునేదేమిటి? అధర్మాన్ని ధర్మం అనుకుంటారు. ఎందువల్ల?

**తమసావృతా** – తమోగుణం వారిని కప్పటంవల్ల. అలా ఒక విషయంలో వారు పొరపాటు పడితే, పోనీలే ఏదో పొరపాటు పడ్డారని వదిలివేయవచ్చు. కాని తామసికబుద్ధి ఉన్నవ్యక్తికి ప్రతి విషయంలోనూ తప్పుడు జ్ఞానమే ఉంటుంది. కర్మ గురించి కూడా సరియైన అవగాహన ఉండదు. కర్మవల్లనే మోక్షం వస్తుంది అనుకుంటాడు.

**సర్వార్థాన్ విపరీతాంశ్చ** – సర్వ అర్థాన్ అంటే ప్రపంచంలో ఉన్న అన్ని విషయాల గురించిన జ్ఞానంగా తీసుకోవచ్చు లేదా అర్థ అంటే పురుషార్థాల గురించిన అయోమయంగా తీసుకోవచ్చు. విపరీతాన్ అంటే తప్పుడు జ్ఞానం.

ఏ విషయం గురించిన అవగాహన కూడా పూర్తిగా ఉండదు. ధనానికి ఎంతమేరకు ప్రాముఖ్యతను ఇవ్వాలో తెలియదు. ధనాన్ని పూర్తిగానూ నిర్లక్ష్యం చెయ్యకూడదు. మనం లక్ష్మీదేవిని ఐశ్వర్యదేవతగా కొలుస్తాము. అందువల్ల ధనాన్ని గౌరవించాలి. ధనం అసలు అవసరమే లేదు అనుకోకూడదు. ధనం మూలమ్ ఇదం జగత్ అని కూడా అనుకోకూడదు. కొంతమంది ధనంతో శాంతిని, ఆనందాన్ని కూడా కొనుక్కోవచ్చు అనుకుంటారు. రెండూ తప్పే. ఇది అర్థ పురుషార్థం గురించి వారికి ఉన్న అపోహ. అలాగే ధర్మం గురించీ, కామం గురించీ, మోక్షం గురించీ కూడా అతనికి సరియైన జ్ఞానం లేదు.

అందువల్ల మోక్షం అంటే వృద్ధాప్యంలో పొందేది అనుకుంటారు. గీతాబోధకు చిన్న వయస్సులో వెళ్ళకూడదు, వయసుడిగిపోయాక వెళ్ళాలి – ఇదొక పెద్ద అపోహ. ఇది తామసబుద్ధి లక్షణం.

ఇంగ్లీషులో ఒక అద్భుతమైన కొటేషన్ ఉంది.

He who knows not and knows not that he knows not, is a fool, shun him
He who knows not and knows that he knows not, is ignorant, teach him
He who knows and knows not that he knows, is asleep, wake him
He who knows and knows that he knows, is wise, follow him.

దాని అనువాదం దగ్గర దగ్గరగా ఇలా వస్తుంది.

అతనికి తెలియదు, అతనికి తెలియదని అతనికి తెలియదు, అతనొక వెర్రివాడు, అతన్ని వదిలివేయండి
అతనికి తెలియదు, అతనికి తెలియదని అతనికి తెలుసు, అతను అజ్ఞాని, అతనికి నేర్పించండి
అతనికి తెలుసు, అతనికి తెలుసని అతనికి తెలియదు, అతను నిద్రపోతున్నాడు, అతన్ని నిద్రలేపండి
అతనికి తెలుసు, అతనికి తెలుసని అతనికి తెలుసు, అతను జ్ఞాని, అతన్ని అనుసరించండి.

ఈ వాక్యాల వివరణ చూస్తే మొదటి రెండు వాక్యాల్లో అతనికి ఏ విషయమూ తెలియదు. కాని వాటి మధ్య భేదం – మొదటివ్యక్తికి తనకేం తెలియదని కూడా తెలియదు. అతన్ని వెర్రివానిగా భావించి వదిలివేయాలి. రెండవవ్యక్తికి తెలియదు కాని తెలియదన్న విషయం తెలుసు. అంటే తన అజ్ఞానం తెలుసు కాబట్టి, అతనికి నేర్పిస్తే నేర్చుకుంటాడు. మిగిలిన రెండు రకాల్లో ఇద్దరికీ విషయం తెలుసు, కాని మొదటివ్యక్తికి తనకా విషయం తెలుసని తెలియదు. అంటే తన శక్తి తనకే తెలియదు. అటువంటి వ్యక్తిలోని శక్తిని మనం లేపాలి. ఆఖరివ్యక్తికి అతనికి తెలుసు, ఆ విషయం అతనికి తెలుసు. అంటే అతను జ్ఞాని, అతన్ని గౌరవించాలి.

ముండకోపనిషత్తు ఈ నలుగురూ కాక, ఇంకొకరు ఉన్నారని చెబుతున్నది. దాన్ని ఇలా కలుపుకోవచ్చు.

He who knows not but thinks he knows is silly, cannot teach him.

అతనికి తెలియదు కాని అతనికి తెలుసని అనుకుంటాడు, అతను మూఢుడు, అతనికి నేర్పించలేము. అతనే పండితుడు అనుకుంటే, అతనికి మనం కొత్తగా నేర్పించేది ఏముంటుంది? అలా తామసికబుద్ధి ఉన్న అతను ఈ ఐదవ తెగ కిందికి వస్తాడు. తనకు తెలియదు కాని అన్నీ తెలుసనుకుంటాడు. అందువల్ల అందర్నీ విమర్శిస్తాడు– తల్లిదండ్రులను, గురువులను, సన్న్యాసులను, శాస్త్రాన్నీ, ఒక్కరినీ వదిలిపెట్టడు. అంతా తనకే తెలుసనుకుంటాడు. మనం నేర్పిద్దామనుకున్నా అతను వినటానికి సిద్ధంగా ఉంటే కదా.

దానికి గొప్ప ఉదాహరణ రావణాసురుడు. రావణాసురుణ్ణి మార్చటానికి ఎందరో ప్రయత్నించారు. అయినా వినలేదు. స్వయంగా శ్రీరామచంద్రుడే ఆఖరి అవకాశం ఇచ్చాడు. 'ఇవాళ పోయి రేపు రా,' అన్నాడు. అప్పుడూ మారలేదు. రేపు వచ్చి, యుద్ధం చేశాడు. కంసుడూ అంతే. ఏమీ మారలేదు. అలాంటి వ్యక్తులు మీ చుట్టూ ఉంటే వారి విషయంలో మీరేమి చెయ్యలేరు; తూర్పుకు తిరిగి దండం పెట్టడం తప్ప. లేదా, 'ఓ భగవంతుడా, ఇటువంటి వ్యక్తిని భరించగలిగే శక్తిని నాకివ్వు,' అని ప్రార్థించుకోవాలి. అటువంటి వారిని భరించటంవల్ల మీ ప్రారబ్ధకర్మ కూడా త్వరగా క్షయమవుతుంది.

**సా బుద్ధిః పార్థ తామసీ** – ఓ పార్థా, అటువంటి బుద్ధి తామసికబుద్ధి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన విచక్షణ అసలు లేకపోయినా అంతా నాకే తెలుసు అనుకునే బుద్ధిని **తామసిక బుద్ధి** అంటారు.

ఇక్కడితో మూడురకాల బుద్ధిని గురించిన వివరణ అయిపోయింది. మూడురకాల బుద్ధి గురించి మళ్ళీ టూకీగా వెనకనుంచి ముందుకు చూద్దాము. అప్పుడు కిందనుంచి పైకి వెళ్ళినట్టవుతుంది.

**మూడురకాల బుద్ధి**

| శ్లోకం | బుద్ధి | వివరణ |
|---|---|---|
| 32 | తామసిక బుద్ధి | ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన విచక్షణ అసలు లేకపోయినా అంతా నాకే తెలుసు అనుకునే బుద్ధి |
| 31 | రాజసిక బుద్ధి | ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన పూర్తి జ్ఞానం లేని బుద్ధి |
| 30 | సాత్త్విక బుద్ధి | ధర్మాధర్మాలు, కార్యాకార్యాలు, భయాభయాలు, బంధమోక్షాల గురించిన విచక్షణ ఉన్న బుద్ధి |

శ్లో. 33 **ధృత్యా యయా ధారయతే మనఃప్రాణేంద్రియక్రియాః ।**
**యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ ॥**
ధృత్యా, యయా, ధారయతే, మనఃప్రాణేంద్రియక్రియాః,
యోగేన, అవ్యభిచారిణ్యా, ధృతిః, సా, పార్థ, సాత్త్వికీ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | మనఃప్రాణేంద్రియక్రియాః | = మనఃప్రాణేంద్రియ క్రియలను |
| యయా | = ఏ | ధారయతే | = ధారణ చేయునో |
| అవ్యభిచారిణ్యా | = ఇటునటు చలింపని | సా | = అది |
| ధృత్యా | = ధారణాశక్తిచే | సాత్త్వికీ, ధృతిః | = సాత్త్వికధృతియని చెప్పబడును |
| యోగేన | = ధ్యానయోగము ద్వారా | | |

**హే పార్థ! (నరః) యయా అవ్యభిచారిణ్యా ధృత్యా**

**మనః-ప్రాణ-ఇన్ద్రియ-క్రియాః యోగేన ధారయతే, సా ధృతిః సాత్త్వికీ (అస్తి) ।**

తా: ఓ పార్థా! మనుష్యుడు ఇటునటు చలింపని ఏ ధారణాశక్తిచే ధ్యానయోగము ద్వారా మనఃప్రాణేంద్రియ క్రియలను ధారణ చేయునో అది సాత్త్వికధృతియని చెప్పబడును.

**ఇ) మూడురకాల ధృతి - శ్లోకాలు: 33-35: ఉపోద్ఘాతం**

ఆధ్యాత్మిక ఉన్నతి పొందాలంటే విచక్షణాశక్తి ఉన్న బుద్ధి ఒకటీ చాలదు. పట్టుదల కూడా దానికి తోడవ్వాలి. దాన్ని విల్‌పవర్ అంటారు ఇంగ్లీషులో. ఇక్కడ కృష్ణపరమాత్మ విల్‌పవర్ గురించి బోధిస్తున్నాడు కాబట్టి మనిషికి ఫ్రీవిల్ ఉందని తేటతెల్లమవుతున్నది.

ఫ్రీవిల్లా, విధా? ఏది మన భవిష్యత్తును నిర్దేశిస్తుంది? ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి మనుష్యులకు. భగవద్గీతలోనే సందర్భం వచ్చినప్పుడు ఈ విషయాన్ని మనం వివరంగానే చర్చించాము. ఇక్కడ కూడా సందర్భం వచ్చింది కాబట్టి, మళ్ళీ కొంత చూద్దాము.

చాలామంది విధిరాతను నమ్ముతారు. బ్రహ్మదేవుడు మనని సృష్టించినప్పుడే మన తలరాతను రాసే పంపాడనీ, అందువల్ల మనం దాన్ని తప్పించుకోలేమనీ అంటారు. మనం విధి ఆడే వింత నాటకంలో కీలుబొమ్మలం

మాత్రమే అంటారు. పైగా మన శాస్త్రం ఇలాంటి లలాట లిఖితాన్ని బోధిస్తోందనే అపప్రథ ఉంది కూడాను.

విధి అంటే మరేదో కాదు, అది అక్షరాలా మన ప్రారబ్ధకర్మే. అది ఈ జన్మలో చేసినది అవచ్చు, ముందు జన్మల్లో చేసినదీ కావచ్చు. పూర్తిగా విధిని కూడా త్రోసిపుచ్చలేము. విధి పాత్ర కూడా ఉంది. కాని పూర్తిగా విధి పాత్ర మాత్రమే లేదని ఈ శ్లోకాల ద్వారా అర్థం చేసుకోవాలి. అనేక అంశాలు ఉంటాయి. వాటిలో ముఖ్యమైన అంశం ఫ్రీవిల్. మన ఫ్రీవిల్‌ను ఉపయోగించి ప్రాయశ్చిత్త కర్మలు చెయ్యవచ్చు, సాధన చెయ్యవచ్చు. దాని ద్వారా మన విధిని కొంతమేరకు తప్పించుకోవచ్చు.

ఫ్రీవిల్లా, విధా అంటే ఈ రెండింటిలో దేని శక్తి ఎక్కువ ఉంటే, అది ప్రబలంగా ఉన్నట్టు అనిపిస్తుంది. ప్రారబ్ధకర్మ ప్రబలంగా ఉంటే ప్రాయశ్చిత్త కర్మ చేసినా దాన్ని తగ్గించలేము. ప్రారబ్ధకర్మ దుర్బలంగా ఉంటే ప్రాయశ్చిత్త కర్మవల్ల దాన్ని తప్పించుకోవచ్చు. మధ్యస్థంగా ఉంటే, దాని ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించవచ్చు. దీనికి ఉదాహరణగా మూడురకాల రోగాలను చూశాము.

ఎ) రోగం తీవ్రంగా ఉంటే, క్యాన్సర్ ముదిరిపోయి దాన్ని నయం చేయలేని పరిస్థితిలో ఉంటే, భగవంతునికి ప్రార్థన చెయ్యటం తప్ప ఏమీ చెయ్యలేము.

బి) రోగం మధ్యస్థంగా ఉంటే, దాన్ని పూర్తిగా నయం చెయ్యలేము కాని, జీవితాంతం మందులు వేసుకుంటూ, దాన్ని అదుపులో ఉంచగలము. బి.పి., షుగర్, థైరాయిడ్ దానికి ఉదాహరణలు.

సి) రోగం తక్కువస్థాయిలో ఉంటే, మందులు తీసుకుని పూర్తిగా తగ్గించుకోవచ్చు.

అదేవిధంగా విధిరాత కూడా అందరికీ సమానంగా ఉండదు. ఎందుకంటే ఆ విధి మనం చేసుకున్న కర్మలవల్ల వచ్చిందని చూశాము. చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా అన్నారు. అందువల్ల ప్రారబ్ధకర్మయొక్క తీవ్రతలో భేదాలు ఉంటాయి. కాని ప్రారబ్ధకర్మ తక్కువగా ఉంటే, మన పురుషప్రయత్నంతో దాన్ని మార్చవచ్చు.

గీతాబోధకు వెళ్ళే విద్యార్థి ఈ ఫ్రీవిల్ మీద నమ్మకం పెట్టుకోవాలి. లేకపోతే ఈ శ్లోకాలు అర్థవంతంగా ఉండవు. ఫ్రీవిల్‌ను ఉపయోగించి పురుషార్థాలలో మీరు మోక్షాన్ని ఎన్నుకోవాలి. మోక్షం అంటే ఏమిటి? భావపరంగా దేనిమీదా ఆధారపడకపోవటం. భావస్వాతంత్ర్యాన్ని మోక్షం అంటారు. అది ఒక్క జ్ఞానమార్గంవల్లనే సాధ్యం. మోక్షం పొందటానికి జ్ఞానమార్గం తప్ప వేరే ఏమీ మార్గంలేదు. ఇది మొదట తెలుసుకోవలసిన విషయం.

రెండవదశలో ఆత్మజ్ఞానం పొందాలంటే సంసిద్ధమైన మనస్సు ఉండాలని తెలుసుకోవాలి. దాన్ని జ్ఞానయోగ్యత అంటారు. జ్ఞానయోగ్యత పొందాలంటే ధార్మికజీవనం గడపాలి. అంటే మోక్షం పొందాలంటే జ్ఞానం పొందాలి; జ్ఞానం పొందాలంటే యోగ్యత ఉండాలి; యోగ్యత ఉండాలంటే ధార్మికజీవనం గడపాలి. అర్థ, కామాల వెంట పరుగులు తీసినా కూడా, ఆ పరుగులు ధర్మంతో పెనవేసుకుని ఉండాలి. ధనం కోరినా, సుఖాలు కోరినా, వాటి కోసం నైతికంగా దిగజారకూడదు. అవి ధర్మబద్ధంగా ఉంటేనే వాటిని సాధించాలి. ఇటువంటి ధార్మిక జీవనాన్ని ఒక ఏడాదో, రెండేళ్ళో పాటిస్తే చాలదు; జీవితాంతం పాటించాలి. అందువల్లనే మనకు నాలుగు ఆశ్రమధర్మాలను విధించింది శాస్త్రం.

దీని సారాంశం ఏమిటంటే, ఆధ్యాత్మిక జీవనవిధానం ఒకరోజు సాధన కాదు; దీనికి అడ్డదార్లు లేవు; క్రాష్ కోర్సులు లేవు. అడ్డదార్లు తొక్కటానికి ప్రయత్నిస్తే, అడ్డంగా పడిపోతారు. అందువల్ల ఆధ్యాత్మిక సాధనలో ఏకాగ్రతతో, పట్టుదలతో, దృఢనిశ్చయంతో ముందుకు సాగాలి. ఏ మార్గంలో వెళ్ళినా ఆటంకాలు తప్పవు. ఆటంకాలకు ఎదురు నిలిచే దృఢనిశ్చయం ఉండాలి. కిందపడితే పడినచోటే శాశ్వతంగా ఉండిపోకుండా, రబ్బరుబంతిలా పైకి లేవాలి. ఇటువంటి పట్టుదలను **సాత్త్వికధృతి** అంటారు. ఈ పట్టుదల మోక్షాన్ని అంతిమ లక్ష్యంలా చూసేలాగా చేస్తుంది. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము. ఈ శ్లోకంలో సాత్త్విక ధృతిని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**ధారయతే** – ఈ వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో నిలబడతాడు. ఏ స్థాయిలో? అన్ని ఇంద్రియాల స్థాయిల్లోనూ, మనస్సు స్థాయిలోనూ.

**మనఃప్రాణేంద్రియక్రియాః** – మనః అంటే మనస్సు; ప్రాణః అంటే పంచప్రాణాలు; ఇంద్రియ అంటే పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు. క్రియాః అంటే ఇవన్నీ చేసే పనులు. మనిషి ఏపని చేసినా, దాని ప్రభావం మనస్సుమీద పడుతుంది. అతను ఒక పుస్తకాన్ని చదివినా, ఒక టీవీ ప్రోగ్రామ్‌ని చూసినా కూడా దాని ప్రభావం మనస్సుమీద పడుతుంది.

ధారయతే – వీటన్నిటినీ ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటాడు సాత్త్విక ప్రవృత్తి ఉన్నవ్యక్తి. ఆధ్యాత్మికజీవనం అంటే వారంలో ఒకరోజు, ఒకగంటసేపు చేసే సాధన కాదు. అంటే వారంలో ఒకరోజు ఒకగంట ఏ భగవద్గీతో విని వదిలేస్తే చాలదు. ప్రతిరోజూ, ప్రతిక్షణమూ, ప్రతి ఆలోచనా, ప్రతిచర్యా ఆధ్యాత్మికతకు సంబంధించినదిగా ఉండాలి. ఆధ్యాత్మికజీవనం అంటే ఆషామాషీగా తీసుకునేది కాదు, కాలక్షేపం బఠానీ అసలే కాదు; ఆడుతూ పాడుతూ చేసేది అంతకన్నా కాదు. అది ఒక బాధ్యతాయుతమైన, మనస్సుపెట్టి తీసుకున్న నిర్ణయం. అందువల్ల ఎప్పటికప్పుడు ఇంద్రియాలు ఏం చేస్తున్నాయో, పంచప్రాణాలు ఏం చేస్తున్నాయో సమీక్షించుకోవాలి.

మనం ఇటువంటి సమీక్షల్లో దిట్టలము. ఎదుటివారు ఎంత ముందుకు వెళుతున్నారో, లేదా ఎంత వెనకబడి ఉన్నారో చెప్పగలము. భగవద్గీత నేర్చుకుంటున్నారు, ఇలాగేనా ప్రవర్తించేది అని విమర్శిస్తాము. ఇంట్లో ఇద్దరు భగవద్గీత నేర్చుకుంటుంటే, ఒకరిని ఒకరు తీవ్రంగా విమర్శించుకుంటారు. నువ్విలా చేస్తావా అంటే నువ్విలా చేస్తావా అంటారు. సమీక్ష అంటే ఎదుటివారిది కాదు, ఆత్మవిమర్శ. మీరు గీత నేర్చుకుంటూ ఆధ్యాత్మికంగా ముందుకు వెళుతున్నారా, ఎక్కడ ఉన్నవారు అక్కడే ఉండిపోయారా చూసుకుంటూ ఉండాలి. అప్పుడే ఎదుగుదల సాధ్యమవుతుంది.

శివానందస్వామీజీ ఆధ్యాత్మిక డైరీ రాయటం అలవాటు చేసుకోవాలని బోధించేవారు. పదహారవ అధ్యాయంలో దైవీసంపత్తి గురించి, ఆసురీసంపత్తి గురించి చూశాము. మీరు ఆ రెండురకాల లక్షణాలను ఆకళింపు చేసుకోవాలి. మీ ప్రవర్తన ఆసురీసంపత్తి వైపు మొగ్గు చూపుతోందా, దైవీసంపత్తి వైపు మొగ్గు చూపుతోందా బేరీజు వేసుకోవాలి.

మీలో కొట్టొచ్చినట్టు మీకేదైనా బలహీనత కనిపించిందా? భగవంతుడు తప్ప మానవమాత్రుడెవరూ పరిపూర్ణుడు కాదు. అందువల్ల ఒక శుభవార్త ఏమిటంటే బలహీనత అంటూ లేని మనిషి ఎవరూ ఉండరు. కాబట్టి మీరు దాని గురించి సిగ్గుపడనవసరం లేదు. అలాగని దాన్ని వదిలేయకూడదు. కొన్ని బలహీనతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తే, కొన్ని అంతగా తెలియవు. మీరు జాగ్రత్తగా ఆత్మవిమర్శ చేసుకుంటే తెలుస్తాయి.

అందువల్ల ఇదొక నియమంగా పెట్టుకోండి. పొద్దున్న లేవగానే మీ బలహీనతల్లో ఒకదాన్ని తీసుకుని ఒక పదినిముషాలు దాని గురించి శ్రద్ధగా ఆలోచించి ఒక నిర్ణయానికి రండి. ఇవాళ రోజు మొత్తంలో ఏ వ్యవహారం నడిపినా, ఆ బలహీనతను గమనిస్తూ రండి. ఉదాహరణకు మీకు ఆలోచించకుండా మాట్లాడేసే అలవాటు ఉందనుకోండి, ఇది చాలామందికి ఉంటుంది, ప్రతిరోజూ మీ మాటలను గమనించుకోండి. వీలున్నంతవరకూ అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నించండి. రాత్రి పడుకునేటప్పుడు ఆ బలహీనత విషయంలో ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోండి. ఏమైనా విజయం సాధించారా, అలాగే ఉన్నారా అని బేరీజు వేసుకోండి. అలా నిరంతరం సాధన చేస్తూ, అవసరమైన మార్పులు చేర్పులు చేసుకుంటూ వస్తే, కొన్నాళ్ళకు అది తగ్గుతుంది.

**అవ్యభిచారిణ్యా** – లక్ష్యంనుంచి పక్కకు తొలగని ఏకాగ్రత ఉండాలి. లౌకిక వ్యవహారాల్లో ఎంతగా కూరుకుపోయినా కూడా ఆధ్యాత్మికలక్ష్యాన్ని ఎన్నడూ మర్చిపోకూడదు. డబ్బు సంపాదన అవసరమే, ముఖ్యమే కాని జీవితమంతా డబ్బు సంపాదనలోనే గడిపివేయకూడదు. అలాగే పనిచేసి అలసిపోయిన మనస్సు విశ్రాంతి కోరుకుంటుంది, సరదాలు, సంతోషాలు కోరుకుంటుంది; తప్పేంలేదు. శాస్త్రం కూడా అసలు విశ్రాంతి తీసుకోవద్దు, ఆనందించవద్దు అనదు. కాని దానిలోనే మునిగిపోవద్దు అంటుంది. వారంలో ఐదురోజులు డబ్బువెంట పరుగులు తీసి, రెండు రోజులు విశ్రాంతిగా గడిపేస్తే, ఇంక ఆధ్యాత్మిక చింతనకు చోటేది?

పదవీ విరమణ అయ్యాక వింటాను అంటే మీ ఇంద్రియాలు కూడా పదవీ విరమణ చేస్తాయి. కళ్ళు సరిగ్గా కనబడవు, చెవులు సరిగ్గా వినబడవు, శరీరం సహకరించదు. అందువల్ల ముందునించే వారానికి ఒక్కరోజైనా గీతాబోధకు వెళ్ళటం అలవాటు చేసుకోవాలి. ముందు అలా వారానికి ఒకసారి వెళ్ళటం మొదలుపెట్టాక, మళ్ళీ వారం బోధకు వెళ్ళేలోపు ఒకసారి ముందురోజు స్వామీజీ ఏం చెప్పారో పునశ్చరణ చేసుకోవాలి. ఒకవేళ ఆదివారం ఆ బోధ ఉంటే, పోయిన ఆదివారం తర్వాత, మళ్ళీ ఈ ఆదివారమే పుస్తకం ముట్టుకోవాలంటే కష్టమే. ఆమాటకొస్తే ఈ ఆదివారం పుస్తకం ముట్టుకుంటారా, వెతుక్కుంటారా అనేది ఇంకా పెద్ద ప్రశ్న! అలాకాకుండా మధ్యలో ఒక అరగంటన్నా కూర్చుని ఆ బోధను గుర్తు తెచ్చుకోవాలి.

అవ్యభిచారణి అంటే చెక్కుచెదరని ఏకాగ్రత. అది ఎలా సాధిస్తారు?

**యోగేన** – యోగాభ్యాసం వల్ల; ముఖ్యంగా అష్టాంగయోగాన్ని అభ్యాసం చెయ్యటం వల్ల. పతంజలి యోగసూత్రాలు చిత్తఏకాగ్రతకు బాగా తోడ్పడతాయి. అసలు యోగం నిర్వచనమే **చిత్తవృత్తి నిరోధః** చాలామంది నిరోధః అంటే ఆలోచనలను నిరోధించటం అంటారు. కాని వేదాంతం దాన్ని అంగీకరించదు. చిత్తవృత్తి నిరోధం అంటే ఆలోచనలను నిర్దేశించటం. ఆలోచనలను ఒక మంచిమార్గంలో నిర్దేశిస్తే, మాటలు మంచివి వస్తాయి; మాటలు, ఆలోచనలు మంచిమార్గంలో ఉంటే, కర్మలు మంచివి చేస్తారు. ఎందుకంటే ఆలోచనలే మాటలకు, కర్మలకు

దారితీస్తాయి. ఆ విధంగా యోగా ఆలోచనా విధానాన్ని నిర్దేశిస్తుంది. ఎటువైపు నిర్దేశిస్తుంది? మోక్షమార్గం వైపు అని కలుపుకోవాలి.

**సా ధృతిః పార్థ సాత్త్వికీ** – ఓ అర్జునా, అటువంటి ధృతి సాత్త్విక ధృతి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనస్సు, ప్రాణం, ఇంద్రియాలు చేసే క్రియలను ఆధ్యాత్మికచింతన వైపు యోగా ద్వారా ఏకీకృతం చేసే ధృతిని **సాత్త్విక ధృతి** అంటారు.

శ్లో. 34 **యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేஉర్జున।**
**ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ ॥**
యయా, తు, ధర్మకామార్థాన్, ధృత్యా, ధారయతే, అర్జున,
ప్రసంగేన, ఫలాకాంక్షీ, ధృతిః, సా, పార్థ, రాజసీ ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ప్రసంగేన | = మిక్కిలి ఆసక్తితో |
| పార్థ! | = ఓ పార్థా! | ధర్మకామార్థాన్ | = ధర్మార్థకామ విషయములను |
| అర్జున! | = ఓ అర్జునా! | ధారయతే | = ధారణ చేయునో |
| ఫలాకాంక్షీ | = కర్మఫలేచ్ఛగల మనుష్యుడు | సా | = అది |
| యయా, ధృత్యా | = ఏ ధృతిచేత | రాజసీ, ధృతిః | = 'రాజసధృతి'యని పేర్కొనబడును |

**హే అర్జున! యయా ధృత్యా ప్రసజ్గేన ఫల–ఆకాంక్షీ తు (సన్) ధర్మ–కామ–అర్థాన్ (నరః) ధారయతే, హే పార్థ! సా ధృతిః రాజసీ (అస్తి)।**

తా: కాని ఓ పార్థా! ఓ అర్జునా! కర్మఫలేచ్ఛగల మనుష్యుడు ఏ ధృతిచేత మిక్కిలి ఆసక్తితో ధర్మార్థకామవిషయములను ధారణ చేయునో అది 'రాజసధృతి'యని పేర్కొనబడును.

ఈ శ్లోకంలో రాజసిక ధృతిని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తికి కూడా అద్భుతమైన పట్టుదల ఉంటుంది కాని దాన్ని అతను లౌకికవిజయాలకు వినియోగిస్తాడు. దానికి కారణాలు అనేకం. అతనికి ఆధ్యాత్మిక లక్ష్యాల గురించి తెలియకపోవచ్చు, ఆధ్యాత్మిక లక్ష్యాలమీద నమ్మకం ఉండకపోవచ్చు, లేదా వాటికి విలువను ఇవ్వకపోవచ్చు. అతని సిద్ధాంతం – లౌకికవిజయాలవల్ల ఆనందం వస్తుంది. పైసా మే పరమాత్మా సిద్ధాంతం వీరిది. కాటికి వెళ్ళేవరకూ కాసులు కావాలి అంటారు. అంటే మనిషి మరణించేదాకా డబ్బులతో అవసరం ఉంటుంది అని అర్థం.

ఈ రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి ప్రతి నిముషమూ డబ్బు ఎంత అవసరమో గుర్తు చేస్తూనే ఉంటాడు. నిజమే, డబ్బు అవసరమే కాని, డబ్బు మాత్రమే జీవితం అనుకోవటం మాత్రం దురదృష్టకరమైన ఆలోచన. అతను తన దృష్టినంతా లౌకికవిజయాలమీదే కేంద్రీకరిస్తాడు. చిన్న వయస్సులోనే ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో అంచెలంచెలుగా పైకి ఎక్కేసి, లక్షల్లో డబ్బు సంపాదించి, క్షణం తీరిక లేకుండా సెల్‌ఫోన్లో మాట్లాడుతూ ఉంటాడు. నీ చరణకమలాల దగ్గర అరనిముషం సేపు ఉన్నా చాలు అని పాట ఉంది. అతనికి ఆ అరనిముషం కూడా

భగవంతుని గురించి ఆలోచించే తీరికే ఉండదు. సంధ్యావందనం పూర్తిగా చేసే సమయం లేదు; గాయత్రీజపం అన్నా చేస్తాడా అంటే అదీ కుదరదు. అన్నింటికీ తీరిక ఉంటుంది కాని, పూజ చెయ్యమంటే తీరిక ఉండదు; ఆలయానికి వెళ్ళాలంటే తీరిక ఉండదు; ధ్యానం చెయ్యాలంటే తీరిక ఉండదు; గీతాబోధకు వెళ్ళాలంటే తీరిక ఉండదు.

ప్రాపంచిక విజయం దృష్ట్యా చూస్తే అతను బాగానే విజయం సాధించాడని చెప్పవచ్చు. సమాజం అతని విజయాన్ని అతని ఆస్తిపాస్తుల విషయంలో చూస్తుంది. అతనికి ఎంత పెద్ద ఇల్లు ఉంది? ఏ కారు ఉంది? ఇవేనా ఇంకేమైనా ఇళ్ళు వేరే ఊర్లలో ఉన్నాయా? ఇవీ ప్రపంచం చూసేది. వీటికోసం ఇతను కూడా ఎండమావుల వెంట పరుగులు తీసినట్టుగా పరుగులు తీస్తాడు.

**ధారయతే** – అంటే పరుగులు తీస్తూనే ఉంటాడు, తీస్తూనే ఉంటాడు. ఈ పరుగులు అన్నీ దేనికోసం? మోక్షం కోసం మాత్రం కాదు.

**ధర్మకామార్థాన్** – ధర్మార్థకామాలకోసం. ధనం ఎంత ఉన్నా చాలదు. ఐదుతరాల వరకూ కూర్చుని తిన్నా తరగనంత ఆస్తిని ప్రోగేస్తాడు. ఇంకా ఏదో తృష్ణ, లేదా సెలవలకి ఊర్లు వెళ్ళాలనే తపన. అది కూడా ఏ ఊటీకో, కొడైకెనాల్‌కో కాదు; స్విట్జర్లాండ్‌కో, ప్రపంచయాత్రకో. అప్పుడు అతని విలువ సమాజంలో బాగా పెరిగిపోతుంది.

ధర్మం అంటే పుణ్యం. అతను కొన్ని దైవకార్యాలు కూడా చేస్తాడు. కాని వాటివల్ల వచ్చే పుణ్యాన్ని కూడా అతను లౌకికవిజయాలకే కోరుకుంటాడు. పుణ్యం రెండురకాలుగా వస్తుంది. నిష్కామకర్మ చేస్తే పుణ్యం చిత్తశుద్ధిని, గురుప్రాప్తిని, శ్రవణప్రాప్తిని, మోక్షప్రాప్తిని కలుగజేస్తుంది. సాత్త్విక ప్రవృత్తి ఉన్నవ్యక్తి ఇటువంటి పుణ్యాన్ని కోరుకుంటాడు. రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి సకామకర్మ చేస్తాడు. అంటే అతను ఇహలోకసుఖాలు లేదా స్వర్గలోక ప్రాప్తివంటి పరలోకసుఖాలు కోరుకుంటాడు. అందువల్ల ఇక్కడ ధర్మం అంటే లౌకికపుణ్యం. అతను అర్థ, కామాల వెంటే పరుగులు తీస్తాడు. ఎలా?

**ప్రసంగేన** – ప్ర అంటే తీవ్రమైన; సంగ అంటే బంధం. అంటే తీవ్రమైన కోరికతో చేస్తాడు. ఎందుకంటే అతను ఒక హోదాలో నిలబడితేనే సమాజం అతన్ని గౌరవిస్తుందని అతనికి తెలుసు. అతనికి కావాల్సింది ఆ గౌరవమర్యాదలే. ఎప్పుడైతే తనకి ఆ హోదా పోతుందో ఆ గౌరవం కూడా పోతుంది.

**స్థానభ్రష్టా న శోభంతే, దంతః కేశః నఖః, నరః**

నాలుగు అంశాలు వాటి స్థానంలో ఉంటేనే వాటికి గౌరవం. ఆ చోటునుంచి కదిలితే, వాటికి విలువ ఉండదు. ఏమిటవి?

**దంత** – దంతాలు మీ నోటిలో ఉన్నంతవరకూ వాటికి కావాల్సిన సేవలన్నీ చేస్తారు. అవసరమైతే డాక్టరు దగ్గరికి వెళ్ళి డబ్బు ఖర్చు పెడతారు. దంతవైద్యం ఖరీదైనది. కాని ఒకసారి పన్ను కింద పడితే, దాన్ని ముట్టుకోను కూడా ముట్టుకోకూడదు. స్నానం కూడా చెయ్యాలి. అదే పన్ను నోటిలో ఉన్నప్పుడు ఎంతో గౌరవం పొందింది.

**కేశః** – జుట్టు తలమీద ఉన్నంతసేపూ దానికి బోలెడు సేవలు చేస్తారు. బ్యూటీపార్లర్లకి వెళతారు, షాంపూలు వాడతారు, రంగు వేస్తారు. కాని అది కిందపడితే దానికి విలువ లేదు. ఆహారంలో పడితే దాన్ని పారేస్తారు కూడా.

**నఖః** – గోరు చేతికి ఉన్నంతవరకూ దానికి అనేక సేవలు చేస్తారు. గోళ్ళు పెంచుకుంటారు, రకరకాల నెయిల్‌పాలిష్‌లు వేస్తారు. దాన్ని మళ్ళీ క్లీన్ చేస్తారు. కాని గోరు కిందపడితే అశౌచం.

**నరః** – మనిషి తన ఉద్యోగంలో ఉన్నంతవరకు, హోదా ఉన్నంతవరకూ అందరూ నెత్తిన పెట్టుకుంటారు. అది పోగానే ఎవరూ పట్టించుకోరు. 'ఉద్యోగానంతరము చూడవలెనమ్మ ఆ అయ్య సౌభాగ్యముల్,' అంటారు. ఉద్యోగంలో ఉండగా ఒంగిఒంగి సలాములు పెట్టినవారు, అసలు పట్టించుకోరు.అంతకుముందు అగ్గగ్గలాడుతూ సేవలు చేసిన ఇంట్లోవారు కూడా ఇప్పుడు పట్టించుకోరు.

అందువల్ల రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి ఈ హోదాల గురించి చాలా తాపత్రయపడతాడు. సాత్త్విక ప్రవృత్తి ఉన్నవ్యక్తికి అవేమీ పట్టవు. అతనికి ఎవరూ పట్టించుకోకపోతే ఇంకా మంచిది. నిశ్చింతగా గీతమీద ఎక్కువ సమయాన్ని వెచ్చించవచ్చు.

కాని రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి అలాకాదు. ప్రసంగేన అంటే తన హోదాకు గమ్ వేసుకుని అంటుకు పోయినట్టుగా అంటుకుపోతాడు.

**ఫలాకాంక్షీ** – అతను లౌకికఫలాలనే ఆశిస్తాడు కాని, ఆధ్యాత్మిక విజయాలను కాదు. సాత్త్విక ప్రవృత్తి ఉన్నవ్యక్తి ఆధ్యాత్మిక విజయంకోసం ప్రయత్నిస్తాడు. లౌకికవిజయం వచ్చినా, రాకపోయినా పట్టించుకోడు. కాని రాజసిక ధృతి ఉన్నవ్యక్తి ఫలాన్ని ఆశిస్తాడు.

**సా ధృతిః పార్థ రాజసీ** – ఓ పార్థా, అటువంటి ధృతి రాజసిక ధృతి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ధర్మార్థకామాల వెంట, లౌకికవిజయాలకోసం, తీవ్రమైన కోరికతో పరుగులు తీస్తూనే ఉండేలా చేసే ధృతిని **రాజసిక ధృతి** అంటారు.

శ్లో. 35 **యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।**
**న విముంచతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ ॥**

యయా, స్వప్నమ్, భయమ్, శోకమ్, విషాదమ్, మదమ్, ఏవ, చ,
న, విముంచతి, దుర్మేధాః, ధృతిః, సా, పార్థ, తామసీ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | చ | = ఇంకా |
| దుర్మేధాః | = దుర్మతియైన మనుష్యుడు | విషాదమ్ | = దుఃఖమును |
| యయా, (ధృత్యా) | = ఏ ధారణశక్తి ద్వారా | మదమ్, ఏవ | = ఉన్మత్తతను |
| స్వప్నమ్ | = నిద్రను | న, విముంచతి | = విడిచిపెట్టడో అనగా ధారణ చేయుచుండునో |
| భయమ్ | = భయమును | సా | = అది |
| శోకమ్ | = చింతను | తామసీ, ధృతిః | = 'తామసధృతి'యని చెప్పబడును |

**హే పార్థ! దుర్మేధా (నరః) యయా స్వప్నమ్, భయమ్, శోకమ్,**

**విషాదమ్, మదమ్ ఏవ చ న విముఞ్చతి, సా ధృతిః తామసీ (మతా)।**

తా: ఓ పార్థా! దుర్మతియైన మనుష్యుడు ఏ ధారణశక్తి ద్వారా నిద్రను, భయమును, చింతను ఇంకా దుఃఖమును, ఉన్మత్తతను విడిచిపెట్టడో అనగా ధారణ చేయుచుండునో అది 'తామసధృతి'యని చెప్పబడును.

ఈ శ్లోకంలో తామసిక ధృతిని వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. తామసిక ధృతి ఉన్నవ్యక్తికి కూడా పట్టుదల ఉంటుంది. కాకపోతే ఆ పట్టుదలను కర్మ చెయ్యకుండా ఉండటానికి తీవ్రంగా ఉపయోగిస్తాడు. కొన్ని విషయాలను చాలా గట్టిగా పట్టుకు కూర్చుంటాడు ఇతను. ఏమిటవి?

**స్వప్నం న విముంచతి** – స్వప్నం అంటే ఇక్కడ పగటికలలు. రాత్రి నిద్రలో కలలు కనటం సర్వసాధారణం. అది ఎవరైనా చేస్తారు. కాని ఇతను పగలు కూడా కలలు కంటాడు. అంటే ఇతను పగటిపూట ఏపనీ చెయ్యకుండా, గాలిలో మేడలు కడుతుంటాడు. అందువల్ల అతను నిద్రపోతూనో, నిద్రమత్తులోనో ఉంటాడు. అతనికి ఈ రెండు అవస్థలే తెలుసు – రాత్రి పడుకుని స్వప్నం కనటం, పగలు పగటికలలు కనటం. అంతే. జాగ్రదావస్థ అనేది ఒకటి ఉందని అతనికి తెలియనే తెలియదు.

ఇటువంటి వ్యక్తికి తాతలనాటి ఆస్తి కలిసివస్తే, ఇంక చెప్పనే అవసరం లేదు. ముప్పొద్దులా ఇంత తిని, హాయిగా కాలం గడిపేయగలడు. తాతలనాటి ఆస్తే అవసరంలేదు, సంపాదించిపెట్టే తండ్రి ఉన్నా చాలు. కొందరు పిల్లలు ప్రయోజకులు కాకపోయినా, వారిని తిట్టకుండా వారిని అతిగారాబం చేసి చెడగొడతారు. తాతలనాటి ఆస్తి ఉన్నా, తండ్రి బాగా సంపాదించిపెడుతున్నా, ఇతను ఉద్యోగం చెయ్యనవసరంలేదని ఎక్కడా రాసిపెట్టలేదు. అతను కూడా పనిచేసి, ఆ అదనపు సొమ్ముతో దానధర్మాలు చెయ్యవచ్చు. అలా చెయ్యటంవల్ల నిజానికి రెండురకాల ఫలం పొందవచ్చు. ఒకటి సమాజం బాగుపడుతుంది; రెండు ఇతను చిత్తశుద్ధి పొందుతాడు. కాని ఇతనికి పగటికలలు కనటం తప్ప పనిచెయ్యటం చేతకాదు. అందువల్ల ఇతను **స్వప్నం న విముంచతి**.

**భయమ్ (న విముంచతి)** – అన్నిటికి న విముంచతి కలుపుకోవాలి. అతను ఓటమి పొందుతానేమోననే భయంవల్ల ఏపనీ చెయ్యడు. అతనికి ఓటమిని చవిచూడటం ఇష్టముండదు. కేవలం విజయమే కావాలి. కాని దురదృష్టవశాత్తూ ఎవరినీ మొదటి ప్రయత్నంలోనే విజయలక్ష్మి వరించదు. నిజానికి అలా మొదటిసారే విజయం వస్తే, ఏదో పొరపాటు జరిగినట్టు అర్థం. ఏ పని చేపట్టినా అపజయం ఎదుర్కోకతప్పదు. అందువల్ల ఈ మహా సోమరిపోతు ఏం చేస్తాడు? ఏ పనీ చేపట్టడు. పైగా గొప్పగా అందరికీ చెప్పుకుంటాడు, 'నేను జీవితంలో ఎన్నడూ ఓటమిని చవిచూడలేదు, తెలుసా?' ఏదైనా పని చేస్తేనే కదా ఓటమి కలిగేది. కాని ఇతను భయంవల్ల ఏ పనీ చేపట్టడు. అందువల్ల ఇతను **భయం న విముంచతి**.

**శోకమ్ (న విముంచతి)** – ఈ తామసికవ్యక్తిని శోకం ఎన్నడూ విడిచిపెట్టదు. ప్రతి మనిషీ రెండు వ్యక్తిత్వాలతో జీవితాన్ని అనుభవిస్తాడు. కర్తగా ప్రపంచంలో పనిచేస్తాడు, భోక్తగా వచ్చిన కర్మఫలాన్ని అనుభవిస్తాడు. భోక్తగా పొందే కర్మఫలాలు ఎక్కువగా శోకాన్ని లేదా బాధలను కొనితెస్తాయి. కాని మనం కర్తగా చురుకుగా పని చేస్తుంటే, మనం హుషారుగా ఉంటే ఈ కర్మఫలాలు తెచ్చే దుఃఖం మనను భోక్తగా ఏమీ చెయ్యలేవు. చురుకైన

జీవితం దుఃఖానికి అద్భుతమైన మందు; చురుకైన జీవితం ఆందోళనకు అద్భుతమైన మందు; చురుకైన జీవితం మానసిక అలజడికి అద్భుతమైన మందు.

కాని ఈ తామసిక ప్రవృత్తి ఉన్న మనిషి ఏదైనా పని చేస్తేనే కదా, అది అద్భుతంగా పని చెయ్యటానికి. అందువల్ల అతనికి ఎదురయ్యే ప్రతి అనుభవం కూడా దుఃఖాన్నే మిగులుస్తుంది. అందువల్ల అతను ఇరవైనాలుగు గంటలూ నస బ్యాండ్‌గా తయారవుతాడు. దేనికో దానికి సణుగుతూనే ఉంటాడు. ముప్పొద్దులా తిని పడుకోవటమే తన పని అయినా కూడా ఆ తిండికి సవాలక్ష వంకలు పెడతాడు. ఉప్పు ఎక్కువయిందంటాడు, కారం తక్కువ అయిందంటాడు. అలా దేనికో దానికి బాధపడుతూనే ఉంటాడు. అందువల్ల అతను **శోకం న విముంచతి**.

**విషాదమ్ (న విముంచతి)** – విషాదం అంటే ఎప్పుడూ దుఃఖంలోనే ఉంటాడు. ఏ పని చెయ్యాలన్నా ఉత్సాహం ఉండదు. ఎప్పుడూ మనస్తాపంలో ఉంటాడు. ఏ పని చెయ్యమని అడిగినా, మూడ్ లేదు అంటాడు. గీతాబోధకు ఎందుకు రాలేదని అడిగితే, ఇవాళ మూడ్ లేదు, రావాలనిపించలేదు అంటాడు. ఆ మూడ్ ఎందుకు లేదంటే దానికేం తర్కం ఉపయోగించలేము. అతనికి ఏదీ చెయ్యాలనిపించదు అంతే; అతని ఇంద్రియాలు చురుకుగా ఉండవు. దయానందస్వామీజీ ఈ మూడ్ లేనివారిని హాస్యంగా మూఢాః అంటారు. శంకరాచార్యులవారు దాన్ని అవసన్నభావః అంటారు. ఎప్పుడూ ఈ వ్యక్తి అలా మనస్తాపంలోనే ఉంటాడు. అందువల్ల అతను **విషాదం న విముంచతి**.

**మదమేవ చ (న విముంచతి)** – ఇటువంటి వ్యక్తి ఒకవేళ పొరపాటున ఏదైనా పని చేస్తే, అది ఇంద్రియాలను తృప్తిపరిచేదై ఉంటుంది. పూర్వకాలపు పల్లెటూర్లలో కొందరికి ఇటువంటి జీవనం ఉండేది. వారికి భూములు ఉంటాయి కాని, ఎవరో దున్నిపెడతారు. చేతినిండా డబ్బు ఉంటుంది కాని చదువుకోవాలనే ఆసక్తి ఉండదు. ఇటు లౌకికవిద్యనూ అభ్యసించరు, అటు శాస్త్రాన్నీ అధ్యయనం చెయ్యరు.

ఇటువంటివారు ఊరి మధ్యలో ఉన్న రచ్చబండ దగ్గర చేరి పిచ్చాపాటి కబుర్లు చెబుతుంటారు. కొంతమంది నోటినిండా తమలపాకు వేసుకుని, దాన్ని నములుతూ, ఏం మాట్లాడుతున్నారో తెలియకుండా మాట్లాడుతారు. మరికొంతమంది పేకాటరాయుళ్ళు ఉంటారు; రోజంతా డబ్బు పెట్టి పేకాట ఆడుతుంటారు. అవి కాక మందుకూ, జూదానికీ అలవాటు పడతారు. అందువల్ల మదం అంటే విషయలాలసలో మునిగితేలుతారు. దీనివల్ల ఆస్తులను కూడా హారతికర్పూరంలా కరిగించివేసిన వారెందరో! వీరికి ఈ చెడు అలవాట్లలో మునిగితేలటం తప్ప, మంచి లక్ష్యం అంటూ ఏమీ లేదు. మోక్షంకోసమే కాదు, కనీసం లౌకికలక్ష్యాల కోసమన్నా పాటుపడాలి. లౌకికలక్ష్యం అన్నా ఉంటే, దాని కోసమన్నా శ్రమపడతారు. కాని వీరికి ఆధ్యాత్మికలక్ష్యం సంగతి దేవుడెరుగు, లౌకికలక్ష్యం కూడా ఉండదు.

చిన్మయానందస్వామీజీ ఎప్పుడూ చెబుతారు, 'మనిషన్న ప్రతివానికీ ఏదో ఒక లక్ష్యం ఉండాలి. మోక్షం కాకపోతే, వేరే ఏదైనా లక్ష్యం ఉండాలి.' కాని తామసిక వ్యక్తికి ధర్మార్థకామమోక్షాలు అంటేనే ఏమిటో తెలియదు. ఇంక వాటికోసం పాటుపడేదెక్కడ?లక్ష్యం లేకపోయేసరికి ఏం చేస్తాడు? వ్యసనాలలో మునిగితేలతాడు. అందువల్ల **మదమేవ చ న విముంచతి**.

**న విముంచతి –** అతనితో మాట్లాడటానికి ప్రయత్నించి, అతనిలో కొంచెమన్నా ఉత్సాహాన్ని నింపుదామని మీరు ప్రయత్నిస్తే, అతని తెలివి ఎంత గొప్పగా ఉంటుందంటే, ఎదురు అతనే తన బద్ధకాన్ని మెచ్చుకుంటూ వాదిస్తాడు. 'నువ్వు సిగరెట్టు ఎందుకు కాలుస్తావు?' అని మీరు వాదిస్తే, అతను దానికి వంద మంచి కారణాలు చూపిస్తాడు. ఆ సిగరెట్టు కంపెనీలను ఎవరు పోషిస్తారు అంటాడు పైగా. మీరు ఇంక 'సరే బాబూ, నువ్వు కాల్చుకో,' అనేదాకా వదలడు. బుద్ధికి ఆ శక్తి ఉంటుంది.

మనిషి ఏదైనా చెడువ్యసనంలో పడిపోతుంటే బుద్ధి మనస్సును బుద్ధిగా హెచ్చరిస్తుంది, చివాట్లు వేస్తుంది. రెండోసారి, మూడోసారి బలహీనంగా మందలిస్తుంది. అప్పుడూ మనస్సు వినకపోతే, అది కూడా మనస్సుతో చేతులు కలిపేస్తుంది. 'అణచి చూడు, లేదా అణగి పో,' సామెత ఉంది. శత్రువును అణచటానికి ప్రయత్నించాలి; లేకపోతే శత్రువుతో మైత్రి చెయ్యాలి. బుద్ధి అలా మనస్సుతో చేతులు కలపటమే కాక, దాని తెలివితేటలను మనస్సును సమర్థించటానికి తిప్పుకుంటుంది.

**దుర్మేధాః –** వీరి బుద్ధి చెడుదారి పట్టింది. ఇటువంటి వారిని మీరు మార్చలేరు సరికదా, ఎదురు వారే మిమ్మల్ని వారి దారిలోకి తిప్పగలరు. 'ఎందుకలా ఇరవైనాలుగు గంటలూ పేకాట ఆడతావు,' అంటే 'రా, నువ్వే చూడు, దీనిలో ఎంత మజా ఉందో,' అంటారు. మీరు కూడా బలహీనమనస్కులు అయితే, మీరు కూడా వారి దారిలో పడిపోయే ప్రమాదముంది. అంత శక్తి ఉంది వారికి. అంతటి వాక్పటిమ ఉంది వారికి. వారి దుర్బుద్ధి వారినే సమర్థిస్తుంది.

ఇంద్రియ నిగ్రహం పాటించాలి అంటే ఉన్నదొక్కటే జీవితం; దాన్ని ఏడిపించకు అంటాడు. ఇతనిది చార్వాక దర్శనానికి దగ్గరగా ఉంటుంది. ఎప్పుడేమవుతుందో తెలియదు, జీవితం చాలా చిన్నది; యవ్వనం ఇంకా చిన్నది. జీవితం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. అంటే వీరి ఉద్దేశంలో అనుభవించాల్సిందంతా అనుభవించేయాలి.

**సా ధృతిః పార్థ తామసీ –** ఓ అర్జునా, అటువంటి ధృతి తామసిక ధృతి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

పగటికలలు కంటూ, భయం, శోకం, విషాదం, మదం అనే గుణాలను వదిలిపెట్టకుండా చేసే ధృతిని **తామసిక ధృతి** అంటారు.

ఇక్కడితో మూడురకాల ధృతి గురించి అయిపోయింది. జీవితంలో మనిషి లక్ష్యం ఎలా ఉండాలి? సాత్త్విక ధృతి ఉండాలి. అది ఉంటే అతను ఆధ్యాత్మిక రంగంలో విజయాన్ని పొందుతాడు. ఆధ్యాత్మిక విజయం పొందేదాకా గట్టి పట్టుదల కలిగివుండటాన్ని సాత్త్విక ధృతి అంటారు.

రాజసిక పట్టుదలలో కూడా అంకితభావం, దృఢనిశ్చయం ఉంటాయి కాని, అతను వాటిని ఆధ్యాత్మిక ఎదుగుదలకు వాడడు; లౌకిక విజయాలకే వాడతాడు. అంటే అతను మోక్షం కోరడు; ధర్మ, అర్థ, కామ పురుషార్థాలనే కోరతాడు. అతనికి వచ్చే పుణ్యాన్ని కూడా లౌకిక విజయాలకే తిప్పుకుంటాడు. సకామకర్మ చేస్తే వచ్చే పుణ్యం అతనికి లౌకిక విజయాలను ఇస్తే, నిష్కామకర్మ చేస్తే వచ్చే పుణ్యం అతనికి చిత్తశుద్ధి, గురుప్రాప్తి, జ్ఞానప్రాప్తిని కలుగజేస్తుంది. ఈ రాజసిక ప్రవృత్తిలో విజయం పొందేదాకా ఉంటాడు. అతని లక్ష్యం అతని రంగంలో అతను ప్రథమశ్రేణిలో ఉండాలి.

ఇక్కడొక విషయాన్ని గమనించాలి. మనం రాజసిక ప్రవృత్తిని పూర్తిగా ఖండించటం లేదు. మొదట్లో ఏ సాధకుడైనా కర్మ చెయ్యాలి; కర్మ చెయ్యాలంటే రాజసిక ప్రవృత్తి ఉండాలి. పైగా మొదట్లో ఎవరికైనా లౌకిక విజయాలమీదే మోజు ఉంటుంది. ఎవరైనా అర్థ, కామాల వెంటే పరుగులు తీస్తారు. వేదపూర్వభాగం కూడా అనేక కర్మలు బోధించటం ద్వారా, దాన్ని ప్రోత్సహిస్తుంది. అందువల్ల రాజసిక ధృతిని అంటే రాజసిక పట్టుదలను పూర్తిగా నిందించకూడదు.

కాని కాలం గడిచేకొద్దీ దాన్నించి పైకి ఎదగాలి. ముందు కేవలం కర్మఠుడుగా పనిచెయ్యటం మొదలుపెడతాడు. చాలా ఎక్కువ డబ్బు సంపాదించాలి; అంతా నేను, మహా అయితే నావారు అనుభవించాలి అనుకుంటాడు. ఇదంతా సకామకర్మ పద్ధతి. నెమ్మదిగా ఒక సాధకుడు సకామకర్మనుంచి నిష్కామకర్మకు ఎదగాలి. కేవలం కర్మఠుడు స్థాయినుంచి కర్మయోగి స్థాయికి ఎదగాలి. కర్మయోగి కూడా బాగా సంపాదిస్తాడు కాని, దాన్ని స్వార్థానికి దాచుకోకుండా పంచమహాయజ్ఞాలు చేస్తాడు. దైవయజ్ఞానికీ, మనుష్యయజ్ఞానికీ, పితృయజ్ఞానికీ వినియోగిస్తాడు ఆ ధనాన్ని.

దయానందస్వామీజీ అంటారు, 'ఇన్నాళ్ళూ నువ్వు సమాజంనుంచి తీసుకున్నావు, ఇప్పుడు సమాజానికి తిరిగి ఇవ్వాలి.' అందువల్ల కర్మయోగిగా సమాజానికి సేవ చెయ్యాలి.

సాత్త్విక వ్యక్తిత్వం ఉన్నవ్యక్తి తనకంటూ ఏమీ దాచుకోడు. ఎందుకంటే అతన్ని బంధించే కోరికలంటూ ఉండవు అతనికి. కాని సత్త్వగుణం మితిమీరినా కూడా ప్రమాదమే. ఎందుకు? అతనికి కోరికలు లేవు కాబట్టి సంపాదన జోలికి కూడా పోడు.

మూడురకాల భిన్న మనస్తత్త్వాలు ఉంటాయి మనుష్యుల్లో. ఒకరు ఏమీ సంపాదించరు, తమకంటూ ఏమీ ఉండదు. ఏమీ ఉండదు కాబట్టి దానధర్మాలు చెయ్యలేరు. కర్మయోగం పంచమహాయజ్ఞాలు చెయ్యాలంటుంది. ఇతనికి ఏమీ సంపాదన లేదు కాబట్టి, తనే ఎవరిమీదో ఆధారపడతాడు కాబట్టి, తను ఏమీ ఇవ్వలేడు.

రెండవరకం వ్యక్తి బాగా సంపాదిస్తాడు కాని పిల్లికి బిచ్చం పెట్టని వ్యక్తి. చాలా ఉంటుంది కాని దమ్మిడీ కూడా (ఆ రోజుల్లో నాణెం) రాల్చడు.

మూడవరకం వ్యక్తి మాత్రమే బాగా సంపాదిస్తాడు, బాగా సమాజం మేలుకోసం ఖర్చు పెడతాడు. ఇటువంటి దానం చెయ్యాలంటే రాజసిక ధృతి ఉండాలి. అలాగని దానాలు చేస్తూనే కూర్చోకూడదు. దాన్నించి సాత్త్విక ధృతికి ఎదగాలి. అంటే జ్ఞానం, మోక్షం పొందాలనే తపన ఉండాలి.

ముందుగా తామసిక ధృతి ఉంటే దాన్ని పోగొట్టుకోవాలి. దాన్నించి వెంటనే సాత్త్విక ధృతిని పొందలేరు. అందువల్ల మధ్యలో రాజసిక ధృతిని పొందాలి. లౌకికవిజయాలకోసం పాటుపడి, కావాల్సినంత సంపాదించాక, పంచమహాయజ్ఞాలు చేశాక, సాత్త్విక ధృతికి ఎదగాలి. అలా మీ లక్ష్యం తామసిక పట్టుదలనుంచి రాజసిక పట్టుదలకు, రాజసిక పట్టుదలనుంచి సాత్త్విక పట్టుదలకు ఎదిగేలా ఉండాలి.

ఇక్కడితో మూడురకాల ధృతిని గురించిన వివరణ అయిపోయింది. మూడురకాల ధృతి గురించి మళ్ళీ టూకీగా వెనకనుంచి ముందుకు చూస్తే, అప్పుడు కిందనుంచి పైకి వెళ్ళినట్టవుతుంది.

**మూడురకాల ధృతి**

| శ్లోకం | ధృతి | లక్షణం |
|---|---|---|
| 35 | తామసిక ధృతి | పగటికలలు కంటూ, భయం, శోకం, విషాదం, మదం అనే గుణాలను వదిలిపెట్టకుండా చేసే ధృతి |
| 34 | రాజసిక ధృతి | ధర్మార్థకామాల వెంట, లౌకికవిజయాలకోసం, తీవ్రమైన కోరికలతో పరుగులు తీస్తూనే ఉండేలా చేసే ధృతి |
| 33 | సాత్త్విక ధృతి | మనస్సు, ప్రాణం, ఇంద్రియాలు చేసే క్రియలను ఆధ్యాత్మిక చింతన వైపు యోగా ద్వారా ఏకీకృతం చేసే ధృతి |

శ్లో. 36 **సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।**
**అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి ॥**
సుఖమ్, తు, ఇదానీమ్, త్రివిధమ్, శృణు, మే, భరతర్షభ,
అభ్యాసాత్, రమతే, యత్ర, దుఃఖాంతమ్, చ, నిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ! | = ఓ అర్జునా! | యత్ర | = ఏ సుఖమందు సాధకుడు |
| ఇదానీమ్ | = ఇప్పుడు | అభ్యాసాత్ | = భజనధ్యానాదుల అభ్యాసమువల్ల |
| త్రివిధమ్ | = మూడు విధములైన | రమతే | = ఆనందించునో |
| సుఖమ్, తు | = సుఖములను గూర్చియు | చ | = ఇంకా |
| మే, (వచః) | = నా మాటలను | దుఃఖాంతమ్ | = దుఃఖమును |
| శృణు | = వినుము | నిగచ్ఛతి | = అతిక్రమించునో |

**హే భరతర్షభ! ఇదానీమ్ తు త్రివిధమ్ సుఖమ్ మే శృణు,**
**యత్ర (సుఖే జీవః) అభ్యాసాత్ రమతే, దుఃఖాన్తమ్ చ నిగచ్ఛతి ।**

తా: ఓ అర్జునా! ఇప్పుడు మూడు విధములైన సుఖములను గూర్చియు నా మాటలను వినుము. ఏ సుఖమందు సాధకుడు భజనధ్యానాదుల అభ్యాసమువల్ల ఆనందించునో ఇంకా దుఃఖమును అతిక్రమించునో,

ఈ శ్లోకంలో ఇంకొక కొత్త అంశాన్ని ప్రవేశపెట్టబోతున్నాడు కృష్ణపరమాత్మ. దాన్ని మూడురకాల సుఖం అంటారు. ఇప్పటివరకూ ఆరు అంశాలను చూశాము. అవి మూడురకాల సన్న్యాసం, మూడురకాల జ్ఞానం, మూడురకాల కర్మ, మూడురకాల కర్త, మూడురకాల బుద్ధి, మూడురకాల ధృతి చూశాము.

**భరతర్షభ** – ఓ అర్జునా,

**ఇదానీం త్రివిధం సుఖం శృణు** – ఇప్పుడు మూడురకాల సుఖాలను గురించి విను. సుఖం అంటే ఆనందం. త్రివిధం అంటే మూడురకాలు. మళ్ళీ ఆ మూడురకాల సుఖం సాత్త్విక, రాజసిక, తామసిక సుఖాలే.

ప్రతి ఒక్కవ్యక్తీ కూడా ఆనందం కావాలని కోరుకుంటాడు. ఆ కోరిక పెంపొందించుకుంటే వచ్చినది కాదు. అది ప్రతివ్యక్తిలోనూ స్వతహాగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆనందం కావాలని కోరుకుంటారు; అంతవరకూ అందరూ సమానమే. కాని ఆ కోరుకునే ఆనందం మనిషి మనిషికీ మారుతుంది.

ఆనందం కావాలా వద్దా అనే విషయంలో మనిషికి ఎన్నుకునే అధికారం లేదు. ఆనందం కోరి తీరే లక్షణం. కాకపోతే ఎటువంటి ఆనందం కావాలి అనుకోవటంలో అతనికి ఎన్నుకునే హక్కు ఉంది. తెలివైన వ్యక్తి అసలైన ఆనందాన్ని కోరుకుంటాడు.

ఇదే సూత్రం ఆహారానికి కూడా వర్తిస్తుంది. ఆహారం తినాలా, వద్దా అనే విషయంలో మనిషికి ఎన్నుకునే అధికారం లేదు. ఆకలి అనేది సహజలక్షణం. కాకపోతే ఆకలివేస్తే ఏం తినాలి అనే విషయంలో చాలా మార్గాలు ఉన్నాయి. వాటిలో ఏం కావాలంటే దాన్ని ఎన్నుకోవచ్చు. శాకాహారమా, మాంసాహారమా; శాకాహారంలో మళ్ళీ ఎటువంటి ఆహారం? ఇలా చెప్పుకుంటూ పోవచ్చు. అదే విధంగా సుఖం కావాలంటే ఎటువంటి సుఖం? నేను చెబుతాను విను అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మీకు నచ్చినటువంటి సుఖాన్ని అనుభవించేలాగా మనస్సుకు శిక్షణను ఇచ్చుకోవచ్చు. ఇది తిరుగులేని సత్యం. రుచితో సహా ఈ సూత్రాన్ని పాటించవచ్చు. మీరు అనుకోకుండా చపాతీలు తినాల్సివచ్చింది అనుకుందాము. మీకు అవి బొత్తిగా ఇష్టంలేదు. కాని నెమ్మదిగా, సణుక్కుంటూనో, గొణుక్కుంటూనో తినటం మొదలుపెడతారు. కొన్నాళ్ళయ్యేసరికి మీరే ఆ రుచికి అలవాటు పడిపోతారు.

మీకు ఆధునిక సంగీతం అంటే ఇష్టం లేదనుకోండి; కాని అదే మీ చెవుల్లో నిరంతరం మారుమ్రోగేలా మీ వారెవరైనా చేస్తే, వినగా వినగా మీరు కూడా దానికి ఎంతగా అలవాటు పడిపోతారంటే, మీకు తెలియకుండానే మీరు ఆ పాటను కూనిరాగాలు తీస్తారు. ఇదంతా కేవలం అభ్యాసంవల్ల సాధ్యం.

అందువల్ల అభ్యాసంవల్ల మీరు సాత్త్విక, రాజసిక, తామసిక సుఖాల్లో దేన్నైనా పొందటానికి తీవ్రంగా ప్రయత్నించవచ్చు. మంచి అవనీ, చెడు అవనీ; అది ఏ విషయంలోనైనా అవనీ. మనస్సు నెమ్మదిగా దానికి అలవాటు పడిపోతుంది. అంటే వేషధారణ విషయంలో, ఆహారనియమాల్లో, ఒక్కటేమిటి అన్నింటిలోనూ! మనస్సుకు అలా శిక్షణను పొందే అంత మంచి లక్షణం ఉంటే, దాన్ని మంచి శిక్షణ పొందేలా ఎందుకు చెయ్యకూడదు? మంచి బ్రాండ్‌ను ఎందుకు ఎన్నుకోకూడదు?

**అభ్యాసాద్రమతే యత్ర** – కేవలం సాధనవల్ల, శిక్షణవల్ల మనస్సు అందులో రమించటం మొదలుపెడుతుంది. మొదట్లో మీరు ఆనందిస్తున్నదాన్ని చూసి ఎదుటివారు ఇందులో ఏముంది అని ఆశ్చర్యపోవచ్చు. పిల్లలు కారులో కారు అద్దాలను పైకెత్తేసి, హోరెత్తించే సంగీతం పెట్టుకుని, దూసుకువెళ్ళిపోతారు. వారంత అద్దాలు పైకెత్తినా మీ చెవులకు ఆ సంగీతం హోరు వినిపించిందంటే, లోపల ఉన్నవారి చెవులు ఇంకెంత బద్ధలవుతాయో

ఒక్కసారి ఊహించుకోండి. కాని వారికేం అది బాధ అనిపించదు. ఎందుకు? వారి చెవులు ఆ ధ్వని తరంగాలకు అలవాటయిపోయాయి.

అందువల్ల అభ్యాసంతో దానిలో రమిస్తారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంతేనా?

**దుఃఖాంతం చ నిగచ్ఛతి** – దుఃఖాలను అధిగమిస్తాడు కూడా అంటున్నాడు కృష్ణపరమాత్మ. మూడురకాల సుఖాలు కూడా దుఃఖాన్ని అంతం చేస్తాయి. సాత్త్విక సుఖమూ దుఃఖాన్ని అంతం చేస్తుంది; రాజసిక సుఖమూ దుఃఖాన్ని అంతం చేస్తుంది; తామసిక సుఖమూ దుఃఖాన్ని అంతం చేస్తుంది. అదెలా? కృష్ణపరమాత్మ రాబోయే శ్లోకాల్లో వరుసగా సాత్త్విక సుఖం, రాజసిక సుఖం, తామసిక సుఖాలను నిర్వచించబోతున్నాడు. అవేమిటో చూద్దాము.

శ్లో. 37 **యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమ్ ఆత్మబుద్ధిప్రసాదజమ్ ॥**
యత్, తత్, అగ్రే, విషమ్, ఇవ, పరిణామే, అమృతోపమమ్,
తత్, సుఖమ్ సాత్త్వికమ్, ప్రోక్తమ్, ఆత్మబుద్ధిప్రసాదజమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏ సుఖమైతే | ఆత్మబుద్ధి | = పరమాత్మకు సంబంధించిన |
| అగ్రే | = ప్రారంభ సమయమున | ప్రసాదజమ్ | విషయములలో నిమగ్నమగుట వలన కలుగునట్టి |
| విషమ్, ఇవ | = కష్టముగా అనిపించినను | | |
| పరిణామే, తత్ | = పరిణామమున అది | తత్, సుఖమ్ | = ఆ సుఖము |
| అమృతోపమమ్ | = అమృతతుల్యముగా ఉండునో | సాత్త్వికమ్ | = 'సాత్త్విక సుఖము' అని |
| (అతః) | = (అందువలన) | ప్రోక్తమ్ | = చెప్పబడును |

**యత్ అగ్రే విషమ్ ఇవ, పరిణామే అమృత–ఉపమమ్ తత్**
**ఆత్మ–బుద్ధి–ప్రసాదజమ్ (అస్తి), తత్ సుఖమ్ సాత్త్వికమ్ ప్రోక్తమ్ ।**

తా: ఏ సుఖమైతే ప్రారంభ సమయమున కష్టముగా అనిపించినను, పరిణామమున అది అమృతతుల్యముగా ఉండునో, అటువంటి పరమాత్మకు సంబంధించిన విషయములలో నిమగ్నమగుటవలన కలుగునట్టి సుఖము 'సాత్త్విక సుఖము' అని చెప్పబడును.

**ఎఫ్) మూడురకాల సుఖం – శ్లోకాలు: 37–39: ఉపోద్ఘాతం**

సాత్త్విక ఆనందాన్ని ఆధ్యాత్మిక ఆనందంగా నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ ఆనందం ఆధ్యాత్మిక జీవనాన్ని గడిపితే వస్తుంది. అది కూడా చివర్లో కాదు, ప్రయాణంలో కూడా అనుభవిస్తాడు. కర్మయోగం ఆనందాన్ని కలుగజేస్తుంది; ఉపాసనయోగం ఆనందాన్ని కలుగజేస్తుంది; సాధనచతుష్టయ సంపత్తి ఆనందాన్ని కలుగజేస్తుంది. పైగా ఈ ఆనందంలో ఆనందకరమైన విషయం ఏమిటంటే, ఈ ఆనందం లోపలినుంచి వస్తుంది. బాహ్యవస్తువులనుంచి రాదు.

నిజానికి అతను అసలు బాహ్యవిషయాల గురించి వెంపర్లాడడు. బాహ్యవిషయాల వెంట పరుగులు తీసే వారు, పాపం ఇతను ఆనందాన్ని పొందటం లేదని ఇతనిమీద జాలిపడతారు కూడా. ఎందుకంటే అతను ఒక సినిమాకి వెళ్ళడు; డిస్కోలకు వెళ్ళడు; క్లబ్బులు, పార్టీలు అంటే ఏమిటో ఎరగడు. ఇవేమీ అనుభవించకుండా ఇంకేం ఆనందం పొందుతాడని తెగ ఆశ్చర్యపడిపోతారు. లేదా అతనిమీద కొండంత జాలిపడతారు.

కాని ఈ ఆనందాన్ని అనుభవించే వ్యక్తికే తెలుసు, ఆ ఆనందమంటే ఏమిటో! ఈ ఆనందానికి పరాకాష్ఠ **ఆత్మజ్ఞాన జన్య ఆనందమ్.** దీన్ని విద్యానందం అంటారు. అంటే స్వస్వరూపాన్ని తెలుసుకోవటంవల్ల కలిగిన ఆనందం; ఈశ్వరుని గురించి తెలుసుకోవటంవల్ల కలిగిన ఆనందం; జగత్తు గురించి తెలుసుకోవటంవల్ల కలిగిన ఆనందం; జీవ జగత్ ఈశ్వరస్వరూపజ్ఞానం పొందటంవల్ల కలిగిన ఆనందం. అది ఇంకేమీ కోరదు. ఒక పరిపూర్ణత్వ భావాన్ని ఇస్తుంది.

ఇటువంటి ఆనందం యొక్క గొప్పతనం ఏమిటి? జ్ఞానాన్ని ఎవరూ దొంగలించలేరు; డబ్బు పోవచ్చు, పదవి పోవచ్చు, గౌరవం పోవచ్చు, బంధుజనం వదిలివేయవచ్చు కాని జ్ఞానం మాత్రం ఎన్నడూ మనని విడిచి వెళ్ళదు. నిజానికి కాలం గడిచినకొద్దీ ఆ జ్ఞానంలో ఇంకా స్పష్టత వచ్చి, ఇంకా పెరుగుతుంది.

**న చోరహార్యం న చ రాజహార్యం న భాతృభాజ్యం న చ భారకారి।**
**వ్యయే కృతే వర్ధత ఏవ నిత్యం విద్యాధనం సర్వధన ప్రధానమ్॥**

ఇది ప్రత్యేకత ఉన్న జ్ఞానం. దొంగలు ఎత్తుకుపోలేరు; ప్రభుత్వం పన్ను విధించి తీసేసుకోలేదు; అన్నదమ్ములు దావా వెయ్యలేరు. జ్ఞానాన్ని ఎవరూ తీసుకోలేరు. మీకున్న జ్ఞానాన్ని ఎవరితోనైనా పంచుకుంటే అది హరించుకుపోదు. నిజానికి మీ జ్ఞానం రెట్టింపు అవుతుంది. స్వామీజీ ఒక్క భగవద్గీతనే 15-20సార్లు అయినా బోధించి ఉంటారు. ఒకసారి బోధిస్తేనే ఆయన జ్ఞానం హరించుకుపోయేటట్టయితే, అన్నిసార్లు బోధించగలరా? అందువల్ల జ్ఞానం ధనాలన్నిటిలోకీ గొప్పది.

జ్ఞానం ఎన్నడూ హరించుకుపోదు కాబట్టి, ఆ జ్ఞానం ఆధారంగా మీకు కలిగిన ఆనందం కూడా హరించుకు పోదు. అది జీవితాంతం ఉంటుంది. జ్ఞానాన్ని ఆధారం చేసుకున్న ప్రశాంతత, మనస్సులో జీవితాంతం ఉంటుంది. ఆందోళన లేని ఆనందం అది. అందువల్ల దాన్ని సాత్త్విక సుఖం, సాత్త్విక ఆనందం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఆత్మబుద్ధిప్రసాదజమ్** – ఆత్మబుద్ధి అంటే ఆత్మజ్ఞానం. ప్రసాద అంటే ప్రశాంతతో నిండిన మనస్సు, ఆందోళన చెందని మనస్సు. ఆ ప్రశాంతతే ఆనందాన్ని కలుగజేస్తుంది. ఆనందం ఎక్కడనుంచి వస్తుంది? ఆత్మనుంచి వస్తుంది. ఆత్మ స్వస్వరూపమే ఆనందం. అందువల్ల ఆత్మానందం ప్రశాంత మనస్సులో ప్రకటితమవుతుంది. ప్రశాంతతవల్ల, ఆత్మజ్ఞానంవల్ల కలిగిన విద్యానందాన్ని సాత్త్విక ఆనందం అంటారు. అందువల్ల అది ఆత్మబుద్ధిప్రసాదజమ్.

కాని కృష్ణపరమాత్మ ఒక హెచ్చరిక చేస్తున్నాడు. ఏమని? ఇంత గొప్ప ఆనందం, ఇంత అద్భుతమైన ఆనందం అంత తేలిగ్గా దొరకదు. ఏ ఆనందానికైనా జీవితభీమా తీసుకోవాలి కాని, ఈ ఆనందానికి అవసరంలేదు. అంత

అద్భుతం ఇది! కాని ఈ ఆనందం అంత తేలిగ్గా దొరకదు. దీనికోసం చాలా కష్టపడాల్సి ఉంటుంది. దీన్ని పొందటానికి చాలా సుదీర్ఘమైన ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి.

దీనికి మొదటిమెట్టు కర్మయోగసాధన. కర్మయోగం అంటే సకామకర్మలను తగ్గించుకుని, నిష్కామకర్మలను పెంచుకోవాలి. అక్కడినుంచే కష్టం మొదలవుతుంది. కర్మయోగం ద్వారా చిత్తశుద్ధి పొందాలి. దాని తర్వాత ఉపాసనయోగానికి రావాలి. బాహ్యముఖంగా ఉన్న మనస్సును అంతర్ముఖం చేసుకోవాలి. దాని తర్వాత, అంతకు ముందు అధ్యాయాల్లో పేర్కొన్న విలువలను పెంపొందించుకోవాలి. అమానిత్వం, అదంభిత్వం, అహింస, శాంతి వంటి దైవీసంపత్తిని పెంపొందించుకోవాలి. దానికి భిన్నంగా మీలో ఉన్న ఆసురీసంపత్తిని కలుపు మొక్కలను ఏరివేసినట్టుగా ఏరివేయాలి.

ఈ శ్రమ ఒక కొండ ఎక్కుతున్నటువంటిది. అందుకని మొదట్లో చాలా కష్టంగా ఉంటుంది. కాని మీరు చేరాలనుకున్న అంతిమలక్ష్యాన్ని గుర్తుపెట్టుకుంటే ఏమీ కష్టమనిపించదు. మానససరోవర పరిక్రమ చెయ్యటానికి వెళ్ళేవారిని ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. అక్కడ వాతావరణం చాలా చల్లగా అయిపోతుంది; ఆక్సిజన్ అందకపోవచ్చు; ప్రాణాలకే ముప్పురావచ్చు; అయినా అంత సాహసానికి ఓర్చి, వేలల్లో డబ్బు ఖర్చుపెట్టుకుని, వందలకొద్దీ మనుష్యులు వెళుతూనే ఉంటారు. ఒకసారి ఆ పరిక్రమ చెయ్యగానే అంతవరకూ పడిన శ్రమను, ఆదుర్దాను, ఖర్చును ఒక్కసారిగా మర్చిపోతారు. అదేవిధంగా ఆత్మజ్ఞానం పొందటంవల్ల కలిగే ఆనందాన్ని దృష్టిలో పెట్టుకుంటే దాన్ని పొందటానికి దాటాల్సిన దశలు ఏమీ కష్టమనిపించవు.

**యత్తదగ్రే విషమివ** – ఈ ఆధ్యాత్మిక ఆనందం మొదట్లో విషంలాగా అనిపిస్తుందిట. విషంలా అనిపిస్తుంది అంటే మొదట్లో చాలా బాధ కలుగజేస్తుంది. ఎందుకంటే దానికి చాలా శ్రమపడాల్సి ఉంటుంది. ఆ మాటకొస్తే, ఏ రంగంలో విజయం సాధించిన వ్యక్తినైనా అతణ్ణి విజయలక్ష్మి ఎలా వరించిందో అడిగిచూడండి. టెన్నిస్ ఆట అవనీ, క్రికెట్ అవనీ, సంగీతం అవనీ, నృత్యం అవనీ– అందులో సాధకుడు రాణించాలంటే చాలా కష్టపడాలి. పొద్దున్నే ఐదుగంటలకు లేచి, ఏడేసి గంటలు సాధన చెయ్యాలి. ప్రతి విజయం వెనుక ఎంతో శ్రమ ఉంటుంది. ఎన్నో త్యాగాలు చెయ్యాల్సి ఉంటుంది. ఆధ్యాత్మిక సాధన కూడా అంతే. అది అంత తేలికగా వచ్చేయదు, సహజంగా కలగదు. చాలా శ్రమతో కూడినది అది. అందువల్ల కష్టంగా అనిపిస్తుంది. కాని దానిలో ఉన్న గొప్పతనం ఏమిటి?

**పరిణామే** – ఆ శ్రమ తరువాత;

**అమృతోపమమ్** – అమృతం పొందినంత ఆనందం కలుగుతుంది.

**తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమ్** – తత్ సుఖం అంటే అటువంటి ఆనందం సాత్త్విక సుఖం అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి సుఖం? సాధనచతుష్టయ సంపత్తివల్ల పొందిన ఆనందం. మొదటిదశ సాధనచతుష్టయ సంపత్తిని పొందటం. దానివల్లనే ఆనందం కలుగుతుంది. ఆ తర్వాత? ఆత్మజ్ఞానం పొందటంవల్ల కలిగే ఆత్మానందాన్ని సాత్త్వికసుఖం అంటారు.

మొదట విషతుల్యంగా అనిపించినా, చివరికి అమృతంలా ఉండి, ఆత్మజ్ఞానంవల్ల కలిగే ఆనందాన్ని **సాత్త్విక సుఖం** అంటారు.

శ్లో. 38 **విషయేంద్రియసంయోగాత్ యత్తదగ్రేஉ మృతోపమమ్ ।**
**పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥**
విషయేంద్రియసంయోగాత్, యత్, తత్, అగ్రే, అమృతోపమమ్,
పరిణామే, విషమ్, ఇవ, తత్, సుఖమ్, రాజసమ్, స్మృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| విషయేంద్రియ | = విషయేంద్రియ | అమృతోపమమ్ | = అమృతతుల్యముగ గోచరించినను |
| సంయోగాత్ | సంయోగము వలన | పరిణామే | = పరిణామమున |
| యత్, సుఖమ్ | = ఏ సుఖము | విషమ్, ఇవ | = విషప్రాయమగును |
| (భవతి) | = కలుగునో | (అతః) | = (అందువలన) |
| తత్ | = ఆ సుఖము | తత్ | = అది |
| అగ్రే | = ప్రారంభసమయమున | రాజసమ్ | = 'రాజస సుఖము' అని |
| | (భోగానుభవ సమయమునందు) | స్మృతమ్ | = తలంపబడును |

**యత్ విషయ-ఇన్ద్రియ-సంయోగాత్ అగ్రే అమృత-ఉపమమ్ తత్**
**పరిణామే (చ) విషమ్ ఇవ (అస్తి) తత్ సుఖమ్ రాజసమ్ స్మృతమ్ ।**

తా: విషయేంద్రియ సంయోగము వలన ఏ సుఖము కలుగునో, ఆ సుఖము ప్రారంభసమయమున (భోగానుభవ సమయమునందు) అమృతతుల్యముగ గోచరించినను, పరిణామమున విషప్రాయమగును. అందువలన అది 'రాజస సుఖము' అని తలంపబడును.

ఈ శ్లోకంలో రాజసిక సుఖాన్ని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. రాజసిక సుఖం ఇంద్రియ సుఖంవల్ల వస్తుంది. మనకున్న ఐదు ఇంద్రియాలు ప్రపంచాన్ని ఐదుగా విభజించి శబ్దస్పర్శరూపరసగంధాలుగా ప్రపంచంలో వస్తువులను మనను అనుభవింపజేస్తాయి. పంచవిధంగా విభజించబడుతుంది కాబట్టి జగత్తును ప్రపంచం అంటారు. అంటే చెవి మంచిపాటని వినిపిస్తుంది; కన్ను మంచిరూపాన్ని చూపిస్తుంది; ముక్కు మంచి వాసనను ఆఘ్రాణింపజేస్తుంది. అలా ఒక్కొక్క ఇంద్రియమూ ఒక్కొక్క రకమైన ఆనందాన్ని కలుగజేస్తుంది. విషయ వస్తువుల ద్వారా కలిగే ఆనందం కాబట్టి, దీన్ని **సంసర్గజాఃభోగాః** అంటారు. కాని ఆనందం వెన్నంటే ఒక హెచ్చరిక ఉంటుంది. దాన్ని మర్చిపోకూడదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటది? విషయవస్తువులతో సంబంధంవల్ల కలిగిన ఏ ఆనందం కూడా శాశ్వతం కాదు. సంబంధమే శాశ్వతం కాదు; అందువల్ల ఆ సంబంధంవల్ల కలిగిన ఆనందం అసలే నిలవదు. అందువల్ల ఆ ఆనందం ఎప్పుడో మటుమాయమవుతుంది.

అలా వచ్చిన ఆనందం కనుమరుగయితే, రెండు బాధలకు లోనయ్యే అవకాశం ఉంది. ఆ ఆనందం పోగానే, మనస్సులో ఒకవిధమైన శూన్యం ఏర్పడుతుంది; లేదా మనస్తాపం కలుగుతుంది. ఇది రాజసిక సుఖాన్ని వెన్నంటి ఉన్న పరిణామం. మనం కర్మకాండ గురించి చూసినప్పుడు ఏ కర్మ చేసినా అది మిశ్రమఫలాన్ని

ఇస్తుందని చూశాము. అంటే అది **దుఃఖమిశ్రితము**. అందువల్ల ఒకవేళ మీకు రాజసిక సుఖం కావాలనుకుంటే, మీ యిష్టం కాని, దాన్ని వెన్నంటే దుఃఖమో, శూన్యతాభావనో ఉంటుందని మర్చిపోకండి.

**విషయేంద్రియసంయోగాత్** – విషయ అంటే విషయవస్తువులు – శబ్దస్పర్శరూపరసగంధాలు; ఇంద్రియ అంటే పంచ జ్ఞానేంద్రియాలు; సంయోగ అంటే ఇవి రెండూ కలవటం. ఈ కలవటం సహజంగా జరగదు. దానికోసం మీరు శ్రమపడాలి. ఎటువంటి ఆటంకం లేకుండా దాన్ని ఆనందించగలగాలి. అలా ఆనందం పొందగలిగితే ఆ ఆనందం ఎలా ఉంటుంది?

**అమృతోపమమ్** – అమృతంలా ఉంటుంది. ఎన్నాళ్ళు?

**యత్తదగ్రే** – మొదట్లో అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏ పని చేసినా మొదట్లోనే ఆనందంగా ఉంటుంది. కొత్తగా ఉద్యోగంలో చేరితే అమృతంలా ఉంటుంది; మంచి విందుభోజనం చేస్తే అమృతంలా ఉంటుంది; కాని ఇదంతా మొదట్లో మాత్రమే సుమా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మీకు ఐస్‌క్రీమ్ అంటే ఇష్టం అనుకోండి. ఇష్టంగా ఒకటి తింటారు, మహా అయితే రెండు తింటారు; అదే బలవంతంగా ఎవరైనా మీచేత పది తినిపిస్తే, ఏం చేస్తారు? వారిముందే కక్కుతారు. దీన్ని లా ఆఫ్ డిమినిషింగ్ రిటర్న్ అంటారు.

ఒకసారి మీ ఇంట్లో ఉన్న క్యాసెట్ల పరిస్థితిని గుర్తు తెచ్చుకోండి. ఏవో పాటలు మీకు నచ్చి, వెంటనే ఆ క్యాసెట్టు కొనేస్తారు. అలా ఎన్నో క్యాసెట్లు కొంటారు. కొన్న మొదట్లో రోజుకు నాలుగుసార్లు, ప్రతిరోజూ వింటారు. నెమ్మదిగా మోజు తగ్గుతుంది; వారానికి ఒకసారి వింటారు; తర్వాతెప్పుడో వాటి విషయం మీ మనస్సులో అడుగున పడిపోతుంది. అవేమో మట్టి కొట్టుకుపోయి, ఆశగా మీకోసం ఎదురుచూస్తుంటాయి. ఏ విషయానందం అయినా మొదట్లో ఆనందంగానే ఉంటుంది. అందువల్ల **అగ్రే అమృతోపమమ్**.

ఒకవేళ వాటిమీద మీకున్న ఆనందం చెక్కుచెదరకుండా ఉన్నాకూడా, ఏ వస్తువూ మీ దగ్గర శాశ్వతంగా ఉండలేదు; కాలంయొక్క కోరల్లో ఏదైనా చిక్కుకోక తప్పదు. రెండు వస్తువులను దగ్గరకి తెచ్చేది కాలమే; వాటిని నిర్దాక్షిణ్యంగా విడదీసేదీ కాలమే. సంయోగం ఆనందాన్ని కలుగజేస్తే, వియోగం దుఃఖాన్ని కలుగజేస్తుంది. వియోగం కలుగజేసే దుఃఖం దాని సంయోగంవల్ల మీకు కలిగే ఆనందపు స్థాయినిబట్టి ఉంటుంది. అంటే మీకా వస్తువు ఎంత నచ్చితే, దాని ఎడబాటు అంత దుఃఖాన్ని కలుగజేస్తుంది. కాని ఆ ఎడబాటు కలుగుతుందనే ఊహనే తట్టుకోలేరు మీరు.

అర్జునుని విషయంలో ఈ పరిస్థితిని కళ్ళారా చూశాము. అర్జునుడు తను భీష్మాచార్యులను, ద్రోణాచార్యులను చంపబోతున్నాను అనే ఊహనే భరించలేకపోయాడు. వారితో కలగబోయే వియోగం తలుచుకుంటేనే కాళ్ళూ, చేతులూ వణుకుతున్నాయి అన్నాడు.

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి** – 1.29

ఆలోచననే భరించలేకపోతే, నిజంగా వియోగం కలిగితే ఇంకెంత బాధాకరంగా ఉంటుందో చూడండి!
**పరిణామే** – ఈ విషయ సుఖాలవల్ల తర్వాత కలిగే పరిణామం ఎలా ఉంటుంది?
**విషమివ** – విషంలా ఉంటుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. సంయోగం కలిగినప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో, వియోగం కలిగినప్పుడు అంత దుఃఖం కలుగుతుంది. ఆ దుఃఖం విషంలా ఉంటుంది. అప్పుడు బాధపడతారు. అలా చెయ్యకుండా ఉండాల్సింది అనుకుంటారు. అందువల్ల అది **పరిణామే విషమివ**.
**తత్సుఖం రాజసం స్మృతమ్** – అటువంటి సుఖాన్ని రాజసిక సుఖం అంటారు. అందువల్ల రాజసిక సుఖాన్ని వదులుకుని సాత్త్విక సుఖానికి ఎదగాలి. ఒకవేళ రాజసిక సుఖాన్ని వదులుకోవాలని లేకపోయినా కూడా, సాత్త్విక సుఖాన్ని కూడా పక్కన అవసరార్థం ఉంచుకోవాలి.

ఉదాహరణకు విద్యుచ్ఛక్తిని ఉపయోగించినా, కరెంటు పోయినప్పుడు జనరేటరును వాడతారు. అలాగే తాగటానికి మున్సిపాలిటీ ఇచ్చిన నీరుని వాడినా, అది రానప్పుడు బోర్‌వెల్‌ను వాడతారు. అదేవిధంగా విషయానందాలను పొందండి, తప్పులేదు కాని దానితోపాటుగా విద్యానందాన్ని కూడా అనుభవించటం నేర్చుకోండి. అప్పుడు విషయానందం ఉంటే బాధలేదు; ఒకవేళ లేకపోతే మీ దృష్టిని విద్యానందం వైపు మరల్చుకోవచ్చు. జనరేటరును యు.పి.యస్. అంటారు; అంటే అన్‌ఇంటరప్టెడ్ పవర్ సప్లై. ఈ విద్యానందాన్ని యు.ఎ.యస్. అంటారు. అంటే అన్‌ఇంటరప్టెడ్ ఆనందం సప్లై. అలా విషయానందాన్ని పొందండి; విద్యానందాన్నీ పొందండి.

అప్పుడే ఏ విధమైన ఆందోళనా ఉండదు. విషయానందం ఉంటే అనుభవించండి; కాని కేవలం రాజసిక సుఖంమీదే ఆధారపడటం మంచిదికాదు. పూర్తిగా సాత్త్వికానందంమీద ఆధారపడితే చాలా మంచిది.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః**. పూర్తిగా రాజసిక ఆనందాన్ని వదులుకోగలిగితే చాలా మంచిది. కాదు, నేను రాజసిక ఆనందాన్ని వదులుకోలేను అంటే మాత్రం సాత్త్విక ఆనందాన్ని కూడా అవసరానికి ఉపయోగపడేలా పక్కన పెట్టుకోండి.

ఈ హెచ్చరిక కృష్ణపరమాత్మ ఇస్తున్నాడు. చేతిలో వేరే ఏ ఆధారమూ లేకుండా పూర్తిగా ప్రపంచంమీదే ఆధారపడితే అది సంసారం అవుతుంది. అది చాలా ప్రమాదకరం. కొంచెం తీరిగ్గా ఆలోచిస్తే ఈ విషయం మీకే అర్థమవుతుంది. అర్థం కాకపోతే జీవితమనే మాష్టారు వేసే కొరడాదెబ్బలు తప్పవు.

దానికి శాస్త్రీయ ఉదాహరణ కోతి వ్యవహారం. ఒక కోతి ఒక దుకాణంలో చొరబడి, అందులోనుంచి వేరుశనగపప్పులు తినేస్తుండేది. దానికి బుద్ధి చెప్పాలనుకున్నాడు దుకాణం యజమాని. ఒకరోజు ఒక బ్రహ్మాండమైన ప్రణాళిక వేశాడు. ఏమిటది? ఒక గాజుజాడీ నిండా వేరుశనగపప్పులు పోశాడు. దాని మూత చాలా సన్నగా ఉంది. కోతి అది చూసి తన పంట పండిందని గెంతుకుంటూ వచ్చింది. హుషారుగా చేతిని అందులో పెట్టి, గుప్పెటనిండా వేరుశనగపప్పును తీసుకుంది. బయటకు తీద్దామంటే చెయ్యి రాదే!

ఇంతలో యజమాని వచ్చి దాన్ని కర్రతో ఎడాపెడా బాదటం మొదలుపెట్టాడు. అది ఆ దెబ్బలు తప్పించుకోవాలంటే ఏం చెయ్యాలి? ఆ పప్పులను వదిలిపెట్టేసి, బతుకుజీవుడా అని పరుగు లంఘించుకోవాలి. కాని దాని ఆశ చావటం లేదు. అలా ఒకపక్క చెయ్యిని ఆ జాడీలో అలాగే ఉంచి, ఇంకో పక్క కుయ్యో, మొర్రో

అని అరుస్తూనే ఉంది. ఎందుకలా? అది బుద్ధిజీవి కాదు కాబట్టి, దానికి అప్పుడు విచక్షణాశక్తి లేకపోయింది. కాని మనుష్యులమైన మనం బుద్ధిజీవులమైనా కూడా, మనమూ ఏమీ తక్కువ తినలేదు. ఆ కోతిలాగే దేనికో ఆశ పడుతూనే ఉంటాము, జీవితం వేసే కొరడాదెబ్బలకు కుయ్యో, మొర్రో అంటూనే ఉంటాము. అలా తినగా తినగా ఎప్పటికో బుద్ధి వచ్చి, భగవద్గీతమీదకు దృష్టి మరల్చవచ్చు.

మొదట అమృతంలా ఉండి, తర్వాత విషతుల్యంగా ఉండే, విషయవస్తువులవల్ల కలిగే సుఖాన్ని **రాజసిక సుఖం** అంటారు.

శ్లో. 39 **యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః ।**
**నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥**
యత్, అగ్రే, చ, అనుబంధే, చ, సుఖమ్, మోహనమ్, ఆత్మనః,
నిద్రాలస్యప్రమాదోత్థమ్, తత్, తామసమ్, ఉదాహృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యత్, సుఖమ్ | = ఏ సుఖము | నిద్రాలస్య ప్రమాదోత్థతమ్ | = నిద్ర, సోమరితనము, మోహములవల్ల ఉత్పన్నమగునో |
| అగ్రే | = అనుభవ సమయమునను | తత్ | = ఆ సుఖము |
| చ | = ఇంకా | తామసమ్ | = 'తామస సుఖము' అని |
| అనుబంధే, చ | = పరిణామమునందును | ఉదాహృతమ్ | = పేర్కొనబడును |
| ఆత్మనః, మోహనమ్ | = ఆత్మను మోహింపజేయునది యగునో | | |

**యత్ అగ్రే చ అనుబన్ధే చ ఆత్మనః మోహనమ్ నిద్రా–ఆలస్య–ప్రమాద–ఉత్థమ్,**
**తత్ సుఖమ్ తామసమ్ ఉదాహృతమ్ ।**

తా: ఏ సుఖము అనుభవ సమయమునను మఱియు పరిణామమునందును, ఆత్మను మోహింపజేయునదియగునో నిద్ర, సోమరితనము, మోహములవల్ల ఉత్పన్నమగునో ఆ సుఖము 'తామస సుఖము' అని పేర్కొనబడును.

ఈ శ్లోకంలో తామసిక సుఖాన్ని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అజ్ఞానసుఖం, నిద్రసుఖం, బద్ధకం సుఖం– ఈ సిద్ధాంతంమీద ఆధారపడి సోమరిపోతుగా జీవితాన్ని గడిపేస్తాడు తామసిక వ్యక్తి. దాన్ని తామసిక సుఖం అంటారు.

**యత్ సుఖం నిద్రాలస్యప్రమాదోత్థమ్** – నిద్ర అంటే నిద్ర; ఆలస్య అంటే సోమరితనం; ప్రమాద అంటే నిర్లక్ష్యం. అంటే నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యంవల్ల పొందుతాడు ఇతను ఆనందం.

నిర్లక్ష్యం అంటే జీవితంలో ఏం జరిగినా పట్టించుకోడు. తను ఉన్నది రామరాజ్యంలోనైనా, రావణరాజ్యంలోనైనా అతనికేమీ భేదం ఉండదు. ప్రపంచంలో ధర్మం రాజ్యమేలుతున్నా, అధర్మం రాజ్యమేలుతున్నా అతనికనవసరం. ఇటువంటి వ్యక్తి విధిరాతను బాగా నమ్ముతాడు. విధిరాతను నమ్మితే, ఇంక ఫ్రీవిల్‌ను నమ్మే ఆస్కారం లేదు.

బ్రహ్మ తన రాతను ముందే రాసి పంపించేశాడు. ఇంక హరిహరాదులు అడ్డువచ్చినా దాన్ని మార్చలేరు అంటాడు. అతనికి అందుబాటులో ఈ శ్లోకం కూడా ఉంటుంది.

**హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి**

**లలాటే లిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే**

ప్రాయశ్చిత్తకర్మ కూడా ఏమీ చెయ్యలేదు. మనం అంతా ఆ భగవంతుని చేతిలో కీలుబొమ్మలం; కానున్నది కాకమానదు అంటాడు ఈ తామసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి.

తామసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి అంతా విధికి వదిలేసి, చేతులెత్తేస్తాడు. రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి అంతా తన చేతిలోనే ఉందని బాగా కష్టపడతాడు. అతనికి లక్ష్యాలు ఎక్కువగా ఉంటాయి; కాకపోతే అవన్నీ లౌకికలక్ష్యాలు. సాత్త్విక పురుషుడు కూడా కష్టపడతాడు; కాని అతని లక్ష్యాలు ఆధ్యాత్మిక లక్ష్యాలు. చిత్తశుద్ధి పొందాలి; సాధన చతుష్టయ సంపత్తి పొందాలి; గురుప్రాప్తి కలగాలి; జ్ఞానప్రాప్తి కలగాలి అనుకుంటాడు. ఆ విధంగా ఫ్రీవిల్‌ను రాజసిక, తామసిక సుఖాన్ని కోరే వ్యక్తులు వాడతారు. తామసిక వ్యక్తి దాన్ని నమ్మడు; ఒకవేళ పొరపాటుగా నమ్మినా వాడడు. అంత తీరిక ఉండదు అతనికి. అందువల్ల అతనిది **నిద్రాలస్యప్రమాదోత్థమ్**.

**కావ్య శాస్త్రవినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్**

**వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా॥**

ఉన్నతబుద్ధి ఉన్నవ్యక్తి కావ్యాన్ని, శాస్త్రాన్ని పఠిస్తాడు. కాని మూర్ఖుడు అంటే తామసిక పురుషుడు వ్యసనాలలో కూరుకుపోతాడు లేదా ఎవరితోనో పోట్లాడుతుంటాడు. అంటే అతను నిద్ర అయినా పోతాడు, పోట్లాడనైనా పోట్లాడతాడు.

ఈ తామసిక పురుషుని ఆనందం ఎలా ఉంటుంది? ఈ ఆనందం బుద్ధిని మందకొడిగా చేస్తుంది. నిద్ర ఆనందాన్ని ఇస్తుంది నిజమే. ఎందుకంటే నిద్రలో అతని అహంకారాన్ని కోల్పోతాడు. జ్ఞాని జ్ఞానం పొంది అహంకారం వదులుకుంటే, అజ్ఞాని నిద్రలో తనకు తెలియకుండా అహంకారాన్ని వదులుకుంటాడు. కాని అతినిద్ర మంచిదికాదు. అది అతని బుద్ధిని మందగించేలా చేస్తుంది.

**ఆత్మనః మోహనమ్** – బుద్ధిని మోహం కప్పేస్తుంది. ఇక్కడ ఆత్మ అంటే మనస్సు; ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బుద్ధి. బుద్ధిని మోహం కప్పేస్తుంది అంటే అతనికి ఆలోచనాశక్తి మందగిస్తుంది, విచక్షణాశక్తి మందగిస్తుంది. ఎప్పుడు?

**అగ్రే చ అనుబంధే చ** – ఆ ఆనందాన్ని అనుభవించే ముందు, అనుభవిస్తుండగా, అనుభవించాక మోహం ఆవరిస్తుంది. అంటే ఆ సుఖం ఎప్పుడూ మోహంలోనే పడవేస్తుంది.

**తత్తామసముదాహృతమ్** – అటువంటి సుఖాన్ని తామసిక సుఖం అంటారు.

ఇటువంటి వ్యక్తి జీవితాన్ని ఆనందంగానే గడిపి ఉండవచ్చు గాక! కాని అతని జీవితం మొత్తాన్ని వృథా చేసుకుంటున్నాడు. జంతువులకీ, అతనికీ మధ్య ఏమీ భేదం ఉండదు. జంతువులూ తామసిక సుఖాన్ని

అనుభవిస్తాయి; ఇతనూ తామసిక సుఖాన్ని అనుభవిస్తాడు. కాని జంతువులకు మారే అవకాశం లేదు. అవి బుద్ధిజీవులు కావు. ఫ్రీవిల్‌ను ఉపయోగించలేవు. మనిషి మాత్రమే బుద్ధిజీవి. అతను తన ఫ్రీవిల్‌ను ఉపయోగించి సాత్త్విక బుద్ధికి ఎదగాలి. కాని మనిషి అలాగే తామసిక ప్రవృత్తిలో నిలిచిపోతే, ఇతనికా నేను మనిషిజన్మ ఇచ్చాను అనుకుంటాడుట భగవంతుడు. అంతేకాదు, వచ్చేజన్మలో అతన్ని జంతువుగా పుట్టిస్తాడు. అప్పుడు అతను హాయిగా తామసిక ప్రవృత్తిలోనే ఉండిపోవచ్చు. ఫ్రీవిల్‌ను ఉపయోగించటం లేదు అనే బెంగ ఏదైనా ఉండివుంటే, అది కూడా జంతువుగా ఉండదు. ఇదీ తామసిక సుఖం.

మొదట, చివర కూడా మనస్సును మోహంలో పడవేసి, నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యాలవల్ల కలిగే సుఖాన్ని **తామసిక సుఖం** అంటారు.

ఈ మూడు సుఖాల్లో సాత్త్విక సుఖం అన్నింటికన్నా శ్రేష్ఠమైనది. అది సాధించటం కష్టమే అయినా, అది ఆదర్శవంతమైనది. ఎందుకంటే, సాత్త్విక ఆనందంలో ఆనందాన్ని, శాంతిని తన నుంచే పొందుతాడు. బాహ్యవస్తువులమీద ఆధారపడితే, అవి ఆనందాన్ని ఇస్తాయో లేదో తెలియదు; పరిస్థితి ఎప్పుడెలా మారుతుందో తెలియదని అతనికి తెలుసు. అందువల్ల తనమీదే తను ఆధారపడటం నేర్చుకుంటాడు. ఒక దేశం ఎలాగైతే అన్ని రంగాల్లోనూ స్వతంత్రంగా ఉన్నతి సాధించాలి అనుకుంటుందో, అలా ఈ సాత్త్వికప్రవృతి ఉన్నవ్యక్తి శాంతి, భద్రత, ఆనందాలకోసం తనమీదే తను ఆధారపడాలని నేర్చుకుంటాడు.

అది తెలుసుకోవాలంటే అతను ముందు సంస్కృత పురుషునిగా మారాలి. చిత్తశుద్ధి పొందాలి, కర్మయోగం చెయ్యాలి, ఉపాసనయోగం చెయ్యాలి. అంచెలంచెలుగా ఎదగాలని చూశాము. అందువల్ల ఇది ప్రారంభంలో కష్టమనిపించినా, తర్వాత ఒకసారి దాని ఫలం రుచి చూశాక, ఇంక వెనక్కి తిరిగే ప్రసక్తే లేదు.

రాజసిక సుఖం విషయానికి వచ్చేసరికి అతను బాహ్యవస్తువులమీద ఆధారపడతాడు. ప్రపంచాన్ని మార్చాలని చూస్తాడు. అలా పరిస్థితులను మార్చి, ప్రపంచాన్ని మార్చి ఆనందం పొందటానికి చూస్తాడు. ఆ ఆనందం కూడా మంచిదే కాని, దానికి ఉండే సమస్యలు దానికి ఉన్నాయి అన్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటా సమస్యలు?

బాహ్య విషయాలు నిత్యమూ మీ అధీనంలో ఉండవు. ఏ క్షణంలో ఏది మారుతుందో తెలియదు. ఉన్నట్టుండి వాతావరణంలో మార్పు వస్తుంది. ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుంది, రాజకీయవ్యవస్థ మారుతుంది, వ్యాపారంలో ఒడిదుడుకులు వస్తాయి, స్టాక్‌మార్కెట్ రోజురోజుకీ మారుతుంది. మనుష్యుల ప్రవర్తన మారిపోతుంటుంది. కుటుంబసభ్యులే ఎప్పుడెలా ప్రవర్తిస్తారో ఊహించలేము.

బంధుత్వాలు బీటలు వారిపోతున్నాయి ఈ రోజుల్లో. అన్నదమ్ముల మధ్య సఖ్యత ఉండటం లేదు; తండ్రీ కొడుకుల మధ్య ఆప్యాయతలు ఉండటం లేదు; భార్యాభర్తల మధ్య ప్రేమ ఉండటం లేదు. కోర్టుకి వెళ్ళిచూస్తే విడాకుల కేసులు ఎన్నో! వివాహమంత్రాల్లో జీవితాంతం కలిసివుండాలని ప్రమాణం చేసుకుంటారు; నీ మనస్సు, నా మనస్సు ఏకమవ్వాలని కోరుకుంటారు. పెళ్ళిమంత్రాలు అన్నీ అద్భుతమైన మంత్రాలు. కాని వాటి విలువ పోతోంది; చిన్న తగాదాకే కోర్టుకెక్కుతున్నారు దంపతులు. ఇలా చిన్న గాలికే రెపరెపలాడే అనుబంధాలు వాటివల్ల ఏర్పడిన సుఖాలు ఎన్నాళ్ళు ఉంటాయి? అందువల్ల రాజసిక సుఖం శాశ్వతం కాదు. బాహ్య ప్రపంచంలో

గొడవ అనే చిరుగాలి వీస్తే, ఇక్కడ మనస్సులో పెనుతుఫాను వీస్తుంది. అందువల్ల ఏదో అవుతుందని ఎదురుచూసే ఆనందం సమస్యలతో పాటు వస్తుంది.

భవిష్యత్తులో మంచి జరుగుతుందనుకుంటే, అది నిరాశకే దారితీస్తుంది. అందువల్ల రాజసిక సుఖం విషయంలో రెండే మార్గాలు ఉన్నాయి. కుదిరితే దానిమీద ఆధారపడకుండా సాత్త్విక సుఖానికి ఎదగటం; లేదూ, నావల్ల కాదూ అనుకుంటే, రాజసిక సుఖాన్ని అనుభవిస్తూ, సాత్త్విక సుఖాన్ని కూడా పక్కన పెట్టుకోవటం.

తామసిక సుఖం గురించి చెప్పనే అవసరం లేదు. అది ముందూ ఆనందాన్ని ఇవ్వదు, తర్వాతా ఆనందాన్ని ఇవ్వదు. అందువల్ల మనిషి తామసిక సుఖంనుంచి ముందు రాజసిక సుఖానికి ఎదగాలి. రాజసిక సుఖాన్ని అనుభవించినా, వాటిని ధర్మబద్ధంగా అనుభవించండి అంటుంది శాస్త్రం. తర్వాత నెమ్మదిగా దాన్నించి కూడా ఎదిగి సాత్త్విక సుఖానికి ఎదగాలి. సాత్త్విక సుఖం ఆత్మజ్ఞాన జన్యసుఖం. అందువల్ల ఉత్తమమైన సుఖం.

ఇక్కడితో మూడురకాల సుఖాల గురించిన వివరణ అయిపోయింది. మళ్ళీ మూడురకాల సుఖాల గురించి టూకీగా వెనకనుంచి ముందుకు చూస్తే, అప్పుడు కిందనుంచి పైకి వెళ్ళినట్టవుతుంది.

**మూడురకాల సుఖాలు**

| **శ్లోకం** | **సుఖం** | **వివరణ** |
|---|---|---|
| 39 | తామసిక సుఖం | మొదట, చివర కూడా మనస్సును మోహంలో పడవేసి నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యాలవల్ల కలిగే సుఖం |
| 38 | రాజసిక సుఖం | మొదట అమృతంలా ఉండి, తర్వాత విషతుల్యంగా ఉండే విషయవస్తువుల వల్ల కలిగే సుఖం |
| 37 | సాత్త్విక సుఖం | మొదట విషతుల్యంగా అనిపించినా, చివరికి అమృతంలా ఉండి, ఆత్మజ్ఞానం వల్ల కలిగే ఆనందం |

(ఈ ఆరు అంశాలను ఈ అధ్యాయము చివర ఒక పట్టికలో చూడవచ్చు.)

శ్లో. 40 **న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్ త్రిభిర్గుణైః ॥**
న, తత్, అస్తి, పృథివ్యామ్, వా, దివి, దేవేషు, వా, పునః,
సత్త్వమ్, ప్రకృతిజైః, ముక్తమ్, యత్, ఏభిః, స్యాత్, త్రిభిః, గుణైః ॥

ప్రకృతిజైః = ప్రకృతినుండి ఉత్పన్నములైన
ఏభిః, త్రిభిః, గుణైః = ఈ మూడు గుణములచేత
ముక్తమ్ = విడువబడినది
యత్ = ఏ ప్రాణి
స్యాత్ = అగునో
తత్, సత్త్వమ్ = ఆ ప్రాణి
పృథివ్యామ్, వా = భూమియందు గాని
దివి, వా = ఆకాశమునందు గాని

| | | | |
|---|---|---|---|
| దేవేషు | = దేవతలందు గాని | న, అస్తి | = లేదు |
| పునః | = మరి ఏ యితర లోకములందు గాని | | |

**యత్ సత్త్వమ్ ఏభిః ప్రకృతిజైః త్రిభిః గుణైః ముక్తమ్ స్యాత్, తత్ పృథివ్యామ్ వా దివి వా పునః దేవేషు (వా) న అస్తి ।**

తా: ప్రకృతినుండి ఉత్పన్నములైన ఈ మూడు గుణములచేత విడువబడినది. ఏ ప్రాణి అగునో ఆ ప్రాణి భూమియందు గాని, ఆకాశమునందు గాని, దేవతలందు గాని మరి ఏ యితర లోకములందు గాని లేదు.

ఈ శ్లోకంతో సాత్త్విక, రాజసిక, తామసిక లక్షణాల గురించిన చర్చకు ముక్తాయింపు పలుకుతున్నాడు కృష్ణపరమాత్మ. ఆరు అంశాలను ఈ గుణాల పరంగా చర్చించాడు. అవి జ్ఞానం, కర్మ, కర్త, బుద్ధి, ధృతి, సుఖం.

ఇప్పుడు కృష్ణపరమాత్మ ఇవి మాత్రమే కాదు, వీటిని కొన్ని ఉదాహరణలుగా మాత్రమే తీసుకున్నాను అంటున్నాడు. దేన్ని చూసినా దానిలో మూడు గుణాలను చూడవచ్చు; అది జంతువు కావచ్చు, చెట్టు కావచ్చు. ఎందుకంటే సృష్టి అంతా మూడు గుణాలనుంచే వచ్చింది.

పద్నాలుగవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ సృష్టి గురించి బోధిస్తూ, మొత్తం జగత్తు మాయనుంచి వచ్చిందని చెప్పాడు. మాయను ప్రకృతి అని కూడా అంటారు. మాయను అపరాప్రకృతి అనీ, భగవంతుణ్ణి పరాప్రకృతి అనీ చూశాము. మాయ త్రిగుణాత్మకం కాబట్టి, మాయనుంచి జగత్తు వచ్చింది కాబట్టి, జగత్తులో అన్నింటిలోనూ ఈ మూడు గుణాలు ఉంటాయి. అది ప్రకృతిసూత్రం. కారణంలో ఏ లక్షణం ఉంటే అది కార్యంలో ఉంటుంది.

జగత్తంతా ఈ మూడుగుణాలవల్ల మాత్రమే సృష్టించబడితే, ఈ జగత్తులో ఇంత వైవిధ్యం ఎందుకుంది? దానికి కూడా అక్కడే కృష్ణపరమాత్మ జవాబు చెప్పాడు. ఆ మూడుగుణాల నిష్పత్తిలో ఉన్న హెచ్చుతగ్గులవల్ల ఆ భేదం అన్నాడు. ఆ వివరాలు అప్పుడు కూడా చూశాము, సందర్భం వచ్చింది కాబట్టి మళ్ళీ చూద్దాము.

ముందు జడవస్తువును తీసుకుంటే, అందులో కూడా మూడు గుణాలు ఉంటాయి గాని, అది తమోగుణ ప్రధానంగా ఉంటుంది. అందువల్ల అది కదలదు. దాన్నించి వృక్షసముదాయానికి వద్దాము. అవి కూడా కొంతమేరకు జడంగా ఉంటాయి. ఎందుకంటే అవీ ఒకచోటినుంచి ఇంకోచోటకు కదలవు. అలా కదిలే గుణం వాటికి ఉంటే, రోడ్డుకి ఇరుపక్కలా ఉన్న చెట్లు రోడ్డు మధ్యకు వచ్చేసే ప్రమాదం ఉంది. అలాగని అవి పూర్తిగా కొండలాగానో, రాయిలాగానో జడమూ కావు. అవి అచలంగా ఉంటాయి, అందువల్ల వాటిలోనూ తమోగుణం ప్రధానంగా ఉంటుంది కాని కొంచెం సత్త్వగుణం, కొంచెం రజోగుణం కూడా ఉంటాయి. అందువల్ల చెట్లకు ప్రాణం ఉంటుంది.

చెట్లనుంచి జంతువుల దగ్గరకి వచ్చేసరికి, వాటిల్లో తమోగుణం తక్కువగా ఉండి, రజోగుణం, సత్త్వగుణాలు ఎక్కువగా ఉంటాయి. వాటిలో కొన్నింటికి వాతావరణంలో మార్పులు తెలుస్తాయి. గొరిల్లా, డాల్ఫిన్ వంటి

జంతువులు తెలివైనవి కూడా. జంతువులనుంచి మనుష్యులకు వచ్చేసరికి, వారిలో సత్త్వగుణం, రజోగుణం ఎక్కువగా ఉంటాయి. మనుష్యుల్లో కూడా రజోగుణం ఎక్కువగా ఉన్నవారు ఉంటారు.

అందువల్ల సృష్టిలో ఏ వస్తువును చూసినా అది త్రిగుణాత్మకం. కాకపోతే ఆ గుణాలు ఉండే నిష్పత్తిలో హెచ్చుతగ్గులు ఉంటాయి. అలా ఏదైనా తీసుకుని త్రిగుణాలను అందులో చూడవచ్చు. నేను మీకు చూపించింది ఉదాహరణగా కొన్ని మాత్రమే సుమా, అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**త్రిభిః గుణైః ముక్తం సత్త్వం న అస్తి** – సత్త్వం అంటే ఒక వస్తువు లేదా ఒక వ్యక్తి. అంటే జడవస్తువైనా కావచ్చు; చేతన వస్తువైనా కావచ్చు. ఇక్కడ సత్త్వం అంటే సత్త్వగుణంగా తీసుకోకూడదు.

త్రిభిః గుణైః ముక్తం న అస్తి అంటే ఏ వస్తువులో కూడా ఈ మూడుగుణాలు లేకుండా లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏ వస్తువులో కూడా ఈ మూడుగుణాలు **లేకుండా లేదు** అనే ఈ వాక్యాన్ని డబుల్ నెగటివ్ అంటారు. అన్నింటిలోనూ మూడుగుణాలూ ఉన్నాయని దీని అర్థం. కాని ఇలా చెప్పినదానికన్నా అలా లేకుండా లేదని చెప్పటంవల్ల చెప్పాల్సిన అంశాన్ని నొక్కి వక్కాణించినట్టు అవుతుంది. చివరికి జడపదార్థమైన క్లిప్పులో కూడా మూడుగుణాలూ ఉంటాయి. కాకపోతే దానిలో తామసిక గుణం 99.999% ఉంటుంది. అందువల్ల అందులో చైతన్యం ఉన్నట్టుగా మనకు తెలియదు. అందువల్ల అన్నింటిలోనూ ఈ మూడుగుణాలూ ఉన్నాయి. ఏ మూడుగుణాలు?

**ప్రకృతిజైః (గుణైః)** – ప్రకృతినుంచి ఈ గుణాలు వచ్చాయి. ప్రకృతిలో మూడు గుణాలు ఉన్నాయి. ప్రకృతి సృష్టికి కారణం కాబట్టి, కార్యం అంతటా కారణం ఉంటుంది కాబట్టి, ప్రకృతియొక్క మూడు గుణాలు సృష్టిలోకి వస్తాయి. ఈ విషయం మన చుట్టూ ఉన్న జగత్తును చూస్తే అర్థం అవుతుంది.

ప్రకృతినుంచి మొట్టమొదట పుట్టినవి పంచభూతాలు. పంచభూతాలు అంటే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి. ఈ ఐదింటిలోనూ ఈ మూడుగుణాలూ ఉంటాయి. అంటే ఆకాశంలో సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలు ఉంటాయి. మనం పాంచభౌతికం అంటే పంచభూతాలనుంచి పుట్టాము; అందువల్ల మనకు కూడా ఈ మూడు గుణాలూ ఉంటాయి. ఈ మూడుగుణాలూ ఈ భూమ్మీద పుట్టిన వాటికే కాదు, పద్నాలుగు లోకాల్లోనూ ఉంటాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**పృథివ్యాం వా దివి దేవేషు వా పునః** – పృథివి అంటే భూలోకం; దివి దేవేషు వా అంటే ఊర్ధ్వలోకాలు. భువర్లోక, సువర్లోక, మహర్లోక, తపోలోక, జనలోక, సత్యలోకాలు; పునః అంటే మిగిలిన పాతాళలోకాలలో కూడా ఈ మూడు గుణాలూ ఉన్నాయి. ఏ లోకం తీసుకున్నా కూడా సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలు ఉండకుండా ఉండవు. అందువల్ల త్రిభిః గుణైః ముక్తం తత్ సత్త్వం న అస్తి.

దీని తర్వాత ప్రతి ఒక్క మనిషి కూడా ఈ మూడుగుణాల చేత నిర్దేశింపబడతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఒక సాధకునిగా మీ ఆలోచనలు, మీ కర్మలు, మీ మాటలు, మీ కార్యకలాపాలు, మీ ప్రవర్తన – ఒక్కటేమిటి అన్నీ ఈ మూడుగుణాల వల్ల నియంత్రించబడతాయి. అందువల్ల మీరు ఈ మూడుగుణాల లక్షణాలను సరిగ్గా

అర్థం చేసుకుంటే, మీ జీవితాన్ని మీరు సరియైన బాటలో నడిపించుకోవచ్చు. ఈ జ్ఞానం లౌకికంగానే కాదు, ఆధ్యాత్మికంగా కూడా మీ సాధనకు తోడ్పడుతుంది.

దీనితో కృష్ణపరమాత్మ ఆరు అంశాలను మూడుగుణాల పరంగా విభజించి, నిర్వచించటం అయిపోయింది. వచ్చే శ్లోకంలో కొత్త అంశంలోకి అడుగుపెట్టబోతున్నాడు.

**4. కర్మయోగము, జ్ఞానయోగము – శ్లోకాలు: 41–66: ఉపోద్ఘాతము**

ఈ శ్లోకాల్లో ఒకసారి గీతాబోధలోని రెండు ముఖ్యమైన అంశాల సారాంశాన్ని మళ్ళీ చెప్పదలుచుకున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయం మొత్తం భగవద్గీతకు ముక్తాయింపు పలుకుతున్నదనీ, మొదటి పదిహేడు శ్లోకాల్లో ఆ రెండు అంశాల సారాంశం చెప్పేశాడని కూడా చూశాము. ఏమిటవి?

కర్మయోగం, జ్ఞానయోగం. కాని ఈ రెండూ చాలా ముఖ్యమైన అంశాలు కాబట్టి, కృష్ణపరమాత్మ ఇప్పుడు వాటిని ఇంకో కోణంలోంచి నిర్వచించబోతున్నాడు.

**కర్మయోగం** – కర్మయోగం అంటే ఒక సాధకుడు సమాజానికి చేసే సేవ అనీ, పంచమహాయజ్ఞాలు అనీ చెప్పవచ్చు. దానివల్ల అతను చిత్తశుద్ధి పొందుతాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే దైవభక్తిలో గడిపే జీవనవిధానం. అది సాధనచతుష్టయ సంపత్తిని పెంపొందించి, తద్వారా జ్ఞానయోగప్రాప్తిని కలుగజేస్తుంది. ఈ జీవితం బాహ్యముఖంగా సాగుతుంది. దీన్ని ప్రవృత్తిమార్గం అని కూడా అంటారు.

ఈ కర్మయోగ జీవనవిధానాన్ని ప్రతిఒక్కరూ ఆచరించితీరాలి. ప్రతిఒక్కరూ నేను సైతం అంటూ, వారివంతు సహకారాన్ని జగత్తుకు తిరిగిఇవ్వాలి. మీరు చేసే ఏ చిన్నపనిని చూసినా, దానికి జగత్తుకు ఋణపడివున్నారు. ప్రాణవాయువును పీల్చినా, మంచినీళ్ళు త్రాగినా, ఆహారం తీసుకుంటున్నా, ఈ జగత్తుకు ఋణపడివున్నారు. అందువల్ల మిమ్మల్ని మీరు తిరిగి ప్రశ్నించుకోవాలి. నేను తీసుకున్నదానికి బదులుగా నేనేమి తిరిగి ఇస్తున్నాను? దేశం నాకేమిచ్చింది అని కాదు, దేశానికి నేనేమి ఇచ్చాను అని చూడాలి అంటారు లౌకికంగా. ఆధ్యాత్మికంగా వెళితే, జగత్తు మీకు ఎంతో ఇస్తున్నది, జగత్తుకు మీరు తిరిగి ఏం ఇవ్వగలరని ఆలోచించుకోవాలి. అప్పుడే మీ జీవితం ఉన్నతంగా సాగుతున్నట్టు అర్థం; జీవితానికి ఒక అర్థం ఉన్నట్టు అర్థం. అలా జగత్తుకు మీవంతు సహాయం మీరు చేసినట్టుగా మీరు భావించుకోగలిగితే, మీ ఆత్మగౌరవం, మీ పేరు పెరుగుతుంది సమాజంలో.

ఏ రోజైతే మీరు ప్రపంచంలో ఎవరికైనా ఏమైనా చేస్తారో, ఆ రోజు మీజన్మ ధన్యమైనట్టుగా అనిపిస్తుంది. అది పెద్దపనే కానవసరంలేదు. ఎవరో ఈ మహానగరంలో ఎవరింటికో దోవ వెతుక్కుంటుంటే వారికి సరియైన అడ్రసు చెప్పి పంపటం కూడా మహోపకారమే! కొంతమంది దోవ తెలియకపోయినా, ఏదో తెలిసినట్టుగా చెప్పేస్తారు. అలా కాకుండా, వారికి మీరు తేలిగ్గా ఇంటిగుర్తులు చెప్పినా కూడా, ఒక మంచిపని చేసిన తృప్తి కలుగుతుంది. కర్మయోగం అంటే అలా ఎదుటివారికి సహాయపడుతూ, ధార్మికమైన జీవనం గడపటం. ఇది మొదటిదశ. ఇది బాహ్యంగా సాగాలి.

**జ్ఞానయోగం** – జ్ఞానయోగం రెండవ దశ. మొదటిదాన్ని ప్రవృత్తి మార్గం అంటే, దీన్ని **నివృత్తి మార్గం** అంటారు. కర్మను వీలున్నంతవరకూ తగ్గించుకోవాలి. ఒకవేళ మీకు తగ్గించుకోవాలని లేకపోయినా కూడా, మీ శరీరం దానికి సహకరించదు. ఏదో పెద్దపూజో, యజ్ఞమో చెయ్యాలనుకుంటే, లేచి నిల్చోవటమే గగనమైపోతుంది. మనస్సు పోయినచోటికల్లా శరీరం పోలేదు; మనస్సు పనిచేసినంత వేగంగా శరీరం పనిచెయ్యలేదు. ఇది అర్థం చేసుకోవటం చాలా కష్టం. అందువల్ల మనకు యాభై, అరవై ఏళ్ళు వచ్చేసరికి, మన శాస్త్రమే నివృత్తిమార్గాన్ని నిర్దేశించింది. నివృత్తిమార్గం అంటే జ్ఞానయోగ ప్రధానజీవనం. ఇవన్నీ కృష్ణపరమాత్మ అంతకుముందే చెప్పేశాడు; కాని ఇక్కడ వాటి సారాంశం మళ్ళీ ఇవ్వదలుచుకున్నాడు.

ముందుగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. కర్మయోగం, జ్ఞానయోగాల గురించి కృష్ణపరమాత్మ వివరిస్తున్నది ఆ రెండింటిలో ఏదో ఒకటి పాటించండి అని చెప్పటానికి కాదు ఈ రెండూ ప్రతి మనిషికీ ముఖ్యమే. ఒకదాని తర్వాత ఒకటి చెయ్యాలి. డిగ్రీ చదివి పీ.జీ.కి వచ్చినట్టుగా, కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి రావాలి. అంటే ప్రతిఒక్కరి జీవితంలోనూ మొదటిదశ కర్మయోగ ప్రధానంగా ఉంటే, రెండవదశ జ్ఞానయోగ ప్రధానంగా ఉండాలి.

మనం భగవద్గీతయొక్క సారాంశాన్ని చాలాసార్లు చూశాము. అది ఇది –

కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం పాటించి చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి ఆత్మజ్ఞానం పొంది మోక్షం పొందాలి.

ఇక్కడ ఉపాసన గురించి ప్రత్యేకించి చెప్పటంలేదు. ఎందుకంటే అది కూడా కర్మయోగంలోకే వస్తుంది.

**కర్మయోగం + జ్ఞానయోగం = మోక్షం**

గీతాసారాన్ని ఒక్కముక్కలో చెప్పాలంటే ఇదీ సారం.

మీరు జీవితంలో విజయం సాధిస్తే చాలదు; మీరు తిరిగి ఏదైనా ఇవ్వాలి. లౌకికవిజయం మీరు ఎంత సంపాదించారు అనే దానిమీద ఆధారపడి ఉంటుంది, కాని ఆధ్యాత్మిక విజయం మీరేం తిరిగిఇచ్చారు అనేదాని మీద ఆధారపడివుంటుంది. అంటే లౌకికవిజయం మీ భోగంమీద ఆధారపడితే, ఆధ్యాత్మిక విజయం మీ త్యాగంమీద ఆధారపడివుంటుంది.

గీతాసారం ఏమిటని అడిగితే ఎవరో అద్భుతంగా చెప్పారు. గీతా పదాన్ని తిరగేస్తే త్యాగీ వస్తుంది. అంటే త్యాగి. అందువల్ల మన ప్రయాణం ఇలా సాగాలి – **భో**గినుంచి **యో**గికి, యోగినుంచి **త్యా**గికి. లేదు నేను భోగిగానే ఉంటానని మొండికేస్తే **రో**గిగా మారే ప్రమాదం ఉంది.

సరే, నేను అన్ని రంగాల్లో తిరిగి సేవ చేస్తాను అనలేరు. ఎందుకంటే ఎవరికీ అన్ని రంగాల్లోనూ సామర్థ్యం ఉండదు. అన్నింటిలోనూ వేలుపెడితే చివరికి అయోమయమే మిగులుతుంది. అలా అయితే ఏ రంగంలో చెయ్యాలి? ఇది పెద్ద సమస్య. మీరు ఏ రంగాన్ని ఎన్నుకోవాలనే విషయంలో సమస్య వస్తే, మూడు రకాలుగా

ఎన్నుకోవచ్చు. అవి – మీకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకోవటం; వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని ఎన్నుకోవటం; అధిక సంపాదనకు ఆస్కారం ఉన్నది ఎన్నుకోవటం.

**మీకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకోవటం** – శాస్త్రం మీకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకోవటం అన్నింటికన్నా శ్రేష్ఠమైన మార్గం అంటుంది. దాన్ని గుణప్రధానంగా లేదా స్వభావప్రధానంగా ఉంది అంటుంది. ఎందుకు ఇది అన్నింటికన్నా శ్రేష్ఠమైనది? మీరు మనస్ఫూర్తిగా ఇష్టపడిన దాన్ని మీరు ఎన్నుకుంటే ఆ పనిలో బాగా శ్రద్ధపెట్టి చేస్తారు. మనసా, వాచా, కర్మణా చేస్తారు ఆ పనిని. మీరు చేసే పనినే మీరు ప్రేమిస్తారు; ఆ పనియొక్క ఫలంకోసం ఎదురుచూడరు. జీతం ఎంత వచ్చినా పట్టించుకోరు; ఎవరు మెచ్చుకున్నా, మెచ్చుకోకపోయినా చలించరు.

స్వామీజీ భగవద్గీతను పదిహేను, ఇరవై సార్లు బోధించివుంటారు. ఇప్పటికీ ఆయన చెన్నై మహాపట్టణంలో భగవద్గీతను బోధిస్తూనే ఉంటారు (ఉపనిషత్తులతో పాటు). శిష్యులు ఆయన్ని అడుగుతుంటారు, 'స్వామీజీ, అన్నిసార్లు భగవద్గీతను బోధిస్తున్నారు కదా, మీకు విసుగనిపించదా?' స్వామీజీకి విసుగనిపించదు. ఆయనకు బోధించటమంటే ప్రాణం. ఆయన బోధను వింటుంటేనే ఆయన తను చెప్పే విషయంలో ఎంతగా రమిస్తారో తెలుస్తుంది. ఒక్కోచోట, ఇక్కడ మీరు ఆనందిస్తున్నారా అని అడిగి, మీ సంగతి నాకు తెలియదు, నేను ఆనందిస్తున్నాను అంటారు. అందువల్ల మీకు విసుగుపుడితే మీరు రాకండి అంటారు కాని ఆయన శ్రద్ధగా బోధించటం మానరు.

ఎవరైనా, ఏ పనినైనా, అలా తనకు ఇష్టమైనది ఎన్నుకుంటే, అతను తన పనిలో ఆనందం పొందుతాడు. ఎందుకొచ్చిన తంటా అనుకోడు. ఆతనికి తను చేసే పని నచ్చితే కర్తగానే ఆనందం పొందుతాడు; చేస్తున్న పనిని మొదటి అడుగునుంచే ఆనందించటం మొదలుపెడతాడు. ఆనందమే ఆనందం. భోక్తగా ఎటువంటి ఫలం వస్తుందో అని దానికోసం ఎదురుచూడడు.

అదే ఇష్టంలేని ఉద్యోగంలో చేరారనుకోండి. అందులో 25 సంవత్సరాలు నిరాసక్తిగా చేశారనుకోండి. ఎలా ఉంటుంది మీ వ్యక్తిత్వం? సోమవారం వస్తోందంటే అమ్మో అనిపిస్తుంది. వారమంతా పని చేసేసరికే శక్తి ఉడిగి పోతుంది. ఇంక శని, ఆదివారాల్లో ఆనందించే ఉత్సాహం ఎక్కడిది?

అందువల్ల గుణాన్నిబట్టి లేదా స్వభావాన్నిబట్టి ఎన్నుకునే వృత్తి శ్రేష్ఠమైనది.

**వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని ఎన్నుకోవటం** – గుణాన్నిబట్టి ఎన్నుకోవటం శ్రేష్ఠమని వినటానికి బాగానే ఉంది కాని, నా గుణమేమిటో నాకే తెలియటం లేదు అంటారు. 'పొద్దున్న సాత్త్వికగుణం ఉన్నట్టు, మధ్యాహ్నం రాజసిక గుణం ఉన్నట్టు, సాయంకాలం తామసిక గుణం ఉన్నట్టూ అనిపిస్తుంది. అంతేకాదు, వాతావరణాన్నిబట్టి కూడా నా గుణం మారుతుంది,' అంటారు కొందరు.

మీ గుణం ఏమిటో మీరు తేల్చుకోలేనప్పుడు, వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని ఎన్నుకోవటం మంచిది. ఎందుకు? మీ వంశంలో ఏ వృత్తి వస్తోందో, దాన్ని మీరు చిన్నప్పటి నుంచీ చూస్తూవస్తారు. మీకు తెలియకుండానే ఆ వృత్తిలోని మెళకువలు తెలుస్తాయి. సంగీత విద్వాంసుల ఇంట్లో పుట్టిన అమ్మాయి చిన్నతనంనుంచే పాడటం మొదలుపెడుతుంది.

ఏ కులంలో పుట్టినవ్యక్తి ఆ కులానికి సంబంధించిన విద్యనే ఎన్నుకుంటే అతనికి అందులో పోటీ ఉండదు. బ్రాహ్మణుడు బ్రాహ్మణవృత్తిని; క్షత్రియుడు క్షత్రియ వృత్తిని ఎన్నుకుంటే తక్కినవారితో పోటీ ఉండదు. బ్రాహ్మణుడు క్షత్రియునికి పోటీ వెళ్ళడు; క్షత్రియుడు బ్రాహ్మణునికి పోటీ వెళ్ళడు. అంటే రెండవ మార్గం జాతినిబట్టి ఎన్నుకోవటం. పూర్వం అలా జాతినిబట్టి ఎన్నుకునేవారు. బ్రాహ్మణుడు పండితుడు అయ్యేవాడు; క్షత్రియుడు పరిపాలన దక్షత చూపేవాడు; వైశ్యుడు వ్యాపారం చేసేవాడు.

**అధిక సంపాదనకు ఆస్కారం ఉన్నది ఎన్నుకోవటం** – ఈ మార్గాన్ని ఎన్నుకుంటే చాలా సమస్యలు వస్తాయి అంటున్నది శాస్త్రం. ఎందుకు? అందరూ ఒక వృత్తి వెంటే పడతారు; కొన్ని వృత్తుల జోలికి ఎవరూ వెళ్ళరు. ముఖ్యంగా బ్రాహ్మణవృత్తి చేపట్టటానికి ఎవరూ ముందుకు రారు; అలాంటి పరిస్థితి ఏర్పడితే, మన శాస్త్రాన్ని పరిరక్షించేవారు ఉండరు; మన సాంప్రదాయాన్ని పాటించేవారు ఉండరు. అప్పుడు ఈ వర్ణాశ్రమ భేదాలను కర్మనుబట్టి నిర్ణయించాల్సి వస్తుంది.

వర్ణాశ్రమ ధర్మాలను గురించి చాలా వివరంగా నాలుగవ అధ్యాయంలో చూశాము. ఇప్పుడంత లోతుల్లోకి వెళ్ళటం లేదు. కాని గుణం, జాతి, కర్మల పదాలను చూశాము కాబట్టి కొంచెంగా ఈ వర్ణాల గురించి చూద్దాము. నాలుగు వర్ణాలు ఉన్నాయి. అవి – బ్రాహ్మణ వర్ణం, క్షత్రియ వర్ణం, వైశ్య వర్ణం, శూద్ర వర్ణం. ఈ విభజన మూడు కోణాల్లో జరిగింది – జాతి, గుణ, కర్మల ఆధారంగా.

**గుణ విభాగం** – ఇది స్వభావాన్నిబట్టి ఏర్పడుతుంది. ప్రతివ్యక్తిలోనూ ప్రాథమికంగా మూడు గుణాలు ఉంటాయి. అవి సత్త్వ, రజ, తమో గుణాలు. మొత్తం మానవజాతిని నాలుగు రకాలుగా విభజించవచ్చు అని కృష్ణపరమాత్మ చెప్పాడు. వాటిని వరుసగా సరత, రసత, రతస, తరస అని చూశాము. స అంటే సత్త్వగుణం, ర అంటే రజోగుణం, త అంటే తమోగుణం.

**సరత** – సరత అంటే అతనిలో సత్త్వగుణం ప్రధానంగా ఉంటుంది. దానికన్నా తక్కువస్థాయిలో రజోగుణం ఉండి, చాలా తక్కువగా తమోగుణం ఉంటుంది. ఇతను అంతర్ముఖుడిగా, తెలివైనవాడుగా ఉంటాడు. ఇటువంటి వ్యక్తిని గుణబ్రాహ్మణుడు అంటారు.

**రసత** – రసత అంటే అతనిలో రజోగుణం ప్రధానంగా ఉంటుంది. దానికన్నా తక్కువస్థాయిలో సత్త్వగుణం ఉండి, చాలా తక్కువ స్థాయిలో తమోగుణం ఉంటుంది. ఇతను చాలా హుషారుగా కర్మలు చేస్తాడు. బహిర్ముఖంగా ఉండి, సమాజానికి సేవ చేస్తాడు. ఇటువంటి వ్యక్తిని గుణక్షత్రియుడు అంటారు.

**రతస** – రతస అంటే అతనిలో కూడా రజోగుణం ప్రధానంగా ఉంటుంది కాని, మధ్యస్థాయిలో తమోగుణం ఉండి, చాలా తక్కువగా సత్త్వగుణం ఉంటుంది. ఇతను కూడా హుషారుగా పనులు చేస్తాడు కాని అవి ఎక్కువ స్వార్థపూరితంగా ఉంటాయి. ఇటువంటి వ్యక్తిని గుణవైశ్యుడు అంటారు.

**తరస** – తరస అంటే అతనిలో తమోగుణం ప్రధానంగా ఉంటుంది. దానికన్నా తక్కువస్థాయిలో రజోగుణం ఉండి, చాలా తక్కువగా సత్త్వగుణం ఉంటుంది. తమోగుణం ఎక్కువ స్థాయిలో ఉంటుంది కాబట్టి మనస్సు హుషారుగా ఉండదు; శరీరం చలాకీగా ఉండదు. మందకొడిగా ఉంటాడు. పనులు చేసినా అవి యాంత్రికంగా ఉంటాయి. ఇటువంటి వ్యక్తిని గుణశూద్రుడు అంటారు.

పైన చెప్పిన గుణాలనుబట్టి వారికి కావాల్సిన వృత్తులను ఎన్నుకోవచ్చు. ఇలా గుణాన్నిబట్టి నాలుగు వర్ణాలలో విభజిస్తారు. (ఈ వర్ణవిభజనను గుణపరంగా ఈ అధ్యాయము చివరలో ఒక పట్టికలో చూడవచ్చు.)

**చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥** – 4.13

**కర్మ విభాగం** – ఈ విభజన వారు చేసే వృత్తినిబట్టి ఉంటుంది.
బుద్ధికి సంబంధించిన కర్మలు చేయటం బ్రాహ్మణకర్మ. వారిని కర్మబ్రాహ్మణులు అంటారు.
పరిపాలన చెయ్యటం క్షత్రియ కర్మ. వారిని కర్మ క్షత్రియులు అంటారు.
వ్యాపారం చెయ్యటం వైశ్య కర్మ. వారిని కర్మ వైశ్యులు అంటారు.
యాంత్రికంగా పనులు చెయ్యటం శూద్రకర్మ. వారిని కర్మ శూద్రులు అంటారు.

**జాతి విభాగం** – ఇది పుట్టుకవల్ల ఏర్పడిన విభాగం. పుట్టుకను జన్మ లేదా జాతి అంటారు. బ్రాహ్మణునికి పుట్టిన వ్యక్తి జాతిబ్రాహ్మణుడు అవుతాడు.

ఇక్కడితో కర్మయోగం, జ్ఞానయోగాల ఉపోద్ఘాతం అయిపోయింది.

శ్లో. 41 **బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥**
బ్రాహ్మణక్షత్రియవిశామ్, శూద్రాణామ్, చ, పరంతప,
కర్మాణి, ప్రవిభక్తాని, స్వభావప్రభవైః, గుణైః ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ పరంతపా! (అర్జునా) | స్వభావప్రభవైః | = వారివారి స్వభావములను అనుసరించి ఏర్పడిన |
| బ్రాహ్మణక్షత్రియవిశామ్ | = బ్రాహ్మణక్షత్రియ వైశ్యులయొక్క | గుణైః | = గుణములనుబట్టి |
| చ | = అలాగే | ప్రవిభక్తాని | = విభజింపబడినవి |
| శూద్రాణామ్ | = శూద్రులయొక్క | | |
| కర్మాణి | = కర్మలు | | |

**హే పరన్తప! బ్రాహ్మణ-క్షత్రియ-విశామ్ శూద్రాణామ్ చ**
**కర్మాణి స్వభావ-ప్రభవైః గుణైః ప్రవిభక్తాని (సన్తి) ।**

తా: ఓ పరంతపా! (అర్జునా) బ్రాహ్మణక్షత్రియ వైశ్యులయొక్క అలాగే శూద్రులయొక్క కర్మలు వారివారి స్వభావములను అనుసరించి ఏర్పడిన గుణములనుబట్టి విభజింపబడినవి.

**ఎ) కర్మయోగము – శ్లోకాలు: 41-49**

కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో నాలుగు వర్ణాల గురించి మాట్లాడుతున్నాడు. అది జాతిపరంగా కాకుండా గుణపరంగా చెబుతున్నాడు. మీ గుణానికి తగ్గ వృత్తిని ఎన్నుకుంటే మంచిది అంటున్నాడు.

**బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ** – మనుష్యుల్లో నాలుగు వర్ణాల వారు ఉన్నారు. వారు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. విశాం అంటే వైశ్యులు. అది కూడా గుణాన్నిబట్టి. ఒక వ్యక్తి జాతిబ్రాహ్మణుడు అవచ్చు కాని, గుణవైశ్యుడో, గుణక్షత్రియుడో అవచ్చు. ఈ నాలుగు రకాల మనుష్యులకూ,

**కర్మాణి ప్రవిభక్తాని** – నాలుగు రకాల కర్మలను వేదాలే నిర్దేశించాయి. ఆ నాలుగు రకాల కర్మలద్వారా వారు సమాజానికి సేవ చేసేలాగా నిర్దేశించాయి. కర్మ అంటే వృత్తి; ప్రవిభక్తాని అంటే వారికి నియమించాయి. ఏవి? వేదాలు. వేదాలు సాక్షాత్తూ ఆ భగవంతునినుంచే వచ్చాయి కాబట్టి, ఈ వర్ణధర్మాలు కూడా భగవంతుడే నియమించాడని చెప్పవచ్చు. ఈ వివరణ పురుషసూక్తంలో వస్తుంది.

**బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ బాహూరాజన్యః కృతః**
**ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత**

ఈ నాలుగు వృత్తులనూ శరీరంలోని నాలుగు అంశాలతో పోలుస్తున్నది. బ్రాహ్మణుడు మనిషికి ముఖం వంటివాడు. ముఖం అంటే వాక్కు. వాక్కు జ్ఞానానికి, సత్త్వగుణానికి సంకేతం. క్షత్రియుడు–చేతులు. చేతులు రక్షించినట్టు క్షత్రియుడు రక్షణ చేస్తాడు. వైశ్యుడు–ఊరువులు. ఊరువులు ఆరోగ్యంగా ఉంటే మనిషి తిరగగలడు. ఆర్థికవ్యవస్థ బాగుంటే సమాజం బాగుంటుంది. శూద్రులు–పాదాలు. పాదాలు పనులకు సంకేతం. సమాజానికి పనులు శూద్రులు చేస్తారు. దీన్నిబట్టి శరీరంలో ప్రతి ఒక్క అంశమూ ఎలా ముఖ్యమో, అలా ప్రతి ఒక్క వర్ణమూ ముఖ్యమేనని తెలుస్తున్నది.

అన్ని వృత్తులూ సమానమే అయితే, నేనేం వృత్తిని ఎన్నుకోవాలి? శ్రేష్ఠమైన పద్ధతి గుణాన్నిబట్టి లేదా స్వభావాన్నిబట్టి ఎన్నుకోవటం. మీ స్వభావమేమిటో మీకు స్పష్టంగా తెలియకపోతే, మీ జాతినిబట్టి ఎన్నుకోవటం. తండ్రి వ్యాపారంలో ఉంటే, చిన్నప్పటినుంచే ఆ వ్యాపారంలోని మెళకువలన్నీ తెలుస్తాయి. మనదేశంలో రాజకీయాల్లోకి కూడా అలా వంశపారంపార్యంగా వస్తున్నారు. అదీ కాకపోతే ఎందులో ఎక్కువ సంపాదన వచ్చే అవకాశం ఉంటే అది ఎన్నుకుంటారు కొందరు. కాని శాస్త్రం స్వభావాన్నిబట్టి ఎన్నుకోమంటుంది.

**స్వభావప్రభవైర్గుణైః** – స్వభావం అంటే ప్రకృతి. ప్రభవ అంటే దాన్నించి పుట్టింది. మీ గుణాన్నిబట్టి శాస్త్రం మీకు కర్మను నిర్దేశించింది. మీగుణం ప్రకృతినుంచి వచ్చింది. ఏ కర్మ చేస్తున్నా ఆ వృత్తి చేస్తున్నందుకు గర్వంగా భావించండి.

ఎన్నడూ పక్కవారితో పోల్చుకోకండి; మీరు చేస్తున్న పనితో తృప్తి చెందండి; దాన్ని ప్రేమించండి; ఆ పనిని మీ శాయశక్తులా చెయ్యండి. అలా చేస్తే ఏ రంగంలో ఉన్నా కూడా రాణిస్తారు. కర్మను ఆనందించండి; కర్మఫలంకోసం ఎదురుచూస్తూ కూర్చోకండి. కర్మఫలంవల్ల ఆనందం పొందుతాను అనుకుంటే ఆ కర్మఫలం ఆనందం ఇచ్చి తీరుతుందనే నమ్మకం లేదు. ప్రమోషన్ రావటం మీ చేతిలో లేదు; మీకే అర్హత ఉన్నా, వేరే వ్యక్తి బాసును కాకాపట్టి, దాన్ని గద్దలా తన్నుకుపోవచ్చు. అదే కర్మలో ఆనందం పొందటం నేర్చుకుంటే ఆ ఆనందం మీ చేతుల్లోనే ఉంది.

శ్లో. 42 **శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ ।**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మస్వభావజమ్ ॥**
శమః, దమః, తపః, శౌచమ్, క్షాంతిః, ఆర్జవమ్, ఏవ, చ,
జ్ఞానమ్, విజ్ఞానమ్, ఆస్తిక్యమ్, బ్రహ్మకర్మస్వభావజమ్ ॥

శమః = మనోనిగ్రహము
దమః = ఇంద్రియ నిగ్రహము
తపః = తపస్సు అనగా ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టములను సహించుట
శౌచమ్ = బాహ్యాభ్యంతరముల శుచిత్వము
క్షాంతిః = ఇతరుల అపరాధములను క్షమించుట
ఆర్జవమ్ = ఋజుమార్గజీవనము
ఆస్తిక్యమ్ = వేదశాస్త్రములందును, ఈశ్వరుని యందును, పరలోకాదులందును విశ్వాసము కలిగియుండుట
జ్ఞానమ్ = వేదశాస్త్రముల అధ్యయనము, అధ్యాపనము
చ = ఇంకా
విజ్ఞానమ్ ఏవ = పరతత్త్వానుభవమూ (ఇవియన్నియును)
బ్రహ్మకర్మ స్వభావజమ్ = బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు

**శమః, దమః, తపః, శౌచమ్, క్షాన్తిః, ఆర్జవమ్, జ్ఞానమ్,**
**విజ్ఞానమ్, ఆస్తిక్యమ్ ఏవ చ (ఇతి) స్వభావజమ్ బ్రహ్మ-కర్మ (అస్తి) ।**

తా: మనోనిగ్రహము, ఇంద్రియ నిగ్రహము, తపస్సు అనగా ధర్మములను పాటించుటలో ఎదురగు కష్టములను సహించుట) బాహ్యాభ్యంతరముల శుచిత్వము, ఇతరుల అపరాధములను క్షమించుట, ఋజుమార్గజీవనము, వేదశాస్త్రములందును, ఈశ్వరుని యందును, పరలోకాదులందును విశ్వాసము కలిగియుండుట, వేదశాస్త్రముల అధ్యయనము, అధ్యాపనము ఇంకా పరతత్త్వానుభవమూ, ఇవియన్నియును బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు.

ఇక్కడ్నుంచి వరుసగా ఒక్కొక్కరి స్వాభావిక కర్మలను నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంలో బ్రాహ్మణ కర్మను చూస్తాము. బ్రాహ్మణ కర్మ మన సాంప్రదాయంలో ఉన్న అంతులేని ఆధ్యాత్మిక గ్రంథాలను పరిరక్షించి, వ్యాపింపజేయటం. ముఖ్యంగా మన వైదిక సాంప్రదాయంలో విస్తారమైన గ్రంథాలు ఉన్నాయి. వాటిని చతుర్దశా విద్యాస్థానాని లేదా అష్టాదశ విద్యాస్థానాని అంటారు.

**అంగాని చత్వారో వేదా, మీమాంసా న్యాయవిస్తరః।**
**పురాణం ధర్మశాస్త్రం చ విద్యాహ్యేతాః చతుర్దశ॥**

**చత్వారః వేదాః** – ఈ నాలుగు వేదాలే చాలా పెద్దవి. ఆ రోజుల్లో పుస్తకాల్లో రాసుకోవటం లేదు; అంతా మనస్సులో నిక్షిప్తం చేసుకోవటమే. అలా గుర్తుంచుకోవాలంటే నిరంతరం పారాయణం చేస్తూనే ఉండాలి. ఇప్పటి పరిస్థితి వేరు. పద్నాలుగు శ్లోకాలు ఉన్న గురుస్తోత్రమే గుర్తు ఉండదు. పూర్వకాలంలో మొత్తం వేదాన్ని అధ్యయనం, అధ్యాపనం చేసేవారు.

**షట్ అంగాని** – వేద అంగాలు ఆరు ఉన్నాయి. అవి శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం.

శిక్షా – వేదమంత్రాల ఉచ్ఛారణ
కల్పమ్ – యజ్ఞాల వివరణ, కర్మకాండలు
వ్యాకరణమ్ – వ్యాకరణం
నిరుక్తమ్ – నిఘంటువు, పదాల ధాతువును తెలుపుతుంది
ఛందస్సు – ఛందస్సు
జ్యోతిషమ్ – యజ్ఞయాగాదులకు ముహూర్తాలు చెప్పేది

అలా నాలుగు వేదాలు + ఆరు అంగాలు ఉన్నాయి. అవే పది అయ్యాయి. వీటన్నిటి గురించి ఉపనిషత్తుల్లో వస్తాయి.

**మీమాంసా న్యాయ విస్తరః** – మీమాంస శాస్త్రం అంటే వేదాన్ని విశ్లేషించే శాస్త్రం. వేదాన్ని తెరిచే తాళంచెవి వేరే ఉంటుంది. కొన్ని సందర్భాలలో వేదంలోని పదాలకు అర్థాలు నిఘంటువులో కూడా దొరకవు. మామూలు వ్యాకరణం వేరు, వైదిక వ్యాకరణం వేరు.

న్యాయ అంటే తర్కం; న్యాయ విస్తారః అంటే తర్కంమీద మనకు విస్తారంగా అనేక పుస్తకాలు ఉన్నాయి. ప్రతిదానికీ భాష్యాలు, భాష్యాలకు ఉపభాష్యాలు, ఉపభాష్యాలకు ఉపభాష్యాలు వందలకొద్దీ ఉన్నాయి.

**పురాణమ్** – మనకు 18 పురాణాలు, 18 ఉపపురాణాలు ఉన్నాయి. వాటన్నిటినీ చదవటానికి ఒక జీవితకాలం సరిపోదు. వాటిమీద అనేక భాష్యాలు వచ్చాయి. భాగవతంలోని 18,000 శ్లోకాలకు శ్రీధరస్వామి భాష్యం రాశారు; భారతంలోని లక్ష శ్లోకాలకు నీలకంఠుడు అనే ఆయన భాష్యం రాశారు. ఇవన్నీ చదవాలంటే ఎంత సమయం పడుతుందో ఊహించండి! అందువల్ల కొంతమంది కేవలం వీటిని అధ్యయనం చెయ్యటానికే వారి జీవితాన్ని అంకితం చేస్తారు.

**ధర్మశాస్త్రమ్** – ధర్మం అంటే ఏమిటి, విలువలు అంటే ఏమిటి, అందులోనూ సామాన్య ధర్మం ఏమిటి, విశేష ధర్మం ఏమిటో వివరంగా వస్తుంది. అంతేకాదు, వర్ణాశ్రమ ధర్మాలు వేటికవే వివరంగా ఉంటాయి. అంటే గృహస్థు పాటించాల్సిన ధర్మాలు ఏమిటి? బ్రాహ్మణుడు పాటించాల్సిన ధర్మాలు ఏమిటి? అంతేకాదు, పురుషుల ధర్మాలు ఏమిటి? స్త్రీల ధర్మాలు ఏమిటి? భార్యకూ, తల్లికీ మధ్యలో గొడవలు వచ్చి నేను కావాలో, మీ అమ్మ కావాలో తేల్చుకోమని భార్య; నేను కావాలో, నీ భార్య కావాలో తేల్చుకోమని తల్లి అతన్ని రెండుగా చీలుస్తుంటే, అతను ఏం చెయ్యాలి? ఎవరివైపు మొగ్గుచూపాలి? దీన్ని ధర్మసంకటం అంటారు. అటువంటి ధర్మసంకటం ఏర్పడితే ఏం చెయ్యాలి? వీటన్నిటికీ జవాబు ధర్మశాస్త్రం.

**విద్యాహ్యేతాః చతుర్దశ** – పధ్నాలుగు విద్యలు ఉన్నాయి. వీటిని ఉపవేదాలు అంటారు. ఉదాహరణకు గంధర్వ వేదం, ఆయుర్వేదం. వీటిమీద మళ్ళీ భాష్యాలు. ఇన్ని అధ్యయనం చెయ్యాలంటే, కేవలం వీటికోసమే

సమయాన్ని కేటాయించగలిగి ఉండాలి. అంతేకాదు, వారు అధ్యయనం చెయ్యటమే కాక, ఆ విద్యను తీరిగ్గా అధ్యయనం చేసే సమయం లేనివారికి వాటి సారాంశాన్ని బోధించాలి. ఎందుకంటే, ఈ గ్రంథాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోవాలంటే ముందు సంస్కృతం నేర్చుకోవాలి.

సంస్కృతమే ఒక మహాసాగరం. అందులోకి దిగితే బయటపడటం కష్టం. సంధిసూత్రాలే చాలా ఉంటాయి. ఒక పదం అలా ఎందుకు వచ్చింది అంటే దానిని విడదీసుకుంటూ అనేక దశల్లోకి వెళ్ళాలి. పాణినీ సూత్రాలకు అనేక భాష్యాలు, ఉపభాష్యాలు ఉన్నాయి. ఇవన్నీ నేర్చుకోవాలంటే మామూలు మేధస్సు చాలదు. అందువల్ల ప్రత్యేకించి, బాగా తెలివైనవారు ఈ శాస్త్రాన్ని ఔపోసన పట్టాలి.

ఇంకొక ముఖ్యమైన అంశం ఉంది. మీరు చేసే బోధ మీ శిష్యులను ప్రభావితం చెయ్యాలన్నా, వారిలో మీరు ఆశించిన ఫలితం రావాలన్నా కూడా, మీరు బోధిస్తున్న సత్యాన్ని మీరు ఆచరణలో పెట్టిచూపాలి. మీరు చెప్పేదొకటి, చేసేదొకటిగా ఉండకూడదు. ఒకపక్క సత్యంవద అని బోధిస్తూ మీరు పాటించేది సత్యం వధ అయితే శిష్యునికి మీమీద గురి ఏముంటుంది? సత్యం చెప్పమని వారికి చెప్పి, మీరు సత్యాన్ని వధ చేస్తే ఎలా? నేను చెప్పేది చెయ్యి, నేను చేసేది చెయ్యకు అంటే దాని ప్రభావం శిష్యులమీద ఉండదు. అందువల్ల బ్రాహ్మణుడు అధ్యయనం, అధ్యాపనం చెయ్యటమే కాదు, దాన్ని ఆచార్యుడుగా ఆచరణలో పెట్టాలి.

**ఆచినోతి చ శాస్త్రార్థాన్, ఆచారే స్థాపయత్యపి।**

**స్వయమ్ ఆచరతే యస్మాత్, తస్మాదాచార్య ఉచ్యతే॥**

ఏ ఆచార్యుడయితే తను స్వయంగా ఆచరించి చూపిస్తాడో, అతన్నే ఆచార్యుడు అంటారు. ధర్మం పాటించమని చెప్పేటట్టయితే అతను ముందు ధర్మాచరణ చెయ్యాలి. అందువల్ల అతను తన మేధస్సును ఉపయోగించి నేర్చుకుని, బోధిస్తే చాలదు. దానికి తగ్గ కర్మ కూడా చెయ్యాలి.

అలా అధ్యయనం, అధ్యాపనం, ఆచరణ చేసే వ్యక్తి జీవితం భేషజాలకు పోకుండా సాదాసీదాగా ఉండాలి. సాధారణజీవనం గడిపే వ్యక్తి అధ్యయనం చెయ్యగలడు; అష్టైశ్వర్యాలతో తులతూగితే విద్యను అభ్యసించలేడు.

**సుఖార్థీ త్యజతే విద్యాం విద్యార్థీ త్యజతే సుఖమ్**

**సుఖార్థినః కుతో విద్యా కుతో విద్యార్థినః సుఖమ్**

**సుఖార్థీ త్యజతే విద్యామ్** – సుఖం కోరే వ్యక్తి విద్యను పొందలేడు. ఎందుకంటే సుఖాలను అమర్చుకోవటంలోనే జీవితం గడచిపోతుంది. అందువల్లనే పూర్వం గురుకుల విద్యావ్యవస్థ ఉన్నప్పుడు జీవితం చాలా సాధారణంగా ఉండేది. రాజకుమారుడు గురుకులానికి వెళ్ళినా అతనికి అక్కడ రాచమర్యాదలు ఉండేవికావు. అతను కూడా అందరిలాగానే ఉంటూ, అందరూ తినే మామూలు భోజనమే తినాలి.

అందువల్ల బ్రాహ్మణవృత్తి అంటే సాధారణ జీవనం, వేద అధ్యయనం, ధర్మాచరణ, వేద అధ్యాయనం చేస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలి. ఎటువంటి ఆదర్శం?

ధర్మం పాటిస్తేనే చాలు ఆనందం కలుగుతుంది. ఆనందంకోసం సుఖాల వెంట పరుగులు తీయనవసరం లేదనే అంశాన్ని తన ప్రవర్తన ద్వారా చాటిచెప్పాలి బ్రాహ్మణుడు. ధర్మాన్ని పాటిస్తేనే చాలు శాంతి, భద్రత,

ఆనందాలు కలుగుతాయని అర్థం చేసుకుంటారు. జీవితం ఆనందమయంగా సాగటానికి, ఐశ్వర్యం ఉండితీరాలని లేదు అని నొక్కివక్కాణిస్తుంది వేదం. ఐశ్వర్యం ఆనందమయ జీవితానికి అవసరం లేదు. ఎందుకు? ఐశ్వర్యం శరీరాన్ని సుఖాలలో ముంచితేలుస్తుంది. కాని ఆనందం మనస్సుకు చెందినది.

ఇది మాటల్లో చెబితే అంత తేలిగ్గా వంటబట్టదు అందరికీ. బ్రాహ్మణుడు అలా ఐశ్వర్యం జోలికి పోకుండా, సాధారణ జీవితం గడుపుతూ కూడా ఆనందంగా ఉంటే, అప్పుడు ఆయన ఆదర్శప్రాయుడు అవుతాడు అందరికీ. అందువల్ల పూర్వకాలంలో బ్రాహ్మణవృత్తి అంటే బీదరికాన్ని, సాధారణ జీవితాన్ని రెండుచేతులా ఆహ్వానించటమే అయ్యేది. నిజానికి బ్రాహ్మణ జీవనవిధానం సన్న్యాసఆశ్రమ జీవనవిధానానికి చాలా దగ్గరగా ఉండేది.

అందువల్ల అటువంటి బ్రాహ్మణునికి సన్న్యాస ఆశ్రమం స్వీకరించటం పెద్ద కష్టమేమీ కాదు. దయానంద స్వామీజీ అంటారు, 'అటువంటి వ్యక్తి కేవలం యజ్ఞోపవీతాన్ని త్యజించాలి అంతే.' ఎందుకంటే అతను సాధారణ జీవనం గడుపుతాడు కాబట్టి అతనికి ఆస్తిపాస్తులు అంటూ ఏమీ ఉండవు. ఇదీ బ్రాహ్మణకర్మయొక్క నిర్వచనం. కాని దురదృష్టవశాత్తూ, నేటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా ఈ వృత్తికి ఇష్టంగా వచ్చేవారిని వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. అంతగా తగ్గిపోతున్నారు. ఇదీ మన వైదిక సాంప్రదాయం యొక్క దుస్థితి. ఇప్పుడు ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**శమః** – బ్రాహ్మణవృత్తిని ఎన్నుకునే వ్యక్తికి ముందుగా ఉండాల్సింది శమము. శమము అంటే మనోనిగ్రహం.

**దమః** – దమః అంటే ఇంద్రియనిగ్రహం; బ్రాహ్మణవృత్తిని చేపట్టే వ్యక్తి ఎక్కువగా విషయవస్తువులవైపు ఆకర్షింపబడకూడదు. అది చేపట్టేముందు, 'నేను ఇంద్రియ నిగ్రహం చేసుకోగలనా,' అని అతను తనను తాను బేరీజు వేసుకోవాలి. శమ, దమాలు సన్న్యాసిగా మాత్రమే కాదు, గృహస్థుగా కూడా పాటించాలి.

**తపః** – తపః అంటే ఇక్కడ సాధారణమైన జీవనాన్ని గడపటం, ధార్మిక జీవనాన్ని గడపటం. దాన్ని అపరిగ్రహం అంటారు. ఇటువంటి జీవనవిధానం పాటించటం నేర్చుకుంటే, అతను ఆధ్యాత్మిక జీవనాన్ని ఎన్నుకుంటే ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అందువల్ల బ్రాహ్మణవృత్తిని ఎన్నుకున్న వ్యక్తికి జ్ఞానయోగం పాటించటం చాలా తేలిక అవుతుంది.

**శౌచమ్** – శౌచం అంటే శుభ్రత. సాధారణ జీవనాన్ని గడపాలి అంటే శుచీ, శుభ్రతను వదిలివేయాలని కాదు దాని అర్థం. గుర్తుంచుకోండి, సాధారణ జీవనం అంటే ఇల్లు, ఒళ్ళు చెత్తగా ఉంచుకోవటం కాదు. సుఖాలలో తేలిపోతుంటేనే శుభ్రత ఉండాలనుకోవటం భ్రమ. పైగా ఇంకొక విషయం. శుభ్రత అంటే బాహ్యంగా మాత్రమే కాదు; ఆంతర శుభ్రత కూడా ఉండాలి. అంటే మాటలు కూడా మంచివి మాట్లాడాలి. మనుస్మృతిలో బ్రాహ్మణవృత్తికి నిర్దేశించిన నియమాలను చూస్తే, ఆ వృత్తిని ఎన్నుకోవటానికే వణుకుతారు ఎవరైనా.

మూడు స్థాయిల్లో ఈ శౌచాన్ని పాటించాలి. అవి మాట్లాడే స్థాయి, శారీరక స్థాయి, బుద్ధి స్థాయి. ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో తెలుసుకోవాలి. కొంతమంది మీరు జాగ్రత్తగా ఉన్నా, కావాలని మిమ్మల్ని రెచ్చగొడతారు. అయినా మీరు రెచ్చిపోకూడదు. తర్వాత శరీరాన్ని శుచిగా ఉంచుకోవాలి; దాని

తర్వాత బుద్ధి కూడా అదుపులో ఉండాలి. నిజానికి యజ్ఞోపవీతంలో ఉన్న మూడు దారాలు ఈ మూడు స్థాయిల శౌచాన్ని సూచిస్తాయి.

**క్షాంతిః** – క్షాంతి అంటే బాహ్యంగా ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనే శారీరక, మానసిక సంసిద్ధత. బ్రాహ్మణవృత్తిని, తదనుగుణంగా సాధారణ జీవనాన్ని, ఎన్నుకున్న వ్యక్తికి సహజంగానే శారీరక సుఖాలు తక్కువే ఉంటాయి. సుఖాలు ఐశ్వర్యంతో వస్తాయి. ఇతను ఐశ్వర్యాన్ని కోరుకోవటం లేదు. ఎండాకాలంలోని ఎండనూ, చలికాలంలోని చలినీ, వానాకాలంలోని వాననూ, అన్నింటినీ నవ్వుతూ స్వీకరిస్తాడు. ఎండాకాలంలో చెమటలు కక్కుతున్నా, ఏ.సీ. లేదని బాధపడడు. కొంతమంది ఏ.సి. లేకపోతే విలవిలలాడిపోతారు. అటువంటి సుఖాలు కావాలంటే లౌకిక విజయాల వైపు మొగ్గుచూపాలి.

కాని మనిషి తీరు ఎలా ఉంటుందంటే, చిన్న అవస్థను కూడా తట్టుకోలేడు. కాసేపు కరెంటు లేకపోతే గోలగోల పెట్టేస్తాడు. ఈ ఆధునిక యుగంలో అన్నీ పరిపూర్ణంగా ఉండాలి అనుకుంటాడు. పూర్వం ఒకరోజంతా కరెంటుకోత ఉండేది; అయినా వారు నవ్వుతూ భరించేవారు. ఇప్పుడు బాహ్యంగా అనేక సుఖాలు వచ్చాయి. అందువల్ల ఏ చిన్న సుఖం లేకపోయినా చిర్రుబుర్రులాడుతారు. అంటే సుఖం కావాలంటే దానికి మీరు చెల్లించాల్సిన రుసుము చిరాకు.

కాని బ్రాహ్మణవృత్తిని ఎన్నుకున్న వ్యక్తి క్షాంతిని బాగా పాటిస్తాడు. కాసేపు సుఖం లేకపోయినా అతను హాయిగానే ఉంటాడు. కాని సుఖాల్లో మునిగితేలుతున్న వ్యక్తి కాసేపు ఆ సుఖం లేకపోయినా గిలగిలలాడిపోతాడు.

**ఆర్జవమ్** – మనోవాక్కాయ కర్మలను ఒక త్రాటిమీద నడిపించటం. చెప్పేది ఒకటీ, చేసేది ఇంకొకటిగా ఉండకూడదు. అంటే అతనిలో ఇద్దరు మనుష్యులు ఉన్నారనే భావనను కలిగించకూడదు. పదమూడవ అధ్యాయంలో ఇంచుమించుగా ఈ పదాలన్నీ మనం చూశాము. అందులో కొన్ని అమానిత్వమ్, అదంభిత్వమ్, అహింసా, క్షాంతి, ఆర్జవమ్.

**జ్ఞానమ్** – ఇది చాలా ముఖ్యమైన లక్షణం. ఈ సాధకుని వృత్తి ఏమిటి? వైదిక సాంప్రదాయాన్ని ఎన్నుకున్నాడు కాబట్టి, అతను మన శాస్త్రాన్ని తను నేర్చుకుని, నలుగురికీ బోధ చెయ్యటం ద్వారా ప్రచారం చెయ్యాలి. క్షత్రియుడు కూడా శాస్త్రాన్ని నేర్చుకుంటాడు కాని, అంత ఎక్కువ నేర్చుకోనవసరం లేదు. అతనికి శాస్త్రంమీద కొంత అవగాహన ఉండి, ధర్మాధర్మాల విచక్షణా జ్ఞానం ఉంటే చాలు. అతను అధ్యయనం చెయ్యగలడు కాని, అధ్యాపనం చెయ్యలేడు. అంటే బ్రాహ్మణుని లాగా అతను ఇతరులకు బోధించలేడు. వైశ్యునికీ అంతే. క్షత్రియుడు నేర్చుకున్నంత కూడా అవసరం లేదు. అతని జీవితాన్ని ఎలా గడపాలో తెలుసుకుంటే చాలు. కాని బ్రాహ్మణుడు అలా కాదు. అతను జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. అంటే అతను జ్ఞానం పొందాలి.

**విజ్ఞానమ్** – ఈ సాధకుడు రెండు రకాల విద్యల్లో జ్ఞానం పొందాలి. అవి పరావిద్య, అపరావిద్య. అపరావిద్య అంటే లౌకికజ్ఞానం; పరావిద్య అంటే ఆత్మజ్ఞానం. లౌకికజ్ఞానాన్ని జ్ఞానం అనీ, ఆత్మజ్ఞానాన్ని విజ్ఞానం అనీ అంటారు. అందువల్ల అతను జ్ఞానం, విజ్ఞానం రెండూ పొందాలి.

**ఆస్తిక్యమ్** – శాస్త్రంమీద నమ్మకం లేదా శ్రద్ధ ఉండటం. ప్రత్యక్షప్రమాణాన్ని నమ్మినంతగా వేదప్రమాణాన్ని నమ్మాలి. బ్రాహ్మణునికి రెండు చక్షువులు ఉండాలి. అంటే మామూలు చక్షువులతో అంటే ప్రత్యక్షప్రమాణంతో బాహ్యప్రపంచాన్ని చూస్తాడు. పంచేంద్రియాలను ప్రత్యక్ష ప్రమాణం అంటారు. అవి బాహ్యవస్తువులను మాత్రమే చూపగలవు.

ఉదాహరణకు కళ్ళు మూసుకుంటే రంగు, రూపులను చూడలేరు. అలా కళ్ళు మూసుకుని నేను రంగు, రూపులను చూడనంటే నష్టపోయేది ఎవరు? మీరే. వేదం ఆరవ ఇంద్రియం. అది పూర్తిగా కొత్త రంగాన్ని చూపిస్తుంది. ఆ రంగాన్ని ఆధ్యాత్మిక రంగం అంటారు. అటువంటి వేదాన్ని నేను ఉపయోగించను అంటే నష్టపోయేది ఎవరు? మీరే. మామూలు కళ్ళు బాహ్యప్రపంచాన్ని చూపిస్తే, జ్ఞాననేత్రం ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తుంది. బ్రాహ్మణునికి శాస్త్రంమీద శ్రద్ధ ఉంటుంది కాబట్టి, అతన్ని ఆస్తికుడు అంటారు.

మీరు వేదాన్ని ప్రమాణంగా స్వీకరించకపోతే నష్టపోయేది ఎవరు? వేదం ఏమీ నష్టపోదు; ఋషులు ఏమీ నష్టపోరు; భగవంతుడు ఏమీ నష్టపోడు; మీరే అద్భుతమైన జ్ఞానాన్ని నష్టపోతారు. బ్రాహ్మణుడు ముందు తను వేదాన్ని ప్రమాణంగా తీసుకుని, తను ఆస్తికునిగా మారి, తక్కిన మనుష్యులను కూడా ఆస్తికులుగా చెయ్యాలి. అది ఎలా చెయ్యగలడు?

దానికి ఒకటే మార్గం ఉంది. అతని జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలి. అతను ఆదర్శప్రాయంగా మారాలంటే ఏం చెయ్యాలి? వేదాన్ని ప్రమాణంగా తీసుకుని అతని జీవన విధానాన్ని ఎంతగా మార్చుకోవాలంటే, చూసిన వారందరూ ఇతను ఇంత శాంతిభద్రతలతో ఎలా ఉండగలుగుతున్నాడు? ఇంత ఆనందంగా జీవితం ఎలా గడపగలుగుతున్నాడని ఆశ్చర్యపోవాలి. ఎందుకంటే నేటి ఆధునిక యుగంలో మనిషి పరుగుపందెంలో ఎంతగా పాల్గొంటున్నాడంటే, అతను కావాల్సిన సుఖాలు కొనుక్కోగలుగుతున్నాడేమో కాని, శాంతిని కొనుక్కోలేకపోతున్నాడు. కాని బ్రాహ్మణుడు ఇవేమీ లేకుండానే ఆనందంగా ఉంటాడు.

**సురమందిర తరుమూల నివాసః శయ్యా భూతలమజినం వాసః**
**సర్వ పరిగ్రహ భోగత్యాగః కస్య సుఖం న కరోతి విరాగః** – భజగోవిందం

బ్రాహ్మణునికి సుఖాలు లేవు; ఆస్తిపాస్తులు లేవు; రేపనేరోజు ఎలా ఉంటుందో తెలియదు; కాని అతను శాంతి, ఆనందాలకు మారుపేరుగా ఉంటాడు. అదిచూసి సమాజం ఆశ్చర్యపోవాలి. అతని రహస్యం ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలం ఉండాలి.

అప్పుడు బ్రాహ్మణుడు నేను ఈ ఆనందాన్ని ఆస్తికుడు అవటం వల్ల పొందుతున్నాను; రండి మిమ్మల్ని ఆ కొత్త ప్రపంచంలోకి తీసుకువెళతాను. మీక్కూడా నాలాగే శాంతి, భద్రత, ఆనందాలు దొరుకుతాయి అంటాడు. వాటి కోసం బాహ్యంగా పరుగులు తీయకండి, అవి మీలోనే ఉన్నాయని నేర్పిస్తాడు.

**బ్రహ్మకర్మ** – ఇది బ్రాహ్మణవృత్తి, గుణబ్రాహ్మణుడు పైన చెప్పిన గుణాలన్నిటినీ పాటించాలి. మరి అతనికి జీవనాధారం ఏమిటి? అతను పంచే జ్ఞానానికి ప్రతిఫలంగా సమాజం అతన్ని పరిరక్షించుకోవాలి. అతని

అవసరాలన్నీ సమాజమే చూసుకోవాలి. అలా అని అతను సమాజాన్ని ఇంత ఇవ్వండి; ఇది ఇవ్వండని వేధించకూడదు. సమాజం ఏదిస్తే దానితో తృప్తి పడాలి. రుద్రం నేర్పిస్తే ఇంత, పురుషసూక్తం నేర్పిస్తే ఇంత ఇవ్వాలని నిర్భందించకూడదు. అతనికున్న జ్ఞానాన్ని సంతోషంగా పంచుకోవాలి. అతని అవసరాలను సమాజమే చూసుకుంటుంది. ఎందుకంటే అటువంటి జ్ఞానివల్ల సమాజమే బాగుపడుతుంది.

నిజానికి బ్రాహ్మణవృత్తి చాలా శ్రేష్ఠమైన వృత్తి. అది చేపట్టినందుకు గర్వంగా భావించవచ్చు ఎవరైనా. కాని ఇప్పుడు దాన్ని చేపట్టేవారే లేరు. ఇప్పుడు ఉనికి కోల్పోయిన కొన్ని జంతువుల్లా ఈ బ్రాహ్మణవృత్తి కూడా ఉనికిని కోల్పోయే దుస్థితి ఏర్పడుతోంది. ఇలాగే కొనసాగితే, కొన్నాళ్ళయ్యాక పురావస్తు ప్రదర్శనశాలలో ఒక గాజు షోకేసులో బ్రాహ్మణకర్మ ఇలా ఉండేదని చూపించాల్సి రావచ్చు. కాని అలాంటి కర్మను చేపట్టాలంటే మీకు ఇష్టమై రావాలి కాని, ఎవరూ మీమీద బలవంతంగా రుద్దకూడదు దానిని. ఎందుకంటే బ్రాహ్మణుడు గడపాల్సిన సాధారణమైన జీవితాన్ని బలవంతంగా చేపడితే, అది ఆనందాన్ని ఇవ్వదు సరికదా బాధని కలుగజేస్తుంది. అదే వృత్తిని ఇష్టంగా, మనస్ఫూర్తిగా చేపడితే ఆ నిరాడంబర జీవనం ఆనందాన్ని ఇస్తుంది.

**స్వభావజమ్** – అందువల్ల దాన్ని సహజంగా ఇష్టపడాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శమము, దమము, తపస్సు, శౌచము, క్షాంతి, ఆర్జవము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము – ఇవన్నీ **బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు**.

చిన్మయానందస్వామి ఆధ్యాత్మిక శిక్షణను ఇవ్వటానికి ఒక సంస్థను నెలకొల్పినప్పుడు ఈ జీవనవిధానం నేర్పించటానికి దీనిలో ఉత్సాహం ఉన్న యువతను ఆహ్వానించారు. మొత్తం కోర్సు పూర్తిగా ఉచితం; ఎటువంటి రుసుము లేదు; ఏ పన్నెండువేలో అడ్వాన్సుగా కట్టనవసరం లేదు; అసలు సమస్తం ఉచితం. వసతి ఏర్పాట్లు, ఆహారం, దుస్తులు, వైద్యసదుపాయం, ఒకటేమిటి విద్యార్థులకు ఏవి అవసరమైతే అవన్నీ ఉచితం. ఆ ఆధ్యాత్మిక విద్యను బోధించే పుస్తకాలూ ఉచితం; ఆ కోర్సులో శాస్త్రంలో ఉన్న నిధిని వీరికి ఒక క్రమపద్ధతిలో బోధించేవారు.

మొత్తం కోర్సు అంతా అయిపోయాక కూడా, వారు ఇటువంటి జీవనవిధానమే గడపాలని ఎవరినీ నిర్బంధించేవారు కాదు. ఎందుకంటే ఈ జీవనవిధానాన్ని బలవంతంగా ఎవరూ పాటించలేరు. అందువల్ల వారి శిక్షణాకాలం పూర్తి అయ్యాక, ఈ విద్యవల్ల ప్రభావితం అయి, తాము సమాజానికి ఈ విద్యను తమ వంతు సాయంగా పంచిపెడతామంటే, 'చాలా సంతోషం,' అంటారు. లేదు, సమాజంలోకి వెళ్ళి, డబ్బు సంపాదించి, పెళ్ళి చేసుకుంటాను అన్నా కూడా అదే జవాబు, 'చాలా సంతోషం.'

దయానందస్వామీజీ శిష్యులకు ఒకటే చెప్పేవారుట. 'మీరు ఇక్కడ ఆశ్రమంలో ఉండి నేర్చుకుంటున్నన్నాళ్ళూ దీనిమీదే శ్రద్ధ పెట్టండి. ఇంక వేరే ఆలోచన లేకుండా పూర్తి ఏకాగ్రతతో నేర్చుకోండి. మీ భవిష్యత్తు ఎలా ఉంటుందో అని ఇప్పుడు మీరు ఆలోచించకండి. ఈ కోర్సు పూర్తయ్యాక మీకు ఉద్యోగం చెయ్యాలని ఉంటే, నేను ఉద్యోగం ఇప్పిస్తాను; పెళ్ళి చేసుకోవాలని ఉంటే, నేను సంబంధం కుదురుస్తాను. కాని ఇప్పుడు మాత్రం అవేమీ ఆలోచించకండి. ఇప్పుడు చదువే మీ ధ్యేయంగా ఉండాలి.'

కోర్సు అంతా అయ్యాక, ఎవరైనా సన్న్యాసం స్వీకరిస్తానంటే కూడా వెంటనే వారికి సన్న్యాసదీక్ష ఇచ్చేవారు కాదు. ముందు కొన్నాళ్ళు వారికి పసుపురంగు దుస్తులు ఇచ్చి, దానితో సన్న్యాసజీవనం గడపమనేవారు. ఇప్పటి ఉద్యోగాల పరిభాషలో అప్రెంటిస్‌గా అన్నమాట. వారికి ఆ శిక్షణాకాలంలో కూడా ఆ శ్రద్ధ నిలబడితే, అప్పుడు వారికి సన్న్యాసదీక్షను ఇచ్చేవారు. సన్న్యాసాన్ని ప్రేమిస్తే చాలా అద్భుతమైన జీవనం అది; కాని మనస్సు సిద్ధం కాకుండా తొందరపడి స్వీకరిస్తే మాత్రం అది నరకమే. ఎందుకంటే సన్న్యాసజీవనం వన్ వే ట్రాఫిక్. దానిలోకి వెళ్ళే హక్కు ఉంది కాని, తిరిగివచ్చే హక్కు లేదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నామంటే, బ్రాహ్మణవృత్తిని మనస్ఫూర్తిగా, దానిమీద ప్రేమతో ఎన్నుకోవాలి. అప్పుడు అది ఇచ్చే ఆనందం అంతా ఇంతా కాదు. అసలు ఆ ఆనందమే వేరు.

శ్లో. 43 **శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।**
**దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥**
శౌర్యమ్, తేజః, ధృతిః, దాక్ష్యమ్, యుద్ధే, చ, అపి, అపలాయనమ్,
దానమ్, ఈశ్వరభావః, చ, క్షాత్రమ్, కర్మ, స్వభావజమ్ ॥

| | | | |
|---|---|---|---|
| శౌర్యమ్ | = శౌర్యము | అపలాయనమ్ | = వెన్ను చూపకుండుట |
| తేజః | = తేజస్సు | దానమ్, చ | = దానములను చేయుట ఇంకా |
| ధృతిః | = ధైర్యము | ఈశ్వరభావః | = స్వామిభావము మొదలగువన్నియును |
| దాక్ష్యమ్, చ | = దక్షత ఇంకా | క్షాత్రమ్, స్వభావజమ్, కర్మ | = క్షత్రియుల స్వాభావిక కర్మలు |
| యుద్ధే, అపి | = యుద్ధమందును | | |

**శౌర్యమ్, తేజః, ధృతి, దాక్ష్యమ్, యుద్ధే అపి చ అపలాయనమ్,**
**దానమ్, ఈశ్వర-భావః చ (ఇతి) స్వభావజమ్ క్షాత్రమ్ కర్మ (అస్తి) ।**

తా: శౌర్యము, తేజస్సు, ధైర్యము, దక్షత ఇంకా యుద్ధమందును వెన్ను చూపకుండుట, దానములను చేయుట ఇంకా స్వామిభావము మొదలగువన్నియును క్షత్రియుల స్వాభావిక కర్మలు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ క్షత్రియ స్వాభావిక కర్మను నిర్వచిస్తున్నాడు. కృష్ణపరమాత్మకు తెలుసు అందరూ బ్రాహ్మణకర్మను ఇష్టపడరని. **లోకో భిన్నరుచిః** అంటారు. అందువల్ల బ్రాహ్మణకర్మ నచ్చకపోతే, క్షత్రియకర్మను ఎన్నుకోమంటున్నాడు. అది ఎలా ఉంటుంది?

**శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యమ్** – క్షత్రియుడు అంటే రాజు, పరిపాలకుడు, సైనికుడు. అతను సమాజంలో చట్టాన్ని, ధర్మాన్ని పరిరక్షించాలి. ధర్మాన్ని రక్షించి, అధర్మాన్ని పారద్రోలాలి. ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నవారితో అవసరమైతే యుద్ధం చెయ్యాలి. అలాంటప్పుడు అతనికి సహజంగానే ధైర్యసాహసాలు ఉండాలి. బొద్దింకను చూసి ఆమడదూరం పారిపోయే వ్యక్తి ఈ వృత్తికి ఎలా రాగలడు?

**శౌర్యమ్** – శౌర్యం అంటే ధైర్యం, వీరత్వం.

**తేజః –** శక్తి. శత్రువుయొక్క శక్తిని చూసి ఇతను నిర్వీర్యం అయిపోకూడదు. శత్రువును ఎదుర్కొనే బలం ఉండాలి.

**ధృతిః –** ధృతిః అంటే దృఢనిశ్చయం.

**దాక్ష్యమ్ –** దక్షత. వ్యవహార దక్షత ఉండాలి. కొన్ని సందర్భాలలో క్షణాలమీద నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాలలో తీరిగ్గా ఆలోచించి నిర్ణయం తీసుకోవచ్చు కాని పరిపాలన చేసే వ్యక్తికి అది ప్రతిసారీ కుదరకపోవచ్చు. శత్రురాజు చెప్పాపెట్టకుండా యుద్ధానికి వస్తే, నెల తర్వాత ఆలోచించి నిర్ణయం తీసుకుంటానంటే, నెలదాకా ఈ రాజే ఉండడు. ఇంక నిర్ణయం తీసుకునే ప్రసక్తి ఎక్కడ ఉంది? అందువల్ల రాజు ఎప్పుడూ అప్రమత్తతతో ఉండాలి; క్షణాలమీద నిర్ణయాలు తీసుకోవాలి. ఎప్పుడు ఏమూలనుంచి ఏ ప్రమాదం పొంచివుంటుందో తెలియదు. అది మీద పడితే, తప్పించుకునే మార్గం తెలియాలి. రాజు అంటే ఇప్పటి పెద్ద సంస్థల అధినేతలు కూడా వస్తారు. వారి సంస్థలు ప్రపంచం నలుమూలలా వ్యాపించివుంటాయి. ప్రపంచదేశాలలో ఏమూల ఏ మార్పు వచ్చినా, అది వీరి సంస్థకు ఇబ్బంది కలుగజేయవచ్చు. అటువంటప్పుడు నిముషాలమీద నిర్ణయాలు అమలుచేయాల్సి ఉంటుంది. అటువంటి మనస్సును **ప్రత్యుత్పన్న మతి** అంటారు. ఈ ప్రత్యుత్పన్న మతిని దాక్ష్యం అంటారు.

**యుద్ధే చాప్యపలాయనమ్** – యుద్ధంనుంచి పారిపోకూడదు. యుద్ధభూమిలోకి అడుగుపెట్టేముందే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి కాని, ఒకసారి అడుగుపెట్టాక వెన్ను చూపకూడదు. క్షత్రియధర్మం – విజయమో, వీరస్వర్గమో! అందువల్ల శరీరంలో ప్రాణం ఉన్నంతవరకూ పోరాడాలి; ఆ ప్రయత్నంలో మరణం ఎదురైనా పారిపోకూడదు.

కృష్ణపరమాత్మ ప్రత్యేకించి ఈ పదాన్ని వాడాడు. ఎందుకలా అన్నాడో సందర్భాన్ని మర్చిపోకూడదు. ఇక్కడ సందర్భం ఏమిటి? మహాభారతయుద్ధంలోకి అడుగుపెట్టి ఉన్నారు కృష్ణార్జునులు. తీరా యుద్ధం చెయ్యాల్సి వచ్చేసరికి, అర్జునుడు యుద్ధం చెయ్యటం అధర్మం అన్నాడు. అప్పుడు ఈ అద్భుతమైన మోక్షశాస్త్రం ఆవిర్భవించింది. యుద్ధభూమిలో బోధ చేస్తున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల అర్జునునికి చురకలు వేస్తున్నాడు. యుద్ధభూమిలో వెన్నుచూపటం క్షత్రియధర్మం కాదు. అందువల్ల **యుద్ధే చ అపి అపలాయనమ్**.

**దానమ్** – క్షత్రియుడు లేదా రాజు అందరికీ దానధర్మాలు చెయ్యాలి. పూర్వకాలంలో రాజులే అందరినీ పోషించేవారు. కళాకారులను, శాస్త్రవేత్తలను కూడా వారే పోషించేవారు. అలాగే బ్రాహ్మణులకు సంపాదన ఉండదని చూశాము. రాజే వారికి రాజపోషకులు అవ్వాలి. బ్రాహ్మణుడు గురుకులం నడుపుతుంటే దానికి కావాల్సిన అన్ని వసతులనూ అమర్చిపెట్టాలి. ఇప్పటికీ ఆ పద్ధతి అమలులో ఉంది. ప్రభుత్వం అనేక రకాల గ్రాంటులను ఇస్తూ ఉంటుంది. అలా క్షత్రియుడు విజ్ఞానశాస్త్రం, లలితకళలు, సాంప్రదాయం – అన్నింటినీ పోషించాలి కాబట్టి దానం చేసే బుద్ధి ఉండాలి.

**ఈశ్వరభావః చ** – నాయకత్వం కూడా ఉండాలి. అతను ముందు నిలుచుని, అందరినీ నడిపించాలి. అతను ఎక్కడో ఒకమూల కుర్చీలో కూర్చోకూడదు; ఎటువంటి పరిస్థితి ఎదురైనా కూడా అతని అయస్కాంతపు వ్యక్తిత్వంతో

అందరినీ తనవైపు తిప్పుకోగలగాలి. అందువల్ల రాజు శారీరకంగా కూడా దృఢంగా ఉండాలి. దానికి అవసరమైన పౌష్ఠిక ఆహారం తీసుకోవాలి. కేవలం కందమూలాలు తింటే ములక్కాడలా ఎండిపోతాడు. శత్రువు అనే గాలి వీస్తే చాలు పడిపోతాడు. అలా కాకుండా ఉండాలంటే అతనికి కండలు తిరిగిన, బలమైన శరీరం ఉండాలి.

బ్రాహ్మణునికి ఇది అవసరం లేదు. అతను సాత్త్విక జీవనం గడుపుతాడు; కాని క్షత్రియుడు రాజసిక జీవనం గడుపుతాడు కాబట్టి అతని శరీరం కూడా బలంగా ఉండాలి. అతన్ని చూడగానే నాయకుడు అనిపించాలి. అందువల్ల ఈశ్వరభావాన్ని ప్రదర్శించాలి.

**క్షాత్రం కర్మ స్వభావజమ్** – ఇటువంటి కర్మలు క్షత్రియుల స్వాభావిక కర్మలు.

శౌర్యము, తేజస్సు, ధృతి, దక్షత, యుద్ధంలో వెన్నుచూపక పోవటం, దానగుణం, నాయకత్వపు లక్షణం – ఇవన్నీ **క్షత్రియుల స్వాభావిక కర్మలు**.

శ్లో. 44 **కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మస్వభావజమ్ ।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥**
కృషిగౌరక్ష్యవాణిజ్యమ్, వైశ్యకర్మస్వభావజమ్,
పరిచర్యాత్మకమ్, కర్మ, శూద్రస్య, అపి, స్వభావజమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| కృషిగౌరక్ష్యవాణిజ్యమ్ | = | వ్యవసాయము, గోపాలనము, క్రయవిక్రయముల యందు సత్యవ్యవహారము మొదలగునవి | అపి | = | ఇంకా అలాగే |
| | | | పరిచర్యాత్మకమ్ | = | అన్ని వర్ణములవారిని సేవించుట |
| వైశ్యకర్మస్వభావజమ్ | = | వైశ్యులకు స్వాభావికములైన కర్మలు | శూద్రస్య | = | శూద్రులకు |
| | | | స్వభావజమ్, కర్మ | = | స్వాభావికములైన కర్మలు |

**కృషి–గౌరక్ష్య–వాణిజ్యమ్ స్వభావజమ్ వైశ్య–కర్మ (అస్తి)**
**అపి (చ) శూద్రస్య పరిచర్యా–ఆత్మకమ్ కర్మ స్వభావజమ్ (అస్తి) ।**

తా: వ్యవసాయము, గోపాలనము, క్రయవిక్రయముల యందు సత్యవ్యవహారము మొదలగునవి యన్నియును వైశ్యులకు స్వాభావికములైన కర్మలు, ఇంకా అలాగే అన్ని వర్ణములవారిని సేవించుట శూద్రులకు స్వాభావికములైన కర్మలు.

ఈ శ్లోకంలో వైశ్యుల స్వాభావిక కర్మలను, శూద్రుల స్వాభావిక కర్మలను కూడా నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. వైశ్యుల వృత్తి వ్యాపారం చెయ్యటం. ఫ్యాక్టరీ విషయం తీసుకుంటే అన్ని వస్తువులూ ఒకచోట దొరకవు; పొలం విషయం తీసుకుంటే అన్ని పంటలూ ఒకచోట పండవు. అనేకచోట్లనుంచి ఒకచోటికి తెచ్చి, వాటిని అమ్మాలి. ఆ పనిని వైశ్యకర్మ అంటారు.

**కృషి** – కృషి అంటే వ్యవసాయం; దీనిలో పరిశ్రమలను కూడా కలుపుకోవచ్చు. ఎందుకంటే రెండూ వస్తువులను ఉత్పత్తి చేస్తాయి.

**గౌరక్ష్య** – గోవులను పెంచటం. ఆ రోజుల్లో గోవులు ఆర్థికవ్యవస్థలో ముఖ్యపాత్రను వహించేవి. ఇప్పటికీ చాలా గోశాలలు చూస్తూ ఉంటాము.

**వాణిజ్యమ్** – వ్యాపారం. ఇవన్నీ వైశ్యకర్మలు. ఇవి దేశంయొక్క ఆర్థిక వ్యవస్థను నిలబెడతాయి. క్షత్రియకర్మ దేశాన్ని రక్షించటం; వైశ్యకర్మ దేశంయొక్క ఆర్థికవ్యవస్థను పైకి తీసుకురావటం. దేశానికి ఏ కర్మ ముఖ్యం? అన్నీ ముఖ్యమే. ఆర్థికవ్యవస్థ బాగుండి, దేశానికి రక్షణ లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. మనం అహింసను, శాంతిని నమ్మినా, పొరుగురాజ్యాలు నమ్ముతాయన్న నమ్మకం లేదు. అందువల్ల మనంతట మనం ఆయుధాలు ఉపయోగించి ఎదుటిరాజ్యానికి దండెత్తి వెళ్ళకపోయినా, వారు మనమీదకు యుద్ధానికి వస్తే, మనం చేతులు ముడుచుకు కూర్చోకూడదు కదా. అందువల్ల సుశిక్షుతులైన సైనికులు సిద్ధంగా ఉండాలి. అలాగని సైనికులే ఉండి, ఆర్థికపరిస్థితి బాగా లేకపోయినా లాభం లేదు.

అందువల్ల ఏ వృత్తి విలువ దానిది. పైగా ప్రతి వృత్తిలో కూడా ప్రజ్ఞాపాటవాలు చూపించాల్సిన పరిస్థితులు వస్తాయి; విచక్షణాశక్తి చూపించాల్సి ఉంటుంది; నాయకత్వపు లక్షణాలు ఉండాలి.

**వైశ్యకర్మ స్వభావజమ్** – ఇటువంటి కర్మలను వైశ్యుల స్వాభావిక కర్మలు అంటారు.

వ్యవసాయం, గోశాల, వాణిజ్య వ్యవహారాలు చూడటం – ఇవన్నీ **వైశ్యుల స్వాభావిక కర్మలు**.

నాయకత్వపు లక్షణాలు లేని కొందరు మనుష్యులు ఉంటారు. వారు ఇంకొకరిని ముందుకు నడపలేరు. వారికే ఎవరైనా దారిచూపితే, వారి వెనక నడుస్తారు. అటువంటి కర్మను శూద్రకర్మ అంటారు. వీరికి ప్రజ్ఞాపాటవాలు ఉండవు. ఇక్కడ జాతినిబట్టి వర్ణాల గురించి మాట్లాడటం లేదు. వారి వృత్తినిబట్టి వర్ణిస్తున్నాడు.

ఈ శూద్రులు పై ముగ్గురికీ సేవ చేస్తారు. బ్రాహ్మణుడు ఒక పెద్దయాగం తలపెడితే దానికి కావాల్సిన పనులు చేసిపెడతాడు; అలాగే క్షత్రియుడు కాని, వైశ్యుడు కాని చేసే పనులకు సాయం వెళతాడు.

**పరిచర్యాత్మకమ్** – పరిచర్యలు చేస్తాడు. ఇందులో అతను నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.

నిర్ణయాలు తీసుకోగలగటం అంత తేలిక కాదు. కొంతమంది చాలా చిన్న విషయాలలో కూడా నిర్ణయం తీసుకోలేరు. ఇవాళ ఏ దుస్తులు ధరించాలో, ఏ వస్తువు కొనాలో కూడా నిర్ణయించుకోలేరు. ఇంక అటువంటివారు నాయకులు ఎలా కాగలరు? అందువల్ల వారు తక్కిన మూడు వర్ణాల వారికీ పరిచర్యలు చేస్తారు.

**కర్మ శూద్రస్యాపి స్వభావజమ్** – ఇటువంటి కర్మలు శూద్రుల స్వాభావిక కర్మలు.

అన్ని వర్ణాలవారికి పరిచర్యలు చెయ్యటం. దీన్ని **శూద్రుల స్వాభావిక కర్మ** అంటారు.

(ఈ స్వాభావికకర్మలను ఈ అధ్యాయము చివరలో ఒక పట్టికలో చూడవచ్చు.)

ఒక విషయం గుర్తుంచుకోవాలి. నాలుగు వృత్తులూ సమాజమనే ఒక వ్యవస్థకు నాలుగు స్తంభాలు. దేని ప్రాముఖ్యత దానిదే; దేని విలువ దానిదే. అందువల్ల దేన్నీ కించపరచకూడదు.

కర్మయోగ వివరణలో భాగంగా కృష్ణపరమాత్మ స్వధర్మం గురించి నొక్కివక్కాణిస్తున్నాడు. అందులో మీరు చేసే ఏ పని అయినా, ఏ ఉద్యోగ, వ్యాపార విషయాలైనా – ఈశ్వరార్పణ భావనతో చెయ్యాలి. మనకు సాధారణంగా ఈశ్వరుణ్ణి ఆలయంలోనో, మన పూజాగదిలోనో ప్రార్థించటం, షోడశోపచారాలు చెయ్యటం తెలుసు. కాని కృష్ణపరమాత్మ మొత్తం జీవితాన్ని, జీవితంలో చేసే ప్రతి చిన్న కర్మని కూడా భగవంతునికి నివేదన చెయ్యమంటున్నాడు. దీన్నే కర్మయోగం అంటారు. ఈ విషయం స్పష్టంగా తొమ్మిదవ అధ్యాయంలో పేర్కొన్నాడు.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥** – 9.27

అంతకుముందే, మూడవ అధ్యాయంలోనే దాని గురించి గట్టిగా చెప్పాడు.

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

ఆ విధంగా అనేక సందర్భాలలో చెప్పిన కర్మయోగ సూత్రాలనే ఇక్కడ మళ్ళీ సారాంశం రూపంలో చెబుతున్నాడు. అందులో భాగంగా నాలుగు రకాల వృత్తులను గురించి చెప్పాడు.

**బ్రాహ్మణకర్మ** – బ్రాహ్మణకర్మలో శాస్త్రాన్ని బోధించటం ఉంటుంది. మన సాంప్రదాయంలో ఏ బోధ అయితే శిష్యునిలో అంతర్గతంగా మార్పు తీసుకువస్తుందో, దాన్నే బోధ అంటారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలు నేర్చుకోవాలి నిజమే, దానివల్ల విద్యార్థి కొన్ని రంగాల్లో ఆరితేరతాడు. అది అతని జీవనానికి తోడ్పడుతుంది. కాని శాస్త్రం ఆ ప్రజ్ఞాపాటవాలను ఆగంతుకఫలం అంటుంది. అసలు ఫలం అతని ప్రవర్తనలో మార్పురావాలి; దృక్పథంలో మార్పురావాలి. మనిషి మనిషిగా ఎదగాలి. ఈ ఉన్నతమైన మార్పు విద్య తీసుకురాకపోతే, అతను తనకున్న విద్యను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. తన ప్రజ్ఞను సమాజాన్ని మోసం చెయ్యటానికో, తన స్వార్థానికి వాడుకోవటానికో ఉపయోగించే ప్రమాదం ఉంది.

ఏరంగంలో ఒక వ్యక్తి నిష్ణాతుడు అయినా, అతనిలో ధార్మిక విలువలు లేకపోతే, అతనిలో సత్ప్రవర్తన లేకపోతే, ఆ రంగానికి చీడపురుగుగా మారతాడు. అదే సత్ప్రవర్తన అలవడితే, తన ప్రజ్ఞను సమాజశ్రేయస్సు కోసం వాడతాడు. అందువల్ల ముందు ధర్మాన్ని, విలువలను నేర్చుకోవాలి. దాని తర్వాత ఏ రంగంలో ఆరితేరినా మంచిదే.

గురువుయొక్క బోధవల్ల ఒక విద్యార్థియొక్క నైతిక విలువలు, ఆధ్యాత్మికజీవనం ఆధారపడివున్నాయి అంటే గురువుయొక్క గురుతమ బాధ్యత ఎంత ఉందో ఊహించుకోండి! గురువులను బ్రాహ్మణులు అంటారు. శాస్త్రానికి ఇచ్చినంత గౌరవం ఇస్తారు వారికి. ఎందుకంటే శాస్త్రం బోధించిన ఆధ్యాత్మిక, ధార్మిక విషయాలను గురువు

బోధించి, వారిని ఆదర్శపురుషులుగా తీర్చిదిద్దుతాడు. అటువంటి గురువులను గౌరవించే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుంది.

నిజానికి, ఒక సమాజం యొక్క అంతర్గత ఆరోగ్యాన్ని వారు గురువులకు ఇచ్చే గౌరవాన్నిబట్టి నిర్ణయించవచ్చు. వైదిక సాంప్రదాయంలో బ్రాహ్మణులు చాలా గౌరవ మర్యాదలు పొందేవారు. మన నిత్యపూజల్లో కూడా వారి క్షేమం కోరే ప్రార్థనలు ఉన్నాయి.

**గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యమ్**

బ్రాహ్మణులకు అంత గౌరవం ఇచ్చినా, ఎవరి పాత్ర వారికి ఉంటుంది. కృష్ణపరమాత్మ నాలుగు వర్ణాలూ ముఖ్యమేనని చెబుతున్నాడు. మనిషికున్న అంగాలన్నీ ఎలా సమానమో, అలా సమాజానికి ఈ నలుగురూ నాలుగు స్తంభాలు. ఇప్పుడు టూకీగా ఈ నాలుగు వర్ణాల గురించి ఒకసారి చూద్దాము.

**స్వాభావిక కర్మలు**

| **శ్లోకం** | **వర్ణము** | **వివరణ** |
|---|---|---|
| 42 | బ్రాహ్మణులు | శమము, దమము, తపస్సు, శౌచము, క్షాంతి, ఆర్జవము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము |
| 43 | క్షత్రియులు | శౌర్యము, తేజస్సు, ధృతి, దక్షత, యుద్ధంలో వెన్ను చూపకపోవటం, దానగుణం, నాయకత్వపు లక్షణం |
| 44 | వైశ్యులు | వ్యవసాయము, గోశాల, వాణిజ్య వ్యవహారాలు చూడటం |
| 44 | శూద్రులు | అన్ని వర్ణాల వారికి పరిచర్యలు చెయ్యటం |

అందువల్ల మీరు ఏ వృత్తిని ఎన్నుకున్నా, అది పవిత్రమైనదే. ఎవరి వృత్తితోనూ పోల్చుకుని మిమ్మల్ని మీరు కించపరచుకోనవసరం లేదు. మీ వృత్తినే దైవపూజగా మలుచుకోవాలి. వర్క్ ఈజ్ వర్షిప్ అంటారు. అలా చేస్తే మీపూజ ఏ అరగంటకో పరిమితమవదు; మీరు పనిచేసే అన్ని గంటలూ నిరంతర పూజలోకి వస్తాయి. మీరు అదనంగా పనిచేస్తే అదనంగా పూజ చేస్తున్నట్టు అన్నమాట.

మీరు చేసే వృత్తిని పూజగా మలుచుకోవాలంటే, మీ దృక్పథంలో మార్పు రావాలి. ఏమిటా మార్పు? ఓ అర్జునా, అది కూడా నేనే చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ జగద్గురువు. అందువల్ల శిష్యునికి ఏది ఎలా బోధించాలో ఆ పరమాత్మకు బాగా తెలుసు. ఇప్పుడు రాబోయే శ్లోకాలన్నీ అద్భుతమైన శ్లోకాలు. దయానందస్వామీజీ వీటి గురించి అనర్గళంగా చెప్పుకుంటూ పోతారు.

శ్లో. 45 **స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥**
స్వే, స్వే, కర్మణి, అభిరతః, సంసిద్ధిమ్, లభతే, నరః,
స్వకర్మనిరతః, సిద్ధిమ్, యథా, విందతి, తత్, శృణు ॥

| | | | |
|---|---|---|---|
| స్వే, స్వే | = తమ తమ | స్వకర్మనిరతః | = తన స్వాభావిక కర్మయందు నిరతుడైనవాడు |
| కర్మణి | = కర్మలందు | యథా | = ఎలా |
| అభిరతః | = తత్పరుడైన | సిద్ధిమ్ | = పరమసిద్ధిని |
| నరః | = మానవుడు | విందతి | = పొందునో |
| సంసిద్ధిమ్ | = భగవత్ప్రాప్తిరూప సిద్ధిని | తత్ | = ఆ విధులను |
| లభతే | = పొందును | శృణు | = వినుము |

**స్వే స్వే కర్మణి అభిరతః నరః సంసిద్ధిమ్ లభతే**
**స్వకర్మ–నిరతః (నరః) యథా సిద్ధిమ్ విన్దతి, తత్ శృణు ।**

తా: తమ తమ కర్మలయందు తత్పరుడైన మానవుడు భగవత్ప్రాప్తిరూప సిద్ధిని పొందును. తన స్వాభావిక కర్మయందు నిరతుడైనవాడు ఎలా పరమసిద్ధిని పొందునో ఆ విధులను వినుము.

కర్మను కర్మయోగంగా మలుచుకోవటానికి, మీరు ఉన్న వృత్తిని మార్చుకోనవసరం లేదు. ముందుగా ఇది స్పష్టం చేస్తున్నాడు కృష్ణపరమాత్మ. మీరు ఏ వృత్తిలో ఉన్నా, మీరు వృత్తి మారనవసరం లేదు; మీ దృక్పథం మార్చుకుంటే చాలు అంటున్నాడు.

**స్వే స్వే కర్మణ్యభిరతః** – మీరున్న వృత్తిలోనే మీరు కొనసాగండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మాటిమాటికీ ఉద్యోగం మారాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఒకేచోట స్థిరంగా ఉంటే, అప్పుడు ఆ పనిలో శ్రేష్ఠులు అవుతారు. అందువల్ల మీ స్వభావానికి ఎటువంటి వృత్తి సరిపోతుందో, ముందుగానే, జాగ్రత్తగా బేరీజు వేసుకోండి. ఆ నిర్ణయం తీసుకోవటానికి కొంత సమయం వృథా అయినా ఫర్వాలేదు; కాని ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దానికి కట్టుబడి ఉండండి.

సమాజం మిమ్మల్ని ఏమన్నా పట్టించుకోకండి. సమాజం దృక్పథం వేరే ఉంటుంది. సమాజం ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క రకమైన వృత్తిని కొనియాడుతుంది. ఏ వృత్తిని మెచ్చుకుంటే, ఆ వృత్తిలో ఉన్న పెళ్ళికొడుకులకు గిరాకీ పెరుగుతుంది. కాని దీన్ని నమ్ముకుని లాభం లేదు. సమాజం మళ్ళీ కొన్నాళ్ళకు ఇంకో వృత్తిని మెచ్చుకుంటుంది. ఈ మూన్నాళ్ళ ముచ్చటను చూసి, మీరు ముచ్చటపడి లాభం లేదు. మీ వృత్తిని మీ స్వభావాన్ని బట్టో, మీ జాతినిబట్టో ఎన్నుకోండి. దాని తర్వాత అందులో స్థిరంగా నిలబడండి. ఆ వృత్తిలో రాణించటమే మీ ధ్యేయంగా పెట్టుకోండి.

అందువల్ల స్వే స్వే కర్మణి అంటే మీరు ఎన్నుకున్న రంగంలో; అభిరతః అంటే అంకితభావంతో పనిచెయ్యండి. మీరు చేసే పనిలో నాణ్యతను పెంచే మార్గాలను అన్వేషించండి. ఒకవేళ మీరు విద్యను బోధించే రంగంలో ఉంటే, మీరు నేర్పే విద్యను వీలున్నంత లోతుగా అభ్యసించండి. మీరు నేర్పుతున్నదానికన్నా పదింతలు ఎక్కువగా మీకు తెలియాలి. అది అథమపక్షం. ఇంకా వందలు, వేల రెట్లు మీరు బోధ చేసే విషయంలో మీ పరిజ్ఞానం ఉంటే, దాన్ని మించిన అద్భుతం మరొకటి లేదు. మీరు ఆ రంగంలోనే శ్రేష్ఠులు అవుతారు.

అంతేకాదు, మీరు గురువైనా, నాయకుడైనా, సంస్థ అధిపతి అయినా, మీకు కావాల్సిన ముఖ్యమైన లక్షణం– మాట్లాడే చాకచక్యం. ఇప్పుడు **కమ్యూనికేషన్ గ్యాప్** అనేమాట తరచు వినిపిస్తుంటుంది. మీరు చెప్పేది ఒకటీ, వారు అర్థం చేసుకునేది ఇంకొకటీ అవుతుంది ఒక్కోసారి. అందువల్ల మీరు చెప్పేది స్పష్టంగా, ఏ మాత్రం సందేహం లేకుండా, ఎదుటివారికి, ముఖ్యంగా మీకింద ఉన్నవారికి – ఎలా సమాచారాన్ని సమర్థవంతంగా అందజేయాలనే విషయంమీద మీరు పరిశోధనలు చెయ్యవచ్చు.

ఇంత లోతుగా వెళ్ళాలంటే, ఆ పనిని మీరు మనసా, వాచా చెయ్యాలి. అభిరతః అంటే అదీ అర్థం. రమ్ అంటే రమించటం; అభిరం అంటే మనసా, వాచా రమించటం.

**సంసిద్ధిం లభతే నరః** – సంసిద్ధిం అంటే చిత్తశుద్ధి. మీరు మీ పనిమీద మీ దృక్పథాన్ని మార్చుకుంటే, మీరు చిత్తశుద్ధిని పొందుతారు; ఆధ్యాత్మికంగా నెమ్మదిగా ఎదుగుతారు. పూర్తిగా లౌకికమైన పనిని కూడా సరిగ్గా చేస్తే, అది మీరు ఆధ్యాత్మికంగా ఎదగటానికి తోడ్పడుతుంది. అంటే మీకు చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. దీన్నే సాంకేతికంగా చెప్పాలంటే సాధనచతుష్టయ సంపత్తిని పెంపొందిస్తుంది. దానివల్ల మీకు జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. దానివల్ల మీకు జ్ఞానయోగంమీద శ్రద్ధ ఏర్పడుతుంది. ఇవన్నీ జరిగితే మీరు కర్మయోగిగా విజయం సాధించినట్టు అర్థం. అది ఎలా సాధించాలి?

**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు** – రాబోయే శ్లోకాల్లో కర్మ ఎలా చిత్తశుద్ధిని కలుగజేస్తుందో వివరిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. లౌకిక కర్మను ఎలా కర్మయోగంగా మలుచుకోవచ్చో రాబోయే శ్లోకంలో వర్ణించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

## కర్మయోగి ఎవరు? ప్రత్యేక విశ్లేషణ

మీ వృత్తిని మీరు పూజగా మలుచుకోవాలటే, మూడు విషయాల్లో మీ దృక్పథాన్ని మార్చుకోవాలి. ఈ మూడు విషయాల్లోనూ మీరు చాలా ఆరోగ్యకరమైన దృక్పథం పెంచుకోవాలి. అవి –

ఎ) **కర్మ** – మీరు చేసే పనులమీద మీ దృక్పథం ఎలా ఉండాలి?

బి) **కర్మఫలం** – మీరు చేసే పనులకు వచ్చే ఫలంమీద మీ దృక్పథం ఎలా ఉండాలి? మీరు ఏ పని చేసినా దానికి ఫలం ఉంటుంది. అది విజయాన్ని చేకూర్చవచ్చు; లేదా ఓటమిని రుచి చూపించవచ్చు. మీ చుట్టూ ఉన్నవారు మిమ్మల్ని మెచ్చుకోవచ్చు, మిమ్మల్ని విమర్శించవచ్చు; ఇతరులు మీరు చేసిన పనిని గుర్తించవచ్చు, గుర్తించకపోవచ్చు; మీవల్ల సహాయం పొందినవారు మీకు కృతజ్ఞత చూపవచ్చు, కృతఘ్నులై ఉండవచ్చు; మీరు కష్టపడి పని చేస్తే, ప్రమోషన్ ఇంకొకరికి దక్కవచ్చు. పని ఒకరిదీ, ఫలితం ఇంకొకరిదీ అంటారు. అలా మీరు ఆశించిన ఫలం వచ్చినా, రాకపోయినా మీ దృక్పథం ఎలా ఉండాలి?

సి) **కర్మఫలదాత** – కర్మఫలదాతైన ఈశ్వరునిమీద మీ దృక్పథం ఎలా ఉండాలి? మీరు చేసిన ప్రతి పనికీ తగ్గ ఫలాన్ని నిర్ణయించేది ఈశ్వరుడు, సమష్టి న్యాయవాది. ఈశ్వరునికి కర్మసిద్ధాంతం బాగా తెలుసు. ఈశ్వరుడు

సర్వజ్ఞుడు. అందువల్ల మీకు ఏ ఫలాన్ని ఇవ్వాలో ఆయనకు తెలుసు. అది మీరు ఆశించిన ఫలమే అవ్వాలనే నియమం లేదు. మీరు ఆశించిన ఫలమే మీకు దక్కటం అనేది చాలా అరుదుగా జరగవచ్చు. ఎక్కువగా మీరు ఆశించినదానికీ, వచ్చిన ఫలానికీ మధ్య పెద్ద అగాధమే ఉండవచ్చు. కాని అది నిర్ణయించేది కర్మఫలదాత అయిన ఈశ్వరుడు. ఈశ్వరునిమీద మీ దృక్పథం ఎలా ఉండాలి?

ఆ విధంగా మీ దృక్పథాన్ని సరిచేసుకోవాల్సిన మూడు అంశాలు – కర్మ, కర్మఫలం, కర్మఫలదాత. మీరు చేసే వృత్తిని పూజగా మలుచుకోవాలనుకుంటే, ఈ మూడింటిమీద మీరు ఆరోగ్యకరమైన దృక్పథాన్ని అలవరచుకోవాలి. ఇప్పుడు వాటినెలా మార్చుకోవాలో వివరంగా చూద్దాము.

ఎ) **కర్మ** – మీరు చేసిన కర్మ భగవంతునికి అర్పించబడుతుందనే విషయాన్ని పదేపదే గుర్తు తెచ్చుకోండి. మీకు ఇష్టమున్నా, లేకపోయినా, మీరు చేసిన ప్రతి ఒక్క కర్మ కూడా భగవంతుని చేతుల్లోకి వెళుతుంది. ఎందుకంటే మీరు చేసిన కర్మకు తగ్గ ఫలం ఆయనే ఇవ్వాలి. ఎలాగూ భగవంతుని చేతుల్లోకి వెళ్ళితీరే కర్మను మీరు ఎందుకు అర్పణ భావనతో చెయ్యికూడదు? ఎప్పుడైతే మీరు కర్మను భగవంతునికి అర్పణ చెయ్యాలనుకున్నారో, అప్పుడే కర్మమీద మీ దృష్టి మారుతుంది.

ముందుగా, మీరు చేసే కర్మను మీరు ఆనందించటం నేర్చుకుంటారు. ధృతి, ఉత్సాహం అవే వస్తాయి. ఎవరికోసమో చేస్తున్నట్టు చెయ్యకండి. ఎందుకొచ్చిన ఖర్మరా బాబూ ఈ కర్మ అనుకోకండి. ఏం చేసినా చిరునవ్వుతో చెయ్యండి. అలా ముందు కర్మను ప్రేమించండి.

తర్వాత మీరు చేసే కర్మను భగవంతునికి అర్పిస్తారు కాబట్టి, మీరు చేసే కర్మలో నాణ్యతను పెంచండి. మీరు చేసే పని మీ పై అధికారికోసమో, ప్రమోషన్‌కోసమో, అవార్డ్ రావాలనో చెయ్యకండి. అవి ఆగంతుకంగా వస్తే రానివ్వండి; కాని దాన్ని భగవంతునికి అర్పిస్తున్నారు కాబట్టి శ్రద్ధగా చెయ్యండి. అందువల్ల మీరు ఏ పనిని చేస్తున్నా కూడా, అంతకుముందుకన్నా కూడా మెరుగ్గా, అంతకుముందుకన్నా కూడా శ్రద్ధగా చెయ్యండి. మీ లెటర్‌పాడ్‌లో రాసినా, రాశాక ఆ కాగితం లెటర్‌పాడ్‌లోంచి చించాలన్నా కూడా, శ్రద్ధగా, సరిగ్గా చెయ్యాలి. ఆ కాగితాన్ని అడ్డదిడ్డంగా చింపకూడదు.

చిన్మయానందస్వామీజీ ఏదైనా పని చేసేటప్పుడు చూసితీరాలి. రెండు కళ్ళు చాలవు. ఏ పని చేసినా, ఎంత చిన్నదైనా సరే, దాన్ని పరిపూర్ణంగా చెయ్యాలి. ఆ లెటర్‌పాడ్ నుంచి చింపిన కాగితాన్ని మడవటంలో కూడా ఒక ప్రజ్ఞ ఉంది. ఎలా పడితే అలా మడవకూడదు. కాగితంయొక్క రెండుకొనలూ సరిగ్గా కలుసుకోవాలి. దాన్ని కవరులో సరిగ్గా పెట్టాలి, కవరు సరిగ్గా అంటించాలి. దానికి అంటించే జిగురు బయటకి రాకూడదు. స్టాంపు అంటించాలంటే, చాలామంది టక్కున నాలిక చాచి, దానికి రాసి, అంటించటానికి చూస్తారు. అలా చేస్తే ఆ స్టాంపు సరిగ్గా అంటుకోదు. చిన్మయానంద స్వామీజీ అలా నిర్లక్ష్యంగా చేస్తే ఇష్టపడేవారు కాదు.

ఎవరినైనా సరిగ్గా చెయ్యమంటే, వారు చెప్పే కుంటిసాకు నాకు తీరిక లేదు. కాని చిన్మయానంద స్వామీజీ ప్రపంచంలో క్షణం తీరిక లేకుండా పనిచేసేవారిలో ఒకరు. అయినా ఏ చిన్నపని చేసినా దాన్ని సమర్థవంతంగా

చేసేవారు. ఆఖరికి తన జేబురుమాలును మడతలు మడచి, జేబులో పెట్టుకోవటంలో కూడా శ్రద్ధ, సామర్థ్యం చూపేవారు. మీరు కూడా అంత శ్రద్ధగా చెయ్యాలి; మీరు చెయ్యగలరు కూడా. భగవంతునికి అర్పించే పని ఎంత శ్రద్ధగా ఉండాలి? అంటే కర్మను ఈశ్వరార్పణ భావనతో చెయ్యాలి.

బి) **కర్మఫలం** – మీరు చేసిన కర్మ భగవంతుని చేతుల్లోకి వెళుతుందనీ, భగవంతుడు కర్మఫలదాత అనీ చూశాము. సాక్షాత్తూ ఆ భగవంతున్నుంచే ఫలం వచ్చేటట్టయితే, ఆ ఫలం న్యాయంగానే ఉంటుంది. భగవంతునికి పక్షపాతం లేదు; అన్యాయం చెయ్యడు; అంత సర్వజ్ఞుడైన భగవంతుని తీర్పును బేరీజు వేసేటంత శక్తి మీకెక్కడిది? భగవంతుడు ఇచ్చిన కర్మఫలం మంచిదో కాదో చెప్పటానికి, కర్మసూత్రాలమీద మీకున్న జ్ఞానం ఏపాటిది?

భగవంతుడు కర్మఫలాలను మీరు ఈ జన్మలో చేసిన పనులనుబట్టి మాత్రమే కాక, ముందు జన్మలో కర్మలను కూడా దృష్టిలో పెట్టుకుని ఇస్తాడు. మీకు ఈ జన్మలో మీరేం చేశారో గుర్తుండటమే కష్టం; అలాంటిది గతజన్మలో ఏంచేశారో మీకేం తెలుస్తుంది? అందువల్ల కర్మఫలంగా భగవంతుడు ఏదిచ్చినా, దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. అంటే కర్మ చేసేటప్పుడు ఈశ్వరార్పణబుద్ధితో చెయ్యాలి, కర్మఫలాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి.

**కర్మయోగం = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి**

సి) **కర్మఫలదాత** – భగవంతుణ్ణి ఎలా కొలవాలి? మొదట్లో మన భక్తి ఏకరూప ఈశ్వరునితో మొదలవుతుంది. భగవంతుడు మన పూజగదిలోనో, ఏదైనా ఆలయంలోనో ఉన్నాడనుకుని, ఆయా ప్రదేశాల్లో పూజిస్తాము. ఇంకా మాట్లాడితే ఎక్కడో దూరంగా వైకుంఠంలోనో, కైలాసంలోనో కూర్చున్నాడు అనుకుంటాము. పూజ చెయ్యటానికి అది సరిపోతుంది. భగవంతునికి ఒక రూపం ఇవ్వకపోతే, పూలు, పండ్లు ఎలా నివేదన చేస్తాము?

కాని దాన్నించి పైకి ఎదగాలి. భగవంతుడు ఏకరూపమున్న భగవంతుడు మాత్రమే కాదు, భగవంతుడు సర్వవ్యాపకుడు. భగవంతుడు జగత్కారకుడు. కారణం కార్యం అంతటా ఉంటుంది. బంగారం ఆభరణం అంతటా ఉంటుంది; మట్టి కుండ అంతటా ఉంటుంది; భగవంతుడు జగత్తు అంతటా ఉన్నాడు.

అంతటా ఉన్నాడంటే ఏ రూపంలో ఉన్నాడు? రూపం, సర్వవ్యాపకత్వం ఒకచోట ఉండవు. రూపం ఉంటే, దానికి పరిమితి ఉంటుంది. సర్వవ్యాపకత్వానికి పరిమితి లేదు, రూపం లేదు. ఆకాశం సర్వవ్యాపకం. దానికి ఏ రూపం ఉంది? అలాగే భగవంతుడు నిరాకారుడు; ఆయన ఈ జగత్తు అంతటా అనేకరూప ఈశ్వరునిగా ప్రకటితమవుతున్నాడు.

మీ శరీరం అంతటా చైతన్యం నిండి ఉన్నట్టుగా, ఈ జగత్తు అంతటా ఒక చైతన్యతత్త్వం, సర్వజ్ఞతత్త్వం నిండివుంది. ఏకరూప ఈశ్వరుడు అనేకరూపఈశ్వరునికి ప్రతీక. అందువల్ల ఏకరూప ఈశ్వరుణ్ణి కొలిచే స్థాయి నుంచి అనేకరూపఈశ్వరుణ్ణి అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలి. ప్రేమకు ఏ రూపం ఉంది? కోపానికి ఏ రూపం ఉంది? అందానికి ఏ రూపం ఉంది? వాటిని మనం ఎలా తెలుసుకుంటున్నాము? ఎలా అనుభవిస్తున్నాము? అలాగే అనేకరూపఈశ్వరుని గురించి కూడా అర్థం చేసుకోవాలి.

జగత్తులో అంతా ఒక నియమం ప్రకారం జరుగుతోంది. అది అంత క్రమపద్ధతిలో నడుస్తోందంటే ఎన్నో ప్రకృతి సూత్రాలు ఉన్నాయి. వాటి వెనక సర్వజ్ఞుడు అయిన భగవంతుడు ఉన్నాడు. భగవంతుణ్ణి ఒక్క గుడిలోనే కాదు, జగత్తులో ఏది చూసినా, పువ్వును చూసినా, పక్షిని చూసినా, కొండను చూసినా అందులో భగవంతుడు ఉన్నాడు. అనేకరూప ఈశ్వరునిగా ప్రకటితమవుతున్నాడు. అనేకరూప ఈశ్వరుడు అంటే అనేక దేవుళ్ళు కాదు; అనేక నామరూపాల్లో ఈశ్వరుడే ఉన్నాడు. అవి నామరూపాలు మాత్రమే, వాటిలో ఈశ్వరుడే ఉన్నాడు.

అంతటా ఉన్న ఈశ్వరుడు మీ ఆఫీసులో కూడా ఉన్నాడు. అందువల్ల ఆఫీసు పనిని ఈశ్వరపూజగా చెయ్యాలి. అలా ఈశ్వరార్పణ భావనతో చేస్తే 'వచ్చిన ఫలంనుంచి నేనేం నేర్చుకున్నాను?' మిమ్మల్ని మీరు బేరీజు వేసుకుంటారు. అప్పుడు భోక్త, ప్రమాతగా మారతాడు. ప్రమాత అంటే నేర్చుకునే వ్యక్తి.

కర్మయోగి కర్మఫలాన్నుంచి ఆనందం పొందడు; తను చేసే కర్మలోనే ఆనందం పొందుతాడు. కర్మఫలంనుంచి పాఠాలు నేర్చుకుంటాడు. అందువల్ల కర్మయోగి తను చేసే కర్మనుంచి ఆనందాన్ని, తనకొచ్చిన ఫలంనుంచి పాఠాలను నేర్చుకుంటాడు. అలా కర్మయోగి సమత్వం పాటించటంవల్ల చిత్తశుద్ధిని పొందుతాడు. అటువంటి వ్యక్తినే మానవః అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మానవః అంటే వివేకం ఉన్నవ్యక్తి; విచక్షణా శక్తి ఉన్నవ్యక్తి.

ఇక్కడితో కర్మయోగి ఎవరు? ప్రత్యేక విశ్లేషణ ముగిసింది. ఈ నేపథ్యంతో ఈ సారాంశం ఉన్న 46వ శ్లోకాన్ని చూద్దాము.

శ్లో. 46 **యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥**

యతః, ప్రవృత్తిః, భూతానామ్, యేన, సర్వమ్, ఇదమ్, తతమ్,
స్వకర్మణా, తమ్, అభ్యర్చ్య, సిద్ధిమ్, విందతి, మానవః ॥

| | | | |
|---|---|---|---|
| యతః | = ఏ భగవంతునినుండి | తమ్ | = ఆ పరమేశ్వరుని |
| భూతానామ్ | = సమస్త ప్రాణులయొక్క | స్వకర్మణా | = తన స్వాభావిక కర్మాచరణము ద్వారా |
| ప్రవృత్తిః | = ఉత్పత్తి జరుగుచున్నదో | అభ్యర్చ్య | = పూజించి |
| యేన | = ఏ భగవంతునిచే | మానవః | = మానవుడు |
| ఇదమ్, సర్వమ్ | = ఈ సమస్త జగత్తు | సిద్ధిమ్ | = పరమసిద్ధిని |
| తతమ్ | = వ్యాప్తమైయున్నదో | విందతి | = పొందుచున్నాడు |

**యతః భూతానామ్ ప్రవృత్తిః (అస్తి), యేన ఇదమ్ సర్వమ్ తతమ్**
**(అస్తి) తమ్ (ఈశ్వరం) స్వకర్మణా అభ్యర్చ్య మానవః సిద్ధిమ్ విన్దతి ।**

తా: ఏ భగవంతునినుండి సమస్త ప్రాణులయొక్క ఉత్పత్తి జరుగుచున్నదో, ఏ భగవంతునిచే ఈ సమస్త జగత్తు వ్యాప్తమైయున్నదో, ఆ పరమేశ్వరుని తన స్వాభావిక కర్మాచరణము ద్వారా పూజించి, మానవుడు పరమసిద్ధిని పొందుచున్నాడు.

చాలా ముఖ్యమైన శ్లోకం ఇది.

**యతః ప్రవృత్తిర్భూతానామ్** – భగవంతుడు ఈ జగత్తు అంతటికీ కారణం. ప్రవృత్తి అంటే ఉత్పత్తి అంటే సృష్టి; భూతానాం అంటే చరాచర జగత్తు అంతటికీ. అంటే భగవంతుడు ఈ జగత్తుయొక్క సృష్టికారణం. భగవంతుడు ఈ జగత్తులో ఒక రూపం ఉన్న వ్యక్తి కాదు; భగవంతుడే ఈ జగత్తు అంతటికీ కారణం. జగత్తుయొక్క సృష్టి జరగకముందు భగవంతుడే ఉన్నాడు.

ఎప్పుడైతే భగవంతుణ్ణి జగత్కారణంగా అర్థం చేసుకుంటారో, అప్పుడు ఒక ప్రకృతి సూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి. **కార్యం అంతటా కారణం ఉంటుంది.** ఈ జగత్తు కార్యం అయితే, కారణం అయిన ఈశ్వరుడు ఎక్కడ ఉంటాడు? ఈ సూత్రం ప్రకారం కార్యం అంతటా ఉంటాడు. చెట్టులో, పుట్టలో, పువ్వులో, మనిషిలో – అన్నింటిలో, అందరిలో ఉంటాడు. పంచభూతాలైన ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమిలో ఉంటాడు. అంతేకాదు, పంచభూతాలనుంచి వచ్చిన పాంచభౌతిక ప్రపంచంలో ఉంటాడు.

ఇటువంటి భగవంతుని రూపం ఏమిటి? ఆయనకు ఒక రూపం ఉండదు. అనేకరూప ఈశ్వరుడు అవుతాడు. అనేకరూప ఈశ్వరుడు అంటే అనేక భిన్న భగవంతుళ్ళు కాదు; ఒకటే భగవంతుడు ప్రతిరూపంలోనూ భాసిల్లుతున్నాడు. ఆకాశానికి ఏరూపం ఉంది? ఆకాశం సర్వవ్యాపకం. భగవంతుడు కూడా సర్వవ్యాపకం. భగవంతుడు సమష్టి బుద్ధిగా సర్వవ్యాపకం. వ్యష్టిగా మీ బుద్ధి లేదా మీ చేతనతత్త్వం మీ శరీరం అంతటా వ్యాపించినట్టుగా, భగవంతుడు సమష్టి బుద్ధిగా, చేతనతత్త్వంగా అంతటా ఉన్నాడు.

నా కళ్ళు మీ శరీరాన్నే చూడగలవు కాని మీలోని చైతన్యాన్ని చూడలేవు; మీ బుద్ధిని చూడలేవు. అలాగే మీ కళ్ళు ఈ జగత్తును చూస్తున్నాయి కాని దాని వెనకనున్న చైతన్యాన్ని చూడలేకపోతున్నాయి. మీరు కొలిచే ఇష్టదేవత ఎవరు? ఈ సర్వవ్యాపకమైన, సర్వజ్ఞుడయిన భగవంతునికి ప్రతీక. ఈ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. నాకు కంటికి కనబడటం లేదే అంటే ప్రేమ కనిపిస్తోందా, కోపం కనిపిస్తోందా, అందం కనిపిస్తోందా? వీటికి ఒక రూపం లేకపోయినా, వీటిని మీరు అర్థం చేసుకోగలుగుతున్నారు. రూపం లేని దాన్ని అర్థం చేసుకునే సూక్ష్మబుద్ధి ఉంది. అలాగే రూపం లేని సమష్టి బుద్ధిని అర్థం చేసుకునేటట్టుగా మీ బుద్ధిని సున్నితంగా చేసుకోవాలి. దయానంద స్వామీజీ 'ఆర్డర్' అనే పదం వాడతారు. జగత్తులో అన్నీ ఒక క్రమపద్ధతిలో జరుగుతున్నాయంటే దానికి కారణం భగవంతుడు. అందువల్ల ఆ క్రమపద్ధతిని భగవంతునిగా భావించటం నేర్చుకోండి. విజ్ఞానశాస్త్రజ్ఞుడు సౌరకుటుంబం గురించి నేర్చుకుంటే సృష్టిలో ఎన్ని ప్రకృతి సూత్రాలు ఉన్నాయో అర్థం చేసుకుంటాడు. 'ప్రకృతిలో ఒక క్రమపద్ధతి, సమయపాలన ఉన్నాయి,' అంటాడు ఒక శాస్త్రజ్ఞుడు. అలా ఎటు చూసినా భగవంతుడే కనిపిస్తుంటే, ఈ జగత్తే మీకొక దేవాలయంగా కనిపిస్తుంది.

శివమానసపూజలో నేనేం చేసినా నీపూజే అంటాడు. 'ఓ దేవా, అది నీకు నేనే చేసే ఆరాధన,' అంటాడు భక్తుడు.

**యేన సర్వమిదం తతమ్** – జగత్కారణమైన భగవంతుడు జగత్తు అంతటా నిండివున్నాడు.

**తమ్ అభ్యర్చ్య** – ఆ సర్వవ్యాపకమైన భగవంతుణ్ణి పూజించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంతటా ఉన్న భగవంతుడు మీ ఆఫీసులో కూడా ఉన్నాడు. ఆ భగవంతునికి పూజ చెయ్యండి. పూజ అంటే పూలు, నైవేద్యం కోసం చూడకండి.

**స్వకర్మణా** – మీరు చేస్తున్న ఉద్యోగం ఏదయితే ఆ కర్మ ద్వారా భగవంతుణ్ణి ప్రార్థించండి. ఆఫీసులో పని అయితే, మీరు రాసే ప్రతి ఉత్తరమూ శ్రద్ధపెట్టి రాయండి; చూసే ప్రతి ఫైలునూ అంకితభావంతో చూడండి; డాక్టరయితే రోగిని శ్రద్ధగా చూడండి. ఏం చేసినా భగవంతునికి అర్పిస్తున్నాను అనుకోండి. అలా చేస్తే ఏం ఫలం వస్తుంది?

**సిద్ధిం విందతి మానవః** – ఇలా చేస్తే, మీకు తెలియకుండానే ఆ కర్మ మిమ్మల్ని సంస్కరిస్తుంది. ఎందుకంటే, ఈశ్వరార్పణ భావనతో చేస్తే, ఏ ఫలం వచ్చినా, 'నాకే ఎందుకు వచ్చింది?' అనుకోరు, భగవంతుణ్ణి విమర్శించరు. ఎదురు, దీనివల్ల నేనేం పాఠం నేర్చుకున్నాను అనుకుంటారు.

కర్మఫలాన్ని అనుభవిస్తే మీరు భోక్త అవుతారు. ఏదైనా కొత్తగా నేర్చుకుంటే మీరు ప్రమాత అవుతారు. అంటే భోక్తగా కర్మఫలాన్ని అనుభవించాల్సిన మీరు, ప్రమాతగా కొత్త పాఠాన్ని నేర్చుకుంటారు. కర్మయోగి కర్మఫలం తెచ్చే ఆనందంకోసం ఎదురుచూడడు. ఎందుకు? అతను చేసే కర్మలోనే రమిస్తాడు. మామూలుగా ఎవరైనా కర్మఫలంలో ఆనందం పొందాలని చూస్తారు. కాని ఇతను కర్మలోనే ఆనందం పొందుతాడు. అందువల్ల కర్మఫలంనుంచి పాఠాలు నేర్చుకుంటాడు. అది కూడా బాధాకరమైన ఫలం వస్తే ఇంకా గొప్ప పాఠాలు నేర్చుకుంటాడు.

పాము విషం మనిషిని కాటేస్తుంది. ఆ పాముకాటువల్ల మరణించే ప్రమాదం ఉంది. కాని అదే పాము నుంచి విషం తీసి, దాన్ని మందుగా ప్రయోగిస్తే, అది రోగాన్ని నయం చేస్తుంది. విషం ఒక్కటే. వాడిన విధానం వేరేగా ఉంది. అలాగే కర్మఫలం ఒక్కటే – వాడే విధానం వేరు. మామూలుగా మనం ఆశించిన కర్మఫలం రాదు; అందువల్ల బాధే ఎక్కువగా ఉంటుంది. కాని కర్మయోగికి ప్రతి ఒక్క ఫలమూ ఒక పాఠశాల.

సిద్ధిం విందతి మానవః అంటే కర్మయోగికి ఆ పాఠాలు చిత్తశుద్ధిని కలుగజేస్తాయి. అటువంటి వ్యక్తిని మానవః అంటారు. మానవః అంటే వివేకం ఉన్న వ్యక్తి; విచక్షణాశక్తి ఉన్న వ్యక్తి. కర్మఫలానికి చలించే వ్యక్తి పాఠం నేర్చుకోలేడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే కర్మయోగి కర్మలో ఆనందం పొందుతాడు; కర్మఫలంనుంచి పాఠం నేర్చుకుని భోక్త కాస్తా ప్రమాతగా మారతాడు. అందువల్ల కర్మయోగి సమత్వం పాటిస్తాడు.

శ్లో. 47 **శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥**
శ్రేయాన్, స్వధర్మః, విగుణః, పరధర్మాత్, స్వనుష్ఠితాత్,
స్వభావనియతమ్, కర్మ, కుర్వన్, న, ఆప్నోతి, కిల్బిషమ్ ॥

| | | | |
|---|---|---|---|
| స్వనుష్ఠితాత్ | = బాగుగా ఆచరించబడిన | స్వభావనియతమ్ | = స్వభావమునకు అనుగుణమైన |
| పరధర్మాత్ | = ఇతరుల ధర్మముకంటెను | కర్మ | = స్వధర్మరూప కర్మలను |
| విగుణః (అపి) | = గుణరహితమేయైనను | కుర్వన్ | = చేయుచు మనుష్యుడు |
| స్వధర్మః | = స్వధర్మాచరణమే | కిల్బిషమ్ | = పాపములను |
| శ్రేయాన్ | = శ్రేష్ఠమైనది | న, ఆప్నోతి | = పొందదు |
| (యస్మాత్) | = ఎందుకంటే | | |

**విగుణః స్వధర్మః స్వనుష్ఠితాత్ పర-ధర్మాత్ శ్రేయాన్ (అస్తి),**
**స్వభావ-నియతమ్ కర్మ కుర్వన్ (నరః) కిల్బిషమ్ న ఆప్నోతి ।**

తా: బాగుగా ఆచరించబడిన ఇతరుల ధర్మముకంటెను, గుణరహితమేయైనను స్వధర్మాచరణమే శ్రేష్ఠమైనది. ఎందుకంటే స్వభావమునకు అనుగుణమైన స్వధర్మరూప కర్మలను చేయుచు మనుష్యుడు పాపములను పొందదు.

మనిషికున్న పెద్ద బలహీనత తనను ఎదుటివారితో పోల్చుకుని బాధపడటం. ఏ ఉద్యోగం చేపట్టినా, తను చేసేదానికన్నా ఎదుటివ్యక్తి చేసే ఉద్యోగం ఇంకా బాగుంది అనిపిస్తుంది. ఉద్యోగం దాకా ఎందుకు, తను తినే ఆహారం, వేసుకున్న దుస్తులు, ఉన్న ఇల్లు, ఏదైనా కూడా పక్కవాడితో పోల్చి చూస్తే తనది నచ్చదు. **దూరపు కొండలు నునుపు** అంటారు.

ఇప్పుడు సందర్భం వృత్తి గురించి కాబట్టి మనిషి ఏ వృత్తి చేపట్టినా, ఇంకో వృత్తి బాగుంది అనుకుంటాడు. బ్రాహ్మణవృత్తి చేపట్టితే, క్షత్రియవృత్తి బాగుంది అనిపిస్తుంది. అలా అనిపించగానే వృత్తో, ఉద్యోగమో మారుతాడు. అలా మారుతూ వస్తే, ఎన్నటికీ పనిలో రాణించలేడు. అందువల్ల కృష్ణపరమాత్మ మీరు ఏ వృత్తిలో ఉంటే, దానిలోనే ప్రావీణ్యం సంపాదించండి అంటున్నాడు.

**స్వధర్మః శ్రేయాన్** – మీరు ఏ వృత్తిని చేపట్టితే అదే మీకు శ్రేయస్కరమైనది. దాన్నే శ్రేష్ఠమైనదానిగా భావించి, దానిలో సామర్థ్యం పెంచుకోండి. మీరు ఏ రంగంలోనైనా రాణించగలరు.

ఈ స్వధర్మః శ్రేయాన్ పదం కూడా అదును చూసి వేశాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? అర్జునుడు తన స్వధర్మాన్ని వదులుకుని పరధర్మానికి వెళదామనుకున్నాడు. తన వారితో యుద్ధం చెయ్యటం కన్నా ఇంకొక అధర్మం లేదు; దానికన్నా భిక్షమెత్తుకుని జీవించటం ఉత్తమం అన్నాడు. అంటే క్షత్రియధర్మం, గృహస్థధర్మం వదిలేసి, సన్న్యాసం స్వీకరించటం శ్రేయస్కరమనుకున్నాడు. అందువల్ల కృష్ణపరమాత్మ స్వధర్మాన్ని పాటించటమే శ్రేయస్కరమైనది అని గట్టిగా హెచ్చరిస్తున్నాడు.

అటువంటి ఆలోచన చాలామందికి వస్తుంది. ముఖ్యంగా పట్టణాలలో రణగొణ ధ్వనుల మధ్య ఉండి, ఉరకలు పరుగులు తీస్తూ ఉండే జీవన విధానంలో కూరుకుపోయినవారు పొరపాటున రెండురోజులు ఏ హృషీకేష్‌కో, ఏ ఆశ్రమానికో వెళితే ఎంతో మురిసిపోతారు. 'అబ్బ! ఎంత ప్రశాంతంగా ఉంది! ఈ గంగ

ఒడ్డున ఒక చిన్న ఇల్లు కట్టుకుని, ఏ స్వామీజీకో సేవ చేస్తూ కాలం గడిపేయవచ్చు,' అనుకుంటారు. వెనక్కి వచ్చి స్వామీజీతో చెబుతారు కూడా.

అటువంటి ఆలోచన ఉన్నవారిని స్వామీజీ గట్టిగానే హెచ్చరిస్తారు. 'అప్పుడే తొందరపడి నిర్ణయాలు తీసుకోకండి. ఇక్కడ వ్యవహారాలు మానేసి, అక్కడికి వెళ్ళిపోయి స్థిరపడదాము అనుకోకండి. మీకంత సరదాగా ఉంటే హృషీకేష్‌కెళ్ళి కొన్ని నెలలు ఉండిచూడండి. అక్కడ ఆశ్రమజీవనం నచ్చుతుందేమో చూడండి! అప్పుడు హైదరాబాదే బాగుంది అన్నా అంటారు.' స్వామీజీ మాటమీద నమ్మకం లేకపోతే, మీరే ప్రయత్నించి చూడండి.

ఆశ్రమాల్లో ఉన్నవారు బయటకు రాలేక అవస్థ పడుతున్నవారు ఉంటారు. ఎవరో ఒక ఆశ్రమానికి వెళ్ళి, 'ఈ ఆశ్రమ పీఠాధిపతి ఏరి?' అని అడిగారుట. 'ఆయనకు ఇక్కడ ప్రశాంతత దొరకక పక్క ఆశ్రమానికి వెళ్ళారు,' అని జవాబిచ్చారుట ఎవరో. ఇది సరదాగా చెప్పిన జోక్. కాని మనం గ్రహించాల్సిన విషయం ఏ వృత్తిలో ఉండే లాభాలు దానికి ఉంటాయి; ఏ వృత్తిలో ఉండే లొసుగులు దానికి ఉంటాయి.

అందువల్ల కృష్ణపరమాత్మ స్వధర్మః శ్రేయాన్ అన్నాడు. ఎక్కడ ఉన్నావో అక్కడే ఆనందం పొందు.

**పరధర్మాత్ (శ్రేయాన్)** – పరధర్మం కంటే కూడా శ్రేయస్కరమైనది. ఏ వృత్తి చేపట్టాలో ముందే నిర్ణయించుకోవాలి. ఒకసారి నిర్ణయించుకున్నాక, దానికే కట్టుబడి ఉండాలి.

**విగుణః (అపి)** – ఇప్పుడు మీరు అందులో ఆరితేరకపోయినా, ముందుముందు రాణించవచ్చు. ఏ పని కూడా ఇది పరిపూర్ణం అని చెప్పలేరు. ఎందుకంటే ప్రతి ఒక్క పనికీ దాన్ని ఇంకా మెరుగ్గా చెయ్యటానికి అనంతమైన అవకాశం ఉంది. కొంతమందికి కాఫీ త్రాగటం కూడా రాదు; అదే కాఫీని చల్లార్చటం కూడా ఒక ప్రజ్ఞే అని చిన్న కాఫీ దుకాణాల్లో చూస్తే అర్థమవుతుంది. అందువల్ల ఏదీ మంచిది కాదని చెప్పలేరు. అయితే ఏం చెయ్యాలి?

**స్వభావనియతం కర్మ కుర్వన్** – స్వభావానికి తగ్గట్టుగా ఎన్నుకున్న కర్మను చెయ్యండి, దాన్ని ఆనందించండి. దాన్ని ఇష్టంగా చెయ్యండి. దాన్నే ఇంకా మెరుగ్గా ఎలా చెయ్యవచ్చో ఆలోచించండి. మీరున్న వృత్తిలో ఎక్కడ ఆరంభించారో, అక్కడే ఆగిపోకండి; ముందుకు సాగండి.

మీరు ఎన్నుకున్న వృత్తి మీ స్వభావాన్నిబట్టి ఉండవచ్చు లేదా మీ జాతినిబట్టి ఉండవచ్చు లేదా దానికి ఆకర్షింపబడి ఉండవచ్చు. ఏ కారణంవల్ల ఎన్నుకున్నా, ఎన్నుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. కాని ఒకసారి అందులో చేరాక, ఇంక వెనక్కి తిరిగి చూడకండి. ఆ వృత్తిని ప్రేమించటం నేర్చుకోండి. అంకితభావంతో పని చెయ్యండి; ఎవరితోనూ పోల్చుకోకండి.

ఏ ఉద్యోగానికి ఉండే సాధకబాధకాలు దానికి ఉంటాయి. దాన్ని ఆక్యుపేషనల్ హజార్డ్స్ అంటారు. అంటే ఏ ఉద్యోగానికి తగ్గ బాధలు ఆ ఉద్యోగానికి ఉంటాయి. ఎనిమిది గంటలూ కూర్చుని చేసే ఉద్యోగంలో ఒక విధమైన అనారోగ్య సమస్య; ఎప్పుడూ ప్రయాణాలు చెయ్యాల్సిన ఉద్యోగంలో ఇంకో సమస్య. స్వంత వ్యాపారంలో ఉండే సాధకబాధకాలు వేరు; ఎవరికిందో ఉద్యోగం చేస్తే ఉండే సాధకబాధకాలు వేరు. అమెరికాలో ఉన్న

సంస్థకు ఇండియానుంచి చేస్తే ఉండే సాధకబాధకాలు వేరు. అలా ఏ వృత్తి చూసినా దానిలో మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది. అందువల్ల నువ్వు ఎన్నుకున్న వృత్తే నీకు శ్రేయస్కరమైనది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**కిల్బిషం న ఆప్నోతి** – తన స్వధర్మాన్ని పాటిస్తే దానివల్ల పాపం రాదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆ విషయం కృష్ణపరమాత్మ ప్రత్యేకించి ఎందుకు చెబుతున్నాడంటే అర్జునుడు మొదటి అధ్యాయంలో తన వారిని చంపితే పాపం వస్తుంది అన్నాడు.

**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః** – 1.36

అర్జునుని స్వధర్మం ఏమిటి? క్షత్రియధర్మం. క్షత్రియుడు ధర్మరక్షణ చెయ్యాలి. దానికోసం అవసరమైతే యుద్ధం కూడా చెయ్యాలి. ఎవరికీ యుద్ధం ఇష్టం ఉండదు; అందులోనూ వేలాది అమాయక జీవులు ప్రాణాలొడ్డాల్సి వస్తుంది; స్వజనులైన భీష్మద్రోణాదులను చంపాల్సి వస్తుంది. ఇటువంటి స్వధర్మాన్ని **సదోషమపి స్వధర్మమ్** అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే ఈ కర్తవ్య నిర్వహణలో రక్తపాతం చిందించాల్సి ఉంటుంది.

హింస అనారోగ్యకరమే అయినా, కొన్ని వృత్తులకు అది తప్పదు. సైన్యంలో ఉన్నా, పోలీసు ఉద్యోగం చేసినా, ఎదుటివారిని దండించక తప్పదు. అర్జునుని ధర్మం యుద్ధం చెయ్యటం; యుద్ధంలో హింస చెయ్యక తప్పదు. ఆ హింస కూడా వారిని హింసించటానికి కాదు; ధర్మాన్ని రక్షించటంకోసం చెయ్యబోతున్నాడు. అటువంటి హింస చేస్తే పాపం కలగదు.

తలారీ పని ఏమిటి? నేరస్థులకు ఉరిశిక్షను అమలుచేయటం. అంటే వారిని స్వయంగా ఉరితీయటం. అది అతని స్వధర్మం. అలా స్వధర్మంలో భాగంగా హింస ఉన్నా కూడా అది పాపాన్ని కలిగించదు. ఎందుకంటే ఆ వ్యక్తి స్వధర్మాన్ని నిర్వర్తించేది ఎదుటివారిని బాధించటానికి కాదు, ధర్మాన్ని రక్షించటానికి. ఇలాంటి ఉద్యోగంలో కూడా ఎవరో ఒకరు చేరాలి. సైనికుడు కావాలి, పోలీసు కావాలి సమాజానికి. అందరూ వ్యాపారమే చేస్తాను; బ్రాహ్మణవృత్తే చేపడతాను; వారికి సేవలే చేస్తాను అంటే ధర్మాన్ని రక్షించేదెవరు? అందువల్ల క్షత్రియవృత్తి చేపట్టాలి, ధర్మరక్షణ చెయ్యాలి.

శ్లో. 48 **సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।**
**సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥**
సహజమ్, కర్మ, కౌంతేయ, సదోషమ్, అపి, న, త్యజేత్,
సర్వారంభాః, హి, దోషేణ, ధూమేన, అగ్నిః, ఇవ, ఆవృతాః ॥

కౌంతేయ! = ఓ కుంతీసుతా!
సహజమ్, కర్మ = స్వాభావికమైన కర్మ
సదోషమ్, అపి = దోషయుక్తమైనను
(తత్) = (దానిని)
న, త్యజేత్ = త్యజింపరాదు

హి = ఎందుకంటే
అగ్నిః = అగ్ని
ధూమేన, ఇవ = పొగచే ఆవరింపబడినట్లు
సర్వారంభాః = కర్మలన్నియును
దోషేణ, ఆవృతాః = ఏదేని ఒక దోషముచేత ఆవరింపబడియే యుండును

**హే కౌన్తేయ! సహజమ్ కర్మ సదోషమ్ అపి న త్యజేత్,**

**ధూమేన అగ్నిః ఇవ హి సర్వారమ్భాః దోషేణ ఆవృతాః (సన్తి) ।**

తా: ఓ కుంతీసుతా! స్వాభావికమైన కర్మ దోషయుక్తమైనను దానిని త్యజింపరాదు. ఎందుకంటే అగ్ని పొగచే ఆవరింపబడినట్లు కర్మలన్నియును ఏదేని ఒక దోషముచేత ఆవరింపబడియే యుండును.

ఇంచుమించుగా ఇంతకుముందు చెప్పిన భావాలనే కొనసాగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏ వృత్తిని తీసుకున్నా కూడా, దేనిలో ఉండే సాధకబాధకాలు దానికి ఉన్నాయి.

**సహజం కర్మ న త్యజేత్** – నీ స్వధర్మాన్ని ఎన్నడూ త్యజించకు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మీరు మీ వృత్తిని మీ స్వభావానికి తగ్గట్టుగా ఎన్నుకున్నా, మీ జాతినిబట్టి ఎన్నుకున్నా కూడా, దానితోపాటు ధర్మం కూడా మిళితమై ఉంటుంది. ఏ కారణంతో ఒక వృత్తిని చేపట్టినా కూడా, ఆ వృత్తికి సంబంధించిన ధర్మం ఉంటుంది.

**సదోషమపి (న త్యజేత్)** – అందులో కొన్ని దోషాలు ఉన్నా కూడా, దాన్ని త్యజించకూడదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఏ వృత్తి తీసుకున్నా, దానిలో ఉండే కనీసపు దోషం ఆ వృత్తిలో విసుగు పుడుతుంది. ఏ ఉద్యోగంలో చేరినా మొదటివారం ఉత్సాహంతో చిందులు వేస్తారు; కాని రెండోవారంనుంచే అదేపని పదేపదే చేయాలి అనేసరికి విసుగుపుడుతుంది.

మీరు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు మీరు గంటల తరబడి క్యూలో నిలబడి, కొన్ని గంటలు క్యూలో నడిచి, కష్టబడి భగవంతుని ముందుకు వచ్చి దర్శనం చేసుకుంటారు. ఆ దర్శనం ఎంతసేపు ఉంటుంది? కొన్ని క్షణాలు మాత్రమే. సరిగ్గా చూడనైనా చూశారో లేదో, బయటకు పంపించి వేయబడతారు. అప్పుడు మీరు అక్కడే ఉన్న పూజారిని చూస్తారు. 'అబ్బ, ఆయనది ఎంత అదృష్టం! అక్షరాలా దేవుని ముందే ఉండవచ్చు; వేంకటేశ్వరస్వామిని తనివితీరా దర్శనం చేసుకోవచ్చు, ఆయన ఎంత అదృష్టవంతుడో కదా,' అనుకుంటారు. 'నేను కూడా ఆ ఉద్యోగంలో చేరితే ఎంత బాగుంటుంది,' అని కూడా అనుకుంటారు. కాని కాసేపు అక్కడే నిలబడి చూడండి; కాస్త వెసులుబాటు కాగానే, ఆ పూజారి కాస్త గాలి పీల్చుకోవటానికి బయటకు వస్తాడు. దీన్నిబట్టి మీకు అర్థమయిందేమిటి? మీరు ఆయన్ని చూసి ఈర్ష్య పడుతున్నారు; ఆయన పడే అవస్థలు ఆయన పడుతున్నాడు.

అందువల్ల మీరు ఏ వృత్తిని చేపట్టినా, కొన్నాళ్ళయ్యాక దానిమీద విసుగు పుట్టటం అనేది చాలా సహజమైన పరిణామం. మీరే ఆ విసుగునుంచి బయటపడే మార్గాలను అన్వేషించి పట్టుకోవాలి. మీరు చేసే పని యాంత్రికమైన పని అయినా, మెదడుకు మేత అయినా, దానిలో మీ సృజనాత్మకతను, మీ ఊహాశక్తిని జోడించి, రోజూ చేసే పనినే నిత్యనూతనంగా మలుచుకోగలగాలి. చిన్నపిల్లవాడు ఒకే బొమ్మతో ఎక్కువ రోజులు ఆడుకోడు; కొన్ని రోజులు ఆడి, దాన్ని పారేస్తాడు. మీరు కూడా అలా ఈ ఉద్యోగం బాగాలేదని ఇంకో ఉద్యోగంలోకి మారుతూ

ఉండకూడదు. అలా కుదురుగా ఒకచోట ఉండకపోతే, మీరు వృత్తిలో పైకి రాలేరు. అందువల్ల కృష్ణపరమాత్మ చాలా గట్టిగానే హెచ్చరిస్తున్నాడు. మీ వృత్తిలో దోషాలు ఉన్నాకూడా, దాన్ని త్యజించకండి అంటున్నాడు. **సదోషమపి న త్యజేత్.**

**సర్వారంభాః ఆవృతాః** – ఎందుకు త్యజించకూడదు? ఏ కర్మను తీసుకున్నా కూడా, దానికి ఉండే దోషాలు దానికి ఉంటాయి. ఇక్కడ ఆరంభః అంటే కర్మ. నిఘంటువులో ఈ పదానికి అర్థం చూస్తే ప్రారంభం అని ఉంటుంది. కాని సందర్భాన్నిబట్టి చూస్తే, ఇక్కడ దీని అర్థం కర్మ. కర్మ అంటే వృత్తి అని తీసుకోవచ్చు. సర్వారంభః అంటే ఏ వృత్తిలో మీరున్నా, అంటే అది బ్రాహ్మణకర్మ అయినా, క్షత్రియకర్మ అయినా, వైశ్యకర్మ అయినా శూద్రకర్మ అయినా కూడా, కర్మలన్నీ దోషాలతో కప్పబడివుంటాయి. ఆవృతాః అంటే ఆవరింపబడి ఉండటం.

ఏ వృత్తిని కూడా ఇది పరిపూర్ణమైన వృత్తి, ఇందులో బొత్తిగా దోషాలు లేవు అని చెప్పలేరు. మీ ప్రవృత్తిలో ఉంది ఆ వృత్తిని ఆనందించటమో, ద్వేషించటమో. మీ మనస్సులో ఆనందం పొందగలిగే ప్రజ్ఞ లేకపోతే, ఎంత మంచి ఉద్యోగంలో చేరినా, దాన్ని అనుభవించలేరు. అందువల్ల వృత్తిని మారుస్తూ పోకండి, మీ ప్రవృత్తిని మార్చండి అంటుంది శాస్త్రం.

ఇదీ, మన వైదిక సాంప్రదాయంయొక్క గొప్పతనం. వైదిక సాంప్రదాయం మీ చుట్టూ ఉన్న పరిసరాలను మార్చటానికి ప్రయత్నించకండి; మీరు మారండి అంటుంది. అదే లౌకిక ఆలోచనాతీరు ఏమిటి? వస్తువులను మార్చండి అంటుంది. మీకు ఒకటే రకమైన దుస్తులు తొడుక్కుని చిరాకుగా ఉందా? ఇదుగో కొత్త ఫ్యాషను చూడండి. ఈ కొత్తరకం దుస్తులను వేసుకోండి అంటుంది. అందువల్ల విజ్ఞానశాస్త్రం మీ కళాకళలకు తగ్గట్టుగా, మీకు అనేక కొత్త పోకడలను పరిచయం చేస్తూ ఉంటుంది. రోజూ జడ వేసుకుని విసుగు పుడుతుంటే, ఇదుగో ఇన్నిరకాల కేశాలంకరణలు చేసుకోవచ్చు చూడండి అంటుంది.

అలా బాహ్యంగా ఏది తీసుకున్నా, సైన్సు దాన్ని విజయవంతంగా ఎలా మార్చవచ్చో మీకు అనేక మార్గాలను సూచిస్తుంది. కాని శాస్త్రం మీ మనస్తత్త్వాన్ని ఎలా విజయవంతంగా మార్చుకోవచ్చో నేర్పిస్తుంది. అలా మార్చుకోగలిగితే, మీరు ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా హాయిగా, తృప్తిగా ఉంటారు. అందువల్ల ఏ వృత్తిని చూసినా దానిలో దోషాలు ఉన్నాయి. **సర్వారంభాః ఆవృతాః.**

**ధూమేనాగ్నిరివ** – ఎలాగైతే అగ్ని పొగతో కప్పబడివుందో, అలా ప్రతి కర్మ కూడా దోషాలతో కప్పబడివుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 49 **అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।**
**నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి ॥**
అసక్తబుద్ధిః, సర్వత్ర, జితాత్మా, విగతస్పృహః,
నైష్కర్మ్యసిద్ధిమ్, పరమామ్, సన్న్యాసేన, అధిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| సర్వత్ర | = ప్రాపంచిక విషయములన్నింటి యందును | సన్న్యాసేన | = సాంఖ్యయోగము ద్వారా |
| అసక్తబుద్ధిః | = ఆసక్తిలేనివాడును | పరమామ్ | = అత్యంత శ్రేష్ఠమైన |
| విగతస్పృహః | = స్పృహరహితుడును | నైష్కర్మసిద్ధిమ్ | = నైష్కర్మసిద్ధిని |
| జితాత్మా | = అంతఃకరణమును జయించినవాడును అగు పురుషుడు | అధిగచ్ఛతి | = పొందును |

**సర్వత్ర అసక్త–బుద్ధిః జిత–ఆత్మా, విగత–స్పృహః (నరః)**
**పరమామ్ నైష్కర్మ్య–సిద్ధిమ్ సంన్యాసేన అధిగచ్ఛతి ।**

తా: ప్రాపంచిక విషయములన్నింటి యందును ఆసక్తిలేనివాడును, స్పృహరహితుడును, అంతఃకరణమును జయించినవాడును అగు పురుషుడు సాంఖ్యయోగము ద్వారా అత్యంత శ్రేష్ఠమైన నైష్కర్మసిద్ధిని పొందును.

ఈ శ్లోకంలో కర్మయోగం పాటిస్తే కలిగే ఫలమేమిటో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగం ఒక సాధకుణ్ణి ఎంతవరకూ తీసుకువెళుతుంది, దాని తర్వాత కర్మయోగి ఏం చెయ్యాలి? అది కూడా వివరిస్తున్నాడు.

ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. కర్మయోగం జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది కాని ఆత్మజ్ఞానాన్ని ఎన్నడూ ఇవ్వలేదు, మోక్షాన్ని కూడా కలుగజేయలేదు. అందువల్ల కర్మయోగం చిత్తశుద్ధిని మాత్రమే ఇవ్వగలదు అంటే సాధనచతుష్టయ సంపత్తిని మాత్రమే పెంపొందించగలదు. ఆ విషయాన్నే ఇక్కడ వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దానికన్నా ముందు కర్మయోగంయొక్క ఫలాన్ని వివరిస్తున్నాడు.

**సర్వత్ర అసక్తబుద్ధిః** – కర్మయోగిని నిర్వచిస్తున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగి దేనితోనూ బంధాన్ని పెంచుకోడు. కర్మయోగి నెమ్మదిగా బాహ్యవస్తువులమీద ఉండే మమకారంనుంచి బయటపడతాడు. ఎందుకు? బాహ్యప్రపంచం ఆనందహేతువూ కాదు, దుఃఖహేతువూ కాదని అర్థం చేసుకుంటాడు. బాహ్యప్రపంచం తనకు దుఃఖాన్ని కలుగజేయనప్పుడు, దాన్ని నిందించి ఏం ప్రయోజనం? అలాగే బాహ్యప్రపంచం ఆనందాన్ని కూడా ఇవ్వలేదు.

ఈ విషయాన్ని కొంచెం తర్కం ఉపయోగిస్తే తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ బాహ్యవస్తువులే ఆనందహేతువు అయితే, ఎవరెవరికైతే ఆ వస్తువులు ఉన్నాయో, వారంతా కూడా సమానంగా ఆనందంగా ఉండాలి. ధనం కావాల్సినంత ఉంటే, ఆనందం కలుగుతుంది అనుకుంటారు చాలామంది. కాని అదే నిజమైతే, ఐశ్వర్యవంతులంతా సమానంగా ఆనందంలో మునిగితేలాలి కదా! కాని అలా లేరే! ఎందరో ఐశ్వర్యవంతులు బాధపడటం మన కళ్ళారా చూస్తాము; ఆ బాధని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నవారూ లేకపోలేదు. అలాగే డబ్బులేని బీదవారంతా బాధపడుతూ ఉండాలి ఈ సూత్రం ప్రకారం. కాని డబ్బులు లేకపోయినా ఆనందంతో కలకలలాడుతున్నవారి మొహాలు చూస్తాము. దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఏమిటది? ధనం దానంతట అది ఆనందాన్నీ ఇవ్వదు; దుఃఖాన్నీ ఇవ్వదు.

భార్య ఉంటే ఆనందం కలుగుతుంది అనుకుంటే భార్యలున్నవారంతా ఆనందం అంచులు చవిచూడాలి మరి. కాని భార్య ఉన్నవారంతా సుఖంగా లేరు. భార్యను భరించలేక విడాకులు ఇస్తున్న ఉదంతాలు ఎన్నో వింటున్నాము. అంటే పెళ్ళి చేసుకుంటే ఆనందంగా ఉంటాము అనుకోవటం ఒక పెద్ద అపోహ.

అలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉంటాయి. ప్రపంచంలో ఏ వస్తువు తీసుకున్నా, అది ఆనందాన్నీ ఇవ్వదు; దుఃఖాన్నీ ఇవ్వదు. కాని 'నేను ఆనందాన్నీ, దుఃఖాన్నీ కూడా అనుభవిస్తున్నాను కదా,' అనుకోవచ్చు మీరు. బాహ్యప్రపంచం సుఖదుఃఖాలకు కారణం కాకపోతే, మీకు సుఖదుఃఖాలు తప్పకపోతే, మరి దానికి ఏమిటి కారణం? ఒక్కటే కారణం ఉంది. ఏమిటది? ఈ ప్రపంచాన్ని అనుభవిస్తున్న **మీరే** దుఃఖహేతువు, మీరే సుఖహేతువు కూడా. దయానందస్వామీజీ అంటారు, 'సమస్యా నువ్వే, పరిష్కారం కూడా నువ్వే.'

అందువల్ల మీరే మీ ఆనందానికి కారణం; మీరే మీ దుఃఖానికి కారణం. అలాంటప్పుడు మార్పు రావాల్సింది బాహ్యంగా కాదు; మీలో రావాలి. ఎటువంటి మార్పు?

**అజ్ఞాత అహం దుఃఖకారణమ్, జ్ఞాత అహం సుఖకారణమ్**

మీ గురించి మీకు సరియైన అవగాహన లేకపోవటంవల్ల అది మీకు దుఃఖాన్ని కలుగజేస్తున్నది అంటుంది శాస్త్రం. అంటే సమస్య ఎక్కడుంది? మిమ్మల్ని మీరు సరిగ్గా అర్థం చేసుకోకపోవటంలో ఉంది. అయితే పరిష్కారం ఏమిటి? మిమ్మల్ని మీరు సరిగ్గా అర్థం చేసుకోవటమే. మీ గురించి మీకు తెలియకపోతే దుఃఖం కలుగుతుంది; తెలుసుకుంటే ఆనందం కలుగుతుంది. అందువల్ల దుఃఖాన్ని ఆనందంగా మలుచుకోవాలంటే, అపార్థం చేసుకున్న మిమ్మల్ని మీరు సరిగ్గా అర్థం చేసుకోవాలి. దీన్ని ఆత్మజ్ఞానం అంటారు.

ఛాందోగ్యోపనిషత్తులో నారదులవారు, ఆత్మవిద్యను బోధించమని సనత్కుమారుని దగ్గరికి వెళతారు. ముందు నీకేం వచ్చో చెప్పు అంటారు సనత్కుమారులు. ఆయనకు వచ్చిన విద్యలు చాలా ఉంటాయి. అవి నాలుగు వేదాలు, ఇతిహాస పురాణాలు, వ్యాకరణం, గణితశాస్త్రం, భవిష్యవాణి, భూగర్భవిద్య, తర్కశాస్త్రం, ధర్మశాస్త్రం, నిరుక్తం, వేదాలకు సంబంధించిన శిక్ష, కల్పం, ఛందస్సు, ఇంకా భూతవిద్య, క్షత్రవిద్య, నక్షత్రవిద్య, సర్పవిద్య, దేవవిద్య జనవిద్య వచ్చు. ఇన్ని చెప్పినా కేవలం అనాత్మ ప్రపంచమే తెలుసు; ఆత్మ గురించి తెలియదు అంటారు.

**శృతగ్ం హ్యేవ మే భగవద్దృశేభ్యః** – ఈ క్రింది వాక్యం మీవంటి మహాత్ములనుంచి విన్నాను అని చెబుతాడు. ఏమిటా వాక్యం?

**తరతి శోకమాత్మవిదితి సోఽహం భగవశ్శోచామి**

**తం మా భగవాఞ్ఛోకస్య పారం తారయతు** – ఛాందోగ్యం 7.1

ఆత్మజ్ఞానం పొందినవ్యక్తి మాత్రమే దుఃఖసాగరాన్ని దాటతాడు. నాకు ఆత్మజ్ఞానం తప్ప అన్నీ తెలుసు. నేను శోకంలో ఉన్నాను. ఓ భగవాన్, మీరే నన్ను శోకమనే సాగరంయొక్క ఆవలతీరానికి తీసుకువెళ్ళాలి అంటారు నారదులవారు. శోకంయొక్క ఆవలితీరం అంటే ఆనందతీరం.

నారదులవారు సమస్య ఏమిటో చక్కగా అర్థం చేసుకున్నారు. ఆత్మఅజ్ఞానం శోకానికి కారణం; ఆత్మజ్ఞానం పొందితే సంసారంనుంచి మోక్షం పొందవచ్చు. కాని ఈ విషయం అర్థం చేసుకోవటానికి మనిషి కొన్ని సంవత్సరాలు

కర్మయోగం పాటించాలి. తన సమస్య తనను తను అర్థం చేసుకోకపోవటంలో ఉందని అర్థం చేసుకోవాలి. అంటే తనను తను అర్థం చేసుకోకపోవటం. తన స్వస్వరూపాన్ని అర్థం చేసుకోకపోవటం.

కాని కర్మయోగి తన సాధనవల్ల తన దుఃఖానికి కాని, ఆనందానికి కాని ప్రపంచం కారణం కాదని ఎప్పుడైతే అర్థం చేసుకుంటాడో అప్పుడు అతను ప్రపంచంమీద పెంచుకున్న రాగంనుంచి విడివడతాడు. అందువల్ల అతను **అసక్తబుద్ధిః**.

**విగతస్పృహః** – స్పృహః అంటే కోరిక. కోరిక లేని వ్యక్తి అవుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

బంధానికీ, కోరికకూ మధ్య ఉన్న సూక్ష్మభేదం ఏమిటి? మీ దగ్గర ఉన్న వస్తువుమీద ఉండేదాన్ని రాగం అంటారు; మీ దగ్గర లేని వస్తువును కోరుకోవటాన్ని కామం అంటారు. కర్మయోగికి రాగం, కామం రెండూ ఉండవు. ఎందువల్ల? కర్మయోగం పాటించటంవల్ల. అంతేకాదు, అతను ఉపాసనను కూడా కర్మయోగంలో భాగంగా చేస్తాడు. ఉపాసన అంటే సగుణఈశ్వరధ్యానం.

మన సాంప్రదాయం ఈ సగుణఈశ్వరధ్యానాన్ని మన నిత్యపూజలో ఒక అంతర్గతభాగంగా కూర్చింది. ఏ పారాయణం చేసినా, ముందు ధ్యానశ్లోకాలు ఉంటాయి.

> అథ ధ్యానం; ఆపాతాళనభః స్థలాంతభువన బ్రహ్మాండమావిస్ఫురత్
>
> జ్యోతిః స్ఫాటిక లింగ మౌళి విలసత్ పూర్ణేందు వాంతామృతైః – ధ్యానశ్లోకం

అలా ఏ పారాయణం తీసుకున్నా కూడా, దానిలో భాగంగా ధ్యానశ్లోకాలు ఉంటాయి. అథధ్యానం అంటే ఇప్పుడు ధ్యానం చెయ్యాలని అర్థం. కాని, మనమేం చేస్తాము? ధ్యానశ్లోకాలను కూడా గుక్క తిప్పుకోకుండా గడగడా చదివేస్తాము. అవి మనం కళ్ళు మూసుకుని, ఆ దైవంయొక్క రూపాన్ని మనస్సులో నిలుపుకోవటానికి తోడ్పడతాయి. ఆ రూపాన్ని నిలుపుకుని, పారాయణం చేస్తే ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది.

అంతేకాదు, ధ్యానం చేస్తే శరీర నిగ్రహం కూడా కలుగుతుంది. పదిహేను నిముషాలు కుదురుగా కూర్చోవాలి కాబట్టి శరీరాన్ని అదుపులో పెట్టుకోవటం నేర్చుకుంటాము. మనస్సును అంతర్ముఖం చేస్తాము కాబట్టి, ఇంద్రియ నిగ్రహం పొందుతాము. ఒక రూపంమీద ధ్యానం చేసాము కాబట్టి, మనోనిగ్రహం కూడా పొందుతాము.

**జితాత్మా** – తన మనశ్శరీరాలను జయించిన వ్యక్తి అవుతాడు. ఇక్కడ ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మ కాదు. ఇక్కడ ఆత్మ అంటే కార్యాకరణసంఘాతం. జితమ్ అంటే జయించినవాడు. అష్టాంగయోగం, ధ్యానం, పూజలు, దీనికి బాగా తోడ్పడుతాయి. ఎందుకంటే, ముందు వీటిలో కుదురుగా కూర్చోవటం నేర్చుకుంటాడు. ఇది కూడా కర్మయోగఫలం. అసక్తబుద్ధి అంటే రాగంనుంచి విముక్తి; విగతస్పృహః అంటే కామంనుంచి విముక్తి. జితాత్మా అంటే తన మనశ్శరీరాలమీద జయం; సర్వత్ర అంటే ఎటువంటి పరిస్థితిలో అయినా కూడా. ఈ పదాలన్నిటినీ కలిపి, సాంకేతికపరిభాషలో చెప్పాలంటే సాధనచతుష్టయ సంపత్తి అంటారు. ఇక్కడితో కర్మయోగసాధన అయిపోయిందా? లేదు.

(ఈ స్వాభావికకర్మలను ఈ అధ్యాయము చివరలో ఒక పట్టికలో చూడవచ్చు.)

అసలు సాధన ఇప్పుడే మొదలవుతుంది. దాన్ని జ్ఞానయోగః అంటారు. దాన్ని రెండవ పాదంలో పేర్కొంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సన్న్యాసేన** – సన్న్యాసం అంటే త్యజించటం. మన సాంప్రదాయం వేదాంత విచారణ చెయ్యటానికి సన్న్యాస ఆశ్రమజీవనాన్ని నిర్దేశించింది. సన్న్యాసాశ్రమంలో వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. అందువల్ల సన్న్యాసం పదం జ్ఞానయోగాన్ని సూచిస్తుంది.

అందువల్ల ఇక్కడ సన్న్యాసం అంటే బాహ్యంగా సన్న్యాసాన్ని స్వీకరించటం కాదు. ఒకవ్యక్తి బాహ్యంగా సన్న్యాసాన్ని స్వీకరించి, వేదాంత విచారణ తప్ప అన్ని పనులూ చేస్తూ కూర్చుంటే లాభంలేదు. దానికి బదులుగా గృహస్థాశ్రమంలో ఉంటూనే ఒక క్రమపద్ధతిలో వేదాంత విచారణ చేస్తే అతను సన్న్యాసుల కోవకే వసాడు. అందువల్ల సన్న్యాసేన అంటే జ్ఞానయోగేన అంటే జ్ఞానయోగాన్ని పాటించటంవల్ల,

**నైష్కర్మసిద్ధిమ్ ఆగచ్ఛతి** – మోక్షం పొందుతారు. నైష్కర్మసిద్ధి అంటే మోక్షం. లేదా ఆత్మజ్ఞానం. దాన్ని అలా వర్ణిస్తారు. నైష్కర్మసిద్ధి పదాన్ని అక్షరాలా చూస్తే కర్మ చెయ్యని స్థితి. సిద్ధి అంటే స్థితి లేదా లక్ష్యం; నైష్కర్మ్యం అంటే కర్మ చెయ్యకపోవటం. కాని కర్మలన్నీ నిజంగా మానేసే స్థితి అని తీసుకోకూడదు. కర్మ చెయ్యని స్థితి అంటే జ్ఞానం పొందిన స్థితి. ఏమిటా జ్ఞానం? నేను కర్మ చెయ్యని ఆత్మను అనే జ్ఞానం. సాంకేతికపరంగా చూస్తే ఈ జ్ఞానాన్ని నైష్కర్మసిద్ధి అంటారు. మనస్సు అప్పుడు కూడా హుషారుగానే ఉంటుంది. కాని జ్ఞానయోగం ద్వారా, నేను కర్మ చేసే శరీరాన్ని కాదు; కర్మచేసే మనస్సును కాను; నేను కర్మలకు అతీతంగా ఉన్న చైతన్యతత్త్వాన్ని అని నేర్చుకోవటం.

చైతన్యం గురించిన ఐదు సూత్రాలను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. అందులో ఒకటి చైతన్యం ఈ శరీరంలో ఒక భాగం కాదు, శరీరంనుంచి ఉత్పత్తి చెందలేదు, శరీరంయొక్క లక్షణాలు లేవు. ఈ ఐదు సూత్రాలను అర్థం చేసుకుంటే అతను పొందే జ్ఞానం సారాంశం ఇది –

నేను మారుతున్న శరీరాన్ని కాదు, మారుతున్న ఇంద్రియాలను కాదు, మారుతున్న మనస్సును కూడా కాదు, నేను వాటికి భిన్నంగా, స్వతంత్రంగా ఉండి, వాటిని చైతన్యవంతం చేసే చైతన్యతత్త్వాన్ని. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేశాక, సాధకుడు పొందాల్సిన లక్ష్యం ఇది. ఇది అంతిమలక్ష్యం.

కర్మయోగం ద్వారా చిత్తశుద్ధి పొందాలి. అది మొదటి లక్ష్యం; జ్ఞానయోగం ద్వారా ఆత్మజ్ఞానం, మోక్షం పొందాలి. అది అంతిమలక్ష్యం. **జ్ఞానయోగేన నైష్కర్మసిద్ధిం పరమామ్ అధిగచ్ఛతి.**

ఇక్కడితో కర్మయోగం గురించి కృష్ణపరమాత్మ చేస్తున్న పునశ్చరణ అయిపోయింది (41–49). కర్మయోగంతో నీ సాధన ముగియదు. మోక్షం పొందటానికి జ్ఞానయోగానికి వచ్చితీరాలి.

### బి) జ్ఞానయోగము శ్లోకాలు: 50–55 – విశ్లేషణ

జ్ఞానయోగంలో మూడుసాధనలు ఉన్నాయి. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటం. గురువు దేని గురించి బోధ చేస్తున్నాడో శిష్యుడు మర్చిపోయినా గురువు మర్చిపోకూడదు. అందువల్ల గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయివుండాలి.

**మననం** – ఈ దశలో శిష్యుడు తనకు కలిగిన సంశయాలను తీర్చుకోవాలి. తనకు కలిగిన సందేహాలను మననం దశలో తోటి విద్యార్థిని అడిగో, గురువును అడిగో తీర్చుకోవాలి.

**నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం అంటే నేర్చుకున్న జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటం. అంటే దాన్ని మీ రెండవ స్వభావంగా చేసుకోవాలి. 'నేను శరీరాన్ని కాదు; నేను శరీరానికి భిన్నంగా ఉన్న చైతన్యాన్ని,' అని నేర్చుకుంటే చాలదు. దాన్ని జీర్ణించుకోవాలి. 'నేను శరీరాన్ని కాదు; ఈ శరీరం నాకు వ్యవహారం నడపటానికి భగవంతుని చేత ఇవ్వబడింది. నేను ఈ శరీరానికి అతీతంగా ఉన్న చైతన్యాన్ని. శరీరం మరణించినా, నాకు మరణం లేదు. శరీరం లేకపోతే నేను వ్యవహారాలు నడపలేను; అంతమాత్రాన నేను లేనట్టు కాదు. ఎప్పుడైతే నేను శరీరం కాదని జీర్ణించుకుంటానో అప్పుడు మృత్యుభయం పోతుంది,' అని నేర్చుకుంటారు. అది జీర్ణించుకోవటానికి మీరు సాధన చెయ్యాలి. దాన్ని నిదిధ్యాసనం అంటారు.

అందువల్ల కృష్ణపరమాత్మ కొంత సమయాన్ని పూర్తి ఏకాగ్రతతో నిదిధ్యాసనకు కేటాయించమన్నాడు. అంటే కొంతసేపన్నా సన్న్యాసిగా భావించాలి. బాహ్యంగా సన్న్యాసిగా అవటం కాదు. కాసేపు ఆంతర సన్న్యాసం స్వీకరించాలి. అంటే ఆ కాసేపు మీరు నేను భర్త కాదు, ఉద్యోగిని కాదు, తండ్రిని కాదు అనుకోగలగాలి. మీరు వేసే పాత్రలన్నిటిని కాసేపు పక్కనపెట్టి చాలా శ్రద్ధగా వేదాంత సాధన చెయ్యాలి. మీ స్వస్వరూపంలో నిలవాలి. దానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. మీరు నిదిధ్యాసనం చెయ్యకుండా మీ శ్రవణం అసంపూర్ణం అవుతుంది.

కాఫీ త్రాగేటప్పుడు మీరు రెండు చెంచాలో, మూడు చెంచాలో చక్కెర వేసుకున్నా, కాఫీ తియ్యగా ఉండదు. అయ్యో, తియ్యగా లేదే అని ఇంకో రెండు చెంచాలు కలుపుతారు. అయినా తియ్యగా ఉండదు. ఎందుకు? చక్కెర వేశాక, దాన్ని చెంచాతో కాఫీలో బాగా కలిసేలా తిప్పాలి.

కాఫీలో చక్కెర వెయ్యటం ముఖ్యమా, దాన్ని చెంచాతో కలపటం ముఖ్యమా? ఏది ముఖ్యం? కలపటం ముఖ్యం అన్నారనుకోండి. ఎదుటివ్యక్తి అసలు చక్కెరే వేయకుండా కలుపుతాడు. ఏమీ మార్పు రాదు రుచిలో. చక్కెర వేయటమే ముఖ్యం అన్నారనుకోండి; ఎంత వేసినా తీపి రాదు.

అలా రెండురకాల శిష్యులు ఉన్నారు. కొంతమంది శ్రవణం చేస్తారు కాని నిదిధ్యాసనం చెయ్యరు. వారు చక్కెర మాత్రం వేసినట్టు అన్నమాట. రెండవ తెగకు చెందినవారు వేదాంత శ్రవణం చెయ్యరు. నేను వేదాంత ధ్యానం చేస్తాను అంటే ఆత్మధ్యానం చేస్తాను అంటారు. సరే ఆత్మ అంటే ఏమిటంటే వారికి జవాబు తెలియదు. ఆత్మ గురించి వింటే కదా, ఆత్మజ్ఞానం చెయ్యగలిగేది? చక్కెర వేస్తేనే కదా, దాన్ని కాఫీలో కలపగలిగేది!

**శ్రవణం చెయ్యకుండా నిదిధ్యాసనం అసాధ్యం; నిదిధ్యాసనం లేకుండా శ్రవణం అసంపూర్ణం.**

రెండవభాగాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నిదిధ్యాసనం లేకుండా శ్రవణం అసాధ్యం అనకూడదు. శ్రవణం అసంపూర్ణం. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు మూడూ చాలా ముఖ్యం.

50–55 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ నిదిధ్యాసనాన్ని కీర్తిస్తున్నాడు. దీన్ని **వేదాంతిక్ మెడిటేషన్** అంటారు. కృష్ణపరమాత్మ దీనికి ప్రత్యేకించి ఆరవ అధ్యాయాన్ని కేటాయించాడు. **ఆత్మసంయమ యోగము** దానిపేరు. ఆ అధ్యాయంయొక్క సారాంశాన్నే ఈ శ్లోకాల్లో చూస్తాము.

నిదిధ్యాసనంయొక్క ప్రాథమిక లక్ష్యం, మీరు నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి తోడ్పడటం. నిదిధ్యాసనంలో కొత్తగా జ్ఞానం పొందరు; నిదిధ్యాసనంలో సందేహాలు తీర్చుకోరు; నిదిధ్యాసనంలో మీరు పొందిన జ్ఞానాన్ని మీలో జీర్ణించుకుంటారు. గురువునుంచి నేర్చుకున్న జ్ఞానంలో ఎంతగా నెలకొని ఉండాలంటే అది మీ అణువు అణువులోనూ కలిసిపోవాలి.

కర్మయోగం చేసి జ్ఞానయోగ్యత పొంది, జ్ఞానయోగానికి వచ్చి, ఆత్మజ్ఞానం పొందాలి. జ్ఞానయోగంలో బ్రహ్మ తనకు భిన్నంగా లేదని నేర్చుకుంటాడు సాధకుడు. ఇది చాలా గొప్ప జ్ఞానోదయం.

మొదటిదశలో తను దేనికోసం బాహ్యంగా వెతుకుతున్నాడో, అది బాహ్యంగా దొరకదని తెలుసుకుంటాడు. అదే పెద్ద ఆశ్చర్యం! నమ్మలేని సత్యం! అతను శాంతికోసం బాహ్యంగా వెతుకుతున్నాడు; ఆనందంకోసం బాహ్యంగా వెతుకుతున్నాడు; భద్రతకోసం బాహ్యంగా వెతుకుతున్నాడు. ఇవేవీ బాహ్యంగా దొరకవు. ఒకవేళ దొరికినా శాశ్వతం కాదు, నిజమైనవి కావు. నిజమైన శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యంగా దొరకవు. ఇది మొదటి ఆశ్చర్యం! రెండవ ఆశ్చర్యకరమైన విషయం అది అతను తన స్వస్వరూపం అని తెలుసుకోవటం. శాంతి తన స్వరూపం, భద్రత తన స్వరూపం, ఆనందం తన స్వరూపం.

ఈ జ్ఞానంలో నిలబడితే దాన్ని జ్ఞాననిష్ఠ అంటారు. జ్ఞాననిష్ఠ అంటే జ్ఞానం అప్రయత్నంగా గుర్తుకురావటం. అప్రయత్నంగా గుర్తుకురావటం అంటే మీకు జీవితంలో ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు, ఈ జ్ఞానం దాన్ని ఎదుర్కోవటానికి తోడ్పడాలి. అంటే మీ ప్రయత్నం లేకుండా మీకు తేలిగ్గా అందుబాటులో ఉండాలి. అందువల్ల జ్ఞాననిష్ఠని ఈ విధంగా నిర్వచించవచ్చు. **ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు, అప్రయత్నంగా అందుబాటులోకి రావటం.**

కొంతమంది ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే, అందుబాటులో కొంత డబ్బు ఉండాలని ప్రత్యేకించి పక్కన పెడతారు. బ్యాంకులో ఎఫ్.డి.లు ఉండవచ్చు, సేవింగ్స్ అకౌంట్‌లో డబ్బు ఉండవచ్చు, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు కూడా బాగానే ఉండివుండవచ్చు కాని ఏదో అత్యవసరమైన ఖర్చు వస్తుంది. మూడురోజులు బ్యాంకు సెలవలు వస్తాయి. డెబిట్ కార్డుతో డబ్బు తీద్దామంటే ఏటియమ్‌లో డబ్బులు ఉండకపోవచ్చు; కార్డుతో డబ్బు ఇవ్వలేకుండా, డబ్బులే ఇవ్వాల్సి రావాల్సిన పరిస్థితి రావచ్చు. అలాంటప్పుడు అవసరానికి ఆదుకోని సొమ్ము బ్యాంకుల్లో ఎంత మూలుగుతుంటే మాత్రం లాభమేమిటి? అందువల్ల ముందుచూపు ఉన్న గృహస్థు ఇంట్లోనే సిద్ధంగా కొంత సొమ్మును పక్కన పెట్టుకుంటాడు. ఇందాక చూసిన నిర్వచనాన్ని దీనికి కూడా అన్వయించవచ్చు. **ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు, అప్రయత్నంగా అందుబాటులోకి రావటం.** వ్యవహార పరంగా లౌకిక ధనం అందుబాటులో ఉండాలి.

మనస్సు పరంగా ఆధ్యాత్మిక ధనం అందుబాటులో ఉండాలి. ఎప్పుడు? మీరు వారానికి ఒకరోజు వెళ్ళే గీతాక్లాసులో మాత్రమే కాదు. ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా కూడా అందుబాటులో ఉండాలి. ఇంట్లో కుటుంబ

సభ్యుల మధ్య గొడవ రావచ్చు; ఆర్థిక సంక్షోభం రావచ్చు; ఆరోగ్యం దెబ్బతినవచ్చు; పిల్లలు ఏదో పెద్ద సమస్య సృష్టించవచ్చు. వీటిలో ఏ సమస్య ఎదురైనా, ఈ జ్ఞానం అప్రయత్నంగా అందుబాటులోకి రావాలి.

ఏదైనా వినగానే, ముందు మీరు అలవాటులో పొరపాటుగా 'ఏమిటి?' అని బాధపడవచ్చు. కాని మీరు నిమిషం తర్వాత 'ఏమిటి?'నుంచి 'అయితే ఏమిటి?' దశకు అప్రయత్నంగా చేరుకోవాలి. ఒక్క నిముషమే ఏమిటని బాధపడటానికి ఒప్పుకుంటుంది వేదాంతం. కాని వెనువెంటనే మీరు నేర్చుకున్న జ్ఞానం ఏమిటి? అయితే ఏమిటి అనటం నేర్చుకోండి అంటుంది. అది ఎంత బాధాకరమైన సన్నివేశం అయినా సరే, మీ స్పందన 'అయితే ఏమిటి?' ఉండాలి. అలా ఉండగలిగితేనే వేదాంతం మీకు పనిచేస్తున్నట్టు అర్థం. దీన్ని జ్ఞాననిష్ఠ అంటారు. ఈ జ్ఞాననిష్ఠలో నెలకొనివుంటే బ్రహ్మప్రాప్తి కలుగుతుంది.

ఇక్కడితో జ్ఞానయోగం – విశ్లేషణ అయిపోయింది. ఈ నేపథ్యంతో రాబోయే శ్లోకాలను చూద్దాము.

శ్లో. 50 **సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే ।**
**సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥**
సిద్ధిమ్, ప్రాప్తః, యథా, బ్రహ్మ, తథా, ఆప్నోతి, నిబోధ, మే,
సమాసేన, ఏవ, కౌంతేయ, నిష్ఠా, జ్ఞానస్య, యా, పరా ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ | = ఓ అర్జునా! | యథా | = ఎలా |
| జ్ఞానస్య, యా, | = జ్ఞానయోగముయొక్క | ఆప్నోతి | = పొందునో |
| పరా, నిష్ఠా సిద్ధిమ్ | పరానిష్ఠయైన నైష్కర్మసిద్ధిని | తథా | = ఆ విధానమును |
| యథా | = ఏ విధముగా | సమాసేన, ఏవ | = సంక్షిప్తముగానే |
| ప్రాప్తః | = మనుజుడు పొందునో తరువాత | మే | = నానుండి |
| బ్రహ్మ | = పరబ్రహ్మ పరమాత్మను | నిబోధ | = తెలుసుకొనుము |

**హే కౌన్తేయ! సిద్ధిమ్ ప్రాప్తః (మానవః) యథా బ్రహ్మ ఆప్నోతి,**
**తథా మే సమాసేన ఏవ నిబోధ, యా (చ ఇయం బ్రహ్మ-ప్రాప్తిః)**
**(సా) జ్ఞానస్య పరా నిష్ఠా (వర్తతే) ।**

తా: ఓ అర్జునా! జ్ఞానయోగముయొక్క పరానిష్ఠయైన నైష్కర్మసిద్ధిని ఏ విధముగా మనుజుడు పొందునో, తరువాత పరబ్రహ్మ పరమాత్మను ఎలా పొందునో, ఆ విధానమును సంక్షిప్తముగానే నానుండి తెలుసుకొనుము.

జ్ఞానయోగం గురించి ఇప్పటికే కృష్ణపరమాత్మ చాలా విస్తారంగా 2, 3, 4, 5, 6, 9, 13, 14 అధ్యాయాల్లో చర్చించాడు. కాని శిష్యునిమీద ఉన్న అపారమైన కృపకొద్దీ మళ్ళీ దాని సారాంశాన్ని విశదీకరిస్తున్నాడు.

**సిద్ధిం ప్రాప్తః** – సాధకుడు సిద్ధిని పొందుతాడు. సిద్ధి అంటే ఇక్కడ చిత్తశుద్ధి లేదా జ్ఞానయోగ్యత లేదా సాధన చతుష్టయసంపత్తి. దాన్ని ఎలా పొందుతాడు? కర్మయోగాన్ని పాటించటం ద్వారా అని కలుపుకోవాలి మనం. దాని తర్వాత ఏమవుతుంది?

**(సః) బ్రహ్మ ఆప్నోతి** – దాని తర్వాత బ్రహ్మను పొందుతాడు. జ్ఞానయోగంద్వారా బ్రహ్మను పొందుతాడని కలుపుకోవాలి మనం. కర్మయోగంద్వారా చిత్తశుద్ధి పొందితే, జ్ఞానయోగంద్వారా బ్రహ్మను పొందుతాడు. బ్రహ్మను పొందుతాడు అంటే బ్రహ్మ వేరు, తను వేరు కాదనే ఐక్యజ్ఞానం పొందుతాడు. ఆత్మజ్ఞానం రెండు ఆశ్చర్యకరమైన విషయాలను బోధిస్తుంది. ఒకటి నువ్వు వెతికే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యంగా లేవు; ఇంకొకటి నువ్వే మూర్తీభవించిన శాంతి, భద్రత, ఆనందాలవు; అవి నీ స్వరూపం అంటుంది. ఈ జ్ఞానం పొందుతాడు. దాని తర్వాత ఏమవుతుంది?

**జ్ఞానస్య నిష్ఠా** – జ్ఞానయోగంలో నిదిధ్యాసన చెయ్యటంవల్ల తను పొందిన జ్ఞానంయొక్క నిష్ఠలో నెలకొని ఉంటాడు. జ్ఞాననిష్ఠ అంటే ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు, అప్రయత్నంగా అందుబాటులోకి రావటం అని చూశాము. ఏ పరిస్థితి ఎదురైనా అలవాటులో పొరపాటుగా 'ఏమిటి?' అని ముందు ఒక్కక్షణం బాధపడినా, వెనువెంటనే 'అయితే ఏమిటి?' అని నిశ్చింతగా వెనక్కి వాలగలగటం. అలా ప్రవర్తించగలిగితే, నేర్చుకున్న వేదాంతం వంటబట్టినట్టు అర్థం; జ్ఞాననిష్ఠలో నిలబడినట్టు అర్థం. బ్రహ్మ ఆప్నోతి అన్నా, జ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటాడన్నా అర్థం ఒక్కటే. జ్ఞానయోగంద్వారా ఈ నిష్ఠలో ఎలా నెలకొని ఉండాలో నేను నేర్పిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సమాసేనైవ నిబోధ మే** – దాని గురించి నానుంచి సంక్షిప్తంగా తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. ముందే చూశాము, ఈ పద్దెనిమిదవ అధ్యాయము ఇంతవరకూ వచ్చిన అంశాల సంక్షిప్త వర్ణన.

శ్లో. 51 **బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।**
**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥**
బుద్ధ్యా, విశుద్ధయా, యుక్తః, ధృత్యా, ఆత్మానమ్, నియమ్య, చ,
శబ్దాదీన్, విషయాన్, త్యక్త్వా, రాగద్వేషౌ, వ్యుదస్య, చ ॥

| | | | |
|---|---|---|---|
| విశుద్ధయా | = విశుద్ధమైన | ధృత్యా | = సాత్త్వికధారణాశక్తి ద్వారా |
| బుద్ధ్యా | = బుద్ధితో | ఆత్మానమ్ | = అంతఃకరణమును, ఇంద్రియములను |
| యుక్తః | = కూడినవాడై | నియమ్య | = సంయమమొనర్చి |
| శబ్దాదీన్ | = శబ్ద, స్పర్శ, రూపాదులైన | రాగద్వేషౌ | = రాగద్వేషములను |
| విషయాన్ | = విషయములను | వ్యుదస్య | = సర్వథా త్యజించి |
| త్యక్త్వా | = త్యజించి | చ | = ఇంకా |

**విశుద్ధయా బుద్ధ్యా యుక్తః, ధృత్యా ఆత్మానమ్ నియమ్య చ,**
**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా, రాగ–ద్వేషౌ చ వ్యుదస్య ।**

తా: విశుద్ధమైన బుద్ధితో కూడినవాడై, శబ్ద, స్పర్శ, రూపాదులైన విషయములను త్యజించి, సాత్త్విక ధారణాశక్తి ద్వారా అంతఃకరణమును, ఇంద్రియములను సంయమమొనర్చి రాగద్వేషములను సర్వథా త్యజించి ఇంకా,

మనం ముందే చూసినట్టుగా జ్ఞానయోగంలో మూడుభాగాలు ఉన్నాయి. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం. శ్రవణ మననాలను మూడు పదాల్లో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**విశుద్ధయా బుద్ధ్యా యుక్తః** – ముందు శ్రవణం చెయ్యాలి. అంటే ఉపనిషత్తులను ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చెయ్యాలి. ఆత్మబోధ కూడా మీరు లౌకికంగా నేర్చుకునే కాలేజీ విద్య వంటిదే. దీనికి కూడా ఒక సిలబస్ ఉంటుంది. వేదాంతాన్ని శాస్త్రం అంటారు. ఈ శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. వేదాంతశాస్త్రంలో ఆరు అంశాలను బోధిస్తారు ముఖ్యంగా.

1. జీవ స్వరూపం – జీవుడు ఎవరు?
2. ఈశ్వర స్వరూపం – ఈశ్వరుడు ఎవరు?
3. జగత్ స్వరూపం – జగత్ అంటే ఏమిటి?
4. బంధ స్వరూపం – సంసారం అంటే ఏమిటి?
5. మోక్ష స్వరూపం – మోక్షం అంటే ఏమిటి?
6. సాధన – బంధంనుంచి మోక్షానికి ఎలా వెళ్ళాలి?

ఈ ఆరు అంశాల గురించీ లోతుగా విశ్లేషించాలి. జీవుడు అంటే పంచకోశాలు, అవస్థాత్రయం, శరీరత్రయం గురించి వస్తుంది. ఒక్కొక్కటీ చాలా పెద్ద అంశం. జగత్తు అంటే సూక్ష్మ పంచభూతాల సృష్టి, పంచీకరణం జరిగి స్థూలపంచభూతాల సృష్టి, పాంచభౌతిక ప్రపంచసృష్టి వస్తుంది.

జీవస్వరూపం గురించి ఒక నెల నేర్చుకుని మరో పది సంవత్సరాల తర్వాత జగత్ స్వరూపం నేర్చుకోవటం మొదలుపెడితే, అప్పటికి జీవస్వరూపం అంటే ఏమిటో పూర్తిగా మర్చిపోతారు. మళ్ళీ కొన్నాళ్ళ తర్వాత ఈశ్వర స్వరూపానికి వస్తే, పై రెండూ మర్చిపోతారు. అందువల్ల ఈ ఆరు అంశాల గురించీ కలిపి సంగ్రహంగా నేర్చుకోవాలి.

ఫిజిక్స్‌లో పట్టభద్రులు అవ్వాలంటే ఇరవై సంవత్సరాలు చదువును అభ్యసించాలి; కెమిస్ట్రీలో పట్టభద్రులు అవ్వాలంటే ఇరవై సంవత్సరాలు చదువును అభ్యసించాలి; వేదాంతంలో ఆరితేరాలన్నా కూడా అనేక సంవత్సరాలు ఉపనిషత్తులను అభ్యసించాలి.

చాలామంది ఆధ్యాత్మికత అంటే భజనలు చేస్తేనో, ధ్యానం చేస్తేనో చాలు అనుకుంటారు. ఆధ్యాత్మికత కూడా ఒక కోర్సు; సంగ్రహంగా నేర్చుకోవాల్సిన ఒక విద్య; దానికి పూర్తి ఏకాగ్రత కావాలనే విషయాన్ని మర్చిపోతారు. అందువల్లనే స్వామీజీ, మీరు గీతాబోధకు వెళితే, ఆ రోజు క్లాసులో స్వామీజీ చెప్పిన బోధయొక్క సారాంశాన్ని మీరు టూకీగా రాసుకోండి అంటారు. లేదా ఎవరైనా దొరికితే, అతన్ని కూర్చోబెట్టి మీరు నేర్చుకున్నది వారికి నేర్పించండి అని చెబుతూ ఉంటారు.

అందువల్ల శ్రవణ మననాల ద్వారా నిస్సంశయజ్ఞానం పొందాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిస్సంశయ జ్ఞానాన్ని విశుద్ధయా బుద్ధి అంటున్నాడు కృష్ణపరమాత్మ. విశుద్ధ అంటే సందేహం లేని; బుద్ధి అంటే జ్ఞానం. సందేహం లేని జ్ఞానం అన్నా, సందేహం లేని బుద్ధి అన్నా ఒకటే. అంటే సందేహం లేని జ్ఞానాన్ని కలిగివున్న బుద్ధి. ఇది శ్రవణ, మననాలు చేస్తేనే సాధ్యం.

శ్రవణం చేశాక, ఇంకో శ్రవణం అవసరం లేదు. అంటే కాఫీలో చక్కెర వేశేసారు. ఇప్పుడేం చెయ్యాలి? ఆ చక్కెరను కాఫీలో బాగా కలపాలి. మీరు పొందిన జ్ఞానాన్ని మీ అణువు అణువులో నింపాలి. దానికి ఏం చెయ్యాలి? ఒంటరిగా కాసేపు కూర్చోవాలి. నిదిధ్యాసనం చెయ్యాలి. శ్రవణంలో పొందిన జ్ఞానాన్ని గుర్తు తెచ్చుకోవాలి. అహంకారం నేనును, సాక్షి నేనుగా మార్చుకుని, ఆ జ్ఞానంలో నిలబడాలి. మీకు ఇంతవరకూ అహంకారం నేనుతో మమేకం అవటమే తెలుసు. నేను శరీరాన్ని కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సును కాదు, వీటన్నిటినీ సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని అని శ్రవణంలో నేర్చుకున్నారు కదా. నేను ఆ సాక్షిచైతన్యాన్ని అని అందులో నిలబడాలి. అదెలాగో రాబోయే శ్లోకంలో చెబుతాడు కృష్ణపరమాత్మ.

శ్రవణం అంటే కాఫీలో చక్కెర వేయటం, నిదిధ్యాసనం అంటే ఆ చక్కెరను కాఫీలో బాగా కలపటం అని చూశాము.

నిదిధ్యాసనం చాలా ముఖ్యం. ఎందుకంటే జీర్ణించుకున్న జ్ఞానం మాత్రమే మీకు తోడు వస్తుంది. ఎలాగైతే జీర్ణించుకున్న ఆహారమే మీ శరీరానికి బలాన్ని ఇస్తుందో అలాగే జీర్ణించుకున్న జ్ఞానమే మీ మనస్సుకు బలాన్ని ఇస్తుంది. మీరు ఎంత తిన్నారన్నది కాదు ముఖ్యం, అందులో ఎంత ఆహారాన్ని హరాయించుకోగలిగారు అన్నది ముఖ్యం. ఇక్కడ మీరు శ్రవణం పొందిన జ్ఞానం ఆహారం; మీరు నిదిధ్యాసనలో జీర్ణించుకున్నది మీ పోషణ.

అందువల్ల జ్ఞానం పొందటం ఎంత ముఖ్యమో, ఆ పొందిన జ్ఞానాన్ని జీర్ణించుకోవటం కూడా అంతే ముఖ్యం లేదా అంతకన్నా ముఖ్యం. అందువల్ల ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ నిదిధ్యాసన గురించి ప్రత్యేకించి చెబుతున్నాడు. నిదిధ్యాసనం అంటే మీరు నేర్చుకున్న జ్ఞానంలో వీలున్నంతగా నిలబడటం. మీరు నడిపే జీవనం మీరు పొందిన జ్ఞానానికి అనుగుణంగా ఉండాలి. మీకు తెలిసినదానికీ, మీరు చేస్తున్నదానికీ మధ్య పెద్ద అగాధం ఉండకూడదు. వేదాంతం నేర్చుకుని అక్రమాలు చెయ్యకూడదు. అందువల్ల మనోవాక్కాయ కర్మలను నిరంతరం పరిశీలించుకుంటూ ఉండాలి. మనస్సు చెప్పింది చెప్పాలి; నోరు చెప్పింది చెయ్యాలి. దీనికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది.

నిదిధ్యాసనం అంటే ముఖ్యంగా మీరు నేర్చుకున్న బోధలో నెలకొని ఉండటం అని చూశాము. అది అనేక రకాలుగా చెయ్యవచ్చు. మనస్సు బోధమీద నిలబడటం ముఖ్యం.

- పదేపదే శ్రవణం చెయ్యవచ్చు. ఒకటి, రెండుసార్లు విన్నప్పుడు జ్ఞానం పొందుతారు; కాని జ్ఞానం పొందాక కూడా శ్రవణం చేస్తూ ఉంటే, కొత్తగా మీరు నేర్చుకునేదేమీ ఉండదు; నేర్చుకున్నదాన్నే బాగా జీర్ణించుకుంటారు.

- పదేపదే చదవటం.
- పదేపదే రాయటం. మీరు నేర్చుకున్నదాన్ని రాసుకోవటం.
- పదేపదే తోటి విద్యార్థులతో చర్చించటం.
- మీరు నేర్చుకున్నదాన్ని ఇంకొకరితో పంచుకోవటం, లేదా వారికి బోధ చెయ్యటం.

పైన చెప్పిన ఈ మార్గాలన్నింటిలోనూ, మనస్సు బోధమీద నిలబడటానికే ప్రాముఖ్యతను ఇస్తాము. ఎలా కూర్చుంటారు అనే విషయాన్ని పట్టించుకోము. పద్మాసనంలోనే కూర్చుని క్లాసు వినాలి అనము. అలా చెబితే, ఎవరూ క్లాసుకి వెళ్ళరు. ఒకవేళ వెళ్ళినా, పద్మాసనంలో కూర్చోగలిగినా, దాన్నించి బయటకు రావటం చాలా కష్టం చాలామందికి. అందువల్ల ఎలా కూర్చున్నారు, ఎక్కడ కూర్చున్నారు కాదు ముఖ్యం; నడుము వాల్చి కూడా వినవచ్చు, కాకపోతే దానివల్ల ఒక ప్రమాదం ఉంది. అది వింటూవింటూ మీకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల కూర్చోవటం కాదు ముఖ్యం, మనస్సు పెట్టి శ్రద్ధగా వినటం ముఖ్యం. అందువల్ల వింటున్నా, చదువుతున్నా, రాస్తున్నా, చర్చిస్తున్నా, బోధిస్తున్నా, మీరు కూర్చునే విధానంతో సంబంధం లేదు. మీ మనస్సు ముఖ్యం.

ఇవికాక, కూర్చునే విధానానికి కూడా ప్రాముఖ్యతను ఇచ్చే ఇంకొకరకమైన నిదిధ్యాసనం ఉంది. శాస్త్రం ఆ విధమైన నిదిధ్యాసనాన్ని కూడా సూచిస్తుంది. మీకు ఇష్టమైతే దాన్ని పాటించవచ్చు; ఇష్టం లేకపోతే పాటించనవసరం లేదు. పూర్తిగా మీ ఇష్టం. మనస్సే ప్రధానం అన్నాము కాని, ఆ మనస్సుకు తోడుగా నిలవటానికి, మనస్సు ఏకాగ్రత చూపటానికి కొన్ని బహిరంగ సాధనలు కూడా ముఖ్యం. ఇటువంటి నిదిధ్యాసనను **సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనము** అంటారు. దీనికి పతంజలియోగ సూత్రాలు ఆధారం. కృష్ణపరమాత్మే స్వయంగా సమాధి అభ్యాసం గురించి వివరంగా ఆరవ అధ్యాయంలో బోధించాడు. పతంజలి యోగసూత్రాల గురించి కూడా చూశాము. వాటిని అంతలోతుగా ఇప్పుడు మళ్ళీ చూడము కాని, సందర్భం వచ్చింది కాబట్టి అవేమిటో మళ్ళీ ఒకసారి చూద్దాము. అష్టాంగయోగంలోంచి ఆరు అంశాలు చూస్తాము. అవి ఆసనం; ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి. తక్కిన రెండూ యమనియమాలు. అవి ప్రస్తుతం అవసరం లేదు.

ఎ) **ఆసనం** – ఆసనం అంటే ఒక సరియైన ఆసనంలో కదలకుండా, స్థిరంగా కొంతసేపు కూర్చోగలగాలి.

**సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః**

శరీరం, మెడ, శిరస్సు మూడూ ఒక లంబరేఖలో ఉండాలి. ఇది అన్నమయకోశానికి చెందినది.

బి) **ప్రాణాయామం** – ప్రాణాయామం ప్రాణమయకోశానికి చెందినది. ప్రాణాయామం అంటే శ్వాసను క్రమబద్ధీకరణం చెయ్యటం. ఈ అంశాన్ని కృష్ణపరమాత్మ ఐదవ అధ్యాయంలో పేర్కొన్నాడు. పంజరంలో బంధించబడ్డ పక్షి ఎలాగైతే పంజరంనుంచి ఎగిరిపోలేదో, అలాగే ప్రాణాయామం అనే పంజరంలో బంధించబడ్డ మనస్సు, శరీరాన్ని వదిలి బయటకు వెళ్ళలేదు.

వేదాంతబోధలో నిలబడే ముందు, శ్వాసను క్రమబద్ధీకరణం చేసుకోవాలి. వెయిట్ లిఫ్టింగ్ చేసే ఛాంపియన్ ఆ వెయిట్‌ను ఎత్తేముందు కళ్ళు మూసుకుని, కొన్నిసార్లు శ్వాసపీల్చి వదులుతాడు. చేతితో చేసేపనికి కూడా శ్వాసను నియంత్రిస్తున్నాడు అంటే అన్నింటికీ అవినాభావ సంబంధం ఉందన్నమాట. అంతేకాదు, మన వైదిక సాంప్రదాయంలో ప్రాణాయామాన్ని ఒక నియమంగా పెట్టారు. ఎందుకంటే యజ్ఞం చెయ్యటానికి, జపం చెయ్యటానికి, ధ్యానం చెయ్యటానికి కావాల్సిన ఏకాగ్రతను ప్రాణాయామం ద్వారా పెంపొందించుకోవచ్చు. అందువల్ల గణపతి ప్రార్థన అవగానే, ప్రాణాయామం చెయ్యమంటారు.

సి) **ప్రత్యాహారం** – ఇంద్రియ నిగ్రహం. బాహ్యముఖంగా ఉన్న ఇంద్రియాలను బాహ్యవస్తువులనుంచి విడదీసి, అంతర్ముఖం చెయ్యటం. ఇంద్రియ నిగ్రహాన్ని దమము అంటారని తత్త్వబోధలో చూశాము. దానినే ఇక్కడ ప్రత్యాహారం అంటోంది యోగశాస్త్రం.

డి) **ధారణ** – ధారణ అంటే ఏకాగ్రత చూపటం. దానికి బాహ్యప్రపంచంనుంచి దృష్టిని మరల్చి, ధ్యానం చేసే వస్తువుమీద దృష్టి నిలపాలి. ఇంకో విధంగా చెప్పాలంటే మనస్సును అనాత్మ విషయాలనుంచి మళ్ళించి, ఆత్మ మీద పెట్టాలి. బాహ్యవస్తువులుగా కనబడే జగత్తు, శరీరం, ఇంద్రియాలు, మనస్సు – ఇవేవీ ఆత్మ కాదు; వీటిని సాక్షిగా చూసే చైతన్యమే ఆత్మ అని తెలుసుకోవాలి. అలా మనస్సును బాహ్యవస్తువునుంచి మళ్ళించి ఆత్మమీద నిలపటాన్ని ధారణ అంటారు.

ఇ) **ధ్యానం** – ధ్యానం అంటే ధ్యానవస్తువుమీద మనస్సును నిలపటం. ధారణకు, ధ్యానానికి సూక్ష్మభేదం ఉంది. ధారణ అంటే ఒక వస్తువుమీద దృష్టి పెట్టటం; ధ్యానం అంటే ఆ వస్తువుమీదే దృష్టిని నిలబెట్టటం. మనస్సు చంచలంగా ఉంటుంది. అది ఎటో వెళ్ళిపోతుంది. మారాం చేసే చిన్నపిల్లవాణ్ణి వెనక్కి లాగినట్టు మనస్సును కూడా వెనక్కి లాగాలి. ఫ్రీవిల్‌ను ఉపయోగించి, ప్రయత్నపూర్వకంగా ఆలోచనలను వెనక్కి లాగుతూ, మనస్సును నిలపటానికి చేసే ఈ తతంగాన్ని ధ్యానం అంటారు. ఎక్కడ నిలపాలి? ధ్యానవస్తువుమీద నిలపాలి.

ఎఫ్) **సమాధి** – చంచలంగా పరుగులు తీస్తున్న మనస్సును ధ్యానవస్తువుమీద నిలబెట్టటం ధ్యానం అని చూశాము. సమాధిలో ధ్యానవస్తువులో సహజంగా స్థిరపడటం జరుగుతుంది. ధ్యానం వరకే ఫ్రీవిల్ వాడాలి; శ్రమపడాలి; ప్రయత్నం చెయ్యాలి. కాని సమాధిలో యుద్ధం ముగిసి, మనస్సు నిలకడ చెందుతుంది.

ఆత్మ చైతన్యం లక్షణాలను మీకు అన్వయించుకోవాలి. నేను నిత్యం; శుద్ధం; అసంగం అనుకోవాలి. కాసేపయ్యాక, మనస్సు సహజంగా ఆ ఆలోచనల్లో స్థిరపడిపోతుంది. మనస్సు అలా స్థిరబడేసరికి, అది అప్రయత్నంగా బోధలో నిలబడుతుంది. అప్పుడు మీరు కష్టపడి ప్రయత్నం చెయ్యనవసరం లేదు. ఇలా సహజంగా, అప్రయత్నంగా ఆత్మలో నెలకొని ఉండటాన్ని సమాధి అంటారు. ఇవన్నీ కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలో వివరంగా చర్చించాడు.

**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్** – 6.25

**యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ ।**
**తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ ॥** – 6.26

**యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।**

**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః ॥** – 6.19

స్థిరంగా ఉన్న మనస్సును, స్థిరంగా ఉన్న దీపంతో పోల్చాడు కృష్ణపరమాత్మ. దీపం పైన ఒక గాజుపలక పెడితే, ఆ దీపం స్థిరంగా వెలుగుతుంది. అదే విధంగా సమాధిలో ఉన్న వ్యక్తి మనస్సు కూడా స్థిరంగా నిలబడుతుంది. దేనిమీద? అహం బ్రహ్మాస్మి; అహం శరీర విలక్షణ అస్మి అనే అంశాలమీద. శ్రవణంలో ఏది నేర్చుకుంటే దానిమీద నిలబడుతుంది.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. నిదిధ్యాసనాన్ని శ్రవణం విజయవంతంగా పాటించాకే, సాధన చెయ్యగలరని. ఎవరినైనా పిలిచి ఆత్మధ్యానం చెయ్యమని చెబితే, అతను వెంటనే ఎదురు ప్రశ్నిస్తాడు. 'ఆత్మ అంటే ఏమిటి?' శాస్త్ర అధ్యయనం చేసి ఆత్మ లక్షణాలు తెలుసుకోవాలి ముందు. ఆత్మ అవస్థాత్రయ సాక్షి చైతన్యం; పంచకోశ అతీతం, శరీరత్రయ విలక్షణం. అవస్థాత్రయ సాక్షిచైతన్యం అంటే జాగ్రదావస్థను, స్వప్నావస్థను, సుషుప్తి అవస్థను కూడా సాక్షిగా చూస్తుంది ఆత్మ.

నిజానికి నిదిధ్యాసనం అంటే వేదాంత శ్రవణాన్ని మళ్ళీ గుర్తు తెచ్చుకోవటమే. శ్రవణానికీ, నిదిధ్యాసనానికీ మధ్య భేదం లేదు. శ్రవణంలో రికార్డ్ ప్లేయర్ పనిచేస్తుంది; నిదిధ్యాసనంలో రీప్లే పనిచేస్తుంది. రికార్డు ప్లేయర్‌లో ఏమీ రికార్డు చెయ్యకుండా, కేవలం రీప్లే చేస్తానంటే ఏమైనా వస్తుందా? అలాగే శ్రవణంలో వినకుండా, నిదిధ్యాసన చేస్తానంటే ఏమీరాదు.

శ్రవణం అంటే గురువు సమక్షంలో, బుద్ధిని ఉపయోగించి చేసే వేదాంత చింతన. నిదిధ్యాసనం అంటే గురువు ప్రమేయం లేకుండా బుద్ధిని ఉపయోగించి చేసే వేదాంత చింతన.

**గురుపూర్వక వేదాంత చింతనం శ్రవణమ్, గురురహిత వేదాంత చింతనం నిదిధ్యాసనమ్**

మీరు ఈ వేదాంత చింతనలో అలా కొన్ని సంవత్సరాలు నిలబడితే, అది మీ రెండవ స్వభావం అవుతుంది. దానినే జ్ఞాననిష్ఠ అంటారు. ఆ జ్ఞానాన్ని జీర్ణించుకుంటేనే, అది మీకు క్లిష్టపరిస్థితుల్లో అక్కరకు వస్తుంది. ఏదైనా సమస్య ఎదురైనా, ఏదైనా మటుమాయమైనా, స్వంతవారు దూరమైనా, యవ్వనం కరిగిపోతున్నా, ఆరోగ్యం క్షీణించిపోతున్నా, రాహుదశ కేతుదశలు కబళించి వేస్తున్నా, స్థిరంగా నిలబడటానికి ఈ జ్ఞాననిష్ఠ తోడ్పడుతుంది.

జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలంటే దానికోసం చాలా సమయాన్ని వెచ్చించగలగాలి. దానికి అడ్డదోవలు లేవు. ముందుగా బోధను వినాలి. అది కూడా ఎలా? చాలా శ్రద్ధగా! ఎవరు చెబుతున్నారు దీన్ని? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే! సమాధి అభ్యాసకు మొదటిదశగా చెప్పినది – బుద్ధ్యా విశుద్ధయా యుక్తః. మీకు నిదిధ్యాసనం చెయ్యాలనివుంటే, వేదాంత శ్రవణ, మననాలు చేసితీరాలి. విశుద్ధబుద్ధి అంటే వేదాంతబోధ గురించిన స్పష్టమైన జ్ఞానం.

స్పష్టమైన జ్ఞానం అంటే ఏమిటి? స్పష్టంగా లేని జ్ఞానం కూడా ఉంటుందా ఏమిటి? స్పష్టంగా లేని జ్ఞానం అంటే సందేహాలతో కూడిన జ్ఞానం. స్పష్టమైన జ్ఞానం అంటే నిస్సంశయ జ్ఞానం; సందేహాలు లేని జ్ఞానం.

నా జీవితంతో అతి సన్నిహితంగా పెనవేసుకున్న మూడు ముఖ్యమైన విషయాల గురించి బోధ చేస్తుంది వేదాంతం. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు. జీవుడనైన నేను ఈ జగత్తుతో వ్యవహారం జరుపుతాను. జగత్తు నన్ను బాధపెడుతుంది; నేను ఈశ్వరునికి మొరపెట్టుకుంటాను. ఈశ్వరుడు జీవ, జగత్తుల సృష్టికర్త. వేదాంతం ఈ మూడింటి గురించీ మాట్లాడుతుంది కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ మూడింటి గురించీ నాకున్న అవగాహనకు పూర్తి భిన్నంగా బోధిస్తుంది.

1. **జీవుడు** – జీవుడైన నేను అనిత్యం అనుకుంటాను; కాని నువ్వు నిత్యం అంటుంది వేదాంతం.

2. **జగత్తు** – నా కంటికి ఎదురుగా కనిపిస్తున్న జగత్తు సత్యం అనుకుంటాను కాని అసలు జగత్తే లేదు అంటుంది వేదాంతం.

3. **ఈశ్వరుడు** – ఈశ్వరుడు ఎక్కడో దూరంగా కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడనీ, నాకు భిన్నంగా ఉన్నాడనీ అనుకుంటాను. కాని వేదాంతం పరమాత్మ నీకు భిన్నంగా, నీకు దూరంగా లేదు; నువ్వే ఆ బ్రహ్మవు అంటుంది.

అంటే నాకు తెలిసిన ప్రతిదాన్నీ ఖండిస్తున్నది. కనిపించే జగత్తు మిథ్య అంటుంది; కనబడని బ్రహ్మ సత్యం అంటుంది. నేను ఆ బ్రహ్మ తప్ప వేరే ఏమీకాదు అంటుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాఽ పరః**

ఇది వేదాంతసారం. కాని ఈ మూడు వాక్యాలను జీర్ణించుకోవటమే చాలా కష్టం. అందువల్ల ముందు ఈ జ్ఞానాన్ని నిస్సంశయ జ్ఞానంగా శ్రవణ, మననాల దశల్లో పొందాలి. అందువల్ల **విశుద్ధయా బుద్ధ్యా.**

**ధృత్యాత్మానం నియమ్య చ** – వేదాంతబోధమీద మీరు ఏకాగ్రత చూపాలి అంటే, ముందు మీకా వేదాంతబోధయొక్క విలువ తెలియాలి. ఎందుకంటే మనస్సు చాలా పొదుపుగా ఉంటుంది, సమయం విషయంలో అయితే మరీ పొదుపుగా ఉంటుంది. మీరు చేస్తున్న ఏదైనా పని అనవసరం అని దానికి అనిపిస్తే, మనస్సు ఆ విషయంమీద లగ్నం చేయకుండా, దేశమంతా తిరిగివస్తుంది.

మీరు విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్నారనుకోండి. అది మీకు కంఠతా వచ్చు; చూడకుండా చదవగలరు; అందువల్ల గడగడా, తడుముకోకుండా ఇరవై నిముషాలలో మొత్తం చదివేయగలరు. అప్పుడు మనస్సు అతి తెలివి చూపిస్తుంది. నా అవసరం లేదు ఇక్కడ. వాక్కు నా ప్రమేయం లేకుండా దాని పని అది చేసుకుపోతున్నది. ఈ సమయాన్ని వేరే దేనికైనా ఉపయోగించుకోవచ్చు అనుకుంటుంది. అందువల్ల ఆ ఇరవై నిముషాలూ మనస్సుకు ఇంతకన్నా విలువైనది అనిపించిన ఇంకో విషయంమీదకు వెళ్ళివాలుతుంది. ఆఫీసులో ఆరోజు మీరు మీటింగ్‌లో చాలా ముఖ్యమైన విషయాలు మాట్లాడాల్సి ఉంటే, మనస్సుకు అది ముఖ్యం అనిపిస్తుంది. విష్ణుసహస్రనామ పారాయణం చిన్నదవుతుంది. యాంత్రికంగా చేసే వాక్కు చేసేస్తుంది దాన్ని.

మనస్సుకు ఒకటే భాష తెలుసు. **మనస్సు దేనికి విలువను ఇస్తుందో, అక్కడికి అది వెళుతుంది.** అందువల్ల ఒక వస్తువుమీద ఏకాగ్రత, ఆ వస్తువుకు మీరు ఇచ్చే విలువమీద ఆధారపడివుంటుంది. మీకు ఏకాగ్రత

కుదరదు అనకండి. మనిషిగా మీకు ఎంతో ఏకాగ్రత చూపించే శక్తి ఉంది; కాకపోతే ఆ ఏకాగ్రత మీరు ముఖ్యమని భావించే విషయాలమీద మాత్రమే చూపుతారు. అందువల్ల నిదిధ్యాసనం మీకు సహజంగా అబ్బాలంటే వేదాంతానికి మీరు విలువను ఇచ్చితీరాలి.

వేదాంతానికి విలువను ఇస్తే, మీరు ఆఫీసు పనిలో తలమునకలుగా మునిగివున్నా కూడా, వేదాంతంమీదకే మనస్సు పోతుంది. విజ్ఞానశాస్త్రజ్ఞుడు ఎక్కడికెళ్ళినా తన పరిశోధన గురించే ఆలోచిస్తాడు; చదరంగంలో ఆరితేరిన వ్యక్తి ఎప్పుడూ చదరంగం గురించే ఆలోచిస్తాడు.

అందువల్ల ధృతి అంటే నిదిధ్యాసనంయొక్క విలువమీద ఏర్పడిన దృఢనమ్మకం. ఆత్మ అంటే ఇక్కడ మనస్సు, ఇంద్రియాలు; నియమ అంటే బాహ్యవిషయాలనుంచి దృష్టిని మరలించటం. అంటే నిదిధ్యాసనం విలువను గ్రహించి మనస్సేంద్రియాలను బాహ్యవస్తువులనుంచి వెనుకకు లాగాలి. అది **ధృత్యాత్మానం నియమ్య చ**.

**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా** – శబ్దాది విషయాలనుంచి ఇంద్రియాలను వెనక్కి లాగాలి. పంచజ్ఞానేంద్రియాలు శబ్దస్పర్శరూపరసగంధాలను మోసుకువస్తాయి. కనీసం నిదిధ్యాసనం చేసే ఇరవై నిముషాలసేపైనా ఈ విషయ వస్తువుల జోలికి పోకుండా ఉండాలి. దీన్ని పతంజలి యోగసూత్రాల పరిభాషలో చెప్పాలంటే ప్రత్యాహారం అంటారు.

**రాగద్వేషౌ వ్యుదస్య చ** – రాగద్వేషాలను కూడా త్యజించాలి, నిదిధ్యాసనం చేసేటప్పుడు. ఎందుకంటే మనస్సు, దానికి దేనిమీద రాగం లేదా ద్వేషం ఉంటుందో దానివైపు పరిగెడుతుంది.

మీరు రోడ్డుమీద నడుస్తుంటే, వందలకొద్దీ మనుష్యులు మీకు ఎదురవుతారు. వారెవరో మీకు తెలియనుకూడా తెలియదు. అందువల్ల మీకు వారిమీద రాగమూ లేదు, ద్వేషమూ లేదు. అందువల్ల వారిని పట్టించుకోరు. ఎన్నో దేశాల్లో భూకంపం వచ్చిందనీ, తుఫాను వచ్చి వందలకొద్దీ మనుష్యులు చనిపోయారనీ వార్తలు వస్తూనే ఉంటాయి. వాటిని మీరు నిరాసక్తంగా చదివి వదిలివేస్తారు. అదే ఆ దేశంలోనో, ఆ ఊర్లోనో మీ ఆత్మీయులు ఎవరో ఉన్నారని తెలిస్తే, వారి గురించి బెంగ పడతారు. అది కూడా ఎప్పుడు? సరిగ్గా నిదిధ్యాసనంలో కూర్చున్నప్పుడు.

అలా రాగద్వేషాలు మనస్సును ధ్యానంనుంచి వాటివైపుకు లాక్కుపోతాయి. అందువల్ల మీ రాగద్వేషాలకు అతీతంగా ఎదగటం నేర్చుకోండి. నిజానికి ఈ రాగద్వేషాలను అధిగమించటం కర్మయోగం స్థాయిలోనే సాధించి ఉంటారు. జ్ఞానయోగానికి వచ్చాక, కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు.

కాని కృష్ణపరమాత్మకు మనుష్యుల మనస్తత్వం గురించి బాగానే తెలుసు. వేదాంతానికి మనం వెనకదోవనుంచి వచ్చామని; అందువల్ల ముందే నిదిధ్యాసనకు వచ్చామనీ తెలుసు. అందువల్ల నిదిధ్యాసనం చేసేముందు, రాగద్వేషాలను అరికట్టాలి అని గుర్తు చేస్తున్నాడు. వ్యుదస్య అంటే వాటికి అతీతంగా ఎదగండి అని అర్థం. రాగద్వేషాలకు అతీతంగా ఎదగండి, అవి మిమ్మల్ని లొంగదీసుకోకుండా చూసుకోండి అంటున్నాడు.

ఇంతవరకూ చెప్పిన అంశాలు నిదిధ్యాసన ఎలా చెయ్యాలో సూచించవు. ఇవి నిదిధ్యాసన చెయ్యటానికి తోడ్పడే సాధనాలు. ఈ సాధనాలను అంతరంగ సాధనాని అంటారు. ఆరవ అధ్యాయంలో వివరంగా ఈ అంశాలను చూశాము. అవి బహిరంగ సాధనలు, అంతరంగ సాధనలు, ధ్యానస్వరూపం, ధ్యానఫలం, ధ్యాన ప్రతిబంధకాలు, ధ్యాన ప్రతిబంధక పరిహారాలు. ఈ అంశాలన్నిటినీ చాలా వివరంగా చూశాము అక్కడ. అంతరంగ సాధనలో మళ్ళీ ఎనిమిది అంశాలను చూశాము. వాటి వివరాలలోకి వెళ్ళటం లేదు మనం ఇప్పుడు. వాటి పేర్లను మాత్రం చూద్దాము. అవి – దేశం, కాలం, ఆసనం, శరీరస్థితి, ప్రాణయామం, ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం, బుద్ధినిశ్చయం. ఆ అంశాలన్నీ ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ఈ భాగం అంటే 50 నుంచి 55 శ్లోకాలు ఆరవ అధ్యాయం సారాంశం అని చూశాము.

శ్లో. 52 **వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥**
వివిక్తసేవీ, లఘ్వాశీ, యతవాక్కాయమానసః,
ధ్యానయోగపరః, నిత్యమ్, వైరాగ్యమ్, సముపాశ్రితః ॥

| | | | |
|---|---|---|---|
| లఘ్వాశీ | = తేలికయైన సాత్త్వికాహారమును మితముగా భుజించువాడును | యతవాక్కాయ మానసః | = మనోవాక్కాయములను అదుపులో ఉంచుకొనినవాడును |
| వివిక్తసేవీ | = పరిశుభ్రమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడును | నిత్యమ్ | = నిరంతరము |
| | | వైరాగ్యమ్ | = దృఢవైరాగ్యమును |
| | | సముపాశ్రితః | = ఆశ్రయించినవాడును |
| | | ధ్యానయోగ పరః | = ధ్యానయోగ పరాయణుడైన వాడును |

**వివిక్త–సేవీ, లఘు–ఆశీ, యత–వాక్–కాయ–మానసః, నిత్యమ్**
**ధ్యాన–యోగ–పరః, వైరాగ్యమ్ సముపాశ్రితః (చ) ।**

తా: తేలికయైన సాత్త్వికాహారమును మితముగా భుజించువాడును, పరిశుభ్రమైన ప్రదేశమున ఏకాంతముగా నివసించువాడును, మనోవాక్కాయములను అదుపులో ఉంచుకొనినవాడును, నిరంతరము దృఢవైరాగ్యమును ఆశ్రయించినవాడును, ధ్యానయోగ పరాయణుడైన వాడును,

ఇప్పుడు చూసిన అంశాలన్నిటినీ కృష్ణపరమాత్మ ఒక క్రమపద్ధతిలో ఇవ్వటం లేదు. ఆమాటకొస్తే ఆరవ అధ్యాయంలో కూడా క్రమపద్ధతిలో ఇవ్వలేదు. మనం వాటిని ఒక పద్ధతిలో ఏర్పరచుకున్నాము. మన ప్రయాణం అన్నమయకోశంనుంచి మొదలై, నెమ్మదిగా లోపలికి సాగాలి. అన్నమయకోశంనుంచి ప్రాణమయకోశానికి వచ్చి, ప్రాణమయకోశంనుంచి మనోమయకోశానికి రావాలి. అందులో కూడా ముందు ఇంద్రియాలకు, తర్వాత మనస్సుకు రావాలి. ఆ తర్వాత విజ్ఞానమయకోశానికి రావాలి. ఇవి మనకు ముందే తెలుసు కాబట్టి, కృష్ణపరమాత్మ వరుస క్రమానికి ప్రాముఖ్యతను ఇవ్వటంలేదు.

**వివిక్తసేవీ** – వీలున్నంత ఏకాంత ప్రదేశాన్ని ఎన్నుకోండి. బాహ్యప్రపంచపు రణగొణ ధ్వనులు తక్కువగా ఉండే ప్రదేశం. వివిక్తః అంటే ఏకాంత ప్రదేశం. ఇంకోచోట ఏకాకీ అంటాడు. అంటే ఒంటరిగా ఉండాలి. లేకపోతే

ధ్యానం గురించి తప్ప అన్ని విషయాల గురించీ వస్తాయి. అందువల్ల ఏకాకిగా ఉండగలగటం అలవాటు చేసుకోవాలి.

ఏకాకిగా ఉండాల్సింది ఒక్క ధ్యానం చెయ్యటానికే కాదు; ఒంటరిగా ఉండగలగటం ఒక పెద్ద వరంగా మారుతుంది ముందుముందు. మనం ఈ భూమ్మీదకు ఒంటరిగా వచ్చాము, వంటరిగా వెళ్ళిపోతాము. మధ్యలో వచ్చినవారు కూడా మనకు సమస్యలు చుట్టుముట్టినప్పుడు ఆదుకోలేరు. వారికి ఆ సమస్యల సాంద్రత తెలియదు కూడా.

ఈ ఒంటరితనం వృద్ధాప్యంలో బాధిస్తుంది, ముఖ్యంగా రాత్రిళ్ళు మీకు నిద్ర పట్టకుండా మంచంమీద అటూఇటూ దొర్లుతుంటే; తక్కినవారు హాయిగా గురకపెట్టి నిద్రపోతుంటారు. అదీ కాకపోతే ఏ తీవ్రమైన అనారోగ్యమో వచ్చి ఆసుపత్రిలో చేరితే, అది కూడా ఒంటరి పోరాటమే అవుతుంది. మీ ఆత్మీయులైనవారు మీ చుట్టూ ఎంతమంది ఉన్నాకూడా, ఐసియూలో మీరు ఒంటరిగా ఉండాలి; వారిని రానివ్వరు; మీ అనారోగ్యంతో మీరే యుద్ధం చెయ్యాలి. ICU అంటే డాక్టరు I See You అని చెప్పినట్టు అర్థం. అంటే డాక్టరే చూడగలడు, వేరెవ్వరూ మిమ్మల్ని చూడలేరు.

ఇది మీరు జీర్ణించుకోగలిగినా, జీర్ణించుకోలేకపోయినా ఇది నగ్నసత్యం. మీరు ఒంటరిగా వచ్చారు, వంటరిగా వెళతారు. అది గ్రహిస్తే ఇప్పటినుంచే ఒంటరితనాన్ని అలవరచుకోవచ్చు.

ఒంటరిగా అంటే అన్ని విధాలా ఒంటరిగా. మనుష్యులు లేకుండా వెళ్ళి, ఏ వాక్‌మన్‌నో తోడు తీసుకు వెళ్ళకూడదు. అందులో పాటలు వింటూ కూర్చుంటే, ఇంక ఏకాంతం ఎక్కడ? లేదా సెల్‌ఫోన్ తీసుకువెళ్ళి, గంటల తరబడీ మాట్లాడకూడదు. మీకు మీరే ఉండాలి; నిశ్శబ్దంగా, ఒంటరిగా.

చిన్మయానంద స్వామీజీ సాధన శిబిరం నిర్వర్తించినప్పుడు ప్రతి ఒక్క సాధకుణ్ణీ ఒంటరిగా వెళ్ళి, ఏకాంతంగా కొంత సమయం గడపమని సూచించేవారు. అది చాలా విశాలమైన ప్రాంగణం; అక్కడ అందరికీ ఏకాంతం విడివిడిగా దొరుకుతుంది. స్వామీజీ వారిని గమనిస్తుంటారని వారికి తెలుసు. అందుకని వారేం చేసేవారు? వెళ్ళటం ఒంటరిగానే వెళ్ళేవారు. కాని ముందే ఒప్పందం చేసుకునేవారు తోటివారితో. ఫలానా చోట కలుసుకుందామనుకునేవారు. అలా చివరికి ఎక్కడ చూసినా కనీసం ఇద్దరు, ముగ్గురు కలిసివుండేవారు.

దయానంద స్వామీజీ చెబుతారు, 'అన్నింటికన్నా అత్యంత బాధాకరమైన విషయం మనను మనం ఎదుర్కోలేము.' ఒంటరిగా ఉండటం అంటే మనను మనం ఎదుర్కోవటం, మన మనస్సును తెలుసుకోవటం, మన మనస్సు చూపే ఆందోళనలను, బెంగలను, ధైర్యాన్ని తెలుసుకోవటం. అందువల్ల ఒంటరితనం ఎన్నుకోవాలి. జీవితకాలంలో ఒకసారి కాదు, ఎంత తరచు వీలైతే అంత తరచుగా. **వివిక్తసేవీ** అవాలి.

**లఘ్వాశీ** – లఘువుగా తినేవ్యక్తి; ఆహారాన్ని మితంగా, నియమిత సమయంలో తీసుకోవాలి. కడుపు నిండుగా లేకపోతేనే, మనస్సు చురుకుగా పనిచేయగలదు. కడుపు మరీ నిండుగా ఉంటే రక్తప్రసరణ అంతా మధ్యప్రదేశ్‌కు వెళుతుంది; అప్పుడు ఉత్తరప్రదేశ్ నిద్రపోతుంది. అంటే కడుపులో ఆహారం జీర్ణించటానికి వెళితే, మనస్సు మత్తుగా పడుకుంటుంది. అందువల్ల అతను **లఘ్వాశీ** అవాలి.

**యతవాక్కాయమానసః** – అన్ని అంగాలనూ అదుపులో పెట్టుకోవాలి. ఈ అర్థం ముందు శ్లోకంలో కూడా వచ్చింది. వాక్కు అంటే వాగింద్రియం; కాయం అంటే శరీరం; మానసః అంటే మనస్సు. యత అంటే వీటన్నిటినీ బాహ్యప్రపంచంనుంచి వెనక్కి లాగాలి. **యతవాక్కాయమానసః**.

**వైరాగ్యం సముపాశ్రితః** – వైరాగ్యాన్ని పెంపొందించుకోవాలి. కైవల్యోపనిషత్తు ఇంకా అద్భుతమైన సూచనను ఇస్తుంది. కనీసం నిదిధ్యాసన చేసే కాసేపు సన్న్యాసిగా మారమంటుంది. ఖంగారు పడకండి, నిజంగా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు. ఆ కాసేపు మానసికంగా అన్నింటినీ త్యజించమంటుంది. కాసేపు మీరు 'నేను తండ్రిని, నేను తాతను, నేను ఉద్యోగిని,' అని మీరు వేసే పాత్రలన్నిటినీ మర్చిపోండి అంటుంది. అన్నింటితో ఉన్న సంగత్వాన్ని కాసేపు పక్కనపెట్టండి. ఎందుకంటే ఎటువంటి సంగత్వమైనా కూడా అది ఏదో ఒక విధంగా మనస్సును కలతపరుస్తుంది.

మీకు మీరే చెప్పుకోండి, 'నాకు ఎవరితోనూ సంగత్వం లేదు.' నిజానికి అదే అంతిమసత్యం కూడా. ఈ బంధుత్వాలు అన్నీ మధ్యలో వచ్చి, మధ్యలో వెళ్ళిపోయేవే. మీరు పుట్టకముందు లేవు; మరణం తర్వాత ఉండవు. శాశ్వతమైన బంధం ఉండేది ఒక్క ఈశ్వరునితోనే. ఈశ్వరసంబంధం జన్మజన్మలకూ ఉంటుంది, కాని మనుష్య సంబంధం ఈ జన్మలో మాత్రమే ఉంటుంది. వచ్చే జన్మలో ఎవరు ఎలా పుడతారో తెలియదు. అందువల్ల మానవ సంబంధాలన్నీ వదులుకుని, మూడింటితో మాత్రమే సంబంధం పెట్టుకోండి. అవి ఈశ్వరసంబంధం, గురుసంబంధం, శాస్త్రసంబంధం. అందువల్ల **వైరాగ్యం సముపాశ్రితః**.

'నా తరువాత నా కుటుంబసభ్యులను ఎవరు చూసుకుంటారు?' ఇది అందరినీ కుదిపేసే బెంగ. కాని అటువంటి బెంగ అవసరం లేదు. భగవంతుడే చూసుకుంటాడు. మీరు వారిని రక్షిస్తున్నారని అనుకుంటున్నారు కాని, వారు వారిని మీనుంచి రక్షించుకోవాలనుకుంటున్నారేమో ఎవరికి తెలుసు? ఇది జీవితసత్యం. నిజానికి సాక్షాత్తూ కృష్ణపరమాత్మే చెప్పాడు, 'మీ భారాన్ని నామీద వెయ్యండి, నేను మీ యోగక్షేమాలను చూస్తాను.'

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

అహం అంటే కృష్ణుడు మాత్రమే కాదు; భగవంతునికి అప్పచెప్పండి, మొత్తం ఆయనే చూసుకుంటాడు.

**పరః** – పరః అంటే అంకితభావంతో. ఆషామాషీగా చెయ్యకూడదు. మీరు సాధనద్వారా శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధిలనుంచి విడివడ్డారు. ఆ కాసేపు సన్న్యాసాన్ని స్వీకరించారు. ఇప్పుడు ఆ సమయాన్ని మనస్ఫూర్తిగా, శ్రద్ధగా, ఏకాగ్రతతో నిదిధ్యాసన సాధన చెయ్యటానికి వినియోగించండి. వేదాంత శ్రవణ, మననాలు చెయ్యకముందు చేసే ధ్యానాన్ని ఉపాసన అంటారు. ఆ ఉపాసనలో మీకు ఇష్టదేవతను రామునిగానో, కృష్ణునిగానో ధ్యానం చేస్తారు.

ఇక్కడ సందర్భం ఉపాసన కాదు, నిదిధ్యాసనం. ఇది వేదాంతబోధ అయ్యాక చేసేది. ఈ నిదిధ్యాసన దేనిమీద చేస్తారు? ఉన్నదొక్కటే సత్యం. అది ఈ జీవికి అతీతంగా, జగత్తుకు అతీతంగా, సగుణఈశ్వరునికి

అతీతంగా ఉన్న **నిర్గుణ బ్రహ్మతత్త్వం**. ఆ నిర్గుణ బ్రహ్మతత్త్వాన్ని **సచ్చిదానంద ఆత్మ** అంటారు. ఆ సచ్చిదానంద ఆత్మను నేను.

> **బ్రహ్మైవాహమిదం జగచ్చ సకలం చిన్మాత్రవిస్తారితమ్**
> **సర్వం చైతదవిద్యయా త్రిగుణయాఽశేషం మయా కల్పితమ్।**
> **ఇత్థం యస్య దృఢామతిః సుఖతరే నిత్యే పరే నిర్మలే**
> **చాణ్డాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురురిత్యేషా మనీషా మమ॥** – మనీషా పంచకమ్ 2

చైతన్యం అయిన నేను ఈ జీవజగత్తు ఈశ్వరులకు అధిష్ఠానాన్ని. ఈ సత్యంలో నెలకొని ఉండటం ధ్యానయోగపరః.

ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు. నిదిధ్యాసనం లేదా వేదాంతిక్ మెడిటేషన్ అంటే ఆలోచనలు లేని స్థితి కాదు. పతంజలి యోగసూత్రాల్లో నిర్వికార సమాధి వస్తుంది. మనం పతంజలి యోగసూత్రాల్లో ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం – అన్నింటినీ తీసుకుంటాము కాని మన ధ్యానపద్ధతి పతంజలి యోగపద్ధతికి భిన్నంగా ఉంటుంది. మనం చేసే నిదిధ్యాసనంలో అహం బ్రహ్మాస్మి ఆలోచనమీద మనస్సును నిలుపుతాము.

> **మనోబుద్ధ్యహంకారచిత్తాని నాహం న చ శ్రోత్ర జిహ్వే న చ ఘ్రాణనేత్రే**
> **న చ వ్యోమభూమిర్న తేజో న వాయుశ్చిదానన్ద రూపః శివోఽహం శివోఽహమ్** – నిర్వాణషట్కమ్ 1

చిదానందరూపాన్ని నేను అనే ఆలోచనలో ప్రయత్నపూర్వకంగా నిలవాలి. దీన్ని **సజాతీయ వృత్తి ప్రవాహం** అంటారు. ఓ అర్జునా, నువ్వు దీన్ని సాధన చెయ్యి. ఈ ధ్యానాన్ని అంకితభావనతో చెయ్యాలి. పరః అంటే తత్పరత. ధ్యానయోగం పదాన్ని శంకరాచార్యులవారు రెండు పదాలుగా విడదీస్తారు. యోగం అంటే సమాధి అంటారు. ఈ బోధలో పూర్తిగా లీనమైపోవాలి. కనీసం కొంతసేపు, వీలున్నంత తరచు. యుద్ధం తర్వాత అని అర్థం చేసుకోవాలి. నిత్యం ధ్యానయోగపరః (భవేత్) – ఈ నియమాలన్నీ పాటించాక, **అది ధ్యానయోగపరః**.

శ్లో. 53 **అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥**
అహంకారమ్, బలమ్, దర్పమ్, కామమ్, క్రోధమ్, పరిగ్రహమ్,
విముచ్య, నిర్మమః, శాంతః, బ్రహ్మభూయాయ, కల్పతే ॥

| | | | |
|---|---|---|---|
| అహంకారమ్ | = అహంకారమును | విముచ్య | = పరిత్యజించి |
| బలమ్ | = బలమును | నిర్మమః | = మమతారహితుడును |
| దర్పమ్ | = దర్పమును | శాంతః | = శాంతియుతుడును అయిన పురుషుడు |
| కామమ్ | = కామమును | బ్రహ్మభూయాయ | = సచ్చిదానంద పరబ్రహ్మమందు అభిన్న భావముతో స్థితుడగుటకు |
| క్రోధమ్ | = క్రోధమును | | |
| పరిగ్రహమ్ | = పరిగ్రహమును | కల్పతే | = పాత్రుడుగును |

**అహంకారమ్ బలమ్ దర్పమ్ కామమ్ క్రోధమ్ పరిగ్రహమ్ (చ)**
**విముచ్య, నిర్మమః శాన్తః, (నరః) బ్రహ్మ-భూయాయ కల్పతే ।**

తా: ఆహంకారమును, బలమును, దర్పమును, కామమును, క్రోధమును, పరిగ్రహమును పరిత్యజించి మమతారహితుడును, శాంతియుతుడును అయిన పురుషుడు సచ్చిదానంద పరబ్రహ్మమందు అభిన్న భావముతో స్థితుడగుటకు పాత్రుడుగును.

నిదిధ్యాసన చేసేటప్పుడు, అనేక భావోద్రేకాలు మీ మనస్సును కలత పెట్టవచ్చు. దానికి కారణం మీలో ఇంకా మిగిలివున్న ఆసురీసంపత్తి కావచ్చు. కృష్ణపరమాత్మ పదహారవ అధ్యాయంలో ఈ ఆసురీసంపత్తిని పేర్కొన్నాడు. వాటినుంచి ఎలా బయటపడాలో కూడా చెప్పాడు. దీన్ని సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే **దుర్వాసన క్షయః** అంటారు. అంటే కొన్ని అనారోగ్యకరమైన ఆలోచనలు మనస్సును ప్రశాంతంగా ఉండనీయకుండా చేస్తాయి. వాటిని కలుపుమొక్కలలాగా జాగ్రత్తగా ఏరివేయాలి.

మనస్సనే తోటలో అనేక కలుపు మొక్కలు ఉన్నాయి. వాటిని ఏరివేయాలి. అన్నింటినీ పేర్కొనటం లేదు ఇక్కడ. కొన్ని మాత్రమే చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

1) **అహంకారమ్** – అహంకారం అంటే అనాత్మ అభిమానం. శరీరంమీద బలమైన అభిమానం. వేదాంతం నేర్చుకునే సాధకుడు ఈ అభిమానాన్ని ఎన్నడూ పెంచుకోకూడదు. తనకు తాను పదేపదే చెప్పుకోవాలి; తన శరీరం పాంచభౌతికం అనీ, ఈ శరీరం వేదాంత విద్యను అభ్యసించటానికి తాత్కాలికంగా ఇవ్వబడింది కాని తిని త్రాగటానికి కాదనీ, మళ్ళీ శరీరంతో పని అయిపోయాక, దాన్ని పంచభూతాలకు తిరిగి ఇవ్వాలనీను.

నుదిటిమీద విభూతి పెట్టుకోవటం మన సాంప్రదాయం. ఎందుకంటే ఎప్పటికన్నా మన శరీరం కాలి బూడిద అవాల్సిందే అనే విషయాన్ని నిరంతరం గుర్తు చెయ్యటానికి. అందువల్ల శరీరాన్ని అవసరం మేరకు కాపాడుకోవాలి కాని, అవసరాన్ని మించి దానికి సేవ చెయ్యకూడదు. ఈ దేహాభిమానమే **అహంకారం**.

2) **బలమ్** – బలమ్ అంటే శక్తి. ఏదైనా సంస్థలో కాని, ఇంట్లో కాని మీకున్న హోదా లేదా పదవిని అంటిపెట్టుకుని ఉండి, తద్వారా శక్తిని ప్రదర్శించటం. కుటుంబం పెరుగుతోంది; కొడుకు పెద్దవాడు అయ్యాడు; కోడలు ఇంట్లోకి అడుగుపెట్టింది; మనవళ్ళు పుట్టారు; వారిలో ఎవరికైనా కుటుంబపెద్దగా వ్యవహరించాలని ఉండవచ్చు. కాని మీరు మాత్రం ఆ కుటుంబపెద్ద అనే హోదాను వదులుకోవటానికి సిద్ధంగా లేరు. మీకు 85 సంవత్సరాలు వచ్చినాసరే, ఒంట్లో ఓపిక లేకపోయినా సరే, ఇంట్లో జరిగే ప్రతిదీ మీకు తెలియాలి అనుకుంటారు. శాస్త్రం మీ ఇంట్లోనే మీరు అతిథిగా ఉండండి అంటుంది. కాని పదవీవ్యామోహం పోదు చాలామందికి. వారి శక్తిని చూపించుకోవాలనుకుంటారు. ఇది **బలం**.

3) **దర్పమ్** – దర్పం అంటే పొగరు. జీవితంలో కొన్ని సాధించగానే, కొన్ని అవార్డులు పొందగానే, మీకు తెలియకుండానే ఈ పొగరు వచ్చి చేరుతుంది. ముఖ్యంగా స్వయంకృషితో పైకి వచ్చినవారితో మరీ ప్రమాదం. వారు ఆ విషయాన్ని ఎన్నడూ మర్చిపోరు. 'నేను స్వయంకృషితో పైకి వచ్చాను; నాకు ఏమీ లేదు. అట్టడుగు స్థాయినుంచి ఈ స్థాయికి వచ్చాను. ఇప్పుడు నేనొక లక్షాధికారిని.' ఈ విషయం వారి మర్చిపోరు. అది **దర్పం**.

4) **కామమ్** – కామమ్ అంటే లౌకిక విషయాలమీద కోరిక. కోరికలు అనంతం.

5) **క్రోధమ్** – ఎక్కడ కామం ఉంటే అక్కడ క్రోధం ఉండి తీరుతుంది. కామం అంటే ఏదో ఒకటి కోరుకోవటం. కోరిక ఉన్నచోట అది తీరాలనే ఆశ ఉంటుంది. కోరిక ఎంత తీవ్రంగా ఉంటే, ఆశ కూడా అంత ఎక్కువగా ఉంటుంది. ఆశ ఉన్నచోట చిరాకు కూడా ఉంటుంది. ఆశ ఎంత ఎక్కువగా ఉంటే, చిరాకు అంత ఎక్కువగా ఉంటుంది. ఆశించిన కోరిక తీరకపోతే, ఎదుటివారిమీద మండిపడతారు. అందువల్ల కామ, క్రోధాలు కలిసి వస్తాయి. దీన్ని కూడా వివరంగా మూడవ అధ్యాయంలో చూశాము.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః** – 3.37

6) **పరిగ్రహమ్** – పరిగ్రహమ్ అంటే మీకున్న ఆస్తిపాస్తులు. వేదాంతం ఎప్పుడూ ఒక చిన్న సూత్రానికి విలువను ఇస్తుంది. అది – ఆస్తిపాస్తులు ఎంత ఎక్కువ ఉంటే మనస్సు అంత ఎక్కువగా చెదురుతుంది. అందువల్ల అపరిగ్రహం లేదా సాధారణ జీవనం పాటించండి అంటుంది; ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధనకు రావాలనుకున్నవారికి చెబుతుంది.

దీన్ని అంత వెంటనే పాటించలేకపోతే నెమ్మదిగా, క్రమేపీ తగ్గించుకు రావటానికి ప్రయత్నించాలి. 73 దుస్తులు ఉంటే, వాటిలో కొన్నింటిని తగ్గించుకోవాలి. అలా ఏ వస్తువు ఉన్నా దానిని త్యజించటమో కనీసం తగ్గించుకోవటమెలా చెయ్యాలి. ఈ పదానికి అర్థం శంకరాచార్యులవారు సన్న్యాసం స్వీకరించాలని చెబుతారు. అంతదూరం వెళ్ళనవసరం లేదు, మీ వస్తువులను కొన్నింటినన్నా దూరం చేసుకోండి.

7) **నిర్మమః** – నిర్మమః అంటే మమకారాన్ని వదులుకోవటం. దేహంమీద ఉన్న ఇష్టాన్ని అభిమానం అంటారు; మీ వస్తువులమీద ఉన్న ఇష్టాన్ని మమకారం అంటారు. అంటే అభిమాన, మమకారాలు రెండింటినీ వదులుకోవాలి.

అపరిగ్రహమ్, నిర్మమః పదాల మధ్య సూక్ష్మభేదం ఉంది. అపరిగ్రహం అంటే ఉన్న వస్తువులను తగ్గించుకోవటం. కొన్ని వస్తువులను ఉంచుకోక తప్పదు. సన్న్యాసికి కూడా ఇది తప్పదు. కాని ఇలా ఉంచుకుతీరాల్సిన వస్తువుల మీద మమకారాన్ని పెంచుకోకుండా ఉండటాన్ని నిర్మమః అంటారు. వస్తువులను తగ్గించుకోవటం ఒక ఎత్తు; ఉన్న వస్తువులమీద కూడా మమకారం లేకుండా ఉండటం ఇంకొక ఎత్తు. మీ వస్తువులకు మీరు ధర్మకర్మగా మాత్రమే వ్యవహరించాలి. ఇవన్నీ భగవంతుడు మీకు తాత్కాలికంగా ఇచ్చాడు; అవసరమైనప్పుడు ఆయనే తిరిగి తీసుకుంటాడు.

**విముచ్య శాంతః** – పైన చెప్పినవాటినన్నింటినీ పరిత్యజిస్తే, మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

**బ్రహ్మభూయాయ కల్పతే** – అటువంటి సాధకుడు బ్రహ్మతో ఐక్యం అయ్యే అర్హతను పొందుతాడు. ఇన్నాళ్ళూ తను అహంకారం అనుకున్నాడు; మారుతున్న నేను అనుకున్నాడు; కార్యకరణ సంఘాతం అనుకున్నాడు; నేను అనిత్యం అనుకున్నాడు. ఇప్పుడు వాటినుంచి విడివడి, ఉన్నత నేనుతో మమేకం చెందుతాడు. ఉన్నత నేను అంటే చైతన్యతత్త్వం అయిన నేను.

చైతన్యం అన్నప్పుడల్లా చైతన్యంయొక్క ఐదు లక్షణాలను గుర్తు తెచ్చుకోవాలి. చైతన్యం స్వతంత్రమైనది; అది శరీరమంతటా వ్యాపించి, శరీరాన్ని చైతన్యవంతం చేస్తుంది. ఇవన్నీ నిదిధ్యాసనలో గుర్తు తెచ్చుకోవాలి. అప్పుడు చైతన్యం అనకుండా ఆ పదం బదులు 'నేను' అనుకోవాలి. చైతన్యం అంటే ప్రథమ పురుషుడు, ఏకవచనం అవుతుంది. దాన్ని ఉత్తమపురుషుడు, ఏకవచనంగా మార్చుకోవాలి. అంటే 'నేను' పదం రావాలి. శరీరంతో మమేకం చెందినప్పుడు 'నేను' పదం అప్రయత్నంగా వచ్చేస్తుంది; కాని చైతన్యంతో మమేకం చెందటం కష్టమవుతుంది.

ఇప్పుడు చైతన్యం ఐదు సూత్రాలను 'నేను' పదంతో చూద్దాము.

1) నేను శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువును కాని కాదు.

2) నేను స్వతంత్ర వస్తువును. నేను శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తాను.

3) నేను శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4) నేను శరీరం నాశనమయితే నాశనమవను. శరీర పతనానంతరం కూడా నేను ఉంటాను.

5) నేను శరీరం లేకపోయినా ఉంటాను కాని తెలియను. నన్ను ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి నేను తెలియను. అంతమాత్రాన నేను లేనట్టు కాదు.

ఈ ఐదు సూత్రాలను నా మనస్సులో జీర్ణించుకోవాలి. అవి నాకు ఎంతగా అలవాటవ్వాలంటే, అవి నాకు అప్రయత్నంగా రావాలి. అవి నా రెండవ స్వభావం అవ్వాలి.

కాని, అది రెండవ స్వభావం అయింది కదా అని ఎవరైనా నువ్వెవరు అంటే నేను శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు అంటూ మొదలుపెట్టకూడదు. అప్పుడు మీరు మనశ్శరీరాలపరంగానే చెప్పాలి. కాకపోతే సంగీత విద్వాంసునికి తంబూరశ్రుతి ఎలా మనస్సులో నిరంతరం వినిపిస్తూనే ఉంటుందో; అలా మీకు నేను శరీరాన్ని కాదు, నేను చైతన్యాన్ని అనే సత్యం తంబూరశ్రుతిలా మీ మనస్సులో నిరంతరం ఉంటూనే ఉండాలి. అప్పుడు 'అహం బ్రహ్మ అస్మి' అని అప్రయత్నంగా చెప్పగలరు. అంతవరకూ అంటే చైతన్యంతో మమేకం చెందనంతవరకూ అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని తేలిగ్గా జీర్ణించుకోలేరు.

శరీర అభిమానంనుంచి విడివడటం సహజంగానూ, చైతన్యంతో మమేకం చెందటం అప్రయత్నంగానూ అయితే, నేను 'అహం బ్రహ్మ అస్మి' అని ధైర్యంగా పలకగలరు. ఎవరంటున్నారు? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే.

బ్రహ్మభూయాయ కల్పతే అంటే అటువంటి సాధకుడు బ్రహ్మతో ఐక్యం అవుతాడు. ఐక్యం అవుతాడు అంటే అక్షరాలా ప్రయాణం చేసివెళ్ళి ఐక్యం అవడు; నేను చైతన్యపరంగా బ్రహ్మను అనే జ్ఞానాన్ని పొందుతాడు. శరీరపరంగా నాకు హద్దులు ఉన్నాయి కాని చైతన్యపరంగా నాకు హద్దులు లేవు. శరీరపరంగా నేను బ్రహ్మను అంటే కుదరదు కాని, చైతన్యపరంగా నేను బ్రహ్మను అనటంలో ఏ సందేహమూ ఉండదు. అందువల్ల అతను ఏ శంకా లేకుండా 'అహం బ్రహ్మ అస్మి' అంటాడు.

భూయాయ అంటే భావన. బ్రహ్మభూయాయ అంటే బ్రహ్మ భావనలో ఉంటాడు. అంటే బ్రహ్మ ఐక్యం పొందుతాడు.

ఒక్క నిదిధ్యాసనలోనే, ఈ బోధలో సత్యాన్ని స్వీకరిస్తాడు. అందువల్ల వేదాంతబోధయొక్క ఫలాన్ని అనుభవించాలంటే నిదిధ్యాసనం చెయ్యాలి. శ్రవణం మాత్రం చేస్తే ఆ సాధన అసంపూర్ణం అవుతుంది. వేదాంతబోధ యొక్క పరిపూర్ణఫలం పొందాలంటే నిదిధ్యాసనం చేసితీరాలి.

ఎన్ని నిముషాలు చెయ్యాలి? ఇదొక ప్రశ్న. ఇప్పటివారికి అన్నీ క్రాష్‌కోర్సులు కావాలి. అన్నీ నిముషాలమీద అయిపోవాలి. వారికి సమయం లేదు మరి. కాని ఈ నిదిధ్యాసన కొన్ని నిముషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు చేస్తే చాలదు. ఎందుకు? మీరు ఈ శరీరంతో అనుబంధాన్ని ఎన్ని సంవత్సరాలుగా, ఇంకా మాట్లాడితే ఎన్ని జన్మలుగా పెంచుకుంటూ వచ్చారు? మీకు 'నేను శరీరాన్ని,' అనే భావన ఎంత లోతుగా కూరుకుపోయింది? అంత లోతుగా కూరుకుపోయినదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేయాలంటే ఎంత సమయం కావాలో మీరే ఆలోచించండి! అందువల్ల విసుగు చెందకుండా, నిదిధ్యాసన చెయ్యాలని కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలోనే చెప్పాడు. శంకరాచార్యుల వారిని అడిగితే, ఆయన ఇంకొక అడుగు ముందుకువేసి, అన్నీ పరిత్యజించి, సన్న్యాసాన్ని స్వీకరించి, అప్పుడు నిదిధ్యాసనం చెయ్యండి అంటారు. మీరు అంతమేరకు వెళ్ళనవసరం లేదు, వీలైనన్నిసార్లు, వీలున్నంతసేపు ఈ వేదాంతబోధలో నిలబడండి చాలు. అంటే నిదిధ్యాసన రోజూ చెయ్యండి.

శ్లో. 54 **బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।**
**సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥**

బ్రహ్మభూతః, ప్రసన్నాత్మా, న, శోచతి, న, కాంక్షతి,
సమః, సర్వేషు, భూతేషు, మద్భక్తిమ్, లభతే, పరామ్ ॥

న, కాంక్షతి = దేనినీ కాంక్షింపడు
సర్వేషు భూతేషు = సమస్త భూతముల యందును
సమః = సమభావము గల యోగి
పరామ్, మద్భక్తిమ్ = నా పరాభక్తిని
లభతే = పొందును
బ్రహ్మభూతః = సచ్చిదానంద బ్రహ్మమునందు ఏకీభావ స్థితుడును
ప్రసన్నాత్మా = ప్రసన్నమైన మనస్సు గలవాడును ఐన యోగి
న, శోచతి = దేనికిని శోకింపడు

**బ్రహ్మ-భూతః ప్రసన్న-ఆత్మా (సన్) న శోచతి, న కాఙ్క్షతి,**
**(చ) సర్వేషు భూతేషు సమః (భూత్వా) పరామ్ మత్-భక్తిమ్ లభతే ।**

తా: సచ్చిదానంద బ్రహ్మమునందు ఏకీభావ స్థితుడును, ప్రసన్నమైన మనస్సు గలవాడును ఐన యోగి దేనికిని శోకింపడు. దేనినీ కాంక్షింపడు. సమస్త భూతముల యందును సమభావము గల యోగి నా పరాభక్తిని పొందును.

ఈ విధంగా నిదిధ్యాసనం వేదాంతబోధను జీర్ణించుకోవటానికి తోడ్పడుతుంది. వేదాంతబోధను జీర్ణించుకుంటే దాన్ని జ్ఞాననిష్ఠ అంటారు. దానికి పర్యాయపదాలు – స్థితప్రజ్ఞ, ఆత్మనిష్ఠ, బ్రహ్మనిష్ఠ, జీవన్ముక్తి. అంటే అప్రయత్నంగా ఈ జ్ఞానంలో నిలబడటం.

అప్రయత్నంగా ఈ జ్ఞానంలో నిలబడివున్నారో లేదో ఎలా తెలుస్తుంది? దీనికి కూడా సమాధానం ఇంతకు ముందే చూశాము. లౌకికంగా ఏమైనా సమస్యలు వస్తే డబ్బు రూపేణ కొంత ధనం ఎలా అందుబాటులో పెట్టుకుంటారో, అలా జీవితంలో ఏదైనా సమస్య వస్తే ఈ జ్ఞానం అందుబాటులో ఉండాలి. దీన్నే జీవన్ముక్తి అంటారు. అంటే జీవించి ఉండగానే ముక్తి పొందటం.

జీవన్ముక్తి పొందారో లేదో ఎలా తెలుస్తుంది? ఇది ఇంకొక ప్రశ్న. దానికి జవాబు కృష్ణపరమాత్మే ఈ శ్లోకంలో చెబుతున్నాడు.

1) **ప్రసన్నాత్మా** – జీవన్ముక్తి పొందారని తెలిపే సూచనగా మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుంది. శాంత సముద్రంలాగా మనస్సు కూడా శాంతంగా ఉంటుంది. మనశ్శాంతి మొదటి సూచన.

సంసారం అంటే ఏమిటి? దీనికి భిన్నంగా ఒత్తిడి, ఆందోళన. నిరంతరం ఒత్తిడి, ఆందోళన ఉంటే సంసారంలో ఉన్నట్టు అర్థం; మనస్సు ప్రశాంతంగా ఉంటే మోక్షం పొందినట్టు అర్థం.

2) **న శోచతి** – జీవన్ముక్తి పొందిన మనస్సు తేలిగ్గా కలత చెందదు; తేలిగ్గా బాధపడదు. జీవితంలో జరిగే సంఘటనలకు బాధపడటం తగ్గిపోతుంది. వచ్చిన పరిస్థితులను 'నాకే ఎందుకు వచ్చింది?' అనుకోకుండా, చిరునవ్వుతో స్వీకరిస్తాడు. ఏదైనా అనుకోని పరిస్థితి ఎదురైతే 'ఏమిటి?' అని అలవాటులో పొరపాటుగా అన్నా, వెనువెంటనే తిప్పుకుని, 'అయితే ఏమిటి?' అనగలిగే ఆత్మస్థైర్యం పెంపొందించుకుంటాడు. 'ఏమిటి?'నుంచి 'అయితే ఏమిటి?'కి ప్రయాణాన్నే సంసారంనుంచి జీవన్ముక్తికి ప్రయాణం అంటారు. నిజానికి కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో ఆ సూత్రంతోనే తన బోధను మొదలుపెట్టాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

జ్ఞాననిష్ఠలో నెలకొని ఉన్నవారు శోకింపదగని వాటికోసం శోకింపరు.

3) **న కాంక్షతి** – జీవన్ముక్తునియొక్క ఇంకొక లక్షణం అతను జీవితంలో ఏమీ కోరడు. పూర్ణత్వభావనలో నెలకొని ఉంటాడు. ఏదో కొరత ఉందనే భావన పోతుంది. దీన్నే సానుకూలంగా చెప్పాలంటే పూర్ణత్వం పొందుతాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – 2.55

అందువల్ల అతనికి బంధించే కోరికలు లేవు; ఒకవేళ కోరిక ఉన్నా అది సమాజానికి సేవ చేసే కోరికగా ఉంటుంది. అందువల్ల జ్ఞాని కోరికలు పూర్ణత్వంకోసం ఉండవు; పూర్ణత్వంవల్ల ఉంటాయి. అంటే తను పొందాలనే కోరిక కాకుండా, తను ఇవ్వాలనే కోరిక ఉంటుంది జ్ఞానికి. జ్ఞాని ఇతరులకు ఇవ్వటం సహజంగా వస్తుంది.

తీసుకోవాలనే కోరిక సంసారం; ఇవ్వాలనుకోవటం మోక్షం; తీసుకోవాలనుకోవటం పోరాటం; ఇవ్వాలనుకోవటం లీల. చివరికి తను చేసిన సేవకు సమాజంనుంచి కృతజ్ఞతలు కూడా ఆశించడు. ఎందుకంటే,

అతను పూర్ణత్వంతో సేవ చేస్తాడు; మెప్పుకోసమో, కృతజ్ఞతకోసమో, పాదపూజలు చేయించుకోవటంకోసమో చెయ్యడు. అందువల్ల **న కాంక్షతి**.

4) **సమః సర్వేషు భూతేషు** – ప్రపంచాన్ని నిష్పక్షపాతంగా చూస్తాడు. దానికి రాగద్వేషాలనే తన రంగులు పులమడు. అహంకారపరంగా ప్రపంచాన్ని చూస్తే, దానిమీద మీరు మీకు తోచిన అభిప్రాయాలను ఏర్పరచుకుంటారు. మీరు ప్రపంచంలో జీవించటం లేదు; మీరు సృష్టించిన వ్యక్తిగత ప్రపంచంలో జీవిస్తున్నారు. ఈ పరిస్థితివల్ల నాకేమిటి లాభం అని అనునిత్యం బేరీజు వేసుకుంటూ ఉంటారు.

కాని జ్ఞాని అలాకాదు; అతను అహంకారంతో మమేకం చెందడు కాబట్టి, దానికి రాగద్వేషాలనే రంగులను పులమడు. దీన్నే సాంకేతిక పదజాలంతో వర్ణించాలంటే అతను **జీవసృష్టి**లో ఉండడు; **ఈశ్వరసృష్టి**లో ఉంటాడు. నిజానికి ఈ జగత్తును ఈశ్వరుడు సృష్టించాడు. దాన్ని ఉన్నది ఉన్నట్టుగా చూస్తే ఈశ్వరసృష్టి అంటారు. దానికి రంగులు అద్ది, మీ మనస్సుతో చూస్తే ఈశ్వరుడు సృష్టించిన జగత్తును మళ్ళీ మీ మనస్సుతో చూస్తున్నారన్నమాట. దాన్ని జీవసృష్టి అంటారు.

జగత్తును ఈశ్వరసృష్టిగా చూడగలిగితే, రాగద్వేషాలకు చోటులేదు. ఇవన్నీ పడిపోతాయి. సమం అంటే **రాగద్వేష రహితం**. ఈ సమత్వాన్ని మనం ముందే అనేకచోట్ల చూశాము.

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥** – 5.18

**సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥** – 14.24

**సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబంధుషు ।**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥** – 6.9

వీటన్నిటి సారాన్ని ఇక్కడ కృష్ణపరమాత్మ **సర్వేషు భూతేషు సమః** అన్నాడు.

ఇటువంటి జ్ఞానికి భక్తి ఏ రూపంలో ఉంటుంది? చాలామందికి వేదాంతం నేర్చుకుని, జ్ఞానం పొందిన వ్యక్తికి భక్తి ఉండదనే అపోహ బాగా ఉంది. జ్ఞానం భక్తిని పారద్రోలుతుంది అనే భయం ఉంది. కృష్ణపరమాత్మ ఆ భయాన్ని పారద్రోలదలుచుకున్నాడు ఇక్కడ.

జ్ఞానం భక్తికి విభిన్నం కాదు. నిజానికి జ్ఞానం భక్తిని సంస్కరిస్తుంది. భక్తిని సంస్కరించటమే కాదు, జ్ఞాని యొక్క భక్తే, అన్ని రకాల భక్తులలోకీ పరాకాష్ట. ఎవరు అన్నారు? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే. నాలుగు రకాల భక్తులను పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ.

**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ**

జ్ఞానియొక్క భక్తిని జ్ఞానీభక్తి అన్నాడు. ఇక్కడ దాన్ని శ్రేష్ఠమైన భక్తి అంటున్నాడు.

పరాం భక్తిం లభతే – శ్రేష్ఠమైన భక్తిని చూపిస్తాడు. దీన్నే అద్వైతభక్తి అంటారు. ఇది అన్నిటికన్నా ఉన్నతమైన భక్తి. ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమ ఎక్కువైన కొద్దీ వారి మధ్య దూరం తగ్గుతూ వస్తుంది. వారు ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. దగ్గరగా కూర్చుంటారు, ఆలింగనం చేసుకుంటారు. ప్రేమ తగ్గినకొద్దీ దూరం పెరుగుతూ వస్తుంది. అద్వైతభక్తి అన్నింటికన్నా శ్రేష్ఠమైనది. ఎందుకంటే ఇందులో భగవంతునికీ, జ్ఞానికీ మధ్య దూరం చాలా తక్కువవటం కాదు, అసలు దూరమే ఉండదు. భగవంతుడు, జ్ఞాని ఒకరే అవుతారు. అందువల్ల అద్వైతభక్తి చాలా శ్రేష్ఠమైనది.

5) **పరాం మద్భక్తిమ్ లభతే** – అందువల్ల జ్ఞాని శ్రేష్ఠమైన భక్తిని పొందుతాడు. అంటే ఏడవ అధ్యాయంలో చూసిన జ్ఞానీభక్తి ఇది. దీన్నే జీవన్ముక్తి అంటారు.

గీతను అధ్యయనం చెయ్యటంవల్ల నాలో ఏదైనా మార్పు వస్తుందో లేదో తెలుసుకోవటం ఎలా? ఈ ప్రశ్న అందరికీ వస్తుంది. ఇప్పుడు కృష్ణపరమాత్మ కొన్ని చెప్పాడు. శాంతి ఉండాలి; శోకం తగ్గాలి; కోరిక తగ్గాలి; ప్రపంచాన్ని రాగద్వేష రహితంగా చూడాలి; జ్ఞానీభక్తి చూపాలి. ఈ ఐదూ మీలో మార్పును సూచించే కొలబద్దలు.

స్వామీజీ FIR Test చెబుతుంటారు ఎప్పుడూ.

F - Frequency – ఎంత తరచు కోపం వస్తోంది?
I - Intensity – ఎంత తీవ్రంగా ఉంది?
R - Recovery period – ఎంతసేపట్లో తగ్గుతోంది?

కోపాన్ని ఉదాహరణగా తీసుకుని చూద్దాము. కోపం స్థానంలో ఇంకే భావోద్రేకమైనా మీరు చూసుకోవచ్చు. మీరు అంతకుముందు చిన్నదానికే చిర్రుబుర్రులాడుతూ ఉండివుండవచ్చు. ఇప్పుడు గీతాబోధను విన్నాక, ఆ బోధను జీర్ణించుకున్నాక, మిమ్మల్ని ఈ మూడు రకాలుగా పరీక్షించి చూసుకోండి.

ఎంత తరచుగా కోపం వస్తోంది? ఇది మొదటి పరీక్ష. అంతకుముందుకన్నా ఇప్పుడు వచ్చే సంఖ్య తగ్గాలి.

వచ్చిన కోపం ఎంత తీవ్రంగా ఉంది? ఇది రెండవ పరీక్ష.

మీ కోపంయొక్క తీవ్రతను మూడు స్థాయిల్లో కొలవవచ్చు. అది మానసిక, వాచిక, కాయిక స్థాయిలు.

**సీదంతి మమగాత్రాణి ముఖం చ పరిశుష్యతి**

అన్నాడు అర్జునుడు. తీవ్రత తగ్గితే కాయిక స్థాయిలో తగ్గుతుంది. కాని మానసిక, వాచిక స్థాయిలో ఉంటుంది. ఇంకొంచెం సాధన చేస్తే వాక్కుపరంగా ప్రకటించటం కూడా తగ్గుతుంది. కాని మనస్సులో కోపం వెంటనే తగ్గదు. అలా మూడింటిపరంగా చూపించే కోపాన్ని రెండుకు, ఒకటికి తగ్గిస్తూ వస్తారు.

ఎంతసేపట్లో కోపం తగ్గుతోంది? ఇది మూడవ పరీక్ష.

బాగా కోపం వచ్చాక, మళ్ళీ మనస్సుకు ప్రశాంతత చేకూరటానికి ఎంతసేపు పడుతున్నది? మీ కోపాన్ని మర్చిపోయి, మళ్ళీ మామూలుగా ఎప్పుడు అవుతారు?

కొంతమంది స్వామీజీకే ఫిర్యాదు చేస్తారు, 'చూడండి స్వామీజీ, కొంతమంది నాలుగున్నరకే వచ్చి, జేబురుమాళ్ళు పరిచేసి ముందే కుర్చీలను కేటాయించేసుకుంటున్నారు. గీతను నేర్చుకునే విద్యార్థులు ఇలా చెయ్యవచ్చునా?' ఇటువంటి తగాదాల్లో స్వామీజీ తలదూర్చరు. స్వామీజీ పని గీతను బోధించటం; నిజానికి ఆ గీతలో ఉన్న బోధ మనిషిని మార్చాలి. ఎవరికి వారే, తమను తాము ప్రశ్నించుకోవాలి, 'నేను చేస్తున్నది తప్పా, ఒప్పా?' వారి అంతరాత్మ ఏం చెబితే దాన్ని వినాలి.

క్లాసులో కూడా అక్కడొకరు, ఇక్కడొకరు కూర్చుంటారు. అందరూ ఒకచోట కూర్చోరు. వారు వచ్చి కూర్చుంటే చాలు అనుకుంటారు స్వామీజీ. ఇలాగే కూర్చోండి అని వారికేమీ సూచనలు ఇవ్వరు. ఒకసారి బోధ మొదలయ్యాక మాత్రం అందరినీ డిస్టర్బ్ చేస్తూ ముందుకు రావద్దంటారు. క్లాసులో వారు చెప్పినటువంటి చిన్నచిన్న ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కాని వాటిని పట్టించుకోకూడదు. భగవద్గీతను మీ చిరాకులు పోగొట్టుకోవటానికి ఉపయోగించుకోండి. ఏ చిరాకులు వచ్చినా, క్లాసు ముందు వచ్చి, క్లాసు మొదలయ్యేసరికి, మీరు మర్చిపోతే ఫర్వాలేదు. క్లాసు మొదలయ్యాక ఇంక ఏకాగ్రత అంతా బోధమీదే ఉండాలి. కాని కొంతమందికి క్లాసు జరుగుతున్న గంటా అసలు ఏకాగ్రత కుదరదు. అంటే వారికి శ్రద్ధ లేదన్నమాట. మీకు ఎటువంటి చిరాకులు ఉన్నా చిరాకు పడండి, తప్పులేదు; కాని అదంతా క్లాసు మొదలయ్యేముందు పడండి. ఒకసారి క్లాసు మొదలయ్యాక, వీటన్నిటినీ పక్కనపెట్టి క్లాసుమీద ఏకాగ్రత చూపండి. స్వామీజీ అంటారు, 'మీకు చెప్పాల్సింది అంతా చెప్పాను!' దీన్నే చెప్పకనే చెప్పటం అంటారు.

శ్లో. 55 **భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥**
భక్త్యా, మామ్, అభిజానాతి, యావాన్, యః, చ, అస్మి, తత్త్వతః,
తతః, మామ్, తత్త్వతః, జ్ఞాత్వా, విశతే, తదనంతరమ్ ॥

| | |
|---|---|
| భక్త్యా | = ఆ పరాభక్తితో (ఆ బ్రహ్మభూతుడైన యోగి) |
| మామ్ | = పరమాత్ముడనైన నన్ను |
| (అహమ్) | = (నేను) |
| యః | = ఎవరినో |
| చ | = ఇంకా |
| యావాన్, అస్మి | = ఎంతటి శక్తిగలవాడనో |
| తత్త్వతః | = యథాతథముగా నా తత్త్వమును |
| అభిజానాతి | = బాగుగా తెలుసుకొనును |
| తతః | = అనంతరము |
| మామ్ | = నన్ను |
| తత్త్వతః | = యథార్థముగా |
| జ్ఞాత్వా | = తెలిసికొని |
| తదనంతరమ్ | = తత్క్షణమే |
| విశతే | = నాలో లీనమగును |

**యావాన్ యః చ అస్మి, (తం) మామ్ తత్త్వతః భక్త్యా అభిజానాతి,**

**తతః తత్త్వతః మామ్ జ్ఞాత్వా తత్ అనన్తరమ్ (మామ్) విశతే ।**

తా: ఆ పరాభక్తితో (ఆ బ్రహ్మభూతుడైన యోగి) పరమాత్ముడనైన నన్ను, నేను ఎవరినో ఇంకా ఎంతటి శక్తిగలవాడనో యథాతథముగా నా తత్త్వమును బాగుగా తెలుసుకొనును. అనంతరము నన్ను యథార్థముగా తెలిసికొని తత్‌క్షణమే నాలో లీనమగును.

ముందు శ్లోకంలో కృష్ణపరమాత్మ నిదిధ్యాసనం అంశాన్ని ఫలశ్రుతితో పాటుగా బోధించి ముగించాడు. ఫలం జీవన్ముక్తి. జీవన్ముక్తి అంటే ఎఫ్.ఐ.ఆర్.ను తగ్గించుకోవటం అని చూశాము. ఈ మార్పు రాత్రికి రాత్రి వచ్చేయదు. ఉదాహరణకు మీకు వందసార్లు కోపం వచ్చేటట్టయితే, అది జీరో అయిపోదు. క్రమేపీ తగ్గుతూ వస్తుంది.

జ్ఞానఫలం కన్నా జ్ఞానం కొంత తొందరగా వస్తుంది. అంటే జ్ఞానం పొందటం తేలిగ్గా పొందవచ్చు కాని, ఆ పొందిన జ్ఞానాన్ని జీర్ణించుకుని, తదనుగుణంగా మారటానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల కొన్ని గ్రంథాలలో జ్ఞానుల్లో తారతమ్యాలను కొలుస్తారు. నిజానికి జ్ఞానులందరూ సమానమే. ఎందుకంటే వారందరూ అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందుతారు. మరి ఈ తారతమ్యం ఎందుకు వస్తుంది? వారు చూపించే ఎఫ్.ఐ.ఆర్.లోని తారతమ్యంవల్ల. అవి బ్రహ్మవిత్, బ్రహ్మవిత్ వరః, బ్రహ్మవిత్ వరీయాన్, బ్రహ్మవిత్ వరిష్ఠ. వీటికి మార్కుల శాతం ఇవ్వకూడదు. కాని మనకు భేదం తెలియటానికి ఇస్తే వరుసగా ఇలా ఇవ్వవచ్చు. బ్రహ్మవిత్‌కు 20%, వరః కు 40%, వరీయాన్‌కు 60%, వరిష్ఠకు 80%. ఇది నిదిధ్యాసన ఫలం.

ఇప్పుడు ఈ శ్లోకంతో నిదిధ్యాసన అంశానికి ముక్తాయింపు పలుకుతున్నాడు. దీన్ని సంగ్రహశ్లోకం అనవచ్చు.

**భక్త్యా** – నిదిధ్యాసనం చెయ్యటం ద్వారా. ఇక్కడ భక్తి అంటే నిదిధ్యాసన రూపభక్తి. పన్నెండవ అధ్యాయంలో ఐదు దశల భక్తిని చూశాము. దాన్నే వేదాంతంలో మూడుదశల్లో చూస్తామని కూడా చూశాము. అవి

**కర్మయోగము + ఉపాసనయోగము + జ్ఞానయోగము = భక్తియోగము**

వేదాంతశ్రవణం కూడా ఒక విధమైన భక్తే. దాన్ని జ్ఞానయజ్ఞం అంటారు. చిన్మయానంద స్వామీ తన బోధలను **జ్ఞానయజ్ఞం** అనే అనేవారు. ఇది కూడా ఒక విధమైన యజ్ఞమే. ఇందులో అగ్ని జ్ఞానాగ్ని; ఆహుతులు అజ్ఞానం, అహంకారం, అన్నిరకాల అపోహలు. అందువల్ల జ్ఞానమూ భక్తే; కర్మ, ఉపాసనలూ భక్తే; నిదిధ్యాసన కూడా భక్తే.

**స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే** – వివేక చూడామణి

అందువల్ల నిదిధ్యాసన కూడా ఒక విధమైన భక్తే. ఇటువంటి భక్తి చూపిస్తే, ఆ సాధకుడు పొందే ఫలమేమిటి?

**మామభిజానాతి** – ఈశ్వరజ్ఞాననిష్ఠ పొందుతాడు. జ్ఞానాతి అంటే జ్ఞానం పొందుతాడు; అభి అంటే ఆ జ్ఞానం జ్ఞాననిష్ఠగా మారుతుంది. అభిజానాతి అంటే తను నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకుంటాడు. ఎవరి గురించిన జ్ఞానం అది? మామ్. మామ్ అంటే ఈశ్వరుని గురించిన జ్ఞానం.

ఈశ్వరుని యొక్క సగుణరూపం గురించీ, నిర్గుణరూపం గురించీ కూడా జ్ఞానం పొందుతాడు. సగుణరూపాన్ని అపరాప్రకృతి అనీ, నిర్గుణరూపాన్ని పరాప్రకృతి అనీ ఏడవ అధ్యాయంలో చూశాము. నిర్గుణబ్రహ్మ అంటే గుణాతీతుడు. సగుణబ్రహ్మ అంటే వ్యావహారిక ప్రపంచంలో పూజలందుకునే బ్రహ్మ. బ్రహ్మను శ్రేష్ఠమైన గుణాలతో పూజిస్తాము. సర్వజ్ఞత్వం, సర్వకారణత్వం, సర్వసృష్టికారణత్వం, సర్వపూజ్యత్వం.

**యావాన్** – యావాన్ అంటే సగుణ స్వరూపం.

**తత్త్వతః యః** – తత్త్వతః యః అంటే నిర్గుణస్వరూపం. తత్త్వ అంటే పారమార్థిక స్వరూపం; చైతన్య స్వరూపం.

ఆ విధంగా నిదిధ్యాసనం భగవంతుని యొక్క స్వరూపాన్ని జీర్ణించుకునేలా చేస్తుంది. అది కూడా భగవంతుని యొక్క రెండు స్వరూపాలనూ జీర్ణించుకునేలా చేస్తుంది.

వ్యావహారిక స్థాయిలో భగవంతుడు వేరు, భక్తుడు వేరు. భగవంతుడు సమష్టి, భక్తుడు వ్యష్టి; కాని పారమార్థిక స్థాయిలో ఈ భేదాలు లేవు. సమష్టి లేదు, వ్యష్టి లేదు; ఉన్నదొక్కటే చైతన్యం. నిర్గుణచైతన్యం. ఇతి అభిజానాతి.

**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా** – ఈ రెండు స్వరూపాల్లో నిర్గుణబ్రహ్మ శ్రేష్ఠం. అందువల్లనే ఏడవ అధ్యాయంలో పరాప్రకృతి జ్ఞానాన్ని విజ్ఞానం అనీ, అపరాప్రకృతి జ్ఞానాన్ని జ్ఞానం అనీ అన్నాడు కృష్ణపరమాత్మ.

పరాప్రకృతి ఎందుకు శ్రేష్ఠం? నిర్గుణజ్ఞానం ఎందుకు శ్రేష్ఠం? ఎందుకంటే నిర్గుణబ్రహ్మ స్థాయికి ఎదిగితే జ్ఞాని కాలాతీతుడు అవుతాడు; దేశాతీతుడు అవుతాడు; నిరాకారం అవుతాడు; మృత్యువును అధిగమిస్తాడు.

**మృత్యోర్మా అమృతం గమయ**

అమృతత్త్వమ్ నిర్గుణత్వంలోనే సాధ్యం. సగుణత్వంలో అమృతత్వానికి ఆస్కారం లేదు. ఎందుకు? సగుణ అంటే సాపేక్షికం. సాపేక్షికంలో కాలపరిమితి, దేశపరిమితి ఉంటాయి. అందుకని కృష్ణపరమాత్మ పరాప్రకృతి శ్రేష్ఠం అంటున్నాడు. అందువల్ల **తతో మాం తత్త్వతో జ్ఞాత్వా.**

**తదనంతరమ్** – ఆ నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందిన ఫలంగా,

**మాం విశతే** – నాలో ప్రవేశిస్తాడు. మళ్ళీ 'ప్రవేశిస్తాడు,' అంటే అక్షరాలా తీసుకోకూడదు. నిర్గుణబ్రహ్మ స్థాయికి ఎదిగితే, దేశకాల అతీత బ్రహ్మను అర్థం చేసుకుంటే, ఆ బ్రహ్మనూ జ్ఞానినీ విడదీసేది ఏమీలేదు.

**అహమేవ సః సః ఏవ అహమ్ అస్మి**

నేనే బ్రహ్మను; బ్రహ్మే నేను. దీన్ని ఐక్యం అంటారు. జీవాత్మ, పరమాత్మ ఐక్యం అంటే అజ్ఞానంవల్ల ఏర్పడిన జీవాత్మ, పరమాత్మ భేదభావనను వదిలివేయటం. అజ్ఞానం చూపిస్తున్నది ఈ భేదాన్ని. భగవంతుడు వేరు, నేను వేరు అంటుంది అజ్ఞానం. ఈ అజ్ఞానాన్ని వదులుకోవటాన్నే ఐక్యం అంటుంది శాస్త్రం.

భౌతికంగా ప్రయాణం చేసివెళ్ళటం లేదు. రైలు ప్రయాణం లాగానూ, అందులో ఇంజను వెళ్ళి భోగీలను కలిస్తే ధడేలుమని వచ్చే శబ్దాలనూ ఊహించుకోకండి. అది నిశ్శబ్దంగా జరిగే ప్రక్రియ. అది కూడా మీ బుద్ధిలో

కలిగిన జ్ఞానంవల్ల జరిగే ప్రక్రియ. స్వప్న వృత్తాంతమే తీసుకోండి. స్వప్నంలో అనేక అనుభవాలను అనుభవించిన స్వాప్నికుడు స్వప్నంనుంచి లేచిన మరుక్షణం జాగ్రద్ పురుషునిలో ఐక్యం అయిపోతాడు. అది నిశ్శబ్దంగా, ఆర్భాటం లేకుండా జరిగే ఐక్యం; జీవాత్మ, పరమాత్మల ఐక్యం కూడా అంతే.

ఇవన్నీ చాలా ముఖ్యమైన శ్లోకాలు. శంకరాచార్యులవారు వీటిమీద చాలా వివరంగా భాష్యం రాశారు. ముఖ్యంగా ఈ శ్లోకంమీద ఆయన రాసిన భాష్యం ఒక అద్భుతం!

ఇక్కడితో జ్ఞానయోగము అంశం ముగిసింది. దీనిలో ప్రధానంగా నిదిధ్యాసనం గురించి బోధించాడు కృష్ణపరమాత్మ. అంటే నిదిధ్యాసన ప్రధాన జ్ఞానయోగము అంశం ముగిసింది.

**సి) కర్మయోగము – శ్లోకాలు: 56–62 – ప్రత్యేక విశ్లేషణ**

శరణాగతి – నిదిధ్యాసనంతో అహంకార, మమకారాలు వదులుకోవాలనీ, పారమార్థిక సత్యానికి ఎదగాలనీ, ధ్యానం వీలున్నన్నిసార్లు, వీలున్నంతసేపు చెయ్యాలనీ చెప్పాడు కృష్ణపరమాత్మ. ఇవన్నీ వింటే కొంతమంది సాధకులకు 'అమ్మో, ఇవన్నీ నావల్ల జరిగే పనేనా అనిపించవచ్చు.'

ఇటువంటి భావన కృష్ణపరమాత్మకు అర్జునుని మొహంలో కూడా కనిపించిందేమో, కృష్ణపరమాత్మ మళ్ళీ ఒక మెట్టు కిందికి దిగివస్తున్నాడు. ఎందుకంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు అందరూ చెయ్యలేరు. కొంతమేరకు శ్రవణం ఏమన్నా చెయ్యగలరేమో. ఎందుకంటే అందులో వారి పాత్ర ఏమీ ఉండదు. నిశ్శబ్దంగా క్లాసులో కూర్చుంటే చాలు. శిష్యుని మనస్సు చెదరకుండా, అతన్ని గంటసేపు ఆకట్టుకునేలా చెప్పే నైపుణ్యం గురువుకు ఉండాలి. బోధ జరిగేటంతసేపు బాగానే కూర్చుంటారు కాని, వేదాంత బోధ ముగిసాక పూర్ణమదః శాంతిపాఠం చెబుతారు. అందులో ఓం పూర్ణమదః ... మొదలవగానే ఏదో వారి కుర్చీకిందనుంచి తేలు వచ్చి వారిని కుట్టినట్టుగా ఒక్కసారిగా లేచి వెళ్ళిపోతారు. కనీసం పాఠం అవుతుండగా కూర్చున్నారు నయమే అనుకోవాలి.

నిదిధ్యాసనలో గురువు ఉండరు; శిష్యుడే ప్రయత్నం చెయ్యాలి. అందువల్ల అది శ్రవణంకన్నా కష్టం. ఆ అవస్థలు అర్థమైనట్టుగా, కృష్ణపరమాత్మ ఒక మెట్టు దిగివస్తున్నాడు. ఎవరైనా జ్ఞానయోగం పాటించటానికి, 'నాకు అర్హత లేదు,' అనుకుంటే; బాధపడకండి, కర్మయోగంమీద దృష్టిపెట్టండి అంటున్నాడు. అతను గీతాబోధ వినవచ్చు; కాని కర్మయోగసాధనమీద ఎక్కువ దృష్టి పెట్టవచ్చు.

అందువల్ల మళ్ళీ 56–62 శ్లోకాల్లో కర్మయోగం గురించి చెప్పబోతున్నాడు. ఇది పరమపద సోపానం (స్నేక్స్ అండ్ లాడర్స్) ఆటలాగా ఉంది. ఒకసారి నిర్గుణబ్రహ్మ స్థాయికి తీసుకువెళ్ళాడు, ఇప్పుడు మళ్ళీ కర్మయోగానికి దిగివస్తున్నాడు. నిజానికి కర్మయోగం గురించి శ్లోకాలు 41–49లో మాట్లాడేశాడు.

అంతకుముందు స్వాభావికకర్మల పరంగా వివరించాడు. చాలామంది వారి హక్కుల గురించి మాట్లాడతారు కాని వారి స్వధర్మాలను గుర్తించరు. మన సాంప్రదాయం మనకు బాధ్యతలనే నేర్పిస్తుంది; హక్కులను నేర్పించదు. ఎందుకంటే ఎవరికి వారు, వారి బాధ్యతలను నెరవేరిస్తే, ఎదుటివారి హక్కులు అవే తీరుతాయి. భర్త భార్యపట్ల

తనకున్న బాధ్యతను నెరవేరిస్తే, భార్య స్త్రీ స్వేచ్ఛకోసం పోరాడాల్సిన అవసరం లేదు. అలాగే పిల్లలు వారి ధర్మాన్ని నెరవేరిస్తే, తల్లిదండ్రులు వారి హక్కులకోసం పోరాడనవసరం లేదు. కాని చాలామంది ధర్మాన్ని వదిలేసి, హక్కులకోసం పోరాడుతారు.

కృష్ణపరమాత్మ హక్కుల విషయం మర్చిపోండి, మీ ధర్మంమీద శ్రద్ధ పెట్టండి. మీ స్వధర్మాన్ని నెరవేర్చండి అని ఇంతకుముందు స్వధర్మం గురించి నొక్కి వక్కాణించాడు.

**స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**

**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥** – 18.45

స్వధర్మాన్ని పాటించండి అన్నాడు. స్వధర్మమంటే ఏమిటి? ఇదొక సందేహం చాలామందికి. స్వధర్మం అంటే మీరు ఏ రంగంలో ఉన్నారో, ఆ రంగాన్ని మీరు పాడుచెయ్యకపోవటం. ఇది మొదటిధర్మం. తర్వాత ఇంకా మీకు కుదిరితే, ఆ రంగాన్ని ఆనందంగా ఉంచటానికి, వృద్ధి పొందించటానికి మీవంతు కృషి మీరు చెయ్యండి.

మీరు ఒక కుటుంబంలో సభ్యులు అయితే, అది నిజమే కూడా. మీ ప్రవర్తనవల్ల మీ కుటుంబం అవస్థ పడకుండా ఉండేలా చూసుకోవటం మీ స్వధర్మం. ఇది మొదటిమెట్టు.

రెండవది, మీవల్ల మీ కుటుంబం లాభం పొందాలి. ఇంకో విధంగా చెప్పాలంటే, మీ కుటుంబంనుంచి మీరు తీసుకునేది తక్కువా, మీరు తిరిగి ఇచ్చేది ఎక్కువా ఉండాలి.

ఇదే సూత్రాన్ని ఏ రంగంకన్నా అన్వయించుకుంటూ పోవచ్చు. మీరు పనిచేసే సంస్థలో మీవల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదు; మీరు సంస్థ అభివృద్ధికి పాటుపడాలి. దేశంలో పౌరులుగా కూడా మీ ధర్మాన్ని మీరు నిర్వర్తించాలి. దేశం నాకేమిచ్చింది అనటం మాని, దేశానికి నేనేమిచ్చాను అని చూడాలి. దీన్నే మతానికి కూడా అన్వయించవచ్చు. హిందువుగా నేను నా మతానికి ఏంచేశాను అని పరీక్ష చేసుకోవాలి. అంటే మీరు మీ కుటుంబానికి, మీ సమాజానికి, మీ దేశానికి, మీ పరిసరాలకి, మీ మతానికి ఏంచేశారు? వీటన్నిటిని సమతుల్యతతో ఉంచటం మీ మొదటి ధర్మం; వీటి ఉన్నతికి వీలైనంత వరకూ మీవంతు మీరు తోడ్పడటం మీ రెండవ ధర్మం.

కర్మయోగం అంటే స్వధర్మాన్ని పాటించటం అన్నాడు కృష్ణపరమాత్మ. వీటన్నిటిలోనూ మీ స్వధర్మాన్ని పాటించటం.

**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః** – 18.46

తన స్వకర్మను చెయ్యటం ద్వారా భగవంతుని ప్రార్థిస్తాడు. ఆ విధంగా కర్మయోగం గురించి స్వధర్మ నిర్వహణ పరంగా చర్చించాడు కృష్ణపరమాత్మ అంతకుముందు.

ఇప్పుడు అదే కర్మయోగాన్ని ఇంకొక కోణంలోంచి చర్చించబోతున్నాడు. అది **ఈశ్వరానుగ్రహం**. భగవంతుని మీద భక్తి లేనిదే, కర్మయోగం సాధ్యం కాదు. దయానందస్వామీజీ పదేపదే చెబుతారు, 'భక్తిలేని కర్మయోగం

లేదు.' కర్మయోగం అంటే అందులో భక్తి ఉండాల్సిందే. కర్మయోగికి భగవంతునియొక్క పారమార్థికస్థాయి గురించి తెలియకపోవచ్చు; తెలియనవసరం లేదు కూడా. అతనికి భగవంతుడు జగత్కారణంగా తెలుసు. అతను భగవంతుణ్ణి తన ఇష్టదైవరూపంలో కొలుస్తాడు. ఈ కర్మయోగం రెండు రకాలుగా పాటించాలని చూశాము.

**కర్మణి అర్పణ భావనా, కర్మఫలే ప్రసాద భావనా**

ఏ పనిచేసినా ఈశ్వరునికి అర్పించటం; ఏ ఫలం వచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం. అంటే కర్మయోగి ఈశ్వరానుగ్రహాన్ని నమ్ముతాడు. మనం చాలాసార్లు చూశాము, మానవప్రయత్నం, ఈశ్వరకృప ఈ రెండూ కూడా ఒక పక్షి యొక్క రెండు రెక్కలు. పక్షి ఎలా రెండురెక్కలు లేకపోతే ఎగరలేదో, అలా మనిషి ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, అతనికి కూడా మానవప్రయత్నం, ఈశ్వరకృప అనే రెండురెక్కలు ఉండితీరాలి. అందువల్ల ఈ కర్మయోగంయొక్క ఈ భాగంలో కృష్ణపరమాత్మ ఈశ్వరానుగ్రహాన్ని స్తుతిస్తున్నాడు.

ఈశ్వరానుగ్రహాన్ని పొందటం ఎలా? భగవంతుణ్ణి శరణు వేడటంద్వారా. ఈ శరణాగతి భావన కర్మయోగంలో ఒక భాగం.

శ్లోకాలు 56–62లో కృష్ణపరమాత్మ మళ్ళీ కర్మయోగం గురించి బోధిస్తున్నాడు. కాకపోతే ఈసారి శరణాగతి, **ఈశ్వరానుగ్రహం పరంగా** చెబుతున్నాడు.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. కర్మయోగికి బ్రహ్మజ్ఞానం లేదు. బ్రహ్మజ్ఞానం పొందితే, అతను ఇంక కర్మయోగిగా మిగలడు. కర్మయోగి దశలను మర్చిపోకూడదు. అతను కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి జ్ఞానం పొందితేనే అతను బ్రహ్మజ్ఞాని అవుతాడు. అందువల్ల కర్మయోగి అజ్ఞానే. అతను ఇంకా జ్ఞానం పొందాలి.

కర్మయోగికి నిర్గుణబ్రహ్మజ్ఞానం లేదు కాబట్టి, అతను కర్మయోగం పాటించే సమయంలో భగవంతుణ్ణి ఇష్టదేవతామూర్తిగా పూజిస్తాడు. అతనికి అహం బ్రహ్మ అస్మి అనే ఐక్యజ్ఞానం లేదు. అతనికి నిర్గుణబ్రహ్మ, పారమార్థిక స్థాయి – ఇవేవీ తెలియవు. అతనికి తెలిసిందల్లా ఒకటే. ఈశ్వరుడు జగత్తుయొక్క సృష్టికారణం. అది కూడా శాస్త్రం ద్వారానే తెలుసుకుంటాడు. ఈశ్వరుడు జగత్తుయొక్క నిమిత్తకారణమనీ, ఉపాదాన కారణమనీ, ఈశ్వరుడు సర్వశక్తివంతుడనీ, సర్వజ్ఞుడనీ తెలుసు. అందువల్ల అతని భక్తిని ఇష్టదేవతాభక్తి అంటారు. కర్మయోగి ఆ భగవంతుణ్ణి శరణువేడి, భగవంతుని అనుగ్రహాన్ని కోరతాడు.

శరణాగతి అంటే ఏమిటి? ముందు మీకు మీరే చెప్పుకోవాలి. నాకు బలాన్ని, భద్రతను ఇచ్చేది చివరికి ఆ భగవంతుడే. 'నీకు ఆధారం ఎవరు?' అంటే సాధారణంగా మీరు తోటిమనుష్యులలో ఎవరి పేరో చెబుతారు. ఆ అలవాటును మానుకుని భగవంతునిమీదే పూర్తి భారం వెయ్యాలి. భగవంతుడు ప్రత్యక్షంగా రాకపోవచ్చు; ఎవరో ఒకరిద్వారా మీ యోగక్షేమాలను తానే చూసుకుంటాడు. ఇప్పుడు పిల్లలు దేశం నలుమూలలకీ వెళ్ళిపోయారు; మీకు అవసరమైనప్పుడు వారు రాగలరో లేరో అనే బెంగపడే బదులు, ఈశ్వరుణ్ణి శరణు వేడితే, ఆయనే ఎవరినో పంపిస్తాడు.

దశరథుని విషయమే తీసుకోండి! ఆయనకు నలుగురు మగపిల్లలు ఉన్నారు; నలుగురూ ఆణిముత్యాలు. కాని ఆయన అంతిమశ్వాస విడిచేటప్పుడు ఒక్క పుత్రుడు కూడా పక్కన లేడు. ఇలాంటివి విని భయపడకూడదు; భగవంతునిమీద భారం వెయ్యటం నేర్చుకోవాలి.

భగవంతునిమీద భారం ఎలా వెయ్యాలి? భగవంతుడు ఎప్పుడూ మీ హృదయంలోనే కొలువైవున్నాడని మర్చిపోకూడదు.

**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**

భగవంతునిమీద భారం వెయ్యాలంటే, దానికి ఇంకొక లోతైన అర్థం కూడా ఉంది. భగవంతుడు చేసిన బోధ మీద భారం వెయ్యాలి. డాక్టరుమీద భారం వెయ్యమంటే ఏమిటి అర్థం? డాక్టరు చెప్పిన సూచనలను అక్షరం పొల్లుపోకుండా పాటించటం. భగవంతుడు మనకు బోధను వేదంద్వారా చేశాడు; గీత ద్వారా చేశాడు. గీత మన జీవనవిధానాన్ని బోధిస్తుంది. వేదంలోనూ, వేదంయొక్క సారాంశం అయిన గీతలోనూ బోధించిన జీవనవిధానాన్ని అక్షరం పొల్లుపోకుండా పాటించాలి.

వేదాలు, గీత ఎటువంటి జీవనవిధానాన్ని బోధించాయి? మీరు చేసే కర్మలను మీరు చెయ్యండి; కాని వాటిని భగవంతునికి అర్పించండి అంటున్నాయి. అలా చేస్తే వచ్చే ఫలం ఏమిటి? మోక్షం పొందుతారు. శాశ్వతమైన ఫలం పొందుతారు.

కాకపోతే ఈ విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. కర్మయోగి అజ్ఞాని అని చూశాము; జ్ఞానం పొందితేనే మోక్షం వస్తుందనీ చూశాము. ఇక్కడేమో కృష్ణపరమాత్మ కర్మయోగం పాటిస్తే మోక్షం వస్తుందని అంటున్నాడు. కృష్ణపరమాత్మే ఎన్నోసార్లు మధ్యలో దశలను వివరించాడు. వాటిని మనం ఇక్కడ కలుపుకోవాలి.

**కర్మయోగము + ఉపాసనయోగము+ జ్ఞానయోగము = మోక్షము**

దీన్ని పరంపరయా మోక్షం అంటారు.

ఇక్కడితో శరణాగతి – ప్రత్యేక విశ్లేషణ అయిపోయింది. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను చూద్దాము.

శ్లో. 56 **సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।**
**మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥**

సర్వకర్మాణి, అపి, సదా, కుర్వాణః, మద్వ్యపాశ్రయః,
మత్ప్రసాదాత్, అవాప్నోతి, శాశ్వతమ్, పదమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| మద్వ్యపాశ్రయమః | = మత్పరాయణుడై నన్ను ఆశ్రయించిన కర్మయోగి | మత్ప్రసాదాత్ | = నా అనుగ్రహము వలన |
| సర్వకర్మాణి | = సమస్త కర్మలను | శాశ్వతమ్ | = సనాతనమైన |
| సదా | = నిరంతరము | అవ్యయమ్ | = నాశరహితమైన |
| కుర్వాణః, అపి | = చేయుచునే | పదమ్ | = పరమపదమును |
| | | అవాప్నోతి | = పొందును |

**మత్-వ్యపాశ్రయః సదా సర్వ-కర్మాణి అపి కుర్వాణః**
**మత్-ప్రసాదాత్ శాశ్వతమ్ అవ్యయమ్ పదమ్ అవాప్నోతి ।**

తా: మత్పరాయణుడై నన్ను ఆశ్రయించిన కర్మయోగి సమస్త కర్మలను నిరంతరము చేయుచునే నా అనుగ్రహము వలన సనాతనమైన, నాశరహితమైన పరమపదమును పొందును.

ఈ శ్లోకాల్లో (56-62) కృష్ణపరమాత్మ శరణాగతిని, ఈశ్వరానుగ్రహాన్ని స్తుతిస్తున్నాడు. ఇక్కడ కర్మయోగికి ఇంకా జ్ఞానం రాలేదు. అతను కర్మయోగం పాటించి, చిత్తశుద్ధిని పొందాక, జ్ఞానయోగానికి వచ్చి అప్పుడు జ్ఞానం పొందాలి. అంతవరకూ అతను అజ్ఞాని కిందికే వస్తాడు. అందువల్ల అతను భగవంతుణ్ణి ఇష్టదేవతా రూపంలో కొలుస్తాడు. అతనికి నిర్గుణబ్రహ్మ గురించి తెలియదు; తనే బ్రహ్మననీ తెలియదు. అందువల్ల కర్మయోగి తన ఇష్టదేవతను శరణు వేడతాడు. అది ఎలా చేస్తాడు? కృష్ణపరమాత్మ వివరిస్తున్నాడు.

**మద్వ్యపాశ్రయః** – నన్ను శరణు వేడుతాడు. వ్యపాశ్రయః అంటే శరణు వేడటం. ముందు మీకు మీరు చెప్పుకోవాలి. నాకు చివరికి బలాన్ని, భద్రతను ఇచ్చేది ఆ భగవంతుడేనని.

మీరు మీ ఆత్మీయుల మధ్య జీవించవచ్చు; వారిని ప్రేమించవచ్చు; వారిని ఆప్యాయంగా చూసుకోవచ్చు; వారిని దూరం తోసేయనవసరం లేదు; కాని మీకు ఆధారం ఎవరని అడిగితే మాత్రం వారిలో ఎవరినో చెప్పకండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. భగవంతునిమీదే మీ అంతిమభారం వేస్తే, ఆయనే మీ యోగక్షేమాలు చూసుకుంటాడు.

పిల్లలేమో చెల్లాచెదురుగా ఉన్నారు. ఒకరు కెనడాలో, ఒకరు ఆస్ట్రేలియాలో, మరొకరు అమెరికాలో ఉన్నారు. మీరిద్దరు మాత్రం ఇండియాలో ఉండిపోయారు. మీరు అక్కడికి వెళ్ళలేరు; వారు ఇక్కడికి మాటిమాటికీ రాలేరు. ఇక్కడేదైనా అవసరం ముంచుకొచ్చినా, వారికి పాస్‌పోర్ట్, వీసాల సమస్యలు లేకుండా ఉండాలి. ఇక్కడ తండ్రి ఎక్స్‌పైర్ అయ్యే సమయానికి అక్కడ కొడుకు వీసా ఎక్స్‌పైర్ అయితే, ఆతనికి తండ్రిమీద ఎంత ప్రేమ ఉన్నా రాలేడు. అందువల్ల మానవమాత్రులమీద భారం వెయ్యకుండా భగవంతునిమీద భారం వెయ్యమంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈశ్వరుని కృప ఉంటే, పిల్లలే పరిగెత్తుకుంటూ వస్తారు; లేకపోతే సమయానికి ఆదుకునేలా ఎవరినైనా స్వయంగా పంపిస్తాడు భగవంతుడు. అందువల్ల భగవంతునిమీద భారం వెయ్యటం నేర్చుకోండి.

భగవంతునిమీద భారం ఎలా వెయ్యాలి? భగవంతుడు మీ హృదయంలోనే నెలకొని ఉన్నాడని గుర్తుంచుకోండి. మీరు నిత్యపూజ చేసేటప్పుడు భగవంతుణ్ణి ఆహ్వానించి, షోడశోపచారాల పూజ చేసి, తర్వాత ఏమంటారు?

**యథాస్థానం ప్రతిష్ఠాపయామి**

అంటే భగవంతుణ్ణి తన అసలు నిలయం ఏదో దానికి పంపిస్తున్నారు. భగవంతుని నిలయం ఎక్కడో దూరంగా కైలాసంలోనో, వైకుంఠంలోనో లేదు. భగవంతుడు మీ హృదయంలోనే ఉన్నాడు. భగవంతునికి పూలు సమర్పించాలి, అభిషేకాలు చెయ్యాలి కాబట్టి, ఆయనను బాహ్యంగా ఆహ్వానించి అవన్నీ చేస్తారు. తర్వాత హృదయంలో మళ్ళీ ప్రతిష్ఠించుకుంటారు. అంటే మీరు శరణు వేడాల్సిన భగవంతుడు ఎక్కడో లేడు. మీ హృదయంలోనే ఉన్నాడు. అది **మద్వ్యపాశ్రయః**. ఇది మొదటి అర్థం.

ఈ పదానికి ఇంకా లోతైన అర్థం ఇంకొకటి ఉంది. అది భగవంతుణ్ణి శరణు వేడటమంటే, ఆయన చేసిన బోధను పాటించటం. భగవంతుడు వేదాల ద్వారా, భగవద్గీత ద్వారా మన జీవనవిధానాన్ని నిర్దేశించాడు. అందువల్ల గీతలో నిర్దేశింపబడిన జీవనవిధానాన్ని మనం అక్షరం పొల్లుపోకుండా పాటించాలి. మద్వ్యపాశ్రయః అంటే **శాస్త్రవ్యపాశ్రయః** అనేది రెండవ అర్థం. శాస్త్రం ఎటువంటి జీవనవిధానాన్ని నిర్దేశించింది?

**సర్వకర్మాణ్యపి సదా కుర్వాణః** – మీరు చెయ్యాలనుకున్న కర్మలన్నీ చెయ్యండి. అది లౌకిక కర్మ అయినా సరే, ఆధ్యాత్మిక కర్మ అయినా సరే. కాని అవన్నీ ఎలా చెయ్యాలి? వాటన్నిటినీ ఈశ్వరార్పణ భావనతో చెయ్యాలి. అంటే వాటన్నిటినీ భగవంతునికి అర్పించాలి. అందువల్ల సర్వకర్మాణ్యపి సదా కుర్వాణః వాక్యానికి ఈశ్వరార్పణ భావనయా కుర్వాణ అని కలుపుకోవాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే కర్మలను **ఈశ్వరార్పణ భావన**తో చెయ్యాలి. అలా చేస్తే ఏమవుతుంది?

**మత్ ప్రసాదాత్ అవాప్నోతి** – మీరు చేసిన ఆ కర్మలకు వచ్చిన ఫలాన్ని నా ప్రసాదంగా స్వీకరించాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. నా ప్రసాదంగా అంటే ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. అలా చేస్తే మీకు కలిగే ఫలమేమిటి?

**పదమ్ ఆప్నోతి** – పదం అంటే ఇక్కడ మోక్షపదం. ఆ మోక్షం ఎటువంటిది?

**శాశ్వతమ్ (పదమ్)** – శాశ్వతమైనది;

**అవ్యయమ్ (పదమ్)** – నాశనం లేనిది. అంటే శాశ్వతమైన, నాశనం లేని మోక్షాన్ని పొందుతారు.

ఈ శ్లోకం సారాంశం మనకు తెలిసినదే. కర్మలన్నిటినీ ఈశ్వరార్పణ భావనతో చేసి, కర్మఫలాన్ని ఈశ్వర ప్రసాదభావనతో స్వీకరిస్తే, శాశ్వతమైన, అవ్యయమైన మోక్షాన్ని పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడ మనం జాగ్రత్తగా ఉండాలి. ఇవి సారాంశ శ్లోకాలు. అందువల్ల కృష్ణపరమాత్మ అన్ని దశలను చెప్పటం లేదు. కర్మయోగం మాత్రమే పాటిస్తే మోక్షం వచ్చేయదు. కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి వచ్చి వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే మోక్షం వస్తుంది. అంటే కర్మయోగం ద్వారా చిత్తశుద్ధి, గురుప్రాప్తి, శ్రవణప్రాప్తి, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షప్రాప్తి. అందువల్ల కర్మయోగం సరిగ్గా పాటించాలి.

శ్లో. 57 **చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।**
**బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ ॥**

చేతసా, సర్వకర్మాణి, మయి, సన్న్యస్య, మత్పరః,
బుద్ధియోగమ్, ఉపాశ్రిత్య, మచ్చిత్తః, సతతమ్, భవ ॥

| | | | |
|---|---|---|---|
| సర్వకర్మాణి | = సమస్త కర్మలను | బుద్ధియోగమ్ | = సమబుద్ధిరూప యోగమును |
| చేతసా | = నిండుమనస్సుతో | ఉపాశ్రిత్య | = అవలంబించి |
| మయి | = నాకు | మత్పరః | = మత్పరాయణుడవై |
| సన్న్యస్య | = సమర్పించి | సతతమ్ | = సంతతము |
| | | మచ్చిత్తః, భవ | = నాయందే చిత్తము గలవాడవగుము |

**(త్వం) సర్వ-కర్మాణి చేతసా మయి సంన్యస్య, మత్-పరః**
**(సన్) బుద్ధి-యోగమ్ ఉపా(శిత్య, సతతమ్ మత్-చిత్తః భవ ।**

తా: సమస్త కర్మలను నిండుమనస్సుతో నాకు సమర్పించి సమబుద్ధిరూప యోగమును అవలంబించి మత్పరాయణుడవై సంతతము నాయందే చిత్తము గలవాడవగుము.

ఇదే భావన కొనసాగుతున్నది ఇంకా.

**బుద్ధియోగమ్ ఉపా(శిత్య** – నువ్వు కర్మయోగం పాటించుగాక అంటున్నాడు కృష్ణపరమాత్మ. బుద్ధియోగం అంటే అది కర్మయోగికి ఇంకొకపేరు. బుద్ధి అంటే ఇక్కడ భావన. కర్మయోగికి రెండు భావనలు ఉండాలని చూశాము.

**కర్మయోగం = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వర(ప్రసాద బుద్ధి**

కర్తగా కర్మయోగి తను చేసే పనులన్నింటినీ భగవదర్పణం చెయ్యాలి. అప్పుడు అతను ఏ కర్మను కూడా ద్వేషించడు. తను చెయ్యాల్సిన కర్మమీద ఇంక అతనికి ఇష్టాయిష్టాలు ఉండవు. తను చేసే పనిని (ప్రేమించటం నేర్చుకుంటాడు. అది అంత తేలిక కాకపోయినా మీరు చేస్తున్న పనిని మీరు (ప్రేమించటం నేర్చుకుంటే, అప్పుడు ఆ పని మీకు విసుగుపుట్టించే ఆస్కారమే లేదు.

ఆఫీసులో మీ ఉద్యోగధర్మం ఏమిటి? మీ పై అధికారి చెప్పిన పనులను మీరు చెయ్యాలి. వాటిమీద మీ ఇష్టాయిష్టాల (ప్రసక్తి లేదు. అలాగే ఇంట్లో భర్తగా మీ ధర్మాన్ని నెరవేర్చాల్సి ఉంటుంది. కొన్ని పనులు మీకు ఇష్టం ఉండకపోవచ్చు. కాని మీ రాగద్వేషాలకు అవకాశం ఇవ్వకుండా మీరు భర్తగా, ఉద్యోగిగా, తండ్రిగా మీ ధర్మాన్ని మీరు నెరవేర్చాల్సి ఉంటుంది. అందువల్ల మీ రాగద్వేషాలనుబట్టి మీ కర్మను నిర్ణయించకండి. మీరు చేసి తీరాల్సిన పనులను (ప్రేమించటం నేర్చుకోండి; మీకు ఆ పనిమీద నిజంగా ఇష్టం లేకపోయినా, చిరునవ్వు చిందించండి. ఇది కర్తగా మీ భావన. ఇది భావన 1.

మీరేపని చేసినా దానికి ఫలం భగవంతుని నుంచే వస్తుంది. అందువల్ల ఆ ఫలాన్ని కూడా మీ రాగద్వేషాలకు అనుగుణంగా నిర్ణయించకండి. ఎప్పుడైతే రాగద్వేషాలను అనుసరించి మీ అనుభవాన్ని బేరీజు వేస్తారో, అప్పుడే ఆనందం ఇచ్చేవి, దుఃఖం కలుగజేసేవి అని వాటికి పేర్లు పెడతారు. అందువల్ల, అలా చెయ్యకుండా ఏది వచ్చినా, చిరునవ్వుతో స్వీకరించండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ చిరునవ్వుతో స్వీకరించటాన్ని **ఆగతే స్వాగతం కుర్యాత్** అంటారు. ఇది భోక్తగా మీ భావన. ఇది భావన 2.

ఇటువంటి భావనతో కర్తగా, భోక్తగా చేస్తే, ఏ కర్మగాని, అనుభవంకాని మిమ్మల్ని బాధించవు. మీ చేతిలో లేని విషయాలను చిరునవ్వుతో స్వీకరించక తప్పదు. **ఏక్సెప్ట్ అండ్ అకామడేట్.** దాన్ని స్వీకరించి, దానికి అలవాటు పడిపోవాలి. ఎందుకంటే, జీవితంలో జరిగేవాటిల్లో 75% మీ చేతుల్లో ఉండదు. ఎందుకు? గతం మీ చేతిలో లేదు; అది జరిగిపోయింది. వర్తమానం మీ చేతిలో లేదు; అది వచ్చేసింది. అంటే గతం, వర్తమానం రెండూ మీ చేతిలో లేవు.

అయితే భవిష్యత్తు మీ చేతిలో ఉందా? కాని భవిష్యత్తు కూడా పూర్తిగా మీ చేతిలో లేదు. మీ ఫ్రీవిల్‌వల్ల జరగబోయే వాటిని మీరు మార్చగలరు కాని, మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా కొన్ని జరిగితీరుతాయి. కొంతమేరకు భవిష్యత్తును రంగులమయంగా చేసుకోవచ్చు, కాని స్వచ్ఛమైన, రంగులమయం కాని భవిష్యత్తు కూడా కొంత ఉంది. ఏమిటది? ముఖ్యమైనది మీ వయస్సు, మీకు ఇష్టమున్నా, లేకపోయినా వయస్సు పెరుగుతూనే ఉంటుంది. ఈ సంవత్సరం మీకు 49 సంవత్సరాలు అయితే, వచ్చే సంవత్సరం మీరు యాభయ్యోపడిలో అడుగుపెట్టక తప్పదు. అందువల్ల పెరిగే వయస్సును మీరు అడ్డంపెట్టి ఆపలేరు. దాన్ని చిరునవ్వుతో స్వీకరించాల్సిందే.

అందువల్ల బుద్ధియోగం అంటే సమత్వబుద్ధియోగం అనికూడా అనవచ్చు. సమత్వబుద్ధి అంటే చిరునవ్వుతో స్వీకరించటం, దానిని వ్యతిరేకించక పోవటం. ఈశ్వరార్పణ ప్రసాదభావనరూప బుద్ధియోగమ్ లేదా సమత్వ బుద్ధియోగమ్ అనవచ్చు.

**మయి సన్న్యస్య** – మీరు చేసే కర్మలను నాకు అర్పించండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మామూలుగా సన్న్యాసం అంటే త్యజించటం; కాని ఇక్కడ సన్న్యాసం అంటే త్యజించటం కాదు, సన్న్యాసం అంటే అర్పించటం. ఏవి అర్పించాలి?

**సర్వకర్మాణి** – అన్ని కర్మలనూ. అంటే మొత్తం కర్మలన్నిటినీ భగవంతునికి అర్పించమంటున్నాడు కృష్ణపరమాత్మ. అది **సర్వకర్మాణి మయి సన్న్యస్య**. ఎలా చెయ్యాలి?

**చేతసా** – భావనతో. ఈశ్వరార్పణ భావనతో అంకితం చెయ్యాలి.

ఇవన్నీ చేస్తున్నప్పుడు మీ లక్ష్యం గురించి మీకు స్పష్టంగా తెలియాలి. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే మీ లక్ష్యం ఆధ్యాత్మికలక్ష్యం అయితేనే మీకు కర్మయోగం పనికివస్తుంది. దాని బదులుగా మీరు లౌకికలక్ష్యాలను కోరితే కర్మయోగం పనికిరాదు. ఎందుకంటే లౌకికలక్ష్యాలను కోరితే బాహ్యవస్తువులకు ప్రాముఖ్యతను ఇస్తారు. శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో దొరుకుతాయని మీరు గట్టిగా నమ్ముతారు.

కాని శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో లేవని తెలుసుకుంటే, మీరు ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చినట్టు అర్థం. అవి మీ అంతర్గత ఎదుగుదలతో వస్తాయని తెలుసుకుంటారు. అందువల్ల కర్మయోగిగా మీ లక్ష్యం ఏమైవుండాలి? చిత్తశుద్ధి అయివుండాలి; లేదా భగవంతుడు అయివుండాలి; లేదా జ్ఞానం అయివుండాలి; లేదా మోక్షం అయివుండాలి; లేదా అన్నీ కలిపి మీ లక్ష్యం అనికూడా చెప్పవచ్చు. చిత్తశుద్ధి తక్షణలక్ష్యం అవుతుంది; గురుప్రాప్తి, జ్ఞానప్రాప్తి, మోక్షప్రాప్తులు దీర్ఘకాలిక లక్ష్యాలు అవుతాయి.

**మత్పరః** – నన్నే లక్ష్యంగా పెట్టుకోవాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. భగవంతుడు, చిత్తశుద్ధి, జ్ఞానప్రాప్తి, మోక్షప్రాప్తి ఇవన్నీ ఒకటే అని చూశాము.

మరి లౌకిక విజయాల మాటేమిటి? కర్మయోగి వాటిని నిర్లక్ష్యం చెయ్యడు; అవి ఆగంతుకంగా వచ్చాయని గ్రహిస్తాడు. వాటినే ముఖ్యలక్ష్యాలుగా భావించడు.

**మచ్చిత్తః సతతం భవ** – నన్ను ఎన్నడూ మర్చిపోకు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎన్నడూ దైవచింతనకు దూరం కాకూడదు. సతతం అంటే ఎప్పుడూ; మత్ చిత్తః భావ అంటే నా ఆలోచనలోనే ఉండు.

కర్తగా మీరు పనిచేస్తుంటే, ఆ పనిని ఈశ్వరార్పణ భావనతో చేస్తున్నారు. అంటే ఈశ్వరునికి అర్పించటం ద్వారా ఈశ్వరభావనలో ఉంటారు. భోక్తగా మీకు ఏ కర్మఫలం వచ్చినా ప్రసాదభావనతో తీసుకుంటారు. అంటే ఎప్పుడూ ఈశ్వరభావనలోనే ఉంటారు. మీరు మేలుకుని ఉన్నంతసేపూ కర్తగానో, భోక్తగానో ఉంటారు. ఎలా ఉన్నా ఈశ్వరుణ్ణి తలుచుకుంటూనే ఉంటారు. అంటే మీ జీవితం ఈశ్వరుని చుట్టూ పెనవేసుకుని ఉంటుంది.

శ్లో. 58 **మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి ।**
**అథ చేత్ త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి ॥**
మచ్చిత్తః, సర్వదుర్గాణి, మత్ప్రసాదాత్, తరిష్యసి,
అథ, చేత్, త్వమ్, అహంకారాత్, న, శ్రోష్యసి, వినంక్ష్యసి ॥

| | | | |
|---|---|---|---|
| మచ్చిత్తః, త్వమ్ | = నాయందు చిత్తమును నిల్పిన నీవు | అహంకారాత్ | = అహంకార కారణముగా |
| మత్ప్రసాదాత్ | = నా యనుగ్రహమువలన | న, శ్రోష్యసి | = నా వచనములను నీవు పెడచెవిన బెట్టినచో |
| సర్వదుర్గాణి | = సమస్త సంకటములను | వినంక్ష్యసి | = నష్టముల పాలగుదువు |
| తరిష్యసి | = అనాయాసముగా దాటగలవు | | |
| అథ, చేత్ | = అలాకాక | | |

**(త్వం) మత్–చిత్తః (సన్) సర్వ–దుర్గాణి మత్–ప్రసాదాత్ తరిష్యసి,**
**అథ త్వమ్ అహంకారాత్ న శ్రోష్యసి చేత్, వినంక్ష్యసి ।**

తా: నాయందు చిత్తమును నిల్పిన నీవు నా యనుగ్రహమువలన సమస్త సంకటములను అనాయాసముగా దాటగలవు. అలాకాక ఆహంకార కారణముగా నా వచనములను నీవు పెడచెవిన బెట్టినచో నష్టముల పాలగుదువు.

ఇలా ఈశ్వరుణ్ణే తన జీవితంలో ప్రధానంగా చేసుకున్న కర్మయోగి కర్తగా, భోక్తగా కూడా తన ప్రతి అనుభవాన్నీ ఒక పాఠంగా మలుచుకుంటాడు. నేర్చుకోవాలే కాని, ప్రతి అనుభవంనుంచి ఒక పాఠం నేర్చుకోవచ్చు. కాని నేర్చుకోవాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. ప్రశాంతంగా లేని మనస్సు ఒక తప్పును మళ్ళీ మళ్ళీ చేస్తుంది. 'తప్పు చెయ్యటం మానవసహజం,' పాత సామెత. 'తప్పు చెయ్యటం మనిషి జన్మహక్కు,' కొత్త సామెత. కాని చేసిన తప్పునే మళ్ళీ చేస్తే, అది వెర్రితనం అంటుంది శాస్త్రం.

తెలివైన వ్యక్తి తప్పు చేస్తాడు కాని ఆ తప్పునుంచి పాఠం నేర్చుకుంటాడు. ఎందుకు నేర్చుకుంటాడు? కర్మయోగం అతనికి ప్రశాంతచిత్తాన్ని ఇస్తుంది కాబట్టి. మనస్సు ప్రశాంతంగా ఉంటే, బుద్ధి పదునుగా ఉంటుంది; బుద్ధి పదునుగా ఉంటే, ప్రతి అనుభవం నుంచీ అది పాఠం నేర్చుకుంటుంది. దాన్ని పరిణితి అంటారు. అలా

పాఠాలు నేర్చుకుంటే, పరిపక్వత చెందుతూ వస్తే, మనిషి సమస్యలను ఆత్మజ్ఞానం మాత్రమే తీర్చగలదని అర్థం చేసుకుంటాడు.

కర్మయోగంలో ప్రతి అనుభవంనుంచి పాఠం నేర్చుకుంటాడు; బాధాకర అనుభవంనుంచి ఇంకా గొప్ప అనుభవం నేర్చుకుంటాడు. ఆ విధంగా చూస్తే బాధాకర అనుభవాలు నిజానికి అతనికి రెండు విధాల తోడ్పడేలా చేస్తున్నాడు భగవంతుడు. ఒకటి, బాధను అనుభవించటంద్వారా అతని ప్రారబ్ధకర్మ క్షయమవుతుంది. రెండవది, బాధాకరమైన అనుభవంనుంచి పాఠం నేర్చుకుని, పైకి ఎదుగుతాడు.

ఆ విధంగా కర్మయోగి సమత్వాన్ని పొంది, ప్రతి ఒక్క కష్టసుఖంనుంచీ ఒక పాఠం నేర్చుకుంటాడు. పాము విషంలో కూడా మందు ఉంది అంటే అత్యంత విషపూరితమైనది కూడా మంచికి తోడ్పడుతుందని అర్థం. అలా పాఠం నేర్చుకుని ఎదుగుతాడు జ్ఞానయోగి.

అంతేకాదు, ఆధ్యాత్మికరంగంలో ఆటంకాలు ఉండి తీరతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏ మంచికార్యం చెయ్యాలన్నా ఆటంకాలు వచ్చి తీరతాయి; గీతాబోధకు వెళదామనుకుంటే ఆటంకాలు వస్తాయి. ఆటంకాలను మూడురకాలుగా వర్ణిస్తారు. అవి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవక ఆటంకాలు. కాని మీరు కర్మయోగి అయితే, ఈ ఆటంకాలను దాటుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**మచ్చిత్తః** – నన్నే మీ మనస్సులో నిలుపుకుంటే,

**మత్ప్రసాదాత్** – నా అనుగ్రహంవల్ల, అంటే ఈశ్వరానుగ్రహంవల్ల;

**సర్వదుర్గాణి తరిష్యసి** – అన్ని ఆటంకాలను దాటుతారు. ఇక్కడ దుర్గ అంటే మీరు కొలిచే దుర్గాదేవి కాదు. ఇక్కడ ఆటంకాలు అని అర్థం. ఆ ఆటంకాలు మీనుంచే వచ్చేవైతే, వాటిని ఆధ్యాత్మిక ఆటంకాలు అంటారు. మనస్సు సహకరించకపోతే మీరు గీతాబోధకు వెళ్ళినా కూడా బోధను కొంచెం కూడా వినలేరు. మీ చెవులు పనిచెయ్యటం లేదా అంటే పక్కింట్లో మాటలు కూడా మీకు బాగానే వినిపిస్తాయి. మనస్సు, చెవి వెనక లేకుండా ఎక్కడెక్కడో తిరిగి వస్తోందన్నమాట.

ఇవికాక ఆధిభౌతిక, ఆధిదైవిక ఆటంకాలు ఉంటాయి. ఆధిభౌతిక అంటే తోటివారినుంచి వచ్చే ఆటంకాలు; ఆధిదైవిక అంటే ప్రకృతి వైపరీత్యాలు. ఇవన్నీ దాటుతాడు కర్మయోగి అంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని అదే సమయంలో ఒక హెచ్చరిక కూడా చేస్తున్నాడు. కర్మయోగం గురించి ఇన్నిసార్లు విని, దాని ప్రయోజనం తెలుసుకుని, దాని గురించిన ప్రేరణలు వినికూడా, ఇంకా కర్మయోగం పాటించనని భీష్మించుకు కూర్చుంటే, అది మీ ఆధ్యాత్మిక పతనానికి దారితీస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అథ న శ్రోష్యసి చేత్** – దాని బదులుగా, ఒకవేళ మీరు ఈ విలువైన సందేశాన్ని వినకపోతే,

**వినంక్ష్యసి** – మీరు నష్టపోతారు. అంటే ఆధ్యాత్మిక పతనం చెందుతారు. మనిషిగా పుట్టిన ప్రయోజనాన్ని పొందలేరు. మనిషిగా పుట్టినందుకు మోక్షం కోసం ప్రయత్నించాలి. ఆ అపురూపమైన వరాన్ని కాలదన్నుకున్నవారు అవుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు వినరు?

**అహంకారాత్** – అహంకారంవల్ల వినరు. మనిషిగా కొంతమందికి ముందు ఉండేదే అహంకారం. నేనేమిటి ఇంకొకరి సలహా వినేదేమిటి అనుకుంటారు. మనిషిగా పుట్టినందుకు మోక్షానికి ప్రయత్నించాలనుకోరు. మనిషిగా పుట్టినందుకు వారేం చెయ్యాలనుకుంటే అది చేసే స్వేచ్ఛ ఉంది అనుకుంటారు. దానివల్ల ఈ మంచిమాటలను పెడచెవిన పెట్టి, పతనమవుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 59 **యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।**
**మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥**
యత్, అహంకారమ్, ఆశ్రిత్య, న, యోత్స్యే, ఇతి, మన్యసే,
మిథ్యా, ఏషః, వ్యవసాయః, తే, ప్రకృతిః, త్వామ్, నియోక్ష్యతి ॥

| | | | |
|---|---|---|---|
| అహంకారమ్ | = అహంకారమును | ఏషః, వ్యవసాయః | = ఈ నిశ్చయము |
| ఆశ్రిత్య | = ఆశ్రయించి | మిథ్యా | = వృథాయే |
| న, యోత్స్యే | = నేను యుద్ధము చేయను | (యతః) | = (ఎందుకంటే) |
| ఇతి | = అని | ప్రకృతిః | = నీ స్వభావమే |
| యత్, మన్యసే | = ఏదైతే తలంతువో | త్వామ్ | = నిన్ను |
| తే | = నీయొక్క | నియోక్ష్యతి | = యుద్ధము చేయుటకు పురికొల్పును |

**యత్ అహంకారమ్ ఆశ్రిత్య న యోత్స్యే ఇతి మన్యసే, (తత్) ఏషః**
**తే వ్యవసాయః మిథ్యా (ఏవ అస్తి), ప్రకృతిః త్వామ్ నియోక్ష్యతి ।**

తా: అహంకారమును ఆశ్రయించి నేను యుద్ధము చేయను అని ఏదైతే తలంతువో, నీయొక్క ఈ నిశ్చయము వృథాయే. ఎందుకంటే నీ స్వభావమే నిన్ను యుద్ధము చేయుటకు పురికొల్పును.

ముందు శ్లోకంలో వాడిన న శ్రోష్యసి వినంక్ష్యసి పదాలను ఇందులో ఇంకా వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అర్జునుని విషయమే తీసుకుంటే అతను జాతిక్షత్రియుడు. రజోగుణం మూర్తీభవించిన వ్యక్తి. అందువల్ల అతను కర్మ చెయ్యాలి. ఇప్పుడేమో అతను నేను యుద్ధం చెయ్యను, సన్న్యాసం స్వీకరిస్తాను లేదా ఆధ్యాత్మిక సాధన చేస్తాను అంటే అది అతని మనస్తత్వానికి సరిపోదు. అందువల్ల అతను అందులో దారుణంగా ఓడిపోతాడు.

సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి నేను కర్మచెయ్యను, ఆశ్రమజీవనం గడుపుతాను అంటే అర్థం ఉంది. అతని గుణం ధ్యానానికీ, వేదాంత శ్రవణానికీ అనువుగా ఉంటుంది. కాని రజోగుణం మెండుగా ఉన్నవ్యక్తి వేదాంతశ్రవణం చెయ్యాలంటే చెయ్యలేడు. మొదట్లో కొన్ని రోజులు బాగానే ఉండవచ్చు కాని, తర్వాత అతనిలోని రజోగుణం బయటకు వస్తుంది. మరో నలుగురు సన్న్యాసులను ప్రోగేసి వారికొక సంఘాన్ని ఏర్పరుస్తాడు. ఇంక వారికేం కావాలంటే వాటికోసం యుద్ధం చేస్తాడు. వారికి గుడిసె లేకపోతే, గుడిసె వేయించి పెడతాడు; అవసరమైతే ఢిల్లీకి విమానంలో వెళ్ళి అక్కడ హెూరాహెూరీ పోట్లాడో, ఉపవాసదీక్షలు చేపట్టో, తిరుగుబాటు లేపో హడావుడి చేస్తాడు. అందువల్ల రజోగుణం ఉన్నవ్యక్తి తీరిగ్గా కూర్చోలేడు. అయితే తక్కినవారికోసం పోరాడుతాడు.

అందువల్లనే ఎవరైనా స్వామీజీ దగ్గరకు వచ్చి, 'నా ఆస్తినంతా ఏ ఆశ్రమానికో రాసేసి, అక్కడే ఉండిపోతాను,' అని చెబితే తొందరపడవద్దనీ, ముందు అక్కడ కొన్ని రోజులు ఉండి చూడమనీ చెబుతారు స్వామీజీ. అలా చూస్తే వెనక్కి తిరిగివచ్చే సందర్భాలే ఎక్కువ కనబడతాయి. దూరపుకొండలు నునుపు అంటారు. ఇక్కడ్నుంచి చూస్తే ఆశ్రమజీవనం బాగుంది అనుకుంటారు; ఆశ్రమానికి వెళ్ళి చూస్తే, ఇక్కడి జీవితమే బాగుంది అనుకుంటారు. ఎందుకంటే ఎక్కడికి వెళ్ళినా రాగద్వేషాలు పోవు.

పరిపక్వత వచ్చాక సన్న్యసిస్తే వేదాంతశాస్త్రంమీద శ్రద్ధ ఏర్పడుతుంది; పరిపక్వత రాకముందే సన్న్యసిస్తే ఎవరేం చేస్తున్నారో గమనించటమే సరిపోతుంది. అందువల్ల సరిగ్గా విను అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**యది అహంకారమ్ ఆశ్రిత్య** – నీ అహంకారాన్నే ఆశ్రయించుకుని కూర్చున్నావనుకో,

**న యోత్స్య ఇతి మన్యసే** – నేను యుద్ధం చెయ్యనని భీష్మించుకు కూర్చున్నావనుకో;

**మిథ్యైష వ్యవసాయస్తే** – ఈ నీ నిర్ణయం వృథా అవుతుంది. అది పనిచెయ్యదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు?

**ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి** – నీ రాజసిక ప్రవృత్తి నిన్ను ఖాళీగా కూర్చోనివ్వదు. ఇక్కడ ప్రకృతి అంటే స్వభావం; అర్జునుని స్వభావం రాజసిక ప్రవృత్తి.

రాజసిక ప్రవృత్తి ఉన్నవారు ఒక వృత్తి నుంచి ఇంకొక వృత్తికి మారినా కూడా ఖాళీగా కూర్చోలేరు. కంప్యూటర్ రంగంలో బిజినెస్ చేస్తున్న వ్యక్తి దానితో విసుగుపుట్టి ఏ హృషీకేశ్‌కో వెళ్ళినా అక్కడ కొన్నాళ్ళకే రుద్రాక్షమాలల వ్యాపారం మొదలుపెడతాడు. ఇండోనేషియాలో చవగ్గా దొరుకుతాయని తెలుసుకుని, అక్కడ్నుంచి తెప్పించి, ఇక్కడ అమ్ముతాడు. అంటే ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేస్తాడు.

అందువల్ల ఇక్కడ జీవితం విసుగు పుడుతోందనుకుని ఎక్కడికో వెళ్ళి, అక్కడ ఇంకో లంపటంలో ఇరుక్కునే బదులు, ఇక్కడే హాయిగా ఉండి, స్వధర్మాన్ని పాటిస్తూ, ఆదివారాలు గీతాబోధకు వెళితే అది ఇంకా లాభదాయకంగా ఉంటుంది. ఎవరు చెబుతున్నారు ఇది? కృష్ణపరమాత్మే. నువ్వు వదలాలనుకోవటం వృథా. అందువల్ల ప్రకృతి ధర్మాన్ని నిర్వర్తించు అంటున్నాడు. అది **ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి**.

శ్లో. 60 **స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా ।**
**కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్ ॥**

స్వభావజేన, కౌంతేయ, నిబద్ధః, స్వేన, కర్మణా,
కర్తుమ్, న, ఇచ్ఛసి, యత్, మోహాత్, కరిష్యసి, అవశః, అపి, తత్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | న, ఇచ్ఛసి | = నీవు ఇష్టపడకున్నావో |
| మోహాత్ | = మోహప్రభావమున | తత్, అపి | = ఆ యుద్ధమును గూడ |
| యత్ | = ఏ యుద్ధకర్మను | స్వేన, స్వభావజేన | = నీ క్షత్రియ స్వభావమునకు తగిన |
| కర్తుమ్ | = చేయుటకు | కర్మణా | = కర్మసంస్కారములచే |

| | | | |
|---|---|---|---|
| నిబద్ధః | = బంధింపబడినవాడవై | కరిష్యసి | = చేయుదువు |
| అవశః | = అవశుడవై | | |

**హే కౌన్తేయ! (యతః) స్వభావజేన స్వేన కర్మణా నిబద్ధః (త్వం)**
**యత్ మోహాత్ కర్తుమ్ న ఇచ్ఛసి, తత్ అవశః (సన్) అపి కరిష్యసి ।**

తా: ఓ అర్జునా! మోహప్రభావమున ఏ యుద్ధకర్మను చేయుటకు నీవు ఇష్టపడకున్నావో, ఆ యుద్ధమును గూడ నీ క్షత్రియ స్వభావమునకు తగిన కర్మ సంస్కారములచే బంధింపబడినవాడవై, అవశుడవై చేయుదువు.

ఏ వృత్తిని మీరు ఎన్నుకున్నా అది మీ స్వభావానికి అనుగుణంగా ఉండాలి. అప్పుడే మీ వ్యక్తిత్వం మిమ్మల్ని బాధించదు. అలా మీ స్వభావానికి అనుగుణంగా లేకపోతే అందులో ఎక్కువకాలం ఉండలేరు. ఆ ఉద్యోగాన్ని వదిలేసి, ఇంకోటి వెతుక్కుంటారు; లేదా మీరు చేసే కర్మను మారుస్తారు.

**స్వేన కర్మణా నిబద్ధః** – ప్రతి ఒక్కరు ఒకరకమైన కర్మకు బంధింపబడివుంటారు. ఈ కర్మ చెయ్యాలని ఏది నిర్ణయిస్తుంది?

**స్వభావజేన** – వారి స్వభావం నిర్ణయిస్తుంది.

తమాషా ఏమిటంటే, ఈ స్వభావం జ్ఞానం పొందాక కూడా మారదు. మీరు జాగ్రత్తగా గమనిస్తే జ్ఞానులకు కూడా వారివారి ప్రవృత్తులు ఉంటాయి. నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, నేను నిర్గుణఆత్మను అనే జ్ఞానం పొందారు వారు. నిజమే, కాని వారి మనశ్శరీరాలకు ఒక ప్రత్యేకమైన స్వభావం ఉంటుంది. ఈ స్వభావమే వారు జ్ఞానం పొందాక కూడా ఏంచెయ్యాలో నిర్ణయిస్తుంది.

కొంతమంది జ్ఞానులు జ్ఞానం పొందగానే సమాజంనుంచి విడివడతారు. ఏ హృషీకేశ్‌కో, ఉత్తరకాశీకో, గంగోత్రీకో వెళ్ళిపోయి, ఒంటరి జీవనాన్ని కొనసాగిస్తారు. గంగోత్రీలో అయితే మరీ అవస్థ. ఆరు నెలలు ఎవరూ అటువైపు వెళ్ళను కూడా వెళ్ళలేరు; అయినా అక్కడ ఒంటరిగా ఉంటారు వారు. చుట్టూ మంచుతో కప్పబడిన హిమాలయాలు తప్ప నరమానవుడు కనపడడు. మాట్లాడటానికి తోడు ఉండదు. అయినా అది ఇష్టపడతారు కొందరు.

మరికొందరు జ్ఞానులు సమాజంలో ఉంటూ, హుషారుగా ఉంటారు. కొంతమంది స్వాములు అయితే దేశ, విదేశాలలో తిరుగుతూ ఉంటారు. పెద్ద బిజినెస్ మాగ్నెట్ కన్నా కూడా వీరు చాలా బిజీగా ఉంటారు.

ఒక జ్ఞాని ఒంటరిగా, నిశ్శబ్దంగా ఉంటే; ఇంకొక జ్ఞాని ఇలా దేశవిదేశాలు ఎందుకు తిరుగుతాడు? అది వారి స్వభావం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**కర్తుం న ఇచ్ఛసి** – నీకు ఇప్పుడు యుద్ధం చెయ్యాలని లేకపోవచ్చు. ఎందుకు?

**మోహాత్** – ఇప్పుడు నువ్వు మోహంలో ఉన్నావు అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. నువ్వు మోహంలో ఉండి, ఇప్పుడు యుద్ధం చెయ్యవద్దని నిశ్చయించుకున్నా కూడా, నువ్వు ఖాళీగా ఉండలేవు అంటున్నాడు.

సాత్త్విక ప్రవృత్తి ఉన్నవ్యక్తిని గృహస్థాశ్రమంలోకి తోస్తే, అతను భార్యకు తలనొప్పిగా మారతాడు. అతనికి డబ్బు సంపాదనమీద వ్యామోహం ఉండదు. దానికి బదులుగా, రాజసప్రవృత్తి ఉన్న అతనికి సన్యాసం ఇప్పిస్తే, అక్కడే కర్మ చేస్తాడు.

**కరిష్యసి** – నువ్వు కర్మ చెయ్యవద్దు అనుకున్నా కూడా, నువ్వు చేస్తావు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు?

**అవశః అపి** – అది నీ స్వభావం కాబట్టి, నువ్వు నిస్సహాయుడవు అవుతావు. అంటే కర్మ చెయ్యకుండా ఉండలేవు. ఏ ఆశ్రమంలో ఉన్నావన్నది కాదు ముఖ్యం; నీ స్వభావం ముఖ్యం. ఆ స్వభావం నిన్ను కట్టిపడేస్తుంది. అందువల్ల నీ స్వభావాన్నే ఎరిగి, నీ ధర్మాన్ని నిర్వర్తించు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**స్వభావజేన కౌంతేయ స్వేన కర్మణా నిబద్ధః**

ఓ అర్జునా, నీ స్వభావానికి తగ్గ కర్మకు కట్టుబడివుండు; దానికి విరుద్ధంగా పోకు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఏదైనా చెప్పటం పాపం, దాన్ని వక్రీకరించేవారు ఉంటారు. ఇది విని, 'అయితే నా స్వభావం దొంగతనం చెయ్యటం. అందువల్ల నేను దొంగతనం చేస్తాను,' అనుకూడదు దొంగ. అప్పుడు పోలీసు వచ్చి, 'అయితే నా స్వభావం దొంగను పట్టుకోవటం. నేను నిన్ను పట్టుకుంటాను,' అంటాడు.

స్వభావం అంటే ధర్మానికి కట్టుబడి ఉన్న స్వభావం ఉండాలి. ఎవరికైనా అధార్మికంగా ఏదైనా చెయ్యాలనే స్వభావం ఉంటే, దాన్ని మార్చుకోవాలి. ధార్మికమార్గం ఉన్న దేన్నైనా మీ జీవితానికి తగ్గట్టుగా ఎన్నుకోవచ్చు. **ఆత్మనః ప్రియం చ** అంటుంది మనుస్మృతి. అంటే మీరు ఎన్నుకున్న వృత్తి మీకు నచ్చాలి.

'నా స్వభావానికి నచ్చే ఉద్యోగం దొరికే అవకాశం ఎక్కడుంది ఈ పోటీ ప్రపంచంలో?' అనవచ్చు మీరు. అప్పుడు కూడా దానికి మార్గం చూశాము. మీకు ఇష్టమైన ఉద్యోగం దొరకకపోతే, దొరికిన ఉద్యోగాన్ని మీకు ఇష్టంగా మలుచుకోండి. నిజానికి, ప్రయత్నం చేస్తే, దేన్నైనా ఇష్టపడవచ్చు. దయానంద స్వామీజీ అంటారు, 'ప్రయత్నం చేస్తే బొద్దింకను కూడా ఇష్టపడటం నేర్చుకుంటారు.' అలాంటప్పుడు మీకు ఇష్టంలేని ఉద్యోగాన్ని ఇష్టపడటం నేర్చుకోవాలి.

అందుకే కృష్ణపరమాత్మ అర్జునునితో అన్నాడు – నీకు యుద్ధం చెయ్యటం ఇష్టం లేకపోయినా, నీ స్వభావం యుద్ధం చెయ్యటం. ఇక్కడ కురుక్షేత్రంలో యుద్ధం చెయ్యకపోతే, అడవిలో చేస్తావు. ఇక్కడ వారితో యుద్ధం చెయ్యకపోతే, అక్కడ వేరే ఎవరితోనో యుద్ధం చేస్తావు. అందువల్ల **అవశః అపి తత్ కరిష్యసి** అన్నాడు.

శ్లో. 61 **ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥**
ఈశ్వరః, సర్వభూతానామ్, హృద్దేశే, అర్జున, తిష్ఠతి,
భ్రామయన్, సర్వభూతాని, యంత్రారూఢాని, మాయయా ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | భ్రామయన్ | = వారివారి కర్మలను అనుసరించి, వారిని భ్రమింపజేయుచు |
| యంత్రారూఢాని | = శరీరరూప యంత్రములను అధిరోహించిన | | |
| సర్వభూతాని | = సమస్త ప్రాణులను | సర్వభూతానామ్ | = సకల భూతములయొక్క |
| ఈశ్వరః | = అంతర్యామియైన పరమేశ్వరుడు | హృద్దేశే | = హృదయములయందు |
| మాయయా | = తన మాయచే | తిష్ఠతి | = స్థితుడై యుండును |

**హే అర్జున! యన్త్ర-ఆరూఢాని సర్వ-భూతాని మాయయా**
**భ్రామయన్ ఈశ్వరః సర్వ-భూతానామ్ హృత్-దేశే తిష్ఠతి ।**

తా: ఓ అర్జునా! శరీరరూప యంత్రములను అధిరోహించిన సమస్త ప్రాణులను అంతర్యామియైన పరమేశ్వరుడు తన మాయచే వారివారి కర్మలను అనుసరించి, వారిని భ్రమింపజేయుచు, సకల భూతములయొక్క హృదయములయందు స్థితుడై యుండును.

**త్యాగేన ఏవ చిత్తశుద్ధిః, త్యాగేన ఏవ మోక్షః**

ఏ విధమైన ఆధ్యాత్మిక ఉన్నతి తీసుకున్నా, సాధకుడు సమాజానికి సేవ చెయ్యటంవల్లనే వస్తుంది. అతను ఈ సేవ చెయ్యటానికి ఎన్నుకున్న మార్గం ఏదైనా కావచ్చు, వృత్తి ఏదైనా కావచ్చు; కాని దానిద్వారా అతను సేవ చెయ్యాలి. చిత్తశుద్ధి కాని, మోక్షం కాని త్యాగం చేస్తేనే వస్తాయి. త్యాగం చెయ్యటం అంటే సేవ చెయ్యటం; సేవ చెయ్యటం అంటే కర్మ చెయ్యటం. కాని కేవలం కర్మ చేస్తే చాలదు; ఆ కర్మను యోగంగా మలచుకోవాలి.

కర్మను కర్మయోగంగా మలుచుకోవటమెలా? ఆ మార్గాన్ని ఈ రెండు శ్లోకాల్లో వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ. కర్మను ఈశ్వరార్పణ భావనతో చెయ్యాలి. మీరు చేసే వృత్తినే భగవంతునికి అర్పించే పువ్వుగా మలచుకోవాలి. మీ వృత్తిలోని కర్మను భగవంతునికి అర్పించాలి. అలా భగవంతునికి అర్పించాలంటే, సాధకుడు రెండు విషయాలను పాటించాలి. అవి శ్రద్ధ, చిరునవ్వు.

సాధకుడు ఏ పనిచేసినా భగవంతునికి అర్పిస్తాడు కాబట్టి, ఆ పనిని సణుక్కుంటూ, గొణుక్కుంటూ చెయ్యకూడదు. చాలా శ్రద్ధపెట్టి చెయ్యాలి. రెండవ విషయం, చిరునవ్వుతో చెయ్యాలి. ఎవ్వరైనా ఏ పనైనా శ్రద్ధగా, చిరునవ్వులు చిందిస్తూ చేస్తున్నారూ అంటే, అతను కర్మయోగి అని చెప్పవచ్చు. వారిచ్చే జీతానికి ఈ పని చాలులే అనకూడదు. జీతం అవాంతర ఫలం. అంటే ధనం అవసరం లేదా అంటే అవసరమే. ధనం లేకపోతే ఆహారం తీసుకోలేరు; నిత్యావసరాలు తీరవు. కాని ధనం**కోసం** పని చెయ్యకూడదు. ధనంతో **సంబంధం లేకుండా** పని చెయ్యాలి. **వర్క్ ఈజ్ వర్షిప్** అంటారు. మీ పనిని దైవపూజగా భావించి చేస్తారు. దానికి వచ్చే జీతం అవాంతర ఫలం అవాలి తప్ప, ముఖ్యఫలం అవకూడదు. అందువల్ల ఏ పనిని చేసినా శ్రద్ధగా, చిరునవ్వుతో చెయ్యండి.

భగవంతునికి అర్పించాలంటే ఏ ఆలయానికి వెళ్ళాలి? మా ఆఫీసులో భగవంతుని ఫోటో కూడా లేదే! ఈ సందేహం రావచ్చు మీకు. కృష్ణపరమాత్మ ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు అంటున్నాడు. ఎందుకు? భగవంతుడు తన నిలయంలో ఉన్నాడు. భగవంతుని నిలయం ఏది అని ఎవరైనా అడిగితే మీరు ఏమంటారు? కైలాసం అనో, వైకుంఠం అనో, బదరీ అనో, రామేశ్వరం అనో అంటారు. కాని కృష్ణపరమాత్మ భగవంతుని అసలైన నిలయం 'మీ హృదయమే సుమా,' అంటున్నాడు. సాక్షిచైతన్యం రూపంలో మీ హృదయంలో ఉన్నాడు.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్ ॥** – తైత్తిరీయం

వేరే ఏవీ కూడా అసలైన నిలయాలు కావు.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽ ర్జున తిష్ఠతి** – ఓ అర్జునా, ఈశ్వరుడు అన్ని జీవుల హృదయాలలో కొలువై ఉన్నాడు. కర్మయోగం పాటించటానికి, భగవంతునికి అర్పించటానికి, ఆలయాలు, దేవతామూర్తులు బాహ్యంగా అవసరం లేదు.

**దేహో దేవాలయ ప్రోక్తః , జీవో దేవః సనాతనః॥**

ఈ శరీరమే ఒక ఆలయం. ఇందులో ఉన్న జీవాత్మ ఎవరో కాదు, సాక్షాత్తూ ఆ పరమాత్మే.

హృద్దేశే – హృదయదేశే. హృదయంలో ఉన్నాడని ఎందుకంటున్నాడు కృష్ణపరమాత్మ. శాస్త్రం ప్రకారం మనస్సు మెదడులో లేదు, మనస్సు హృదయంలో ఉంది. ఏ హృదయం? కుడివైపుదా, ఎడమవైపుదా? ఒకటే హృదయం ఉంటుంది ప్రతి మనిషికీ. కొందరు రెండు హృదయాలు ఉన్నాయని, ఈ హృదయం కుడివైపు ఉంటుందనీ అపోహ పడతారు. అది పొరపాటు, ఉన్నదొకటే హృదయం.

అయితే ఆ హృదయంకోసం ఎలా వెదకాలి? భగవంతుడు మహాత్ములలోను, జ్ఞానులలోను ఉంటాడు కదా, వారిని వెతికి పట్టుకోవటమెలా అంటారు కొందరు. కృష్ణపరమాత్మ నీకా సందేహమేమీ వద్దు అంటున్నాడు. ఎందుకు?

సర్వభూతానామ్ (హృద్దేశ) – భగవంతుడు అందరి హృదయాలలోనూ ఉంటాడు. ఉత్తమపురుషుడయినా, సాధువైనా, మేధావి అయినా, నేరస్థుడు అయినా, ఎవరినీ విడిచిపెట్టకుండా, అందరి హృదయాలలో నెలకొని ఉంటాడు. కాకపోతే సాధువులు, జ్ఞానులు చిత్తశుద్ధి పొందారు కాబట్టి, వారి మనస్సు శుభ్రంగా ఉంటుంది. అంత స్వచ్ఛమైన మనస్సులో భగవంతుడు మరింత స్పష్టంగా ప్రకటితమవుతాడు. మనస్సు స్వచ్ఛంగా లేని వారిలో భగవంతుడు లేడు అనకూడదు; కాకపోతే వారి మనస్సులో ప్రకటితమవడు.

బంగారాన్ని చూడండి, కొత్తగా కొన్న ఆభరణం మిలమిల మెరిసిపోతుంది; ఎప్పట్నుంచో వేసుకుంటున్న ఆభరణంమీద బాగా దుమ్ము చేరుకుని, ఇత్తడిలా ఉంటుంది. రెండూ నిజానికి బంగారమే. స్వచ్ఛమైన దానిలో (దుమ్ములేని దానిలో) బంగారం ప్రస్ఫుటంగా ఉంటే, మకిలిపట్టినదానిలో బంగారం విలువ తెలియటంలేదు. అందువల్ల భగవంతుడు మీ హృదయంలో కూడా ఉన్నాడు. హృద్దేశే అంటే అంతఃకరణంలో ఉన్నాడు. ఎలా ఉన్నాడు?

సాక్షిచైతన్యం రూపంలో ఉన్నాడు. దేన్ని సాక్షిగా చూస్తున్నాడు? ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తున్నాడు. మీకు వస్తున్న ప్రతి ఆలోచన కూడా మీకు తెలుస్తున్నది; ఆలోచన రాకపోతే కూడా, ఆలోచన రాలేదని తెలుస్తున్నది. ఎలా తెలుస్తున్నది? సాక్షి చైతన్యంవల్ల. ఆ సాక్షి చైతన్యమే **ఈశ్వరః తిష్ఠతి**.

**సర్వభూతాని భ్రామయన్** – అన్ని ప్రాణులకు చైతన్యాన్ని ప్రసాదిస్తున్నాడు. హృదయంలో ఉండి, అన్ని ప్రాణులను చైతన్యవంతం చేస్తున్నాడు. చైతన్యవంతం చేస్తున్నాడు అంటే భగవంతుడు వారికి చైతన్యాన్ని అందిస్తున్నాడు. ఎందుకంటే, మనశ్శరీరాలు జడం; వాటికి సహజంగా జీవం లేదు. శరీరం జడం, ఇంద్రియాలు జడం, మనస్సు జడం. ఎందుకంటే అవి పాంచభౌతికం. ఇవన్నీ జడమైనా కూడా చైతన్యవంతంగా ఉన్నాయి. ఎందుకు? అవి చైతన్యాన్ని ఎక్కడినుంచో అరువు తెచ్చుకున్నాయి. అవి ఎక్కడినుంచో అరువు తెచ్చుకున్నాయి అంటే, దాని అర్థం చైతన్యాన్ని అప్పు ఇచ్చే ఒక వస్తువు ఉందన్నమాట. కృష్ణపరమాత్మ ఇదుగో ఈ ఆత్మ లేదా ఈ చైతన్యం అప్పు ఇస్తున్నది అంటున్నాడు. భ్రామయన్ అంటే చైతన్యవంతం చెయ్యటం. ఈ భావన అద్భుతంగా కేనోపనిషత్తులో వస్తుంది.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యత్। వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః** – కేనోపనిషత్ 1.2

కన్ను కన్నుగా, చెవి చెవిగా పని చేస్తున్నాయి అంటే వాటి వెనక ఉండి, వాటికి చైతన్యాన్ని ఇస్తున్న చైతన్యంవల్లనే. ఒక అందమైన మళయాళం పాట కూడా అదే భావనను అందజేస్తున్నది.

**కన్నిను కన్నాయ కన్నా** – కన్నా అంటే కృష్ణపరమాత్మ. ఓ కృష్ణా, నువ్వు; కన్నిను కన్నాయ అంటే నువ్వు కన్నుకు కన్నువు. అంటే కన్నుకు చూసే శక్తిని ఇచ్చేది నువ్వే.

కృష్ణపరమాత్మ కూడా అదే చెబుతున్నాడు.

నేను అందరికీ చైతన్యాన్ని ఇస్తున్నాను.

భూతాని – భూతాని అంటే స్థూల, సూక్ష్మ శరీరాలు. అవి వాటంతట అవి జడం. వాటికి కృష్ణపరమాత్మ నేను చైతన్యం కలుగజేస్తున్నాను అంటున్నాడు. ఎలా ఇస్తాడు? ఒక ఉదాహరణ చెబుతున్నాడు దానికి.

**యంత్రారూఢాని మాయయా (ఏవ)** – ఏవ మనం కలుపుకోవాలి. బొమ్మలలో పెట్టిన యంత్రాలు బ్యాటరీలవల్ల నడుస్తాయి, మాట్లాడతాయి. వాటిని వాకీటాకీ డాల్స్ అంటారు. కీ ఇస్తే మాట్లాడే బొమ్మలు అవి. అంటే అవి జడం, కాని వాటిని బ్యాటరీల ద్వారా మాట్లాడింపజేస్తున్నారు. ఇప్పటి రోబోలను కూడా ఉదాహరణగా తీసుకోవచ్చు. రోబో ఒక యంత్రం మాత్రమే కాని దాన్ని మనిషిలా అన్ని పనులు చేసేలా చేస్తున్నాడు మనిషి. అదే విధంగా మనిషి కూడా భగవంతుడు సృష్టించిన యంత్రమే. ఆ యంత్రానికి చైతన్యాన్ని కలుగజేస్తున్నాడు భగవంతుడు.

ఏదైనా చెప్పటం పాపం, దాన్ని వక్రీకరించేవారు ఉంటారు. అలాగే ఇక్కడ కూడా భగవంతుడు మనలను కీలుబొమ్మలను ఆడించినట్లు ఆడిస్తున్నాడు అంటే, అయితే మనమేం చెయ్యటం లేదు; అయితే మనం ఏదైనా చెడుకర్మలు చేస్తే, దానికి ఎవరు బాధ్యులు అంటారు కొందరు.

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్** – 11.33

భగవంతుడు అక్కడ అంతా నేనే చేస్తున్నాను, నువ్వు నిమిత్తమాత్రుడివి మాత్రమే అర్జునా అన్నప్పుడు, ఈ విషయంమీద వివరంగా చూశాము. అక్కడ కూడా ఇదే సందేహాన్ని వెలిబుచ్చాము. దాని సారాంశాన్ని మాత్రం ఇప్పుడు చూద్దాము.

భగవంతుడు మనకు చైతన్యాన్ని అరువు ఇస్తాడు కాని, మనం ఎటువంటి కర్మను చెయ్యాలో భగవంతుడు నిర్ణయించడు; మన ఫ్రీవిల్‌తో మనమే నిర్ణయించుకోవాలి. దానికి ఉదాహరణగా కారులో పెట్రోలు అంశం చూశాము. పెట్రోలు కారు రోడ్డుమీదకు పరిగెత్తటానికి శక్తిని ఇస్తుంది; రోడ్డుమీద కారు ఎటు పరుగెత్తాలో పెట్రోలు నిర్ణయించదు. దాన్ని నడిపే డ్రైవరు నిశ్చయిస్తాడు.

ఈ ఉదాహరణలో పెట్రోలు భగవంతుడు. భగవంతుడు మనకు ఈ జీవనాన్ని సాగించటానికి శక్తిని ఇస్తాడు కాని, ఎటు వెళ్ళాలో నిర్ణయించుకునేది మనమే. పెట్రోలును సామాన్యకారణం అనీ, డ్రైవరును విశేషకారణం అనీ అంటారు. అలాగే మన జీవితానికి భగవంతుడు సామాన్యకారణం, మనం విశేషకారణం. భగవంతుడు ఈ శక్తిని ఎలా ఇస్తాడు?

మాయయా – తన మాయాశక్తితో ఇస్తాడు. భగవంతుడు ఈ జగత్తును, జీవులను సృష్టించటమే కాక వాటికి చైతన్యాన్ని కూడా ఇస్తున్నాడు తన మాయాశక్తితో.

శ్లో. 62 **తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।**
**తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥**
తమ్, ఏవ, శరణమ్, గచ్ఛ, సర్వభావేన, భారత,
తత్ప్రసాదాత్, పరామ్, శాంతిమ్, స్థానమ్, ప్రాప్స్యసి, శాశ్వతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | తత్ప్రసాదాత్ | = ఆయన అనుగ్రహమువల్ల |
| సర్వభావేన | = అన్ని విధములుగా | పరామ్, శాంతిమ్ | = పరమశాంతిని |
| తమ్, ఏవ | = ఆ పరమేశ్వరునే | శాశ్వతమ్, స్థానమ్ | = శాశ్వతమైన పరమపదమును |
| శరణమ్, గచ్ఛ | = శరణుజొచ్చుము | ప్రాప్స్యసి | = పొందగలవు |

**హే భారత! (త్వం) తమ్ ఏవ సర్వ–భావేన శరణమ్ గచ్ఛ**
**తత్ ప్రసాదాత్ పరామ్ శాన్తిమ్ శాశ్వతమ్ స్థానమ్ (చ) ప్రాప్స్యసి ।**

తా: ఓ అర్జునా! అన్ని విధములుగా ఆ పరమేశ్వరునే శరణుజొచ్చుము. ఆయన అనుగ్రహమువల్ల పరమశాంతిని, శాశ్వతమైన పరమపదమును పొందగలవు.

భగవంతుడు జీవులందరి హృదయంలో కొలువైవున్నాడు కాబట్టి, మీరు చేసే కర్మలను భగవంతునికి అర్పించి, మీ ఆధ్యాత్మిక సాధనలో మీరు ఉన్నత శిఖరాలు ఎక్కటానికి తోడ్పడమని వేడుకోవాలి. మీరు చేసే కర్మ ద్వారా మీకు రావాల్సిన చిత్తశుద్ధిని భగవంతుడే అందించగలడు. ఇది కర్మపరంగా చూశాము.

ఇప్పుడు కర్మఫలం పరంగా చూస్తే ఈశ్వరుడు కర్మఫలదాత అని తెలుసు. ఏ కర్మ చేసినా కూడా, దానికి రెండు రకాల పుణ్యం వస్తుంది. అవి లౌకికపుణ్యం, ఆధ్యాత్మికపుణ్యం. లౌకికపుణ్యం లౌకికఫలాలను ఇస్తుంది అంటే ఇల్లు, కుటుంబం, ఐశ్వర్యం. ఆధ్యాత్మికపుణ్యం అంటే గీత నేర్చుకునే అవకాశం; గీతాబోధకు వెళ్ళే సామర్థ్యం. అది ఈ జన్మలో చేసుకున్న పుణ్యంవల్ల కావచ్చు, గతజన్మ పుణ్యంవల్ల కూడా కావచ్చు. చిత్తశుద్ధి కావాలంటే భగవంతుణ్ణి శరణు వేడాలి.

**తమేవ శరణం గచ్ఛ** – ఆ పరమాత్మనే శరణు వేడాలి. ఎలా?

**సర్వభావేన** – శ్రద్ధాభక్తులతో శరణు వేడాలి. అలా మీరు చేసే కర్మను భగవంతునికి అర్పిస్తే, లౌకికసుఖాలు వచ్చినా, రాకపోయినా, ఆధ్యాత్మిక ఎదుగుదల ఖచ్చితంగా వస్తుంది. లౌకిక జయాపజయాలు అనేక అంశాల మీద ఆధారపడివుంటాయి. అందువల్ల శరణాగతి పాటించినా, లౌకికంగా విజయం సాధించకపోవచ్చు. 'నేను ఈ పని ప్రారంభించేముందు భగవంతునికి కొబ్బరికాయ కొట్టి మరీ పని ప్రారంభించాను. కాని విఫలమయ్యాను,' అంటారు కొందరు. భగవంతునికి అర్పణ భావనతో చేస్తే లౌకిక విజయాలు వచ్చినా, రాకపోయినా, ఆధ్యాత్మిక విజయం తథ్యం.

> **నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
> **స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥** – 2.40

సర్వభావేన – సర్వభావేన అంటే శ్రద్ధాభక్తులతో, మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి శరణు వేడాలి.

**తత్ప్రసాదాత్** – మొత్తం బాధ్యతను భగవంతునికి అప్పజెప్పేశాక, మీకు ఎప్పుడు, ఏ దశలో, ఏది ఇవ్వాలో భగవంతుడే చూసుకుంటాడు. వివేకం ఇస్తాడు, వైరాగ్యం ఇస్తాడు, శమాదిషట్కసంపత్తి ఇస్తాడు; ముముక్షుత్వం ఇస్తాడు. ఇవన్నీ ఇచ్చాక సరియైన సమయం ఆసన్నమైనప్పుడు గురువును కూడా భగవంతుడే ఏర్పరుస్తాడు. నేర్చుకునే ఆసక్తిని కలుగజేస్తాడు. ఒకటేమిటి, సమస్తం భగవంతుడే చూసుకుంటాడు.

> **తక్కువేమి మనకూ రాముండొక్కడుండువరకూ**

మీరు ఇంక నిశ్చింతగా ఉండండి.

తత్ప్రసాదాత్ అంటే ఈశ్వర అనుగ్రహంవల్ల. దీని తర్వాత ఏం చెయ్యాలో మీకు తెలియకపోయినా, భగవంతునికి తెలుసు. ఒకసారి టికెట్టు కొని రైలెక్కాక మీ బాధ్యత తీరిపోతుంది. మధ్యలో ఏ స్టేషన్లమీదుగా వెళ్ళాలనేది మీ సమస్య కాదు; రైలును నడిపే డ్రైవర్‌ది అది. మిమ్మల్ని అతను మీ అంతిమలక్ష్యానికి చేరుస్తాడు.

భగవంతునిమీద మీరు భారం వేస్తే, ఆధ్యాత్మిక ప్రయాణంలో అన్ని దశలూ ఆయనే చూసుకుంటాడు. మీకు ఏ టికెట్టు కొనాలి, ఏ రైలు ఎక్కించాలి, ఎన్ని స్టేషన్లు దాటించి, అంతిమగమ్యానికి తీసుకువెళ్ళాలి, అంతా ఆయనదే బాధ్యత. మీకు టికెట్టు కొనే శ్రమ కూడా లేదు. భగవంతుడు మీకూడా ఉండి, మీ లక్ష్యానికి మిమ్మల్ని చేరుస్తాడు. ఏమిటా లక్ష్యం?

**శాశ్వతం స్థానం ప్రాప్యసి** – శాశ్వతమైన మోక్షమనే లక్ష్యానికి తీసుకువెళతాడు. అంతిమ లక్ష్యానికి చేరుకున్నారో లేదో ఎలా తెలుస్తుంది? శరీరంలో ఏమైనా మార్పు వస్తుందా?

**పరాం శాంతిమ్ (ప్రాప్యసి)** – మోక్షం పొందితే శ్రేష్ఠమైన శాంతిని పొందుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ప్రశాంతత, సమతుల్యత పొందుతారు. ఇవి మోక్షంయొక్క లక్షణాలు. కాకపోతే, ఎప్పుడూ చూసే దశలను మర్చిపోకూడదు.

కర్మయోగం → చిత్తశుద్ధి → గురుప్రాప్తి → శ్రవణప్రాప్తి → జ్ఞానప్రాప్తి → మోక్షప్రాప్తి

ఈ స్టేషన్లను దాటుకుంటూ వెళితే అంతిమలక్ష్యం అయిన మోక్షం పొందుతారు. భగవంతునిమీద భారం వేస్తే ఈ స్టేషన్లను భగవంతుడే దాటిస్తాడు.

దీనితో కృష్ణపరమాత్మ కర్మయోగ సారాంశాన్ని ముగిస్తున్నాడు. 56–62 శ్లోకాలు కర్మయోగ సారాంశం.

ఈ పద్దెనిమిదవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ మొత్తం గీతాబోధయొక్క సారాంశం చెబుతున్నాడు. గీతలో కృష్ణపరమాత్మ ప్రధానంగా రెండు సాధనలు గురించి చెప్పాడు. అవి కర్మయోగం, జ్ఞానయోగం.

కర్మయోగం జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తే, జ్ఞానయోగం జ్ఞానప్రాప్తిని ఇస్తుంది. తద్వారా మోక్షాన్ని ఇస్తుంది. ఇదీ ప్రాథమిక బోధ. మనకు తెలిసిన ఏ ఆధ్యాత్మిక సాధనను తీసుకున్నా కూడా, అది ఈ రెండు సాధనల్లో ఏదో ఒక దానికిందకు వస్తుంది. బదరీ, కేదార్‌నాథ్, కాశీ, రామేశ్వరాలకు వెళ్ళే తీర్థయాత్రలు; ప్రాణాయామం, సమాజసేవలు, భజనలు చెయ్యటం, యజ్ఞయాగాదులు చెయ్యటం – ఇవన్నీ కర్మయోగంలోకి వస్తాయి.

జ్ఞానం పొందటానికి పరోక్షంగా తోడ్పడేది ఏదైనా జ్ఞానయోగం కిందికి వస్తుంది. సంస్కృతం నేర్చుకుంటే అది జ్ఞానయోగానికి తోడ్పడుతుంది. అలాగే తర్కశాస్త్రం, మీమాంసశాస్త్రం నేర్చుకుంటే శంకరాచార్యుల వారి భాష్యాలను అర్థం చేసుకోవటానికి తోడ్పడతాయి. భగవద్గీతలోని శ్లోకాలను లేదా ఉపనిషత్తుల్లోని మంత్రాలను కంఠతా పట్టినా కూడా జ్ఞానయోగానికి తోడ్పడుతుంది. ఆ విధంగా మీరు ఏ సాధన చేసినా అది అయితే కర్మయోగం అవుతుంది, లేదా జ్ఞానయోగం అవుతుంది. ఆ మాట కృష్ణపరమాత్మే మూడవ అధ్యాయంలో చెప్పాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**

**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥** – 3.3

ఆ విధంగా రెండే ఉన్నాయి – కర్మయోగం, జ్ఞానయోగం.

మరి అయితే పన్నెండవ అధ్యాయంలో చెప్పిన భక్తియోగం మాటేమిటి? అక్కడే చూశాము, భక్తియోగం విడిగా లేదని. భక్తిని కృష్ణపరమాత్మ ఐదు మెట్లుగా విభజిస్తే, శాస్త్రంలో మూడు మెట్లుగా చూస్తాము.

**కర్మయోగము + ఉపాసనయోగము + జ్ఞానయోగము = భక్తియోగము**

రెండే ఉన్నాయని చెబుతూ, ఇప్పుడు ఉపాసనయోగం ఎక్కడ్నుంచి వచ్చింది అనకూడదు. కర్మయోగంలో భాగమే ఉపాసనయోగం. కర్మ కాయికకర్మ అయితే ఉపాసన మానసికకర్మ. భక్తియోగంలోని ప్రాథమిక దశను కర్మయోగం అంటే భక్తియోగంలోని చివరిదశను జ్ఞానయోగం అంటారు. అందువల్ల భక్తియోగం అంటూ ప్రత్యేకించి విడిగా లేదు. భగవద్గీతలో భక్తియోగం అంటూ ప్రత్యేకించి విడిగా లేదు అంటే, వేదాల్లో కూడా విడిగా లేదని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే భగవద్గీత వేదాల సారం. కర్మ+ఉపాసనల గురించి వేదపూర్వభాగంలో నేర్చుకుంటే, జ్ఞానం గురించి వేదఅంతభాగంలో నేర్చుకుంటారు. కర్మయోగంలో భగవంతునిమీద భారం వేస్తే, జ్ఞానయోగంలో ఆ భగవంతుడు నేనే అని నేర్చుకుంటారు.

కర్మయోగం, జ్ఞానయోగం – ఈ రెండే ప్రాథమిక సాధనలు కాబట్టి, ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ ఈ రెండింటి గురించి మళ్ళీమళ్ళీ అనేక కోణాల్లో చెబుతున్నాడు. కర్మయోగము గురించి మూడుసార్లు (1–12, 41–49, 56–62 శ్లోకాలు), జ్ఞానయోగం గురించి రెండుసార్లు (13–17, 50–55 శ్లోకాలు) చెప్పాడు. మళ్ళీ ఈ రెండింటినీ ఏకశ్లోకంలో ఒక్కొక్కటిగా చెబుతాడు.

శ్లో. 63 **ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।**
**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥**
ఇతి, తే, జ్ఞానమ్, ఆఖ్యాతమ్, గుహ్యాత్, గుహ్యతరమ్, మయా,
విమృశ్య, ఏతత్, అశేషేణ, యథా, ఇచ్ఛసి, తథా, కురు ॥

| | | | |
|---|---|---|---|
| ఇతి | = ఈ విధముగా | అశేషేణ | = సమగ్రముగా |
| గుహ్యాత్, గుహ్యతరమ్ | = పరమ గోప్యమైన | విమృశ్య | = పరిశీలించి |
| జ్ఞానమ్ | = జ్ఞానము | యథా | = ఏ విధముగా |
| మయా | = నాచేత | ఇచ్ఛసి | = నీవు కోరుకొనుచున్నావో |
| తే | = నీకు | తథా | = ఆ ప్రకారము |
| ఆఖ్యాతమ్ | = చెప్పబడినది | కురు | = చేయుము |
| ఏతత్ | = ఈ గోప్యజ్ఞానమును | | |

**ఇతి గుహ్యాత్ గుహ్యతరం జ్ఞానమ్ మయా తే ఆఖ్యాతమ్,**
**ఏతత్ అశేషేణ విమృశ్య, యథా ఇచ్ఛసి తథా కురు ।**

తా: ఈ విధముగా పరమ గోప్యమైన జ్ఞానము నాచేత నీకు చెప్పబడినది. ఈ గోప్యజ్ఞానమును సమగ్రముగా పరిశీలించి ఏ విధముగా నీవు కోరుకొనుచున్నావో ఆ ప్రకారము చేయుము.

ఇప్పుడిక ఈ రెండింటి గురించీ రెండుమూడు సార్లు చెప్పాడు కాబట్టి, అర్జునుడు బాగానే అర్థం చేసుకోగలడు కాబట్టి, తన బోధను రాబోయే శ్లోకాల్లో (63–66) ముగించబోతున్నాడు.

**జ్ఞానం తే ఆఖ్యాతమ్** – ఈ విధంగా నేను నీకు గీతాబోధను చేశాను. ఇతి అంటే రెండవ అధ్యాయంలో 11వ శ్లోకంలో మొదలుపెట్టి ఇంతకుముందు శ్లోకం వరకూ (2.11 – 18.62) ఈ విధంగా చేసిన ఈ బోధ, ఈ శ్లోకాల్లో నేను వేదాంతసారమైన గీతాశాస్త్రాన్ని బోధించాను.

ఈ బోధను అంత తేలిగ్గా తీసుకోవద్దని కూడా చెబుతున్నాడు. సాధారణంగా మనిషి మనస్తత్త్వం ఎలా ఉంటుందంటే ఏదైనా తేలిగ్గా దొరికినా, పైసా ఖర్చులేకుండా దొరికినా దాని విలువ తెలుసుకోలేడు. దాన్ని తేలిగ్గా తీసుకుంటాడు. ఇక్కడ కూడా అర్జునుడు అడగగానే, అది కూడా యుద్ధభూమిలో అడిగినా, వెంటనే కృష్ణపరమాత్మ బోధించాడు కదా! అర్జునుడు దాన్ని తేలికగా తీసుకోకుండా కృష్ణపరమాత్మ దాని విలువ గురించి చెబుతున్నాడు.

**గుహ్యాద్గుహ్యతరమ్ (జ్ఞానమ్)** – నీకు నేను బోధించిన జ్ఞానం మామూలు జ్ఞానం కాదు. రహస్యాలలోకెల్లా అత్యంత గొప్ప రహస్యమైన జ్ఞానాన్ని నీకు బోధించాను. మంత్రశాస్త్రంలో కొన్ని మంత్రాలను చెప్పరు. అలా కొన్ని రహస్యవిద్యలు ఉన్నాయి. వాటిలో అత్యంత రహస్యమైన జ్ఞానం ఆత్మజ్ఞానం.

కాని చివరికి నువ్వు ఏం చెయ్యాలో నేను ప్రత్యక్షంగా నీకు చెప్పను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్** – 3.2

నేను యుద్ధం చెయ్యాలో, వద్దో నువ్వే తేల్చిచెప్పు అన్నాడు అర్జునుడు మూడవ అధ్యాయంలో.

ఇప్పుడు పద్దెనిమిదవ అధ్యాయంలో కూడా కృష్ణపరమాత్మ నువ్వేం చెయ్యాలో నేను తేల్చిచెప్పను. నువ్వు బుద్ధిజీవివి, మంచీ చెడూ ఆలోచించుకునే తెలివితేటలు నీకు ఉన్నాయి అంటున్నాడు.

భగవంతుడు మనిషిని బుద్ధిజీవిని చేసింది ఎందుకు? బుద్ధిగా ఇతరుల సలహాలను పాటించమని చెప్పటానికి కాదు. అందరి సలహాలు వినాలి, మంచీ చెడు బేరీజు వేసుకోవాలి, చివరికి తనే నిర్ణయం తీసుకోవాలి. తన జీవితానికి తనే బాధ్యుడు అవ్వాలి. ఇంకొకరి చేతిలో కీలుబొమ్మ కారాదు.

పైగా ఇంకొకరి నిర్ణయాలను అమలుపరచటం అలవాటు చేసుకుంటే, ఆ ఆధారపడటం ఎంతగా అలవాటు అవుతుందంటే, చివరకి ఏ దుస్తులు వేసుకోవాలో కూడా వీరు నిర్ణయం చేసుకోలేరు. షష్టిపూర్తి అయినా కూడా, ఎవరో ఒకరిమీద ఆధారపడతారు. చిన్నప్పుడు, ఊహ తెలియకముందు, ఎవరి నిర్ణయంమీదో ఆధారపడ్డారంటే అర్థం ఉంది; ఊహ తెలిశాక, వారి బుద్ధిని ఉపయోగించాలి.

అంటే అసలు ఎవరి సలహా వినకూడదా? సలహా విననవసరం లేదు అనటం లేదు. అనుభవజ్ఞులైన పెద్దలు ఉన్నారు, గురువులు ఉన్నారు, తల్లిదండ్రులు ఉన్నారు, శాస్త్రం ఉంది. అందరి నుంచీ, అన్నింటి నుంచీ సమాచారాన్ని సేకరించండి, బేరీజు వేసుకోండి; కాని చివరికి మీరే నిర్ణయం తీసుకోండి. మీరే నిర్ణయం తీసుకున్నా, దానివల్ల ఎదురయ్యే ఫలితాన్ని ఎదుర్కొనే గుండెధైర్యాన్ని అలవరచుకోండి. కాని చాలామందికి, వారు చేసిన కర్మవల్ల వచ్చే ఫలితాలను ఎదుర్కొనే ధైర్యం ఉండదు. దానికి ఎవరిమీదో తప్పును తోసేయాలి. అందువల్ల నిర్ణయం తీసుకునే హక్కు కూడా ఎదుటివారికే ఇస్తారు.

కాని ఇక్కడ కృష్ణపరమాత్మ ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాడు అర్జునునికి. 'ఓ అర్జునా, నువ్వేం చెయ్యాలో నేను నిశ్చయించను. నా లక్ష్యం నీకు జ్ఞానోదయం కలిగించటం తప్ప నిన్ను ఆదేశించటం కాదు!'

**ఏతత్ అశేషేణ విమృశ్య** – నేను చెప్పినదాన్ని నువ్వే పూర్తిగా పరిశీలించి, విశ్లేషించుకో. ఈ ఆధ్యాత్మిక నిచ్చెనలో నువ్వు ఏ మెట్టుమీద ఉన్నావో, నువ్వే నిర్ణయించుకో.

చిత్తశుద్ధి కలిగేదాకా, కర్మ చేసితీరాలి. కాని చిత్తశుద్ధి పొందాక, క్రమేపీ కర్మను తగ్గించుకుంటూ రావాలి. కర్మను పెంచాలా, తగ్గించాలా? ఇది అందరికీ సమానంగా ఇచ్చే సలహా కాదు. ఒక్కొక్కరు ఒక్కొక్క స్థాయిలో ఉంటారు. వారి స్థాయీభేదాన్నిబట్టి వారికి సలహా ఇవ్వాలి.

అందరికీ ఒకటే సలహా ఎలా ఇస్తారు? తలనొప్పితో తన దగ్గరకు వచ్చిన రోగులందరికీ సమానంగా ఆస్ప్రిన్ వేసుకోమని చెప్పలేదు డాక్టరు. అలా చెబితే, అది ప్రమాదకరం కూడా. ఎందుకంటే తలనొప్పి 2500 కారణాలవల్ల రావచ్చు. అందులో ఒక కారణం, కుటుంబసభ్యులు కూడా కావచ్చు. అందువల్ల అందరికీ ఒకే మందు ఎలా చెబుతాడు? ఇది వైద్యరంగానికి చెందిన సూత్రం. అదే సూత్రాన్ని ఆధ్యాత్మిక రంగానికి కూడా అన్వయించవచ్చు. ఐదు దశల సాధనను పన్నెండవ అధ్యాయంలో చూశాము. అందులో ఏ దశలో తాము ఉన్నారో, ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. దాన్నిబట్టి ముందుకు సాగాలి. అందువల్ల నువ్వు నేర్చుకున్నదాన్ని బాగా విశ్లేషించుకో – **ఏతత్ అశేషేణ విమృశ్య.**

**యథేచ్ఛసి** – నువ్వు ఏది సరియైన నిర్ణయం అని భావిస్తావో, నీ అవసరానికి ఏది సరిపోతుంది అనుకుంటావో;

**తథా కురు** – అలా చెయ్యి.

ఇతరులకు, వారు నిర్ణయాలు తీసుకునేందుకు మీరు తోడ్పడవచ్చు. కాని చివరికి నిర్ణయం తీసుకోవాల్సింది వారే. మీరు ఎప్పటికీ వారి వెన్నంటే ఉండలేరు. ముఖ్యంగా పిల్లలు ఎప్పుడూ మీతోనే ఉండరు; అందువల్ల వారంతట వారు నిర్ణయం తీసుకునే స్థాయికి ఎదిగేలా తోడ్పడాలి.

ఇతరులకు స్వేచ్ఛను ఇవ్వగలగటం మీరిచ్చే సరియైన శిక్షణ. కాని అందరూ ఆ స్వేచ్ఛను ఇవ్వలేరు. ఎందుకు? అలా వారికి స్వేచ్ఛను ఇవ్వాలంటే మీకు చాలా గుండెధైర్యం ఉండాలి. మీమీద ఇతరులు, ముఖ్యంగా మీ పిల్లలు ఆధారపడటం అనే అలవాటుకు మీరు ఆధారపడ్డారు. మీ అబ్బాయి మీ సలహామీద ఆధారపడితే, అది మీకు ఆనందం. పెళ్ళయ్యాక ఏదైనా సలహా అడగకపోతే, కోడల్ని ఆడిపోసుకుంటారు. వాడు భార్య వచ్చాక మారిపోయాడు అంటారు. ఎన్నాళ్ళు అలా మీమీద ఆధారపడాలి?

మిమ్మల్ని వారు కావాలనుకోవాలని మీరు కావాలనుకోవటం సంసారం. వారు మిమ్మల్ని కావాలని కోరుకుంటున్న అన్నిరోజులూ వారిని మీ అదుపులో పెట్టుకుంటారు; ప్రతి చిన్నదానికీ మీమీద ఆధారపడేలా అలవాటు చేస్తారు. అలా వారిని మీ చేతుల్లో ఉంచుకుంటారు.

కృష్ణపరమాత్మ ఇది మంచిపద్ధతి కాదు అంటాడు. ఆరోగ్యకరమైన పెంపకం అంటే వారు స్వయంగా నిర్ణయాలు తీసుకునేలా పిల్లలను పెంచటం. అలాగే ఆరోగ్యకరమైన బోధ అంటే శిష్యుడు గురువుమీద ఆధారపడకుండా

ఉండేలా చెయ్యటం. కృష్ణపరమాత్మ ఆదిగురువు; పరమాత్మకు గురువెలా ఉండాలో తెలుసు. నేను నిన్ను ఆజ్ఞాపించను. నీకేది మంచిది అనిపిస్తే అది చెయ్యి. **యథేచ్ఛసి తథా కురు.**

శ్లో. 64 **సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః ।**
**ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥**
సర్వగుహ్యతమమ్, భూయః, శృణు, మే, పరమమ్, వచః,
ఇష్టః, అసి, మే, దృఢమ్, ఇతి, తతః, వక్ష్యామి, తే, హితమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వగుహ్యతమమ్ | = | సమస్త గోప్యవిషయములందును పరమగోప్యమైన | ఇష్టః, అసి | = | ఇష్టమైనవాడవు |
| మే, పరమమ్ | = | సర్వశ్రేష్ఠమైన నా వచనములను | తతః | = | అందువలన |
| భూయః | = | ఇంకనూ | ఇతి, హితమ్ | = | హితకరములైన, వచనములను |
| శృణు | = | వినుము | తే | = | నీకు |
| మే | = | నాకు | వక్ష్యామి | = | చెప్పెదను |
| దృఢమ్ | = | అత్యంతము | | | |

**సర్వ–గుహ్యతమమ్ పరమమ్ వచః మే భూయః శృణు**
**మే దృఢమ్ ఇష్టః అసి, ఇతి తతః తే హితమ్ వక్ష్యామి ।**

తా: సమస్త గోప్యవిషయములందును పరమగోప్యమైన సర్వశ్రేష్ఠమైన నా వచనములను ఇంకనూ వినుము. నాకు అత్యంతము ఇష్టమైనవాడవు. అందువలన హితకరములైన, ఈ నా వచనములను నీకు చెప్పెదను.

ముందు శ్లోకంలో అర్జునునికి తన ఫ్రీవిల్‌ను ఉపయోగించి, తనే నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను ఇచ్చాడు కృష్ణపరమాత్మ. అంటే ఇప్పుడు అర్జునుడు తన ఫ్రీవిల్‌ను ఉపయోగించాలి. ఫ్రీవిల్‌ను సద్వినియోగం చెయ్యవచ్చు; దుర్వినియోగం చెయ్యవచ్చు కూడా. దయానంద స్వామీజీ ఫ్రీవిల్ అంటే దుర్వినియోగం చేసేది అంటారు. కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి నువ్వే నిశ్చయించుకో అన్నాడు కాని, అతనిమీద అభిమానం కొద్దీ, అతను సరియైన నిర్ణయం తీసుకోగలడో లేదో అని మళ్ళీ ఆరాటపడుతున్నాడు. అర్జునుడు పద్దెనిమిది అధ్యాయాలూ విన్నాక, బాగా ఆలోచించి, తప్పు నిర్ణయం తీసుకుంటేనో?

'ఇదిగో, పైకప్పు కిందికి ఉంది, తలుపు చాలా కిందికి ఉంది, తల కొట్టుకుంటుంది జాగ్రత్త,' అని చెపితే, ఒకవ్యక్తి అతి జాగ్రత్తకు పోయి, ఎక్కడినుంచో తల వంచుకుంటూ వచ్చి, తీరా తలుపు దగ్గరికి వచ్చేసరికి తల ఎత్తాడు. ఫలితం! తల బొప్పి కట్టింది. అలా మనిషి రెండురకాలుగా పొరపాటు చేసే ప్రమాదం ఉంది. అవి – ఆలోచించి చేసే పొరపాటు, ఆలోచించకుండా చేసే పొరపాటు. అలా అర్జునుడు పద్దెనిమిది అధ్యాయాలూ విన్నాక, ఆలోచించి మరీ పొరపాటు చేస్తే ఎలా? కృష్ణపరమాత్మకు అర్జునుణ్ణి ఆజ్ఞాపించటమూ ఇష్టంలేదు;

అలాగని అతన్ని పూర్తిగా వదిలివేయటానికీ మనసు రావటం లేదు. అందువల్ల మళ్ళీ ఒకసారి గీతాసారాన్ని చెప్పదలుచుకున్నాడు. నిజానికి మంగళం పాడేశాడు. కాని మళ్ళీ చెప్పబోతున్నాడు కాబట్టి,

**భూయః** – మళ్ళీ చెబుతాను అంటున్నాడు. ఏమిటి?

**సర్వగుహ్యతమం (భూయః) శృణు** – అత్యంత రహస్యమైన ఈ జ్ఞానం గురించి మళ్ళీ ఒకసారి విను.

**పరమం వచః** – నా శ్రేష్ఠమైన మాటలను, అపురూపమైన మాటలను మళ్ళీ విను అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఎందుకు మళ్ళీ మళ్ళీ కృష్ణపరమాత్మ చెబుతున్నాడు? అర్జునుడు తన మాటలను వినాలనుకుంటున్నాడా, అర్జునుడు తప్పు నిర్ణయం తీసుకోకూడదనుకుంటున్నాడా? కృష్ణపరమాత్మకు తన బోధ బాగా చేశాడని తెలుసు; కాని ఇంతా విని అర్జునుడు ఎక్కడ పొరపాటుగా నిర్ణయం తీసుకుంటాడో అని ఏమూలో శంక ఉండిపోయింది.

ఇప్పుడు, తల్లిదండ్రులుగా మీరు కూడా పిల్లలకు స్వేచ్ఛను ఇచ్చినా, ఏమూలో వారు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో, అది తప్పవుతుందేమోననే భయం ఉంటుంది. అదికాక, వారు తీసుకునే తప్పు నిర్ణయం మిమ్మల్ని బాధిస్తుందేమోననే భయం కూడా ఉంటుంది. వారేం నిర్ణయం తీసుకున్నా, మీకేం నష్టంలేదు అనే నమ్మకం కలిగినప్పుడే వారిని పూర్తిగా వదులుతారు. అదే విధంగా శిష్యుడు ఏ నిర్ణయం తీసుకున్నా గురువుకు ఏం నష్టం వాటిల్లదు అని గురువుకు నమ్మకం కలిగినప్పుడే వారిని పూర్తిగా వదులుతాడు.

కాని ఇక్కడ కృష్ణపరమాత్మకు తనకు నష్టం కలుగుతుందన్న శంక ఏమీలేదు. నువ్వేం నిర్ణయం తీసుకున్నా నాకేం నష్టంలేదు అని ప్రత్యేకించి చెబుతున్నాడు. అయినా ఎందుకు మళ్ళీ చెబుతున్నాడు?

**ఇష్టోఽసి** – నువ్వంటే నాకు చాలా ఇష్టం. పైగా నువ్వు మార్గం చూపమని నన్ను శరణు వేడావు.

**దృఢమ్** – నువ్వంటే మామూలుగా ఇష్టం కాదు, నువ్వు నాకు అత్యంత ఆత్మీయునివి.

**తతో వక్ష్యామి తే హితమ్** – అందువల్ల, నీకు ఏది మంచిదో అది మళ్ళీ చెబుతాను విను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ముందే చెప్పినట్టుగా, మనమేం నిర్ణయం తీసుకున్నా భగవంతునికి ఏమీ అవదు. భగవంతుడు మనకు స్వేచ్ఛనిచ్చాడు. ఏం కావాలంటే అది చెయ్యండి; కాని దానివల్ల కలిగే పరిణామాలను అనుభవించటానికి సిద్ధంగా ఉండండి అంటాడు.

ఈ అధ్యాయంలో ఈ శ్లోకం వరకూ (18.64) కృష్ణపరమాత్మ మొత్తం భగవద్గీతను మళ్ళీ సంక్షిప్తంగా బోధించాడు. అందులో ముఖ్యమైన రెండు సాధనలు కర్మయోగం, జ్ఞానయోగం. ఇవి ముఖ్యం కాబట్టి, ఈ అధ్యాయంలోనే కర్మయోగాన్ని మూడుసార్లు, జ్ఞానయోగాన్ని రెండుసార్లు సంక్షిప్తంగా వివరించాడు. తను చెప్పాల్సిందంతా చెప్పేశాను అని తృప్తిపడ్డాడు. అర్జునా నా అభిప్రాయాన్ని నీమీద బలవంతంగా రుద్దను. నా బోధను ఆధారంగా చేసుకుని నీ నిర్ణయం నువ్వే తీసుకో అన్నాడు.

**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు** – 18.63

నేను నీకు దారి చూపించే గురువునే కాని, నీ తరుపున నేను నిర్ణయాలు తీసుకోను అన్నాడు. కాని అర్జునుడు ఎక్కడ పప్పులో కాలేస్తాడో అని మళ్ళీ తన బోధను ఇంకో రెండు శ్లోకాల్లో చెప్పబోతున్నాడు.

శ్లో. 65 **మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥**
మన్మనాః, భవ, మద్భక్తః, మద్యాజీ, మామ్, నమస్కురు,
మామ్, ఏవ, ఏష్యసి, సత్యమ్, తే, ప్రతిజానే, ప్రియః, అసి, మే ॥

| | | | |
|---|---|---|---|
| మన్మనాః | = నాయందే మనస్సు నిల్పినవాడవు | మామ్, ఏవ | = నన్నే |
| మద్భక్తః | = నాయందు భక్తి గలవాడవు | ఏష్యసి | = పొందెదవు |
| మద్యాజీ | = నన్ను పూజించువాడవు | తే | = నీకు |
| భవ | = కమ్ము | సత్యమ్, ప్రతిజానే | = సత్యప్రతిజ్ఞ చేయుచున్నాను |
| మామ్ | = నాకు | (యతః) | = ఎందుకంటే |
| నమస్కురు | = నమస్కరింపుము | మే | = నాకు |
| (ఏవమ్) | = ఇట్లు చేయుటవలన | ప్రియః, అసి | = నీవు మిక్కిలి ఇష్టమైనవాడవు |

**మత్–మనాః, మత్–భక్తః, మత్–యాజీ (చ) భవ, మామ్ నమస్కురు (ఏవం కృత్వా త్వం)**
**మామ్ ఏవ ఏష్యసి (ఇతి) తే సత్యమ్ ప్రతిజానే, (యతః త్వం) మే ప్రియః అసి ।**

తా: నాయందే మనస్సు నిల్పినవాడవు, నాయందు భక్తి గలవాడవు, నన్ను పూజించువాడవు కమ్ము. నాకు నమస్కరింపుము. ఇట్లు చేయుటవలన నన్నే పొందెదవు. నీకు సత్యప్రతిజ్ఞ చేయుచున్నాను. ఎందుకంటే నాకు నీవు మిక్కిలి ఇష్టమైనవాడవు.

**డి) చరమ శ్లోకం: 65 కర్మయోగము – సంక్షిప్తంగా**

ఈ శ్లోకం, తర్వాత వచ్చే శ్లోకం కూడా సంక్షిప్తానికి, సంక్షిప్తానికి, సంక్షిప్త శ్లోకాలని చెప్పవచ్చు. ఈ శ్లోకాన్ని కర్మయోగానికి ఏకశ్లోకీ అనీ, వచ్చే శ్లోకాన్ని జ్ఞానయోగానికి ఏకశ్లోకీ అనీ వ్యవహరించవచ్చు. అందువల్ల ఈ రెండూ చాలా ముఖ్యమైన శ్లోకాలు. ఈ రెండింటిలోనూ మొత్తం గీతాసారం వచ్చేస్తుంది. అందువల్ల మిగతా గీతాబోధను మర్చిపోయినా, నిజానికి మర్చిపోకూడదు, ఈ రెండు శ్లోకాలను మర్చిపోకూడదు.

కర్మయోగం అంటే దైవం ప్రధానంగా ఉన్న జీవనవిధానం. దైవాన్ని ప్రధానంగా చేసుకుని, సమాజానికి ఉపయోగపడే కర్మలు చెయ్యటం. జ్ఞానయోగం అంటే జ్ఞానం ప్రధానంగా ఉన్న జీవనవిధానం. బాహ్యంగా కాకుండా, అంతర్ముఖులై జ్ఞానాన్ని పొందటం.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ కర్మయోగం గురించి సంక్షిప్తంగా చెబుతున్నాడు. కర్మయోగం అంటే దైవచింతన ఉన్న జీవనాన్ని నడపటం. దైవచింతన ఉన్న జీవనం రెండు ముఖ్య సాధనలతో మొదలవుతుంది. అవి నిత్యపూజ, స్వాధ్యాయము.

**ప్రార్థన** – రోజూ కొంతసేపు ప్రత్యేకించి భగవంతునికి ప్రార్థన చెయ్యాలి. మీ వీలునుబట్టి ఎంతసేపు చేస్తారో మీరు నిర్ణయించుకోవచ్చు. అరగంట చేస్తారో, గంటసేపు చేస్తారో మీ ఇష్టం; కాని పూజ మాత్రం చేసితీరాలి. దానికి కుంటిసాకులు ఏవీ చెల్లవు. అదికూడా, వీలున్నంత వరకూ, ఆ పూజ పొద్దున్న చేస్తే మంచిది. ఎందుకంటే పొద్దున్నే పూజ చేస్తే దాని ప్రభావం రోజంతా ఉంటుంది. పొద్దున్నా, సాయంకాలం కూడా చెయ్యగలిగితే మరీ మంచిది; అలా కుదరదు, ఒకసారే చేస్తాను అంటే పొద్దున్నే చెయ్యటం మంచిది. అది కూడా సూర్యోదయం అవటానికి ముందో, అవుతుండగానో చేస్తే ఇంకా మంచిది. అంటే దీని అర్థం, మీరు పొద్దున్నే లేవాలి.

అంటే రాత్రి ఒంటిగంట వరకూ టీవీ చూసి, పొద్దున్న పదిగంటలకు లేస్తాను అంటే కుదరదు. సూర్యోదయం కన్నా ముందో, కనీసం సూర్యోదయం అవుతుండగానో లేచి, కొంత సమయాన్ని ప్రార్థనకు కేటాయించండి. అది ఏ రూపంలోనైనా ఉండవచ్చు. పూజ చెయ్యండి; పారాయణం చెయ్యండి; జపం చెయ్యండి; లేదా ధ్యానం చెయ్యండి. నామజపాన్ని మనస్సులో చేస్తే అది ఒక విధమైన ధ్యానం అవుతుంది. వీటన్నిటినీ కలిపి **ప్రార్థన** అంటారు.

**స్వాధ్యాయము** – ఈ రెండవ సాధనను ఈ మధ్య ఎక్కువగా నొక్కివక్కాణించటం లేదు. కాని అది భగవద్గీతను అధ్యయనం చెయ్యటం. దాన్ని స్వాధ్యాయము అంటారు. ఇది పంచమహాయజ్ఞాల్లో ఒకటైన బ్రహ్మయజ్ఞం కిందికి వస్తుంది. అసలైతే స్వాధ్యాయము చెయ్యాలంటే ఉపనిషత్తులను అధ్యయనం చెయ్యాలి. భగవద్గీత ఉపనిషత్తుల సారం కాబట్టి, ఒక్క గీతను, సంపూర్ణంగా, పూర్తిగా మొత్తం బోధ అర్థమయ్యేలా అధ్యయనం చెయ్యాలి. అధ్యయనం అంటే గీతాశ్లోకాలను పారాయణం చెయ్యటమే కాదు, గీతాబోధను అర్థం చేసుకోవటం. ఇది చాలా ముఖ్యమైన దైవచింతన.

**గేయం గీతానామ సహస్రం ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్** – భజగోవిందం

గీతను అందరూ అధ్యయనం చేసితీరాలని శంకరాచార్యుల వారు భజగోవిందంలో బోధించారు. ఆ విధంగా దైవచింతనలో మొదటిదశ – **దైవప్రార్థన, గీత అధ్యయనం.**

**ఇష్టదేవత** – ఎవరైనా సరే, ఈ రెండు సాధనలూ చేస్తూ వస్తే, తనలో గొప్ప మార్పు వచ్చినట్టు అతనికి తెలుస్తుంది. ఎందుకంటే శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే, అతనికి మూడు అంశాల గురించి బాగా అర్థమవుతుంది. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు. ఇవి లోతుగా అర్థమైనకొద్దీ అతని దృక్పథంలో మార్పు వస్తుంది; దృక్పథంలోనే కాదు జీవితం పట్ల, జీవితలక్ష్యాల పట్ల ఉన్న అవగాహన కూడా మారుతుంది.

కొన్ని ప్రశ్నలకు జవాబు దొరుకుతుంది. మనం ఈ భూమ్మీదకు ఎందుకు వచ్చాము? ఎందుకు జీవిస్తున్నాము? మనం ఈ జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలు ఏమిటి? వీటికి జవాబులు తెలుస్తాయి.

మొదటిదశ అంటే ప్రార్థన, గీత అధ్యయనం – నిరంతరం, తంబూరశ్రుతి లాగా కొనసాగుతూనే ఉండాలి. అలా ఎవరైతే ఈ రెండింటినీ తంబూరశ్రుతిలాగా కొనసాగిస్తారో, అతని జీవితంలోకి భగవంతుడు ప్రవేశిస్తాడు. భగవంతుడు ఎక్కడో దూరాన కూర్చునిలేడు; ఇక్కడే, తన జీవితంలోనే ఒక భాగంగా పెనవేసుకుని ఉన్నాడని అర్థం చేసుకుంటాడు. భగవంతుడు అతని జీవితంలో ఒక తోడు లేదా ఒక భాగస్వామి అవుతాడు. భగవంతుణ్ణి రామునిగానో, కృష్ణునిగానో, ఇష్టదేవతగా కొలుస్తాడు.

**వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ ।**
**శ్రీమాన్ నారాయణో విష్ణుః వాసుదేవోఽభిరక్షతు ॥**

అతనికి భగవంతుడు ప్రథమ మిత్రుడు అవుతాడు. తోటి మనుష్యులు పలికినా, పలకకపోయినా, అతనికి భగవంతుడు పిలిస్తే పలుకుతాడు. అతని ప్రాథమిక బంధం భగవంతునితో, ఇష్టదేవతా రూపంలో, ఉంటుంది. ఇది ఇంకొక దశ.

**లక్ష్యం** – ఈ భావనలో ఈ సాధకుడు దైవపరమైన జీవనం గడుపుతుంటే, భగవంతుడు తన జీవితంలో తోడు మాత్రమే కాదు; భగవంతుడే తను చేరుకోవాల్సిన అంతిమలక్ష్యం అని శాస్త్రం ద్వారా తెలుసుకుంటాడు. అంతకుముందు తన లౌకికలక్ష్యాలను పొందటానికి తనకు సహాయపడే తోడుగా భావిస్తూ వచ్చాడు. భగవంతుడు లక్ష్యం కాదు; తన లక్ష్యాన్ని పొందటానికి తోడ్పడే మార్గం మాత్రమే. కాని కొన్నాళ్ళకు భగవంతుడు మార్గం కాదు, లక్ష్యం అని తెలుసుకుంటాడు. కాని అప్పుడు కూడా భగవంతుడు మాత్రమే లక్ష్యం అనుకోడు. తనకి ఉన్న 7847 లక్ష్యాల్లో (సుమారుగా ఒక సంఖ్య ఇవ్వటం జరిగింది), భగవంతుడు కూడా ఒక లక్ష్యం అవుతాడు. అంతకుముందు అంత పెద్ద సంఖ్యలో భగవంతుడు అసలు లేడు; ఇప్పుడు భగవంతుడు కూడా వచ్చి కలిశాడు. అంతకుముందు భగవంతుడు అతని లక్ష్యాలను పొందటానికి సహాయపడితే, ఇప్పుడు భగవంతుడు కూడా ఒక లక్ష్యం అవుతాడు. ఎప్పుడైతే, భగవంతుడు లక్ష్యాల్లో ఒకటి అవుతాడో, అప్పుడే భగవంతునికి కొత్తపేరు వస్తుంది. ఆ పేరు **మోక్షం**.

**ముముక్షువు** – ఎప్పుడైతే భగవంతుడు లేదా మోక్షం అతని లక్ష్యాల్లో ఒకటిగా మారుతుందో అప్పుడే అతని జీవితంలో ఆధ్యాత్మికత చోటు చేసుకుంటుంది. ఇంతవరకూ అతనిలో దైవచింతన మాత్రమే ఉంది. ఇప్పుడు ఆధ్యాత్మికతతో కూడిన దైవచింతన ఏర్పడుతుంది. భగవంతుడు తోడుగా ఉంటే దైవచింతన; భగవంతుడు లక్ష్యాల్లో ఒకటి అయితే ఆధ్యాత్మికత. అలా భగవంతుణ్ణి లక్ష్యంగా చేసుకున్న వ్యక్తిని ముముక్షువు అంటారు. భగవంతుడు అతని లక్ష్యాల్లో ఒకటి అయ్యాడు కాని, అతను ప్రాథమిక దైవచింతన కొనసాగిస్తాడు. అవి **ప్రార్థన, స్వాధ్యాయము**.

భగవంతుడు అతనికి ఉన్న 7847 లక్ష్యాల్లో చివరి లక్ష్యం అవుతాడు. కాని కొన్నాళ్ళు ఈ దైవచింతనలో సాగితే, భగవంతునికి ఇచ్చిన చివరి స్థానం పైకి జరుగుతూ వస్తుంది. అంటే 7847వ లక్ష్యంగా ఉన్న భగవంతుడు క్రమేపీ ఏ 35వ స్థానానికో వస్తాడు. తర్వాత చాలా నెలలకు, లేదా సంవత్సరాలకు, లేదా కొన్ని జన్మలకు భగవంతుడు మొట్టమొదటి లక్ష్యంగా వస్తాడు.

ముముక్షువుగా మారాక కూడా అతను దశలు దాటుకుంటూ రావాలి. మంద ముముక్షువునుంచి మధ్యమ ముముక్షువుగా మారాలి. మంద ముముక్షువుకి 7847 లక్ష్యాల్లో భగవంతుడనే లక్ష్యం అట్టడుగున ఉంటుంది. మధ్యమ ముముక్షువుకు భగవంతుడనే లక్ష్యం మొట్టమొదటి లక్ష్యంగా మారుతుంది. అంటే మోక్షం పొందటం అతనికి ప్రధానలక్ష్యంగా మారుతుంది.

మోక్షం ప్రధాన లక్ష్యంగా మారినా మొదటిదశ మర్చిపోకూడదు. ఏమిటది? **ప్రార్థన, స్వాధ్యాయము**. అలా ముందుకు సాగితే, ఆ దైవచింతనతో కూడిన జీవనవిధానం, ప్రధానలక్ష్యం అయిన భగవంతుడు ముఖ్యమవుతాడు. తక్కిన లక్ష్యాలన్నీ దీనిముందు వీగిపోతాయి. భగవంతుడనే లక్ష్యం ఎంత బలాన్ని పుంజుకుంటూ వస్తే, అంతగా తక్కిన లక్ష్యాలు వాటి శక్తిని కోల్పోతూ వస్తాయి. తక్కినవి ఎన్ని ఉన్నాయి? ఆ సంఖ్యనే కొనసాగిద్దాము. 7846(మోక్షం కాక) ఉన్నాయి.

చిన్నప్పుడు మీరు బొమ్మలతో బాగా ఆడుకున్నారు. అవి లేకపోతే ఉండలేని స్థితిలో ఉన్నారు. కాని వయస్సు పెరిగేకొద్దీ, వాటిమీద మోజు తగ్గుతూ వస్తుంది. ఒక వయస్సులో వాటితో ఆడాలనే అనిపించదు. అలా అనిపిస్తోందనే పశ్చాత్తాపం కూడా ఉండదు. నాకు బొమ్మలమీద వ్యామోహం పోయింది సుమా అని పనిగట్టుకుని ఎవరికీ ప్రచారం కూడా చెయ్యరు. దీన్నే అతీతంగా ఎదగటం అంటారు. చిన్నచిన్న కోరికలను పెద్ద కోరిక తగ్గించేస్తుంది.

ఆ విధంగా మోక్షఇచ్ఛ తక్కిన లక్ష్యాలను మాయం చేసేస్తుంది. మోక్షఇచ్ఛను ఈశ్వరఇచ్ఛ లేదా ముముక్షుత్వం అనికూడా అనవచ్చు. ఇప్పుడింక, అతనికి ఒకటే లక్ష్యం మిగిలితే, దాన్ని మొట్టమొదటి లక్ష్యం అనవచ్చా? మొట్టమొదటి లక్ష్యం అంటే ఒక లిస్ట్ ఉండాలి. లిస్టు ఉంటేనే కదా, మొదటిదో చివరిదో అయ్యేది! అతనికి ఉన్నది ఒక్కటే లక్ష్యం. అది మోక్షం పొందటం.

ఎక్కడ్నుంచి ఎక్కడికి ప్రయాణం చేశాడో చూశారా! ముందు భగవంతుడు తనకు తోడుగా ఉన్నాడు. తర్వాత ముముక్షువుగా మారాడు. అంటే తనకున్న అనేకానేక లక్ష్యాలలో భగవంతుణ్ణి లేదా మోక్షాన్ని ఒక లక్ష్యంగా చేసుకున్నాడు. తర్వాత దాన్ని మొట్టమొదటి స్థాయికి తీసుకువచ్చాడు. దాని తర్వాత తక్కిన లక్ష్యాలన్నింటినీ వదిలేసి, దాన్నే తన అంతిమలక్ష్యంగా చేసుకున్నాడు. ఎప్పుడైతే ఒక్కటే లక్ష్యమైందో అప్పుడే అతను ఉత్తమ ముముక్షువు అవుతాడు. ఉత్తమ ముముక్షువును సాధనచతుష్టయ సంపన్న అధికారి అంటారు. ఇది కర్మయోగం యొక్క పరాకాష్ఠ.

ఎప్పుడైతే సాధకుడు ఈ దశను చేరుకుంటాడో, అంటే జీవితంలో ఉండాల్సిన ఏకైక లక్ష్యం మోక్షం అని అర్థం చేసుకుంటాడో, అప్పుడే కర్మయోగం తన ధర్మాన్ని పూర్తి చేసినట్టు అర్థం. అప్పుడు అతను రెండవ దశకు తయారు అయినట్టు అర్థం. తర్వాత దశ జ్ఞానయోగం.

ఇక్కడితో కర్మయోగం – సంక్షిప్తంగా అయిపోయింది.

ఈ అధ్యాయంలో, ఈ శ్లోకంలో (18.65) కర్మయోగం గురించి మళ్ళీ గుర్తుచేస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకం ఇంచుమించుగా తొమ్మిదవ అధ్యాయం చివర్లో ఉన్న శ్లోకంలాగానే ఉంది.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ॥** – 9.34

తొమ్మిదవ అధ్యాయంలోని ఈ శ్లోకంలో ఒక భక్తుని జీవితం ఎలా ఉండాలో అద్భుతంగా వర్ణించాడు కృష్ణపరమాత్మ. అక్కడ భక్తుని ఎదుగుదలను వివరంగా ఐదు దశలుగా చూశాము. అవి మళ్ళీ ఇక్కడికి తెస్తున్నాము, ఇది చాలా ముఖ్యమైన శ్లోకం కాబట్టి. ఈ శ్లోకంలో మత్పరాయణః పదం ఉంది; దాన్ని రెండవదశగా తీసుకున్నాము. అవి మళ్ళీ ఒకసారి చూద్దాము.

తా: నాయందు మనస్సు కలవాడవు అవుము, నా భక్తుడవు అవుము, నన్ను పూజించు వాడవు అవుము నన్ను నాకు నమస్కరింపుము. ఈ విధముగా ఆత్మను నాయందే నిలిపి మత్పరాయణుడవై నన్నే పొందగలవు.

భక్తుని జీవనవిధానం ఎలా ఉండాలో ఈ శ్లోకంలో అద్భుతంగా వర్ణించాడు కృష్ణపరమాత్మ. చాలా అద్భుతమైన శ్లోకం. ఒక భక్తుడు ఎలా ఉంటాడో, ఎలాంటి జీవితాన్ని గడుపుతాడో తెలుసుకోవాలంటే, ఈ ఒక్క శ్లోకం చదివితే చాలు.

ఇక్కడ ఐదు అంశాలు చెప్పబడ్డాయి. భక్తుని ఎదుగుదల చూపిస్తాయి అవి. ఆ ఎదుగుదల అర్థం చేసుకోవటానికి ఈ శ్లోకంలో వరుసక్రమాన్ని మార్చుకుని చూద్దాము.

1. **మద్భక్తః భవ** – నామీద భక్తి పెంపొందించుకో. ఇది సాధనభక్తి. భక్తిలో నాలుగు రకాలు చూశాము. ఆర్తభక్తి, అర్థార్థీ భక్తి, జిజ్ఞాసు భక్తి, జ్ఞానీ భక్తి. మొదటి రెండు అంటే ఆర్తభక్తి, అర్థార్థీ భక్తిలో భగవంతుణ్ణి సాధనగా చూస్తారు, ప్రాపంచిక విషయాలను సాధ్యంగా చూస్తారు. ఫర్వాలేదు. అలా భగవంతుణ్ణి సాధనగా చూసినా కూడా అందుకోవటానికి భగవంతుడు సిద్ధమే. ఆయనకు తెలుసు, మనుష్యులు కోరేది ప్రాపంచిక విజయాలనేనని.

**ధనం ధాన్యం పశుం బహుపుత్రలాభం శతసంవత్సరమ్**

ఇలా ఏవో కోరుతారు. అందువల్ల భగవంతుణ్ణి సాధనగా వాడినా కూడా ఫర్వాలేదు. దీన్ని సకామభక్తి అంటారనీ, సకామ భక్తికి కూడా ఫలితాలు వస్తాయనీ చూశాము. ఇంతకుముందు కూడా చూశాము, భక్తి ఉన్న వ్యక్తికి శాంతి ఉంటుంది. అది ఎటువంటి భక్తి అయినా సరే అటువంటి వారిని కూడా స్వీకరిస్తాడు భగవంతుడు.

2. **మత్పరాయణః** – నన్నే నీ అంతిమలక్ష్యంగా చేసుకో. ఇది సాధ్యంమీద భక్తి. ఇది రెండవదశ భక్తి. అంటే భగవంతుడిని సాధనగా చూసే దశనుంచి సాధ్యంగా చూసే దశకి ఎదగటం. మనం వెంపర్లాడే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యప్రపంచంలో లభ్యం కావని ఒక దశలో అర్థం చేసుకుంటాము. ఎన్ని ఉన్నా, ఏ భూకంపం లాంటిదో వస్తే ఒక్క క్షణంలో, లేదా అరక్షణంలో అన్నీ మటుమాయమయిపోతాయని తెలుసుకుని, భగవంతుని వైపు దృష్టి మరల్చాలి. మత్పరాయణంలో పరం అయణం అంటే జీవితంయొక్క అంతిమలక్ష్యం. అందువల్ల భగవంతుడు సాధన దశనుంచి సాధ్యం దశకు వస్తాడు.(ఈ దశ ఈ శ్లోకంలో లేదు. మనం కలుపుకోవాలి.)

3. **మన్మనా (భవ)** – నన్ను నీ లక్ష్యంగా ఎన్నుకున్నాక, ఏకాగ్రత వీడకు. ఇది ముముక్షుభక్తి. గృహస్థుగా ఏ లౌకిక వ్యవహారం నడిపినా – అంటే ఇల్లు కట్టుకున్నా, డబ్బు సంపాదిస్తున్నా, పిల్లలను కన్నా, వారి బాగోగులు చూస్తున్నా, ఎన్ని పనులు చేయాల్సివున్నా వీటన్నిటి వెనక మనిషిగా మీ జీవనలక్ష్యం ఏమిటో మర్చిపోకూడదు. ఈ పనులు మానమనటం లేదు, కాని సుప్తచేతన మనస్సులో, భగవంతుని చింతన ఎప్పుడూ ఉండాలి. మన్మనా భవ అంటే సుప్తచేతన మనస్సులో నన్నే నిరంతరం పెట్టుకో. సంగీత విద్వాంసుడు తను పాడే పాటలో లీనమైనా, ఎలా తంబూర శ్రుతిని వింటూనే ఉంటాడో అలా మీ ప్రయత్నం లేకుండానే భగవంతుని చింతన ఎప్పుడూ ఉండాలి. అంటే ముముక్షు భక్తికి ఎదగాలి. గమ్యాన్ని ఎన్నడూ మర్చిపోకూడదు.

4. **మద్యాజీ (భవ)** – నువ్వు చేసే ప్రతి పనినీ నాకే అంకితం చెయ్యి. ఇది నిష్కామభక్తి.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్** – 9.27

ఏం చేసినా, ఏం తిన్నా, ఏ దానం చేసినా నాకే అర్పించు అన్నాడు అంతకుముందు. అలా చెయ్యటంవల్ల ప్రతి పనీ కూడా ఆధ్యాత్మిక సాధనగా అవుతుంది. అన్నం వడ్డించగానే తినకుండా, భక్తితో ఈశ్వరుడిని తలుచుకుని తింటే, అది యజ్ఞంగా మారుతుంది. ఇంతకుముందు కూడా చూశాము ఏం చేసినా ఈశ్వరార్పణభావనతో చెయ్యాలి. అంటే నిష్కామ భక్తి లేదా కర్మయోగం పాటించాలి.

5. **మాం నమస్కురు** – నన్నే శరణు వేడు, నా దీవెనలు కోరు. ఇది ఈశ్వరానుగ్రహం కోరే భక్తి. పై నాలుగు దశలూ పాటిస్తూ వస్తే, సహజంగా ఆధ్యాత్మికంగా ఎదుగుతాము. కాని ఒక్కోసారి అలా ఎదిగినప్పుడు గర్వం వచ్చే ప్రమాదముంది. గర్వం వచ్చిన మనిషి పతనమవుతాడు. అందుకని జీవితంలో ఏ విజయం సాధించినా, అది ఈశ్వరుని అనుగ్రహంవల్లనే పొందామని గ్రహించాలి. అంతేకాదు భవిష్యత్తులో కలగబోయే విజయాలకు కూడా ఈశ్వర అనుగ్రహం కావాలని గుర్తుంచుకోవాలి. మాం నమస్కురు అంటే కేవలం నమస్కారం చెయ్యటం కాదు, నన్ను శరణు వేడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ముందు దశలో మద్యాజీ అంటే నీ ఫ్రీవిల్‌ను ఉపయోగించు అని అర్థం; మాం నమస్కురు అంటే ఈశ్వర అనుగ్రహం కూడా కోరు అని అర్థం. ఈ విషయం చాలాసార్లు చూశాము. మన భవిష్యత్తును నిర్దేశించేది ఏది? ఫ్రీవిల్లా, ఈశ్వరకృపా? ఇక్కడ భగవంతుడే ఆ సందేహాన్ని తీర్చాడు. ఫ్రీవిల్, ఈశ్వరకృప రెండూ అవసరమే.

ఇప్పుడు ఈ ఐదు దశలను టూకీగా చూద్దాము. అవి –

| | |
|---|---|
| 1. మద్భక్తః భవ: నామీద భక్తి పెంపొందించుకో. | – ఇది సాధనమీద భక్తి. |
| 2. మత్పరాయణః: నన్నే నీ అంతిమ లక్ష్యంగా చేసుకో. | – ఇది సాధ్యంమీద భక్తి. |
| 3. మన్మనా భవ: నన్ను నీ లక్ష్యంగా ఎన్నుకున్నాక, ఏకాగ్రత వీడకు. | – ఇది ముముక్షు భక్తి. |
| 4. మద్యాజీ భవ: నువ్వు చేసే ప్రతి పనినీ నాకే అంకితం చెయ్యి. | – ఇది నిష్కామ భక్తి. |
| 5. మాం నమస్కురు: నన్నే శరణు వేడు, నా దీవెనలు కోరు. | – ఇది ఈశ్వరానుగ్రహం కోరే భక్తి. |

ఈ ఐదు నియమాలూ పాటిస్తే ఏం జరుగుతుంది?

**ఏవమ్ ఆత్మానమ్ యుక్త్వా** – ఇటువంటి భక్తి తత్పరతతో కూడిన జీవితం గడిపితే,

**మామ్ ఏవ ఏష్యసి** – నువ్వు నన్నే పొందగలవు. అంటే మోక్షం పొందగలవు.(ఇక్కడనుంచి ఈ శ్లోకం –18.65)

మామ్ ఏవ ఏష్యసి – మోక్షం పొందగలవు అంటే పరంపరయా అని కలుపుకోవాలి. జ్ఞానయోగానికి వచ్చి మోక్షం పొందుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సత్యమ్** – ఇది నూటికి నూరుశాతం నిజం. కృష్ణపరమాత్మ గ్యారంటీ కార్డు ఇస్తున్నాడు. మూడు నెలలకో, ఆరు నెలలకో మాత్రమే కాదు, జీవితాంతం ఉంటుంది అంటున్నాడు.

**తే ప్రతిజానే** – నీకు ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను. నువ్వు ఇవన్నీ పాటిస్తే మారుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**పిచ్చి కుదిరితే కాని పెళ్ళి కాదు, పెళ్ళి అయితే కాని పిచ్చి కుదరదు** అని సామెత. అలాగే మార్పు వస్తేనే భగవద్గీతను అధ్యయనం చేస్తాను అంటారు కొందరు; కాని భగవద్గీతను అధ్యయనం చేస్తేనే మార్పు వస్తుంది. భగవద్గీత నాలో మార్పు తీసుకువస్తుందని మీరు హామీ ఇవ్వగలరా అంటారు కొందరు. భగవద్గీతను అధ్యయనం చేస్తే మార్పు వచ్చితీరుతుంది. ఎవరు చెబుతున్నారు? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే హామీ ఇస్తున్నాడు. ఇతి సత్యం. నేను ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను, నువ్వు మారతావు అంటున్నాడు.

పైగా ఇది ఏదో వ్యాపారప్రకటన కూడా కాదు; ఎలా చెప్పగలము?

**ప్రియః అసి మే** – నువ్వు నాకు ఇష్టమైనవాడివి; నీకు నేను లేనిపోని ఆశలు చూపను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇంకొక సందర్భంలో నువ్వు నాకు సఖుడవు అన్నాడు. తనకు చాలా ప్రియమైనవ్యక్తియొక్క మేలు కోరతాడు కాబట్టి, ఆ దైవచింతనతో కూడిన జీవనవిధానాన్ని నమ్మకంగా పాటించవచ్చు అర్జునుడు. ఈ మొదటిదశ కర్మయోగం.

ఇప్పుడు కృష్ణపరమాత్మ జ్ఞానయోగం అనే రెండవదశను వివరించబోతున్నాడు.

శ్లో. 66 **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**
సర్వధర్మాన్, పరిత్యజ్య, మామ్, ఏకమ్, శరణమ్, వ్రజ,
అహమ్, త్వా, సర్వపాపేభ్యః, మోక్షయిష్యామి, మా, శుచః ॥

| | | | |
|---|---|---|---|
| సర్వధర్మాన్ | = సమస్త ధర్మములను | అహమ్, త్వా | = నేను నిన్ను |
| పరిత్యజ్య | = నాకు సమర్పించి | సర్వపాపేభ్యః | = సమస్త పాపములనుండి |
| ఏకమ్ | = సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను అయిన | మోక్షయిష్యామి | = విముక్తుని గావించెదను |
| మామ్ (ఏవ) | = నన్నే | మా, శుచః | = నీవు శోకింపకుము |
| శరణమ్, వ్రజ | = శరణుజొచ్చుము | | |

**(త్వం) సర్వ-ధర్మాన్ పరిత్యజ్య మామ్ ఏకమ్ శరణమ్ వ్రజ,**

**అహమ్ త్వా సర్వ-పాపేభ్యః మోక్షయిష్యామి, (త్వం) మా శుచః ।**

తా: సమస్త ధర్మములను నాకు సమర్పించి సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను అయిన నన్నే శరణుజొచ్చుము. నేను నిన్ను సమస్త పాపములనుండియు విముక్తుని గావించెదను. నీవు శోకింపకుము.

**ఇ) చరమ శ్లోకం 66 జ్ఞానయోగము - సంక్షిప్తంగా**

ఈ శ్లోకం జ్ఞానయోగాన్ని సంక్షిప్తంగా వర్ణిస్తుంది. ఇక్కడితో గీతాబోధ కూడా ముగుస్తుంది కాబట్టి దీన్ని చరమశ్లోకం అనికూడా అంటారు. చరమ అంటే అంతిమ అని అర్థం. కృష్ణపరమాత్మ బోధ 2.11తో మొదలయ్యి 18.66తో పూర్తవుతుంది. ఈ శ్లోకం తర్వాత వచ్చే శ్లోకాల్లో బోధ లేదు; వాటిని ఉపసంహార శ్లోకాలు అనవచ్చు. ఇది కృష్ణపరమాత్మ బోధకు చరమశ్లోకం కాబట్టీ, అసలు మొత్తం జ్ఞానయోగాన్ని సంక్షిప్తంగా చెప్పింది కాబట్టీ ఇది చాలా ముఖ్యమైన శ్లోకం.

నిజానికి ఈ శ్లోకం జ్ఞానయోగంయొక్క సారాంశం అయినా కూడా కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో ఎక్కడా జ్ఞానం పదాన్ని వెయ్యలేదు. జ్ఞానం, విచారణ, వేదాంతం - ఏ పదం కూడా వాడలేదు. అంటే ఈ శ్లోకంలో జ్ఞానయోగం అంతర్లీనంగా ఉంది. అలా కొన్నిచోట్ల కృష్ణపరమాత్మ తన చిలిపితనాన్ని చూపిస్తూనే వచ్చాడు. నర్మగర్భంగా చెబుతూ వచ్చాడు. ఇక్కడ చివరిసారిగా మళ్ళీ తన చిలిపితనాన్ని ప్రదర్శిస్తున్నాడు.

ఈ శ్లోకంలో జ్ఞానయోగం గురించి ప్రత్యక్షంగా లేకపోవటంవల్ల ఈ శ్లోకంయొక్క అర్థాన్ని యథాతథంగా అంటే ఉన్నదున్నట్టుగా తీసుకుంటే, అయోమయంలో పడవేస్తుంది కూడా. అందువల్ల ఈ శ్లోకానికి అనేక రకాల వివరణలు వచ్చాయి.

ఈ శ్లోకంలోని పదాలను అక్షరాలా తీసుకుంటే మొట్టమొదటి మాటే నమ్మలేని మాటగా ఉంటుంది. సర్వధర్మాన్ పరిత్యజ్య అన్నాడు. అంటే నీ ధర్మాలన్నీ త్యజించు అంటున్నాడు. ధర్మం అంటే విలువలు, నైతికధర్మం, పుణ్యకర్మ - ఏదైనా తీసుకోవచ్చు. అందువల్ల ఈ వాక్యంయొక్క వాచ్యార్థం తీసుకుంటే, నీ ధర్మాలన్నీ త్యజించు అని వస్తుంది.

నిజానికి ఇంతవరకూ భగవద్గీతలో కృష్ణపరమాత్మ ధర్మంయొక్క ప్రాముఖ్యతను గురించి చెప్పుకుంటూ వచ్చాడు. నిజానికి నేను అవతారం ఎత్తిందే ధర్మరక్షణకోసం అన్నాడు నాలుగవ అధ్యాయంలో.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**

**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ।।** - 4.8

కృష్ణపరమాత్మ ధర్మాన్ని ఎలా రక్షిస్తాడు? ధర్మం మాయమయిపోతున్నప్పుడు నేను అవతారం ఎత్తుతాను అన్నాడు అక్కడ. కాని ఇక్కడేమో, ధర్మాన్ని పరిత్యజించండి అంటున్నాడు; అది కూడా ఒకటో రెండో కాదు. సర్వధర్మాణి - అన్ని ధర్మాలనూ అంటున్నాడు.

ఏదైనా చెప్పటం పాపం, దాన్ని వక్రీకరిస్తారు కొందరు అని చూశాము. అలా కొంతమంది శాస్త్రంలోంచీ, భగవద్గీతలోంచీ వారికి కావాల్సింది తీసుకుని, వారికి కావాల్సిన విధంగా మలుచుకుంటారు దాన్ని. ఈ శ్లోకాన్ని అలా రెండు రకాలుగా మలుచుకుంటారు.

అందులో ఈ వాక్యం ఒకటి. నైతిక విలువలు పాటించనివారు, 'నేను గీతాబోధను పాటిస్తున్నాను, చరమ శ్లోకంలో సాక్షాత్తూ కృష్ణపరమాత్మే నీ విలువలను త్యజించు అన్నాడు,' అంటారు. ఇంతవరకూ అలాంటి తప్పుడు పనులు చేస్తున్నందుకు ఏమూలో ఏకాస్త అయినా అపరాధభావన ఉంటే, అదికూడా తుడిచిపెట్టుకుని పోతుంది అటువంటివారికి.

**మామేకం శరణం వ్రజ** – నన్నే శరణు వేడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మామ్ అంటే నన్ను; శరణం వ్రజ అంటే శరణు వేడు; ఏకం అంటే నేను మాత్రమే. ఈ వాక్యం అర్థం – నన్ను శరణు వేడు, నేను మాత్రమే నీకు ఆధారం. ఈ వాక్యం కృష్ణ భక్తులకు, వైష్ణవులకు, అమృతం తాగినట్టు ఉంటుంది. అదుగో కృష్ణపరమాత్మే నన్నే శరణు వేడు అన్నాడు అంటే వేరే దేవుళ్ళెవరూ నిన్ను రక్షించరు; కృష్ణుడే రక్షిస్తాడు అంటారు. నన్ను శరణు వేడితేనే మోక్షం వస్తుంది అన్నాడు అంటారు.

ఈ అయోమయాలు ఎందుకు వచ్చాయంటే, ఇందులో అంతర్లీనంగా ఉన్న జ్ఞానయోగాన్ని వెలికి తీసుకు రాకపోవటంవల్ల. అందువల్ల శంకరాచార్యులు మనను ఆదుకుంటున్నారు. ఇందులో జ్ఞానయోగం ఎలా దశలవారీగా నిండి నిబిడీకృతమై ఉందో విశ్లేషిస్తున్నారు. ఆ నేపథ్యంతో ఈ శ్లోకంయొక్క అర్థాన్ని చూద్దాము.

**సర్వధర్మాన్ పరిత్యజ్య** – ఇక్కడ ధర్మం అంటే అధర్మం కూడా తీసుకోవాలి అంటున్నారు శంకరాచార్యులవారు. ఈ సందర్భంలో కృష్ణపరమాత్మ అధర్మం కూడా అని ప్రత్యేకించి చెప్పలేదు; ఎందుకంటే అనేక సందర్భాలలో అంతకుముందు చెప్పాడు. అంతేకాదు, శాస్త్రం అధర్మాన్ని, అనైతిక విలువలను త్యజించాలని పదేపదే చెబుతుంది; పైగా అధర్మాన్ని పాటించకూడదనే విషయం ఎవరికైనా తెలుసు; ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అందువల్ల సర్వధర్మాన్ పరిత్యజ్యను సర్వ ధర్మ–అధర్మాన్ పరిత్యజ్యగా తీసుకోవాలి.

అయితే ధర్మం అంటే ఏమిటి? ధర్మానికి సంస్కృత నిఘంటువులో 108 అర్థాలున్నాయి. ఇందులో ఏ అర్థం తీసుకోవాలో ఎలా తెలుస్తుంది? ఇక్కడ ధర్మం పదానికి సాంకేతిక అర్థం ఉంది. ధర్మం అంటే పుణ్యకర్మలు; అంటే విహిత కర్మలు, నైతిక కర్మలు, శాస్త్రం విధించిన కర్మలు. అందులో కాయిక కర్మలు, వాచిక కర్మలు, మానసిక కర్మలు కూడా వస్తాయి. వీటన్నిటినీ కలిపి పుణ్యకర్మలు అంటారు.

ధర్మం అంటే పుణ్యకర్మలు అయితే, అధర్మం అంటే దీనికి భిన్నమైన కర్మలు. అంటే అనైతిక కర్మలు, కాయిక, వాచిక, మానసిక పాపకర్మలు. ఒక్కముక్కలో చెప్పాలంటే ధర్మం అంటే కాయిక, వాచిక, మానసిక పుణ్యకర్మలు; అధర్మం అంటే కాయిక, వాచిక, మానసిక పాపకర్మలు. ఇప్పుడు దానికి సర్వ కలుపుకుంటే అన్ని పుణ్య పాప కర్మలు. ఇంకా చెప్పాలంటే అన్ని కర్మలు. కర్మ అంటే ఏమిటి? మీరు చేసే పనులు. పనులన్నీ ఈ రెండు తెగల్లో ఏదో ఒకదానిలో వస్తాయి. అంటే అయితే పుణ్యకర్మలు అవుతాయి, లేకపోతే పాపకర్మలు అవుతాయి. అంటే

ఇప్పుడు సర్వధర్మాన్ పరిత్యజ్య అంటే వాచ్యార్థం తీసుకుంటే అసలు కర్మలన్నింటినీ త్యజించమంటున్నాడు అని అర్థం వస్తుంది.

ఇప్పుడు సమస్య ఏమిటంటే, మనిషి అన్ని కర్మలను ఎలా త్యజించగలడు? మానవమాత్రుడన్న వారెవరికీ కర్మను పూర్తిగా త్యజించటం సాధ్యం కాదు. ఆమాటకొస్తే, ఆ విషయాన్ని కృష్ణపరమాత్మే చెప్పాడు.

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్** – 3.5

ఏ మనిషి కూడా, ఒక్కక్షణం కూడా కర్మ చెయ్యకుండా ఉండలేడు అన్నాడు.

**న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః** – 18.11

ఏ మనిషికి కూడా కర్మలను పూర్తిగా త్యజించటం అసాధ్యం. ఐదవ అధ్యాయంలో కూడా కృష్ణపరమాత్మే ఇదే విషయం చెప్పాడు. కర్మలను త్యజించిన సన్న్యాసి కూడా కొన్ని కర్మలు చెయ్యకతప్పదు అన్నాడు. అన్నపానాదులు తీసుకోవటం కూడా కర్మ కిందికే వస్తుంది. పూర్తిగా కర్మలను త్యజించటం అనేది మరణించాకే జరుగుతుంది. అంతవరకూ కర్మలు చేసిన వ్యక్తి మరణిస్తే, అతనికి అంత్యకర్మలు చెయ్యటానికి బంధుజనం ఇంకా ఎక్కువ కర్మలు చెయ్యాల్సివుంటుంది.

అంతగా మనిషి అనే వ్యక్తి కర్మను చెయ్యకుండా ఉండలేడని పదేపదే చెప్పిన కృష్ణపరమాత్మ, అన్ని కర్మలను మానేయమని ఇప్పుడెందుకు చెబుతున్నాడు? ఇది కృష్ణపరమాత్మ చూపిస్తున్న మొదటి చిలిపితనం.

కృష్ణపరమాత్మ అలా మనను ఒక ఆట ఆడిస్తున్నాడంటే, కృష్ణపరమాత్మ హృదయాన్ని తెలుసుకోవాలి. ఆ మాటల వెనకనున్న అంతరార్థం ఏమిటో తెలుసుకోవాలి. ఈ వాక్యం యొక్క అంతరార్థం తెలుసుకోవాలంటే, ఇంతవరకూ, ఇన్ని అధ్యాయాలలో కృష్ణపరమాత్మ చెప్పుకుంటూ వచ్చిన బోధను గుర్తు తెచ్చుకోవాలి. గుర్తుంచుకోండి, ఈ అధ్యాయం సారాంశాన్ని గుర్తుకు తెచ్చే అధ్యాయం. అందువల్ల మళ్ళీ వివరంగా చెప్పుకురాడు. పైగా ముందు చెప్పిన అంశాలు గుర్తుంచుకుంటారని ఆశిస్తాడు.

ఇంతవరకూ కర్మ గురించిన కృష్ణపరమాత్మ చెప్పిన అంశాలు ఏమిటి? కర్మ చేసేది కార్యకరణ సంఘాతం; అంటే మనస్సు, శరీరం.

**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః** – గీత 3.27

శరీరమే కర్మ చేస్తుంది. దేహేంద్రియ మనోబుద్ధులతో మమేకం చెందేంతవరకూ, మనిషి నేనే కర్మ చేస్తున్నాను అనుకుంటాడు. దీన్ని దేహాభిమానం లేదా అహంకారం అంటారు. ఈ అహంకారంలో ఉన్న వ్యక్తి, తను కర్త అనుకుంటాడు. అందువల్ల అతను చేసే కర్మలు అతనికే చెందుతాయి.

ఇప్పుడు కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా కర్మలను త్యజించాలంటే, ఒక విధంగా త్యజించవచ్చు. నిజానికి ఆ విధంగానే త్యజించవచ్చు. ఏమిటది? దేహాభిమానాన్ని త్యజించటంద్వారా త్యజించవచ్చు. నేను మనస్సు, నేను శరీరాన్ని అనుకోకపోతే నేను కర్తను అవను.

ధర్మత్యాగం = కర్మత్యాగం = దేహాభిమానత్యాగం

ఎక్కడినుండి ఎక్కడికి వచ్చామో చూడండి. చాలా సాంకేతిక పరిభాష ఉన్న శ్లోకం ఇది. దేహాభిమానం అంటే మనశ్శరీరాలతో మమేకం చెందటం.

ఇప్పుడు ఇంకొక మెట్టు పైకి ఎక్కాలి. దేహాభిమానం వదులుకోవాలి అంటే, అది ఎప్పుడు సాధ్యం అవుతుంది? నేను దేహంమీద ఉన్న అభిమానాన్ని వదులుకోవాలంటే, నేను దేహం కాదు, నేను దేహంలో ఉన్న దేహి అని నాకు అర్థం కావాలి. రెండవ అధ్యాయంలో 12–25 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ నేను దేహం కాదు, దేహిని అని బోధించాడు. దేహి అంటే ఏమిటి? నేను ఆత్మచైతన్యాన్ని. చైతన్యం అనగానే చైతన్యానికి ఉన్న ఐదు సూత్రాలను వెంటనే గుర్తు తెచ్చుకోవాలి. అందులో మొట్టమొదటి అంశమే చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు, దాని లక్షణం కాదు; దాన్నించి ఉత్పత్తి చెందలేదు. శరీరం కర్తా, భోక్తా కాని ఆత్మ చైతన్యం అయిన నేను **అకర్తను, అభోక్తను**. దీన్ని ఆత్మజ్ఞానం అంటారు.

ఈ ఆత్మజ్ఞానం పొందితే, దేహాభిమానం పోతుంది. దేహాభిమానం పోతే, కర్మ చేస్తున్నా కూడా, నేను కర్మ చెయ్యటంలేదని అర్థం అవుతుంది.

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – 5.8

ఆత్మజ్ఞాని తను చూస్తున్నా, వింటున్నా, స్పృశిస్తున్నా, ఆఘ్రాణిస్తున్నా, భుజిస్తున్నా, నడుస్తున్నా, నిద్రిస్తున్నా, శ్వాస పీలుస్తున్నా, తనేమీ కర్మ చెయ్యటం లేదని అర్థం చేసుకుంటాడు.

ఇప్పుడు సర్వధర్మాన్ పరిత్యజ్యయొక్క మూడు దశలను మళ్ళీ చూద్దాము.

1. సర్వకర్మలను త్యజించాలి.
2. కర్మత్యాగం చెయ్యాలంటే దేహాభిమానత్యాగం చెయ్యాలి.
3. దేహాభిమానత్యాగం చెయ్యాలంటే ఆత్మజ్ఞానం పొందాలి.

ఆత్మజ్ఞానాన్ని జీవస్వరూపజ్ఞానం అంటారు. జీవస్వరూపజ్ఞానం పొందితే, నేను ఆత్మను, నేను కర్మలు చెయ్యటం లేదు, శరీరం చేస్తోంది అని అర్థం చేసుకుంటాను. దీన్ని సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే **త్వమ్ పద జ్ఞానం** అంటారు.

ఇక్కడ ఇంకొక విషయాన్ని గమనించాలి. సర్వధర్మ పరిత్యజ్య అంటే ఉత్తమ కర్మలను పరిత్యజించమని వాచ్యార్థం వస్తుందని చూశాము. దీన్ని అక్షరాలా తీసుకుని, వెంటనే ఉత్తమ కర్మలను పరిత్యజించకూడదు. ఎందుకంటే అసలు ఉత్తమ కర్మలు చెయ్యటమే అపురూపం; అలాంటిది చేస్తున్న ఉత్తమ కర్మలను త్యజిస్తే ఎలా?

అందువల్ల మనశ్శరీరాలను పుణ్యకర్మలు చెయ్యనివ్వండి. ధర్మమే సమాజాన్ని రక్షిస్తుంది. అజ్ఞానీ ధర్మాన్ని పాటించాలి; జ్ఞానీ ధర్మాన్ని పాటించాలి. అంటే ఇద్దరూ పుణ్యకర్మలు చెయ్యాలి.

**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి**

లోకసంగ్రహం కోసమైనా జ్ఞాని కర్మలు చెయ్యాలి. కాని జ్ఞానికి తను శరీరం కాదు, తను మనస్సు కాదు, తను సాక్షిచైతన్యం; సాక్షిచైతన్యానికి కర్తృత్వ, భోక్తృత్వాలు ఉండవని తెలుసు. అందువల్ల జ్ఞాని కర్మలు చేసినా అతను నేను చేస్తున్నానని అనుకోడు.

మరేం అనుకుంటాడు? అకర్తా, అభోక్తా అయిన ఆత్మనైన నా సమక్షంలో మనశ్శరీరాలు కర్మలు చేస్తున్నాయి అనుకుంటాడు. ఇలా జ్ఞానంతో కర్మను సన్న్యసించటాన్ని **జ్ఞానకర్మ సన్న్యాసం** అంటారు. ఈ పేరుతో నాలుగవ అధ్యాయం అయింది. దానిలో ఈ విషయం విపులంగా చర్చించబడింది.

స్వధర్మ పరిత్యాగం = అకర్తృత్వ స్వరూపజ్ఞానం

జ్ఞానయోగంలో ఇది మొదటి భాగం.

2. **మామేకం శరణం వ్రజ** – వ్రజ అంటే నా దగ్గరికి రా. ఈ విషయం ఎవరు చెబుతున్నారు? కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. అందువల్ల మాం వ్రజ అంటే భగవంతుని దగ్గరికి రా అని అర్థం. భగవంతుడు ఎవరు? ఇది తర్వాత ప్రశ్న.

ఇంతకుముందు కూడా చూశాము. కృష్ణపరమాత్మ నేను అంటే సందర్భాన్నిబట్టి అర్థం తీసుకోవాలి. నేనుకి సందర్భాన్నిబట్టి మూడు అర్థాలు వస్తాయి.

ఎ) **ఏకరూప ఈశ్వరుడు** – కృష్ణపరమాత్మను దేవకీ పుత్రునిగా, వసుదేవ పుత్రునిగా, అర్జునుని సఖునిగా చూసినప్పుడు, ఆయన ఒక రూపం ఉన్న ఏకరూప ఈశ్వరుడు.

బి) **అనేకరూప ఈశ్వరుడు** – విశ్వరూప ఈశ్వరుడు. ఈ విశ్వరూప దర్శనాన్ని పదకొండవ అధ్యాయంలో చేసుకున్నాము.

సి) **అరూప ఈశ్వరుడు** – నిర్గుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మ అంటే ఏకరూప ఈశ్వరుడూ కాదు, అనేకరూప ఈశ్వరుడూ కాదు, అరూప ఈశ్వరుడు. ఏడవ అధ్యాయంలో పరాప్రకృతి అన్నాడు కృష్ణపరమాత్మ.

ఇప్పుడు కృష్ణపరమాత్మ నన్నే శరణు వేడు అంటే ఏ నేను గురించి చెబుతున్నాడు? ఏకరూప ఈశ్వరుడా, అనేకరూప ఈశ్వరుడా, అరూప ఈశ్వరుడా? ఇక్కడ అరూప ఈశ్వరుడని అర్థం చేసుకోవాలి. అరూప ఈశ్వరునికి పర్యాయపదాలు పరాప్రకృతి, నిర్గుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మను సచ్చిదానంద బ్రహ్మ అంటారు.

**మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా** – 9.4

అందువల్ల ఇక్కడ మాం అంటే అరూప ఈశ్వరుడు. అది తెలియజేయటానికి '**ఏకమ్**' అనే విశేషణాన్ని వాడాడు కృష్ణపరమాత్మ. ఏకం అంటే ఉన్నదొకటే, అద్వితీయం బ్రహ్మ. అద్వితీయం అంటే రెండవది లేనిది.

**సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం పరంబ్రహ్మ**

ఈ నిర్వచనాన్ని ఉపనిషత్తులలో చూస్తాము.

**మామేకం శరణం వ్రజ = అరూప ఈశ్వరుణ్ణి శరణు వేడు**

అరూప ఈశ్వరుడు అంటే సర్వవ్యాపకుడు. సర్వవ్యాపకుడైన పరమాత్మను జీవాత్మ ఎలా చేరుకుంటాడు? ఈ ప్రశ్నే తప్పు. ఎలా? మీరు ఎవరిని చేరుకోగలరు? మీకు దూరంగా ఉన్న వ్యక్తిని. అలాగే భగవంతుడు ఏ కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉంటే, శరణాగతి పేరుతో, మీరు ప్రయాణం చేసీచేసీ భగవంతుణ్ణి చేరుకోగలరు. కాని భగవంతుడు సర్వవ్యాపకం అయితే, ప్రయాణం చేసే ప్రశ్న ఎక్కడ ఉంది? అందువల్ల ఎలాగైతే ధర్మ పరిత్యజ్య పదానికి వాచ్యార్థం తీసుకోకూడదు అన్నామో, అలాగే, చేరుకోవటం పదానికి కూడా వాచ్యార్థం తీసుకోకూడదు. సర్వవ్యాపకమైన భగవంతుడు దూరంగా ఉండగలడా? దూరంగా లేని భగవంతుణ్ణి చేరుకోవటం అంటే ఏమిటి?

దీనికి అర్థం, చేరుకోవటం అంటే, ఇప్పుడు మనం భగవంతుడు నాకు భిన్నంగా, నాకు దూరంగా ఉన్నాడనే అపోహలో ఉన్నాము. రెండు పదాలు – నాకు భిన్నంగా ఉన్నాడు, నాకు దూరంగా ఉన్నాడు. రెండూ అపోహలే. చేరుకోవటం అంటే ఈ అపోహలను వదిలివేయాలి.

ఈ అపోహలను ఎలా వదిలివేయాలి? ఇది మరొక సందేహం. ఏ తప్పుడు ఊహను అయినా సరియైన జ్ఞానంతో పోగొట్టుకోవాలి. సరిగ్గా చూడండి, సరియైన ఊహ అనకూడదు. సరియైన జ్ఞానంతో తప్పుడు ఊహను పారద్రోలాలి. ఏమిటా సరియైన జ్ఞానం? భగవంతుడు నాకు భిన్నంగా లేడు – ఒక జ్ఞానం; భగవంతుడు నాకు దూరంగా ఎక్కడో లేడు – ఇది ఇంకొక జ్ఞానం. ఈ రెండింటినీ కలిపి **జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం** అంటారు.

శరణాగతి అంటే ఏమిటి? దీనికి అనేక అర్థాలు ఇస్తారు కాని, శరణాగతి అంతిమ అర్థం – జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొంది, పరమాత్మను చేరుకోవాలనే అపోహను వదులుకోవటం. ఇప్పుడు ఇవన్నీ కలుపుకుంటే

**మామేకం శరణం వ్రజ = జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొందటం**

జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానాన్నే ఉపనిషత్తులు మహావాక్యజ్ఞానం అంటాయి. ఉపనిషత్తుల్లో అనేక మహావాక్యాలు ఉన్నాయి. అందులో నాలుగు మహావాక్యాలను ఉదాహరణల కింద చెబుతారు. అవి తత్త్వమసి, అహం బ్రహ్మ అస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ.

**తత్త్వమసి** – **అది నువ్వే**
**అహం బ్రహ్మ అస్మి** – **నేను ఆ బ్రహ్మను**

గురువు శిష్యునికి జీవాత్మ, పరమాత్మల ఐక్యం బోధించేటప్పుడు తత్త్వమసి అని చెబుతాడు. నువ్వు, ఆ బ్రహ్మ ఒకటే అంటే శిష్యుడు మళ్ళీ తత్త్వమసి అనకూడదు. నేను ఆ బ్రహ్మ ఒకటే అనగలగాలి. అందువల్ల అతను గురువు బోధకు సమాధానంగా అహం బ్రహ్మ అస్మి అంటాడు. ఈ జ్ఞానాన్ని శరణాగతి అంటారు.

ఈ జ్ఞానాన్ని పొందటం ఎలా? వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యటం ద్వారా. అవి ఎలా చెయ్యాలి? గురువు ద్వారా. అది ఎవరు చెప్పారు? కృష్ణపరమాత్మే చెప్పాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

గురువు ద్వారా అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందాలి.

ఈ ఆత్మజ్ఞానం పొందితే కలిగే ప్రయోజనం ఏమిటి?

**మామేకం శరణమ్** – సంసారంనుంచి విముక్తి కలిగించేది పరమాత్మ మాత్రమే. ఎందుకు? పరమాత్మ మాత్రమే దేశకాలాతీతం. పరమాత్మను కాదని మీరు ఎక్కడికి వెళ్ళినా, **ఎక్కడికి** అంటేనే అది ఒక దేశం అవుతుంది. మీరు వైకుంఠానికి వెళ్ళినా, కైలాసానికి వెళ్ళినా, బ్రహ్మలోకానికి వెళ్ళినా, అది ఒక దేశం అవుతుంది; దేశం ఉంటే దాన్ని వెన్నంటే కాలం కూడా ఉంటుంది. అంటే కాలాన్ని తప్పించుకోలేరు.

కాలాన్ని సంసారం అంటారు. ఎందుకంటే కాలమే షడ్వికారాలను కలుగజేస్తుంది. అందులో మరణం కూడా ఉంది. అందువల్ల ఎక్కడికో వెళితే మీకు సంసారంనుంచి విముక్తి దొరకదు; దేశకాల అతీత, నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకుంటే, సంసారంనుంచి విముక్తి పొందుతారు. శరణం వ్రజ అంటే అక్షరాలా శరణం కోరటం కాదు; ఐక్యజ్ఞానం పొందటం. ఇందులో **శరణం** పదం ఉంది కాబట్టి దీన్ని శరణాగతి శ్లోకం అంటారు. ఇక్కడితో జ్ఞానయోగ సారాంశం కూడా అయిపోయింది. ఇప్పుడు రెండవ పాదంలో జ్ఞానఫలాన్ని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

**అహం త్వా మోక్షయిష్యామి** – నువ్వు పొందిన జ్ఞానానికి నీకు ఫలాన్ని ఇస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే భగవంతుడే కర్మఫలదాత, జ్ఞానఫలదాత కూడా. మీరు కర్మ చేసినా, జ్ఞానం పొందినా, రెండింటికీ భగవంతుడే ఫలాన్ని ఇస్తాడు. జ్ఞానఫలం ఏమిటి?

**సర్వపాపేభ్యో (మోక్షయిష్యామి)** – నిన్ను అన్ని పాపాలనుంచి బంధ విముక్తుడిని చేస్తాను. అన్ని పాపాలు అంటే సంచితపాపాలు, ఆగామి పాపాలు, ప్రారబ్ధ పాపాలు. మరి పుణ్యం మాటేమిటి? వేదాంతం ప్రకారం పుణ్యం కూడా పాపం కిందికే వస్తుంది. కాకపోతే రెండింటికీ మధ్య ఉన్న భేదం ఏమిటంటే, పాపం ఇనుప సంకెళ్ళతో మిమ్మల్ని బంధిస్తే, పుణ్యం బంగారు సంకెళ్ళతో కట్టివేస్తుంది. ఎందుకంటే పుణ్యం పొందినా కూడా, ఆ పుణ్యక్షయంకోసం మళ్ళీ పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడక తప్పదు. పుణ్యం ఉన్నా సంసారం తప్పదు, పాపం వచ్చినా సంసారం తప్పదు. సంసారం తప్పాలంటే ఒకటే మార్గం ఉంది. పుణ్యపాపాలకు అతీతంగా ఎదగాలి.

**తథా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి** – ముండకం 3.1.3

ముండకోపనిషత్తు అద్భుతంగా చెబుతుంది. జ్ఞాని పుణ్యపాపాలు రెండింటినీ వదిలించుకుంటాడు. ఆ విధంగా, అర్జునా, నీ పుణ్యపాపాలనుంచి నేను విడుదల చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. **అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి.**

**మా శుచః** – నువ్వు శోకించకు; సంసారం సమస్యనుంచి బయటపడే మార్గం ఉంది.

ఈ విధంగా ఒక్క శ్లోకంలో కృష్ణపరమాత్మ ఆత్మజ్ఞానం అంటే ఏమిటో, ఐక్యం అంటే ఏమిటో, దాని ఫలం ఏమిటో చెప్పేశాడు. అందువల్ల దీన్ని చరమశ్లోకం అనికూడా అంటారు.

ఇంకా ముందుకు వెళ్ళేముందు శంకరాచార్యుల వారు తన భాష్యంలో శరణాగతిని గురించి ఏం చెప్పారో చూద్దాము. చాలా లోతుగా విశ్లేషించి శరణాగతి అంటే జ్ఞానం అని చెప్పారు. దాని సారాంశం ఇప్పుడు చూద్దాము.

ముందుగా శరణాగతి అంటే అసలు అర్థం ఏమిటి? నమస్కారం చెయ్యటం, సాష్టాంగ నమస్కారం చెయ్యటం, నామజపం చెయ్యటం – ఇలా అనేకమంది అనేక అర్థాలు చెబుతారు. కాని శంకరాచార్యులవారు జ్ఞానం అన్నారు. అలా ఎలా చెప్పారు? ఇది నా స్వంత అర్థం కాదు, శాస్త్రం చెప్పినదాని సారాంశం అన్నారు శంకరాచార్యుల వారు.

1. **మోక్షఫలం** – ఉపనిషత్తులన్నీ ఏకగ్రీవంగా ఒకటే విషయాన్ని ఘోషిస్తున్నాయి. ఏమిటది? జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది. అందువల్ల ఆ సూత్రం ప్రకారం మోక్షఫలం ఎక్కడ చెప్పబడితే, అక్కడ చెప్పబడిన సాధనను జ్ఞానంగా తీసుకోవాలి. జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని ఉపనిషత్తులు ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, వందలసార్లు చెబుతాయి.

**తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే**

జ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది; వేరే మార్గం ఇవ్వదు. జ్ఞానం అనేక మార్గాల్లో ఒకటి కాదు. జ్ఞానమార్గమొక్కటే మార్గం.

శ్వేతాశ్వతర ఉపనిషత్తులో, కావాలంటే వేరే మార్గం ద్వారా జ్ఞానం పొందవచ్చు; కాకపోతే ఒక నియమాన్ని పాటించాలని అద్భుతంగా చెబుతుంది. ఏమిటా నియమం?

ఆకాశాన్ని చాపచుట్టలా చుట్టగలిగితే మోక్షం వస్తుందిట. అంటే ఏమిటి? వేరే మార్గాల ద్వారా మోక్షం అసాధ్యం. అందువల్ల కృష్ణపరమాత్మ శరణాగతి మోక్షాన్ని ఇస్తుంది అంటే శరణాగతి = జ్ఞానం అవాలి. ఎందుకంటే శాస్త్రం పదేపదే **జ్ఞానాదేవ తు కైవల్యమ్** అంటుంది.

ఉపనిషత్తుల దాకా ఎందుకు? భగవద్గీతలోనే కృష్ణపరమాత్మ జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుందని పదేపదే చెప్పాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

జ్ఞాని మాత్రమే మోక్షం పొందుతాడు. ఈ శ్లోకంతోనే కృష్ణపరమాత్మ తన బోధను మొదలుపెట్టాడు. ఆ తర్వాత కర్మ, భక్తి గురించి చెప్పుకొచ్చాడు. కర్మ గురించి చెప్పినప్పుడు ఏ కర్మ కూడా మోక్షాన్ని ఇవ్వదు; కర్మలు జ్ఞానయోగ్యతా ప్రాప్తిని మాత్రమే ఇస్తాయి, జ్ఞానానికి తీసుకువెళతాయి కాని వాటంతట అవి జ్ఞానాన్ని కానీ, మోక్షాన్ని కానీ ఇవ్వవని చెప్పాడు.

**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే**

జ్ఞానానికి రాకపోతే, ఎన్ని కర్మలు చేసినా కూడా మోక్షం పొందలేరు అన్నాడు కృష్ణపరమాత్మ.

అలాగే భక్తి గురించి చెప్పేటప్పుడు కూడా, అందరు భక్తులు గొప్పవారే కాని జ్ఞానీభక్తుడు అందరిలోకీ శ్రేష్ఠుడు అన్నాడు.

**ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥** – 7.18

భక్తిలో ఎన్ని రకాలు పాటించినా కూడా భక్తి పరాకాష్ఠ వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. దీని ద్వారా అజ్ఞాని భక్తుడు తనను తాను జ్ఞానీభక్తునిగా మలుచుకోవాలి. జ్ఞానీభక్తుడే మోక్షాన్ని పొందగలడు. ఈ విషయాన్ని కృష్ణపరమాత్మ 7, 9, 12 అధ్యాయాల్లో మళ్ళీమళ్ళీ చెప్పాడు. అందువల్ల మీరు ఏ కర్మ అయినా చెయ్యండి, ఏ భక్తి అయినా చూపండి, ఏ రకమైన శరణాగతిని అయినా పాటించండి కాని శరణాగతి పరాకాష్ఠ అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం పొందటం. కృష్ణపరమాత్మ కూడా అదే అనేక సందర్భాలలో చెప్పాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య = జ్ఞానయోగం పాటించి మోక్షం పొందు**

ఇక్కడితో శంకరాచార్యులవారు శరణాగతి గురించి చేసిన విశ్లేషణ అయిపోయింది.

శ్లో. 67 **ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥**

ఇదమ్, తే, న, అతపస్కాయ, న, అభక్తాయ, కదాచన,
న, చ, అశుశ్రూషవే, వాచ్యమ్, న, చ, మామ్, యః, అభ్యసూయతి ॥

| | | |
|---|---|---|
| తే (త్వయా) | = | నీచే |
| ఇదమ్ | = | రహస్యమయమైన ఈ గీతోపదేశము |
| కదాచన | = | ఎప్పుడైనను |
| అతపస్కాయ | = | తపస్సంపన్నుడు కానివానికి |
| న, వాచ్యమ్ | = | చెప్పదగదు |
| అభక్తాయ, చ | = | భక్తిరహితునకును |
| న, (వాచ్యమ్) | = | చెప్పదగదు |
| అశుశ్రూషవే | = | వినుటకు ఇచ్ఛలేని వానికి |
| న, (వాచ్యమ్) | = | చెప్పదగదు |
| చ | = | ఇంకా |
| యః | = | ఎవడు |
| మామ్ | = | నన్ను |
| అభ్యసూయతి | = | దోషదృష్టితో చూచునో |
| (తస్మై) | = | (వానికి ఎన్నడును) |
| న | = | ఈ గీతా బోధను చేయరాదు |

**ఇదమ్ తే న అతపస్కాయ, (చ) న అభక్తాయ, న చ అశుశ్రూషవే,**
**న చ యః మామ్ అభ్యసూయతి (తస్మై) కదాచన వాచ్యమ్ ।**

తా: నీచే రహస్యమయమైన ఈ గీతోపదేశము ఎప్పుడైనను తపస్సంపన్నుడు కానివానికి చెప్పదగదు. భక్తిరహితునకును చెప్పదగదు. వినుటకు ఇచ్ఛలేని వానికి చెప్పదగదు ఇంకా ఎవడు నన్ను దోషదృష్టితో చూచునో వానికి ఎన్నడును గీతా బోధను చేయరాదు.

### 5. ఉపసంహారం శ్లోకాలు 67–78

#### ఎ) సాంప్రదాయ విధి – గీత అధ్యయనానికి కావాల్సిన అర్హతలు

కృష్ణపరమాత్మ చేసిన బోధ ముందు శ్లోకంతో అయిపోయింది. రెండవ అధ్యాయంలో పదకొండవ శ్లోకంతో మొదలైన బోధ పద్దెనిమిదవ అధ్యాయంలో అరవై ఆరవ శ్లోకంతో (శ్లోకాలు 2.11–18.66) ముగిసింది. ఇక్కడ్నుంచీ గీతాబోధ గురించి కొన్ని అంశాలు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంలో గీతాబోధ వినటానికి అవసరమైన నాలుగు అర్హతలను గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అర్హతలు ఎంత ఎక్కువగా ఉంటే, గీతాబోధవల్ల కలిగే ఫలం అంత ఎక్కువగా ఉంటుంది; ఎంత తక్కువగా ఉంటే, దాని ఫలం కూడా అలాగే ఉంటుంది. ఈ అర్హతలు అసలు లేకపోతే, అసలు ప్రయోజనం ఉండదు. ఏమైనా ప్రయోజనం ఉంటే అతని కుటుంబసభ్యులకు ఉంటుంది. ఇంట్లో కూర్చుని మా మెదడు తినకపోతే ఆ గీతా క్లాసుకైనా వెళ్ళరాదా అని తోసివుంటారు వారు. ఆ కాసేపన్నా వారు ప్రశాంతంగా ఉంటారు.

తత్త్వబోధలో చూసే నాలుగు అర్హతలు వేరు. వాటిని సాధనచతుష్టయ సంపత్తి అంటారు. ఇక్కడ చెప్పే నాలుగు సాధనలు వేరు. అవి – తపస్సు, భక్తి, శుశ్రూష, అనసూయ.

1) **తపస్సు** – తపస్సు అంటే ఆధ్యాత్మిక నియంత్రణ ఉండాలి.

2) **భక్తి** – గురువులమీద, భగవంతునిమీద భక్తి ఉండాలి. ఎవరికైతే ఈశ్వరభక్తి, గురుభక్తి ఉంటుందో, అతను జ్ఞానాన్ని పొందుతాడని ఉపనిషత్తులు చెబుతాయి.

3) **శుశ్రూష** – జ్ఞానం పొందాలి, గీతను అధ్యయనం చెయ్యాలనే తీవ్రమైన శ్రద్ధ ఉండాలి. మామూలుగా శుశ్రూష అంటే సేవ. గురుశుశ్రూష, పితృశుశ్రూష, అనేవారు. గురువుకు, తల్లిదండ్రులకు, భర్తకు సేవ చెయ్యాలి అంటుంది శాస్త్రం. కాని శుశ్రూష అసలు అర్థం నేర్చుకోవాలనే తపన. శుశ్రూష అంటే శ్రోతుం ఇచ్ఛ.

ఈ వినాలనే తపన లేకపోతే, గీతాబోధకు వెళ్ళికూర్చున్నా ఒక్కముక్క కూడా వినలేరు. ఒక్కోసారి మీరు సరిగ్గా గీతాక్లాసుకు వెళ్ళేముందు ఏ అనుకోని అతిథో మీ యింటికి వస్తారు. మీరు వారిని వదిలి క్లాసుకు వెళ్ళలేరు; అలాగని క్లాసుని వదులుకోలేరు. అప్పుడేం చేస్తారు? వారిని కూడా క్లాసుకు తీసుకువెళతారు. వారి పనిని బలవంతపు బ్రాహ్మణార్థం అంటారు. కాదనలేక వస్తారు కాని, వారికేం శ్రద్ధ ఉండదు. ఆ గంటసేపూ దిక్కులు చూస్తూ కూర్చుంటారు. అందువల్ల శుశ్రూష ఉండాలి. నేర్చుకోవాలనే తపన ఉండాలి.

4) **అనసూయః** – అనసూయః అంటే విమర్శనాత్మకంగా ఉండకూడదు. విమర్శించే ఉద్దేశ్యంతోనే, తప్పులు పట్టే ఉద్దేశంతోనే శాస్త్రాన్ని ఎన్నడూ అధ్యయనం చెయ్యకూడదు. నాస్తికులు గీతను చదివేది దాన్ని విమర్శించటానికే. అలాంటి దృక్పథంతో ఎన్నడూ గీతను నేర్చుకోకండి. అలా నేర్చుకుంటే మీరే నష్టపోతారు.

అందువల్ల అనసూయ అంటే సానుకూలంగా చెప్పాలంటే శ్రద్ధ కలిగివుండటం. గీతను గౌరవపూర్వకంగా నేర్చుకోవాలి. ఆమాటకొస్తే గీతమీదే కాదు, జీవితంలో ఏ పని చేసినా, దానిమీద శ్రద్ధ ఉండాలి. ఆఖరికి ఒక డాక్టరు దగ్గరికి వెళ్ళినా, ఆయనమీద శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ లేకపోతే, ఆయన ఎంత గొప్ప మందు ఇచ్చినా అది పనిచెయ్యదు. శ్రద్ధ ఉంటే, ఆయన ఇంజక్షన్ పేరుతో డిస్టిల్డ్ వాటర్ ఇచ్చినా కూడా, అది అమోఘంగా పనిచేస్తుంది. దీన్ని ప్లాసిబో అంటారు. అలా తపస్సు, భక్తి, శుశ్రూష, అనసూయ అనే ఈ నాలుగు లక్షణాలూ శిష్యునికి ఉండాలి.

కృష్ణపరమాత్మ గీతాబోధ చేసే గురువులకు ఈ శ్లోకంలో సలహా ఇస్తున్నాడు. ఈ లక్షణాలు లేనివారికి బోధ చెయ్యవద్దనీ, వారిని తప్పించుకోవాలనీ చెబుతున్నాడు. అలాంటి వారికి బోధ చేస్తే, వారికి మేలు జరగదు కాని, గురువుకే అనవసరంగా అతని సమయం వృథా అవుతుంది.

**ఇదం తే** – నీకు చెప్పబడిన ఈ గీతాబోధను; నీకు చెప్పబడిన అనే మాటను మనం కలుపుకోవాలి.

**న వాచ్యమ్** – ఎన్నడూ ఈ క్రిందివారికి బోధించకూడదు. ఎవరా క్రిందివారు?

**అతపస్కాయ (న వాచ్యమ్)** – తపస్సు లేనివారికి బోధించకూడదు. ముఖ్యంగా ఆధ్యాత్మిక చింతన లేనివారికి బోధించకూడదు. తపస్సు గురించి పదిహేడవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ బోధించాడు. అక్కడ ఆహారం, యజ్ఞం, తపస్సు, దానం గురించి మూడురకాలుగా చెప్పాడు కృష్ణపరమాత్మ. అందులో మళ్ళీ తపస్సు గురించి రెండురకాలుగా చెప్పాడు.

కాయిక, వాచిక, మానసిక తపస్సులను లక్షణ ప్రధాన తపస్సు అన్నాడు. ఈ మూడురకాల తపస్సునూ చేసే పద్ధతినిబట్టి సాత్త్విక, రాజసిక, మానసిక తపస్సులుగా వర్ణించాడు. వీటిని గుణప్రధాన తపస్సు అన్నాడు అక్కడ. ఈ తపస్సులో అన్నీ పాటించకపోయినా, కనీసం చెయ్యాలనే తపన ఉండాలి. ఈ తపస్సులను చేసే ఉద్దేశ్యం ఇసుమంతకూడా లేనివారికి మాత్రం అసలు చెప్పకూడదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. **అతపస్కాయ న వాచ్యమ్.**

**అభక్తాయ (న వాచ్యమ్)** – న వాచ్యమ్ అన్నింటికీ కలుపుకోవాలి. భక్తి లేనివారికి బోధించకు. **అభక్తాయ న వాచ్యమ్.**

**కదాచన** – ఎన్నడూ. అంటే భక్తి లేనివానికి ఎటువంటి పరిస్థితిలోనూ బోధించకు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే భక్తిలేని వ్యక్తి ప్రతిదాన్నీ విమర్శిస్తాడు.

ఎవరో వక్రబుద్ధి ఉన్నవారు కృష్ణపరమాత్మ బోధను ఈ విధంగా వక్రీకరించారు. కృష్ణపరమాత్మ 'వినయంగా ఉండండి, పొగరుగా ఉండకండి, గర్వం చూపకండి; అమానిత్వం, అదంభిత్వం పాటించండి,' అని అడుగడుక్కీ

బోధిస్తాడు. కాని కృష్ణపరమాత్మ పదవ అధ్యాయంలో అన్నీ నా విభూతులే అన్నాడు. దేవర్షులలో నేను నారదుణ్ణి, మృగాలలో నేను సింహాన్ని, మునులలో నేను వేదవ్యాసుణ్ణి అంటూ ఒక పెద్ద పట్టికను ఇచ్చాడు. పదకొండవ అధ్యాయంలో తన విశ్వరూపాన్ని చూపించాడు. ఇదంతా గర్వం కాదా?' ఇది వారి వక్రబుద్ధి కాక మరేమిటి? గీత సరిగా అర్థం చేసుకోనివారికి వస్తుందీ వక్రబుద్ధి. అసలీ కోణంలో ఆలోచించటమే తగదు.

నిజానికి మనం దీనికి జవాబు ముందే చూశాము. కృష్ణపరమాత్మ నేను అంటే ఏకరూపంగా మాత్రమే చెప్పుకోవటం లేదు. నేను అంటే మూడు అర్థాలలో ఏదో ఒకటని ఈ అధ్యాయంలో కూడా చూశాము. అవి – ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. ఇప్పుడు మీరు, నేను బ్రహ్మను అంటే మీరు మనశ్శరీరాలపరంగా ఆమాటను అనటం లేదు. అలా మనశ్శరీరాలతో మమేకం చెంది, నేను బ్రహ్మను అంటే అది అహంకారం అవుతుంది. చైతన్యపరంగా నేనూ, బ్రహ్మ ఒకటే అంటే సత్యం తెలుసుకున్నట్టు అవుతుంది. అదే విధంగా కృష్ణపరమాత్మ ఏకరూప ఈశ్వరునిగా తన గొప్పలు చెప్పలేదు. అనేకరూప ఈశ్వరుని గురించి, అరూప ఈశ్వరుని గురించి అంటే భగవత్ తత్త్వం గురించి చెప్పాడు. అందువల్ల సత్యానికీ, అహంకారానికీ మధ్య భేదాన్ని గుర్తించాలి. తేలిగ్గా ప్రతిదాన్నీ అహంకారం అనేయకూడదు. **అభక్తాయ న వాచ్యమ్ కదాచన.**

**(న) చ శుశ్రూషవే (న వాచ్యమ్)** – నేర్చుకునే శ్రద్ధలేని వ్యక్తికి ఎన్నడూ గీతను బోధించకు. గీతాబోధే కాదు, మామూలు కులాసా కబుర్లు కూడా వినే శ్రద్ధ లేనివానికి చెబితే లాభం లేదు. అతను రెండోసారి మిమ్మల్ని ఆమడదూరంనుంచి చూసే, మీనుంచి పారిపోతాడు. దానికోసం అతను చుట్టూ తిరిగి వెళ్ళాల్సి వచ్చినా బాధపడడు. అందువల్ల శ్రద్ధలేనివారికి బోధ చెయ్యకు. **న చ శుశ్రూష వే వాచ్యమ్.**

**న చ మామ్ యః అభ్యసూయతి** – ఎవరైతే ప్రతిదానిలోనూ తప్పులెన్నుతాడో అతనికి బోధించకూడదు. వారు ప్రతిదీ విమర్శిస్తారు. ఈ పైన చెప్పిన నలుగురికీ బోధ చెయ్యకు. దానికి భిన్నంగా తపస్సు, భక్తి, శుశ్రూష, అనసూయ ఉన్నవారికి ఈ జ్ఞానాన్ని పంచు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 68 **య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥**
యః, ఇమమ్, పరమమ్, గుహ్యమ్, మద్భక్తేషు, అభిధాస్యతి,
భక్తిమ్, మయి, పరామ్, కృత్వా, మామ్, ఏవ, ఏష్యతి, అసంశయః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడయితే | మద్భక్తేషు | = నా భక్తులందు |
| మయి | = నాయందు | అభిధాస్యతి | = పదిలపరచునో |
| పరామ్, భక్తిమ్, కృత్వా | = పరమభక్తిని కలిగి | సః | = అతడు |
| ఇమమ్ | = ఈ | మామ్, ఏవ | = నన్నే |
| పరమమ్, గుహ్యమ్ | = మిక్కిలి గోప్యమైన గీతోపదేశమును | ఏష్యతి | = పొందును |
| | | అసంశయః | = ఇందు సంశయమునకు తావేలేదు |

**యః ఇమమ్ పరమమ్ గుహ్యమ్ (జ్ఞానం) మత్-భక్తేషు అభిధాస్యతి,**
**(సః) మయి పరామ్ భక్తిమ్ కృత్వా, అసంశయః (సన్) మామ్ ఏవ ఏష్యతి ।**

తా: ఎవడయితే నాయందు పరమభక్తిని కలిగి ఈ మిక్కిలి గోప్యమైన గీతోపదేశమును నా భక్తులందు పదిలపరచునో అతడు నన్నే పొందును. ఇందు సంశయమునకు తావేలేదు

**గురుస్తుతి**

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ మూడురకాల మనుష్యులను పొగుడుతున్నాడు. వారు – గురువు, శ్రద్ధ ఉన్న శిష్యుడు, శ్రద్ధ లేకుండా విన్న శిష్యుడు.

గురువు – గీతాబోధను చేసే గురువు నాకు చాలా ప్రియం.

శ్రద్ధ ఉన్న శిష్యుడు – గీతను శ్రద్ధగా నేర్చుకునే శిష్యుడు.

శ్రద్ధ లేకుండా విన్న శిష్యుడు – గీతమీద శ్రద్ధ లేకపోయినా, అర్థం కాకపోయినా, వచ్చి గీత విన్న శిష్యుడు.

ఆ విధంగా ఈ ముగ్గురినీ మెచ్చుకుంటున్నాడు. మళ్ళీ ఈ ముగ్గురిలో గీతాబోధ చేసే గురువు ఇంకా ఎక్కువ ఇష్టం అంటున్నాడు. ఎందుకంటే, నేను ఏ పని చేద్దామనుకున్నానో, దాన్ని ఈ గురువు చేస్తున్నాడు అంటున్నాడు.

కృష్ణపరమాత్మ కృష్ణావతారం ఎత్తిన కారణాల్లో ఒకటి – మన సనాతన ధర్మాన్ని రక్షించి, చాటిచెప్పటానికి. గీత బోధించే ఆచార్యులు, గీతాబోధద్వారా, సనాతన ధర్మాన్ని రక్షించి, పునరుద్ధరించే బృహత్కార్యాన్ని చేపడుతున్నారు కాబట్టి వారంతా నాకు చాలా ప్రీతిపాత్రులు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**య ఇమం పరమం గుహ్యమ్ అభిదాస్యతి** – ఒక ఆచార్యుడు ఈ అత్యంత రహస్యమైన గీతాబోధను చేస్తే; ఎవరికి?

**మద్భక్తేషు** – భక్తుడు అంటే ఇంతకుముందు శ్లోకంలో చెప్పిన నాలుగు గుణాలను తీసుకోవాలి – తపస్సు, భక్తి, శుశ్రూష, అనసూయ. ఈ నాలుగు లక్షణాలు ఉన్న శిష్యులకు బోధిస్తే. అది కూడా ఎలా బోధించాలి?

**భక్తిం మయి పరాం కృత్వా** – చాలా గొప్ప గౌరవంతో బోధించాలి. అంటే ఇక్కడ కృష్ణపరమాత్మ గురువుకు కూడా పరోక్షంగా సూచనలిస్తున్నాడు. 'నేను కాబట్టి గీతాబోధ చేస్తున్నాను అనుకోవద్దు.' ఈ బోధ సాక్షాత్తూ ఆ భగవంతుని నుంచే వచ్చింది. అందువల్ల గీతాచార్యుడు కృష్ణపరమాత్మ చేసిన బోధను నేను చేయగలిగే అవకాశం నాకు వచ్చిందనే భక్తితో చెయ్యాలి. అంటే భక్తి ఉండాల్సింది ఒక్క శిష్యునికే కాదు; గీతను బోధించే గురువుకు కూడా ఉండాలి. అందువల్ల శిష్యునిది భక్తి అయితే, గురువుది **పరాంభక్తి**. గురువుయొక్క భక్తి చతుర్విధ భక్తుల్లో నాలుగవ భక్తిగా ఉండాలి. అంటే గురువు జ్ఞానీభక్తుడు అవ్వాలి. అది అద్వైతభక్తి అవుతుంది. అటువంటి భక్తుడు బోధిస్తే, అతనికి కలిగే ఫలమేమిటి?

**మామేవైష్యత్యసంశయః** – అతను మోక్షం పొందుతాడు. అందులో ఏమాత్రం సందేహం లేదు. అంటే అతను జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతాడు.

శ్లో. 69 **న చ తస్మాన్ మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।**
**భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి ॥**
న, చ, తస్మాత్, మనుష్యేషు, కశ్చిత్, మే, ప్రియకృత్తమః,
భవితా, న, చ, మే, తస్మాత్, అన్యః, ప్రియతరః, భువి ॥

| | | | |
|---|---|---|---|
| మనుష్యేషు | = మనుష్యులలో | చ | = అలాగే |
| మే | = నాకు | భువి | = ఈ భూమండలమున |
| తస్మాత్ | = వానికంటెను | తస్మాత్ | = వానికంటెను |
| ప్రియకృత్తమః | = మిక్కిలి ప్రియమును గూర్చువాడు | మే | = నాకు |
| కశ్చిత్, చ | = ఎవ్వడును | ప్రియతరః | = మిక్కిలి ప్రియమైనవాడు |
| న | = లేడు | అన్యః | = మరియొకడు |
| | | న, భవితా | = ఉండబోడు |

**మనుష్యేషు చ కశ్చిత్ తస్మాత్ ప్రియ-కృత్తమః మే న (అస్తి)**
**తస్మాత్ అన్యః భువి ప్రియతరః చ మే న భవితా ।**

తా: మనుష్యులలో నాకు వానికంటెను మిక్కిలి ప్రియమును గూర్చువాడు ఎవ్వడును లేడు. అలాగే ఈ భూమండలమున వానికంటెను నాకు మిక్కిలి ప్రియమైనవాడు మరియొకడు ఉండబోడు.

ఈ శ్లోకంలో ఈ ముగ్గురిలోకీ, గీతాచార్యులను, తనకు అత్యంత ప్రియమైన వ్యక్తులుగా స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**మనుష్యేషు (సః) ప్రియకృత్తమః** – సః అంటే ఎవరైతే గీతబోధను ఇతరులకు చేస్తారో, ఆ గురువు –

మనుష్యేషు – మనుష్యులందరిలో

ప్రియకృత్తమ – నాకు అత్యంత ప్రియమైన వ్యక్తి. ఎందుకంటే అతను నాకు అత్యంత ప్రియమైన పనిని చేస్తున్నాడు. భగవంతుడు ఎన్నో పనులు చేస్తాడు

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – 4.8

అవతారం ఎత్తిన అనేక కారణాలలో ఒకటి వైదిక సాంప్రదాయాన్ని పునరుద్ధరించటానికి. ఎందుకంటే ఈ బోధ ద్వారానే సనాతన ధర్మం, సమతుల్యత, శాంతి నెలకొంటుంది సమాజంలో. అందువల్ల తనకు ఎంతో ప్రియతమమైన పనిని గురువు చేస్తున్నాడు కాబట్టి, ఆ గురువు కూడా ప్రియతమమే అవుతాడు.

**భవితా న చ మే** – ఇప్పుడు గీత బోధిస్తున్నప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ఆ ఆచార్యుడే ప్రియతముడు అవుతాడు.

**తస్మాత్ అన్యః ప్రియతరో భువి** – అతనికంటే వేరే ఎవరూ ప్రియతరం కాలేరు. ప్రియతరం అంటే గీతా ఆచార్యుని కన్నా వేరే ఎవరూ ప్రియతరం కారు. ఎవరంటున్నారు? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే అంటున్నాడు.

దీన్నిబట్టి ఒక ఉపసిద్ధాంతం తీసుకోవచ్చు. అవకాశం దొరికితే, మీరు కూడా ఎవరినైనా పట్టుకుని, అతని కోసం కూడా మీరే ప్రార్థన చేసి, అతనికి బోధ చెయ్యటం ప్రారంభించండి. నిజానికి నేనేమిటి, బోధ చెయ్యటం ఏమిటి అనుకోకండి! మీరు నేర్చుకున్న జ్ఞానాన్ని నలుగురితో పంచుకుంటున్నారని భావించండి. ఇలా నలుగురితో పంచుకుంటే అది బ్రహ్మవిద్య అవుతుంది. భగవంతుడు కూడా చాలా సంతోషిస్తాడు. మీరు భగవంతునికి ప్రియతములు అవుతారు.

**స్వాధ్యాయ ప్రవచనేన చ** – తైత్తిరీయం

మీకు రెండు ధర్మాలు ఉన్నాయి. శాస్త్రాన్ని మీరు అధ్యయనం చెయ్యటం; మీరు నేర్చుకున్న విద్యను నలుగురికి పంచటం. అందువల్ల ఈ భూమ్మీద నాకు గురువుకన్నా ప్రియమైన వారుఎవరూ లేరు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ విధంగా గీతాబోధ చేసే ఆచార్యునికి రెండు ఫలాలు కలుగుతాయి.

మామేవైష్యత్యసంశయః – పరమాత్మలో ఐక్యం అవుతాడు.

ప్రియకృత్తమః - జీవించి ఉండగానే, అతను కృష్ణపరమాత్మకు ప్రియమైన వ్యక్తి అవుతాడు.

శ్లో. 70 **అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।**
**జ్ఞానయజ్ఞేన తేనాహమ్ ఇష్టః స్యామితి మే మతిః ॥**
అధ్యేష్యతే, చ, యః, ఇమమ్, ధర్మ్యమ్, సంవాదమ్, ఆవయోః,
జ్ఞానయజ్ఞేన, తేన, అహమ్, ఇష్టః స్యామ్, ఇతి, మే, మతిః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడయితే | తేన, చ | = వానిచేతను |
| ఇమమ్ | = ఈ | అహమ్ | = నేను |
| ధర్మ్యమ్ | = ధర్మయుక్తమైన | జ్ఞానయజ్ఞేన | = జ్ఞానయజ్ఞము ద్వారా |
| ఆవయోః | = మన ఇరువురియొక్క | ఇష్టః, స్యామ్ | = పూజితుడను అగుదును |
| సంవాదమ్ | = సంవాదరూపమైన గీతాశాస్త్రమును | ఇతి | = అని |
| అధ్యేష్యతే | = పఠించునో | మే, మతిః | = నా అభిప్రాయము |

**యః చ ఆవయోః ఇమమ్ ధర్మ్యమ్ సంవాదమ్ అధ్యేష్యతే, తేన**
**జ్ఞాన–యజ్ఞేన అహమ్ ఇష్టః స్యామ్ ఇతి మే మతిః ।**

తా: ఎవడయితే ఈ ధర్మయుక్తమైన, మన ఇరువురియొక్క సంవాదరూపమైన గీతాశాస్త్రమును పఠించునో వానిచేతను నేను జ్ఞానయజ్ఞము ద్వారా పూజితుడను అగుదును అని నా అభిప్రాయము.

**శిష్యస్తుతి**

ఈ రెండు శ్లోకాల్లో అంటే 70, 71 శ్లోకాల్లో శిష్యస్తుతి లేదా శిష్యమహిమ గురించి చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ శిష్యులను మళ్ళీ రెండురకాలుగా విభజిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఒకరకం గీతను శ్రద్ధగా

నేర్చుకుంటారు. ఉత్తమ శిష్యుడు అనవచ్చు. రెండవరకం శిష్యుడు గీతను నేర్చుకోవటానికి సిద్ధంగా లేదు; అందువల్ల గీతను ఆషామాషీగా నేర్చుకుంటాడు. అందువల్ల అతను మధ్యమరకం అవుతాడు.

అర్హత ఉన్నవ్యక్తి నేర్చుకుంటే – అది అధ్యయనం

అర్హత లేనివ్యక్తి నేర్చుకుంటే – అది శ్రవణం

అధ్యయనం అంటే శ్రద్ధగా, ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవటం; శ్రవణం అంటే మనం ఎప్పుడూ చూసే వేదాంత శ్రవణం అర్థం కాదు ఇక్కడ. శ్రవణం అంటే యధాలాపంగా వినటం. ఏదో నాలుగు మంచిమాటలు చెవిన పడతాయిలే అనుకుని, చాలా తేలిగ్గా వినటం.

కాని ఈ రెండురకాల శిష్యులు కూడా గొప్ప ఫలితాలను పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటా ఫలాలు? ఉత్తమశిష్యుడు మోక్షాన్నే పొందుతాడు. గీతను మోక్షశాస్త్రం అంటారని మర్చిపోకూడదు. అందువల్ల అతను గీతను శ్రద్ధగా నేర్చుకుంటే మోక్షాన్ని పొందుతాడు. రెండవ శిష్యుడు శ్రద్ధగా కాకపోయినా, వింటే అతనికి స్వర్గప్రాప్తి కలుగుతుంది. అందువల్ల మీకు శ్రద్ధ ఉన్నా, లేకపోయినా, గీతాబోధకు వెళ్ళటం మానకండి. వెళితే కనీసం స్వర్గానికి అయినా వెళతారు. ఈ మాటలు కృష్ణపరమాత్మే చెబుతున్నాడు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**యః ఇమం సంవాదమ్ అధ్యేష్యతే** – ఒకవేళ శ్రద్ధ ఉండి, అర్హత ఉన్న విద్యార్థి ఈ భగవద్గీతను జాగ్రత్తగా అధ్యయనం చేస్తే;

**ఆవయోః సంవాదమ్** – మన ఇరువురి మధ్య సంభాషణరూపంలో ఉన్న భగవద్గీతను అధ్యయనం చేస్తే అంటున్నాడు కృష్ణపరమాత్మ. మన ఇరువురు అంటే కృష్ణపరమాత్మ, అర్జునుడు.

**ధర్మ్యమ్ (సంవాదమ్)** – ఎటువంటి సంవాదమిది? ధర్మ్యం. ధర్మ్యం అంటే వేదాన్ని ఆధారంగా తీసుకుని చేసిన బోధ. వేదాలు బోధించేదాన్ని ధర్మం అంటారు. భగవద్గీత వేదాలసారం అని కృష్ణపరమాత్మే సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతూనే ఉన్నాడు. 'నేను చెబుతున్నది కొత్త సిద్ధాంతం కాదు, వైదిక సాంప్రదాయం తగ్గిపోతుంటే నేను దాన్ని భగవద్గీత పేరుతో పునరుద్ధరిస్తున్నాను.' అందువల్ల ధర్మ్యం అంటే వేదబోధకు అనుగుణంగా ఉన్న గీతాబోధ.

అధ్యేష్యతే – ఎవరైతే ఇంత గొప్ప సంవాదాన్ని శ్రద్ధగా, క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా అధ్యయనం చేస్తారో, దాన్ని జ్ఞానయజ్ఞం అంటారు.

**జ్ఞానయజ్ఞేన** – గీతాబోధను జ్ఞానయజ్ఞం అంటారు. ఇది అగ్నిహోత్రం వెలిగించి చేసే యజ్ఞం అనే క్రతువు కాదు; ఇక్కడ జ్ఞానమనే అగ్నిని వెలిగిస్తారు.

**జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసాత్ కురుతే**

గీతలోనే చూశాము జ్ఞానాగ్ని అన్ని కర్మలను అంటే కర్మఫలాలను దగ్ధం చేస్తుందని. ఈ జ్ఞానాగ్నిలో వేసే ఆహుతులు అజ్ఞానం, అజ్ఞానజనిత అహంకారం. గీతను నేర్చుకునే ప్రతి శిష్యుడు కూడా ఈ జ్ఞానయజ్ఞాన్ని చేస్తున్నాడు.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప** – 4.33

మనుష్యులు చేసే అన్ని యజ్ఞాలకన్నా జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమైనది అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ జ్ఞానయజ్ఞం ద్వారా ఈ గీతాబోధను వినే శిష్యులందరూ భగవంతునికి పూజ చేస్తున్నారు. అంటే కళ్ళ ఎదురుగుండా భగవంతుని చిత్రపటం ఉండకపోవచ్చు; మూర్తి ఉండకపోవచ్చు; కాని, భగవంతుణ్ణి ఆరాధిస్తున్నట్టే అర్థం.

**తేన అహమ్ ఇష్టః** – వారిచేత నేను పూజించబడుతున్నాను. ఇష్టం అంటే పూజ. ఆ పూజ ప్రత్యక్షంగా జరగటం లేదు; ఎందుకంటే కనబడే పూజాద్రవ్యాలు వాడటం లేదు, కాని వారు కనబడని అహంకారాన్ని ఆహుతిగా వేస్తున్నారు. ఇంత గొప్ప యజ్ఞం చేస్తున్నారు కాబట్టి, దానికి వారు పొందే ఫలం కూడా శ్రేష్ఠంగానే ఉంటుంది. వారు పొందే ఫలం మోక్షఫలం. మోక్షఫలాన్ని ఇక్కడ కృష్ణపరమాత్మ ప్రత్యేకించి పేర్కొనలేదు కాని, మనం ముందు శ్లోకాల్లోంచి కలుపుకోవాలి. జ్ఞానయజ్ఞం చేసిన ప్రతి విద్యార్థి కూడా ముందు జీవన్ముక్తి, తర్వాత విదేహముక్తి పొందుతాడు. ఆ విధంగా గీతమీద శ్రద్ధ ఉన్న ప్రతి శిష్యుడు కూడా ముక్తపురుషుడు అవుతాడు.

మీకు గీతమీద అంత శ్రద్ధ ఉందో లేదో మీరు తేల్చుకోవాలి. కృష్ణపరమాత్మ అంతగా శ్రద్ధలేని విద్యార్థి నేర్చుకుంటే అతను పొందే ఫలమేమిటో కూడా చెప్పబోతున్నాడు రాబోయే శ్లోకంలో.

శ్లో. 71 **శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః ।**
**సోఽపి ముక్తః శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్ ॥**
శ్రద్ధావాన్, అనసూయః, చ, శృణుయాత్, అపి, యః, నరః,
సః, అపి, ముక్తః, శుభాన్, లోకాన్, ప్రాప్నుయాత్, పుణ్యకర్మణామ్ ॥

| | | | |
|---|---|---|---|
| యః, నరః | = ఏ మనుష్యుడైతే | ముక్తః | = పాపవిముక్తుడై |
| శ్రద్ధావాన్ | = శ్రద్ధగలవాడై | పుణ్యకర్మణామ్ | = పుణ్యకర్మలను ఆచరించువారి యొక్క |
| అనసూయః, చ | = దోషదృష్టి లేనివాడై | | |
| శృణుయాత్, అపి | = ఈ గీతాశాస్త్రమును వినునో | శుభాన్, లోకాన్ | = ఉత్తమ లోకములను |
| సః అపి | = అతడును | ప్రాప్నుయాత్ | = తప్పక పొందును |

**శ్రద్ధావాన్ అనసూయః చ యః నరః (ఇదం) శృణుయాత్ అపి సః**
**ముక్తః (సన్) పుణ్య–కర్మణామ్ శుభాన్ లోకాన్ అపి ప్రాప్నుయాత్ ।**

తా: ఏ మనుష్యుడైతే శద్ధగలవాడై, దోషదృష్టి లేనివాడై ఈ గీతాశాస్త్రమును వినునో అతడును పాపవిముక్తుడై పుణ్యకర్మలను ఆచరించువారియొక్క ఉత్తమ లోకములను తప్పక పొందును.

కొంతమందికి గీతాబోధ వినటానికి కావాల్సిన అర్హతలు అన్నీ ఉండవు; మోక్షంమీద వారికి ఇచ్ఛ కూడా లేదు; ఏదో సరదాగా, కాలక్షేపానికి వస్తారు. లేదా గీతద్వారా వారి జీవితాన్ని, ఉద్యోగాన్ని మెరుగుపరుచుకోవాలని వస్తారు.

**యోగః కర్మసు కౌశలమ్**

గీత నిజానికి మోక్షశాస్త్రం అయినా, అది మన జీవనవిధానాన్ని కూడా నిర్దేశిస్తుంది. అంటే లౌకికంగా విజయాలు సాధించటానికి కూడా అందులో మార్గాలు ఉంటాయి. **గీత ద్వారా వ్యక్తిత్వవికాసం** అంటారు కొందరు. అందువల్ల కొందరు స్పష్టంగా చెబుతారు కూడా, నాకు మోక్షం వద్దు అని. నిజానికి వారు అలా అంటున్నారు అంటే, వారికి మోక్షంయొక్క సరియైన అర్థం తెలియదని అర్థం. ఏది ఏమైనా వారిలో తీవ్రముముక్షుత్వం లేదు; అలాగని విమర్శ కూడా చెయ్యరు. వారికి శ్రద్ధ, అనసూయ ఉంది; గీతమీద, కృష్ణపరమాత్మమీద భక్తి ఉంది; ఇవి లేకపోతే క్లాసుకు రోజూ కాదు సరికదా, ఒక్కరోజు కూడా రాలేరు. అటువంటివారి పరిస్థితి ఏమిటి?

**శ్రద్ధావాన్** – అతనికి భగవద్గీతమీద శ్రద్ధ ఉంది;

**అనసూయశ్చ** – భగవద్గీతలో తప్పులెన్నటానికి రావటం లేదు. అందువల్ల అనసూయ.

**శృణుయాదపి యో నరః** – అటువంటి మనిషి కాసేపు వింటే కూడా. అంటే కొంతమంది బోధ అవుతున్న గంటసేపూ శ్రద్ధగా వినలేరు. ఓ పదినిముషాలు వింటారు; తర్వాత మనసెక్కడికో తిరిగివస్తుంది.

స్వామీజీ గీతాబోధకు ఒక అచ్చతెలుగు గృహిణి రోజూ వచ్చేది. స్వామీజీ బోధ మొత్తం ఇంగ్లీషులో ఉంటుంది; ఆవిడకేమో ఇంగ్లీషు రాదు. అయినా రోజూ వచ్చేది. ఎందుకంటే గీతాబోధ (శబ్దం) చెవుల్లో పడినా, అది పుణ్యమే అనే భక్తితో వచ్చేది. అలా కొన్నాళ్ళు విన్నాక, ఒకరోజు స్వామీజీ దగ్గరకు వెళ్ళి ఒక సేఫ్టీపిన్ను ఇచ్చింది ఆవిడ. ఎందుకో అర్థంకాక, ఆశ్చర్యంగా చూశారు స్వామీజీ ఆమెకేసి. మీరు మీ అంగవస్త్రాన్ని పదేపదే సర్దుకుంటున్నారు, దానితో అవస్థ పడుతున్నారని, అది కదలకుండా ఉంచుకోవటానికి ఈ పిన్నుని ఇస్తున్నాను అంది. ఇది ఎందుకు జరిగింది? ఆవిడకు స్వామీజీ చేసే బోధ అర్థమై ఉంటేనో, దానిమీద శ్రద్ధపెట్టి ఉంటేనో, ఈ విషయాన్ని గమనించి ఉండేదికాదు. ఆవిడకు భాష రాదు కాబట్టి, స్వామీజీ చేసే భరతనాట్య విన్యాసాలను చూసింది. మరికొంతమంది క్లాసుకు శ్రద్ధగా వస్తారు కాని మధ్యలో నిద్రపోతారు. కాని అలా సగం, సగం విన్నాకూడా, అటువంటి శిష్యునికి కూడా,

**సః అపి ముక్తః** – అతను ఈ పుణ్యకర్మ చెయ్యటంవల్ల అన్ని పాపకర్మలనుంచి ముక్తి పొందుతాడు. ఇలాంటి శ్రవణం, జ్ఞానయోగం కిందికి రాదు. ఇది కూడా కర్మయోగం లేదా పుణ్యకర్మలోకి వస్తుంది. పుణ్యకర్మ చేస్తే కలిగే ఫలమేమిటి? పాపం పోతుంది.

**శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్** – అతను మరణించాక పుణ్యలోకాలకు వెళతాడు. అవి ఎటువంటి లోకాలు?

**పుణ్యకర్మణామ్** – పుణ్యకర్మలు చేస్తే ఏ లోకాలకు వెళతాడో, ఆ లోకాలకు ఆయా కర్మలు చేయకుండానే, గీతా శ్రవణం చేసిన విద్యార్థి వెళతాడు. పెద్ద యాగాలైన సోమయాగం, ఏకాదశరుద్రం, మహారుద్రం చేస్తే పుణ్యలోకాలకు వెళతారు. కాని ఈ యాగాలన్నీ చెయ్యకుండానే, గీతాశ్రవణం చేసిన వ్యక్తి వెళతాడు. ఎవరంటున్నారు ఈ మాట? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే హామీ ఇస్తున్నాడు. అందువల్ల రెండవరకం విద్యార్థికి ఫలం స్వర్గఫలం.

70, 71 శ్లోకాల్లో శిష్యస్తుతి జరిగింది. ఇప్పుడు ఈ రెండురకాల శిష్యుల్లో అర్జునుడు ఏ శిష్యుని తెగలోకి వస్తాడో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది కృష్ణపరమాత్మకు. అందువల్ల అదే ప్రశ్నను వేస్తున్నాడు రాబోయే శ్లోకంలో.

శ్లో. 72 **కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।**
**కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రనష్టస్తే ధనంజయ ॥**
కచ్చిత్, ఏతత్, శ్రుతమ్, పార్థ, త్వయా, ఏకాగ్రేణ, చేతసా,
కచ్చిత్, అజ్ఞానసమ్మోహః, ప్రనష్టః, తే, ధనంజయ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | ధనంజయ! | = ఓ ధనంజయా! |
| ఏతత్ | = ఈ గీతాశాస్త్రము | తే | = నీయొక్క |
| త్వయా | = నీచేత | అజ్ఞాన సమ్మోహః | = అజ్ఞానజనితమైన మోహము |
| ఏకాగ్రేణ, చేతసా | = ఏకాగ్రచిత్తముతో | కచ్చిత్, ప్రనష్టః | = పూర్తిగా తొలగిపోయినదా? |
| శ్రుతమ్, కచ్చిత్ | = వినుట జరిగినదా? | | |

**హే పార్థ! త్వయా ఏతత్ ఏకాగ్రేణ చేతసా శ్రుతమ్ కచ్చిత్**

**హే ధనఞ్జయ! తే అజ్ఞాన–సమ్మోహః ప్రనష్టః కచ్చిత్ ।**

తా: ఓ పార్థా! ఈ గీతాశాస్త్రము నీ చేత ఏకాగ్రచిత్తముతో వినుట జరిగినదా? ఓ ధనంజయా! నీయొక్క అజ్ఞానజనితమైన మోహము పూర్తిగా తొలగిపోయినదా?

**బి) కృష్ణార్జునుల సంవాద ఉపసంహారము శ్లోకాలు 72,73**

**పార్థ ఏకాగ్రేణ చేతసా శ్రుతం కచ్చిత్** – ఓ అర్జునా, నా బోధను ఏకాగ్ర చిత్తంతో విన్నావా? అంటే ఉత్తమ అధికారిగా విన్నావా? పూర్తి శ్రద్ధపెట్టి విన్నావా? అర్జునుడు ఒకవేళ పూర్తి శ్రద్ధపెట్టి విన్నాడో లేదో ఎలా తెలుస్తుంది? ఏకాగ్రతతో వింటే అతనికి అజ్ఞానం నశించి, జ్ఞానప్రాప్తి కలుగుతుంది.

**కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రనష్టస్తే ధనంజయ** – ఆత్మ అజ్ఞానం పోయిందా అర్జునా అని ప్రశ్నిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంలో రెండు చోట్లా కచ్చిత్ ప్రశ్నను సూచిస్తుంది. ఏకాగ్రతతో విన్నావా? ఒక ప్రశ్న. అజ్ఞానమూ, అజ్ఞాన జనిత మోహమూ పోయిందా? ఇంకొక ప్రశ్న.

అర్జునునికి కలిగిన మోహం ఏమిటి? దాన్ని మర్చిపోకూడదు. అతనికి భీష్మద్రోణాదులను చూడగానే రాగం, శోకం, మోహం కలిగాయి. మోహంవల్ల ధర్మయుద్ధాన్ని అధర్మయుద్ధం అన్నాడు. అందువల్ల అతని సమస్య యుద్ధం చెయ్యాలా, వద్దా అన్నది.

అర్జునునికి స్వర్గఫలం అయితే ఖచ్చితంగా వస్తుంది. కాని మంచి గురువుకు శిష్యుడు మధ్యమస్థాయిలో ఆగిపోవటం ఇష్టం ఉండదు. అతను ఉత్తమస్థాయిలోకి రావాలి. ఉత్తమస్థాయి శిష్యుడు పొందే ఫలం సాక్షాత్తూ మోక్షం. అర్జునా, నువ్వు ముక్తపురుషుడివా అని అడుగుతున్నాడు? ఆ ప్రశ్నలో అంతర్లీన సందేశం, నేను నీకు

అర్థమయ్యేలా బోధ చేశానా అనే ప్రశ్న దాగివుంది. ఎందుకంటే ఒక విద్యార్థి బాగా నేర్చుకోవాలంటే అందులో ఇటు శిష్యుని పాత్ర, అటు గురువు పాత్ర కూడా ఉంటుంది. అందువల్ల కృష్ణపరమాత్మ అర్జునుడు చెప్పబోయే జవాబుకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. అర్జునుడు ఏం జవాబు చెబుతాడో రాబోయే శ్లోకంలో చూస్తాము.

**అర్జున ఉవాచ**

శ్లో. 73 **నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥**

నష్టః, మోహః, స్మృతిః, లబ్ధా, త్వత్ప్రసాదాత్, మయా, అచ్యుత,
స్థిత, అస్మి, గతసందేహః, కరిష్యే, వచనమ్, తవ ॥

| | | | |
|---|---|---|---|
| అచ్యుత! | = ఓ అచ్యుతా! | లబ్ధా | = పొందబడినది |
| త్వత్ప్రసాదాత్ | = నీ అనుగ్రహమువలన | గతసందేహః, స్థితః, అస్మి | = సందేహములు తొలగిన వాడనైతిని |
| (మమ) మోహః | = నా మోహము | (అతః) | = కనుక |
| నష్టః | = పూర్తిగా తొలగినది | తవ, వచనమ్, కరిష్యే | = నీ ఆజ్ఞను తలదాల్చెదను |
| మయా | = నాచేత | | |
| స్మృతిః | = స్మృతి | | |

**హే అచ్యుత! త్వత్ ప్రసాదాత్ (మే) మోహః నష్టః, మయా స్మృతిః లబ్ధా,**
**(అహం) గత-సన్దేహః స్థితః అస్మి, (ఇదానీం) తవ వచనమ్ కరిష్యే ।**

తా: ఓ అచ్యుతా! నీ అనుగ్రహము వలన నా మోహము పూర్తిగా తొలగినది. నాచేత స్మృతి పొందబడినది. సందేహములు తొలగిన వాడనైతిని కనుక నీ ఆజ్ఞను తలదాల్చెదను.

ఇంతవరకూ అర్జునుడు శ్రద్ధగా విన్నాడు; కృష్ణపరమాత్మ బోధించాడు. ఇప్పుడు కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి ప్రశ్నించాడు. దానికి జవాబుకోసం కుతూహలంగా వేచివున్నాడు. అర్జునుడు కృష్ణా, నేను ఉత్తమశిష్యుణ్ణి, నువ్వు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువి; నువ్వు బాగా బోధించావు. నీ బోధ ఎంత స్పష్టంగా ఉందంటే, నా అజ్ఞానం పటాపంచలయింది; అజ్ఞానజనిత మోహం పోయింది అన్నాడు.

అర్జునుడు ఆ మాట అనకుండా ఉంటే అధ్యాయం 19 వచ్చివుండేది. అర్జునుని ఈ జవాబు ఇంకో అధ్యాయం రావాలో వద్దో తేల్చి చెపుతుంది.

**అర్జున ఉవాచ** – అర్జునుడు జవాబు చెబుతున్నాడు.

**నష్టో మోహః** – పోయింది నా మోహం అంటున్నాడు అర్జునుడు. అర్జునుడు నా మోహం పోయిందని చెప్పి ఉండవచ్చు. కాని అలా మొదలుపెట్టి ఉంటే నా మోహం అన్నాక పోయిందో, పోలేదో అనే శంక ఇంకా మిగులుతుంది. పోయింది అనే పదం వినటానికి ఇంకొక క్షణం అదనంగా పడుతుంది. అందువల్ల అంత బాగా చెప్పిన గురువుకు తను కూడా జవాబు బాగా చెప్పాలి కదా! అందువల్ల పోయింది నా మోహం అన్నాడు;

నా మోహం పోయింది అనకుండా. ఇది కూడా ఒక కళ. చెప్పాల్సిన విషయాన్ని ముందు చెప్పాలి, స్పష్టంగా చెప్పాలి. దానికి ఆంజనేయస్వామి ఉదాహరణను చెబుతారు.

**కంటిని సీతమ్మవారిని** అన్నాడు ఆంజనేయస్వామి. సీతమ్మవారిని కంటిని అని చెప్పివుంటే సీతమ్మవారిని పదం విన్నాక చూశాడా, చూడలేదా అనే ఆత్రుత రాములవారికి ఇంకొక క్షణం పెరుగుతుంది. అది పెంచకుండా ముందు చూశాను అనే పదం వేశాడు. పైగా ఇది ఒక **గొప్ప కమ్యూనికేషన్ స్కిల్**. ఆంజనేయస్వామి వెళ్ళింది ప్రత్యేకించి సీతమ్మవారిని వెతకటానికి. కాబట్టి ఆయన చెప్పాల్సిన జవాబు సీతమ్మవారు దొరికారా, లేదా అనేది. అందువల్ల ఇతరులను ఆత్రుతలో ముంచకుండా ముందుగా 'చూశాను' అన్నాడు.

అలాగే ఇక్కడ కూడా అర్జునుడు మోహంలో ఉన్నాడు. ప్రశ్న అర్థం – నీకు మోహం పోయిందా, లేదా అని. అందువల్ల అర్జునుడు కృష్ణపరమాత్మను ఆత్రుతలో పెట్టకుండా పోయింది మోహం అన్నాడు. అక్కడ ఆంజనేయస్వామి పదం **దృష్టః** – చూశాను; ఇక్కడ అర్జునుని పదం నష్టః – పోయింది. ఏం పోయింది?

మోహః – మోహం పోయింది అంటున్నాడు. అంటే మోహమూ పోయింది, అజ్ఞానమూ పోయింది. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే మోహం పదాన్ని అధ్యాసః అంటారు. అందువల్ల అజ్ఞానమూ పోయింది, అజ్ఞానజనిత అధ్యాసా పోయింది అంటున్నాడు.

అర్జునుని అజ్ఞానం ఎలా పోయింది? ఎవరి అజ్ఞానం అయినా ఒక్క మార్గంవల్లనే పోతుంది. ఏమిటది? జ్ఞానం పొందితేనే అజ్ఞానం పోతుంది. కాంతి వస్తేనే చీకటి తొలుగుతుంది. జ్ఞానమనే కాంతి వస్తేనే, అజ్ఞానమనే చీకటి తొలుగుతుంది. శీర్షాసనం వేసినా, మరేం చేసినా అజ్ఞానం పోదు.

**స్మృతిర్లబ్ధా –** నాచేత జ్ఞానం పొందబడింది. జ్ఞానం అంటే జీవాత్మ పరమాత్మల ఐక్యజ్ఞానం. వేదాంత పరిభాషలో జ్ఞానం అంటే ఎప్పుడూ జీవాత్మ పరమాత్మల ఐక్యజ్ఞానం. దాన్నే స్మృతి అంటారు. మామూలుగా స్మృతి అంటే జ్ఞాపకం; కాని ఇక్కడ స్మృతి అంటే జ్ఞానం.

ఆమాట చెప్పాక, అర్జునునికి ఒక అనుమానం కలిగింది. నేను జ్ఞానం పొందాను, నా అజ్ఞానం తొలిగింది అని చెబితే, అది అహంకారానికి దారి తీస్తుందేమో అనుకున్నాడు. అన్ని గర్వాల్లోకీ విద్యాగర్వం చాలా ప్రమాదకరం. తక్కిన గర్వాలను భంగపరచవచ్చు కాని విద్యాగర్వానికి మందులేదు. అందువల్ల తనకు గర్వం రాలేదని చూపటానికి ఒక మాట వేశాడు.

**త్వత్ప్రసాదాత్** – నేను జ్ఞానం పొంది, నాకు మోహం పోయిందంటే దానికి కారణం ఎవరనుకున్నావు? అది నీ కృపే అంటున్నాడు అర్జునుడు.

భగవద్గీతలో భగవంతుని కృప అంటే క్రమపద్ధతిలో చేసిన జ్ఞానబోధ. ఒక వ్యక్తిమీద కృపను అనేక విధాలుగా కురిపించవచ్చు; చక్షుషా అనుగ్రహః, స్పర్శ అనుగ్రహః. కంటిచూపుతో అనుగ్రహించవచ్చు, స్పర్శతో అనుగ్రహించవచ్చు. కాని జ్ఞానం రావాలంటే మాత్రం ఇటువంటి అనుగ్రహాలు కుదరవు. భగవంతుని ప్రసాదం లేదా అనుగ్రహం క్రమపద్ధతిలో చేసే బోధవల్లనే కుదురుతుంది.

ఈ విషయాన్ని ఇంతకుముందు కూడా చూశాము. ఒకవేళ స్పర్శవల్ల జ్ఞానాన్ని శిష్యునికి పంపగలిగితే, కృష్ణపరమాత్మ యుద్ధభూమిలో కూర్చుని, అంతసేపు అర్జునునికి, అదికూడా ఒక క్రమపద్ధతిలో బోధ చేసుకు వచ్చేవాడా? అర్జునుని తలమీద చెయ్యి వేసి జ్ఞానాన్ని ప్రసరింపజేసి ఉండేవాడు. దీనివల్ల జ్ఞానాన్ని ఒక క్రమపద్ధతిలో బోధించాలని అర్థమవుతున్నది. అలాంటి ఒక దగ్గరదారి ఉండివుంటే, కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ తన విద్యార్థులందరినీ ఒక లైనులో నిలుచోమని, అందరి తలలమీదా తన చేతిని పెట్టి జ్ఞానాన్ని ప్రసరింపజేయవచ్చు. అలా జరగటం లేదు, అలా జరగదు.

అసలు అంతసేపు వింటేనే, శిష్యునికి పూర్తిగా అర్థం కాదు. అలాంటిది కేవలం గురువును **చూస్తేనే** ఎలా వస్తుంది? అందువల్ల గురువు అనుగ్రహం అంటే జ్ఞానబోధ అని అర్థం చేసుకోవాలి. త్వత్ ప్రసాదాత్ అంటే త్వత్ ఉపదేశాత్ అని తీసుకోవాలి. నీ బోధవల్ల నాకు మోహం పోయింది అంటున్నాడు.

**స్థితోఽస్మి గతసందేహః** – ఇప్పుడు యుద్ధం చెయ్యటం ధర్మమా, అధర్మమా అనే సందేహం పోయింది. ఆ సందేహం గతంలో ఉంది. అందువల్లనే నాకు శ్రేయస్కరమైనదేదో బోధించు అన్నాడు అప్పుడు.

**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**

ఇప్పుడు నాకు ఎటువంటి సందేహమూ లేదు. ఈ ధర్మయుద్ధం చెయ్యటానికే నేను నిశ్చయించుకున్నాను.

**తవ వచనం కరిష్యే** – నీ సూచనలు పాటిస్తాను నేను అంటున్నాడు అర్జునుడు.

అర్జునుడు ఒకవేళ అజ్ఞాని అయితే చిత్తశుద్ధి పొందటం కోసం కర్మలు చెయ్యక తప్పదు. ఒకవేళ జ్ఞాని అయితే లోకసంగ్రహంకోసం తను చేసే కర్మలను కొనసాగించాలి. అంటే జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా కర్మలను తప్పించుకోలేడు. ఈ విషయం కృష్ణపరమాత్మ బాగా వివరించి చెప్పాడు. అందువల్ల అర్జునుడు తన నిర్ణయాన్ని చెప్పాడు, నేను ఈ యుద్ధాన్ని చేస్తాను, నా స్వధర్మాన్ని పాటిస్తాను, అది నాకు బాధ కలిగించేదైనా కూడా అన్నాడు.

ఈ జవాబు విని కృష్ణపరమాత్మ తన జన్మ ధన్యమైందని అనుకుని ఉంటాడు. తను ఏ లక్ష్యంకోసం ఈ గీతాబోధ చేశాడో, ఆ లక్ష్యం నెరవేరింది. ఇంక దాని గురించి మళ్ళీ కొత్తగా బోధించేదేమీ లేదు. అందువల్ల కృష్ణపరమాత్మ నిశ్శబ్దం వహించాడు. అర్జునుడు కూడా అంతా అర్థమయింది అన్నాడు కాబట్టి, అతనికి ఇంక అడిగే ప్రశ్నలూ లేవు. అందువల్ల అతనూ మౌనంగా ఉండిపోయాడు. ఇద్దరూ మౌనం వహించటంతో, ఇంక సంజయుడు అందుకొని, గీతా సంవాదాన్ని ముగిస్తాడు.

**సంజయ ఉవాచ**

శ్లో. 74 **ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।**
**సంవాదమిమమశ్రౌషమ్ అద్భుతం రోమహర్షణమ్ ॥**

ఇతి, అహమ్, వాసుదేవస్య, పార్థస్య, చ, మహాత్మనః,
సంవాదమ్, ఇమమ్, అశ్రౌషమ్, అద్భుతమ్, రోమహర్షణమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఇతి | = ఈ ప్రకారముగా | ఇమమ్ | = ఈ |
| అహమ్ | = నేను | అద్భుతమ్ | = అద్భుతమైన |
| వాసుదేవస్య | = శ్రీకృష్ణునియొక్క | రోమహర్షణమ్ | = తనువును పులకింపజేయునట్టి |
| మహాత్మనః | = మహాత్ముడైన | సంవాదమ్ | = సంవాదమును |
| పార్థస్య, చ | = అర్జునుని యొక్క | అశ్రౌషమ్ | = వింటిని |

**ఇతి అహమ్ వాసుదేవస్య మహాత్మనః పార్థస్య చ ఇమమ్ అద్భుతమ్**
**రోమ-హర్షణమ్ సంవాదమ్ అశ్రౌషమ్ ।**

తా: ఈ ప్రకారముగా నేను శ్రీకృష్ణునియొక్క, మహాత్ముడైన అర్జునునియొక్క ఈ అద్భుతమైన తనువును పులకింపజేయునట్టి సంవాదమును వింటిని.

### 6. సంజయుని ముక్తాయింపు శ్లోకాలు 74-78

ఇప్పుడు రంగం మారింది. మనం ఇంక యుద్ధభూమిలో లేము. ధృతరాష్ట్రుని అంతఃపురములోకి వచ్చాము. అక్కడ ధృతరాష్ట్రునికి, సంజయునికి మధ్య సంభాషణతో భగవద్గీత మొదలయ్యింది. సంజయుడు తన దివ్యదృష్టితో యుద్ధభూమిలో జరుగుతున్నదాన్ని ధృతరాష్ట్రునికి వివరిస్తూ వస్తున్నాడు.

**సంజయ ఉవాచ** – సంజయుడు అందుకున్నాడు సంభాషణను. అర్జునుడు యుద్ధభూమిలో ప్రత్యక్షంగా సాక్షాత్తూ కృష్ణపరమాత్మనుంచి గీతాబోధను విన్నాడు. సంజయుడు అక్కడ యుద్ధభూమిలో ప్రత్యక్షంగా లేకపోయినా, తనకు ప్రసాదింపబడిన దివ్యదృష్టితో తను కూడా అదంతా విన్నాడు. వినటమే కాదు, అర్జునుని మనస్సు కూడా చదవగలిగాడు. తను కూడా విన్నందుకు తన కృతజ్ఞతలను ఈ విధంగా వెలిబుచ్చుతున్నాడు.

**ఇతి ఇమమ్ సంవాదమ్ అహమ్ అశ్రౌషమ్** – ఈ విధంగా ఈ అద్భుతమైన సంవాదాన్ని నేను విన్నాను.

**వాసుదేవస్య పార్థస్య** – ఈ సంవాదం ఎవరి మధ్య జరిగింది? వాసుదేవుడు, పార్థుల మధ్య. అంటే కృష్ణార్జునుల మధ్య. వీరిరువురు ఎలాంటివారు?

**మహాత్మనః** – మహాత్ములు, శ్రేష్ఠులు. ఈ మహాత్ముడు విశేషణాన్ని ఇద్దరికీ వాడవచ్చు. కృష్ణపరమాత్మ ఎలాగూ పరమాత్మే. ఆయనకు కొత్తగా చెప్పేదిలేదు. ఇప్పుడు అర్జునుణ్ణి కూడా శ్రేష్ఠుడు అనవచ్చు. ఎందుకంటే అర్జునుడు ఈ బోధను సాక్షాత్తూ భగవంతుని నుంచే విన్నాడు.

**అద్భుతమ్** – అంతేకాదు, ఆ బోధ ఎటువంటిదనుకున్నారు? అద్భుతం. మాటల్లో వర్ణించలేనిది. అద్భుతాలలో అద్భుతం. అంతేకాదు,

**రోమహర్షణమ్** – నా రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి అంటున్నాడు సంజయుడు. ఆ బోధ ఎంత అద్భుతంగా ఉందంటే నా తనువు పులకరించిపోతోంది. ఆనందం కాని, దుఃఖం కాని, భయం కాని దాని సరిహద్దులను దాటితే, అది శరీరంలో కనిపిస్తుందని గీతలోనే చూశాము. అందువల్ల సంజయుడు కృష్ణపరమాత్మ, అర్జునుల మధ్య ఈ సంవాదం ఎంత అద్భుతంగా ఉందంటే, అది విన్నందుకు నా తనువు పులకరించిపోతోంది అంటున్నాడు.

సంజయునికి ఈ దివ్యదృష్టి ఎలా వచ్చింది? వ్యాసాచార్యులవారు ప్రసాదించారు. అందువల్ల తర్వాత శ్లోకంలో ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాడు సంజయుడు.

శ్లో. 75 **వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ ఏతద్గుహ్యమహం పరమ్ ।**
**యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ సాక్షాత్ కథయతః స్వయమ్ ॥**
వ్యాసప్రసాదాత్, శ్రుతవాన్, ఏతత్, గుహ్యమ్, అహమ్, పరమ్,
యోగమ్, యోగేశ్వరాత్, కృష్ణాత్, సాక్షాత్, కథయతః, స్వయమ్ ॥

| | |
|---|---|
| వ్యాసప్రసాదాత్ | = వ్యాసభగవానుని కృపవల్ల దివ్యదృష్టిని పొందినవాడనై |
| అహమ్ | = నేను |
| ఏతత | = ఈ |
| పరమ్, గుహ్యమ్ | = పరమగోప్యమైన |
| యోగమ్ | = యోగమును |
| స్వయమ్ | = స్వయముగా |
| కథయతః | = ఉపదేశించుచున్న |
| యోగేశ్వరాత్ | = యోగేశ్వరుడైన |
| కృష్ణాత్ | = శ్రీకష్ణభగవానునినుండి |
| సాక్షాత్ | = ప్రత్యక్షముగా |
| శ్రుతవాన్ | = వింటిని |

**వ్యాస–ప్రసాదాత్ స్వయమ్ యోగమ్ కథయతః యోగేశ్వరాత్ కృష్ణాత్**
**ఏతత్ పరమ్ గుహ్యమ్ అహమ్ సాక్షాత్ శ్రుతవాన్ ।**

తా: వ్యాసభగవానుని కృపవల్ల దివ్యదృష్టిని పొందినవాడనై నేను ఈ పరమగోప్యమైన యోగమును, గీతను అర్జునునకు స్వయముగా ఉపదేశించుచున్న యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానునినుండి ప్రత్యక్షముగా వింటిని.

కృష్ణపరమాత్మ ఎలాగైతే అర్జునునికి పదకొండవ అధ్యాయంలో దివ్యచక్షువులను ప్రసాదించాడో, అదే విధంగా వ్యాసాచార్యులవారు సంజయునికి దివ్యచక్షువులను ప్రసాదించారు.

**వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్** – ఈ సంవాదాన్ని నేను వినగలిగాను అంటే వ్యాసాచార్యులవారు నాకు ప్రసాదించిన దివ్యచక్షువులవల్ల. అదికూడా ఎటువంటి సంవాదము?

**ఏతత్ పరం గుహ్యమ్** – ఎంతో రహస్యమైన జ్ఞానం ఇది. రహస్యం ఎందుకంటే, ఈ విద్య అంత తేలికగా అందరికీ అందుబాటులో ఉండదు. బ్రహ్మవిద్యను బోధించేవారు చాలా అరుదు, వినేవారు కూడా చాలా అరుదు. అంత అరుదైన బోధ కాబట్టే అది రహస్యం. రహస్యం అయితే పవిత్రమైనది కూడా.

**శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః** – కఠ

బ్రహ్మవిద్యను నేర్చుకోవాలనే తపన అందరికీ ఉండదు. తపన ఉన్నాకూడా నేర్చుకోవటం కుదరదు; ఏదో ఒక ఆటంకం కలుగుతూనే ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, చెన్నైలో ఏ ప్రాంతంలో స్వామీజీ క్లాసులు తీసుకున్నా కూడా, ఆ చుట్టుపక్కల వారు ఎక్కువమంది రారు. ఇక్కడ ఏం జరుగుతుందో చూద్దాము, ఏ ప్రసాదం పంచుతున్నారో చూద్దాము అని కూడా రారు. కాని ఆ తపన ఉన్నవారు ఎక్కడెక్కడి నుంచో వస్తారు. కంచినుంచి కూడా వస్తుంటారు. అందువల్ల రెండు అంశాలు తోడవ్వాలి. అవకాశం, శ్రద్ధ. గంగ ఒడ్డున ఉండేవారు గంగలో స్నానం చేసే సందర్భాలు చాలా తక్కువగా ఉంటాయి.

అందువల్ల అటువంటి అరుదైన అవకాశం తనకు దొరికినందుకు సంజయుడు తన జన్మ ధన్యమైపోయింది అనుకుంటున్నాడు. పైగా అతనికి రెండు విధాల సంతోషం. అతను విన్నది మామూలు జ్ఞానం కాదు; బ్రహ్మజ్ఞానం. విన్నది కూడా మామూలు మనిషినుంచి కాదు, సాక్షాత్తూ ఆ కృష్ణపరమాత్మనుంచి విన్నాడు.

**యోగేశ్వరాత్ కృష్ణాత్** – యోగులకే యోగుడైన, సాక్షాత్తూ భగవంతుడే అయిన కృష్ణపరమాత్మనుంచి విన్నాను.

**యోగమ్** – ఈ యోగాన్ని విన్నాను. ఇక్కడ యోగం అంటే బోధ. ఈ బోధను విన్నాను. ఈ యోగం పదాన్ని గుహ్యం పరమ్ పదంతో కలుపుకోవాలి. **ఏతత్ పరం గుహ్యం యోగమ్.**

**సాక్షాత్ కథయతః స్వయమ్** – సాక్షాత్తూ కృష్ణపరమాత్మే స్వయంగా చేసిన బోధను విన్నాను. అంటే ఇది పరోక్షజ్ఞానం కాదు; ప్రత్యక్షంగా భగవంతునినుంచే అర్జునునికి వచ్చింది.

అర్జునునికే ఎందుకు బోధ చేశాడు? భీష్మ, ద్రోణ, కర్ణ, ధర్మరాజులలో ఎవరికైనా బోధ చేసివుండవచ్చు కదా! దీనికి ఏదో ప్రత్యేకమైన కారణం వెతకటానికి చూస్తారు కొందరు. కారణం చాలా తేలికగా చెప్పవచ్చు. అర్జునుడు అడిగాడు కాబట్టి బోధ చేశాడు.

**శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్**

నిన్ను నేను శరణు వేడుతున్నాను; నీకు శిష్యుణ్ణి అవుతాను, నాకు బోధించు అన్నాడు. అలా ఎవరు అడిగినా, బోధ ఇవ్వబడుతుంది. ఈ బోధను సాక్షాత్తూ కృష్ణపరమాత్మే బోధించాడని చెబుతున్నాడు సంజయుడు. ప్రార్థన శ్లోకాల్లో చూశాము,

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయమ్**

ఇక్కడ కూడా స్వయం పదాన్ని వేశాడు సంజయుడు. **సాక్షాత్ కథయతః స్వయమ్.**

శ్లో. 76 **రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమ్ ఇమమద్భుతమ్ ।**
**కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥**
రాజన్, సంస్మృత్య, సంస్మృత్య, సంవాదమ్, ఇమమ్, అద్భుతమ్,
కేశవార్జునయోః, పుణ్యమ్, హృష్యామి, చ, ముహుర్ముహుః ॥

| | | | |
|---|---|---|---|
| రాజన్! | = ఓ ధృతరాష్ట్ర మహారాజా! | సంవాదమ్ | = గీతా సంవాదమును |
| కేశవార్జునయోః | = శ్రీకృష్ణభగవానునకును, అర్జునునకును మధ్య జరిగిన | సంస్మృత్య, సంస్మృత్య | = పదేపదే స్మరించుచు |
| | | ముహుర్ముహుః | = నిరంతరము |
| ఇమమ్ | = ఈ పరమగోప్యమైన | హృష్యామి | = ఆనందించుచున్నాను |
| పుణ్యమ్ | = పవిత్రమైన | | |
| అద్భుతమ్, చ | = అద్భుతమైనదియగు | | |

**హే రాజన్! (అహం) కేశవ–అర్జునయోః ఇమమ్ పుణ్యమ్ అద్భుతమ్ చ సంవాదమ్ సంస్మృత్య సంస్మృత్య ముహుః ముహుః హృష్యామి ।**

తా: ఓ ధృతరాష్ట్ర మహారాజా! శ్రీకృష్ణభగవానునకును, అర్జునునకును మధ్య జరిగిన ఈ పరమగోప్యమైన, పవిత్రమైన అద్భుతమైనదియగు గీతా సంవాదమును పదేపదే స్మరించుచు నిరంతరము ఆనందించుచున్నాను.

**రాజన్** – ఓ రాజా!

**ముహుర్ముహుః హృష్యామి** – నాకు దక్కిన ఈ అద్భుతమైన అదృష్టాన్ని తలుచుకున్నకొద్దీ నాకు ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను.

**సంస్మృత్య సంస్మృత్య** – పదేపదే గుర్తుకువస్తోంది.

**ఇమమ్ అద్భుతం పుణ్యం సంవాదమ్** – ఈ అద్భుతమైన, పవిత్రమైన ఈ సంవాదం తలుచుకున్నకొద్దీ నా ఆనందం అంచులు దాటుతోంది.

**కేశవార్జునయోః** – కేశవునికి, అర్జునునికి మధ్య జరిగిన ఈ సంవాదం.

సంజయుడు రెండు విషయాలకు మురిసిపోయాడని అంతకుముందు శ్లోకంలో చూశాము. ఒకటి, అత్యంత రహస్యమైన బ్రహ్మవిద్య విన్నందుకు; రెండు, అదీ సాక్షాత్తూ కృష్ణపరమాత్మనుంచే విన్నందుకు. ఈ శ్లోకంలో అంత అరుదైన అవకాశాన్ని తలుచుకున్నకొద్దీ పదేపదే ఆనందం కలుగుతోంది అంటున్నాడు. నిజం కూడా అంతేకదా! మీరు ఏ మానస సరోవరానికో, బదరీనాథ్‌కో, ఏ అమెరికాకో మొదటిసారి వెళితే, ఆ అనుభవాలను పదేపదే తలుచుకుని మురిసిపోతారు. అంత మురిపెంగా ఉంది సంజయునికి ఇప్పుడు. తలుచుకున్నకొద్దీ సంజయుని ఆనందం రెట్టింపు అవుతూ వస్తున్నది.

శ్లో. 77 **తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః ।**
**విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః ॥**

తత్, చ, సంస్మృత్య, సంస్మృత్య, రూపమ్, అతి, అద్భుతమ్, హరేః,
విస్మయః, మే, మహాన్, రాజన్, హృష్యామి, చ, పునః, పునః ॥

| | | | |
|---|---|---|---|
| రాజన్! | = ఓ రాజా! | మే | = నాకు |
| హరేః | = శ్రీకృష్ణునియొక్క | మహాన్, విస్మయః | = అంతులేని ఆశ్చర్యము కలుగుచున్నది |
| తత్, అతి, అద్భుతమ్ | = ఆ అత్యద్భుతమైన | (అహమ్) | = (నేను) |
| రూపమ్, చ | = దివ్యరూపమునే | పునః, పునః | = మాటిమాటికిని |
| సంస్మృత్య, సంస్మృత్య | = పదేపదే స్మరించుట వల్ల | హృష్యామి | = ఆనందమున పొంగిపోవుచున్నాను |

**హే రాజన్! హరేః తత్ చ అతి-అద్భుతమ్ రూపమ్ సంస్మృత్య సంస్మృత్య**

**మే మహాన్ విస్మయః (భవతి), (అహం) పునః పునః హృష్యామి చ ।**

తా: ఓ రాజా! శ్రీకృష్ణునియొక్క ఆ అత్యద్భుతమైన దివ్యరూపమునే పదేపదే స్మరించుటవల్ల నాకు అంతులేని ఆశ్చర్యము కలుగుచున్నది. నేను మాటిమాటికినీ ఆనందమున పొంగిపోవుచున్నాను.

భగవద్గీత మీకు అంతగా నచ్చితే, పద్దెనిమిది అధ్యాయాల్లో, ఏ అధ్యాయం చాలా నచ్చింది? ఈ ప్రశ్న ఒకటి తరచు వినిపిస్తుంటుంది. ఒక పుస్తకం చదివితే, అందులో ఏ భాగం నచ్చిందని అడిగినట్టుగా, ఇందులో ఏ భాగం నచ్చింది అంటారు. ఈ ప్రశ్నను ఎవరూ అడగకుండానే సంజయుడు జవాబు చెబుతున్నాడు. నాకు కృష్ణపరమాత్మ బోధ అంతా నచ్చింది కాని విశ్వరూపదర్శనం ఇంకా నచ్చింది అంటున్నాడు.

**రాజన్** – ఓ రాజా! ధృతరాష్ట్రుణ్ణి సంబోధిస్తూ అంటున్నాడు.

**తత్ చ సంస్మృత్య సంస్మృత్య** – ఆ అధ్యాయాలను వెనక్కి తిరిగి ఒకసారి గుర్తు తెచ్చుకుంటూ అంటున్నాడు. ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. కృష్ణపరమాత్మ, అర్జునునికి బోధ చేసినప్పుడు, **ప్రథమోధ్యాయః** అనో **ద్వితీయాధ్యాయః** అనో ప్రత్యేకించి చెప్పి మరీ బోధించలేదు. మనం తేలిగ్గా అర్థం చేసుకోవటానికి వీలుగా వ్యాసాచార్యులవారు ఆ విభజనను చేసి, కృష్ణార్జున సంవాదానికి ఒక రూపకల్పన చేశారు. అందువల్ల ఇప్పుడు మనం అధ్యాయం పదాన్ని వాడుతున్నాము. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే, నాకు విశ్వరూపదర్శనం నచ్చింది అంటున్నాడు సంజయుడు.

**హరే అత్యద్భుతం రూపమ్** – భగవంతునియొక్క విశ్వరూపం నా మనస్సులో హత్తుకుపోయింది. అనేకరూప ఈశ్వరుడు, అన్ని రూపాల్లో, నామాల్లో నిలిచివున్న ఆ ఈశ్వరుడే నా కళ్ళ ముందు కనబడుతున్నాడు. ఆ విశ్వరూపాన్ని తలుచుకుంటేనే చాలు,

**మహాన్ విస్మయః** – ఎంతో విస్మయం కలుగుతోంది; నేను ఆశ్చర్యపోతున్నాను; ఉత్సాహం ఉరకలు వేస్తోంది; నోటమాట రావటం లేదు అంటున్నాడు. విస్మయం అంటే ఆశ్చర్యం.

**హృష్యామి చ పునః పునః** – ఆ దృశ్యాన్నే పదేపదే గుర్తుకు తెచ్చుకుంటున్నాను. అది గుర్తుకు వచ్చినకొద్దీ ఆనందం, ఆశ్చర్యం ఎక్కువవుతున్నది అంటున్నాడు.

సంజయుడు అంతకు ముందు మూడు శ్లోకాల్లో తన ఆనందాన్ని ప్రకటించాడు; గీత విన్నందుకూ, భగవంతునినుంచి విన్నందుకూ ఆనందంగా ఉంది అన్నాడు; గుర్తు తెచ్చుకుంటున్నకొద్దీ ఆనందం పెరుగుతోంది

అన్నాడు; ఇప్పుడు విశ్వరూపం గుర్తు తెచ్చుకుంటున్నకొద్దీ ఆనందం విస్మయంగా మారుతోంది అంటున్నాడు. అంటే ఎంత చెప్పినా అతని ఆనందం తనివితీరటం లేదు.

శ్లో. 78 **యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥**
యత్ర, యోగేశ్వరః, కృష్ణః, యత్ర, పార్థః, ధనుర్ధరః,
తత్ర, శ్రీః, విజయః, భూతిః, ధ్రువా, నీతిః, మతిః, మమ ॥

| | | | |
|---|---|---|---|
| యత్ర | = ఎక్కడ | తత్ర, శ్రీః | = అచ్చట సిరిసంపదలును |
| యోగేశ్వరః, కృష్ణః | = యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు ఉండునో | విజయః | = సర్వవిజయములును |
| యత్ర | = ఎక్కడ | భూతిః | = సకలైశ్వర్యములును |
| ధనుర్ధరః, పార్థః | = గాండీవధనస్సును చేతపట్టిన అర్జునుడు ఉండునో | ధ్రువా, నీతిః | = దృఢమైన నీతియు |
| | | (ఇతి) | = ఉండును అని |
| | | మమ, మతిః | = నా నిశ్చితాభిప్రాయము |

**యత్ర యోగేశ్వరః కృష్ణః యత్ర ధనుర్ధరః పార్థః, తత్ర శ్రీః, విజయః, భూతిః, ధ్రువా నీతిః (చ ఇతి) మమ మతిః (అస్తి) ।**

తా: ఎచ్చటయితే యోగేశ్వరుడైన శ్రీకృష్ణభగవానుడు ఉండునో, ఎచ్చటయితే గాండీవధనస్సును చేతపట్టిన అర్జునుడు ఉండునో అచ్చట సిరిసంపదలును, సర్వవిజయములును, సకలైశ్వర్యములును, దృఢమైన నీతియు ఉండును అని నా నిశ్చితాభిప్రాయము.

ఈ శ్లోకంతో మొత్తం భగవద్గీతకు ఉపసంహారం పలుకుతున్నాడు సంజయుడు. దీన్ని ఫలశ్రుతిగా తీసుకోవచ్చు.

గీతాబోధ ఎప్పటికీ, అన్నివేళలా ఉంటుంది. ఎక్కడ కృష్ణపరమాత్మను గుర్తు పెట్టుకుంటారో, ఎక్కడ అర్జునుణ్ణి గుర్తుపెట్టుకుంటారో, అక్కడ గీతాబోధ సజీవంగా ఉంటుంది. ఎందుకంటే కృష్ణపరమాత్మను తలుచుకున్నా, అర్జునుణ్ణి తలుచుకున్నా, వెంటనే వారి సంవాదం గుర్తుకు రాకతప్పదు; తద్వారా గీతాబోధ గుర్తుకు రాకతప్పదు.

**యత్ర యోగేశ్వరః కృష్ణః** – ఎక్కడయితే కృష్ణపరమాత్మ ఉన్నాడో. ఎలాంటి రూపంలో? యోగీశ్వరునిగా – అంటే బ్రహ్మవిద్యా గురువు అని అర్థం. కృష్ణపరమాత్మ అనగానే గీతాచార్యునిగా, బ్రహ్మవిద్యా గురువుగా గుర్తుకువస్తాడు.

**యత్ర పార్థో ధనుర్ధరః** – ఎక్కడయితే అర్జునుడు ఉన్నాడో. ఎటువంటి రూపంలో?ధనుర్ధారిగా అంటే గాండీవ ధనుస్సును చేపట్టిన అర్జునునిగా. ధనుస్సు అర్జునుడు చెయ్యాల్సిన స్వధర్మ అనుష్ఠానాన్ని సూచిస్తుంది. అర్జునుని స్వధర్మం ధర్మరక్షణం; ధర్మరక్షణం చెయ్యటానికి కావాల్సింది ధనుస్సు.

ఎక్కడయితే యోగీశ్వరుని వంటి గురువు, స్వధర్మాన్ని పాటించే శిష్యుడు ఉంటారో, అక్కడ గీతాజ్ఞానం పవిత్ర గంగానదిలా ప్రవహిస్తుంది. గీతాజ్ఞానం ఒక నిరంతర ప్రవాహం. కొన్ని వేల సంవత్సరాల క్రిందట మొదలైన

గీతాబోధ, ఈ రోజుకు కూడా కొనసాగుతున్నది. ఎలా చెప్పగలరు? మనం ఇంకా గీత నేర్చుకోగలగటమే గీత కొనసాగుతున్నందుకు నిదర్శనం. స్వామీజీ చేసే గీతాబోధకు వందలకొద్దీ విద్యార్థులు ప్రత్యక్షంగా వెళ్ళి వినటమే గీతా ప్రవాహం నిరాటంకంగా కొనసాగుతున్నదని చెప్పటానికి నిదర్శనం. గీతాబోధయొక్క శ్రేష్ఠత, పవిత్రత చెప్పకనే చెబుతున్నాయి అవి.

ఈ శ్లోకంలో గీత నేర్చుకుంటే కలిగే ఫలశ్రుతిని చెబుతున్నాడు సంజయుడు. గీతను మోక్షశాస్త్రం అంటారని మర్చిపోకూడదు. అందువల్ల గీతను కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా ఉత్తమ విద్యార్థిగా శ్రద్ధగా వింటే అతనికి కలిగే ఉత్తమ, శాశ్వతమైన ఫలం మోక్షం. అది కూడా కృష్ణపరమాత్మే చెప్పాడు. కాని చాలామంది మోక్షం దాకా రారు.

అందువల్ల ఇక్కడ అటువంటి వారికోసం, సంజయుడు మరికొన్ని లౌకికఫలాలను వివరిస్తున్నాడు.

**తత్ర శ్రీర్విజయో భూతిః** – అక్కడ సిరిసంపదలు, విజయం, సకల ఐశ్వర్యాలు, నీతి అన్నీ ఉంటాయి అంటున్నాడు సంజయుడు. శ్రీః అంటే సిరిసంపదలు; విజయః అంటే విజయం లేదా గెలుపు; భూతిః అంటే అన్నిరకాల ఐశ్వర్యాలు; నీతిః అంటే న్యాయం. ఇవన్నీ కలుగుతాయి.

**ఇతి మే మతిః** – ఇది నా నిశ్చితాభిప్రాయము. నేను ఇచ్చే హామీ.

**ధ్రువా** – అదికూడా కొన్ని రోజులకి వచ్చిపోయే ఫలాలు కావు. ఈ సిరిసంపదలు, విజయం, సర్వఐశ్వర్యాలు, నీతి శాశ్వతంగా నిలుస్తాయి అంటున్నాడు సంజయుడు.

అందువల్ల మీకు మోక్షం అవసరం లేకపోయినా గీతాశాస్త్రాన్ని వదలకండి. సిరిసంపదలు కావాలంటే గీతను అధ్యయనం చెయ్యండి; పరీక్షలో పాసవ్వాలంటే గీతను అధ్యయనం చెయ్యండి; ఇంటర్వ్యూలో నెగ్గాలంటే గీతను అధ్యయనం చెయ్యండి; అంటే అధ్యయనం చేసి మాత్రం ఊరుకోకూడదు. మీ ప్రయత్నం కూడా మీరు చెయ్యాలి. మానవ ప్రయత్నం చేసి, ఈశ్వరానుగ్రహంకోసం గీతాశాస్త్రాన్ని అధ్యయనం చేస్తే మిమ్మల్ని విజయలక్ష్మి వరిస్తుంది; ఐశ్వర్యలక్ష్మి వరిస్తుంది. ఎవరు చెబుతున్నారు? సంజయుడు చెబుతున్నాడు.

అది కూడా ఎటువంటి సంజయుడు? స్వయంగా భగవంతుని నోటినుంచి గీతాబోధను విన్న సంజయుడు చెబుతున్నాడు. అందువల్ల గీతాశాస్త్రానికి అంత విలువ ఉంది; అది అంత శ్రేష్ఠమైనది కూడా.

దీనితో మొత్తం భగవద్గీత బోధ కూడా ముగిసింది.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే మోక్షసన్న్యాసయోగో నామ అష్టాదశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు మోక్షసన్న్యాసయోగము అనే పద్దెనిమిదవ అధ్యాయము.

## మోక్షసన్న్యాసయోగము – ఏడు అంశాల విశ్లేషణ

| సంఖ్య | అంశము | సాత్త్విక | రాజసిక | తామసిక |
|---|---|---|---|---|
| 1. | సన్న్యాసం | నియతకర్మలు చేస్తూ వాటి ఫలాలను త్యజించటం (9) | దేహాభిమానం వల్ల నియతకర్మలను త్యజించటం (8) | అజ్ఞానం వల్ల నియతకర్మలను త్యజించటం (7) |
| 2. | జ్ఞానం | నేను ఆత్మను, ఆత్మ ఏకం, నిర్వికారం, అవ్యయం, అవిభక్తం అనే జ్ఞానం (20) | నేను మనస్సును, ఎన్ని జీవులు ఉంటే అన్ని జీవాత్మలు ఉన్నాయనే జ్ఞానం (21) | నేను శరీరాన్ని, ఎన్ని జీవులు ఉంటే అన్ని శరీరాలు ఉన్నాయనే నిర్హేతుకమైన, అల్పజ్ఞానం (22) |
| 3. | కర్మ | నియతకర్మలను, బంధం పెంచుకోకుండా, రాగద్వేషాలకు అతీతంగా, ఫలాపేక్ష లేకుండా చేసే కర్మ (23) | లౌకిక విజయాల కోసం, అహంకార దర్పంతో, ఒత్తిడి, ఆందోళనలకు లోనై చేసే కర్మ (24) | తన సామర్థ్యాన్ని చూసుకోకుండా, పర్యవసనాలు చూడకుండా, ప్రణాళిక లేకుండా, అనాలోచితంగా, అజ్ఞానంతో చేసే కర్మ (25) |
| 4. | కర్తా | సంగత్వం, అహంకారం లేని; పట్టుదల, ఉత్సాహం ఉన్న, జయాపజయాలకు చలించని కర్త (26) | రాగం, విజయాల మీద మక్కువ, లోభత్వం, హింసాత్మకత్వం, అనుమానం, హర్షశోకాలు ఉన్న కర్త (27) | యోగి కాని వ్యక్తి, ప్రాకృత పురుషుడు, మూర్ఖుడు, మాయావి, ఇతరుల పనికి అడ్డం వచ్చే వ్యక్తి, సోమరిపోతు, పనిని వాయిదా వేసే కర్త (28) |
| 5. | బుద్ధి | ధర్మాధర్మాలు, కార్యాకార్యాలు, భయాభయాలు, బంధమోక్షాల గురించిన విచక్షణ ఉన్న బుద్ధి (30) | ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన పూర్తిజ్ఞానం లేని బుద్ధి (31) | ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన విచక్షణ అసలు లేకపోయినా అంతా నాకే తెలుసు అనుకునే బుద్ధి (32) |
| 6. | ధృతి | మనస్సు, ప్రాణం, ఇంద్రియాలు చేసే క్రియలను ఆధ్యాత్మిక చింతన వైపు యోగా ద్వారా ఏకీకృతం చేసే ధృతి (33) | ధర్మార్థకామాల వెంట, లౌకిక విజయాల కోసం, తీవ్రమైన కోరికతో పరుగులు తీస్తూనే ఉండేలా చేసే ధృతి (34) | పగటికలలు కంటూ, భయం, శోకం, విషాదం, మదం అనే గుణాలను వదిలిపెట్టకుండా చేసే ధృతి (35) |
| 7. | సుఖం | మొదట విషతుల్యంగా అనిపించినా, చివరికి అమృతంలా ఉండి, ఆత్మజ్ఞానం వల్ల కలిగే ఆనందం (37) | మొదట అమృతంలా ఉండి, తర్వాత విషతుల్యంగా ఉండే విషయవస్తువుల వల్ల కలిగే సుఖం (38) | మొదట, చివర కూడా మనస్సును మోహంలో పడవేసి, నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యాల వల్ల కలిగే సుఖం (39) |

## స్వాభావిక కర్మలు

| శ్లోకం | వర్ణము | వివరణ |
|---|---|---|
| 42 | బ్రాహ్మణులు | శమము, దమము, తపస్సు, శౌచము, క్షాంతి, ఆర్జవము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము |
| 43 | క్షత్రియులు | శౌర్యము, తేజస్సు, ధృతి, దక్షత, యుద్ధంలో వెన్ను చూపకపోవటం, దానగుణం, నాయకత్వపు లక్షణం |
| 44 | వైశ్యులు | వ్యవసాయము, గోశాల, వాణిజ్య వ్యవహారాలు చూడటం |
| 44 | శూద్రులు | అన్ని వర్ణాల వారికి పరిచర్యలు చెయ్యటం |

## వర్ణ విభజన – గుణపరంగా

| శ్లోకం | వర్ణము | పేరు | వివరణ |
|---|---|---|---|
| 42 | బ్రాహ్మణుడు | సరత | సత్త్వగుణం ప్రధానంగా, తక్కువ స్థాయిలో రజోగుణం, ఇంకా తక్కువ స్థాయిలో తమోగుణం ఉంటాయి |
| 43 | క్షత్రియుడు | రసత | రజోగుణం ప్రధానంగా, తక్కువ స్థాయిలో సత్త్వగుణం, ఇంకా తక్కువ స్థాయిలో తమోగుణం ఉంటాయి |
| 44 | వైశ్యుడు | రతస | రజోగుణం ప్రధానంగా, తక్కువ స్థాయిలో తమోగుణం, ఇంకా తక్కువ స్థాయిలో సత్త్వగుణం ఉంటాయి |
| 44 | శూద్రుడు | తరస | తమోగుణం ప్రధానంగా, తక్కువ స్థాయిలో రజోగుణం, ఇంకా తక్కువ స్థాయిలో సత్త్వగుణం ఉంటాయి |

## కర్మయోగ, జ్ఞానయోగ విభజనల వివరాలు

| శ్లోకం | అంశము | వివరణ |
|---|---|---|
| | **కర్మయోగము గురించి** | |
| 1-12 | కర్మయోగము | సాత్త్విక సన్న్యాసం పరంగా |
| 41-49 | కర్మయోగము | స్వాభావిక కర్మల పరంగా |
| 56-62 | కర్మయోగము | ఈశ్వరానుగ్రహం పరంగా |
| 65 | కర్మయోగము | చరమ శ్లోకంగా |
| | **జ్ఞానయోగము గురించి** | |
| 13-17 | జ్ఞానయోగము | ఆత్మ నిర్వచనం పరంగా |
| 50-55 | జ్ఞానయోగము | నిదిధ్యాసన పరంగా |
| 66 | జ్ఞానయోగము | చరమ శ్లోకంగా |

# అధ్యాయము 18 - మోక్షసన్న్యాసయోగము సారాంశము

భగవద్గీతలో రెండవ అధ్యాయము, పద్దెనిమిదవ అధ్యాయము చాలా ముఖ్యమైన అధ్యాయాలు. ఎందుకంటే ఈ రెండు అధ్యాయాలలోనూ కృష్ణపరమాత్మ మొత్తం గీతాసారాంశాన్ని సంగ్రహంగా బోధించాడు. కాకపోతే రెండింటి మధ్య సూక్ష్మభేదం ఉంది. రెండవ అధ్యాయంలో చెప్పిన సంగ్రహం-ఉపోద్ఘాతం. పద్దెనిమిదవ అధ్యాయంలో చెప్పిన సంగ్రహం-ఉపసంహారం. మూడవ అధ్యాయం నుంచీ, పదిహేడవ అధ్యాయం వరకూ ఆ సారాన్ని విస్తారంగా చెప్పుకువస్తాడు. దీన్ని మళ్ళీ టూకీగా చూద్దాము.

**అధ్యాయము 2 - ఉపక్రమ సంక్షేపము**
**అధ్యామయు 3-17 - విస్తారము**
**అధ్యాయము 18 - ఉపసంహార సంక్షేపము**

ఇదీ గీతాబోధనాశైలి. ఈ అంశాన్ని ఇంతకుముందు కూడా చూశాము. గీతాబోధ వార్తలు చదివే విధానానికి దగ్గరగా ఉంటుంది. వార్తలు చదివేటప్పుడు ముందు ముఖ్యాంశాలు చెప్పి, వాటిని వివరించి, మళ్ళీ ముగించేముందు ముఖ్యాంశాలు మరోసారి చెబుతారు.

పద్దెనిమిదవ అధ్యాయములో కృష్ణపరమాత్మ ముఖ్యాంశాలను మళ్ళీ బోధించాడు కాబట్టి ఈ అధ్యాయం చాలా ముఖ్యమైన అధ్యాయం. అంతేకాదు, అన్నింటికన్నా ఇది చాలా పెద్ద అధ్యాయం కూడా. ఇందులో 78 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయం పేరు **మోక్షసన్న్యాసయోగము**.

ఈ అధ్యాయానికీ, ఐదవ అధ్యాయానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. ఐదవ అధ్యాయమూ, ఈ అధ్యాయమూ కూడా సన్న్యాసయోగమే. కాని రెండింటి మధ్య ఉన్న సూక్ష్మభేదాన్ని సూచించటానికి, వాటి ముందు చిన్న విశేషణ పదాలు కలుపబడ్డాయి. కాని వాటిని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఐదవ అధ్యాయాన్ని కర్మసన్న్యాసయోగము అంటారు. దాని అర్థం - కర్మను సన్న్యసించు. ఈ అధ్యాయం పేరు మోక్షసన్న్యాసయోగము. కర్మసన్న్యాసయోగము అంటే కర్మను సన్న్యసించు అన్నారు కదా, మోక్షసన్న్యాసయోగము అంటే ఇప్పుడు మోక్షాన్ని సన్న్యసించాలా? ఇంకా మోక్షాన్ని పొందనేలేదు, ఇంక సన్న్యసించేదెక్కడ? మోక్షసన్న్యాసయోగము అంటే మోక్షం కొరకు సన్న్యసించటం. అంతేకాని మోక్షాన్ని సన్న్యసించటం కాదు.

కర్మసన్న్యాసయోగము - కర్మ**ను** సన్న్యసించటం
మోక్షసన్న్యాసయోగము - మోక్షము **కొరకు** సన్న్యసించటం

అందువల్ల పదాలను విడదీసేటప్పుడు జాగ్రత్తగా విడదీయాలి. మోక్షాన్ని అనకూడదు; మోక్షంకోసం అనాలి.

ఈ నేపథ్యంతో ఈ పద్దెనిమిదవ అధ్యాయముయొక్క సారాంశాన్ని చూద్దాము. ఈ అధ్యాయములో ప్రధానంగా ఐదు అంశాలు ఉన్నాయి. అవి -

**1. సాత్త్విక సన్న్యాసయోగము - శ్లోకాలు 1-12**
**2. జ్ఞానయోగము - శ్లోకాలు 13-17**
**3. ఆరు అంశాల విశ్లేషణ - శ్లోకాలు 18-40**
**4. కర్మయోగము, జ్ఞానయోగము - శ్లోకాలు 41-66**
**5. ఉపసంహారము - శ్లోకాలు 67-78**

ఇప్పుడు ఒక్కొక్క అంశాన్ని విపులంగా చూద్దాము.

**1. సాత్త్విక సన్న్యాసయోగము - శ్లోకాలు 1-12**

కృష్ణపరమాత్మ సన్న్యాసము అనే ఈ అంశం గురించి మాట్లాడాల్సి వచ్చింది. ఎందుకంటే అర్జునుడు సన్న్యాసం గురించి ఒక సందేహాన్ని ప్రవేశపెట్టాడు. 'సన్న్యాసం పదానికీ, త్యాగం పదానికీ మధ్య ఉన్న భేదం ఏమిటి?' అడిగాడు అర్జునుడు. నిఘంటువులో మీరు చూశారంటే, రెండు పదాలకీ అర్థం ఒకటే ఉంటుంది. ఆ అర్థం త్యజించటం. అందువల్ల ఆ పదాలు ఒకటేనా, వాటి మధ్య భేదం ఉందా అన్నాడు. ఇంకో విధంగా చెప్పాలంటే, సన్న్యాసం అంటే ఏమిటి అనేది ప్రశ్న?

దానికి కృష్ణపరమాత్మ వివరంగా చెప్పుకొచ్చాడు 2-12 శ్లోకాల్లో. కృష్ణపరమాత్మ దృష్టిలో సన్న్యాసం, త్యాగం పదాల మధ్య భేదం లేదు. అవి రెండూ పర్యాయపదాలు.

సన్న్యాసం = త్యాగం = త్యజించటం.

సరే అయితే, త్యజించటం అంటే ఏమిటి? త్యజించటం పదానికి రెండు అర్థాలున్నాయి. వాటిని ముఖ్యసన్న్యాసం అనీ, గౌణసన్న్యాసం అనీ అంటారు. ముఖ్య సన్న్యాసం అంటే సన్న్యాసాశ్రమ ధర్మాన్ని స్వీకరించటం. ఇది అందరికీ నిర్దేశించరు. ఈ ముఖ్య సన్న్యాసాన్ని ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హతలు అన్నీ ఉన్నవ్యక్తికే ఇస్తారు. అంటే అతను చిత్తశుద్ధి పొందివుండాలి; సంస్కరించబడివుండాలి; సంసిద్ధుడై వుండాలి; సాధనచతుష్టయ సంపన్నుడై ఉండాలి. అటువంటి అధికారికి మాత్రమే ముఖ్యసన్న్యాసాన్ని నిర్దేశిస్తుంది శాస్త్రం.

ఈ ముఖ్యసన్న్యాసంలో అన్నింటినీ అక్షరాలా త్యజించాలి. అంటే కుటుంబాన్ని త్యజించాలి; సమాజాన్ని త్యజించాలి; అనుబంధాలను త్యజించాలి; ఆస్తిపాస్తులను త్యజించాలి; ఉద్యోగాన్ని త్యజించాలి. అంతేకాదు, అదనంగా ఇంకొక జత దుస్తులు కూడా ఉండకూడదు; బ్యాంకు బాలెన్సు అసలే ఉండకూడదు; ఇలా అన్నింటినీ, అందరినీ వదులుకోవాల్సి రావటాన్ని ముఖ్యసన్న్యాసం అంటారు. దీనికి ఆధ్యాత్మికంగా చాలా ఉన్నతి సాధించి ఉండాలి.

కృష్ణపరమాత్మ దృష్టిలో అర్జునునిలో ఈ పరిణితి ఇంకా రాలేదు. అతను మొదటి అధ్యాయంలో తన మోహాన్ని ప్రదర్శించాడు. తనవారు అనుకుంటున్నవారినుంచి ఎడబాటును ఊహించుకుంటేనే అతను భరించలేకపోయాడు. భీష్మద్రోణులు మరణిస్తారని ఊహించుకుంటేనే భరించలేని వ్యక్తి, శాశ్వతంగా అందరినీ వదిలి సన్న్యాసానికి ఎలా వస్తాడు? అందువల్ల అర్జునుడు ముఖ్యసన్న్యాసానికి సిద్ధంగా లేడని అతని మనస్థితి

చెబుతున్నది. అందువల్ల కృష్ణపరమాత్మ ముఖ్యసన్న్యాసం అంశం గురించి ఇక్కడ చెప్పలేదు. ఆ భాగాన్ని నిశ్శబ్దంగా వదిలివేశాడు. ముఖ్యసన్న్యాసాన్ని ఆశ్రమసన్న్యాసం అంటారు లేదా కాషాయవస్త్ర సన్న్యాసం అంటారు. దీని గురించి కృష్ణపరమాత్మ కావాలని చెప్పలేదు. అది కాకుండా **గౌణసన్న్యాసం** గురించి ఈ మొదటిభాగంలో చెప్పాడు. గౌణసన్న్యాసం అంటే ఆంతర్గత సన్న్యాసం.

ఈ భాగంలో కృష్ణపరమాత్మ అర్జునునికి గట్టిగా సలహా ఇచ్చాడు. ఏమని? ఎన్నడూ నీ కుటుంబాన్ని వీడకు; నీ ధర్మాన్ని వీడకు; నీకున్న వేటినీ వీడకు అన్నాడు. అర్జునుడు ఒకవేళ ధర్మాన్ని వీడితే, అతని విషయంలో అది పొరపాటు అవుతుంది. ఎందుకంటే అతను అప్పుడే సన్న్యాసం స్వీకరించటానికి సిద్ధంగా లేడు. సిద్ధంగా లేకుండా, సన్న్యాసం స్వీకరిస్తే అది రాజసిక సన్న్యాసమో లేదా తామసిక సన్న్యాసమో అవుతుంది. పరిపక్వత చెందని మనస్సు సన్న్యాసం స్వీకరిస్తే, దాన్ని **పలాయనవాదం** అంటారు. కృష్ణపరమాత్మ దాన్ని రాజసిక, తామసిక సన్న్యాసం అన్నాడు.

అందువల్ల అర్జునుణ్ణి సన్న్యాసం స్వీకరించవద్దు అన్నాడు. అతను కురుక్షేత్రంలో ఉండి యుద్ధం చెయ్యాలి. గృహస్థాశ్రమంలో ఉండి ధర్మాన్ని నిర్వర్తించాలి. కర్తగా తన ధర్మాన్ని నెరవేర్చాలి. రాగద్వేషాలను త్యజించాలి. రాగద్వేషాలు ఉంటే ఎదుటివారినుంచి ఏదో ఒకటి ఆశిస్తాడు. కుటుంబంనుంచి, సమాజంనుంచి ఆశిస్తాడు. ఇవి అతన్ని బంధంలో పడవేస్తాయి. ఎప్పుడైతే అవి బంధిస్తాయో అప్పుడే అవి మనస్సును కల్లోలపరుస్తాయి.

సంకల్పాన్ని వదిలివేయాలి. సంకల్పం అంటే బంధించే కర్మఫలాన్ని ఆశించటం. అంటే గాలిలో మేడలు కట్టటం, భవిష్యత్తును ఊహించుకోవటం. అబ్బాయి భవిష్యత్తు గురించి ఊహించుకోవటం. ఇవన్నీ బంధంలో పడవేసే ఆశలు. ఇటువంటి సంకల్పాన్ని వదిలివేయటాన్ని సాత్త్విక సన్న్యాసం అంటారు.

**సాత్త్విక సన్న్యాసయోగమంటే నిత్యకర్మ ఫలాలను త్యజించటం.** అంటే అతను సమాజంలో ఉంటూ, నిత్యనైమిత్తిక కర్మలను చేస్తూ, ఆ చేసిన కర్మలకు వచ్చే ఫలాలమీద ఆశ పెట్టుకోకుండా దాన్ని త్యజించాలి. కర్మఫలాలమీద ఆశను త్యజించాలి అంటే రాగద్వేషాలను త్యజించాలి. దీన్ని సాత్త్వికకర్మ సన్న్యాసం అంటారు.

**అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥** – 18.12

ఇలా సాత్త్విక సన్న్యాసం స్వీకరిస్తే, మహాభారతయుద్ధం చేసినప్పుడు విజయం పొందినా, పొందకపోయినా అతను చలించడు; భయాందోళనలు కలగవు. అటువంటి సమత్వాన్నే సన్న్యాసం అంటారు. దీన్ని గౌణసన్న్యాసం అంటారు.

సాధారణంగా ఏదైనా కర్మ చేస్తే దాని ఫలం గురించి ఆందోళన ఉంటుంది కదా! కాని కర్మ చెయ్యి, కర్మఫలం గురించిన ఆందోళనను త్యజించు అన్నాడు కృష్ణపరమాత్మ. దాన్ని సాత్త్విక సన్న్యాసం అన్నాడు.

సాత్త్విక సన్న్యాసం = కర్మఫలత్యాగ భావన

కర్మఫలత్యాగం చెయ్యాలంటే ఎలా? మళ్ళీ కర్మయోగంలోకి వెళ్ళాలి. కర్మఫలత్యాగం అంటే వచ్చిన కర్మఫలాన్ని ఈశ్వరప్రసాద భావనతో స్వీకరించటం.

ఆ విధంగా 1-12 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ మళ్ళీ కర్మయోగం గురించి మాట్లాడాడు. కాకపోతే ఇందులో కర్మఫలత్యాగం పరంగా మాట్లాడాడు.

దాన్ని సాత్త్విక సన్న్యాసం అన్నాడు. సాత్త్విక సన్న్యాసాన్ని సంకల్ప త్యాగపూర్వక స్వధర్మ అనుష్ఠానం అని కూడా అనవచ్చు. ఇది **మొదటి అంశము - సాత్త్వికసన్న్యాసయోగము.**

## 2. జ్ఞానయోగము - శ్లోకాలు 13-17

ఇంతకుముందు భాగాన్ని కర్మయోగం అంటే ఈ రెండవ భాగాన్ని జ్ఞానయోగం అనవచ్చు. ఆత్మస్వరూపం యొక్క నిర్వచనాలను అనేక అధ్యాయాలలో చూశాము. ఇక్కడ కృష్ణపరమాత్మ మళ్ళీ చెప్పిన అంశాలు - ఆత్మ చైతన్యం, ఆత్మ అకర్తా, అభోక్తా.

కృష్ణపరమాత్మ అంతకు ముందు కూడా వివరించాడు. ప్రతి ఒక్కరిలోనూ రెండు అంశాలు ఉంటాయి. అవి చేతన అంశ, అచేతన అంశ. చేతన అంశను చైతన్యం లేదా ఆత్మ అంటారు; అచేతన అంశను అనాత్మ అంటారు.

చెతన్యం- చైతన్యం అనగానే చైతన్యంయొక్క ఐదు అంశాలను గుర్తు తెచ్చుకోవాలి. చైతన్యం స్వతంత్రంగా ఉండి, శరీరానికి చైతన్యాన్ని ఇస్తుంది. ముఖ్యమైన విషయం, శరీరం రాలిపోయినా చైతన్యం పడిపోదు.

మొదటి దశ - ఈ చైతన్యాన్ని మీ శరీరంలో గుర్తించాలి. మీకేదైనా సందేహం ఉంటే, మీ శరీరాన్ని గిల్లి చూసుకోండి. వెంటనే నొప్పి కలిగిందంటే, మీరు ఆ చైతన్యాన్ని గుర్తించినట్టే.

రెండవ దశ - ఆ చైతన్యంతో మమేకం చెందటం నేర్చుకోవాలి. ఇన్నాళ్ళూ 'నేను ఎవరు అంటే నేను శరీరం,' అంటున్నారు. ఇప్పుడు 'నేను శరీరం కాదు, ఈ శరీరం నాకు తాత్కాలికంగా ఇవ్వబడిన వస్త్రం,' అంటారు.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి** - 2.22

'ఈ శరీరాన్ని అది పుట్టినప్పటినుంచి ధరిస్తున్నాను; అది జీర్ణించినప్పుడు దీన్ని వదిలేసి, ఇంకొక శరీరాన్ని ధరిస్తాను. శరీరం రాలిపోయినా, నేను శాశ్వతంగా ఉంటాను.' ఇది చైతన్యం లక్షణం. అంటే చైతన్యం శాశ్వతం.

**అకర్తా, అభోక్తా** - చైతన్యం అకర్తా, అభోక్తా. చైతన్యం ఏ పని చెయ్యదు; అందువల్ల దానివల్ల కలిగే ఫలాన్ని కూడా అనుభవించదు. ఆత్మ అకర్తా, అభోక్తా అని నిరూపించటానికి, కర్మలన్నీ అనాత్మవల్లనే జరుగుతాయని చూపించాడు కృష్ణపరమాత్మ.

**పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।**

**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥** - 18.13

**అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।**

**వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥** - 18.14

**శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః ।**
**న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥** – 18.15
**తత్రైవం సతి కర్తారమ్ ఆత్మానం కేవలం తు యః ।**
**పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః ॥** – 18.16
**యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**
**హత్వాపి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే ॥** – 18.17

ఇవన్నీ చాలా ముఖ్యమైన శ్లోకాలు. కర్మలను చేసేవి ఐదు కరణాలు అని చెప్పి, వాటి పేర్లను చెప్పుకువచ్చాడు. ఐదు కరణాలలో నాలుగు, నాలుగు కోశాలు. అవి – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం. ఐదవ కరణం – హిరణ్యగర్భ తత్త్వము.

కాంతి సమక్షంలో ఈ గదిలో పనులు జరుగుతాయి; కాని కాంతి ఏమీ పని చెయ్యదు. కాంతి సమక్షంలో నా చెయ్యి కదులుతున్నది కాని, నా చేతిని ప్రకాశింపజేసే కాంతి అసలు కదలదు.

**అకర్తృత్వ, అభోక్తృత్వ చైతన్యమ్ అహమస్మి**

నేను అకర్తా, అభోక్తా అయిన చైతన్యాన్ని. ఎప్పుడైతే నేను ఈ జ్ఞానం పొందుతానో, అప్పుడే ఈ సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు నన్ను బాధించలేవు. ఈ కర్మలన్నీ కర్మఫలాలు. నేను కర్మే చెయ్యనప్పుడు, కర్మవల్ల వచ్చే ఫలాలు నాకెలా అంటుతాయి? ఎవరు కర్మ చేస్తే వారే కర్మఫలాన్ని అనుభవించాలి. ఆత్మగా నేను కర్తనూ కాదు; అందువల్ల భోక్తనూ కాదు. అంటే నేను నిత్యముక్త స్వరూపుడను; నేను పుణ్యాపాప అతీతుడను; సంచిత, ఆగామి, ప్రారబ్ధ వర్జితుడను; ఉత్తమ, మధ్యమ, అధమ జన్మరహితుడను. జన్మలు కూడా నాకు అంటవు. ఎందుకంటే జన్మలు కర్మలవల్ల ఏర్పడతాయి. నేను కర్మ చేస్తేనే కదా, నాకు జన్మంటూ కలిగేది. సరే జన్మలేదు, పునర్జన్మ ఉంటుందా? జన్మే లేకపోతే పునర్జన్మ ప్రసక్తి ఎక్కడినుంచి వస్తుంది? అందువల్ల పునర్జన్మ కూడా లేదు. అందువల్ల నేను నిత్యముక్తుడను. ఈ జ్ఞానాన్ని ఆత్మస్వరూపజ్ఞానము అంటారు. ఈ ఆత్మస్వరూప జ్ఞానాన్ని రెండవ అధ్యాయంలో 12–25 శ్లోకాల్లో వివరంగా చర్చించాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ మళ్ళీ 13–17 శ్లోకాల్లో చర్చించాడు.

ఇది **రెండవ అంశము – జ్ఞానయోగము.**

3. **ఆరు అంశాల విశ్లేషణ – శ్లోకాలు 18–40**

కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో ఆరు అంశాలను విశ్లేషించుకుంటూ వచ్చాడు. ఈ ఆరూ గీతాబోధను సమగ్రంగా సూచిస్తాయి. అందువల్ల కృష్ణపరమాత్మ చాలా తెలివిగా ఆరు అంశాలను ఎన్నుకున్నాడు. ఈ ఆరు అంశాలూ సరిగ్గా అర్థమయితే, గీతాబోధ మొత్తం అర్థం అయిందని చెప్పవచ్చు. ఆ ఆరు అంశాలు – జ్ఞానం, కర్మ, కర్త, బుద్ధి, ధృతి, సుఖం. మళ్ళీ ఈ ఆరు అంశాలను విడివిడిగా తీసుకుని, వాటిని సాత్త్విక, రాజసిక, తామసిక గుణాల ప్రకారం విభజించుకువచ్చాడు.

ఉదాహరణకు జ్ఞానంలో సాత్త్వికజ్ఞానం అంటే ఏమిటి, రాజసిక జ్ఞానం అంటే ఏమిటి, తామసిక జ్ఞానం అంటే ఏమిటి వివరించాడు ఒక్కొక్క శ్లోకంలో.

అందులో సాత్త్వికజ్ఞానం అంటే నేను ఆత్మను; ఆత్మ ఏకం, నిర్వికారం, అవ్యయం, అవిభక్తం అనే జ్ఞానం. అలా ఆరు అంశాలనూ మూడేసి తెగల కింద చెప్పుకుంటూ వచ్చాడు.

ఇది సారాంశం కాబట్టి వాటన్నిటినీ మళ్ళీ వివరంగా చూడబోవటం లేదు (కావాలంటే సారాంశం ముందు ఇచ్చిన పట్టికలో చూడవచ్చు).

ఈ విభజన గురించిన ఒక సాధారణ విశ్లేషణను అంతకుముందు కూడా చూశాము. మళ్ళీ చూద్దాము. సాత్త్విక లక్షణం అంటే ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడే అంశం ఏదైనా సరే. అది ఆహారం అవవచ్చు; కర్మ అవవచ్చు; బుద్ధి అవవచ్చు. ఏ రంగంలో తీసుకున్నా, ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడితే దాన్ని సాత్త్వికగుణం అనవచ్చు.

తామసిక గుణం అంటే ఏమిటి? పూర్తిగా దీనికి భిన్నమైన గుణం. ఆధ్యాత్మిక పతనానికి తోడ్పడుతుంది అది. మనిషి ఆధ్యాత్మికంగా ఎదగకపోగా, ఇంకా కిందికి దిగజారిపోతాడు. అది ఆహారం అవనీ, దుస్తులు అవనీ, ఆఖరికి అనుబంధం అవనీ, అవి సరిగ్గా లేకపోతే, ఆధ్యాత్మికంగా కిందికి లాగుతాయి.

రాజసిక గుణం అంటే ఏమిటి? లౌకిక ఎదుగుదలకు తోడ్పడేది ఏదైనా రాజసిక గుణంలోకి వస్తుంది. ఈ రాజసిక గుణం, లౌకికంగా విజయాన్ని చేకూరుస్తుంది కాని ఆధ్యాత్మికంగా ఉన్నతిని ఇవ్వదు. కొంతలో కొంత మేలు ఏమిటంటే అది తామసిక గుణంలాగా కిందికీ లాగదు. అలాగని మేలూ చెయ్యదు. సాత్త్విక గుణంలాగా పైకి తీసుకువెళ్ళదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని సామెత. అలా ఎక్కడ ఉన్న వ్యక్తిని అక్కడే ఉంచుతుంది. అక్కడే ఉంచేది ఆధ్యాత్మికంగానే; లౌకికంగా ఎన్నో నిచ్చెనమెట్లు ఎక్కేస్తాడు. తన సంస్థలను విస్తరింపజేస్తాడు, ఎన్నో భవంతులు, కార్లు కొంటాడు. వీటిలో అంత తలమునకలుగా మునిగిపోతాడు కాబట్టి ఆధ్యాత్మికతకు తీరిక ఉండదు;

**బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావత్ చింతాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥** – భజగోవిందం 7

ప్రపంచంలో ఇతను అందరికన్నా ఐశ్వర్యవంతుడు కాని దైవచింతనకు తీరికలేదు. పూజ చెయ్యటానికి తీరికలేదు, జపం చెయ్యటానికి తీరికలేదు, గీతాబోధకు వెళ్ళే తీరిక అసలే లేదు. ఇలా లౌకికంగా విజయం సాధించి, ఆధ్యాత్మిక ఎదుగుదల లేని జీవనవిధానాన్ని రాజసిక జీవనవిధానం అంటారు.

మళ్ళీ ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడేది సాత్త్వికగుణం; ఆధ్యాత్మిక ఎదుగుదల లేకుండా ఉన్నచోటే ఆపివేసేది రాజసిక గుణం; ఆధ్యాత్మిక పతనానికి దారితీసేది తామసిక గుణం.

ఈ మూడు స్థాయిలూ అర్థమయితే, మీ జీవనవిధానాన్ని దీనికి అనుగుణంగా మలుచుకోవచ్చు. ముందుగా ఆధ్యాత్మిక పతనానికి దారితీస్తున్న పనులేమైనా చేస్తుంటే, వెంటనే వాటిని ఆపేయాలి. ఆఖరికి సుఖం కూడా,

మీరు అనుభవిస్తున్నది తామసిక సుఖం అయితే, దాన్ని వదులుకోవాలి. ముందుగా దీన్ని గమనించుకోవాలి. ఏదైనా వ్యాపారం చేస్తున్నప్పుడు కూడా, మీరు గమనించుకోవాల్సిన మొట్టమొదటి దశ ఏమిటి? ఆ వ్యాపారంలో లాభం వచ్చినా, రాకపోయినా మీరు పెట్టిన పెట్టుబడి నష్టపోకుండా చూసుకోవాలి.

మనిషిగా జన్మనెత్తగలగటమే గొప్ప వరం. ఆ వరాన్ని మీరే చేజేతులా నాశనం చేసుకోకూడదు. తామసిక ప్రవృత్తికీ, జంతుప్రవృత్తికీ ఎక్కువ భేదం లేదు. దాంట్లోనే మనిషి మునిగితేలితే, ఇతనికా నేను మనుష్యజన్మను ఇచ్చానని భగవంతుడు బాధపడిపోతాడుట. అంతేకాకుండా, వచ్చే జన్మలో సరే, జంతువుగానే బ్రతుకు. అప్పుడు మనిషిగా బ్రతకలేదనే అపరాధభావన కూడా ఉండదు అంటాడు.

అందువల్ల ఈ వరాన్ని మీరు ఒడిసిపుచ్చుకుని, ఆధ్యాత్మిక పతనం అయ్యేవి మాని, క్రమేపీ ఆధ్యాత్మిక ఉన్నతిని తీసుకువచ్చే పనులను చెయ్యాలి. పనులు ఒక్కటే కాదు, ఈ ఆరు అంశాల్లో బుద్ధి, ధృతి, సుఖం కూడా ఉన్నాయి. ఆఖరికి సుఖం కూడా మిమ్మల్ని కిందికి దిగజార్చవచ్చు. అనైతిక సుఖాలు సుఖాలను ఇస్తాయి నిజమే కాని, అవి మనిషి పతనానికి దారితీస్తాయి. అలా ఆరు అంశాలలోనూ మీరు ఏ స్థాయిలో ఉన్నారో చూసుకుంటూ వచ్చి సాత్త్విక ప్రవృత్తిని అలవరచుకోవాలి.

ఇది **మూడవ అంశము – ఆరు అంశాల విశ్లేషణ**.

### 4. కర్మయోగము, జ్ఞానయోగము – శ్లోకాలు 41-66

ఈ శ్లోకాల్లో గీతాబోధలోని రెండు ముఖ్యమైన అంశాల సారాంశాన్ని మళ్ళీ చెప్పాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయం మొత్తం భగవద్గీతకు సారాంశమనీ, మొదటి పదిహేడు శ్లోకాల్లో ఆ రెండు అంశాల సారాంశం చెప్పేశాడని కూడా చూశాము. ఏమిటవి? కర్మయోగం, జ్ఞానయోగం. కాని ఈ రెండూ చాలా ముఖ్యమైన అంశాలు కాబట్టి, కృష్ణపరమాత్మ ఇప్పుడు వాటిని ఇంకో కోణంలోంచి నిర్వచించాడు.

#### ఎ) కర్మయోగము – శ్లోకాలు 41-49

అంతకుముందు భాగంలో కృష్ణపరమాత్మ కర్మయోగం గురించి సాత్త్విక సన్న్యాసం పరంగా చెబితే, ఈ భాగంలో స్వధర్మ అనుష్ఠానం గురించి బోధించాడు. కర్మయోగం అంటే ఏమిటి?

కర్మయోగం = సరియైన కర్మ + సరియైన దృక్పథం

సరియైన కర్మ అంటే ఏమిటి? ఈ భాగంలో **స్వాభావికకర్మల పరంగా** వివరించాడు కృష్ణపరమాత్మ. ఎవరి ధర్మాన్ని వారు పాటించాలి. ఆ ధర్మం కూడా అనేక రకాలుగా ఉంటుంది. తనకు తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యమే కాకుండా, కుటుంబానికి, సమాజానికి, దేశానికి, మతానికి, వాతావరణానికి నిర్వర్తించాల్సిన కర్తవ్యాలు ఎన్నో ఉన్నాయి. మనం పుడుతూనే అనేక బాధ్యతలతో పుట్టాము. నాకు జీవితాన్ని అనుభవించాలని ఉందంటే, శాస్త్రం అనుభవించండి, తప్పు లేదు కాని మీ బాధ్యతను కూడా నెరవేర్చండి అంటుంది.

నా బాధ్యత ఏమిటో నాకెలా తెలుస్తుంది? పూర్వం వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి.

**బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥** – 18.41

పూర్వం మనుష్యులను నాలుగు వర్ణాల కింద విభజించింది శాస్త్రం. వారు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. ఈ విభజన వారి పుట్టుకనుబట్టి ఉంటుంది. ఈ నాలుగు వర్ణాలకు వేదాలే నాలుగు రకాల కర్మలను కూడా నిర్దేశించాయి. ఆ నాలుగు రకాల కర్మల ద్వారా వారు సమాజానికి సేవ చేసేలాగా నిర్దేశించాయి. అలాగే నాలుగు ఆశ్రమధర్మాలను కూడా నిర్దేశించాయి. అవి బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం.

ఒకవేళ ఈ వర్ణాల ప్రకారం మీ ధర్మాలను నిర్వర్తించటం మీకు ఇష్టం లేకపోతే, మీ గుణాన్నిబట్టి మీరు ఈ వృత్తిని ఎన్నుకోవచ్చు. ఏది ఎన్నుకున్నా మీ జీవనవిధానం సమాజానికి మీరు తిరిగి ఇచ్చేలాగా ఉండాలి. మీరు సమాజంనుంచి తీసుకునేదానికన్నా, మీరు తిరిగి ఇచ్చేది ఎక్కువగా ఉండాలి.

సమాజంనుంచి తిరిగి తీసుకోమని శాస్త్రం ప్రత్యేకించి బోధించనవసరం లేదు. తీసుకోవటంలో దిట్టలం మనం. అందువల్ల తిరిగి తీసుకునే అంశం గురించి బోధించలేదు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ, మీరు తీసుకోండి ఫర్వాలేదు కాని, తిరిగి ఇవ్వండి అన్నాడు. మీరు తీసుకున్నదానికన్నా మీరు తిరిగి ఇచ్చేది ఎక్కువగా ఉంటేనే మీరు ఆధ్యాత్మికంగా విజయం సాధిస్తున్నట్టు అంటుంది శాస్త్రం.

ఆధ్యాత్మిక విజయానికీ, లౌకిక విజయానికీ నిర్వచనాల్లో భేదం ఉంది. లౌకిక విజయంలో మీరు తీసుకునేది ఎక్కువ, తిరిగి ఇచ్చేది తక్కువా ఉంటుంది. ఒక పుస్తకాన్ని, ఇంతలావు పుస్తకం, కేవలం పదిరూపాయలకే అమ్ముతున్నారని కొన్నాను అంటారు. అంటే, అందులో ఏముందో మీకనవసరం; దానివల్ల లాభం పొందాలి. తక్కువ ఇచ్చి, ఎక్కువ తీసుకోవాలి. ఇదీ లౌకిక విజయం అంటే.

దీనికి భిన్నమైనది ఆధ్యాత్మిక విజయం. మీ జ్ఞానం, మీ శక్తి, మీ సమయం, మీ సామర్థ్యం, మీ దీవెనలు, మీ చిరునవ్వు – ఏదైనా సరే ఎదుటివారికి పంచండి. చిరునవ్వు చిందించటం పైసా ఖర్చులేని పని. దానివల్ల నలుగురి హృదయాలలో దీపాలు వెలిగించిన వారవుతారు. కాని చాలామంది, అదేమిటో గాని, చిరునవ్వును కూడా చాలా పొదుపుగా వాడతారు. అంటే ఏదైనా ఎదుటివారికి ఇవ్వాలి.

సరియైన కర్మ = ఎదుటివారికి తోడ్పడే కర్మ.

ఇప్పుడు సరియైన దృక్పథం అంటే ఏమిటి?

సరియైన దృక్పథం = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి.

**స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥** – 18.45

**యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥** – 18.46

మీరు ఎన్నుకున్న వృత్తిలోనే అంకితభావంతో కర్మను చెయ్యండి. కర్మయోగి మూడు అంశాలలో చాలా ఆరోగ్యకరమైన దృక్పథం పెంచుకోవాలి. అవి కర్మ, కర్మఫలం, కర్మఫలదాత.

**కర్మ** – మీరు చేసే కర్మను ఈశ్వరార్పణ భావనతో చేస్తారు కాబట్టి, ప్రతి చిన్నపనినీ శ్రద్ధగా చెయ్యాలి.
**కర్మఫలం** – కర్మఫలం ఏది వచ్చినా నవ్వుతూ స్వీకరించాలి. అంటే ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి.
**కర్మఫలదాత** – ఏకరూప ఈశ్వరుణ్ణి కొలిచే స్థాయినుంచి అనేకరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలి.

**కర్మయోగి** – కర్తగా తను చేసే కర్మలో ఆనందం పొందుతాడు. భోక్తగా కర్మఫలంనుంచి పాఠం నేర్చుకుని ప్రమాతగా మారతాడు.

**కర్మయోగఫలం** – జ్ఞానయోగ్యతాప్రాప్తి, చిత్తశుద్ధి.

1–12 కర్మయోగాన్ని సాత్త్వికసన్న్యాసపరంగా; 41–49 శ్లోకాల్లో స్వాభావికకర్మల పరంగా వివరించాడు.
ఇది **నాలుగవ అంశంలో మొదటి భాగము – కర్మయోగము**.

బి) **జ్ఞానయోగము – శ్లోకాలు 50–55**

కర్మయోగం గురించి టూకీగా చెప్పాక, కృష్ణపరమాత్మ జ్ఞానయోగ సాధన గురించి ఈ శ్లోకాల్లో చెప్పాడు. కర్మయోగంతో మీ సాధన ముగియదు. మోక్షం పొందటానికి జ్ఞానయోగానికి వచ్చితీరాలి.

ఇంతకుముందు జ్ఞానయోగం గురించి చెప్పినప్పుడు, ఆత్మస్వరూపం దృష్ట్యా చెప్పాడు (13–17 శ్లోకాలు). ఇప్పుడు (50–55 శ్లోకాలు) జ్ఞానయోగం గురించి శ్రవణ, మనన, నిదిధ్యాసనల పరంగా, ముఖ్యంగా నిదిధ్యాసన పరంగా మళ్ళీ బోధించాడు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటం. గీతను క్రమం తప్పకుండా అధ్యయనం చెయ్యాలి.

**మననం** – ఈ దశలో శిష్యుడు తనకు కలిగిన సంశయాలను తీర్చుకోవాలి. తనకు కలిగిన సందేహాలను మననం దశలో తోటి విద్యార్థిని అడిగో, గురువును అడిగో తీర్చుకోవాలి.

**నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం అంటే నేర్చుకున్న జ్ఞానాన్ని జ్ఞాననిష్టగా మలుచుకోవాలి. అంటే దాన్ని మీ రెండవ స్వభావంగా చేసుకోవాలి. ఆవకాయలోని మామిడికాయ ముక్క ఆవపిండిలో బాగా ఊరినట్టుగా, భగవద్గీతనుంచి మీరు పొందిన జ్ఞానం మీ అణువణువులో జీర్ణించుకుపోవాలి. జ్ఞానాన్ని పొంది జ్ఞాననిష్టలో నిలవకపోతే, అది పొందికూడా లాభం లేదు. దీనికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. ఈ భాగంలో కృష్ణపరమాత్మ నిదిధ్యాసనం గురించి ఎక్కువగా వివరించాడు.

**వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥** – 18.52

**అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమః శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥** – 18.53

నిదిధ్యాసనం అనేక రకాలుగా చెయ్యవచ్చు. మళ్ళీ శ్రవణం చెయ్యవచ్చు, రాయవచ్చు, ఎవరికైనా బోధ చెయ్యవచ్చు. ఇవికాక శాస్త్రం ఇంకొక విధమైన నిదిధ్యాసనాన్ని నిర్దేశిస్తుంది. దాన్ని **సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనము** అంటారు. వాటికి నియమాలను పతంజలి యోగసూత్రాల్లోంచి తీసుకుంటాము. ఇక్కడ వాటి పేర్లు మాత్రం చూద్దాము. అవి ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి. నిదిధ్యాసనం శ్రవణం చేశాకే చెయ్యాలి. ముందు చెయ్యకూడదు.

నిదిధ్యాసన చేసేటప్పుడు అనేక భావోద్రేకాలు మీ మనస్సును కలతపెట్టవచ్చు. దానికి కారణం మీలో ఇంకా మిగిలివున్న ఆసురీసంపత్తి కావచ్చు. మనస్సనే తోటలో ఉన్న అనేక కలుపు మొక్కలను ఏరివేయాలి. వాటిలో కొన్నింటిని మాత్రమే 53వ శ్లోకంలో పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ. అవి అహంకారం, బలం, దర్పం, కామం, క్రోధం, పరిగ్రహం, మమకారం. వీటన్నిటినీ పరిత్యజిస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అటువంటి సాధకుడు బ్రహ్మతో ఐక్యం అవుతాడు. అంటే **జీవన్ముక్తి ఫలం** పొందుతాడు.

ఇక్కడితో జ్ఞానయోగం అంశం ముగిసింది. దీనిలో ప్రధానంగా నిదిధ్యాసనం గురించి బోధించాడు కృష్ణపరమాత్మ. అంటే నిదిధ్యాసన ప్రధాన జ్ఞానయోగం అంశం ముగిసింది.

ఇది **నాలుగవ అంశంలో రెండవ భాగము – జ్ఞానయోగము.**

సి) **కర్మయోగము – శ్లోకాలు 56–62**

నిదిధ్యాసనలో అహంకార, మమకారాలను వదులుకోవాలని, పారమార్థిక సత్యానికి ఎదగాలని చెప్పాడు కృష్ణపరమాత్మ. ఇదంతా నావల్ల అయ్యేనా అనుకునేవారికి మళ్ళీ కర్మయోగము స్థాయికి దిగివచ్చి కర్మయోగము గురించి బోధించాడు ఈ శ్లోకాల్లో.

ఇంతకు ముందు (41–49 శ్లోకాలు) కర్మయోగము గురించి స్వాభావిక కర్మల పరంగా చర్చించాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు ఈ శ్లోకాల్లో (56–62 శ్లోకాలు) అదే కర్మయోగాన్ని ఇంకొక కోణంలోంచి చర్చించాడు. అది **ఈశ్వరానుగ్రహం**. కర్మయోగి నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందలేడు. అందువల్ల అతను భగవంతుణ్ణి ఇష్టదేవతా రూపంలో కొలుస్తాడు. ఈశ్వరానుగ్రహాన్ని కోరితే మీ ఆధ్యాత్మిక ప్రయాణంలో అన్ని దశలూ ఆయనే చూసుకుంటాడు.

ఇది **నాలుగవ అంశంలో మూడవ భాగము – కర్మయోగము.**

డి) **చరమ శ్లోకం – కర్మయోగము శ్లోకం 65**

ఇప్పటికే కర్మయోగము గురించి కృష్ణపరమాత్మ మూడుసార్లు చెప్పాడు. అంతా చెప్పేశాను, ఇంక నిర్ణయం నీ చేతిలో ఉంది; నువ్వే తేల్చుకో అన్నాక, మళ్ళీ అర్జునుడు ఏమైనా పొరపాటుగా నిర్ణయం తీసుకుంటాడేమోనని ఈ శ్లోకంలో మళ్ళీ కర్మయోగం గురించి చెప్పాడు. కర్మయోగంలోని అంశాలను ఇందులో చెప్పాడు. అవి ప్రార్థన, స్వాధ్యాయము, భగవంతుడు తోడుగా ఉంటాడు, భగవంతుడు లక్ష్యంగా మారతాడు. అప్పుడు ముముక్షువుగా మారతాడు; ఇది కర్మయోగంయొక్క పరాకాష్ఠ.

ఇది **నాలుగవ అంశంలో నాలుగవ భాగం – కర్మయోగము గురించిన చరమ శ్లోకం**.

ఇ) **చరమ శ్లోకం – జ్ఞానయోగము శ్లోకం 66**

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ తన గీతాబోధను ముగించాడు. దీంట్లో శరణాగతి గురించి చెప్పాడు కాబట్టి, దీన్ని శరణాగతి శ్లోకం అంటారు; గీతాబోధను ముగించాడు కాబట్టి, చరమశ్లోకం అంటారు. ఈ శ్లోకంలో జ్ఞానయోగాన్ని సంక్షిప్తంగా మళ్ళీ చూశాము. ఇందులో జ్ఞానం గురించిన పదం ప్రత్యక్షంగా లేకపోయినా ఇది జ్ఞానయోగానికి చెందినదని చూశాము.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥** – 18.66

**సర్వధర్మాన్ పరిత్యజ్య** – ఈ వాక్యాన్ని మూడు దశల్లో అర్థం చేసుకోవాలని చూశాము.

- సర్వకర్మలను త్యజించాలి
- కర్మత్యాగం చెయ్యాలంటే దేహాభిమానం త్యాగం చెయ్యాలి
- దేహాభిమానం త్యాగం చెయ్యాలంటే ఆత్మజ్ఞానం పొందాలి.

**మామేకం శరణం వ్రజ** – అంటే ఏకరూప ఈశ్వరుడైన కృష్ణపరమాత్మను కాదు శరణు వేడాల్సింది. అరూప ఈశ్వరజ్ఞానం పొందాలి. దీన్ని జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం అంటారు.

**మామేకం శరణం వ్రజ = జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం పొందటం**

**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః** – నువ్వు శోకించకు, నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాను అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకాన్ని అనేక రకాలుగా అర్థం చేసుకుంటారు కాని దీన్ని జ్ఞానయోగం శ్లోకంగా శంకరాచార్యులవారు నిర్వచించారు.

ఇది **నాలుగవ అంశంలో ఐదవభాగం – జ్ఞానయోగాన్ని గురించిన చరమ శ్లోకం.**

ఇది **నాలుగవ అంశము – కర్మయోగము, జ్ఞానయోగము.**

5. **ఉపసంహారము – శ్లోకాలు 67–78**

ఎ) **సాంప్రదాయవిధి – శ్లోకాలు 67–71**

అర్హత – గీతాబోధ గురించి కొన్ని అంశాలు చెప్పాడు కృష్ణపరమాత్మ. ముందుగా గీతాబోధ వినటానికి శిష్యునికి కావాల్సిన నాలుగు అర్హతలను గురించి చెప్పాడు. అవి తపస్సు, భక్తి, శుశ్రూష, అనసూయ.

**తపస్సు** – ఆధ్యాత్మిక నియంత్రణ ఉండాలి.
**భక్తి** – ఈశ్వరభక్తి, గురుభక్తి ఉండాలి.
**శుశ్రూష** – గీత వినాలనే తీవ్రమైన తపన ఉండాలి.
**అనసూయ** – విమర్శనాత్మక బుద్ధి ఉండకూడదు.

ఈ నాలుగు అర్హతలు ఉన్న శిష్యునికే చెప్పాలి గురువు; లేకపోతే అతనికి చెప్పకూడదు అన్నాడు కృష్ణపరమాత్మ.

**గురుస్తుతి** – గీతాబోధను చేసే గురువు నాకు చాలా ప్రియం అన్నాడు కృష్ణపరమాత్మ.

**శిష్యస్తుతి** – శిష్యులను రెండు రకాలుగా విభజించాడు.

శ్రద్ధ ఉన్న శిష్యుడు – గీతను శ్రద్ధగా నేర్చుకునే శిష్యుడు.
శ్రద్ధ లేకుండా విన్న శిష్యుడు – గీతమీద శ్రద్ధ లేకపోయినా, అర్థం అయినా కాకపోయినా, వచ్చి గీత విన్న శిష్యుడు.

ఈ ముగ్గురూ ప్రియమే కాని, గీతాబోధ చేసే గురువు ఇంకా ఎక్కువ ఇష్టం అన్నాడు. రెండు రకాల శిష్యులకూ ఫలం వస్తుంది. శ్రద్ధగా విన్న శిష్యునికి మోక్షం వస్తే, అశ్రద్ధగా విన్న శిష్యునికి కనీసం స్వర్గలోకఫలం వస్తుంది అన్నాడు. అందుకని గీతను అధ్యయనం చెయ్యటం మానకూడదు.

బి) **కృష్ణార్జునుల సంవాద ఉపసంహారము – శ్లోకాలు 72, 73**

72వ శ్లోకంలో కృష్ణపరమాత్మ ఈ శిష్యుల్లో అర్జునుడు ఏ రకంలోకి వస్తాడో తెలుసుకోవాలనుకున్నాడు. అందువల్ల కృష్ణపరమాత్మ, అర్జునా! నీకు ఆత్మ అజ్ఞానం పోయిందా అని అడిగాడు. దానికి జవాబుగా అర్జునుడు మోహం పోయింది నాకు అన్నాడు.

**అర్జున ఉవాచ**

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥** – 18.73

తనకు మోహం పోయింది అంటే అజ్ఞానం కూడా పోయిందని అర్థం. అజ్ఞానంవల్ల మోహం కలిగింది. నేను జ్ఞానం పొందాను; యుద్ధం చేస్తాను అన్నాడు.

దీనితో కృష్ణార్జునుల సంవాదం విజయవంతమైంది.

**సి) సంజయుని ముగింపు – శ్లోకాలు 74-78**

ఇక్కడ్నుంచి సంజయుడు అందుకుని భగవద్గీతకు ఉపసంహారం చేశాడు. ధృతరాష్ట్రునికి ఈ బోధ విన్న ఆనందం ఎంత గొప్పగా ఉన్నదో వివరించాడు. సంజయునికి తన అదృష్టాన్ని తలుచుకున్నకొద్దీ ఆనందం అంతకంతకూ పెరిగిపోతున్నది.

మహానుభావుడైన అర్జునుడు అడిగితే, సాక్షాత్తూ కృష్ణపరమాత్మే స్వయంగా బోధ చేస్తే, అది కూడా అత్యంత రహస్యమైన బ్రహ్మవిద్యను బోధ చేస్తే, అర్జునునితో పాటు తను కూడా సాక్షాత్తు భగవంతునినుంచే విన్నాడు. అదే గొప్ప అదృష్టం. తనకు దివ్యచక్షువులు ప్రసాదించి, తనకు ఆ అదృష్టాన్ని కలుగజేసిన వ్యాసాచార్యులవారికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆ బోధను తలుచుకున్నకొద్దీ తన తనువు పులకించిపోతున్నది అన్నాడు. అన్నింటిలోకి విశ్వరూప దర్శనాన్ని తలుచుకున్నకొద్దీ విస్మయంలో మునిగిపోతున్నాను అనికూడా అన్నాడు.

తర్వాత సంజయుడు గీతాబోధయొక్క ఫలశ్రుతిని కూడా ఇచ్చాడు.

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥** – 18.78

కేవలం అర్జునుడు, సంజయుడు మాత్రమే ఈ ఫలాన్ని పొందరు. ఎవరైతే బ్రహ్మవిద్య గురువుగా కృష్ణపరమాత్మను, ధనుర్ధారి అయిన అర్జునుణ్ణి తలుచుకుంటారో, వారి మధ్య జరిగిన గీతాబోధను గుర్తు తెచ్చుకుంటారో, వారు లౌకిక, ఆధ్యాత్మిక విజయాలను పొందుతారు. శ్రద్ధగా విని, జ్ఞాననిష్ఠలో నిలబడితే మోక్షం పొందుతారు; లేకపోతే లౌకిక విజయాలైన సిరిసంపదలు, విజయం, సకల ఐశ్వర్యాలు, నీతి అన్నీ పొందుతారని నేను హామీ ఇస్తున్నాను అన్నాడు సంజయుడు.

దీనితో భగవద్గీతలోని ఉపసంహారం అయినది; పద్దెనిమిదవ అధ్యాయం అయినది; భగవద్గీత సంపూర్ణమైంది.

ఓం తత్సత్ సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

## స్వామీజీ ఆణిముత్యాలు

సంజయుడు అంతకు ముందు మూడు శ్లోకాల్లో తన ఆనందాన్ని ప్రకటించాడు; గీత విన్నందుకూ, భగవంతునినుంచి విన్నందుకూ ఆనందంగా ఉంది అన్నాడు; గుర్తు తెచ్చుకుంటున్నకొద్దీ ఆనందం పెరుగుతోంది అన్నాడు; ఇప్పుడు విశ్వరూపం గుర్తు తెచ్చుకుంటున్నకొద్దీ ఆనందం విస్మయంగా మారుతోంది అంటున్నాడు. అంటే ఎంత చెప్పినా అతని ఆనందం తనివితీరటం లేదు.

మన ఆనందం కూడా అంతే. ఎంత చెప్పినా మన ఆనందం తనివితీరదు.

# కృష్ణాష్టకమ్

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 1

అతసీపుష్పసంకాశం, హారనూపురశోభితమ్ ।
రత్నకంకణకేయూరం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 2

కుటిలాలకసంయుక్తం, పూర్ణచంద్రనిభాననమ్ ।
విలసత్కుండలధరం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 3

మందారగంధసంయుక్తం, చారుహాసం చతుర్భుజమ్ ।
బర్హిపింఛావచూడాంగం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 4

ఉత్ఫుల్లపద్మపత్రాక్షం, నీలజీమూతసన్నిభమ్ ।
యాదవానాం శిరోరత్నం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 5

రుక్మిణీకేళిసంయుక్తం, పీతాంబరసుశోభితమ్ ।
అవాప్తతులసీగంధం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 6

గోపికానాం కుచద్వంద్వకుంకుమాంకితవక్షసమ్ ।
శ్రీనికేతం మహేష్వాసం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 7

శ్రీ వత్సాంకం మహోరస్కం వనమాలావిరాజితమ్ ।
శంఖచక్రధరం దేవం, కృష్ణం వందే జగద్గురుమ్ ॥ 8

కృష్ణాష్టకమిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
కోటిజన్మకృతం పాపం, స్మరణేన వినశ్యతి ॥ 9

*॥ ఇతి శ్రీ కృష్ణాష్టకం సంపూర్ణమ్ ॥*

# శ్రీ గీతామాహాత్మ్యమ్

ధరోవాచ

భగవన్! పరమేశాన! భక్తిరవ్యభిచారిణీ! ।
ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥ 1

శ్రీ విష్ణు రువాచ

ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరతస్సదా ।
సముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥ 2

మహాపాపాదిపాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।
క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళమంభసా ॥ 3

గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।
తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై । 4

సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।
గోపాలా గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః ।
సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ॥ 5

యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్ ।
తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి సదైవ హి ॥ 6

గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ ।
గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్ ॥ 7

గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః ।
అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా ॥ 8

చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్ ।
వేదత్రయీ పరానందతత్త్వార్థజ్ఞానమంజసా ॥ 9

యోఽష్టాదశ జపేన్నిత్యం నరో నిశ్చలమానసః ।
జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ ॥ 10

పాఠేఽసమర్థస్సంపూర్ణే తదర్ధం పాఠమాచరేత్ ।
తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః ॥ 11

త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్ ।
షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ ॥ 12

ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః ।
రుద్రలోక మవాప్నోతి గణోభూత్వా వసేచ్చిరమ్ ॥ 13

అధ్యాయశ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః ।
స యాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే! ॥ 14

గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్ ।
ద్వౌత్రీనేకం తదర్ధం వా శ్లోకానాం యః పఠేన్నరః ॥ 15

చంద్రలోక మవాప్నోతి వర్షాణామయుతం ధ్రువమ్ ।
గీతాపాఠ సమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్ ॥ 16

గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తిముత్తమాం ।
గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ ॥ 17

గీతార్థ శ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా ।
వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే ॥ 18

గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః ।
జీవన్ముక్త స్స విజ్ఞేయో దేహాంతే పరమం పదమ్ ॥ 19

గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః ।
నిర్ధూతకల్మషా లోకే గీతాయాతాః పరం పదమ్ ॥ 20

గీతాయాః పఠనం కృత్వా మహాత్మ్యం నైవ యః పఠేత్ ।
వృథాపాఠో భవేత్ తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః ॥ 21

ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః ।
స తత్ఫలమవాప్నోతి దుర్లభాం గతిమాప్నుయాత్ ॥ 22

సూత ఉవాచ:
మాహాత్మ్యమేతద్గీతాయా మయా ప్రోక్తం సనాతనం।
గీతాంతే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ ॥ 23
ఇతి శ్రీవరాహపురాణే గీతామాహాత్మ్యం సంపూర్ణమ్
(గీతా పారాయణమైన పిదప గీతా మాహాత్మ్యమును పఠింపవలెను.)

# గీతా హారతి

జయ భగవద్గీతే, జయ భగవద్గీతే
హరి–హియ–కమల–విహారిణి, సుందర సుపునీతే ॥ జయ ॥

కర్మ–సుమర్మ–ప్రకాశిని కామాసక్తిహరా
తత్త్వజ్ఞాన–వికాసిని విద్యాబ్రహ్మపరా ॥ జయ ॥

నిశ్చల–భక్తి–విధాయిని నిర్మల మలహారీ
శరణ–రహస్య–ప్రదాయిని సబ విధి సుఖకారీ ॥ జయ ॥

రాగ–ద్వేష–విదారిణి కారిణి మోద సదా
భవ–భయ–హారిణి తారిణి పరమానందప్రదా ॥ జయ ॥

ఆసుర భావ–వినాశిని నాశిని తమ–రజనీ
దైవీ సద్గుణదాయిని హరి–రసికా సజనీ ॥ జయ ॥

సమతా, త్యాగ సిఖావని, హరి–ముఖకీ బానీ
సకల శాస్త్రకీ స్వామిని శ్రుతియోంకీ రానీ ॥ జయ ॥

దయా–సుధా బరసావని మాతు! కృపా కీజై
హరి–పద–ప్రేమ దాన కర అపనో కర లీజై ॥ జయ ॥

# శ్రీమద్భగవద్గీత-అకారాది సూచిక

## శ్రీమద్భగవద్గీత

### అకారాది శ్లోకానుక్రమణిక

అ


| | | | |
|---|---|---|---|
| 1. | అకీర్తిం చాపిభూతాని | అ2 | శ్లో34 |
| 2. | అక్షరాణామకారోస్మి | అ10 | శ్లో33 |
| 3. | అక్షరం బ్రహ్మ పరమమ్ | అ8 | శ్లో 3 |
| 4. | అగ్నిర్జ్యోతిరహశ్శుక్లః | అ8 | శ్లో24 |
| 5. | అచ్ఛేద్యోఽ యమదాహ్యోయమ్ | అ2 | శ్లో24 |
| 6. | అజోఽ పిసన్నవ్యయాత్మా | అ4 | శ్లో 6 |
| 7. | అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ | అ4 | శ్లో40 |
| 8. | అత్ర శూరా మహేష్వాసాః | అ1 | శ్లో 4 |
| 9. | అథ కేన ప్రయుక్తోయమ్ | అ3 | శ్లో36 |
| 10. | అథ చిత్తం సమాధాతుమ్ | అ12 | శ్లో 9 |
| 11. | అథ చేత్త్వమిమం ధర్మ్యం | అ2 | శ్లో33 |
| 12. | అథ చైనం నిత్యజాతమ్ | అ2 | శ్లో26 |
| 13. | అథవా బహునైతేన | అ10 | శ్లో42 |
| 14. | అథవా యోగినామేవ | అ6 | శ్లో42 |
| 15. | అథ వ్యవస్థితాంధృష్ట్వా | అ1 | శ్లో20 |
| 16. | అథై తదప్యశక్తోసి | అ12 | శ్లో11 |
| 17. | అదృష్టపూర్వం హృషితోస్మి | అ11 | శ్లో45 |
| 18. | అదేశకాలే యద్దానమ్ | అ17 | శ్లో22 |
| 19. | అద్వేష్టా సర్వభూతానామ్ | అ12 | శ్లో13 |
| 20. | అధర్మాభిభవాత్క ృష్ణ | అ1 | శ్లో41 |
| 21. | అధర్మం ధర్మమితియా | అ18 | శ్లో32 |
| 22. | అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య | అ15 | శ్లో2 |
| 23. | అధిభూతం క్షరో భావః | అ8 | శ్లో 4 |
| 24. | అధియజ్ఞః కథం కోఽత్ర | అ8 | శ్లో 2 |
| 25. | అదిష్ఠానం తథా కర్తా | అ18 | శ్లో14 |
| 26. | అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్ | అ13 | శ్లో12 |
| 27. | అధ్యేష్యతే చ య ఇమమ్ | అ18 | శ్లో70 |
| 28. | అనన్తవిజయం రాజా | అ1 | శ్లో16 |
| 29. | అనన్తశ్చాస్మి నాగానామ్ | అ10 | శ్లో29 |
| 30. | అనన్యచేతాః సతతమ్ | అ8 | శ్లో14 |
| 31. | అనన్యాశ్చిన్తయన్తో మామ్ | అ9 | శ్లో22 |
| 32. | అనపేక్షః శుచిర్దక్షః | అ12 | శ్లో16 |
| 33. | అనాదిత్వాన్నిర్గుణత్వాత్ | అ13 | శ్లో32 |
| 34. | అనాదిమధ్యాన్తమనన్త | అ11 | శ్లో19 |
| 35. | అనాశ్రితః కర్మఫలమ్ | అ6 | శ్లో 1 |
| 36. | అనిష్టమిష్టం మిశ్రం చ | అ18 | శ్లో12 |
| 37. | అనుద్వేగకరం వాక్యం | అ17 | శ్లో15 |
| 38. | అనుబన్ధం క్షయం హింసా | అ18 | శ్లో25 |
| 39. | అనేకచిత్తవిభ్రాన్తాః | అ16 | శ్లో16 |
| 40. | అనేకబాహూదరవక్త్రనేత్రమ్ | అ11 | శ్లో16 |
| 41. | అనేకవక్త్రనయనం | అ11 | శ్లో10 |
| 42. | అన్తకాలే చ మామేవ | అ8 | శ్లో 5 |
| 43. | అన్తవత్తు ఫలం తేషామ్ | అ7 | శ్లో23 |
| 44. | అన్తవన్త ఇమే దేహాః | అ2 | శ్లో18 |
| 45. | అన్నాద్భవన్తి భూతాని | అ3 | శ్లో14 |
| 46. | అన్యే చ బహవః శూరాః | అ1 | శ్లో 9 |
| 47. | అన్యే త్వేవమజానన్తః | అ13 | శ్లో26 |
| 48. | అపరం భవతో జన్మ | అ4 | శ్లో 4 |
| 49. | అపరే నియతాహారాః | అ4 | శ్లో30 |
| 50. | అపరేయమితస్త్వన్యామ్ | అ7 | శ్లో 5 |
| 51. | అపర్యాప్తం తదస్మాకమ్ | అ1 | శ్లో10 |
| 52. | అపానే జుహ్వతి ప్రాణమ్ | అ4 | శ్లో29 |
| 53. | అపి చేత్సుదురాచారః | అ9 | శ్లో30 |
| 54. | అపి చేదసి పాపేభ్యః | అ4 | శ్లో36 |
| 55. | అప్రకాశోఽ ప్రవృత్తిశ్చ | అ14 | శ్లో13 |
| 56. | అఫలాకాంక్షిభిర్యయజ్ఞః | అ17 | శ్లో11 |
| 57. | అభయం సత్వసంశుద్ధిః | అ16 | శ్లో 1 |
| 58. | అభిసంధాయ తు ఫలమ్ | అ17 | శ్లో12 |
| 59. | అభ్యాస యోగయుక్తేన | అ8 | శ్లో 8 |
| 60. | అభాసేఽ ప్యసమర్థోఽ సి | అ12 | శ్లో10 |
| 61. | అమానిత్వమదంభిత్వమ్ | అ13 | శ్లో 8 |
| 62. | అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య | అ11 | శ్లో26 |

| | | | |
|---|---|---|---|
| 63. | అమీ హి త్వాం సురసంఘా | అ11 | శ్లో21 |
| 64. | అయతి శ్రద్ధయోపేతః | అ6 | శ్లో37 |
| 65. | అయనేషు చ సర్వేషు | అ1 | శ్లో11 |
| 66. | అయుక్తః ప్రాకృతః స్తబ్ధః | అ18 | శ్లో28 |
| 67. | అవజానన్తి మాం మూఢాః | అ9 | శ్లో11 |
| 68. | అవాచ్యవాదాంశ్చ బహూన్ | అ2 | శ్లో36 |
| 69. | అవినాశి తు తద్విద్ధి | అ2 | శ్లో17 |
| 70. | అవిభక్తం చ భూతేషు | అ13 | శ్లో17 |
| 71. | అవ్యక్తాదీని భూతాని | అ2 | శ్లో28 |
| 72. | అవ్యక్తాద్వ్యక్తయస్సర్వాః | అ8 | శ్లో18 |
| 73. | అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః | అ8 | శ్లో21 |
| 74. | అవ్యక్తోఽయమచిన్త్యోఽయమ్ | అ2 | శ్లో25 |
| 75. | అవ్యక్తం వ్యక్తిమాపన్నమ్ | అ7 | శ్లో24 |
| 76. | అశాస్త్రవిహితం ఘోరమ్ | అ17 | శ్లో 5 |
| 77. | అశోచ్యానన్వశోచస్త్వమ్ | అ2 | శ్లో11 |
| 78. | అశ్రద్ధధానాః పురుషాః | అ9 | శ్లో 3 |
| 79. | అశ్రద్ధయా హుతం దత్తమ్ | అ17 | శ్లో28 |
| 80. | అశ్వత్థః సర్వవృక్షాణామ్ | అ10 | శ్లో26 |
| 81. | అసక్తబుద్ధిస్సర్వత్ర | అ18 | శ్లో49 |
| 82. | అసక్తిరనభిష్వఙ్గః | అ13 | శ్లో10 |
| 83. | అసత్యమప్రతిష్ఠన్తే | అ16 | శ్లో 8 |
| 84. | అసౌ మయా హతశ్శత్రుః | అ16 | శ్లో14 |
| 85. | అసంయతాత్మనా యోగః | అ6 | శ్లో36 |
| 86. | అసంశయం మహాబాహో | అ6 | శ్లో35 |
| 87. | అస్మాకం తు విశిష్టా యే | అ1 | శ్లో 7 |
| 88. | అహమాత్మా గుడాకేశ | అ10 | శ్లో20 |
| 89. | అహంకారం బలం దర్పమ్ | అ16 | శ్లో18 |
| 90. | అహంకారం బలం దర్పమ్ | అ18 | శ్లో53 |
| 91. | అహం క్రతు రహం యజ్ఞః | అ9 | శ్లో16 |
| 92. | అహంవైశ్వా నరోభూత్వా | అ15 | శ్లో14 |
| 93. | అహంసర్వస్య ప్రభవః | అ10 | శ్లో 8 |
| 94. | అహం హి సర్వయజ్ఞానామ్ | అ9 | శ్లో24 |
| 95. | అహింసా సత్యమక్రోధః | అ16 | శ్లో 2 |
| 96. | అహింసా సమతా తుష్టిః | అ10 | శ్లో 5 |
| 97. | అహో బత మహత్పాపమ్ | అ1 | శ్లో45 |
| | **ఆ** | | |
| 98. | ఆఖ్యాహిమేకో భవానుగ్రః | అ11 | శ్లో31 |
| 99. | ఆచార్యః పితరః పుత్రాః | అ1 | శ్లో34 |
| 100. | ఆఢ్యోఽభిజనవానస్మి | అ16 | శ్లో15 |
| 101. | ఆత్మసంభావితాః స్తబ్ధాః | అ16 | శ్లో17 |
| 102. | ఆత్మౌపమ్యేన సర్వత్ర | అ6 | శ్లో32 |
| 103. | ఆదిత్యానామహం విష్ణుః | అ10 | శ్లో21 |
| 104. | ఆపూర్యమాణమచలప్రతిష్ఠమ్ | అ2 | శ్లో70 |
| 105. | ఆబ్రహ్మభువనాల్లోకాః | అ8 | శ్లో16 |
| 106. | ఆయుస్సత్త్వ బలారోగ్య | అ17 | శ్లో 8 |
| 107. | ఆయుధానామహం వజ్ర | అ10 | శ్లో28 |
| 108. | ఆరురుక్షోర్మునేర్యోగం | అ6 | శ్లో 3 |
| 109. | ఆవృతం జ్ఞానమేతేన | అ3 | శ్లో39 |
| 110. | ఆశాపాశశతైర్బద్ధాః | అ16 | శ్లో12 |
| 111. | ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదే | అ2 | శ్లో29 |
| 112. | ఆసురీం యోనిమాపన్నాః | అ16 | శ్లో20 |
| 113. | ఆహారస్త్వపి సర్వస్య | అ17 | శ్లో 7 |
| 114. | ఆహుస్త్వామృషయః సర్వే | అ10 | శ్లో13 |
| | **ఇ** | | |
| 115. | ఇచ్ఛా ద్వేషస్సుఖం దుఃఖమ్ | అ13 | శ్లో 7 |
| 116. | ఇచ్ఛా ద్వేషసముత్థేన | అ7 | శ్లో27 |
| 117. | ఇతిక్షేత్రం తథా జ్ఞానం | అ13 | శ్లో19 |
| 118. | ఇతి గుహ్యతమం శాస్త్రమ్ | అ15 | శ్లో20 |
| 119. | ఇతి తే జ్ఞానమాఖ్యాతమ్ | అ18 | శ్లో63 |
| 120. | ఇత్యర్జునం వాసుదేవస్త | అ11 | శ్లో50 |
| 121. | ఇత్యహం వాసుదేవస్య | అ18 | శ్లో74 |
| 122. | ఇదం జ్ఞానముపాశ్రిత్య | అ14 | శ్లో 2 |
| 123. | ఇదం శరీరం కౌన్తేయ | అ13 | శ్లో 2 |
| 124. | ఇదం తు తే గుహ్యతమమ్ | అ9 | శ్లో 1 |
| 125. | ఇదం తే నాతపస్కాయ | అ18 | శ్లో67 |
| 126. | ఇదమద్య మయా లబ్ధమ్ | అ16 | శ్లో13 |
| 127. | ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే | అ3 | శ్లో34 |
| 128. | ఇన్ద్రియాణాం హి చరతామ్ | అ2 | శ్లో67 |
| 129. | ఇన్ద్రియాణి పరాణ్యాహుః | అ3 | శ్లో42 |
| 130. | ఇన్ద్రియాణి మనో బుద్ధిః | అ3 | శ్లో40 |
| 131. | ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్ | అ13 | శ్లో 9 |
| 132. | ఇమం వివస్వతే యోగమ్ | అ4 | శ్లో 1 |
| 133. | ఇష్టాన్భోగాన్హి వో దేవాః | అ3 | శ్లో12 |
| 134. | ఇహైకస్థం జగత్కృత్స్నమ్ | అ11 | శ్లో 7 |
| 135. | ఇహైవ తైర్జితస్సర్గః | అ5 | శ్లో19 |

ఈ

136. ఈశ్వరస్సర్వభూతానామ్ అ18 శ్లో61

ఉ

137. ఉచ్చైశ్శ్రవసమశ్వానామ్ అ10 శ్లో27
138. ఉత్క్రామన్తం స్థితం వాపి అ15 శ్లో10
139. ఉత్తమః పురుషస్త్వన్యః అ15 శ్లో17
140. ఉత్సన్నకులధర్మాణామ్ అ1 శ్లో44
141. ఉత్సీదేయురిమే లోకాః అ3 శ్లో24
142. ఉదారాః సర్వఏవైతే అ7 శ్లో18
143. ఉదాసీన వదాసీనః అ14 శ్లో23
144. ఉద్ధరేదాత్మనాత్మానమ్ అ6 శ్లో 5
145. ఉపద్రష్టాఽనుమన్తా చ అ13 శ్లో21

ఊ

146. ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః అ14 శ్లో18
147. ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అ15 శ్లో 1

ఋ

148. ఋషిభిర్బహుధా గీతమ్ అ13 శ్లో 5

ఏ

149. ఏతచ్ఛ్రుత్వావచనం కేశవస్య అ11 శ్లో35
150. ఏతద్యోనీని భూతాని అ7 శ్లో 6
151. ఏతన్మేసంశయం కృష్ణ అ6 శ్లో39
152. ఏతాం దృష్టిమవష్టభ్య అ16 శ్లో 9
153. ఏతాన్న హన్తుమిచ్ఛామి అ1 శ్లో35
154. ఏతాం విభూతిం యోగమ్ అ10 శ్లో 7
155. ఏతాన్యపితు కర్మాణి అ18 శ్లో 6
156. ఏతైర్విముక్తః కౌన్తేయ అ16 శ్లో22
157. ఏవం జ్ఞాత్వా కృతం కర్మ అ4 శ్లో15
158. ఏవం పరమ్పరా ప్రాప్తమ్ అ4 శ్లో2
159. ఏవం ప్రవర్తితం చక్రమ్ అ3 శ్లో16
160. ఏవం బహువిధా యజ్ఞా అ4 శ్లో32
161. ఏవం బుద్ధేః పరంబుద్ధ్వా అ3 శ్లో43
162. ఏవం సతతయుక్తా యే అ12 శ్లో 1
163. ఏవముక్తో హృషీకేశః అ1 శ్లో24
164. ఏవముక్త్వా తతోరాజన్ అ11 శ్లో 9
165. ఏవముక్త్వాఽర్జునస్సంఖ్యే అ1 శ్లో47
166. ఏవముక్త్వా హృషీకేశమ్ అ2 శ్లో 9
167. ఏవమేతద్యథాఽఽత్థత్వమ్ అ11 శ్లో 3
168. ఏషాతేఽభిహితా సాంఖ్యే అ2 శ్లో39
169. ఏషాబ్రాహ్మీస్థితిః పార్థ అ2 శ్లో72

ఓ

170. ఓం తత్సదితి నిర్దేశః అ17 శ్లో23
171. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ అ8 శ్లో13

క

172. కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ అ18 శ్లో72
173. కచ్చిన్నోభయ విభ్రష్టః అ6 శ్లో38
174. కట్వమ్లలవణాత్యుష్ణ అ17 శ్లో 9
175. కథం న జ్ఞేయమస్మాభిః అ1 శ్లో39
176. కథం భీష్మమహం సంఖ్యే అ2 శ్లో 4
177. కథం విద్యామహం యోగిన్ అ10 శ్లో17
178. కర్మజం బుద్ధియుక్తాహి అ2 శ్లో51
179. కర్మణైవ హి సంసిద్ధిమ్ అ3 శ్లో20
180. కర్మణోహ్యపిబోద్ధవ్యమ్ అ4 శ్లో17
181. కర్మణస్సుకృతస్యాహుః అ14 శ్లో16
182. కర్మణ్య కర్మ యః పశ్యేత్ అ4 శ్లో18
183. కర్మణ్యేవాధికారస్తే అ2 శ్లో47
184. కర్మబ్రహ్మోద్భవం విద్ధి అ3 శ్లో15
185. కర్మేన్ద్రియాణి సంయమ్య అ3 శ్లో 6
186. కర్శయన్తశ్శరీరస్థమ్ అ17 శ్లో 6
187. కవిం పురాణమనుశాసితారమ్ అ8 శ్లో 9
188. కస్మాచ్చ తే న నమేరన్ అ11 శ్లో37
189. కాఙ్క్షన్తః కర్మణాం సిద్ధిమ్ అ4 శ్లో12
190. కామ ఏష క్రోధ ఏషః అ3 శ్లో37
191. కామక్రోధ వియుక్తానామ్ అ5 శ్లో26
192. కామ మాశ్రిత్య దుష్పూరమ్ అ16 శ్లో10
193. కామాత్మానః స్వర్గపరాః అ2 శ్లో43
194. కామైస్తైస్తైః హృతజ్ఞానాః అ7 శ్లో20
195. కామ్యానాం కర్మణాం న్యాసమ్ అ18 శ్లో 2
196. కాయేన మనసా బుద్ధ్యా అ5 శ్లో11
197. కార్పణ్యదోషోపహతస్వభావః అ2 శ్లో 7
198. కార్యకారణ కర్తృత్వే అ13 శ్లో21
199. కార్యమిత్యేవ యత్కర్మ అ18 శ్లో 9
200. కాలోఽస్మి లోకక్షయకృత్ అ11 శ్లో32
201. కాశ్యశ్చ పరమేష్వాసః అ1 శ్లో17
202. కిం కర్మ కిమకర్మేతి అ4 శ్లో16

203. కిం పునర్బ్రాహ్మణాః పుణ్యాః అ9 శ్లో33
204. కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మమ్ అ8 శ్లో 1
205. కిరీటినం గదినం చక్రహ అ11 శ్లో46
206. కిరీటినం గదినం చక్రిణం చ అ11 శ్లో17
207. కుతస్త్వా కశ్మలమిదమ్ అ2 శ్లో 2
208. కులక్షయేప్రణశ్యన్తి అ1 శ్లో40
209. కృపయా పరయావిష్టః అ1 శ్లో28
210. కృషి గోరక్షవాణిజ్యమ్ అ18 శ్లో44
211. కైర్లిఙ్గై స్త్రీన్గుణానేతాన్ అ14 శ్లో21
212. క్రోధాద్భవతి సమ్మోహః అ2 శ్లో63
213. క్లేశోధికతరస్తేషామ్ అ12 శ్లో 5
214. క్లైబ్యంమాస్మగమః పార్థ అ2 శ్లో 3
215. క్షిప్రం భవతి ధర్మాత్మా అ9 శ్లో31
216. క్షేత్రక్షేత్రజ్ఞ యోరేవమ్ అ13 శ్లో35
217. క్షేత్రజ్ఞం చాపిమాం విద్ధి అ13 శ్లో3

గ

218. గతసఙ్గస్య ముక్తస్య అ4 శ్లో23
219. గతిర్భర్తా ప్రభు స్సాక్షీ అ9 శ్లో18
220. గాణ్డీవం స్రంసతే హస్తాత్ అ1 శ్లో30
221. గామావిశ్య చ భూతాని అ15 శ్లో13
222. గుణానేతానతీత్యత్రీన్. అ14 శ్లో20
223. గురూనహత్వాహి మహా అ2 శ్లో 5

చ

224. చఞ్చలం హి మనః కృష్ణ అ6 శ్లో34
225. చతుర్విధా భజన్తేమామ్ అ7 శ్లో16
226. చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్ అ4 శ్లో13
227. చిన్తామపరిమేయాం చ అ16 శ్లో11
228. చేతసా సర్వకర్మాణి అ18 శ్లో57

జ

229. జన్మకర్మచ మే దివ్యమ్ అ4 శ్లో 9
230. జరామరణమోక్షాయ అ7 శ్లో29
231. జాతస్య హి ధ్రువోమృత్యుః అ2 శ్లో27
232. జితాత్మనః ప్రశాన్తస్య అ6 శ్లో 7
233. జ్ఞానం కర్మ చ కర్తా చ అ18 శ్లో19
234. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా అ18 శ్లో18
235. జ్ఞానం తేహం సవిజ్ఞానమ్ అ7 శ్లో 2
236. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే అ9 శ్లో15
237. జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా అ6 శ్లో 8
238. జ్ఞానేన తు తదజ్ఞానమ్ అ5 శ్లో16
239. జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి అ13 శ్లో13
240. జ్ఞేయస్స నిత్యసన్న్యాసీ అ5 శ్లో 3
241. జ్యాయసీ చేత్కర్మణస్తే అ3 శ్లో 1
242. జ్యోతిషామపి తజ్జ్యోతిః అ13 శ్లో18

త

243. తచ్చసంస్మృత్య సంస్మృత్య అ18 శ్లో77
244. తత్ క్షేత్రం యచ్చయాదృక్చ అ13 శ్లో 4
245. తతః పదం తత్పరిమార్గితవ్యమ్ అ15 శ్లో 4
246. తతః శంఖాశ్చ భేర్యశ్చ అ1 శ్లో13
247. తతః శ్వేతైర్హయైర్యుక్తే అ1 శ్లో14
248. తతః స విస్మయా విష్టః అ11 శ్లో14
249. తత్త్వవిత్తు మహాబాహో అ3 శ్లో28
250. తత్ర తం బుద్ధిసంయోగమ్ అ6 శ్లో43
251. తతః సత్వం నిర్మలత్వాత్ అ14 శ్లో 6
252. తత్రాపశ్యతి స్థితాన్ పార్థః అ1 శ్లో26
253. తత్రైకస్థం జగత్కృత్స్నమ్ అ11 శ్లో13
254. తత్రైకాగ్రం మనః కృత్వా అ6 శ్లో12
255. తత్రైవం సతి కర్తారమ్ అ18 శ్లో16
256. తదిత్యనభిసంధాయ అ17 శ్లో25
257. తద్బుద్ధయస్తదాత్మానః అ5 శ్లో17
258. తద్విద్ధిప్రణిపాతేన అ4 శ్లో34
259. తం తథా కృపయాఽఽవిష్టమ్ అ2 శ్లో 1
260. తపస్విభ్యోఽధికోయోగీ అ6 శ్లో46
261. తపామ్యహమహం వర్షమ్ అ9 శ్లో19
262. తమస్త్వజ్ఞానజం విద్ధి అ14 శ్లో 8
263. తమువాచ హృషీకేశః అ2 శ్లో10
264. తమేవ శరణం గచ్ఛ అ18 శ్లో62
265. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే అ16 శ్లో24
266. తస్మాత్త్వ మిన్ద్రియాణ్యాదౌ అ3 శ్లో41
267. తస్మాత్త్వముత్తిష్ఠ యశో అ11 శ్లో33
268. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయకాయమ్ అ11 శ్లో44
269. తస్మాత్సర్వేషు కాలేషు అ8 శ్లో 7
270. తస్మాదజ్ఞాన సమ్భూతమ్ అ4 శ్లో42
271. తస్మాదసక్తస్సతతమ్ అ3 శ్లో19
272. తస్మాదోమిత్యుదాహృత్య అ17 శ్లో24

| | | |
|---|---|---|
| 273. తస్మాద్యస్య మహాబాహో | అ2 | శ్లో68 |
| 274. తస్మాన్నార్హా వయం హన్తుమ్ | అ1 | శ్లో37 |
| 275. తస్య సఞ్జనయన్ హర్షమ్ | అ1 | శ్లో12 |
| 276. తానహం ద్విషతః క్రూరాన్ | అ16 | శ్లో19 |
| 277. తానిసర్వాణి సంయమ్య | అ2 | శ్లో61 |
| 278. తుల్యనిన్దాస్తుతిర్మౌనీ | అ12 | శ్లో19 |
| 279. తేజః క్షమా ధృతిశ్శౌచమ్ | అ16 | శ్లో 3 |
| 280. తే తం భుక్త్వా స్వర్గలోకమ్ | అ9 | శ్లో21 |
| 281. తేషాం జ్ఞానీ నిత్యయుక్తః | అ7 | శ్లో17 |
| 282. తేషాం సతతయుక్తానామ్ | అ10 | శ్లో10 |
| 283. తేషామహం సముద్ధర్తా | అ12 | శ్లో 7 |
| 284. తేషామేవానుకమ్పార్థమ్ | అ10 | శ్లో11 |
| 285. తం విద్యాద్దుఃఖసంయోగ | అ6 | శ్లో23 |
| 286. త్యక్త్వా కర్మఫలాసఙ్గమ్ | అ4 | శ్లో20 |
| 287. త్యాజ్యం దోషవదిత్యేకే | అ18 | శ్లో 3 |
| 288. త్రిభిర్గుణమయైర్భావైః | అ7 | శ్లో13 |
| 289. త్రివిధా భవతి శ్రద్ధా | అ17 | శ్లో 2 |
| 290. త్రివిధం నరకస్యేదమ్ | అ16 | శ్లో21 |
| 291. త్రైగుణ్యా విషయావేదాః | అ2 | శ్లో45 |
| 292. త్రైవిద్యా మాం సోమపాః | అ9 | శ్లో20 |
| 293. త్వమక్షరం పరమం వేదితవ్యమ్ | అ11 | శ్లో18 |
| 294. త్వమాదిదేవః పురుషః | అ11 | శ్లో38 |
| **ద** | | |
| 295. దణ్డోదమయతా మస్మి | అ10 | శ్లో38 |
| 296. దమ్భో దర్పోఽభిమానశ్చ | అ16 | శ్లో 4 |
| 297. దాతవ్యమితి యద్దానమ్ | అ17 | శ్లో20 |
| 298. దివి సూర్యసహస్రస్య | అ11 | శ్లో12 |
| 299. దివ్యమాల్యామ్బరధరమ్ | అ11 | శ్లో11 |
| 300. దుఃఖమిత్యేవ యత్కర్మ | అ18 | శ్లో 8 |
| 301. దుఃఖేష్వనుద్విగ్నమనాః | అ2 | శ్లో56 |
| 302. దూరేణ హ్యవరం కర్మ | అ2 | శ్లో49 |
| 303. దృష్ట్వా తు పాణ్డవానీకమ్ | అ1 | శ్లో 2 |
| 304. దృష్ట్వేదం మానుషం రూపమ్ | అ11 | శ్లో51 |
| 305. దేవద్విజగురుప్రాజ్ఞపూజనమ్ | అ17 | శ్లో14 |
| 306. దేవాన్భావయతానేన | అ3 | శ్లో11 |
| 307. దేహినోఽస్మిన్ యథా దేహే | అ2 | శ్లో13 |
| 308. దేహీ నిత్యమవధ్యోఽయమ్ | అ2 | శ్లో30 |
| 309. దైవమేవాపరే యజ్ఞమ్ | అ4 | శ్లో25 |
| 310. దైవీసమ్పద్విమోక్షాయ | అ16 | శ్లో 5 |
| 311. దైవీ హ్యేషాగుణమయీ | అ17 | శ్లో14 |
| 312. దోషైరేతైః కులఘ్నానామ్ | అ1 | శ్లో43 |
| 313. దంష్ట్రాకరాలాని చ తే ముఖాని | అ11 | శ్లో25 |
| 314. ద్యావా పృథివ్యోరిదమన్తరం హి | అ11 | శ్లో20 |
| 315. ద్యూతం ఛలయతామస్మి | అ10 | శ్లో36 |
| 316. ద్రవ్య యజ్ఞాః తపో యజ్ఞాః | అ4 | శ్లో28 |
| 317. ద్రుపదో ద్రౌపదేయాశ్చ | అ1 | శ్లో18 |
| 318. ద్రోణంచ భీష్మం చ జయద్రథమ్ | అ11 | శ్లో34 |
| 319. ద్వావిమౌ పురుషౌ లోకే | అ15 | శ్లో16 |
| 320. ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ | అ16 | శ్లో 6 |
| **ధ** | | |
| 321. ధర్మక్షేత్రే కురుక్షేత్రే | అ1 | శ్లో 1 |
| 322. ధూమేనావ్రియతే వహ్నిః | అ3 | శ్లో38 |
| 323. ధూమోరాత్రిస్తథా కృష్ణః | అ8 | శ్లో25 |
| 324. ధృత్యా యయా ధారయతే | అ18 | శ్లో33 |
| 325. ధృష్టకేతు శ్చేకితానః | అ1 | శ్లో 5 |
| 326. ధ్యానేనాత్మని పశ్యన్తి | అ13 | శ్లో25 |
| 327. ధ్యాయతో విషయాన్ | అ2 | శ్లో62 |
| **న** | | |
| 328. న కర్తృత్వం న కర్మాణి | అ5 | శ్లో14 |
| 329. న కర్మణామనారమ్భాత్ | అ3 | శ్లో 4 |
| 330. న కాంక్షే విజయం కృష్ణ | అ1 | శ్లో32 |
| 331. న చ తస్మాన్మనుష్యేషు | అ18 | శ్లో69 |
| 332. న చ మత్స్థాని భూతాని | అ9 | శ్లో 5 |
| 333. న చ మాం తాని కర్మాణి | అ9 | శ్లో 9 |
| 334. న చైతద్విద్మః కతరన్నో | అ2 | శ్లో 6 |
| 335. న జాయతే మ్రియతే వా | అ2 | శ్లో20 |
| 336. న తదస్తి పృథివ్యాం వా | అ18 | శ్లో40 |
| 337. న తద్భాసయతే సూర్యః | అ15 | శ్లో 6 |
| 338. న తుమా శక్యసే ద్రష్టుమ్ | అ11 | శ్లో 8 |
| 339. న త్వేవాహంజాతునాసమ్ | అ2 | శ్లో12 |
| 340. న ద్వేష్ట్య కుశలం కర్మ | అ18 | శ్లో10 |
| 341. న ప్రహృష్యేత్ ప్రియమ్ | అ5 | శ్లో20 |
| 342. న బుద్ధిభేదం జనయేత్ | అ3 | శ్లో26 |
| 343. నభః స్పృశం దీప్తమనేకవర్ణమ్ | అ11 | శ్లో24 |

| | | |
|---|---|---|
| 344. నమః పురస్తాదథపృష్ఠతస్తే | అ11 | శ్లో40 |
| 345. న మాం కర్మాణి లిమ్పన్తి | అ4 | శ్లో14 |
| 346. న మాం దుష్కృతినో మూఢాః | అ7 | శ్లో15 |
| 347. న మే పార్థాఽస్తి కర్తవ్యమ్ | అ3 | శ్లో22 |
| 348. న మే విదుస్సురగణాః | అ10 | శ్లో 2 |
| 349. నరూపమస్యేహ తథోప | అ15 | శ్లో 3 |
| 350. న వేద యజ్ఞాధ్యయనైర్నదానైః | అ11 | శ్లో48 |
| 351. నష్టో మోహః స్మృతిర్లబ్ధా | అ18 | శ్లో73 |
| 352. న హి కశ్చిత్ క్షణమపి | అ3 | శ్లో 5 |
| 353. న హి జ్ఞానేన సదృశమ్ | అ4 | శ్లో38 |
| 354. న హి దేహభృతాశక్యమ్ | అ18 | శ్లో11 |
| 355. న హి ప్రపశ్యామి | అ2 | శ్లో 8 |
| 356. నాత్యశ్నతస్తు యోగోఽస్తి | అ6 | శ్లో16 |
| 357. నా దత్తే కస్యచిత్పాపమ్ | అ5 | శ్లో15 |
| 358. నాన్తోఽస్తి మమ దివ్యానామ్ | అ10 | శ్లో40 |
| 359. నాన్యం గుణేభ్యః కర్తారమ్ | అ14 | శ్లో19 |
| 360. నాసతో విద్యతే భావః | అ2 | శ్లో16 |
| 361. నాస్తి బుద్ధిరయుక్తస్య | అ2 | శ్లో66 |
| 362. నాహం ప్రకాశస్సర్వస్య | అ7 | శ్లో25 |
| 363. నాహం వేదైర్న తపసా | అ11 | శ్లో53 |
| 364. నిమిత్తాని చ పశ్యామి | అ1 | శ్లో31 |
| 365. నియతం కురు కర్మత్వమ్ | అ3 | శ్లో 8 |
| 366. నియతం సఙ్గరహితమ్ | అ18 | శ్లో23 |
| 367. నియతస్య తు సన్న్యాసః | అ18 | శ్లో 7 |
| 368. నిరాశీర్యతచిత్తాత్మా | అ4 | శ్లో21 |
| 369. నిర్మానమోహాజితసఙ్గదోషాః | అ15 | శ్లో 5 |
| 370. నిశ్చయం శ్రుణు మే తత్ర | అ18 | శ్లో 4 |
| 371. నిహత్య ధార్తరాష్ట్రాన్నః | అ1 | శ్లో36 |
| 372. నేహాభిక్రమనాశోఽస్తి | అ2 | శ్లో40 |
| 373. నైతే సృతీపార్థజానన్ | అ8 | శ్లో27 |
| 374. నైనం ఛిన్దన్తి శస్త్రాణి | అ2 | శ్లో23 |
| 375. నైవ కించిత్కరోమీతి | అ5 | శ్లో 8 |
| 376. నైవతస్య కృతేనార్థః | అ3 | శ్లో18 |
| **ప** | | |
| 377. పఞ్చైతాని మహాబాహో | అ18 | శ్లో13 |
| 378. పత్రం పుష్పం ఫలం తోయమ్ | అ9 | శ్లో26 |
| 379. పరస్తస్మాత్తు భావోఽన్యః | అ8 | శ్లో20 |
| 380. పరిత్రాణాయ సాధూనామ్ | అ4 | శ్లో 8 |
| 381. పరంబ్రహ్మ పరంధామ | అ10 | శ్లో12 |
| 382. పరం భూయః ప్రవక్ష్యామి | అ14 | శ్లో 1 |
| 383. పవనః పవతామస్మి | అ10 | శ్లో31 |
| 384. పశ్య మే పార్థ రూపాణి | అ11 | శ్లో 5 |
| 385. పశ్యాదిత్యాన్ వసూన్ | అ11 | శ్లో 6 |
| 386. పశ్యామి దేవాంస్తవదేవ | అ11 | శ్లో15 |
| 387. పశ్యైతాం పాణ్డుపుత్రాణామ్ | అ1 | శ్లో 3 |
| 388. పాఞ్చజన్యం హృషీకేశః | అ1 | శ్లో15 |
| 389. పార్థనైవేహ నాముత్ర | అ6 | శ్లో40 |
| 390. పితాఽసిలోకస్య చరాచర | అ11 | శ్లో43 |
| 391. పితాహమస్య జగతః | అ9 | శ్లో17 |
| 392. పుణ్యోగన్ధః పృథివ్యాఞ్చ | అ7 | శ్లో 9 |
| 393. పురుషః ప్రకృతిస్థో హి | అ13 | శ్లో22 |
| 394. పురుషః స పరః పార్థః | అ8 | శ్లో22 |
| 395. పురోధసాం చ ముఖ్యమ్ | అ10 | శ్లో24 |
| 396. పూర్వాభ్యాసేన తే నైవ | అ6 | శ్లో44 |
| 397. పృథక్త్వేన తు యత్ జ్ఞానమ్ | అ18 | శ్లో21 |
| 398. ప్రకాశఞ్చ ప్రవృత్తిఞ్చ | అ14 | శ్లో22 |
| 399. ప్రకృతిం పురుషం చైవ | అ13 | శ్లో 1 |
| 400. ప్రకృతిం పురుషం చైవ | అ13 | శ్లో20 |
| 401. ప్రకృతిం స్వామవష్టభ్య | అ9 | శ్లో 8 |
| 402. ప్రకృతేః క్రియమాణాని | అ3 | శ్లో27 |
| 403. ప్రకృతేర్గుణ సమ్మూఢాః | అ3 | శ్లో29 |
| 404. ప్రకృత్యైవ చ కర్మాణి | అ13 | శ్లో30 |
| 405. ప్రజహాతి యదా కామాన్ | అ2 | శ్లో55 |
| 406. ప్రయత్నాద్యతమానస్తు | అ6 | శ్లో45 |
| 407. ప్రయాణకాలే మనసాఽచలేన | అ8 | శ్లో10 |
| 408. ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ | అ5 | శ్లో 9 |
| 409. ప్రవృత్తిం చ నివృత్తిం చ | అ16 | శ్లో 7 |
| 410. ప్రవృత్తించ నివృత్తించ | అ18 | శ్లో30 |
| 411. ప్రశాన్త మనసం హ్యేనమ్ | అ6 | శ్లో27 |
| 412. ప్రశాన్తాత్మా విగతభీః | అ6 | శ్లో14 |
| 413. ప్రసాదే సర్వదుఃఖానామ్ | అ2 | శ్లో65 |
| 414. ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్ | అ10 | శ్లో30 |
| 415. ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ | అ6 | శ్లో41 |
| **బ** | | |
| 416. బన్ధురాత్మాత్మనస్తస్య | అ6 | శ్లో 6 |
| 417. బలం బలవతాం చాహమ్ | అ7 | శ్లో11 |

418. బహిరన్తశ్చ భూతానామ్ అ13 శ్లో16
419. బహూనాం జన్మనామన్తే అ7 శ్లో19
420. బహూనిమే వ్యతీతాని అ4 శ్లో 5
421. బాహ్యస్పర్శేష్వసక్తాత్మా అ5 శ్లో21
422. బీజం మాం సర్వభూతానామ్ అ7 శ్లో10
423. బుద్ధియుక్తో జహాతీహ అ2 శ్లో50
424. బుద్ధిర్జ్ఞాన మసంమ్మోహ అ10 శ్లో 4
425. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ అ18 శ్లో29
426. బుద్ధ్యా విశుద్ధయా యుక్తః అ18 శ్లో51
427. బృహత్సామ తథా సామ్నామ్ అ10 శ్లో35
428. బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహమ్ అ14 శ్లో27
429. బ్రహ్మణ్యాధాయ కర్మాణి అ5 శ్లో10
430. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా అ18 శ్లో54
431. బ్రహ్మార్పణం బ్రహ్మహవిః అ4 శ్లో24
432. బ్రాహ్మణః క్షత్రియవిశామ్ అ18 శ్లో41

భ

433. భక్త్యా త్వనన్యయా శక్యః అ11 శ్లో54
434. భక్త్యా మామభిజానాతి అ18 శ్లో55
435. భయాద్రణాదుపరతామ్ అ2 శ్లో35
436. భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ అ1 శ్లో 8
437. భవాప్యయౌహి భూతానామ్ అ11 శ్లో 2
438. భీష్మద్రోణ ప్రముఖతః అ1 శ్లో25
439. భూతగ్రామస్స ఏవాయమ్ అ8 శ్లో19
440. భూమిరాఽపో నలోవాయుః అ7 శ్లో 4
441. భూయ ఏవ మహాబాహో అ10 శ్లో 1
442. భోక్తారం యజ్ఞతపసామ్ అ5 శ్లో29
443. భోగైశ్వర్య ప్రసక్తానామ్ అ2 శ్లో44

మ

444. మచ్చిత్తా మద్గతప్రాణాః అ10 శ్లో 9
445. మచ్చిత్తః సర్వదుర్గాణి అ18 శ్లో58
446. మత్కర్మకృన్మత్పరమః అ11 శ్లో55
447. మత్తః పరతరం నాన్యత్ అ7 శ్లో 7
448. మదనుగ్రహాయ పరమమ్ అ11 శ్లో 1
449. మనః ప్రసాదస్సౌమ్యత్వమ్ అ17 శ్లో16
450. మనుష్యాణాం సహస్రేషు అ7 శ్లో 3
451. మన్మనా భవ మద్భక్తః అ9 శ్లో34
452. మన్మనా భవ మద్భక్తః అ18 శ్లో65
453. మన్యసే యది తచ్ఛక్యమ్ అ11 శ్లో 4
454. మమయోనిర్మహద్బ్రహ్మ అ14 శ్లో 3
455. మమైవాంశో జీవలోకే అ15 శ్లో 7
456. మయాతతమిదం సర్వమ్ అ9 శ్లో 4
457. మయాఽధ్యక్షేణ ప్రకృతిః అ9 శ్లో 10
458. మయాప్రసన్నేన తవార్జు అ11 శ్లో47
459. మయిచానన్య యోగేన అ13 శ్లో11
460. మయిసర్వాణి కర్మాణి అ3 శ్లో30
461. మయ్యావేశ్య మనో యే అ12 శ్లో 2
462. మయ్యాసక్త మనాః పార్థ అ7 శ్లో 1
463. మయ్యేవ మన ఆధత్స్వ అ12 శ్లో 8
464. మహర్షయః సప్త పూర్వే అ10 శ్లో 6
465. మహర్షీణాం భృగురహమ్ అ10 శ్లో25
466. మహాత్మానస్తు మాం పార్థ అ9 శ్లో13
467. మహాభూతాన్యహంకారః అ13 శ్లో 6
468. మాతే వ్యథా మా చ వి అ11 శ్లో49
469. మాం చ యోఽవ్యభిచారేణ అ14 శ్లో26
470. మాం హి పార్థ! వ్యపాశ్రిత్య అ9 శ్లో32
471. మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ అ2 శ్లో14
472. మానావమానయోస్తుల్యః అ14 శ్లో25
473. మాముపేత్య పునర్జన్మ అ8 శ్లో15
474. ముక్తసఙ్గోఽనహంవాదీ అ18 శ్లో26
475. మూఢగ్రాహేణాత్మనో యత్ అ17 శ్లో19
476. మృత్యుస్సర్వహరశ్చాహమ్ అ10 శ్లో34
477. మోఘాశా మోఘకర్మాణః అ9 శ్లో12

య

478. య ఇమం పరం గుహ్యమ్ అ18 శ్లో68
479. య ఏనం వేత్తి హన్తారమ్ అ2 శ్లో19
480. య ఏవం వేత్తి పురుషమ్ అ13 శ్లో24
481. యం యం వాపిస్మరన్భా అ8 శ్లో 6
482. యం లబ్ధ్వాచాపరంలాభమ్ అ6 శ్లో22
483. యం సన్యాసమితిప్రాహుః అ6 శ్లో 2
484. యం హి న వ్యథయన్త్యేతే అ2 శ్లో15
485. యః శాస్త్రవిధిముత్సృజ్య అ16 శ్లో23
486. యః సర్వత్రానభిస్నేహః అ2 శ్లో57
487. యచ్చాపిసర్వభూతానామ్ అ10 శ్లో39
488. యచ్చావహాసార్థమసత్కృతోఽసి అ11 శ్లో42

| | | | |
|---|---|---|---|
| 489. | యజన్తే సాత్త్వికాదేవాన్ | అ17 | శ్లో 4 |
| 490. | యజ్జ్ఞాత్వా న పునర్మోహం | అ4 | శ్లో35 |
| 491. | యజ్ఞదాన తపః కర్మ | అ18 | శ్లో 5 |
| 492. | యజ్ఞ శిష్టామృతభుజః | అ4 | శ్లో31 |
| 493. | యజ్ఞ శిష్టాశినస్సన్తః | అ3 | శ్లో13 |
| 494. | యజ్ఞార్థాత్కర్మణోஉన్యత్ర | అ3 | శ్లో 9 |
| 495. | యజ్ఞేతపసి దానే చ | అ17 | శ్లో27 |
| 496. | యతతో హ్యపి కౌన్తేయ | అ2 | శ్లో60 |
| 497. | యతన్తో యోగినశ్చైనం | అ15 | శ్లో11 |
| 498. | యతః ప్రవృత్తిర్భూతానాం | అ18 | శ్లో46 |
| 499. | యత్కరోషి యదశ్నాసి | అ9 | శ్లో27 |
| 500. | యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానమ్ | అ5 | శ్లో 5 |
| 501. | యతేన్ద్రియమనోబుద్ధిః | అ5 | శ్లో28 |
| 502. | యతో యతో నిశ్చరతి | అ6 | శ్లో26 |
| 503. | యత్తదగ్రే విషమివ | అ18 | శ్లో37 |
| 504. | యత్తు కామేప్సునా కర్మ | అ18 | శ్లో24 |
| 505. | యత్తు కృత్స్నవదేకస్మిన్ | అ18 | శ్లో22 |
| 506. | యత్తుప్రత్యుపకారార్థం | అ17 | శ్లో21 |
| 507. | యత్రకాలే త్వనావృత్తిం | అ8 | శ్లో23 |
| 508. | యత్రయోగేశ్వరః కృష్ణః | అ18 | శ్లో78 |
| 509. | యత్రోపరమతే చిత్తం | అ6 | శ్లో20 |
| 510. | యథాஉஉకాశస్థితో నిత్యం | అ9 | శ్లో 6 |
| 511. | యథా దీపో నివాతస్థః | అ6 | శ్లో19 |
| 512. | యథా నదీనాం బహవః | అ11 | శ్లో28 |
| 513. | యథా ప్రకాశయత్యేకః | అ13 | శ్లో34 |
| 514. | యథా ప్రదీప్తం జ్వలనం | అ11 | శ్లో29 |
| 515. | యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ | అ13 | శ్లో33 |
| 516. | యథైధాంసి సమిద్ధోஉగ్నిః | అ4 | శ్లో37 |
| 517. | యదక్షరం వేదవిదోవదన్తి | అ8 | శ్లో11 |
| 518. | యదగ్రే చానుబన్ధే చ | అ18 | శ్లో39 |
| 519. | యద్యహఙ్కారమాశ్రిత్య | అ18 | శ్లో59 |
| 520. | యదా తే మోహకలిలమ్ | అ2 | శ్లో52 |
| 521. | యదాదిత్యగతం తేజః | అ15 | శ్లో12 |
| 522. | యదా భూత పృథగ్భావమ్ | అ13 | శ్లో31 |
| 523. | యదా యదాహి ధర్మస్య | అ4 | శ్లో 7 |
| 524. | యదావినియతం చిత్తమ్ | అ6 | శ్లో18 |
| 525. | యదా సంహరతే చాయమ్ | అ2 | శ్లో58 |
| 526. | యదాసత్త్వే ప్రవృద్ధేతు | అ14 | శ్లో14 |
| 527. | యదా హి నేన్ద్రియార్థేషు | అ6 | శ్లో 4 |
| 528. | యది మామప్రతీకారమ్ | అ1 | శ్లో46 |
| 529. | యదిహ్యహం న వర్తేయమ్ | అ3 | శ్లో23 |
| 530. | యదృచ్ఛయా చోపపన్నమ్ | అ2 | శ్లో32 |
| 531. | యదృచ్ఛాలాభసన్తుష్టః | అ4 | శ్లో22 |
| 532. | యద్యదాచరతి శ్రేష్ఠః | అ3 | శ్లో21 |
| 533. | యద్యద్విభూతిమత్సత్త్వమ్ | అ10 | శ్లో41 |
| 534. | యద్యప్యేతే న పశ్యన్తి | అ1 | శ్లో38 |
| 535. | యయాతు ధర్మకామార్థాన్ | అ18 | శ్లో34 |
| 536. | యయా ధర్మమధర్మంచ | అ18 | శ్లో31 |
| 537. | యయా స్వప్నం భయమ్ | అ18 | శ్లో35 |
| 538. | యస్త్వాత్మరతిరేవస్యాత్ | అ3 | శ్లో17 |
| 539. | యస్త్విన్ద్రియాణి మనసా | అ3 | శ్లో 7 |
| 540. | యస్మాత్ క్షరమతీతోஉహం | అ15 | శ్లో18 |
| 541. | యస్మాన్నో ద్విజతే లోకః | అ12 | శ్లో15 |
| 542. | యస్య నాహంకృతో భావః | అ18 | శ్లో17 |
| 543. | యస్య సర్వే సమారమ్భాః | అ4 | శ్లో19 |
| 544. | యాతయామం గతరసమ్ | అ17 | శ్లో10 |
| 545. | యా నిశా సర్వభూతానాం | అ2 | శ్లో69 |
| 546. | యాన్తిదేవవ్రతాదేవాన్ | అ9 | శ్లో25 |
| 547. | యామిమాం పుష్పితాం | అ2 | శ్లో42 |
| 548. | యావత్సంజాయతే కిఞ్చిత్ | అ13 | శ్లో27 |
| 549. | యావదేతాన్నిరీక్షేஉహం | అ1 | శ్లో22 |
| 550. | యావానర్థ ఉదపానే | అ2 | శ్లో46 |
| 551. | యుక్తాహార విహారస్య | అ6 | శ్లో17 |
| 552. | యుక్తః కర్మఫలం త్యక్త్వా | అ5 | శ్లో12 |
| 553. | యుఞ్జన్నేవం సదాత్మానం | అ6 | శ్లో15 |
| 554. | యుఞ్జన్నేవం సదాత్మానం | అ6 | శ్లో28 |
| 555. | యుదామన్యుశ్చవిక్రాన్తః | అ1 | శ్లో 6 |
| 556. | యే చైవ సాత్త్వికా భావాః | అ7 | శ్లో12 |
| 557. | యే తు ధర్మ్యామృతమిదం | అ12 | శ్లో20 |
| 558. | యే తు సర్వాణికర్మాణి | అ12 | శ్లో 6 |
| 559. | యేత్వక్షర మనిర్దేశ్యమ్ | అ12 | శ్లో 3 |
| 560. | యేత్వే తదభ్యసూయన్తః | అ3 | శ్లో12 |
| 561. | యేஉప్యన్యదేవతా భక్తాః | అ9 | శ్లో23 |

| | | |
|---|---|---|
| 562. యే మే మతమిదం నిత్యమ్ | అ3 | శ్లో31 |
| 563. యే యథామాం ప్రపద్యన్తే | అ4 | శ్లో11 |
| 564. యే శాస్త్రవిధిముత్సృజ్య | అ17 | శ్లో 1 |
| 565. యేషాంత్వన్తగతం పాపమ్ | అ7 | శ్లో28 |
| 566. యేషామర్థేకాంక్షితం నః | అ1 | శ్లో33 |
| 567. యే హి సంస్పర్శజాభోగాః | అ5 | శ్లో22 |
| 568. యోగయుక్తో విశుద్ధాత్మా | అ5 | శ్లో 7 |
| 569. యోగసన్న్యస్తకర్మాణమ్ | అ4 | శ్లో41 |
| 570. యోగస్థః కురుకర్మాణి | అ2 | శ్లో48 |
| 571. యోగినామపి సర్వేషామ్ | అ6 | శ్లో47 |
| 572. యోగీ యుఞ్జీత సతతమ్ | అ6 | శ్లో10 |
| 573. యోత్స్యమానానవేక్షేహమ్ | అ1 | శ్లో23 |
| 574. యో న హృష్యతి నద్వేష్టి | అ12 | శ్లో17 |
| 575. యోన్త స్సుఖోన్తరారమః | అ5 | శ్లో24 |
| 576. యో మాం పశ్యతి సర్వత్ర | అ6 | శ్లో30 |
| 577. యోమా మజ మనాదిం చ | అ10 | శ్లో 3 |
| 578. యో మామేవమసమ్మూఢః | అ15 | శ్లో19 |
| 579. యోయం యోగస్త్వయా | అ6 | శ్లో33 |
| 580. యో యో యాం యామ్ | అ7 | శ్లో21 |

ర

| | | |
|---|---|---|
| 581. రజసి ప్రళయం గత్వా | అ14 | శ్లో15 |
| 582. రజస్తమశ్చాభిభూయ | అ14 | శ్లో10 |
| 583. రజోరాగాత్మకం విద్ధి | అ14 | శ్లో 7 |
| 584. రసోఽహమప్సు కౌన్తేయ | అ7 | శ్లో 8 |
| 585. రాగద్వేష వియుక్తైస్తు | అ2 | శో64 |
| 586. రాగీ కర్మఫలప్రేప్సుః | అ18 | శ్లో27 |
| 587. రాజన్ సంస్మృత్య సం | అ18 | శ్లో76 |
| 588. రాజవిద్యా రాజగుహ్యమ్ | అ9 | శ్లో 2 |
| 589. రుద్రాణాం శఙ్కరశ్చాస్మి | అ10 | శ్లో23 |
| 590. రుద్రాదిత్యా వసవో యే | అ11 | శ్లో22 |
| 591. రూపం మహత్తే బహు | అ11 | శ్లో23 |

ల

| | | |
|---|---|---|
| 592. లభన్తే బ్రహ్మనిర్వాణం | అ5 | శ్లో25 |
| 593. లేలిహ్యసేగ్రసమానస్సమన్తాత్ | అ11 | శ్లో30 |
| 594. లోకేఽస్మిన్ ద్వివిధానిష్ఠా | అ3 | శ్లో 3 |
| 595. లోభః ప్రవృత్తిరారమ్భః | అ14 | శో12 |

వ

| | | |
|---|---|---|
| 596. వక్తుమర్హస్యశేషేణ | అ10 | శ్లో16 |
| 597. వక్త్రాణి తే త్వరమాణా | అ11 | శ్లో27 |
| 598. వాయుర్యమోఽగ్నిర్వరుణ | అ11 | శ్లో39 |
| 599. వాసాంసి జీర్ణాని యథా | అ2 | శ్లో22 |
| 600. విద్యావినయ సమ్పన్నే | అ5 | శ్లో18 |
| 601. విధిహీనమసృష్టాన్నమ్ | అ17 | శ్లో13 |
| 602. వివిక్తసేవీ లఘ్వాశీ | అ18 | శ్లో52 |
| 603. విషయా వినివర్తన్తే | అ2 | శ్లో59 |
| 604. విషయేన్ద్రియసంయోగాత్ | అ18 | శ్లో38 |
| 605. విస్తరేణాత్మనో యోగమ్ | అ10 | శ్లో18 |
| 606. విహాయ కామాన్యః సర్వాన్ | అ2 | శ్లో71 |
| 607. వీతరాగభయక్రోధః | అ4 | శ్లో10 |
| 608. వృష్ణీనాం వాసుదేవోఽస్మి | అ10 | శ్లో37 |
| 609. వేదానాం సామవేదోఽస్మి | అ10 | శో22 |
| 610. వేదాఽవినాశినం నిత్యం | అ2 | శ్లో21 |
| 611. వేదాహం సమతీతాని | అ7 | శ్లో26 |
| 612. వేదేషు యజ్ఞేషు తపస్సు | అ8 | శ్లో28 |
| 613. వ్యవసాయాత్మికా బుద్ధిః | అ20 | శ్లో41 |
| 614. వ్యామిశ్రేణేవ వాక్యేన | అ3 | శ్లో 2 |
| 615. వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ | అ18 | శ్లో75 |

శ

| | | |
|---|---|---|
| 616. శక్నోతీ హైవయస్సోఢుం | అ5 | శ్లో23 |
| 617. శనైః శనైరుపమేత్ | అ6 | శ్లో25 |
| 618. శమోదమస్తపశ్శౌచమ్ | అ18 | శ్లో42 |
| 619. శరీరం యదవాప్నోతి | అ15 | శ్లో 8 |
| 620. శరీర వాఙ్మనోభర్యత్ | అ18 | శ్లో15 |
| 621. శుక్లకృష్ణే గతీహ్యేతే | అ8 | శ్లో26 |
| 622. శుచౌదేశే ప్రతిష్ఠాప్య | అ6 | శ్లో11 |
| 623. శుభాశుభఫలైరేవం | అ9 | శ్లో28 |
| 624. శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం | అ18 | శ్లో43 |
| 625. శ్రద్ధయా పరయా తప్తం | అ17 | శ్లో17 |
| 626. శ్రద్ధవాన్ లభతే జ్ఞానం | అ4 | శ్లో39 |
| 627. శ్రద్ధావాననసూయశ్చ | అ18 | శ్లో71 |
| 628. శ్రుతి విప్రతి పన్నా తే | అ2 | శ్లో53 |
| 629. శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ | అ4 | శ్లో33 |
| 630. శ్రేయాన్ స్వధర్మోవిగుణః | అ3 | శ్లో35 |

631. శ్రేయాన్ స్వధర్మోవిగుణః అ18 శ్లో47
632. శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ అ12 శ్లో12
633. శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే అ4 శ్లో26
634. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ అ15 శ్లో 9
635. శ్వశురాన్ సుహృదశ్చైవ అ1 శ్లో27

స

636. స ఏవాయం మయాతేఽద్య అ4 శ్లో 3
637. సక్తాః కర్మణ్యవిద్వాంసః అ3 శ్లో25
638. సఖేతి మత్వా ప్రసభం అ11 శ్లో41
639. స ఘోషో ధార్తరాష్ట్రాణామ్ అ1 శ్లో19
640. సఙ్కరో నరకాయైవ అ1 శ్లో42
641. సఙ్కల్ప ప్రభవాన్కామాన్ అ6 శ్లో24
642. సంనియమ్యేన్ద్రియగ్రామమ్ అ12 శ్లో 4
643. సతతం కీర్తయన్తోమామ్ అ9 శ్లో14
644. స తయాశ్రద్ధయాయుక్తః అ7 శ్లో22
645. సత్కారమానపూజార్థమ్ అ17 శ్లో18
646. సత్త్వం రజస్తమ ఇతి అ14 శ్లో 5
647. సత్త్వం సుఖేసఞ్జయతి అ14 శ్లో 9
648. సత్త్వాత్సంజాయతే జ్ఞానమ్ అ14 శ్లో17
649. సత్త్వానురూపా సర్వస్య అ17 శ్లో 3
650. సదృశం చేష్టతే స్వస్యాః అ3 శ్లో33
651. సద్భావే సాధుభావే చ అ17 శ్లో26
652. సన్తుష్టస్సతతం యోగీ అ12 శ్లో14
653. సన్న్యాసం కర్మణాం కృష్ణ అ5 శ్లో 1
654. సన్న్యాసః కర్మయోగశ్చ అ5 శ్లో 2
655. సన్న్యాసస్తు మహాబాహో అ5 శ్లో 6
656. సన్న్యాసస్య మహాబాహో అ18 శ్లో 1
657. సమం కాయశిరోగ్రీవం అ6 శ్లో13
658. సమం పశ్యన్హి సర్వత్ర అ13 శ్లో29
659. సమం సర్వేషు భూతేషు అ13 శ్లో28
660. సమః శత్రౌ చ మిత్రే చ అ12 శ్లో18
661. సమదుఃఖసుఖ స్వస్థః అ14 శ్లో24
662. సమోఽహం సర్వభూతేషు అ9 శ్లో29
663. సర్గాణామాదిరన్తశ్చ అ10 శ్లో32
664. సర్వకర్మాణి మనసా అ5 శ్లో13
665. సర్వకార్యాణ్యపి సదా అ18 శ్లో56
666. సర్వగుహ్యతమం భూయః అ18 శ్లో64
667. సర్వతః పాణిపాదం తత్ అ13 శ్లో14
668. సర్వద్వారాణి సంయమ్య అ8 శ్లో12
669. సర్వద్వారేషు దేహేఽస్మిన్ అ14 శ్లో11
670. సర్వధర్మాన్ పరిత్యజ్య అ18 శ్లో66
671. సర్వభూతస్థమాత్మానాం అ6 శ్లో29
672. సర్వభూత స్థితం యోమాం అ6 శ్లో31
673. సర్వభూతాని కౌన్తేయ అ9 శ్లో 7
674. సర్వభూతేషు యేనైకం అ18 శ్లో20
675. సర్వమేతదృతం మన్యే అ10 శ్లో14
676. సర్వయోనిషు కౌన్తేయ అ14 శ్లో4
677. సర్వస్యచాహం హృదిసన్నివిష్టః అ15 శ్లో15
678. సర్వాణీన్ద్రియకర్మాణి అ4 శ్లో27
679. సర్వేన్ద్రియ గుణాభాసం అ13 శ్లో15
680. సహజం కర్మ కౌన్తేయ అ18 శ్లో48
681. సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వాః అ3 శ్లో10
682. సహస్రయుగపర్యన్తం అ8 శ్లో17
683. సాంఖ్యయోగౌపథగ్బాలాః అ5 శ్లో 4
684. సాధిభూతాధిదైవం మాం అ7 శ్లో30
685. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ అ18 శ్లో50
686. సీదన్తి మమగాత్రాణి అ1 శ్లో29
687. సుఖం త్విదానీం త్రివిధం అ18 శ్లో36
688. సుఖ దుఃఖే సమే కృత్వా అ2 శ్లో38
689. సుఖమాత్యన్తికం యత్తత్ అ6 శ్లో21
690. సుదుర్దర్శమిదం రూపం అ11 శ్లో52
691. సుహృన్మిత్రార్యుదాసీన అ6 శ్లో 9
692. స్థానేహృషీకేశ తవ ప్రకీర్త్యా అ11 శ్లో36
693. స్థితప్రజ్ఞస్య కా భాషా అ2 శ్లో54
694. స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ అ5 శ్లో27
695. స్వధర్మమపి చావేక్ష్య అ2 శ్లో31
696. స్వభావజేన కౌన్తేయ అ18 శ్లో60
697. స్వయమేవాత్మనాఽఽత్మానం అ10 శ్లో15
698. స్వే స్వే కర్మణ్యభిరతః అ18 శ్లో45

హ

699. హతో వా ప్రాప్స్యసే స్వర్గం అ2 శ్లో37
700. హన్త తే కథయిష్యామి అ10 శ్లో19
701. హృషీకేశం తదా వాక్యం అ1 శ్లో21


**శ్రీమద్భగవద్గీత అక్షరాది అనుక్రమణిక సమ్పూర్ణమ్**